

రా జ శే ఖ ర వి ర చి తా


కా వ్య మీ మాం సా

బాలానన్దివ్యాఖ్యయా
ఆంధ్రభాషా వ్యాఖ్యయా సమేతా

వ్యాఖ్యారచయితా
డా. పుల్లెల శ్రీరామచంద్రః

ప్రథమ ముద్రణము : 1979
ప్రతులు : 1000

మూల్యము : రూ. 15-00



ప్రతులకు :
శ్రీమతి పుల్లెల సుబ్బలక్ష్మి
R. 38; O. U. Campus
హైదరాబాదు, 500 007.

ముద్రణ
నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు-29.
ఫోన్ నెం : 220238



కృతిసమర్పణము

పుట్టినది జమీందారుల కుటుంబములో నైనను నిరాడంబర జీవితము గడపుచు ఉన్నతపదవులలో ఉన్న పలువురకు మార్గ దర్శకులును, ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీకి కార్యదర్శిగ ఉండి ఇతర రాష్ట్రములలోని అకాడమీలకు ఒక ఉన్నతాదర్శము నెలకొల్పిన కార్యనిర్వహణదక్షులును, చాలకాలము ఉస్మానియా విశ్వవిద్యాలయము సిండికేటులో సభ్యులుగా ఉండి, వివిధ శాఖలలో ఉత్తమ విద్యాప్రమాణములను రూపొందించుటయే విశ్వవిద్యాలయముల ప్రధానకర్తవ్యమను నమ్మికతో ఉన్నత విద్యాసేవ చేసిన విద్యావేత్తలును అగు

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి

సాదరముగా సమర్పితము

భవ్యేయం కావ్యమీమాంసా బాలానన్దిన్యుపస్కృతా
రామానుజాయ సుధియే శ్రీమతే తే సమర్ప్యతే.

పుల్లెల శ్రీరామచంద్రుడు
బాలానన్దినీ రచయిత

ప్రస్తావన

సాధారణముగ సంస్కృత గ్రంథరచయితల జీవితవిశేషాదులను గూర్చి తెలిసికొనుటకు వారి గ్రంథములు అంతగ ఉపకరింపవు. కాని రాజశేఖరుడు తన రచనలలో తన జీవితాదులకు సంబంధించిన ఎన్నో విషయములను పేర్కొని యుండుటచే అతని దేశకాలాదులకు సంబంధించిన విషయములను కొంతవరకు నిశ్చయపూర్వకముగ తెలిసికొనగలుగుచున్నాము.

రాజశేఖరుడు మహారాష్ట్రదేశీయుడు. ఆ రోజులలో వివిధ ప్రాంతముల రాజుల మధ్య తరచుగ యుద్ధములు జరుగుచుండుటచే దేశముల సరిహద్దులు అతిశీఘ్రముగ మారిపోవుచుండెడివి. కుంతల-విదర్భ-లాట-చేదిదేశములలోని కొన్ని భాగములు కలిసి ఆనాటి మహారాష్ట్రము. రాజశేఖరునకు ఈ నాలుగు ప్రాంతములతో సంబంధ మున్నట్లు అతని గ్రంథములవలన తెలియుచున్నది ఈతడు లాటదేశీయుల ప్రాకృతభాషను, అచటి సుందరాంగుల సౌందర్యాదులను ఎక్కువగ మెచ్చుకొనినాడు దక్షిణగుజరాతు ప్రాంతమునకును, మహారాష్ట్రము లోని కొంత భాగమునకును ఆనాడు లాటదేశ మని పేరు. లాటదేశముపై ఈతడు చూపిన మక్కువను, బట్టి ఈతడు కొంతకాలము ఈ ప్రాంతమునందు నివసించి యుండు ననియు, ఈ దేశమునకు సంబంధించిన పభుదేవి యను కవి ఈతనికి ప్రేయసి ఐ ఉండు ననియు విమర్శకుల అభిప్రాయము. మహారాష్ట్రాం తర్గత మైన విదర్భ ప్రాంతము (నేటి బరార్) ఈతని జన్మస్థానమై యుండు నని కూడ కొందరి అభిప్రాయము. ఈ ప్రాంతమును రాజశేఖరుడు బాలరామా యణాదులలో కుంతలదేశ మని కూడ పేర్కొనినాడు. ఆ రోజులలో కుంతల దేశీయులు (కర్ణాటదేశీయులు) ఈ ప్రాంతమును కూడ ప్రాలించియుందురు.

రాజశేఖరుని వంశాదులు:- తాను యాయావరవంశీయు డని రాజశేఖరుడు కావ్యమీమాంసలో అనేకస్థలములందు చెప్పికొనినాడు తరువాతి కవులు కొందరు ఈతనిని యాయావరు డనియే పేర్కొన్నారు. ఈతని పూర్వపురుషులను గూర్చిన కొన్ని విషయములు అతని నాటకముల ద్వారా తెలియుచున్నవి. ఈతని ముత్తాత.

యగు అకాలజలదుడు మహాకవి. ఈతని శ్లోకములను అపహరించి, తన నాటకములలో కూర్చుకొని కాదంబరీరాము డను కవి నాటకరచయితగా పేరు పొందినాడట. రాజశేఖరుని వంశములో సురానందుడు, తరలుడు, కవిరాజు అనువారు కూడ గొప్ప ప్రసిద్ధి పొందిన కవులు. సురానందుడు చేదిరాజాస్థానపండితుడుగా ఉండెనట కావ్యమీమాంసలో అచ్చటచ్చట ఈతని మతమును ఉదాహరించుటను పట్టి ఈతడు అలంకారశాస్త్రగ్రంథ మేదియో వ్రాసి యుండు నని తెలియుచున్నది. రాజశేఖరుని తండ్రి యైన దుర్దుకుడు లేదా దుహికుడు మహామంత్రిగా ఉండెనట. ఈతని తల్లి పేరు శీలవతి.

రాజశేఖరుడు యాయావరవంశమునకు చెందినవాడే యైనను, ఈతని భార్య యైన అవంతి సుందరి 'చాహువాన' వంశమునకు చెందిన దగుటచే ఈతడు క్షత్రియుడై యుండునా అని కొందరి ఊహ. కాని ధర్మశాస్త్రములను బట్టి చూడగా యాయావరీయులు బ్రాహ్మణులే అని తెలియుచున్నది. (చూ. కావ్యమీమాంస. పు. 4) అవంతిసుందరి ఉత్తమవిద్యాసంస్కృతిసంపన్నురాలు. కావ్యమీమాంసలో రాజశేఖరుడు ఈమె మతమును మూడు స్థలములలో ఉదాహరించినాడు దీనిని పట్టి చూడగా ఈమె ఏదియో అలంకారశాస్త్రగ్రంథమును రచించి యుండవచ్చు నని తోచుచున్నది రాజశేఖరుని ప్రాకృతభాషారూపక మగు కర్పూరమంజరి మొట్టమొదట ఈమె అభిలాష ననుసరించి ప్రయోగింపబడినది

రాజశేఖరుని గ్రంథములను పరిశీలింపగా ఈతనికి శివవిష్ణ్వాదులవిషయమున తారతమ్య బుద్ధి లేకపోవుటయే కాక జైనబౌద్ధాదిమతముల విషయమున గూడ ఈతడు ఉదారాశయు డని తెలియుచున్నది.

మహారాష్ట్రములోని బరారు ప్రాంతమునకు చెందినవా డగుటచే రాజశేఖరునకు ఆంధ్ర-కర్ణాట-ద్రావిడాది దాక్షిణాత్యదేశములతో ఘనిష్ఠసంబంధ ముండియుండును. ఈతడు యౌవనమున ఈ దేశములందు సంచరించుచు భోగవిలాసపూర్ణ మైన జీవితమును గడపినట్లు క్షేమేంద్రుని ఔచిత్యవిచారచర్చలోని ఈ క్రింది శ్లోకమువలన తెలియుచున్నది:-

"కర్ణాటీదశనాఙ్కితః శితమహారాష్ట్రీకటాక్షక్షతః
ప్రౌఢాన్ధ్రీస్తనపీడితః ప్రణయినీభ్రూభఙ్గవిత్రాసితః,

లాటీబాహావివేష్టితశ్చ మలయస్త్రీతర్జనీతర్జితః
సోయం సంప్రతి రాజశేఖరకవిర్వారాణసీం వాఞ్ఛతి''

''కర్ణాటకాంతల దంతక్షతములచే చిహ్నితుడును, మహారాష్ట్రమంద యానల తీక్ష్ణ కటాక్షములచే గుచ్ఛబడిన వాడును, ప్రౌఢ లగు ఆంధ్రమహిళా మతల్లుల పయోధరములచే పీడింపబడినవాడును, ప్రేయసుల భ్రూభంగములచే భయపెట్టబడినవాడును, లాటదేశీయకుటిలాలకల బాహువులచే బంధింపబడిన వాడును, మలయపర్వత ప్రాంతీయ సుందరీమణుల తర్జనిచే అదిలింపబడిన వాడును అగు ఈ రాజశేఖరకవి ఇపుడు వారణాసిపై ఇచ్ఛ చూపుచున్నాడు'',

ఈ విధముగ మహారాష్ట్రమున జన్మించి, దక్షిణాపథమునందలి అనేక ప్రాంతములతో గూడ సంబంధము గల రాజశేఖరుడు తన పాండిత్యాదులచే, ఆనాడు సకలవిద్యాస్థానమై భారతీయసంస్కృతికి ఆట పట్టైన కాన్యకుబ్జమున రాజాదరము సంపాదించుటయే కాక అపుడు రాజ్యము పాలించుచున్న నిర్భయ మహేంద్రపాలునికి ఉపాధ్యాయుడుగ కూడ ఉండెను. మహేంద్రపాలుని కుమారు డగు మహీపాలుడు కూడ రాజశేఖరుని తన ఆస్థానవిద్వాంసునిగ చేసి కొని గౌరవించెను.

కనౌజను రాజధానిగ చేసికొని మధ్యదేశమును పాలించిన ఈ నిర్భయ మహేంద్రపాల-మహీపాలులు గూర్జదేశములోని ప్రతీహారవంశమునకు చెందిన వారు. మహేంద్రపాలుడు క్రీ. శ. 890-908 సంవత్సరములందును, మహీపాలుడు 910-940 సంవత్సరములందును రాజ్యపాలనము చేసిరి. కావున చాల కాలము మహేంద్రపాలుని ఆస్థానమును, తరువాత కొంచెము కాలము మాత్రమే అతని కుమారు డగు మహీపాలుని ఆస్థానమును అలంకరించిన రాజశేఖరుని కాలము క్రీ. శ. 830-920 అని నిర్ధారణగ చెప్పవచ్చును. రాజశేఖరుడు ఈ కాలమునకు చెందినవా డని చెప్పుటకు మరి కొన్ని ఆధారములు కూడ ఉన్నవి. క్రీ. శ. 857-984 ప్రాంతమునకు చెందిన ఆనందవర్ధనుని మతమును రాజశేఖరుడు ఉదాహరించినాడు. అట్లే పదవశతాబ్దము ఉత్తరార్ధమునకు చెందిన సోమదేవ-సోడ్ఢల-అభినవగుప్తులు రాజశేఖరుని గ్రంథములనుండి ఉదాహరించి యున్నారు,

"హిమవద్వింధ్యయోర్మధ్యం యత్ప్రాగ్వినశనాదపి, ప్రత్యగేవ ప్రయాగాచ్చ మధ్యదేశః ప్రకీర్తితః" అను మనుస్మృతి వాక్యము ననుసరించి, దక్షిణమున వింధ్యము, ఉత్తరమున హిమాలయము, పశ్చిమమున వినశనము (సరస్వతీనది భూమిలో హరించిపోయిన చోటు. ఇదినేటి థానేశ్వరము. అంబాలా జిల్లాలోని 'సర్‌హిందు' అను స్థాన మని కొందరు చెప్పుదురు) తూర్పున ప్రయాగ-ఈ నాలిగింటి మధ్య నున్న దేశము మధ్యదేశము. రాజశేఖరుడు కూడ దీనినే మధ్యదేశ మని చెప్పినాడు. ఈ ప్రాంతము వారు సదాచారసంపన్నులు, సభ్యత కలవారు అని కామ సూత్రములో చెప్పబడినది. "మధ్యదేశ్యాః ఆర్యప్రాయాః శుచ్యుపచారాః"(కా. సూ.). ఈ సూత్రార్థమును వివరించుచు జయమంగళవ్యాఖ్యానమున, "వసిష్ఠుని మతము ప్రకారము గంగా యమునల మధ్యనున్న దేశము మధ్యదేశము" అని చెప్పబడినది. రాజశేఖరుడు గంగాయమునామధ్య ప్రాంతమును అంతర్వేది యనియు, పాంచాల మనియు పేర్కొనినాడు. కాన్యకుబ్జము మధ్యదేశరాజధాని. కాన్యకుబ్జరాజాదరణము పొందిన రాజశేఖరుడు పాంచాలములోని పండితులు శాస్త్రకావ్యాదులలో చాల నిష్ణాతు లనియు, ఉత్తమసంస్కృతి కలవారనియు, వీరి అభిరుచులు అగ్రామ్యములుగ నుండు నసియు, కాన్యకుబ్జస్త్రీల సుందరము లగు వేషభూషాదులను ఇతర ప్రాంతీయు లందరును, అనుకరించుటకై ప్రయత్నించుచుందు రనియు బాలరామాయణకావ్యమీమాంసాదులలో చెప్పియున్నాడు.

"యత్రార్యే'న తథానురజ్యతి కవిర్గ్రామీణగీర్గుమ్ఫనే
శాస్త్రీయాసు చ లౌకికీషు చ యథా భవ్యాసు నవ్యోక్తిషు.
పాఞ్చాలాస్త్వ పశ్చిమేన త ఇమే వామా గిరాం భాజనా
స్త్వ్యర్థ్యష్టేరతిశేశవన్తు యమునాం త్రిస్రోతసం చాన్తరా.
(బాలరామాయణము. 10.8)

"యో మార్గః పరిధానకర్మణి, గిరాం యా సూక్తిముద్రాక్రమో
భంగిర్యా కబరీచయేషు, రచనం యద్భూషణాలీషు చ.
దృష్టం సున్దరి కాన్యకుబ్జలలనాలోకైరిహాన్యచ్చ యత్
శిక్షన్తే సకలాసు దిక్షు తరసా తత్ కౌతికిన్యః ప్రియః"

బాలరామాయణము. 10. 90,

ఈ కావ్యకాలమునే కేంద్రముగా గ్రహించి రాజశేఖరుడు భారతదేశము నందలి వివిధప్రాంతముల సీమావిభజ్జనము చేసి యున్నాడు.

రాజశేఖరుడు తనకు 'కవిరాజు' అను బిరుద మున్నట్లు కర్పూరమంజరిలో చెప్పికొన్నాడు. కావ్యమీమాంసలో ఈతడు వర్ణించిన పది 'కవి' భేదములలో 'కవిరాజు' అనునది ఏడవది. కవిరాజు మహాకవికంటె గొప్పవాడు. అనేక భాషలలో, విభిన్నరసములతో ఒప్పారు వివిధసాహిత్యప్రక్రియలందును చేయి తిరిగినవాడు కవిరాజు.

రాజశేఖరునికృతులు:- ''బాలరామాయణ'-'బాలభారత'(అసంపూర్ణము), 'విద్ధసాలభంజికలు'. ఈతని సంస్కృత రూపకములు 'కర్పూర మంజరి' ప్రాకృతరూపకము. కావ్యమీమాంస ఈతడు పరిణతబుద్ధియైన పిమ్మట రచించిన అలంకారశాస్త్రీయగ్రంథము. కర్పూరమంజరి రచించునాటికే ఈతనికి 'కవిరాజ' బిరుదము లభించినది. మొదటి మూడు రూపకముల లోని శ్లోకములను కావ్యమీమాంసలో ఉదాహరించుట జరిగినది. ఈతడు 'హరవిలాస' మను ఒక మహాప్రబంధమును కూడ రచించి యుండునని తరువాతి కవుల రచనల ద్వారా తెలియు చున్నది. ఇది ఇపుడు అలభ్యము. హేమచంద్ర-ఉజ్జ్వల దత్తాదులు దీనినుండి కొన్ని శ్లోకములను ఉదాహరించినారు. ఈ కావ్యము ప్రారంభమున ఈతడు కొందరు పూర్వకవులను స్తుతించి యుండును. అట్టి సంప్రదాయము అనాటి ప్రాకృతకావ్యములలో కూడ ఉన్నది. రాజశేఖరుని ఈ విశిష్టకవి ప్రశంసలు జల్హణుని సూక్తిముక్తావళిలో ఉద్ధృతములై ఉన్నవి. ఈ శ్లోకము లాధారముగ చేసికొని కొందరు 'కవివిమర్శము' అను మరి యొక గ్రంథమును కూడ రాజశేఖరుడు రచించి యుండు నని ఊహించుచున్నారు. అట్లూహించుట కంటె హరవిలాసప్రారంభముననే రాజశేఖరు డా శ్లోకములను కూర్చి యుండు నని చెప్పుట యుక్త మని మరి కొందరి అభిప్రాయము. భూగోళమును వర్ణించు 'భువనకోశము'అను గ్రంథమును కూడ రాజశేఖరుడు రచించినట్లుకావ్యమీమాంసలోని 17వ అధ్యాయమువలన తెలియుచున్నది. అది స్వతంత్ర గ్రంథమో లేక కావ్యమీమాంసలోని అలభ్య మగు భాగమో తెలియదు. ఉజ్జ్వలదత్తుడు శివనామ పర్యాయములను చెప్పు శ్లోక మొకదానిని రాజశేఖరకృత మని ఉదాహరించినాడు. ఇది హరవిలాసములో ఉన్నదో, రాజశేఖరుడు నిఘంటువు కూడ ఏదైన రచించినాడో తెలియదు. అలంకారశేఖరమునందు మూడు శ్లోకములు రాజశేఖరకృతముగ ఉదాహరింపబడినవి:-

"సమానమధికం న్యూనం సజాతీయం విరోధి చ
సకుల్యంసోదరం కల్పమిత్యాద్యాః సామ్యవాచకాః.
అలఙ్కారశిరోరత్నం సర్వస్వం కావ్యసమ్పదామ్.
ఉపమా కవివంశస్య మాతైవేతి మతిర్మమ.''
"ఉత్పాదిర్నభోభిత్తైః శైలై రామూలబన్ధనాత్.
తాంస్తానర్థాన్సమాలోక్య సమస్యాం పూరయేత్కవిః''

ఇవి నిజముగ రాజశేఖరుని శ్లోకములే యైనచో మొదటి రెండును ఉభయాలంకారికాధికరణములోనివి, మూడవది వైనోదికాధికరణములోనిది అయి ఉండవలెనని విమర్శకుల అభిప్రాయము.

రాజశేఖరుని కాలమున సంస్కృతభాషతో పాటు ప్రాకృత-అపభ్రంశ-పైశాచీభాషలు కూడ కావ్యభాషలుగా ప్రచారములో ఉండెడివి. నేటి వ్రజభాషకు మూలభాష యైన శౌరసేనీ ప్రాకృతమును గూర్చి రాజశేఖరుడు ''మధుర మథురావాసి భణితి'' అని చెప్పియున్నాడు ఏ ప్రాంతమున ఏ భాషలు ప్రచారములో ఉండెనో, ఎవరు ఏ భాషను ఆదరించెడివారో దేనిని ద్వేషించెడివారో, ఎవరు ఏ భాషలో ప్రవీణులో మొదలగు విషయములను కూడ ఈతడు కావ్యమీమాంసలోనే కాక బాలరామాయణాదులలో కూడ సూచించినాడు అపభ్రంశభాష మార్వాడ్, తూర్పు పంజాబు, స్యాల్‌కోట్ మొదలైన ప్రాంతాలలోను, పైశాచీభాష అవన్తి-పారియాత్రదశపురాది ప్రాంతములలోను ప్రచారములో నుండెడివి. ఆయా ప్రాంతీయుల ఉచ్చారణభేదములను కూడ వర్ణించినాడు. దీనిని బట్టి రాజశేఖరునకు ఆనాటి దేశభాషలలో కూడ మంచి ప్రవేశమున్నట్టు స్పష్టమగుచున్నది. కావుననే ఈతడు తన కవిరాజత్వమును బాలరామాయణములో ఈ విధముగ సమర్థించుకొనినాడు:-

''గిరః శ్రవ్యా దివ్యాః ప్రకృతిమధురాః ప్రాకృతధురాః
సుభవ్యోఽపభ్రంశః సరస రచనం భూతవచనమ్.
విభిన్నాః పన్థానః కిమపి కథనీయాశ్చ త ఇమే
నిబద్ధా యస్త్వేషాం స ఇహ కవిరాజో విజయతే.''

"శ్రవణమధురము లగు సంస్కృతరచనలు, స్వభావ మధురము లగు ప్రాకృతకృతులు. అందమైన అపభ్రంశభాషాకావ్యము; సరసమైన పైశాచభాషా

రచనను-వీటినన్నింటిని విభిన్నసాహిత్యప్రక్రియలలో నడిపించిన కవిరాజు సర్వోత్కర్షతో ఉన్నాడు."

ప్రాకృతభాష విషయమున రాజశేఖరుడు లాటదేశీయులను అధికముగ ప్రశంసించినాడు. సంస్కృతభాషాద్వేష లగు లాటదేశీయులు ప్రాకృతకావ్యము లను పఠించునపుడు వారు నాలుకను త్రిప్పెడు విధానము కూడ హృద ముచ్చటగా నుండునట:

"పఠన్తి లటభం లాటాః ప్రాకృతం సంస్కృతద్విషః
జిహ్వయా లలితోల్లాప లబ్ధసౌందర్యముద్రయా" (కామీ. vii)

లాటదేశీయుల నోటినుండి ఇంత మధురముగ వినవచ్చు ఈ ప్రాకృత కావ్యమే గౌడ దేశీయులు చదువుచున్నపుడు వినుటకు చాల దుర్భరముగ నుండు నట. అందుచేతచే సరస్వతి బ్రహ్మవద్దకు వెళ్లి-"నీవు గౌడుడు ప్రాకృత గాథలు చదువకుండునట్లు చేసెదవా; లేదా నన్ను వాగ్దేవిగా నా ఉద్యోగమునకు రాజీనామా ఈయమందువా" అని అడిగినదట:-

"బ్రహ్మన్ విజ్ఞాపయామి త్వాం స్వాధికారజిహాసయా
గౌడస్త్యజతు వా గాథామన్యా వాస్తు సరస్వతీ" (కామీ. vii)

బాలరామాయణములోని లాటదేశవర్ణనప్రకరణమునందు గూడ రాజశేఖ రుడు లాటదేశీయుల ప్రాకృతమును ప్రశంసించుచు వారి ప్రాకృతము చెవిలో పడగనే ఇతరభాషలన్నియు కటువుగ ఉండు ననియు, లాటదేశస్త్రీల మధుర ప్రాకృతోక్తులు, వక్రవీక్షణములు, మన్మథుని కూడా ఉత్తేజితుని చేయు ననియు చెప్పియున్నాడు:-

"యద్యోనిః కిల సంస్కృతస్య సుదృశాం జిహ్వాసు యన్మోదతే
యత్ర శ్రోత్రపథావతారిణి కటుర్భాషాక్షరాణాం రసః
గద్యం చూర్ణపదం పదం రతిపతేస్తత్ప్రాకృతం యద్వచః
తాన్ లాటాన్ లలితాఙ్గి పశ్య నుదతీ దృష్టేర్నిమేషవ్రతమ్
లక్ష్యీకర్తుం పవ్యతోపి లాటీలదహవీక్షితైః
లక్ష్యీభవతి కన్దర్పః స్వైషామేవాత్ర పత్రిణామ్"

రాజశేఖరునకు సంస్కృత కావ్యములకంటె ప్రాకృతకావ్యములందే ఆసక్తి అధికము. సంస్కృతము పరుషమైనదనియు ప్రాకృతము సుకుమార

మైనదనియు కర్పూర మంజరీ ప్రారంభమున చెప్పుచు ప్రాకృత సంస్కృత కావ్యములనడుమనున్న భేదము స్త్రీ పురుషుల మధ్య నున్న భేదము వంటి దని వర్ణించినాడు:-

"పరుసా సంక్కిఅబన్ధా పాఉదబన్ధో వి హోఇ సుఉమారో
పురుస మాలాణం జేత్తిఅ మిహంతరం తేత్తి అ మిమాణం".

ప్రాకృతవ సంస్కృతమునకు మూల మని కొందురు, సంస్కృతము ప్రాకృతమునకు మూల మని మరికొందరు చెప్పుచుందురు. రాజశేఖరుడు మాత్రము, పైన దాహరించిన 'యద్యోనిః కిల' అను శ్లోకములో, ప్రాకృత మునుండి సంస్కృతము పుట్టిన దని చెప్పినాడు.

రాజశేఖరుడు తన పాండిత్య ప్రకర్ష విషయమునను, కవితానిర్మాణ చాతుర్యము విషయమునను మంచి ఆత్మవిశ్వాసము గల వ్యక్తి. ఆదికవి యైన వాల్మీకియే రెండవజన్మమున భర్తృమేంఠుడు గాను, తరువాత భవభూతి గాను జనించి, పిదప రాజశేఖరుడుగా అవతరించినా డని ఒక దైవజ్ఞుడు చెప్పినట్లుగా అతడే ఈ క్రింది శ్లోకములో చెప్పికొన్నాడు.

"బభూవ వల్మీకభవః కవిః పురా తతః ప్రపేదే భువి భర్తృమేణ్ఠతామ్.
స్థితః పునర్యో భవభూతిరేఖయా స వర్తతే సంప్రతి రాజశేఖరః",

వాల్మీకి-భర్తృమేంఠ-భవభూతులు రాజశేఖరునకు ఆదర్శకవు లను విషయమును గూడ ఈశ్లోకము సూచించు చున్నది. మహావీరచరిత-మాలతీమాధవ-ఉత్తరరామచరితముల రచయిత యైన భవభూతి సర్వవిదితుడు. భర్తృమేంఠుడు కాశ్మీరదేశాధిపు డగు మాతృగుప్తుని ఆస్థానములో నుండెడివాడు. ఈతడు రచించిన హయగ్రీవవధమహాకావ్యము ఇపుడు అలభ్యము. ఈతడు వక్రోక్తి నిపుణు డని వర్ణించు శ్లోక మొకటి జల్హణుని సూక్తిముక్తావళిలో ఉన్నది:-

"వక్రోక్త్యా మేణ్ఠరాజస్య వహన్త్యా సృణిరూపతామ్,
ఆవిద్ధా ఇవ ధున్వన్తి మూర్ధానం కవికుఞ్జరాః"

"అంకుశముగ నైన మేంఠుని వక్రోక్తిచే గ్రుచ్చబడినవారు వలె కవి కుంజరులు తల లూపుచున్నారు"

రాజశేఖరుడు సహృదయుడైన కవి; విమర్శకుడు. పురుషుల వలె స్త్రీలు కూడ ఉత్తమకవులు కావచ్చునని కావ్యమీమాంసాదవమాధ్యాయమునచెప్పుచు

మంచి సంస్కారమును సంపాదించుకొను విషయములో స్త్రీపురుషాదిభేదము లేదని స్పష్టీకరించినాడు. ఈతని భార్యయైన అవంతిసుందరి గొప్పవిదుషీమణి అను విషయమును చూచియున్నాము. ఈతడు కొందరు స్త్రీకవులను ప్రశంసించుచు వ్రాసిన కొన్ని శ్లోకములు సూక్తిముక్తావళిలో పొందుపరపబడియున్నవి. మంచి సంస్కారము సంపాదించుకున్నవారు జాతివర్ణాదిభేదములతో పని లేక గౌరవపాత్రులే అని కూడ రెండు శ్లోకములలో చెప్పియున్నాడు:-

"కే వైకటనితమ్బేన గిరాం గుమ్ఫేన గుమ్ఫితాః.
నిన్దన్తి నిజకాన్తానాం న మౌగ్ధ్యమధురా గిరః."

ఇది వికటనితంబ యను స్త్రీకవిని ప్రశంసించు శ్లోకము. "వికటనితంబ యొక్క వాగ్గుంభనముల రుచి చూచిన తరువాత, మౌగ్ధ్యముచే మధురములైన తమ కాంతల వాక్కులను కూడ నిందింపని వారు ఎవరైన ఉందురా?"

"శబ్దార్థయోః సమో గుమ్ఫః పాఞ్చాలీరీతిరుచ్యతే
శీలాభట్టారికావాచి బాణోక్తిషు చ సా యది."

"శబ్దార్థముల సమమైన (అన్యూనానతిరిక్తమైన) కూర్పు పాంచాలీరీతి. అది చూడవలె నన్నచో శీలాభట్టారిక రచనలో చూడవలె, లేదా బాణుని రచనలో చూడవలెను."

"పార్థస్య మనసి స్థానం లేభే ఖలు సుభద్రయా
కవీనాం చ వచోవృత్తిచాతుర్యేణ సుభద్రయా."

"ఆ సుభద్ర అర్జునుని మనస్సులో స్థానము చేసికొనినది. ఈ సుభద్ర (ఒక స్త్రీ కవి) కావ్యరచనాచాతుర్యముచే కవుల మనస్సులో స్థానము చేసికొన్నది"

"సూక్తీనాం స్మరకేలీనాం కలానాం చ విలాసభూః.
ప్రభుదేవీ కవిర్లాటీ గతాపి హృది తిష్ఠతి."

"సూక్తులకును, కామకేళులకును, కళలకును, విలాసస్థానమైన లాటదేశ స్త్రీకవియైన ప్రభుదేవి మరణించినను, నా హృదయములోనే ఉన్నది."

"అహో ప్రభావో వాగ్దేవ్యా యన్మాతఙ్గదివాకరః
శ్రీహర్షస్యాభవత్సభ్యః సమో బాణమయూరయోః."

"వాగ్దేవి ప్రభావము ఎంత గొప్పది! ఏల ననగా అంత్యజాతివాడైన దివా కరుడు కూడ బాణమయూరులతో సమముగ శ్రీహర్షుని ఆస్థానములో సభ్యుడుగ ఉండెను."

"సరస్వతీపవిత్రాణాం జాతిస్తత్ర న దేహినామ్,
వ్యాసస్పర్ధి కులాలోఽభూత్ యద్ద్రోణో భారతే కవిః"

"సరస్వతే పవిత్రులైన మానవులకు జాతి అనునది లేదు ఎందుచేత ననగా-కుమ్మరియైన ద్రోణకవి భారతరచనవిషయమున వ్యాసునితో పోటీచేయ కలిగెను."

ఉత్తమ సాహిత్యవిమర్శకుడుగా, కవిరాజుగా ప్రసిద్ధి పొందిన రాజశేఖ రుని, అతని సహలికులు, తదితరులు కూడ ప్రశంసించినా రన్నచో ఆశ్చ ర్యము లేదు. రాజశేఖరుని కవిగోష్ఠిలో సదస్యుడును, మృగాంకలేఖాకథారచ యితయు అగు అపరాజితుడు అతనిని గూర్చి ప్రాకృతములో వ్రాసిన ఒక ప్రశంసాపద్యము కర్పూరమంజరీప్రారంభమున కూర్చబడినది :-

"బాలకఈ ఇరాఓ జిబ్బఆరాఅస్స తహ ఉబజ్ఝాఓ
ఇతి అస్స రంపరాఏ అత్తా మాహత్త మారూఢో."

"మొదట బాలకవియై, తరువాత కవిరాజై, తరువాత నిర్భరరాజుకు ఉపాధ్యాయుడై - ఈ విధముగ రాజశేఖరుడు క్రమక్రమాభివృద్ధి పొందినాడు."

తన కవిగోష్ఠిలో మరియొక సభ్యుడైన కృష్ణశంకరశర్మ తనను గూర్చి చెప్పిన పద్యమును రాజశేఖరుడు విద్ధశాలభంజికాప్రారంభమున చేర్చినాడు:-

"హాతుం శ్రోత్రరసాయనం రచయితుం వాచః సతాం సమ్మతాః
వ్యుత్పత్తిం పరమామవాప్తుమవధిం లబ్ధుం రసస్రోతసః.
భోక్తుం స్వాదు ఫలం చ జీవితతరోర్యద్యస్తి తే కౌతుకం
తద్ భ్రాతః శృణు రాజశేఖరకవేః సూక్తీః సుధాస్యన్దినీః."

"శ్రోత్రరసాయనమును పానము చేయుటకును, సత్పురుషులకు సంమ తములగు వాక్కులను రచించుటకును, మంచి వ్యుత్పత్తి సంపాదించుకొనుట కును, రస ప్రవాహపరావధి చేరుటకును, జీవితవృక్షము మధురఫలమును అను భవించుటకును నీ కేమైన కోరిక యున్నచో, ఓ సోదరా! అమృతము ఒలుకు రాజ శేఖరుని సూక్తులను వినుము."

తిలకమంజరి యను గద్యకావ్యమును రచంచిన ధనపాండు రాజశేఖరుని ఈ విధముగ ప్రశంసించెను :—

"సమాధిగుణశాలిన్యః ప్రసన్నపరిపక్త్రిమాః
యాయావరకవేర్వాచో మునీనామివ వృత్తయః."

"యాయావరకవి వాక్కులు, మునుల వృత్తులు వలె, సమాధి యను గుణముతో ప్రకాశించునవి. (ధ్యానముతోడను సద్గుణముతోడను ప్రకాశించు నవి అని ముని పక్షమున అర్థము). ప్రసాదగుణము కలవి (నిర్మలమైనవి). ద్రాక్షాపాకాదులతోకూడినవి (పుణ్యపరిపాకమును పొందినవి)."

లాటదేశీయుడైన సోడ్ఢలు డనే ఒక కాయస్థకవి ఉదయసుందరీకథ అనే చంపూకావ్యములో రాజశేఖరుని ప్రశంసించుచు — "పండితసమాజముల మన్న నలు పొందిన రాజశేఖరుని వాక్కులలో సరసపదలక్ష్మి నటి వలె నాట్యమాడి నది" అని చెప్పినాడు :—

"యాయావరః ప్రాజ్ఞవరో గుణజ్ఞైరాశంసితః సూరిసమాజవర్యైః.
నృత్యత్యుదారం భణితే రసస్థా నటీవ యస్యోఢరసా పదశ్రీః."

ఈ విధముగ ఎందరో కవులు రాజశేఖరుని కవితావైదుష్యములను ప్రశంసించి యున్నారు.

కావ్యమీమాంసా :- ఇది అర్థశాస్త్ర - కామశాస్త్రాదుల వలె సూత్ర సదృశము లగు వాక్యములలో వ్రాయబడినది. కావుననే దీని శైలి ఆహ్లాదకరము గను అర్థగంభీరముగను ఉండును. శాస్త్రసంగ్రహ మను మొదటి అధ్యాయమును బట్టి చూడగా రాజశేఖరుడు అతివిస్తృతమైన అలంకారశిక్షానసర్వస్వము వంటి గ్రంథమును రచించుటకు ఉపక్రమించినట్లు తెలియుచున్నది. కాని ఈతడు వ్రాయదలచిన, లేదా వ్రాసిన పదునెనిమిది అధికరణములలో కవి రహస్య మను పేరు గల మొదటి అధికరణము మాత్రమే మన కిపుడు లభ్యమగుచున్నది. "మూడు రీతులను గూర్చి ముందు ముందు చెప్పగలము"; 'ఈ విషయమును ఔపనిషదధికరణమున విశదీకరించెదము'— ఈ విధమగ రాజశేఖరుడు వ్రాసిన దానిని బట్టి అతడు ఆ యధికరణములను వ్రాయుటకై ఒక ప్రణాళికను వేసి కొనినట్లు తెలియచున్నది.

కవి రహస్య మను ఈ ప్రథమాధికరణములో పద్దెనిమిది అధ్యాయము లున్నవి. కాని ఈ అధికరణములోని మొదటి మూడు అధ్యాయములను, రాజ శేఖరుడు తాను వ్రాయదలచిన అష్టాదశాధికరణాత్మక మగు మొత్తము కావ్య మీమాంసకు ఉపోద్ఘాతరూపమున వ్రాసినట్లు కనబడుచున్నది. అందుచే 'కవి రహస్యమునకు' సంబంధించిన విషయము నాల్గవ అధ్యాయముతో ప్రారంభమగు చున్నది.

మొదటి అధ్యాయములో సాహిత్య శాస్త్రోత్పత్తి, ఈ శాస్త్రమునకు సంబంధించిన వివిధ విషయములును నిరూపింపబడినవి. రెండవ అధ్యాయములో సాహిత్యశాస్త్రప్రాధాన్యము నిరూపింపబడినది. ఇది వేదార్థజ్ఞానమునకు ఉపక రించున దగుటచే ఏడవ వేదాంగము. పదునైదవ విద్యాస్థానము తృతీయా ధ్యాయములో కావ్యపురుషోత్పత్తి, సాహిత్యవిద్యతో ఆతని వివాహము ఆ యా ప్రాంతములలో నున్న వృత్తి-ప్రవృత్తి-రీత్యాదులభేదములు కావ్యశైలిలో వర్ణింపబడినవి. ఈ కావ్యపురుష - సాహిత్యవిద్యావృత్తాంతము రాజశేఖరుని అద్భుత ప్రతిభకు నిదర్శనము.

ఈ కవిరహస్యములో ప్రధానముగ-(1)కవి కాదలచినవాడు సంపాదించు కొనవలసిన యోగ్యతలు (2) ఆతడు కావ్య నిర్మాణ విషయమున అనుసరింప దగిన నియమములు, (3) పరిహరింపదగిన దోషాదులు-ఈ మూడు విషయము లును ప్రతిపాదింపబడినవి. 4-9 అధ్యాయములలో మొదటి విషయము, 10వ అధ్యాయములో రెండవ విషయము, 11-18 అధ్యాయములలో మూడవ విషయము ప్రతిపాదింపబడినవి. పాఠకులీ విషయములను గ్రంథమునుండియే గ్రహింపగలరను అభిప్రాయముతో ఇచట వివరించుట లేదు.

కావ్యమీమాంసలోని విషయములను తరువాతి ఆలంకారికులు గ్రహించి తమ గ్రంథములలో పొందుపరచిరి. హేమచంద్రుడు ఇందలి విషయములను కావ్యానుశాసన వివేకములోనికి గ్రహించినాడు. 17, 18 అధ్యాయములలోని విషయము యథాతథముగ గ్రహింపబడినది. ఇట్లే నేమికుమారుని కుమారుడగు వాగ్భటుడు, కవిశిక్షలు వ్రాసిన క్షేమేంద్ర-అమర-వినయచంద్ర-దేవేశ్వరాదులు కూడ ఎన్నో విషయములను ఈ గ్రంథమునుండి సంగ్రహించినారు. భోజుడు సరస్వతీకంఠాభరణములో ఉదాహరించిన కొన్ని పద్యములు కావ్యమీమాంసలో

మాత్రమే లభ్యమగుచున్నవి. దీనిని బట్టి కావ్యమీమాంసకు గల ప్రసిద్ధి స్పష్టముగ తెలియుచున్నది.

రాజశేఖరుడు కావ్యమీమాంసలో సాహిత్యశాస్త్రమును ఒక నూతన దృక్పథముతో నిరూపించుటయే గాక భారతదేశములోని అనేక ప్రాంతములలో నున్న విభిన్న-ఆచారవ్యవహారాదులను. వేషభూషాదులను కూడ చక్కగ వర్ణించి యున్నాడు. ఇతర గ్రంథములలో లభ్యము కాని ఎన్నో మనోహరము లగు పద్యములను ఉదాహరించినాడు. అనాటి కవితాగోష్ఠులస్వరూపము, కవులలోని తారతమ్యములు, మొదలగు ఎన్నో విషయములు ఈ గ్రంథము ద్వారా తెలియుచున్నవి. ఏ భాషలో కవిత్వము వ్రాసినను ప్రతి ఒక్క కవియు. భావుకుడున తప్పక చదువవలసిన ఉత్తమ గ్రంథము ఈ కావ్యమీమాంస.

దాదాపు 18 సంవత్సరములకు పూర్వము నేను రసగంగాధరముపై థీసిస్ వ్రాయు సందర్భమున ఈ కావ్యమీమాంసాది గ్రంథములను చదువుట జరిగినది. కావ్యమీమాంసను తెలుగులోనికి తీసికొనివచ్చిన బాగుండును అను అభిలాష అనాడే కలిగినది. కాని అది ఈనాటికి సఫలమైనది. గ్రంథము వ్రాయుటకంటె కష్ట మైన పని తత్ప్రచురణము. దానికి కూడ సాహసించితిని. ఇది ఏ కొందరు సహృదయుల కైనను ఉపకరించినచో శ్రమ సఫల మగును.

మదీయశ్రేయోభిలాషులును. గ్రంథప్రచురణాదికార్య నిర్వహణమునచే వివిధరాష్ట్రములలో నున్న సాహిత్యఅకాదమీలలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమీకి అందరి మన్ననలు పొందిన అగ్రస్థానమును సంపాదించిన కార్య దక్షులును అగు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఈ సాహిత్యశాస్త్ర గ్రంథమును కృతిగా స్వీకరించుటకై అంగీకరించినందులకు వారి కెంతయు కృతజ్ఞుడను. నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్ అధిపతి యగు శ్రీ యన్. చిదంబర రావు గారు అతి శీఘ్రముగ ముద్రణ కార్యమును నిర్వహించినందులకు మదీయ కృతజ్ఞతాపాత్రులు.

హైదరాబాదు
27-5-1979.

పుల్లెల శ్రీరామచంద్రుడు.

శ్రీః

శ్రీ మహాగణాధిపతయేనమః

కావ్యమీమాంసా.

ప్రథమోధ్యాయః—శాస్త్ర సఙ్గ్రహః.

మూ. అథాతః కావ్యం మీమాంసిష్యామహే యథోపదిదేశ శ్రీ కణ్ఠః పరమేష్ఠి వైకుణ్ఠాదిభ్యశ్చతుః షష్టయే శిష్యేభ్యః. సోఽపి భగవాన్ స్వయమ్భూరిచ్ఛా జన్మభ్యః స్వాన్తేవాసిభ్యః తేషు సారస్వతేయో వృన్దీయసామపి వన్ద్యః కావ్యపురుష ఆసీత్. తంచ సర్వసమయవిదం దివ్యేన చక్షుషా భవిష్యదర్థదర్శినం భూర్భువః స్వస్త్రితయవర్తినీషు ప్రజాసు హితకామ్యయా ప్రజాపతిః కావ్యవిద్యా ప్రవర్తనాయై ప్రాయుఙ్క్త. సోఽష్టాదశాధికరణీం దివ్యేభ్యః కావ్యవిద్యా స్నాతకేభ్యః సప్రపఞ్చం ప్రోవాచ.

బాలానన్దినీవ్యాఖ్యా.

నత్వా శ్రీ తాతపాదాద్యాన్ శాస్త్రమన్త్రాదిసద్గురూన్
కుర్వేఽహం కావ్యమీమాంసావ్యాఖ్యామాన్ధ్రీం యథామతి.

శ్రీకంఠుడు బ్రహ్మవిష్ణ్వాదులైన అరవైనలుగురు శిష్యులకు ఉపదేశించిన పద్ధతితో ఇపుడు కావ్యమును గూర్చిన మీమాంసను చేసెదము. (మీమాంస అనగా పూజనీయమైన విచారము.) భగవంతు డగు ఆ బ్రహ్మ కూడ స్వేచ్ఛామాత్రలబ్ధ జన్ములైన తన శిష్యులకు ఉపదేశించెను. వీరిలో సరస్వతీపుత్రు డగు కావ్యపురుషుడు ఒకడు. అతడు జగత్పూజ్యులగు ప్రధానదేవతలకు కూడ పూజ్యుడు: సర్వసంప్రదాయములు తెలిసినవాడు; దివ్యదృష్టిచే భవిష్యద్విషయములను కూడ తెలిసికొనకలిగినవాడు. భూర్భువఃస్వర్లోకము లనెడు మూడు లోకములందును నివసించు ప్రజలకు హితము కూర్చవలె ననెడు అభిలాషచే

ప్రజాపతి, కావ్యవిద్యా ప్రచారమునకై ఆ కావ్యపురుషుని నియమించెను. అతడు పద్దెనిమిది అధికరణములలో నున్న ఈ కావ్యవిద్యను కావ్యవిద్యాస్నాతకు లగు దివ్యపురుషులకు సవిస్తరముగ బోధించెను.

వి. రాజశేఖరుడు ఈ గ్రంథమును సూత్రపద్ధతిలో వ్రాయుచున్నాడు. అందుచే "అథాతో ధర్మజిజ్ఞాసా" (జైమినిసూ) "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" (బ్రహ్మసూ) ఇత్యాదులందు వలె అథాతః అను శబ్దములతో ప్రారంభించినాడు. అథ = కావ్యనాటకాదిరచనానంతరము, అతః = వాటి వ్యుత్పత్తికి కావ్యమీమాంస ఆవశ్యకము గాన ఇత్యాదివిధమున అర్థము చెప్పుకొనవలెను. 'అథ' అనునది శ్రవణమాత్రముచేతనే మంగళప్రదముగాన మంగళాచరణము కూడ జరిగినది. "ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా. కణ్ఠం భిత్త్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గలికావుభౌ'' అను వాక్యమిచట ప్రమాణము.

మూ. తత్ర కవిరహస్యం సహస్రాక్షః సమామ్నాసీత్; ఔక్తికముక్తిగర్భః; రీతినిర్ణయం సువర్ణనాభః; ఆనుప్రాసికం ప్రచేతాః; యమో యమకాని; చిత్రం చిత్రాఙ్గదః; శబ్దశ్లేషం శేషః; వాస్తవం పులస్త్యః; ఔపమ్యమౌపకాయనః; అతిశయం పారాశరః; అర్థశ్లేషముతథ్యః; ఉభయాలఙ్కారికం కుబేరః; వైనోదికం కామదేవః; రూపకనిరూపణీయం భరతః; రసాధికారికం నన్దికేశ్వరః; దోషాధికరణం ధిషణః; గుణౌపాదానిక ముపమన్యుః;. ఔపనిషదికం కుచమారః —ఇతి తతస్తే పృథక్ పృథక్ స్వశాస్త్రాణి విరచయాఞ్చక్రుః.

వ్యా. సహస్రాక్షుడు కవిరహస్య మనెడు అధికరణమును రచించెను ఉక్తిగర్భుడు (ఉక్తులకు సంబంధించిన అనగా శబ్దరచనకు సంబంధించిన) ఔక్తికాధికరణమును రచించెను. ఇట్లే సువర్ణనాభుడు రీతినిర్ణయమును, ప్రచేతసుడు అనుప్రాసికమును, యముడు యమకములను, చిత్రాంగదుడు చిత్రమును, శేషుడు శబ్దశ్లేషమును, పులస్త్యుడు వాస్తవమును, ఔపకాయనుడు ఔపమ్యమును, పారాశరుడు అతిశయమును, ఉతథ్యుడు అర్థశ్లేషమును, కుబేరుడు ఉభయాలంకారికమును, కామదేవుడు వైనోదికమును, భరతుడు రూపకనిరూపణీయకమును, నందికేశ్వరుడు రసాధికారికమును, బృహస్పతి దోషాధికరణమును, ఉపమన్యువు గుణౌపాదానికమును, కుచమారుడు ఔపనిషదికమును (అనగా కావ్యతత్త్వ

విచారమై లేదా మంత్రోపాసనాదికమై యుండును) రచించిరి. అటు పిమ్మట వారందరును తమ తమ శాస్త్రములను కూడ వేరు వేరుగ రచించిరి.

మూ. ఇత్థ జ్కారం చ ప్రకీర్ణత్వాత్ సా కిఞ్చిదుచ్ఛిచ్ఛిదే. ఇతీయం ప్రయోజకాఙ్గవతీ సజ్క్షిప్య సర్వమర్థ మల్పగ్రన్థేన అష్టాదశాధికరణీ ప్రణీతా.

వ్యా. ఈ విధముగ ప్రకీర్ణముగ ఉండుటచే, అనగా వేరు వేరు రచయితలు వేరు వేరు విధములలో రచింపగా భిన్న భిన్నముగ ఉండుటచే, ఆకావ్య విద్య కొంచెము ఉచ్ఛిన్న మైపోయినది. కావున అవశ్యకము లగు అంగములతో గూడిన అష్టాదశాధికరణాత్మక మగు ఈ కావ్యవిద్యలో ఉన్న విషయముల నన్నింటిని సంక్షిప్తముగ ప్రతిపాదించుచు ఈ గ్రంథమును రచించినాను.

మూ. తస్యా అయం ప్రకరణాధికరణ సముద్దేశః, శాస్త్రసఙ్గ్రహః, శాస్త్ర నిర్దేశః, కావ్యపురుషోత్పత్తిః, పదవాక్యవివేకః పాఠప్రతిష్ఠా, అర్థానుశాసనం, వాక్యవిధయః, కవివిశేషః. కవిచర్యా, రాజచర్యా, కాకుప్రకారాః, శబ్దార్థహరణో పాయాః, కవిసమయః, దేశకాలవిభాగః, భువనకోశః ఇతి కవిరహస్యం ప్రథమ మధికరణ మిత్యాది.

వ్యా. ఆ కావ్యవిద్యకు సంబంధించిన వివిధ ప్రకరణ సహితము లగు అధికరణముల సముద్దేశము ఈ క్రింది విధముగ ఉండును. (ప్రతిపాదింప నున్న విషయముల పేర్లు మాత్రము చెప్పుటకు 'సముద్దేశము' అని పేరు) ప్రథమాధికరణ మైన కవి రహస్యములో—శాస్త్ర సంగ్రహము, శాస్త్రనిర్దేశము, కావ్య పురుషోత్పత్తి, పదవాక్యవివేకము, పాఠప్రతిష్ఠ, అర్థానుశాసనము, వాక్యవిధులు, కవి విశేషము, కవిచర్య, రాజచర్య, కాకుస్వర పద్ధతులు, శబ్దార్థములను కూర్చుటకు ఉపాయములు, కవిసమయము, దేశకాలవిభాగము, భువనకోశము అను ప్రకరణములుండును.

వి. కవిరహస్యమున 18 ప్రకరణము లుండగా, రాజశేఖరుడు 15 మాత్రమే పేర్కొనినాడు. క్రమము కూడ మార్చి చెప్పినాడు. దీనిని బట్టి మొదట అతడు అనుకొనిన పద్ధతిలో కాక వేరే విధమున ఇందలి ప్రకరణక్రమాదులు నడచినట్లు కనబడుచున్నది.

మూ. ఇతి సూత్రాణ్యథైతేషాం వ్యాఖ్యా భాష్యం భవిష్యతి. 1
సమాసవ్యాసవిన్యాసః సైష శిష్యహితాయ నః

వ్యా.''ఈ విధముగ విషయసూచకము లగు సూత్రములు చెప్పబడినవి. వీటి విస్తృతవ్యాఖ్యానము ముమ్ముందు చేయబడును. ఈ రీతిగ సంక్షిప్తరూపమునను (సమాస) విస్తృతరూపమునను (వ్యాస) విషయప్రతిపాదనము శిష్యుల హితముకొరకై చేయబడుచున్నది.''

మూ. చిత్రోదాహరణైర్గుర్వీ గ్రన్థేన తు లఘీయసీ.
ఇయం నః కావ్యమీమాంసా కావ్యవ్యుత్పత్తి కారణమ్ 2

వ్యా. ''గ్రంథరూపమున లఘువే యైనను, చిత్రము లగు ఉదాహరణములతో గురువైన ఈ మా 'కావ్యమీమాంస' కావ్యములకు సంబంధించిన పరినిష్ఠిత జ్ఞానమును కలిగించును.''

మూ. ఇయం సా కావ్యమీమాంసా మీమాంసా యత్ర వాగ్లవః
వాగ్లవం న స జానాతి న విజానాతి యస్త్విమామ్. 3

''దేనియందు ఇతరమీమాంస అంతయు వాక్కుయొక్క ఒకలేశమాత్రముగ కన్పట్టునో అట్టి కావ్యమీమాంస ఇదియే ఈ కావ్యమీమాంసను తెలిసికొనని వాడు వాక్కుయొక్క లేశమును కూడ తెలిసికొనజాలడు.''

మూ. యాయావరీయః సంక్షిప్య మునీనాం మత విస్తరమ్
వ్యాకరోత్కావ్యమీమాంసాం కవిభ్యో రాజశేఖరః. 4

వ్యా. ''యాయావరీయు డగు రాజశేఖరుడు అతివిస్తృతము లగు మునుల మతములను సంగ్రహించి, కవుల ఉపయోగముకొరకై కావ్యమీమాంసను రచించెను.''

(విశేషాంశములు) వైఖానస ధర్మప్రశ్నము ప్రకారము, గృహస్థులు, వార్తావృత్తి, శాలీనవృత్తి, యాయావరుడు, ఘోరాచారికుడు, అని నాలుగు విధములు. హవిర్యజ్ఞసోమయజ్ఞాదులను తాను చేయుచు, ఇతరులచే చేయించుచు, యజన-యాజన-అధ్యయన-అధ్యాపన-దాన-ప్రతిగ్రహరూపము లగు షట్కర్మలను ఆచరించుచు, నిత్యము అగ్నిపరిచర్య చేయుచు, అతిథ్యభ్యాగతాదులకు అన్నాదులను ఇచ్చుచుండు గృహస్థుడు యాయావరుడు. ''యాయావరో హవిర్యజ్ఞైః సోమయజ్ఞైశ్చ యజతే యాజయత్యధీతేఽధ్యాపయతి, దదాతి, ప్రతిగృహ్ణాతి, షట్కర్మనిరతో నిత్యమగ్ని పరిచరణ మతిథిభ్యోఽభ్యాగతేభ్యోఽ

న్నాద్యం చ కురుతే" (-వైఖానసధర్మప్రశ్నము. 1.6.4) రాజశేఖరుని పూర్వీకులు ఇట్టి యాయావరులై యుందురు.

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే
ప్రథమేఽధికరణే ప్రథమోఽధ్యాయః శాస్త్రసంగ్రహః.
బాలానందినిలో ప్రథమాధ్యాయము సమాప్తము.

ద్వితీయోధ్యాయః. శాస్త్ర నిర్దేశః.

మూ. ఇహ హి వాఙ్మయముభయథా-శాస్త్రం, కావ్యం చ. శాస్త్రపూర్వకత్వాత్ కావ్యానాం పూర్వం శాస్త్రేష్వభినివిశేత. న హ్యప్రవర్తితప్రదీపాస్తే తత్త్వార్థసార్థమధ్యక్షయన్తి

వ్యా. శాస్త్రమనియు, కావ్యమనియు వాఙ్మయము రెండు విధములు. కావ్యములు శాస్త్రపూర్వకములు గాన ముందుగా శాస్త్రముల విషయమున శ్రద్ధ చూపవలెను. (అనగా శాస్త్రజ్ఞానము లేనిచో కావ్యజ్ఞానము కలుగదు గాన ముందుగా శాస్త్రాభ్యాసము చేయవలెను) దీపము వెలిగించుకొనకుండా పదార్థములను చూడ జాలరు కదా ?

మూ. తచ్చ ద్విధా- అపౌరుషేయం పౌరుషేయం చ. అపౌరుషేయం శ్రుతిః, సా చ మన్త్రబ్రాహ్మణే వివృతక్రియాతన్త్రా మన్త్రాః. మన్త్రాణాం స్తుతినిన్దా వ్యాఖ్యానవినియోగగ్రన్థో బ్రాహ్మణమ్.

వ్యా. ఆ శాస్త్రము కూడ అపౌరుషేయము (పురుషనిర్మితముకానిది). పౌరుషేయము అని రెండు విధములు. అపౌరుషేయశాస్త్రము వేదము. అది మంత్రబ్రాహ్మణాత్మకము. యజ్ఞాది క్రియాకలాపమును వివరించునవి (యజ్ఞాద్యనుష్ఠానముతో ప్రత్యక్షముగ సంబంధించునవి) మంత్రములు, ఆయా విషయముల స్తుతినిందాదుల ద్వారా మంత్రార్థములనువివరించుచు, వాటిని యజ్ఞాదులలో ఏ విధముగ వినియోగించవలెనో బోధించునవి బ్రాహ్మణములు.

మూ. ఋగ్యజుః సామవేదాస్త్రయీ. అథర్వణశ్చ తురీయః తత్రార్థవ్యవస్థితపాదా ఋచః తాః సగీతయః సామాని. అచ్ఛన్దాంస్యగీతాని యజూంషి. ఋచో, యజూంషి సామాని చాథర్వణం చ ఇమే చత్వారో వేదాః.

వ్యా. ఋగ్యజుః సామవేదములకు 'త్రయి' (మూడింటిసముదాయము) అని పేరు. అధర్వణము నాల్గవది. అర్థానుసారముగా నిర్ణీతమైన పాదములు కలవి ఋక్కులు. గానముతో కూడిన ఆ ఋక్కులే సామములు. ఛందస్సుకాని, గానము కాని లేనివియజుస్సులు. ఋక్కులు, యజుస్సులు, సామములు, అధర్వణములు- ఈ నాల్గును నాలుగు వేదములు.

మూ. ఇతిహాసధనుర్వేదౌ గాన్ధర్వాయుర్వేదావపి చోపవేదాః "వేదోపవేదాత్మా సార్వవర్ణికః పఞ్చమో గేయవేదః" ఇతి ద్రౌహిణిః.

వ్యా. ఇతిహాసవేదము, ధనుర్వేదము. గాంధర్వవేదము, ఆయుర్వేదము, ఉపవేదములు. వేదోపవేదరూపము, అన్ని వర్ణములవారికిని ఉపయోగించునదియు అగు గాన వేదము పంచమవేద మని ద్రౌహిణి చెప్పియున్నాడు.

వి. గానవేద మనగా గాంధర్వవేదము. ఇది సామవేదముతో సంబంధించినది గాన వేదము; పైన చెప్పినట్లు ఉపవేదము కూడ. దీనిని పంచమ వేదముగ గ్రహింపవలె నని అభిప్రాయము.

మూ. "శిక్షా, కల్పో, వ్యాకరణం, నిరుక్తం, ఛన్దోవిచితిః. జ్యోతిషం చ షడఙ్గాని" ఇత్యాచార్యాః. "ఉపకారకత్వాదలఙ్కారః సప్తమమఙ్గమ్" ఇతి యాయావరీయః.

వ్యా. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందోవిచితి, జ్యోతిషము అనునవి ఆరు అంగములు అని ఆచార్యులు చెప్పియున్నారు ఉపకారకముగాన, అనగా వేదార్థజ్ఞానమునకు ఉపకరించునది గాన అలంకార శాస్త్రము ఏడవ అంగము అని యాయావరీయుని.అభిప్రాయము.

మూ. ఋతే చ తత్స్వరూపపరిజ్ఞానాద్వేదార్థానవగతిః. యథా:-

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిష స్వజాతే.
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి" 1

వ్యా. అలంకారశాస్త్రస్వరూపము తెలియనిచో వేదార్థజ్ఞానము కలుగదు ఉదా:-

"మంచి రెక్కలు కలవి కలిసి ఉండునవి, మైత్రితో కూడినవి అగు రెండు పక్షులు ఒకే వృక్షమును ఆశ్రయించి యున్నవి. వాటిలో ఒకటి

మధురమైన ఫలమును (కర్మఫలమును) భుజించుచున్నది. రెండవది తినకుండగ ప్రకాశించుచున్నది.

వివ. ఈ మంత్రము, రూపకవ్యతిరేకాలంకారములను ఉపయోగించి, జీవాత్మపరమాత్మలు ఒకే దేహమును ఆశ్రయించి యున్న వనియు, వారిలో జీవాత్మ కర్మఫలమును అనుభవించుచుండగా, పరమాత్మ మాత్రము కర్మఫలభోగ విహీనై ప్రకాశించుచున్నా డనియు బోధించుచున్నది ఈ విధముగ రూపకోప మాదులతో నిండిన వేదముల అర్థము స్పష్టముగ తెలియవలె నన్నచో అలంకార శాస్త్రము ఆవశ్యక మని అభిప్రాయము.

మూ సేయం శాస్త్రోక్తిః ప్రత్యధికరణం చ ఋచం బ్రాహ్మణం యజుః సామాథర్వణం చోదాహృత్య భాషా ముదాహరిష్యామః

వ్యా. ఇది శాస్త్రోక్తి; అనగా శాస్త్రములను గూర్చిన విషయము. ప్రతి అధికరణము నందును (అపౌరుషేయ శాస్త్రములగు) ఋగ్యజుఃసామాథర్వములను ఉదాహరించి భాషను అనగా పౌరుషేయ శాస్త్రములను ఉదాహరించెదము.

మూ. తత్ర వర్ణానాం స్థానకరణ ప్రయత్నాదిభిః నిష్పత్తి నిర్ణయినీ శిక్షా ఆపిశలీయాదికా

వ్యా. కంఠతాల్వాది స్థానములు, కరణములు(అభ్యంతరప్రయత్నములు), బాహ్య ప్రయత్నములు మొదలగువాటి ద్వారా వర్ణములు ఏ విధముగ ఉత్పన్న మగునో నిర్ణయించి చెప్పునది ఆపిశలీయాది శిక్ష

వి. పాణిని, ఆపిశలి, యాజ్ఞవల్క్యుడు మొదలగువారు రచించిన శిక్షలు అనేకములు ఉన్నవి. వర్ణములను ఏ విధముగ ఉచ్చరింపవలెను అను విషయ మును ఇవి ప్రతిపాదించును. ఉదాహరణకు- క కారమునకు స్థానము కంఠము. కరణము అనగా- అభ్యంతర ప్రయత్నము, స్పృష్ట పయత్నము. బాహ్య ప్రయత్నములు శ్వాస- అఘోష- వివార- అల్ప ప్రాణములు. ఈ విధముగ శిక్షా గ్రంథములలో వర్ణోచ్చారణాదులకు సంబంధించిన అనేక విషయము లున్నవి.

మూ. నానాశాఖాధీరానాం మన్త్రాణాం వినియోజకం సూత్రం కల్పః. సచ యజుర్విద్యా.

వ్యా. వివిధ శాఖలలోని మంత్రములను ఏయే కర్మలలో ఏయే విధముగా ఉపయోగింపవలెనో బోధించు సూత్రము కల్పసూత్రము.(ఒక్కొక్క వేదశాఖకు ఒక్కొక్క కల్పసూత్రము ఉండును. ఇవి కాత్యాయనాది వివిధ ఋషి నిర్మిత ములు.) ఇది యజుర్విద్య. అనగా యజ్ఞాది కర్మానుష్ఠానమునకు సంబంధించిన విద్య.

మూ. శబ్దానా మన్వాఖ్యానం వ్యాకరణమ్.

వ్యా. ప్రయోగములో ఉన్న శబ్దముల స్వరూపమును నిరూపించునది వ్యాకరణము.

వి. శాకటాయన పాణిన్యాదులు రచించిన వ్యాకరణ గ్రంథములు ప్రకృతి ప్రత్యయవిభాగమును చూపి వివిధ శబ్దముల వ్యుత్పత్తిని బోధించును. 'వ్యాకరణము' అనగా పదములో, ఇది ప్రకృతి, ఇది ప్రత్యయము అని విడదీసి చూపించుట.

మూ. నిర్వచనం నిరుక్తమ్. ఛన్దసాం ప్రతిపాదయిత్రీ ఛందోవిచితిః. గ్రహగణితం జ్యోతిషమ్. అలఙ్కార వ్యాఖ్యానం తు పురస్తాత్.

వ్యా. నిరుక్త మనగా నిర్వచనము. (అనగా ఒకపదమునకు ఆ అర్థమును చెప్పుటకు కారణ మేమి అను విషయమును బోధించునది నిరుక్తము. ప్రస్తుతము యాస్కరచిత మను నిరుక్తము ప్రచారములో ఉన్నది.) (అనుష్టుప్, త్రిష్టుప్ మొదలైన) ఛందస్సుల లక్షణ స్వరూపాదులను బోధించునది ఛందోవిచితి. గ్రహములకు సంబంధించిన గణితము జ్యోతిషము. (జ్యోతిఃస్వరూపము లైన గ్రహముల గమనము ననుసరించి కాలాదుల నిర్ణయము చేయు శాస్త్రము గాన దీనికి జ్యోతిఃశాస్త్రమని పేరు.) అలంకార శాస్త్ర స్వరూపము మున్ముందు చెప్ప గలము. (కావ్యమీమాంసలోని అలంకార ప్రతిపాదకాధికరణము లభ్యము కాదు).

మూ. పౌరుషేయం తు:- పురాణమ్, ఆన్వీక్షకీ, మీమాంసా, స్మృతి తన్త్రమితి చత్వారి శాస్త్రాణి.

వ్యా. పురాణము, ఆన్వీక్షకి, మీమాంస, స్మృతితంత్రము (ధర్మశాస్త్ర గ్రంథములు) అనునవి పౌరుషేయ శాస్త్రములు.

మూ. తత్ర వేదాఖ్యానోపనిబన్ధనప్రాయం పురాణమష్టాదశధా. యదాహుః:-

"సర్గః ప్రతిసంహారః కల్పోమన్వన్తరాణి వంశవిధిః.

జగతో యత నిబద్ధం తద్విజ్ఞేయం పురాణమితి." 2

వ్యా. దాలవరకు వేదములలోనిఉపాఖ్యానములను కూర్చుటకు ఉద్దిష్టమైన పురాణము పద్దెనిమిది విధములు. పురాణలక్షణమును ఈ విధముగ చెప్పి యున్నారు:- జగత్తుయొక్క సృష్టి, సంహారము, శ్వేతవరాహకల్పాదికల్పములు, మన్వంతరములు, వివిధరాజవంశవర్ణనము ఏ గ్రంథమునందు చేయబడునో అది పురాణమని గ్రహింపవలెను.

వి. కొన్నిచోట్ల "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ. వంశానుచరితంచేతి పురాణం పఞ్చలక్షణమ్" అను శ్లోక మున్నది. దానిలో 'సర్గః' అనుదానికి పంచమహాభూతాదిమూలపదార్థసృష్టియనియు, ప్రతిసర్గః అనుదానికి మనుష్యవృక్షాదిసృష్టిరూప మగు అవాంతరసృష్టియనియు అర్థము చెప్పుదురు. కొందరు ప్రలయ మని అర్థము చెప్పుదురు.

మూ. "పురాణప్రవిభేద ఏవేతిహాసః" ఇత్యేకే. స చ ద్విధా-పరక్రియా పురాకల్పాఖ్యామ్. యదాహుః-

"పరక్రియా పురాకల్ప ఇతిహాసగతిర్ద్విధా

స్యాదేకనాయకా పూర్వా ద్వితీయా బహునాయకా.

తత్ర రామాయణం భారతం చోదాహరణే. 3

వ్యా. ఇతిహాసము కూడ పురాణములలో ఒక భేదమే అని కొందరు చెప్పుదురు 'పరక్రియ' 'పురాకల్పము' అని అది రెండు విధములు. కావుననే ఈ విధముగ చెప్పబడినది:- పరక్రియ యనియు, పురాకల్పమనియు ఇతిహాసముల పద్ధతి రెండు విధములు, ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నది మొదటిది (పరక్రియ). బహునాయకులు కలది రెండవది (పురాకల్పము). వీటికి వరుసగ రామాయణభారతములు ఉదాహరణములు.

మూ. ఆన్వీక్షకీం తు విద్యావసరే వక్ష్యామః.

వ్యా. ఆన్వీక్షికిని గూర్చి విద్యాస్వరూపము చెప్పునపుడు వివరించెదము.

మూ. నిగమవాక్యానాం న్యాయైః సహస్రేణ వివేక్త్రీ మీమాంసా. సా చ ద్వివిధా— విధి వివేచనీ బ్రహ్మనిదర్శనీ చ.

వ్యా. సహస్రన్యాయములతో వేదవాక్యముల అర్థమును వివరించునది మీమాంసా శాస్త్రము. విధివాక్యములను గూర్చి వివేచనము చేయు పూర్వ మీమాంస యనియు, బ్రహ్మను గూర్చి వివేచనము చేయు ఉత్తరమీమాంస యనియు అది రెండు విధములు.

వి. వేదవాక్యములకు అర్థనిర్ణయ మెట్లు చేయవలెనో తెలుపుచు మీమాంసా శాస్త్రమున కొన్ని నియమములు ఏర్పరుపబడినవి దానిలో దాదాపు వేయి అధిక రణములు ఉన్నవి. ఒక్కొక్క అధికరణము ఒక్కొక్క న్యాయమును. అనగా విషయమును, ప్రతిపాదించును. ఆ న్యాయమును వినియోగించుచు వేదవాక్య ముల అర్థనిర్ణయము చేయవలెను. అందు కర్మకాండను బోధించు వేదభాగము నకు సంబంధించిన మీమాంసకు పూర్వమీమాంస అనియు జ్ఞాన ప్రతిపాదక మగు ఉపనిషద్భాగమునకు సంబంధించిన భాగమునకు ఉత్తరమీమాంస అనియు పేర్లు.

మూ. అష్టాదశైవ శ్రుత్యర్థస్మరణాత్ స్మృతయః తానీమాని చతుర్దశ విద్యాస్థానాని, యదుత వేదాశ్చత్వారః. షడఙ్గాని, చత్వారి శాస్త్రాణి" ఇత్యా చార్యాః

వ్యా. వేదముల అర్థమును స్మరించుచు వ్రాసినవి స్మృతులు. అవి కూడ పదునెనిమిది మాత్రమే నాలుగు వేదములు, ఆరు వేదాంగములు, నాలుగు శాస్త్ర ములు— ఇవన్నియు కలిసి చతుర్దశవిద్యాస్థానములు" అని ఆచార్యులు చెప్పుదురు.

"పురాణన్యాయ మీమాంసా ధర్మశాస్త్రాఙ్గమిశ్రితాః
వేదాః స్థానాని విద్యానాం ధర్మస్యచ చతుర్దశ."

మూ. తాన్యేతాని కృత్స్నాని భూర్భువఃస్వస్త్రయీం వ్యాప్య వర్తన్తే. తదాహుః:—

"విద్యాస్థానానాం గన్తుమన్తం న శక్తో
దేవేద్వర్షాణాం యోఽపి స్యాద్గం సహస్రమ్

తస్మాత్సంక్షేపాదర్థ సన్దోహ ఉక్తో
వ్యాసః సంత్యక్తో గ్రన్థభీరుప్రియార్థమ్''. 4

వ్యా ఈ పదునాలుగు విద్యాస్థానములు భూలోక- భువర్లోక- స్వర్లోకము లనెడు మూడు లోకములందును వ్యాపించి ఉన్నవి. (అనగా ఈ మూడు లోకములకును సంబంధించిన విషయములు వీటిలో ఉన్నవి). కావుననే ఇట్లు చెప్పి యున్నారు. "వేయి సంవత్సరముల పాటు జీవించ కలిగిన వాడు కూడ విద్యాస్థానముల అంతమును చూడజాలడు. అనగా సంపూర్ణముగా తెలిసికొన జాలడు. అందువలన విషయముల నన్నింటిని సంక్షేపముగ ప్రతిపాదించి ఉన్నాము గ్రంథగౌరవమును చూచి భయపడువారు సంతోషించుటకు విస్తృత వివరణమును విడిచిపెట్టినాము''.

మూ. "సకలవిద్యాస్థానైకాయతనం పఞ్చదశం కావ్యం విద్యాస్థానమ్" ఇతి యాయావరీయః. గద్యపద్యమయత్వాత్, కవిధర్మత్వాత్ హితోపదేశకత్వాచ్చ తద్ధి శాస్త్రాణ్యనుధావతి.

వ్యా. సమస్త విద్యాస్థానములకును ఏకైకస్థానమైన (అనగా సకలవిద్యలకును ప్రధానాధారమైన) కావ్యము పదిహేనవ విద్యాస్థాన మని యాయావరీయుడ నైన నేను చెప్పుచున్నాను. కావ్యము గద్యపద్య మయము. కవి ధర్మము (కర్మ);హితమును ఉపదేశించునది అందుచే అది శాస్త్రముల నన్నిండిని అనుసరించి నడచుచుండును.

మూ. ''వార్తా, కామసూత్రం, శిల్పశాస్త్రం, దణ్డనీతిరితి పూర్వైః సహాష్టాదశవిద్యాస్థానాని" ఇత్యపరే.

వ్యా. ''వెనుక చెప్పిన చతుర్దశవిద్యాస్థానములతో వార్త, కామసూత్రము, దండనీతి అనువాటిని కూడ చేర్చగా అష్టాదశవిద్యాస్థానములు'' అని కొందరు చెప్పుదురు.

మూ, అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దణ్డనీతిశ్చేతివిద్యాః. 'దణ్డనీతిరేవైకా విద్యా'ఇత్యౌశనసాః.దణ్డభయాద్ధి కృత్స్నో లోకః స్వేషు స్వేషు కర్మస్వవతిష్ఠతే. ''వార్తా దణ్డనీతిర్ద్వే విద్యే" ఇతి బార్హస్పత్యాః. వృత్తిర్వినయగ్రహణం చ స్థితిహేతుర్లోకయాత్రాయాః. త్రయీ వార్తా దణ్డనీతయస్తిస్రో విద్యాః'' ఇతి

మానవాః. త్రయీ హి వార్తాదణ్డనీత్యోరుపదేష్ట్రీ, ''ఆన్వీక్షకీ-త్రయీ-వార్తా-దణ్డనీతయశ్చతస్రోవిద్యాః'' ఇతి కౌటిల్యః. ఆన్వీక్షక్యాహి వివేచితా త్రయీ వార్తాదణ్డనీత్యోః ప్రభవతి.

వ్యా. ఆన్వీక్షకి (న్యాయశాస్త్రాదికము), వేదత్రయము, వార్త (వాణిజ్య-పశుపాల్యాదికము),దండనీతి అనునవి విద్యలు.''విద్య అనగా దండనీతి ఒక్కటియే'' అని ఉశనాచార్యమతానుయాయులు చెప్పుదురు. సమస్తజనులును దండభయమువలననే కదా తమ తమ కర్తవ్యములను చేయుచున్నారు? ''వార్త, దండనీతి అనునవి రెండును విద్యలు'' అనిబృహస్పతి మతానుయాయులు చెప్పుదురు. (వార్తవలనకలుగు) ఆయా వృత్తులకు సంబంధించిన జ్ఞానము చేతను, (దండనీతివలన కలుగు) వినయగ్రహణముచేతను, అనగా నియమబద్ధజీవన విధానమును అలవరచుకొనుటచేతను లోకయాత్ర నడచుచున్నది. ''వేదత్రయము, వార్త,దండనీతి అనునవి మూడు విద్యలు'' అని మనుమతానుయాయులు చెప్పుచున్నారు. వార్తాదండనీతులను ఉపదేశించునది వేదత్రయమే కదా? ''ఆన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అను నాలుగును విద్యలని కౌటిల్యుని అభిప్రాయము. ఆన్వీక్షకిచే బాగుగ వివేచనము చేసిన వేదత్రయమే వార్తాదండనీతులను ఉపదేశింప సమర్థమగును కదా?

మూ. ''పఞ్చమీ సాహిత్యవిద్యా'' ఇతి యాయావరీయః. సా హి చ తస్రృణామపి విద్యానాం నిష్యన్దః. అభిర్ధర్మార్థౌ యద్విద్యాత్తద్విద్యానాం విద్యాత్వమ్.

వ్యా. ''సాహిత్యవిద్య, ఐదవవిద్య'' యని యాయావరీయుని అభిప్రాయము. అది నాలుగు విద్యల సారము కదా? వీటి సహాయముతో ధర్మార్థములను తెలిసికొందురు లేదా సంపాదింతురు; అందువలన వీనికి ''వేద్యేతే ధర్మార్థౌ అభిరితి విద్యాః'' అను విగ్రహముచే విద్యలు అని పేరు.

మూ. తత్ర త్రయీ వ్యాఖ్యాతా. ద్విధా చాన్వీక్షికీ పూర్వోత్తరపక్షాభ్యామ్. అర్హద్భదన్తదర్శనే లోకాయతం చ పూర్వః పక్షః. సాఙ్ఖ్యం న్యాయవైశేషికౌ చోత్తరః. త ఇమే షట్ తర్కాః. తత్ర చ త్రిసః కథా భవన్తి-వాదో, జల్పో, వితణ్డా చ.

వ్యా. వీటిలో 'త్రయి' అనుదాని అర్థము వెనుక వివరించబడినది. పూర్వ పక్ష మనియు, ఉత్తరపక్ష మనియు ఆన్వీక్షకి రెండు విధములు. జైన–బౌద్ధ లోకాయత-దర్శనములు పూర్వపక్షము. సాంఖ్య-న్యాయ-వైశేషిక–దర్శనములు, ఉత్తరపక్షము, ఈ ఆరును తర్కములు. వీటిలో వాదము, జల్పము, వితండ అనుమూడు విధము లగు కథలు (వాగ్వాదపద్ధతులు) ఉండును.

మూ. మధ్యస్థయో స్తత్త్వావబోధాయ వస్తుతత్త్వ పరామర్శో వాదః. విజిగీషోః స్వపక్షసిద్ధయే ఛల-జాతి-నిగ్రహాది-పరిగ్రహో జల్పః. స్వపక్ష స్యాపరిగృహీత్రీ, పరపక్షస్య దూషయిత్రీ వితణ్డా.

వ్యా. తత్త్వమును తెలుసుకొనుటకై, మధ్యస్థులు, (అనగా ముందుగానే ఏదో ఒక నిర్ణయమునకు వచ్చి ఒక పక్షమును స్వీకరించనివారు) చేయు వస్తు తత్త్వవిమర్శము వాదము ప్రతివాదిని జయింపవలె నని అభిలషించువాడు, తన పక్షమును ఏదియో విధముగ స్థాపించుటకై ఛలము, జాతి, నిగ్రహస్థానము మొదలగువాటిని స్వీకరించి వాదించుట జల్పము. స్వపక్షమును స్థాపించుటకై ప్రయత్నించక, పరపక్షదూషణము మాత్రమే చేయు కథ వితండ

వి. ఛల–జాత్యాదులను గూర్చి న్యాయశాస్త్రమున అతివిపులం మగు చర్చ చేయబడినది. వాది ఒక అర్థమున ప్రయోగించిన మాటకు మరొక అర్థము కల్పించి అతనిని ఆక్షేపించుట ఛలము. ఉదా. "నవకమ్బలో೽యం బాలః" "ఈ బాలుని దగ్గర క్రొత్త కంబళీ ఉన్నది" అని వాది చెప్పినపుడు 'నవ' అను దానికి తొమ్మిది అను అర్థము గ్రహించి, "ఏపీ! ఇతని దగ్గర ఒక్క కంబళీయే ఉన్నది కదా" అని ఆక్షేపించవచ్చును. Doctors should serve the weak' అని ఎవరైన అన్నప్పుడు, "Why! they always serve the weak only" అని అన్నచో ఛల మగును. ఇట్టి పద్ధతులు స్వపక్షీకులు అధిక సంఖ్యలో ఉన్నచోట మాత్రమే ఉపయోగించును.

వాది ఒక విషయమును స్థాపించుటకై కొన్ని యుక్తులు చూపును. ప్రతి వాది కొన్ని ప్రతియుక్తులు చూపి వాటి నాక్షేపించును అపుడు వాది సరియైన యుక్తి తోచక సామ్యమును బట్టి కాని, వైషమ్యమును బట్టి కాని ఏవో యుక్తు లను చూపి ప్రతివాదియుక్తులను ఖండించుటకు ప్రయత్నించును. అది జాతి. ఉదా— "ఆత్మ ఽనిత్యము" అని వాది చెప్పగా ప్రతివాది "ఆకాశమువలె

సర్వవ్యాపి గాన ఆత్మ నిత్యము" అని చెప్పును. అపుడు మొదటివాడు- "సర్వవ్యాపిత్వ మనెడు ఆకాశసామ్యమును బట్టి నీవు ఆత్మ నిత్య మనుచున్నావు. కాని చైతన్యరూపత్వ మనెడు వైషమ్యమును బట్టి,(అనగా ఆత్మ చైతన్యవంతము, ఆకాశము కాదు అనెడు తేడాను బట్టి) ఆత్మ అనిత్యమే అని నేనందును" అని పలుకును. ఇట్టి దూషణాభాసమే జాతి.

విప్రతిపత్తి, అప్రతిపత్తి అని నిగ్రహస్థానము రెండు విధములు. విషయమును సరిగా గ్రహింపజాలకపోవుట విప్రతిపత్తి. ప్రతివాది యుక్తులను ఖండించలేకపోవుట లేదా అతడు చూపిన దూషణములకు సమాధానము చెప్పలేకపోవుట అప్రతిపత్తి. ఈ రెండింటిలో ఏది ఏర్పడినను ఆ వ్యక్తి పరాజితు డైనట్లు పరిగణింపబడును.

మూ. కృషిపాశుపాల్యే వాణిజ్యా చ వార్తా. ఆన్వీక్షికీ త్రయీ వార్తానాం యోగక్షేమసాధనో దణ్డః; తస్య నీతిర్దణ్డనీతిః. తస్యామాయత్తా లోకయాత్రా. ఇతి శాస్త్రాణి.

వ్యా. వ్యవసాయము, పశుపాలనము, వర్తకము-వీటికి వార్త అని పేరు. ఆన్వీక్షికీ-త్రయీ-వార్తల యోగక్షేమములకు సాధనమైనది దండము. దండమునకు సంబంధించిన నీతి దండనీతి. లోకయాత్ర అంతయు ఈ దండనీతిపైననే ఆధారపడి యున్నది. ఈ విధముగ శాస్త్రస్వరూపము చెప్పబడినది.

మూ. సామాన్యలక్షణం చైషామ్:-

"సరితామివ ప్రవాహా స్తుచ్ఛాః ప్రథమం యథోత్తరం విపులాః.
యే శాస్త్రసమారమ్భా భవన్తిలోకస్య తే వన్ద్యాః" 5

వ్యా. శాస్త్రముల సామాన్యలక్షణము ఈ విధముగ నుండును:- "ఏ శాస్త్రముల ప్రారంభములు, నదీప్రవాహముల వలె మొదట స్వల్పముగ నుండునో, క్రమక్రమముగ విపులముగ ఉండునో అట్టి శాస్త్రములు లోకముల ఆదరమునకు పాత్ర మైనవి."

మూ. సూత్రాదిభిశ్చైషాం ప్రణయనమ్. తత్ర సూత్రణాత్ సూత్రమ్. యథాహః-

"అల్పాక్షరమసన్దిగ్ధం సారవద్విశ్వతోముఖమ్.
అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రకృతో విదుః" 6

వ్యా. ఈ శాస్త్రముల రచన సూత్రాదుల ద్వారా జరిగినది. సూత్ర మనగా విస్తృత మైన అర్థమును సంక్షిప్తరూపమున ప్రతిపాదించునది. దీని లక్షణము నిట్లు చెప్పుదురు:-

"అల్ప మైన అక్షరములు కలది, సందేహముకలిగించనిది, సారము కలది, వ్యాపక మగు అర్థమును బోధించునది, వ్యర్థపదములు లేనిది, దోషరహిత మైనది. అగు వాక్యము సూత్రము అని సూత్రలక్షణము తెలిసినవారు చెప్పుదురు."

మూ. సూత్రాణాం సకలసారవివరణం వృత్తిః. సూత్రవృత్తివివేచనం పద్ధతిః. ఆక్షిప్య భాషణాద్భాష్యమ్. అన్తర్భాష్యం సమీక్షా. అవాన్తరార్థవిచ్ఛేదశ్చ సా. యథాసమ్భవమర్థస్య టీకనం టీకా. విషమపదభఞ్జికా పఞ్జికా, అర్థప్రదర్శనకారికా కారికా, ఉక్తానుక్తదురుక్తచిన్తా వార్తికమితి శాస్త్రభేదాః.

వ్యా. సూత్రముల సారము నంతను వివరించునది 'వృత్తి,' ఆ వృత్తిని విశదీకరించునది 'పద్ధతి'. ఎన్నియో ఆక్షేపములు చేయుచు, అనగా అనుపపత్తులు చూపుచు, వాటికి తగు సమాధానములను చెప్పునది "భాష్యము." భాష్యోక్తవిషయములను వివరించునది సమీక్ష. భాష్యములో ప్రసక్తానుప్రసక్తముగా వచ్చిన విషయములను వివరించుటకు గూడ 'సమీక్ష' అని పేరు. వీలైనంతవరకు అర్థములను సూచించునది 'టీక'. విషమపదములను విరుగగొట్టి అర్థమును చెప్పునది 'పంజిక'. ఒక పరినిష్ఠితార్థమును ప్రదర్శించునది కారిక. (శ్లోకరూపమునఉండును,) చెప్పిన విషయములను గూర్చియు, చెప్పని విషయములను గూర్చియు, తప్పుగా చెప్పిన విషయములను గూర్చియు చేయు చింతకు; అనగా పర్యాలోచనమునకు, 'వార్తికము' అని పేరు. ఇవన్నియు శాస్త్రరచనా రీతులలోని భేదములు.

మూ. "భవతి ప్రథయన్నర్థం లీనం సమభిప్లుతం స్ఫుటీకుర్వన్
అల్పమనల్పం రచయన్ననల్పమల్పం చ శాస్త్రకవిః. 5

వ్యా. నిగూఢమైన అర్థమును ప్రకటింపచేయుచు, అస్పష్టముగాను, సందిగ్ధముగాను ఉన్న అర్థమును స్పష్టీకరించుచు, సంక్షిప్తముగా ఉన్న విషయ

మును విస్తరించుచు. విస్తృతముగా ఉన్న దానిని సంక్షిప్తముచేయుచు రచన చేయువాడు శాస్త్రకవి యగును.

మూ. శాస్త్రైక దేశస్య ప్రక్రియా ప్రకరణమ్ అధ్యాయాదయస్త్వవాన్తరవిచ్ఛేదాః. కృతిభిః స్వతన్త్రతయా ప్రణీతా ఇత్య సఙ్ఖ్యేయా అనాఖ్యేయాశ్చ.

వ్యా. శాస్త్రముయొక్క ఒక భాగమునకు సంబంధించిన ప్రక్రియ ప్రకరణము. శాస్త్ర గ్రంథములలో చేయు అవాంతర విభాగములు అధ్యాయాదులు. 'అధ్యాయము' మొదలైన ఈ విభాగములు శాస్త్రరచయితలు స్వతంత్ర రూపమున చేయుచుందురు. కావున ఇవి అసంఖ్యాకములు. చెప్పశక్యము కానివి.

మూ. శబ్దార్థయోర్యథావత్సహభావేన విద్యా సాహిత్యవిద్యా. ఉపవిద్యాస్తు చతుః షష్టిః. తాశ్చ కలా ఇతి విదగ్ధవాదః. స ఆజీవః కావ్యస్య తమౌపనిషదకే వక్ష్యామః.

వ్యా. శబ్దార్థములు రెండును పరస్పరానుకూలముగ కలసి యుండు విద్య సాహిత్యవిద్య. ఉపవిద్యలు అరువదినాలుగు. వాటిని కళ లని విద్వాంసులు చెప్పుదురు. ఉపవిద్యలు కావ్యమునకు జీవనాధార మైనవి. ఆ విషయమును గూర్చి 'ఔపనిషదిక' ప్రకరణమునందు చెప్పగలము.

మూ ఇత్యనన్తోఽభియుక్తానామత్ర సంరమ్భవిస్తరః
త్యక్తో నిపుణధీగమ్యో గ్రన్థగౌరవకారణాత్. 6
ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే
ప్రథమేఽధికరణే ద్వితీయోఽధ్యాయః శాస్త్ర నిర్దేశః.

వ్యా. ఈ విధముగ గ్రంథరచనావిషయమున పండితుల ప్రవృత్తి బహుముఖముల అనంతముగ ఉన్నది. దీనిని గూర్చి బుద్ధిమంతులు ఊహించి తెలుసుకొనగలరు. గ్రంథగౌరవభయముచే దాని విస్తృతవేచనమును విడిచినాను.

బాలానందినియందు ద్వితీయాధ్యాయము సమాప్తము.

''తృతీయోఽధ్యాయః-కావ్యపురుషోత్పత్తిః.''

మూ. ఏవం గురుభ్యో గిరః పుణ్యాః పురాణీః శృణుమః స్మ; యత్కిల ధిషణం శిష్యాః కథా ప్రసఙ్గే ప్రపచ్ఛుః-కీదృశః పునరసౌ సారస్వతేయః కావ్యపురుషో వో గురుః ఇతి. స తాన్ బృహతాం పతిరూచే.



వ్యా. గురువులనుండి ఈ విధముగ ప్రాచీనము లగు కొన్ని వాక్కులు విన వచ్చుచున్నవి. "మీ గురువైన ఆ సరస్వతీపుత్రు డగు కావ్యపురుషుడు ఎవరు? ఎట్టివాడు?" అని మాటల సందర్భమున బృహస్పతిని ఆతని శిష్యులు ప్రశ్నించి నారట. బృహస్పతి వారి కిట్లు చెప్పెను. (బృహస్పతి యనగా 'బృహతాం పతిః'. అనగా వాక్కులకు పతి).

మూ పురా పుత్రీయన్తీ సరస్వతీ తుషారగిరౌ తపస్యామాస. ప్రీతేన మనసా తాం విరిఞ్చిః ప్రోవాచ — పుత్రం తే సృజామి. అథైషా కావ్యపురుషం సుషువే. సోఽభ్యుత్థాయ సపాదోపగ్రహం ఛన్దస్వతీం వాచ ముదచీచరత్.

"యదేతద్వాఙ్మయం విశ్వమర్థమూర్త్యా వివర్తతే
సోఽస్మి కావ్యపుమానమ్బ పాదౌ వన్దేయ తావకౌ." 1

వ్యా. పూర్వము సరస్వతి పుత్రాభిలాషతో హిమాచలముపై తపస్సు చేసెను. బ్రహ్మ సంతుష్టాంతరంగుడై "నీకు పుత్రుని సృజించెదను" అని పలికెను. అపు డామె కావ్యపురుషుని కనెను. ఆతడు లేచి, తల్లి పాదములకు నమస్కరించుచు ఛందోమయ మగు వాక్కును పలికెను: —

"తల్లీ! ఎవని ద్వారా ఈ వాఙ్మయ ప్రపంచ మంతయు అర్థరూపమున పరిణతి చెందుచుండునో అట్టి కావ్యపురుషుడ నగు నేను నీ పాదములకు నమస్కరించు చున్నాను."

మూ. తామామ్నాయదృష్టచరీ ముపలభ్య భాషావిషయే ఛన్దోముద్రాం దేవీ సప్రమోదమఙ్కపర్యఙ్కేనాదాయ తముదలాపయత్ — "వత్స! సచ్ఛన్దస్కాయా గిరః ప్రణేతర్వాఙ్మయ మాతరమపి మాతరం మాం విజయసే. ప్రశస్యతమం చేదముదాహరన్తి — 'యదుత పుత్రాత్పరాజయో ద్వితీయం పుత్రజన్మ' ఇతి. త్వత్తః పూర్వే హి విద్వాంసో గద్యం దదృశుర్న పద్యమ్. త్వదుపజ్ఞమథాతః ఛన్దస్వద్వచః ప్రవర్త్స్యతి. అహో శ్లాఘనీయోఽసి. శబ్దార్థౌ తే శరీరమ్. సంస్కృతం ముఖమ్. ప్రాకృతం బాహుః. జఘనమపభ్రంశః. పైశాచం పాదౌ. ఉరో మిశ్రమ్. సమః, ప్రసన్నో, మధుర, ఉదార ఓజస్వీ చాసి. ఉక్తిచణం తే వచో; రస ఆత్మా; రోమాణి ఛన్దాంసి. ప్రశ్నోత్తర ప్రవహ్లికాదికం చ

వాక్కేలిః అను ప్రాసోపమాదయశ్చ త్వామలఙ్కుర్వన్తి. భవిష్యతోఽర్థస్యాభి ధాత్రీ శ్రుతిరపి భవన్త మభిస్తౌతి:—

"చత్వారి శృఙ్గాస్త్రయో ఽస్య పాదా ద్వే శీర్షే సప్తహస్తాసోఽస్య
త్రిధా బద్ధో రోరవీతి మహో దేవో మర్త్యాఁ ఆవివేశ." 2

తథాపి సంవృణు ప్రగల్భస్య పుంసః కర్మ. బాలోచితం చేష్టస్వ" ఇతి నిగద్య నివేశ్య చైనమనోకహాశ్రయిణి గద్దా శైలతల్పే స్నాతుమ్మభగఙ్గాం జగామ.

వ్యా. పూర్వము వేదమునందు మాత్రమే కనబడుచుండెడి ఆ ఛందో ముద్ర (లౌకిక) భాషావిషయమున గూడ ప్రవర్తించుటను చూచి సరస్వతీదేవి సంతోషముతో ఆతనిని ఒడిలోకి తీసికొని, బుజ్జగించుచు ఇట్లనెను — "ఛందో మయ మగు వాక్కును రచించిన ఓ వత్సా! వాఙ్మయమున కంతకును తల్లియు, నీ జననియు అగు నన్ను కూడ జయించుచున్నావు 'పుత్రుని చేతిలో ఓటమి ద్వితీయపుత్రజన్మతుల్యము' అని ఒక ప్రశస్త మగు లోకోక్తి చెప్పుచుందురు. నీకు పూర్వమునందున్న విద్వాంసులు గద్యను మాత్రమే చూచిరి కాని పద్య మును చూడలేదు. అందుచే త్వదుపజ్ఞమైన, అనగా ప్రథమమున నీచేతనే ప్రయుక్తమైన, ఛందోమయ మగు వాక్కు లోకములో ప్రసిద్ధి పొందగలదు

శబ్దార్థములు నీ శరీరము సంస్కృతభాష ముఖము. ప్రాకృతభాషలు నీ బాహువులు. అపభ్రంశభాష జఘనము (నడుము) పైశాచభాష పాదములు. మిశ్రభాషలు వక్షస్థలము. నీవు సముడవు; ప్రసన్నుడవు; మధురస్వభావుడవు; ఉదారుడవు; ఓజస్వివి. (సమత, ప్రసాదము, మాధుర్యము, ఔదార్యము, ఓజస్సు అనునవి కావ్యగుణములు) నీ వాక్కు ఉక్తిచణము, అనగా సదుక్తులచే ప్రసిద్ధము రసము ఆత్మ. ఛందస్సులు రోమములు. ప్రశ్నోత్తరములు, ప్రహేళి కాదులు నీ వాగ్విలాసము. అనుప్రాసోపమాదులు నిన్ను అలంకరించును. రాబోవు విషయములను చెప్పు సామర్థ్యము గల శ్రుతి కూడ నిన్ను స్తుతించుచున్నది:-

"ఈ వృషభమునకు కొమ్ములు నాలుగు; పాదములు మూడు; శిరస్సులు రెండు; హస్తములు ఏడు; మూడు విధముల బంధింపబడినదై ధ్వని చేయుచు ఈ మహాదేవుడు మనుష్యులలో ప్రవేశించెను"

"సప్తస్వరాః, త్రీణి స్థానాని, చత్వారోవర్ణాః, ద్వివిధాకాకుః. షడలం కారాః, షడఙ్గాని" అని భరతనాట్యశాస్త్రము (17అ). వీదిని యథాసంభవముగ శృంగాదిరూపమున అన్వయించుకొనవలెను.

వి. ఈ మంత్రమును రాజశేఖరుడు తన శాస్త్రమునకు అన్వయించునట్లు వ్యాఖ్యానించినాడు సాయణాచార్యులు(ఋగ్వేదభాష్యభూమికలో)దీనిని ఈ క్రింది విధముగ వ్యాఖ్యానించియున్నారు.''ఈ యజ్ఞ-వృషభమునకు హోత, అధ్వర్యువు ఉద్గాత బ్రహ్మ అను వారు నలుగురును శృంగములు, ప్రాతః సవనాదులు మూడునూ పాదములు. పత్నీయజమాను లిరువురును రెండు శిరస్సులు. గాయత్ర్యాదిఛందస్సులు ఏడును హస్తములు. ఋగ్వేదాదివేదత్రయముచే మూడు విధముల బంధింపబడినది. కామములను వర్షించును గాన వృషభము. మాటి మాటికి స్తోత్రశస్త్రాదిధ్వనులు చేయును. యజ్ఞరూపుడగు ఈ ప్రౌఢుడైన దేవుడు మర్త్యులలో ప్రవేశించెను. అనగా మర్త్యులే ఇందుకు అధికారులు.'' కొంచెము మార్పుతో నిరుక్తము కూడ ఈ మంత్రమును యజ్ఞపురుషార్థమున సమన్వయించెను. (13. 6)

పతంజలి తన మహాభాష్యమున ఈ మంత్రమునే వ్యాకరణశాస్త్రపరముగ వ్యాఖ్యానించినారు, "మహాదేవుడు మానవులలో ప్రవేశించెను. ఈ శబ్దము కామములను వర్షించునది గాన వృషభము. ఈ వృషభమునకు నామములు, ఆఖ్యాతములు, ఉపసర్గలు, నిపాతములు అనునవి నాలుగు శృంగములు. భూత - భవిష్యద్వర్తమానకాలములు మూడును మూడు పాదములు. నిత్యశబ్ద - కార్యశబ్దములు రెండును రెండుశిరస్సులు. ఏడు విభక్తులు ఏడు హస్తములు, మూడు విధములుగ వక్షస్థలము, కంఠము, శిరస్సు అను మూడు స్థానములందు-బంధింపబడినది. ఇది ధ్వనిచేయుచుండును (రోరవీతి)''.

వ్యా. బనను ప్రగల్భుడగు పురుషుని కర్మను కప్పిపుచ్చుము. (ప్రగల్భ పురుషుని వలె ప్రవర్తింపకుము). బాలురకు తగు విధముగ ప్రవర్తించుము.'' ఇట్లు పలికి అతనిని వృక్షములకాశ్రయ మగు (వృక్షములతో గూడిన) పర్వత శిలా తల్పముపై పరుండ బెట్టి, స్నానము చేయుటకై ఆకాశగంగకు వెళ్లెను.

మూ. తావచ్చ కుశాన్ సమిధశ్చ సమాహర్తుం నిఃసృతో మహాముని రుశనాః పరివృత్తే పూషణ్యుష్మోపప్లుతం తముద్రాక్షీత్. కస్యాయమనాథో బాల ఇతి చిన్తయన్ స్వమాశ్రమపదమన్వైక్షీత్.

వ్యా. ఇంతలో మహాముని యగు ఉశనస్సు (శుక్రాచార్యుడు) దర్భలను సమిధలను ప్రోగుచేసికొనుటకై బయలుదేరెను. సూర్యుడు పైకి లేచుటచే వేడికి

బాధపడుచున్న ఆ పిల్లవానిని చూచెను అనాథుడగు ఈ బాలుడు ఎవరి పిల్ల వాడు? అని అనుకొనుచు తన ఆశ్రమమునకు తీసికొని వెళ్లెను.

మూ. క్షణాదాశ్వస్తశ్చ స సారస్వతేయ స్తస్మై (మకారం) ఛందస్వతీం వాచం సమాదారయత్. అకస్మాద్విస్మాపయన్ స చాభ్యువాచ:—

''యా దుగ్ధాపి న దుగ్ధేవ కవిదోగ్ధృభిరన్వహమ్.

హృది నః సన్నిధత్తాం సా సూక్తిధేనుః సరస్వతీ'' ఇతి. 8

వ్యా. క్షణకాలములో సేదదేరిన ఆ సరస్వతీ కుమారుడు ఆ శుక్రాచార్యు నకు, ఛందోమయ మగు వాక్కు ప్రసరించునట్లు చేసెను. ఆశ్చర్యమును కలిగించు విధమున ఆతడు ఆకస్మాత్తుగ ఇట్లు పలికెను:—

''కవులనెడు దోగ్ధలు (ప్రాలుపితుకువారు) ప్రతిదినము పితుకుచున్నను ఏది పితకనట్లే ఉన్నదో అట్టి సూక్తి కామధేను వగు సరస్వతి మా హృదయము నందు నివసించుగాక''

మూ. తత్పూర్వకం మధ్యేతౄణాం చ సుమేధస్త్వమాదిదేశ. తతః ప్రభృతి తముశనసం సన్తః కవిరిత్యాచక్షతే. తదుపచారాచ్చ కవయః కవయ ఇతి లోకయాత్రా. కవిశబ్దశ్చ ''కబృ వర్ణే'' ఇత్యస్యధాతోః కావ్యకర్మణో రూపమ్. కావ్యైకరూపత్వాచ్చ సారస్వతేయేఽపి కావ్యపురుష ఇతి భక్త్యా ప్రయుజ్యతే.

వ్యా. (ఆ సారస్వతేయు డా విధముగ శుక్రునియందు ఛందోమయ వాక్కు ప్రసరించునట్లు చేసి) ఈ శ్లోకముతో (శుక్రునినోటినుండివెలువడిన 'యా దుగ్ధాపి' ఇత్యాది శ్లోకముతో) ప్రారంభించి అధ్యయనము చేయువారికి సుమేధస్త్వము కలుగు నని (వారు మేధాసంపన్నులగుదు రని) ఆజ్ఞాపించెను. (అనుగ్రహించెను). అంతవరకును ఉశనసుడను పేరుతో నున్న ఆతనిని (శుక్రుని) అప్పటినుండి కవి యని చెప్పుచున్నారు. ఈ పేరునే ఆరోపించి ఇతరులను గూడ 'కవులు' 'కవులు' అను లోకప్రసిద్ధి ఏర్పడినది. 'కవి' శబ్దము కావ్యము అను అర్థము గల 'కబృ వర్ణే' అను ధాతువుయొక్క (ధాతువునుండి నిష్పన్న మైన) రూపము. సారస్వతేయుడు కావ్యైకరూపుడు గాన ఆతని విషయమున 'కావ్యపురుషుడు' (అనగా కావ్యాభిన్నుడైన పురుషుడు) అని ఔపచారిక ప్రయోగము చేయుచున్నారు.

మూ. తతశ్చ వినివృత్తా వాగ్దేవీ తత్ర పుత్రమపశ్యన్తీ మద్యేహృదయం చక్రన్ద ప్రసఙ్గాగతశ్చ వాల్మీకిర్మునివృషా సప్రశ్రయం తముదన్తముదాహృత్య భగవత్యై భృగుసూతే రాశ్రమపదమదర్శయత్.

వ్యా. అంతట తిరిగి వచ్చిన వాగ్దేవత, అచట పుత్రుడు కనబడకపోవుటతో మనస్సులో ఆక్రందించెను. ప్రసంగవశముచే అచటకువచ్చిన మునిశ్రేష్ఠుడైన వాల్మీకి, సవినయముగ భగవతి యగు వాగ్దేవికి ఆ వృత్తాంతమును తెలిపి, శుక్రుని ఆశ్రమమును చూపించెను.

మూ. సాపి ప్రస్నుతపయోధరా పుత్రాయాఙ్కపాలీం దదానా. శిరసి చ చుమ్బన్తీ స్వస్తిమతా చేతసా ప్రాచేతసాయాపి మహర్షయే నిభృతం సచ్ఛన్దాంసి వచాంసి ప్రాయచ్ఛత్.

వ్యా. ఆమె కూడ చనుబాలు స్రవింప కుమారుని ఒడిలోకి తీసికొని, శిరమున ముద్దిడుచు శుభచిన్తాభరిత మగు చిత్తముతో ఆ వాల్మీకికి కూడ, రహస్యముగ, ఛందోగ్రథితము లగు వాక్కులను అనుగ్రహించెను.

మూ. అనుప్రేషితశ్చ స తయా నిషాదనిహతసహచరీకం క్రౌఞ్చయువానం కరుణక్రేఙ్కారయా గిరా క్రన్దన్తం ఉదీక్ష్య శోకవాన్ శ్లోకముజ్జగాద:-

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః
యత్క్రౌఞ్చ మిథునాదేకమవధీః కామమోహితమ్." 4

వ్యా. స్వాశ్రమమునకు వెళ్లుటకై ఆమెచే అనుమతింపబడిన అతడు, నిషాదు డొకడు తన సహచరిని సంహరింపగా కరుణాభరితక్రేంకారరూప మగు (కొన్ని పక్షుల కూతలకు క్రేంకార మని పేరు) ధ్వనితో ఆక్రందించుచున్న ఒక యువక్రౌంచపక్షిని చూచి, శోకవంతుడై. ఈ శ్లోకమును పలికెను:-

"ఓ నిషాదుడా క్రౌంచమిథునమునుండి కామమోహితమై యున్న ఒక పక్షిని చంపినావు: అందుచే చిరకాలము భూమిపై మనకుందువు గాక!"

వి. ఇచట రాజశేఖరుడు, ఆడ పక్షిని చంపినట్లు వ్రాసినాడు ఆనందవర్ధనుడు కూడ అట్టి అర్థమే వచ్చునట్లు వ్రాసినాడు కాని అభినవగుప్తుడు శ్రమపడి దానికి అర్థము కుదర్చినాడు· అట్లుకుదర్చుట ఈ వాక్యములో శక్యముకాదు. కావున ఇది రామాయణములో ఇప్పుడు ప్రసిద్ధిలోనున్న పాఠమునకు విరుద్ధము.

మూ. తతో దివ్యదృష్టిర్దేవీ తస్మా అపి శ్లోకాయ వరమదాత్; యదుతాన్యదనధీయానో యః ప్రథమమేనమధ్యేష్యతే స సారస్వతః కవిః సమ్పత్స్యతే ఇతి. స తు మహామునిః ప్రవృత్తవచనో రామాయణమితిహాసం సమదృభత్; ద్వైపాయనస్తు శ్లోకప్రథమాధ్యాయీ తత్ప్రభావేన శతసాహస్రీం సంహితాం భారతమ్.

వ్యా. దివ్యదృష్టిచే ఈ శ్లోకనిర్మాణమును తెలిసికొనిన సరస్వతీదేవి ''అంతవరకును ఏమియు అధ్యయనము చేయనివాడు మొట్టమొదటగ ఈ శ్లోకమును పఠించినచో సారస్వతకవి (సరస్వతీప్రసాదపాత్ర మగు కవి) యగును'' అని ఈ శ్లోకమునకు కూడ వర మిచ్చెను. ఈ విధముగ అనాయసముగ వెడలినశ్లోకము గల ఆ ముని రామాయణ మనెడు ఇతిహాసమును రచించెను. ప్రప్రథమముగ ఈ శ్లోకమునే చదివిన ద్వైపాయనుడు, దీని ప్రభావముచే, శతసాహస్రసంహితారూప మైన (నూరువేల శ్లోకములు గల) భారతమును రచించెను.

మూ. ఏకదా తు బ్రహ్మర్షివృన్దారకయోః శ్రుతివివాదే దాక్షిణ్యవాన్ దేవః స్వయమ్భూః తామిమాం నిర్ణేత్రీముద్దిదేశ. ఉపశ్రుతవృత్తాన్తశ్చ మాతరం వ్రజన్తీం సోఽనువవ్రాజ. ''వత్స' పరమేష్ఠినాననుమతస్య తే న బ్రహ్మలోకయాత్రా నిఃశ్రేయసాయ'' ఇత్యభిదధానా హఠాన్న్యవర్తయదేన మాత్మనా తు ప్రవవృతే.

వ్యా. ఒకనాడు బ్రహ్మర్షులకును దేవతలకును మధ్య ఏదియో వైదికవిషయమును గూర్చి వివాద మేర్పడినది. అపుడు దాక్షిణ్యవంతు డగు బ్రహ్మ (రెండు పక్షములవారియందును తుల్య మగు ప్రేమ కలవాడు దాక్షిణ్యవంతుడు. అందుచే బ్రహ్మ తాను ఈ నిర్ణయము చేయలేదు), ఆమెను (సరస్వతిని) వివాదనిర్ణేత్రినిగా ఆజ్ఞాపించెను. కావ్యపురుషుడు ఈ విషయము తెలిసి బ్రహ్మలోకమునకు వెళ్ళుచున్న తల్లిని అనుసరించెను "వత్సా! బ్రహ్మ అనుమతి లేనిదే నీవు బ్రహ్మలోకమునకు వచ్చుట క్షేమకరము కాదు'' అని పలికి ఆమె అతనిని బలాత్కారముగ వెనుకకు పంపెను. తాను మాత్రము ముందుకు సాగెను.

మూ. తతః స కావ్యపురుషో రుషా నిశ్చక్రామ. ప్రియం మిత్రమస్య చ కుమారః సాక్రన్దం రుదన్నభ్యధీయత గౌర్యా — "తాత తూష్ణీమాస్స్వ. సాహ

మేష నిషేధామి'' ఇతి నిగదన్తీ సమచిన్తయత్ - ''ప్రాయః ప్రాణభృతాం ప్రేమాణమన్తరేణ నాన్యద్బన్ధనమస్తి. తదేతస్య వశీకరణం కామపి స్త్రియం సృజామి''ఇతి విచిన్తయన్తి సాహిత్య విద్యావధూ ముదపాదయదాదిశచ్చైనామ్— ''ఏష తే రుషా ధర్మపతిః పురః ప్రతిష్ఠతే. తదినువర్తస్వైనం, నివర్తయ చ. భవన్తోఽపి హన్త మునయః కావ్యవిద్యాస్నాతకాశ్చరితమేతయోః స్తువ్వమ్ ఏతద్ధి వః కావ్యసర్వస్వం భవిష్యతి" ఇత్యభిధాయ భవానీ తూష్ణీమాసిష్ట. తేఽపి తథా కర్తుమవతస్థిరే.

వ్యా. అంతట ఆకావ్యపురుషుడు కోపముతో ఎచటికో పోవుటకు బయలు దేరెను. అతని ప్రియమిత్రుడగు కుమారస్వామి బిగ్గరగ ఏడ్వ మొదలిడెను. అపుడు పార్వతి ఇట్లు చెప్పెను - ''తండ్రీ! ఊరుకొనుము, వీనిని నేను వెళ్ళకుండ చేసెదను." ఇట్లు పలికి ఆమె మనస్సులో ఈ విధముగ ఆలోచించెను- ''సాధారణముగ ప్రాణులకు ప్రేమను మించిన బంధము మరి యొకటి లేదు. అందుచే ఈతనిని వశము చేసికొనెడు స్త్రీని ఒకతెను సృజించెదను." ఇట్లు ఆలోచించి సాహిత్యవిద్యావధువును సృజించి, ఆమెను ఇట్లు ఆజ్ఞాపించెను — "ఇదుగో నీ ధర్మపతి కోపముతో (ఎచటికో) వెడలిపోవుచున్నాడు. అందుచే ఇతనిని అనువర్తించుము; వెనుకకు మరల్చుము.'' ''ఓమునులారా! కావ్యవిద్యాస్నాతకులగు మీరుకూడ వీ౯ (సాహిత్యవిద్యావధూ - కావ్యపురుషుల) చరితమును స్తుతింపుడు. ఇది (వీరిచరితము) మీ కావ్యసర్వస్వము కాగలదు'' అని (మునులతో) పలికి భగవతి యగు పార్వతి మౌనము వహించెను. వారు కూడ ఆ విధముగ చేయ నుద్యుక్తులై యుండిరి.

మూ అథ సర్వే ప్రథమం ప్రాచీం దిశం శ్రియోః యత్రాఙ్గ-వఙ్గ-సుహ్మ- బ్రహ్మ-పుణ్డ్రాద్యా జనపదాః తత్రాభియుఞ్జానా తమౌమేయీ యం వేషం యథేష్టమసేవిష్ట స తత్రత్యాభిః స్త్రీభిరన్వకియత సా ప్రవృత్తి రౌఢ్రమాగధీ. తం తే మునయోఽభితుష్టువుః—

"ఆర్ద్రార్ద్ర చన్దనకుచార్పిత సూత్రహారః
సీమన్తచుమ్బిసిచయః స్ఫుటబాహుమూలః.
దూర్వాప్రకాణ్డరుచిరాస్వగురూపభోగాద్
గౌడాఙ్గనాసు చిరమేష చకాస్తు వేషః." 6

వ్యా. అంత వారందరును మొదట తూర్పు దిక్కు వైపు వెళ్లిరి. అంగ-వంగ-సుహ్మ-బ్రహ్మ-పుండ్రాదిదేశములు ఈ దిక్కుననే ఉన్నవి.

వి. భాగలపుర్‌నుండి ముంగేర్ వరకు ఉన్న ప్రదేశము అంగదేశము. చంపాపురి దీని రాజధానిగా ఉండెడిది. ఇది నేటి భాగల్‌పుర్‌కు మూడు కిలో మీటర్ల దూరములో గంగాతీరమున ఉన్నది. వంగదేశమనగా నేటి బంగాలా దేశము. దీనికి సమతటము అని కూడ పేరు. ఒక కాలమున ఈ దేశము టిపరా-గారో పర్వతములవరకు వ్యాపించి యుండెడిది. సుహ్మదేశము: నేటి మిదినాపుర్ హుగలీ, వర్ధమాన మండలాలకు ప్రాచీన కాలమున సుహ్మదేశ మని పేరు. తామ్రలిప్తి దాని రాజధానిగా ఉండెడిది. బ్రహ్మదేశము: నేటి బర్మాదేశము. పుండ్రదేశము: నేటి బంగాలదేశమునందలి మాల్దా-బోగరా మండలములలోని కొన్ని భాగములకు పూర్వము పుండ్రదేశ మని పేరు.

వ్యా. అచట అతనిని (కావ్యపురుషుని) వశము చేసికొనుటకై అనుస రించుచున్న ఆ ఉమాపుత్రి (సాహిత్యవిద్యావధువు) యథేష్టముగ (ప్రయత్న పూర్వకముగ) ఏ వేషమును ధరించెనో ఆ వేషమును అచట నున్న స్త్రీలు అనుక రించిరి. ఆ వేషరచనకు "ఔడ్రమాగధప్రవృత్తి" యని పేరు. ఆ ప్రవృత్తిని (కావ్యవిద్యాస్నాతకు లగు ఆ మునులు ఈ విధముగ స్తుతించిరి:- "అగురు ధూపమును సేవించుటచే (వర్ణము కొంచెము మారి) దూర్వాతృణములో మధ్య నున్న కాండము వలె సుందర మైన శరీరకాంతి గల గౌడాంగనలలో తడి తడిగా ఉన్న చందనము గల కుచములపై ఉంచబడిన హారసూత్రము కలదియు, సీమంతమును చుంబించుచున్న (పాపటను అంటుచున్న) వస్త్రాంతము (మేలి ముసుగు) కలదియు, స్పష్టముగ దృశ్యము లగు బాహుమూలములు కలదియు అగు ఈ వేషము, చాల కాలము ప్రకాశించుగాక" !

మూ. యదృచ్ఛయాపి యాదృఙ్నేపథ్యః స సారస్వతేయ ఆసీత్ తద్వేషాశ్చ పురుషా బభూవుః. సాపి సైవ ప్రవృత్తిః. యదపరం నృత్తవాద్యా దికమేషా చక్రే సా భారతీవృత్తిః. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ.

వ్యా. ఆ సారస్వతేయుడు ఆ సమయమున యాదృచ్ఛికముగ ఏ వేషమును ధరించెనో, అచటి పురుషు లందరును ఆ వేషమునే ధరించిరి మరియు ఆమె (సాహిత్యవిద్యావధువు) ఏ నృత్తవాద్యాదికమును చేసెనో అది భారతీ

వృత్తి. 'తాం తే మునయః' ఇత్యాదికము పూర్వము వలె సమానమే. (అనగా ఆ మునులు ఆ భారతీవృత్తిని స్తుతించిరి అని యర్థము).

మూ. తథావిధాకల్పయాపి తయా యదవశంవదీకృతః సమాసవత్, అనుప్రాసవత్, యోగవృత్తి పరమ్పరాగర్భం జగాద సా గౌడీయా రీతిః. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. వృత్తిరీతి స్వరూపం యథావసరం వక్ష్యామః.

వ్యా. ఆమె అటి వేషమును ధరించినను ఆ కావ్యపురుషుడు ఆమెకు వశంవదుడు కాలేదు అతడు సమాసభూయిష్ఠము, అనుప్రాసబహులము అగు యౌగికవృత్తి పరంపరతో కూడినది అగు (వాక్యమును) (లేదా "యౌగికవృత్తి పరంపరా గర్భముగ" అని క్రియావిశేషణము) పలికెను. అదియే గౌడీయరీతి. మునులు దానిని ఇత్యాదికము యథాపూర్వమే. భారత్యాదివృత్తుల స్వరూపమును, గౌడీయాది రీతిస్వరూపమును ముందు సమయము వచ్చినపుడు చెప్పగలము.

మూ. తతశ్చ స పాఞ్చాలాన్ ప్రత్యుచ్చచాల యత్ర పాఞ్చాల - శూరసేన - హస్తినాపుర - కాశ్మీర - వాహిక - బాహ్లీక - బాహ్లవేయాదయో జనపదాః తత్రాలియుఞ్జానా తమౌమేయీతి సమానం పూర్వేణ.సా పాఞ్చాలమధ్యమా ప్రవృత్తిః. తాం తే మునయోఽభితుష్టువుః.

వ్యా. అంతట అతడు, పాంచాల - శూరసేన - హస్తినాపుర - కాశ్మీర - వాహిక - బాహ్లీక - బాహ్లవేయాదిదేశములకు స్థానమైన పాంచాల ప్రాంతమునకు వెళ్లెను.''తత్రాలియుఞ్జానా తమౌమేయీ'' ఇత్యాదికము వెనుకటి వలెనే. (అనగా అచట అతనిని వశము చేసికొనుటకై ఉమాపుత్రి ప్రయత్నపూర్వకముగ ఏ వేషమును ధరించెనో దానిని అచటి స్త్రీలు అనుకరించిరి అని యర్థము.) అది పాంచాలమధ్యమప్రవృత్తి. మునులు దానిని స్తుతించిరి.

వి. పాంచాలదేశముః థానేశ్వరమునుండి (థనేసర్) ప్రయాగవరకు, హిమాలయ ప్రాంతమునుండి యమునవరకు వ్యాపించి యున్న దేశము పాంచాలదేశము. ఇది ఉత్తరపాంచాలము, దక్షిణపాంచాలము, అని రెండు ప్రదేశములుగ విభక్తమైనది. అహిచ్ఛత్రము (నేటిఅహిచ్ఛత్ర) దక్షిణపాంచాలమునకును, కాంపిల్యము ఉత్తరపాంచాలమునకును రాజధానులు. పాంచాలమును రాజశేఖరుడు అంతర్వేది యని కూడ నిర్దేశించి యున్నాడు. అతని కాలమున దీని రాజధాని కాన్యకుబ్జము. శూరసేనదేశము; ఇది కూడ ఉత్తరమున నున్నది దీనికి మధుర రాజధానిగ

ఉండెడిది హస్తినాపురము: ఇది కురుదేశరాజధాని. ఇది మేరఠ్‌కు వాయవ్యముగా 22మైళ్ల దూరమునను ఢిల్లీకి ఆగ్నేయముగ 56మైళ్లదూరమునను ఉన్నది. కాశ్మీరము: నేటి కాశ్మీరము. "శారదామఠమారభ్య కుంకుమాద్రితటాన్తకః. తావత్కాశ్మీరదేశః స్యాత్ పంచాశద్యోజనాత్మకః" అను తంత్రశాస్త్రోక్తి ననుసరించి శారదాపీఠము మొదలు కుంకుమాద్రివరకును గల 500మైళ్ల ప్రమాణము గల దేశము. వాహీకము: దీనికి పంచనదము, ఆరట్టదేశము, టక్కదేశము అను నామాంతరములు కలవు. "పంచానాం సిన్ధు షష్ఠానాం నదీనాం యత్ర సంగమః. వాహీకా నామ తే దేశాః –" అను ప్రసిద్ధోక్తి ననుసరించి సింధ్వాదినదులు ఆరు కలియు దేశము వాహీకదేశము. ఇచటివారు పూర్వము అనార్యులుగ భావింపబడెడివారు ఈ దేశము పంజాబులో భాగము. బాహ్లీకము: ఇది వాహీకదేశసమీపవర్తిదేశము. ఇది నేటి 'బల్ఖ్' ప్రాంతము. బాహ్లవేయము: ఇది 'ములతాన్' సమీపమున నున్న నేటి 'బాదియా'. ఇది సింధునదీతీరమున నున్నది.

మూ. తాటఙ్కవల్గనతరఙ్గితగణ్డరేఖ
మానాభిలమ్బిదరదోలితతారహారమ్
ఆశ్రోణిగుల్ఫపరిమణ్డలితాన్తరీయం.
వేషం నమస్యత మహోదయసున్దరీణామ్ 6

వ్యా. తాటంకముల (కర్ణభూషణముల) కదలికచే తరంగములు కలిగినట్లు కనబడు చెక్కిళ్లు కలదియు, నాభిదేశమువరకును వ్రేలాడుచున్న, కొంచెము ఊగుచున్న పెద్దముత్యముల హారము కలదియు, నితంబప్రదేశమునుండి మడమల వరకును చుట్టబడిన అధోవస్త్రము కలదియు అగు కాన్యకుబ్జస్త్రీల వేషమును నమస్కరింపుడు (నేటి 'కనౌజ్' కు పూర్వము 'కాన్యకుబ్జము', 'గాధినగరము' 'మహోదయము' అను నామధేయము లుండెడివి).

మూ. కిఞ్చిదార్ద్రితమనా యన్నేపథ్యః స సారస్వతేయ ఆసీదితి సమానం పూర్వేణ. సాపి యదీవన్నృత్తగీతవాద్యవిలాసాదికం దర్శయామ్బభూవ సా సాత్త్వతీ వృత్తిః. అవిద్ధగతిమత్త్వాత్సా చారభటీ. తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. కథావిధానకల్పయాపి తయా యదీష ద్వశంవదీకృత ఈషదసమాసం,

ఈషదనుప్రాసముపచారగర్భం చ జగాద సా పాఞ్చాలీ రీతిః తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ.

వ్యా (సాహిత్యవిద్యావధువుధరించిన ఆ వేషమును చూచి) ఆసారస్వతేయుడు కొంచెము ఆర్ద్రమైన మనస్సు కలవాడై ఏ వేషమును ధరించెనో (ఆ వేషమును అచటి పురుషులు ధరించిరి) ఇత్యాదికము యథాపూర్వమే. ఆమె కొంచెము, ఏనృత్త - గీత - వాద్యవిలాసాదికమును చూపించెనో, అది సాత్త్వతీ వృత్తి. కొంచెము గమనమును అడ్డుకొనుటచే ఆ వృత్తియే ఆరభటికూడ. దానిని ఆమునులు ... ఇత్యాదికము వెనుకటి వలెనే (దానిని ఆ మునులు స్తుతించిరి.) అట్టి వేషమును ధరించినను ఆమెచే కొంచెము మాత్రమే వశీకృతుడై (ఆ కావ్య పురుషుడు) చిన్న చిన్నసమాసములుతోడను, అనుప్రాసము తక్కువగ ఉండున ట్లును, ఉపచారగర్భముగను పలికెను. అదియే పాంచాలీరీతి. దానిని మునులు ... ఇత్యాదికము వెనుకటి వలెనే, (మునులు ఆ రీతిని ప్రశంసించిరి).

మూ. తతః సోఽవన్తీన్ ప్రత్యుచ్చచాల యత్రావన్తీ-వైదిశ-సురాష్ట్ర-మాలవార్బుద - భృగుకచ్ఛాదయో జనపదాః. తత్రాపి యుష్మానా త మౌమేయాతి సమానం పూర్వేణ. సా ప్రవృత్తిరావన్తీ పాఞ్చాలీమధ్యమా-దాక్షిణాత్యయోరన్తర చారిణీ హి సా. అత ఏవ సాత్త్వికీ కైశిక్యౌ తత్ర వృత్తీ. తాం తే మునయోఽభి తుష్టువుః.-

పాఞ్చాలనేపథ్యవిధిర్నరాణాం
  స్త్రీణాం పునర్నన్దతు దాక్షిణాత్యః.
యజ్జల్పితం యచ్చరితాదికం త
  దన్యోన్యసంభిన్నమవన్తిదేశే 7

వ్యా. అనంతరము అతడు అవన్తీ - వైదిశ - సురాష్ట్ర - మాలవ - అర్బుద - భృగుకచ్ఛదేశము లున్న అవంతీదేశము వైపు వెళ్ళెను. "తత్రాపి యుష్మానాతమోమేయా" ఇత్యాదికము పూర్వము వలెనే (అనగా అతనిని వశము చేసికొనుటకై ఉమాపుత్రి ఏ వేషమును ధరించెనో ఆ వేషమును అచటి స్త్రీలు కూడ ధరించిరి.) ఆ ప్రవృత్తికి పాంచాలీప్రవృత్తి యని పేరు. అది పాంచాల మధ్యమావృత్తికిని, దాక్షిణాత్యవృత్తికిని నడుమ నుండునది. కావుననే అచట సాత్త్వతీ - కైశికీవృత్తు లున్నవి. ఆ వృత్తిని మునులు ఈ విధముగ స్తుతించిరి:-

"పురుషుల పొందాలవేషవిధానము సుందరమైనది. స్త్రీలకు మాత్రము దాక్షిణాత్యవేషవిధానము మనోహరమైనది. సంభాషణ- చరితములు రెండును అవంతిదేశమున పరస్పరము కలిసియున్నవి."

వి. అవన్తిప్రదేశము :- నేటి మాలవా ప్రాంతము దీనికి ఉజ్జయిని రాజధానిగా ఉండెడిది. ఈ ప్రాంతమునకు పీఠిహోత్ర మని కూడ నామాంతరమున్నది. వైదిశ: విదిశానగరమునకు చుట్టు పక్కల నున్న దేశము. విదిశా నగరము (నేటి భిలిసా.) భోపాలకు 26 మైళ్ళ దూరమున వేత్రవతీనదీతీరమున నున్నది. ఇది దశార్ణదేశమునకు రాజధానిగా ఉండెడిది సౌరాష్ట్రము :- కఠియావాడ్ ప్రాంతమునకును, గుజరాత్‌లోని కొంత భాగమునకును సౌరాష్ట్ర మని పేరు ఉండెడిది దీనికి ఆనర్తదేశ మని కూడ పేరు. ద్వారక దీని రాజధానిగా ఉండెడిది. కొంతకాలము వలభి కూడ రాజధానిగా ఉండెడిది. మాలవదేశము: నేటి మాలవా. అర్బుదము: అరావళీపర్వత శ్రేణికి సంబంధించిన ఆబూపర్వతము రాజపుతానాలో సిరోహీప్రాంతమున నున్నది. ఈ పర్వతము చుట్టు పక్కల నున్న భూభాగము అర్బుదదేశము. భృగుకచ్ఛము గుజరాతులోని 'బ్రోచ్' ప్రాంతము. దీనికే 'భరోచ్' అని కూడ పేరు.

మూ. తతశ్చ స దక్షిణాం దిశమాససాద యత్ర మలయ-మేకల-కున్తల-కేరల-పాలమఞ్జర-మహారాష్ట్ర-గఙ్గ-కలిఙ్గాదయో జనపదాః. తత్రా వియఞ్ఞానా తమౌ మేయాతి సమానం పూర్వేణ. సా దాక్షిణాత్యా ప్రవృత్తిః తాం తే మునయో౽భితుష్టువుః —

"ఆమూలతో వలితకున్తలచారు చూడ
చూర్ణాలకప్రచయలాఞ్ఛితభాలభాగః.
కక్షానివేశ నిబిడీకృత నీవి రేష
వేషశ్చిరం జయతి కేరలకామినీనామ్" 8

వ్యా. అచటినుండి అతడు. మలయ-మేకల-కున్తల-కేరల-పాల-మఞ్జర-మహారాష్ట్ర-గంగ-కలింగాదిదేశములున్న దక్షిణదిశకు చేరెను. అతనిని వెన్నంటుచు వెళ్లిన ఆ ఉమాపు త్రి ఇత్యాదికము వెనుకటివలెనే. (అతనిని వశముచేసి కొనుటకై వెన్నంటి వెళ్లిన ఆ ఉమాపుత్రి ఏ వేషమును ధరించెనో ఆ వేషమును

ఆచటి స్త్రీలు కూడ ధరించిరి.) అది దాక్షిణాత్య ప్రవృత్తి దానిని మునులు ఈ విధముగ స్తుతించిరి.

"కుదుళ్లనుంచి త్రిప్పి కట్టబడిన కుంతలములతో అందముగ నున్న శిరస్సు కలదియు, ముంగురుల సముదాయముచే అలంకృత మగు నుదురు కలదియు, బుజము క్రింద బిగించి వేసిన కోకముడి గలదియు అగు కేరలస్త్రీల వేషము చిరకాలము సర్వోత్కృష్టముగ నున్నది"

వి. మలయము: మైసూరునుండి ట్రావన్‌కూరు వరకును వ్యాపించి యున్న పర్వతశ్రేణి. మేకలము: వింధ్యపర్వత శ్రేణిలో ఒక భాగము. దీనికి అమరకంటక మని కూడ పేరు. నర్మదానది ఈ పర్వత ప్రాంతమునుండియే జనించినది. కున్తలదేశము: ఈ దేశము గోదావరీకృష్ణానదుల మధ్యభాగమున నున్నది. ఇది చోలదేశమునకు ఉత్తరముగ ఉండెడిది. దాని రాజధాని కల్యాణపురము. ఇది హైదరాబాదుకు వాయవ్యముగా నున్న దేశము. కర్ణాటదేశములోని కొంతభాగము, విదర్భ ప్రాంతము, కుంతలదేశముపాలనలో ఉండెడిది. కేరలదేశము: నేటి మలబారు, కొచిన్, ట్రావన్‌కూర్ మండలములు కేరళ దేశనామముతో ప్రసిద్ధములై యుండెడివి. ఇది కోంకణదేశములోని గోకర్ణక్షేత్రమునుండి కన్యాకుమారివరకు వ్యాపించి యుండెడివి పాలదేశము: పాలమంజరదేశము అనునది ఒక్క దేశమా, లేక పాలదేశము వేరు మంజరదేశము వేరా అనునది సంశయాస్పదము. మహోద్ ప్రాంతదేశము పాలదేశ మని కొందరి అభిప్రాయము. మహారాష్ట్రము: నేటి మహారాష్ట్రప్రదేశము. రామాయణములో ఇది దండకారణ్యము. కలింగము: ఉత్తరమున ఒరిస్సా మొదలు దక్షిణమున గోదావరీతీరము వరకును ఉన్న దేశము. 'దంతకూర్' దీని రాజధాని. దీనికే మహాభారతమున 'దంతపురము' అని పేరు. నేటి రాజమహేంద్రవరము దీని రాజధానిగా ఉండెడి దని కొందరు ఐతిహాసికుల అభిప్రాయము. గంగదేశము: కోయంబత్తూరు, సేలం జిల్లాలకు పూర్వము 'కోంగు' అను పేరు ఉండెడిదనియు, అదియే ఈ గంగదేశ మనియు కొందరి అభిప్రాయము.

మూ. తామనురక్తమనాః స యన్నేపథ్యః సారస్వతేయ ఆసీదితి సమానం పూర్వేణ. సా పి యద్విచిత్రనృత్తగీతవాద్యవిలాసాదిక మావిర్భావయామాస సా కైశికీ వృత్తిస్తాం తే మునయ ఇతి సమానం పూర్వేణ. యదత్యర్థం

చ స తయా వశంవదీకృతః స్థానానుప్రాసవదసమాసం యోగవృత్తిఙ్చ జగాద సా వైదర్భీ రీతిః. తాం తే మునయః ఇతి సమానం పూర్వేణ.తత్ర వేషవిన్యాస క్రమః ప్రవృత్తిః; విలాస-విన్యాసక్రమో వృత్తిః. వచనవిన్యాసక్రమో రీతిః.

వ్యా. ఆమెపై అనురాగముతో నిండిన మనస్సు గల ఆ సారస్వతేయుడు ఏ వేషమును ధరించెనో ఇత్యాదికము వెనుకటి వలెనే (ఆ వేషమునే అచటి పురుషులు ధరించిరి). అమె విచిత్రము లగు ఏ నృత్త-గీత-వాద్య-విలాసాదులను అవిష్కరించెనో అదియే కైశికీవృత్తి. దానిని మునులు ఇత్యాదికము పూర్వము వలెనే (దానిని మునులు స్తుతించిరి). పూర్తిగ ఆమెకు వశంవదు డైన ఆ సారస్వతేయుడు, నియత స్థానములందు అనుప్రాసము కలదియు, సమాసరహితమును, యోగవృత్తి గర్భమును (యౌగికపదభూయిష్ఠ మని యర్థము) అగు వాక్యమును పలికెను. అదియే వైదర్భీరీతి. 'మునులు దానిని' ఇత్యాదికము పూర్వమువలెనే. (మునులు దానిని స్తుతించిరి) అందు వేషవిన్యాసపద్ధతికి ప్రవృత్తి యని పేరు. విలాసవిన్యాస క్రమమునకు వృత్తి యని పేరు. వచనవిన్యాస క్రమమునకు రీతి అని పేరు.

మూ. "చతుష్టయీ గతిర్వృత్తీనాం ప్రవృత్తీనాం చ: దేశానాం పునరానన్త్యమ్.తత్కథమివ కార్త్స్న్యేన పరిగ్రహః"ఇత్యాచార్యాః."అనన్తానపి హి దేశాన్ చతుర్ధైవాకల్య్య కల్పయన్తి. చక్రవర్తిక్షేత్రం సామాన్యేన. తదవాన్తరవిశేషైః పునరనన్తా ఏవ" ఇతి యాయావరీయః.

వ్యా. "వృత్తులును, ప్రవృత్తులును నాలుగేసి విధములు. దేశములో- అనంతములు. అట్టి పరిస్థితులలో అన్ని దేశములకును సంబంధించిన వృత్త్యాదులను పూర్తిగ పరిగ్రహించుటకు ఎట్లు వీలగును?" అని ఆచార్యులఆక్షేపము. దేశము లనంతము లైనను వాటిని నాలుగు భాగములుగా విభజించి కల్పించుచుందురు. సామాన్యరూపమున చక్రవర్తిక్షేత్రయు ఒక్కటే. అవాంతరవిశేషములను దృష్టిలో నుంచుకొని విభజించినచో (దేశముల వలె వృత్త్యాదులు కూడ) అనంతములే" అని యాయావరీయుడు అనగా రాజశేఖరుడు, (చెప్పుచున్నాడు.)

మూ. దక్షిణాత్సముద్రా దుదీచీం దిశం ప్రతి యోజనసహస్రం చక్రవర్తిక్షేత్రమ్. తత్రైవ నేపథ్యవిధిః. తతః పరం దివ్యాదాఅపి యం దేశమధివసేయు స్తద్దేశ్యం వేషమాశ్రయన్తో నిబన్ధనీయాః. స్వభూమౌ తు కామచారః.

ద్వీపాన్తరభవానాం తదనుసారేణ వృత్తిప్రవృత్తిః. రీతయస్తు తిస్రః తాస్తు పురస్తాత్.

వ్యా. దక్షిణసముద్రమునుండి ఉత్తరపుదిక్కు వైపు వేయి యోజనముల భూభాగమునకు చక్రవర్తిక్షేత్ర మని పేరు ఇంతవరకును చెప్పిన వేషవిధానము ఈ చక్రవర్తిక్షేత్రమునకు సంబంధించినది. దానిని దాటిన దేశమునకు సంబంధించిన, దివ్యపురుషాదులు కూడ ఏ దేశమును ఆశ్రయించి యుందురో ఆ దేశమునందలి వేషమును ధరించినట్లుగ వర్ణింపవలెను (కాని ఆ దివ్యపురుషులు) తమ లోకములో నున్నపుడు మాత్రము (కవి వారి వేషభూషాదులను) తన ఇచ్ఛ ననుసరించి వర్ణింపవచ్చును. ద్వీపాంతరనివాసుల వృత్తిప్రవృత్తులను ఆయా ద్వీపములలో నుండు విశేషముల ననుసరించి వర్ణింపవలెను. రీతులు మాత్రము మూడే వాటిని గూర్చి మున్ముందు చెప్పగలము.

మూ. తత్రాస్తి మనోజన్మనో దేవస్య క్రీడావాసః విదర్భేషు, వత్సగుల్మం నామ నగరమ్. తత్ర సారస్వతస్తామౌమేయీం గన్ధర్వవత్పరిణినాయ. తత్వస్తద్వధూవరం వినివృత్య తేషు ప్రదేశేషు విహరమాణం తుషారగిరిమేవాజగామ, యత్ర గౌరీ సరస్వతీ చ మిథః సమ్బన్ధినౌ తస్థతుః. తౌ చ కృతవన్దనౌ దమ్పతీ దత్త్వాశిషం ప్రభావమయేన వపుషా కవిమానసనివాసినౌ చక్రతుః. తయోశ్చ కవిలోకస్వర్గసర్గం తమకల్ప (యే) తామ్; యత్ర కావ్యమయేన శరీరేణ మర్త్యమధి వసన్తో దివ్యేన దేహేన కవయ ఆకల్పం మోదన్తే.

వ్యా. భగవంతు డగుమన్మథునికి క్రీడానివాస మైన వత్సగుల్మ మనెడు ఒక నగరము విదర్భదేశములో నున్నది. సారస్వతేయుడు ఆ నగరమున ఆ ఉమాపుత్రిని గాంధర్వవిధిచే వివాహ మాడెను. ఆ వధూవరులు అచటినుండి వెనుకకు మరలి, ఆ యా దేశములలో విహరించుచు హిమవత్పర్వతమును చేరిరి. వియ్యమందిన గౌరీసరస్వతులు అచటనే ఉండిరి. ఆ గౌరీసరస్వతులు, నమస్కరించిన దంపతులను ఆశీర్వదించి, వారు (ఆ దంపతులు) ప్రభావమయ మగు శరీరముతో కవిమానసమునందు నివసించునట్లు చేసిరి. వారికొరకై ఒక కవిజన స్వర్గసృష్టి చేసిరి. కావ్యమయశరీరముతో భూలోకములో నివసించు కవులు దివ్యదేహముతో ఈ స్వర్గమునందు కల్పాంతమువరకును ఆనందించుచుందురు.

మూ. ఇత్యేవ కావ్యపురుషః పురా సృష్టః స్వయమ్భువా.
ఏవం విభజ్య జానానః ప్రేత్య చేహ చ నన్దతి 9

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధి
కరణే తృతీయోధ్యాయః కావ్యపురుషోత్పత్తిః.

వ్యా. ఈ విధముగ పూర్వము బ్రహ్మచే కావ్యపురుషుడు సృజింపబడెను. ఈ విధముగ వివేకపూర్వకముగ తెలిసికొనువాడు ఇహలోకమునందును, మరణానంతరము గూడ ఆనందించును.

వి. సారస్వతేయుని ఉత్పత్తిని గూర్చి వాయుపురాణ. మహాభారతములలో కూడ ఉన్నది, కాని అది కొంచెము భిన్నముగ నున్నది. దీనిని బాణభట్టు కూడ హర్షచరిత్రప్రారంభమున చెప్పి యున్నాడు. రాజశేఖరు డా కథను కొంచెము స్వప్రయోజనుకూలము లగు మార్పులతో ఇచట చేర్చినాడు. ఈ సారస్వతేయుడే కావ్యప్రవర్తకు డగు కావ్యపురుషు డనియు అతడు ఉమాపుత్రి యగు సాహిత్య విద్యావధువును వివాహ మాడె ననియు చెప్పుచు. ఇతడు, కావ్యములకును, తద్గుణదోషవిమర్శనాత్మక మగు అలంకారశాస్త్రమునకును గల మనిష్ఠసంబంధమును సూచించినాడు. ఆయా ప్రాంతములలో ప్రచారములో నున్న వృత్తిరీత్యాదులభేదమును కూడ చక్కగ చిత్రించినాడు.

దృశ్యకావ్యములు, శ్రవ్యకావ్యములు అని కావ్యములురెండు విధములు. దృశ్యకావ్యములలో నాట్యసంబంధ ముండును. నాట్యమునందు వేషవిన్యాసము. విలాసవిన్యాసము, వచనవిన్యాసము అనుమూడు ప్రధానాంగము లుండును. వీనికి వరుసగ ప్రవృత్తి, వృత్తి, రీతి అని నామధేయములు. మూడవదైన రీతి శ్రవ్యకావ్యములకు కూడ సాధారణము. ప్రాంతభేదము ననుసరించి ఈ వృత్తి రీత్యాదుల స్వరూప మెట్లుండునో, కావ్యపురుష - సాహిత్యవిద్యావధువుల వేష - భాషాదివర్ణన ద్వారా రాజశేఖరుడు ఈ ప్రకరణమున సూచించినాడు.

బాలానందినిలో తృతీయాధ్యాయము సమాప్తము.

చతుర్థోఽధ్యాయః — పదవాక్యవివేకః

మూ. ద్వివిధం శిష్యమాచక్షతే యదుత బుద్ధిమానాహార్యబుద్ధిశ్చ. యస్య నిసర్గతః శాస్త్రమనుధావతి బుద్ధిః స బుద్ధిమాన్. యస్య చ శాస్త్రాభ్యాసః సంస్కురుతే బుద్ధిం అసావాహార్యబుద్ధిః.

వ్యా. బుద్ధిమంతు డనియు, ఆహార్యబుద్ధి యనియు శిష్యుడు రెండు విధములు. స్వభావముచేతనే (అప్రయత్నముగనే) శాస్త్రములలో ప్రవేశించు బుద్ధి గలవాడు బుద్ధిమంతుడు. శాస్త్రాభ్యాసముచే సంస్కారమును సంపాదించు కొనిన బుద్ధి కలవాడు ఆహార్యబుద్ధి.

మూ. త్రిధా చ సా—స్మృతిః, మతిః, ప్రజ్ఞేతి. అతిక్రాన్తార్థస్య స్మర్త్రీ స్మృతిః. వర్తమానస్య మన్త్రీ మతిః. అనాగతస్య ప్రజ్ఞాత్రీ ప్రజ్ఞా ఇతి. సా త్రిప్రకారాపి కవీనాముపకర్త్రీ.

వ్యా. స్మృతి, మతి, ప్రజ్ఞ అని ఆ బుద్ధి మూడు విధములు. గడచిపోయిన విషయములను స్మరించు బుద్ధి స్మృతి. జరుగుచున్న విషయమును తెలిసికొనగల్గుబుద్ధిమతి. రాబోవు విషయములను గ్రహింపగల్గునది ప్రజ్ఞ. ఈ మూడు విధముల బుద్ధియు కవులకు ఉపకరించును.

మూ. తయోర్బుద్ధిమాన్ శుశ్రూషతే, శృణోతి, గృహ్ణీతే, ధారయతి, విజానాతి, ఊహతే, అపోహతి, తత్త్వం చాభినివిశతే. ఆహార్యబుద్ధేర ప్యేత ఏవ గుణాః; కిన్తు ప్రశాస్తారమపేక్షన్తే. అహరహః సుగురూపాసనా తయోః ప్రకృష్టో గుణః. సా హి బుద్ధివికాసకామధేనుః. తదాహుః :-

వ్యా. ఈ రెండు విధముల మనుష్యులలో బుద్ధిమంతుడు వినుటకు అభిలషించుచుండును; వినును, గ్రహించును; ధారణము చేయును, తెలిసికొనును, ఊహించును, ఆశంకలకు సమాధానము చెప్పును. యథార్థస్వరూపమునందు ఆస్థతో ఉండును. ఆహార్యబుద్ధికి గూడ ఈ గుణము లుండును. కాని అతనికి ఈ గుణములు అలవడుటకు ఉపదేష్టయొక్క అవశ్యకత ఉండును. ప్రతిదినము సద్గురువును ఉపాసించుట వారిరువురికిని ప్రకృష్ట మగు గుణము. (గురూపాసన చేసినచో వారికి ఇంకను మంచి దని యర్థము.) ఆ గురూపాసన బుద్ధివికాసము కలిగించుటలో కామధేనువు కదా ? ఈ విషయమునే ఇట్లు చెప్పుదురు :-

మూ. ప్రథయతి పురః ప్రజ్ఞా జ్యోతిర్యథార్థపరిగ్రహే
తదను జనయత్యూహాపోహక్రియావిశదం మనః.

అభినివిశతే తస్మాత తత్త్వం తదేకముఖోదయం
సహ పరిచయో విద్యావృద్ధైః క్రమాదమృతాయతే॥ 1

వ్యా. విద్యావృద్ధులతో పరిచయము, ముందుగా ప్రజ్ఞాజ్యోతిని వికసింప చేసి యథార్థగ్రహణ శక్తిని కలిగించును. పిమ్మట మనస్సును, ఊహాపోహాలు చేయుటచే (శంకాసమాధానములు చేయుటచే) పరిశుద్ధ మైనదానినిగ చేయును. ఇట్టి విశదత్వము లభించుటచే మనస్సు ఏకాగ్రమై తత్త్వమును గ్రహించును. ఈ విధముగ విద్యావృద్ధుల సహవాసము క్రమముగ అమృతమువంటి దగును.

వి. ఒక విషయమునకు సంబంధించిన మంచిచెడుగుల నన్నింటిని బాగుగ పరిశీలించుట ఊహాపోహము.

మూ. తాభ్యామన్యథా బుద్ధిర్దుర్బుద్ధిః. తత్ర బుద్ధి మతః ప్రతిపత్తిః. స ఖలు సకృదభిధానప్రతిపన్నార్థః కవిమార్గం మృగయితుం గురుకులముపాసీత. ఆహార్యబుద్ధేస్తు ద్వయమప్రతిపత్తిః సన్దేహశ్చ, స ఖల్వప్రతిపన్నమర్థం ప్రతిపత్తుం సన్దేహం చ నిరాకర్తుమాచార్యానుపతిష్ఠేత.

వ్యా. ఈ ఇరువురికంటెను భిన్నమైన బుద్ధి కలవాడు దుర్బుద్ధి. వీరిలో బుద్ధిమంతునకు విషయగ్రహణము బాగుగ నుండును. అతడు ఒక్కమారు చెప్పి నంతనే విషయమును గ్రహించును. అతడు కవి మార్గమును అన్వేషించుటకై గురుకులమును సేవించవలెను. ఆహార్యబుద్ధికి విషయ అగ్రహణము, సందేహము రెండును ఉండును. తెలియని విషయమును గహించుటకును, సందేహములను తొలగించుకొనుటకును అతడు ఆచార్యులను సేవించవలెను.

మూ. దుర్బుద్ధేస్తు సర్వత్ర మతివిపర్యాస ఏవ స హి నీలమేచకిత సిచయకల్పః, అనాధేయగుణాన్తర త్వాత్. తం యది సారస్వతో౽నుభావః ప్రసాద యతి తమౌపనిషదికే వక్ష్యామః.

వ్యా. దుర్బుద్ధికి అంతటను మతివిపర్యాసమే. (అతని బుద్ధి ఎల్లప్పుడును విపరీతముగనే పనిచేయుచుండును). క్రొత్త గుణములను వేటిని అతనిలో కల్పించుటకు శక్యము కాదు. అందుచే అతడు నీలిమందుతో నల్లగ తయారుచేసిన వస్త్రము వంటివాడు. సరస్వతీప్రసాదవిశేషము అతనిలో కూడ కొంత మంచిని కలిగించునా అను విషయమును 'ఔపనిషదిక' ప్రకరణములో చెప్పగలము.

వి. రాజశేఖరుడు ఈ ఔపనిషద ప్రకరణమున, మంత్రజపదేవతాను గ్రహాదులచే కవిత్వ శక్తిని సంపాదించు ఉపాయములను వివరించియుండును. అది లభ్యముకాదు.

మూ. "కావ్యకర్మణి కవేః సమాధిః పరం వ్యాప్రియతే" ఇతి శ్యామదేవః. మనస ఏకాగ్రతా సమాధిః సమాహితం చిత్తమర్థాన్ పశ్యతి. ఉక్తఞ్చ:—

"సారస్వతం కిమపి తత్సుమహా రహస్యం
యద్గోచరే చ విదుషాం నిపుణైక సేవ్యమ్.
తత్సిద్ధయే పరమయం పరమో౽భ్యుపాయః
యచ్చేతసో విదితవేద్యవిధేః సమాధిః." 2

వ్యా. "కావ్యరచనావిషయమున కవికి సమాధియే అధికముగ ఉపయుక్తమగును" అని శ్యామదేవుని అభిప్రాయము. సమాధి యనగా మనస్సుయొక్క ఏకాగ్రత ఏకాగ్ర మగు మనస్సు విషయములను బాగుగ గ్రహించును. కావుననే ఇట్లు చెప్పుదురు:—

"ఆ సారసతత్త్వము వర్ణింప శక్యము కాని, మహారహస్యము. విద్వాంసులం మాత్రమే తెలియదగిన ఆ తత్త్వము కేవలము నిపుణులచేత మాత్రమే సేవింపదగినది. ఆ సారస్వతతత్త్వము సిద్ధింపవలె నన్నచో, విదితవేద్య మగు (తెలియదగిన విషయము లన్నియు తెలిసిన) మనస్సుయొక్క ఏకాగ్రత ఒక్కటియే పరమోపాయము."

మూ. 'అభ్యాస' ఇతి మంగలః. అవిచ్ఛేదేన శీలనమభ్యాసః. స హి సర్వత్ర నిరతిశయం కౌశలమాధత్తే. "సమాధిరాన్తరః ప్రయత్నో బాహ్యస్త్వభ్యాసః. తావుభావపి శక్తిముద్భాసయతః. సా కేవలం కావ్యే హేతుః" ఇతి యాయావరీయః.

వ్యా. (కవికి కావ్యనిర్మాణమున ఉపకరించునది) అభ్యాస మని మంగలుని అభిప్రాయము. నిరంతరము కావ్యపరిశీలనమునకు అభ్యాస మని పేరు. అది (అభ్యాసము) సర్వవ్యాప్తమై (అన్ని విషయములను ఆకలించు కొనునదై) అన్నిటియందు అత్యధిక మగు నేర్పును కలిగించును. "సమాధి మానసిక మగు ప్రయత్నము. అభ్యాస మనునది బాహ్యప్రయత్నము. ఈ సమాధ్యభ్యాసములు

రెండును శక్తిని వికసింప చేయును. కేవలము ఆ శక్తి మాత్రమే కావ్యమునకు హేతువు'' అని యాయావరీయుడు చెప్పుచున్నాడు.

మూ. విప్రసృతిశ్చ సా ప్రతిభావ్యుత్పత్తిభ్యామ్. శక్తిహేతుకే హి ప్రతిభావ్యుత్పత్తికర్మణీ. శక్తస్య ప్రతిభాతి శక్తశ్చ వ్యుత్పద్యతే యా శబ్దగ్రామం, అర్థసార్థం, అలఙ్కారతన్త్రం, ఉక్తిమార్గం, అన్యదపి తథా విధమధి హృదయం ప్రతిభాసయతి సా ప్రతిభా. అప్రతిభస్య పదార్థసార్థః పరోక్ష ఇవ. ప్రతిభావతః పునరపశ్యతోఽపి ప్రత్యక్ష ఇవ. యతో మేధావి రుద్రకుమారాదయో జాత్యన్ధాః కవయః శ్రూయన్తే.

వ్యా. అది (శక్తి) ప్రతిభావ్యుత్పత్తులచే విశిష్టమైన ప్రసారము కలది. (ప్రతిభావ్యుత్పత్తుల ద్వారా శక్తి బాగుగ ప్రసరించును అనగా శక్తియే ప్రతిభా వ్యుత్పత్తుల రూపమున ప్రసరించు నని అర్థము). ఏలనన ప్రతిభావ్యుత్పత్తి కర్మలు శక్తియే కర్తగా కలవి. (ప్రతిభావ్యుత్పత్తుల కర్తశక్తియే) శక్తి కల వానికే ప్రతిభానము కలుగును. శక్తి కలవానికే వ్యుత్పత్తి కూడ కలుగును. శబ్ద సముదాయమును, అర్థ సంఘాతమును అలంకార మర్యాదను, చెప్పెడు విధానమును, ఈ విధము లగు ఇతర విషయములను హృదయమునందు భాసింప చేయునది ప్రతిభ. ప్రతిభ లేనివానికి పదార్థ సముదాయ మంతయు పరోక్షము వలె నుండును. ప్రతిభావంతునకు మాత్రము, అతడు చూడకున్నను, ప్రత్యక్షము వలె నుండును. ఏల అన మేధావిరుద్ర కుమారదాసాది కవులు జాత్యంధు లని వినవచ్చు చున్నది.

మూ. కిఞ్చ న మహాకవయోఽపి దేశద్వీపాన్తర కథాపురుషాదిదర్శనేన తత్రత్యాం వ్యవహృతిం నిబధ్నన్తి స్మ. తత్ర దేశాన్తరవ్యవహారః:—

వ్యా. మహాకవులు గూడ దేశాంతరములకును ద్వీపాంతరములకును సంబంధించిన కథలను, అచ్చట నున్న పురుషాదులను చూచి అచ్చటి వ్యవహారమును కూర్చలేదు. అనగా అచటి విషయములను వేటిని స్వయముగ చూడకున్నను కూర్చి రని అర్థము.

దేశాంతర వ్యవహారమునకు ఉదాహరణము:— (ఈ శ్లోకము అభిజ్ఞాన శాకున్తలములో మేరుపర్వతముపై నున్న మారీచమున్యాశ్రమవర్ణనఘట్టము లోనిది).

"ప్రాణానామనిలేన వృత్తిరుచితా సత్కల్పవృక్షే వనే
తోయే కాఞ్చన పద్మరేణుకపిశే పుణ్యాభిషేకక్రియా.
ధ్యానం రత్నశిలాగృహేషు విబుధస్త్రీసన్నిధౌ సంయమః
యత్కాంక్షన్తి తపోభిరన్యమునయ స్తస్మిం స్తపస్యన్త్యమీ." 3

వ్యా. "ఉత్తమ మైన కల్పవృక్షములు కల వనమునందు గాలి మాత్ర మును ఆహారముగా గ్రహించి ప్రాణధారణము చేయుట అలవాటుగా నున్నది. బంగారు పద్మముల పుష్పొడిచే కపిశవర్ణముతో నున్న ఉదకమునందు పుణ్య స్నానము రత్నశిలాగృహముల యందు ధ్యానము దేవతాస్త్రీల (అప్సరస్త్రీల) సన్నిధిలో సంయమము. ఇతర మునులు తపస్సు చేసి ఏ స్థానమును పొందవలె నని అభిలషింతురో ఆ స్థానమునందు వీరు తపస్సు చేయుచున్నారు."

వి. ఇచట కవి తానెన్నడును చూడని దేవర్షుల తపస్సును ప్రత్యక్షముగ చూచినట్లుగ, చక్కగ వర్ణించినాడు.

మూ ద్వీపాన్తరవ్యవహారః
"అనేన సార్ధం విహరామ్బురాశే స్తీరేషు తాలీవనమర్మరేషు
ద్వీపాన్తరానీతలవఙ్గపుష్పైరపాకృతస్వేదలవా మరుద్భిః. 4
వ్యా. ద్వీపాంతరవ్యవహారవర్ణన మెట్లనగా—

(ఈ శ్లోకము రఘువంశమునందలి ఇందుమతీ స్వయంవరఘట్టములోనిది. సునంద ఇందుమతిని దక్షిణదేశరాజు వద్దకు తీసికొనివెళ్ళి అతనిని వివాహ మాడినచో ఏట్లు సుఖించవచ్చునో చెప్పుచున్నది) :-

"ద్వీపాంతరమునుండి లవంగపుష్పములను తీసికొనివచ్చెడు చల్లగాలు లచే తొలగింపబడిన చెమట బిందువులు కలదానవై తాలవృక్షవనము లుండుటచే మర్మరధ్వనిచేయుచున్న సముద్రతీరములందు ఈతనితో కూడ విహరింపుము."

వి దక్షిణదేశమునకు అవతలి ద్వీపమైన లంకలో లవంగలతాదు లున్నట్లును, (ద్వీపాంతరమునవలె,) సుదూరమైన దక్షిణసముద్రతీరమున తాళీవనాదు లున్నట్లును వర్ణించుటచే ఇది కవికి గల ద్వీపాన్తరవ్యవహార జ్ఞానమును సూచించుచున్నది.

మూ. కథాపురుషవ్యవహారః :-

"హరో౽పి తావత్పరివృ త్తధైర్యః చన్ద్రోదయారమ్భ ఇవామ్బురాశిః
ఉమాముఖేబిమ్బఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని." 5

"తథాగతాయాం పరిహాసపూర్వం సఖ్యాం సఖీ వేత్రభృదాబభాషే.
బాలే వ్రజామో౽న్యత ఇత్యథైనాం వధూరసూయాకుటిలం దదర్శ" 6

వ్యా. కథాపురుషవ్యవహారము అనగా కథలో నున్న వ్యక్తులను కండ్లకు కట్టినట్లు వర్ణింపగలిగిన ప్రతిభ. మొదటి శ్లోకము కుమారసంభవమున తృతీయ సర్గలోనిది.తపస్సు చేయుచున్న శివునికి పార్వతియందు ప్రేమను కలిగించుటకై మన్మథుడు ప్రయత్నించుచు బాణ ప్రయోగయునకు అవకాశమును పొంచి యుండును· అంతలో పార్వతి శివుని సమీపించి పుష్పములను సమర్పించును. ఇదే సమయ మని మన్మథుడు అస్త్ర ప్రయోగము చేయగా శివుని మనస్సు చలించును. "చంద్రోదయప్రారంభమున సముద్రము వలె, శివుడు కూడ కొంచెము చలించిన ధైర్యము కలవాడై, బింబఫలము వంటి అధరోష్ఠముగల ఉమాముఖము నందు నేత్రములను ప్రసరింపచేసెను·"

రెండవ శ్లోకము రఘువంశమునందలి ఇందుమతీ స్వయంవర వర్ణనఘట్ట ములోనిది. సునంద స్వయంవరమునకు వచ్చిన రాజులనందరిని ఒక్కొక్కరుగ ఇందుమతికి పరిచయము చేయుచుండెను. ఆమె ఒక్కొక్కరినీ కాదని ముందుకు సాగుచుండెను. అజుని దగ్గరకు చేరిన పిమ్మట సునంద అతని పరిచయము చేసెను. అతనిని వరింపవలె ననెడు అభిప్రాయములో ఇందుమతి ముందుకు సాగ కుండగా అచటనే నిలచి తటపటాయించుచుండెను. ఆమె భావమును గ్రహించినది సునంద."ఇందుమతి అట్టి పరిస్థితిలో నుండగా "బాలా! ముందుకు సాగుదమా?" అని పరిహాసపూర్వకముగ సునంద పలికెను. అపుడు ఆ వధువు ఆమె వైపు కోపముతో వక్రముగ చూచెను."

పైరెండు కములందును కవి ఆయా వ్యక్తులను కంటికికట్టి నట్లు అతి మనోహరముగ చిత్రించె ననగా ఇందుకు ప్రతిభయే కారణము.

మూ. సా చ ద్విధా-కారయిత్రీ భావయిత్రీ చ. కవేరుపకుర్వాణా కారయిత్రీ. సాపి త్రివిధా సహజా, ఆహార్యా, ఔపదేశికీ చ. జన్మాన్తర సంస్కారాపేక్షిణీ సహజా. జన్మసంస్కార యోని రాహార్యా.మన్త్రతంత్రాద్యుపదేశ ప్రభవా ఔపదేశికీ ఐహికేన కియతాపి సంస్కారేణ ప్రథమాం తాం సహజేతి వ్యపదిశ న్తి.

మహతా పునరాహార్యా. ఔపదేశిక్యాః పునరైహిక ఏవోపదేశకాలః; ఐహిక ఏవ సంస్కారకాలః.

వ్యా. కారయిత్రి భావయిత్రి అని ఆ ప్రతిభ రెండు విధములు. కవికి ఉపకరించునది, అనగా కవిచేత కావ్యములు వ్రాయించునది, కారయిత్రి. ఆ కారయిత్రి ప్రతిభ కూడ సహజ, ఆహార్య, ఔపదేశికి అని మూడు విధములు. జన్మాంతర సంస్కారము చే లభించినది సహజ. జన్మతః వచ్చి శాస్త్రాభ్యాసాది సంస్కారమువలన కూడ కలిగినది ఆహార్య ప్రతిభ. మంత్రతంత్రాద్యుపదేశముల వలన కలిగినది ఔపదేశికి మొదటి దగు సహజ ప్రతిభకు ఐహిక మగు సంస్కారము చాల కొద్దిగ చేయవలసి యుండును. ఈ సంస్కారము అతిస్వల్పము గాన దీనిని సహజ యందురు. శాస్త్రాభ్యాసాది సంస్కారము అత్యధికముగ చేయవలసి యున్నచో అది ఆహార్యప్రతిభ అనగా దానిలో జన్మతః లభించినది స్వల్పము సంస్కారమువల్ల లభించినది అధికము. మొదటిదానిలో జన్మతః లభించినది అధికము సంస్కారముచే లభించినది స్వల్పము. ఔపదేశిక ప్రతిభ ఇహలోకమున (ఈ జన్మలో) జరిగిన ఉపదేశాదుల వలననే జనించును: సంస్కారము కూడ ఇహలోకమునందే చేయబడును.

మూ. త ఇమే త్రయోఽపి కవయః సారస్వతః, ఆభ్యాసికః, ఔపదేశికశ్చ. జన్మాన్తరసంస్కారప్రవృత్తసరస్వతీకో బుద్ధిమాన్ సారస్వతః. ఇహ జన్మాభ్యాసోద్భాసిత భారతీక ఆహార్యబుద్ధిరాభ్యాసికః. ఉపదేశదర్శిత వాగ్విభవో దుర్బుద్ధి రౌపదేశికః. "తస్మాన్నేతరౌ తన్త్రశేషమను తిష్ఠతామ్. న హి ప్రకృతిమధురా ద్రాక్షా ఫాణితసంస్కార మపేక్షతే" ఇత్యాచార్యాః. 'న' ఇతి యాయావరీయః "ఏకార్థం హి క్రియాద్వయం ద్వైగుణ్యాయ సమ్పద్యతే."

వ్యా. సహజము, ఆహార్యము, ఔపదేశికము అను మూడు విధములగు కారయిత్రీ ప్రతిభను అనుసరించి, సారస్వతలు, ఆభ్యాసికలు, ఔపదేశికులు అని కవులు మూడు విధములుగ నుందురు. జన్మాంతర సంస్కారముచే ప్రవర్తించిన సరస్వతి గల బుద్ధిమంతు డగు కవి 'సారస్వతుడు'. ఈ జన్మలో చేసిన అభ్యాసముచే వికసించిన సరస్వతి కల ఆహార్యబుద్ధి (మెరుగు పెట్టవలసిన బుద్ధికలవాడు) ఆభ్యాసికుడు. (మంత్రతంత్రాదుల) ఉపదేశముచే వాగ్వైభవమును చూపగలిగిన దుర్బుద్ధి (మందబుద్ధి) ఔపదేశికుడు. "మొదటి రెండు తరగతులకును

చెందినవారు తంత్రమంత్రాద్యనుష్ఠానము చేయవలసిన పని లేదు. స్వభావతః మధుర మగు ద్రాక్షకు మామూలు బెల్లముతో చేయు సంస్కారము యొక్క ఆవశ్యకత ఉండదు కదా?" అని ఆచార్యుల అభిప్రాయము. "ఇట్లు చెప్పుట యుక్తము కాదు. ఒకే ప్రయోజనమును ఉద్దేశించి రెండు క్రియలు చేసినచో ఫలము రెట్టింపు లభించును కదా?" అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. "తేషాం పూర్వ పూర్వః శ్రేయాన్" ఇతి శ్యామదేవః యతః—

"సారస్వతః స్వతన్త్రః స్యాద్భవేదాభ్యాసికో మితః
ఔపదేశకవిస్త్వత్ర వల్గు ఫల్గు చ జల్పతి." 7

వ్యా. వీరిలో పూర్వపూర్వుడు గొప్పవాడు. ఔపదేశికునికంటె ఆహార్యబుద్ధి, ఆహార్యబుద్ధికంటె సారస్వతుడు గొప్పవాడు, అని శ్యామదేవుని అభిప్రాయము ఏలననగా—

"సారస్వతకవి స్వతంత్రుడై రచనలు చేయగలడు. అభ్యాసిక కవి కొన్ని పరిధులలో సీమితుడై, సీమితమైన రచనలు మాత్రమే చేయగలుగును. ఔపదేశికకవి పలుకులు సుందరములైననే ఉండును గాని సారరహితముగ ఉండును"

మూ. "ఉత్కర్షః శ్రేయాన్" ఇతి యాయావరీయః స చ అనేక గుణ సంనిపాతే భవతి. కిఞ్చ—

"బుద్ధిమత్త్వం చ కావ్యాఙ్గవిద్యాస్వభ్యాసకర్మ చ
కవేశ్చోపనిషచ్ఛక్తిస్త్రయమేకత్ర దుర్లభమ్." 8

"కావ్యకావ్యాఙ్గవిద్యాసు కృతాభ్యాసస్య ధీమతః
మన్త్రానుష్ఠాననిష్ఠస్య నేదిష్ఠా కవిరాజతా." 9

వ్యా. ఉత్కర్షము మంచిది. అని యాయావరీయుని అభిప్రాయము. అది (ఉతర్ష), అనేకగుణముల కలయికవలన కలుగును. అనగా సారస్వతాది భేదములను పట్టి కవుల తారతమ్యమును నిర్ణయించుట యుక్తము కాదు. అనేక సద్గుణములు ఎవనియందు కలిసి యుండునో అతడు ఉత్తముడు. ఆ గుణములు ఎట్లు వచ్చినవి అను విషయము అప్రధానములని అభిప్రాయము,

"కవికి—సహజబుద్ధి, కావ్యాంగము లగు విద్యల అభ్యాసము, మంత్ర తంత్రాదిజన్య మగు దైవశక్తి అనునవి ఆవశ్యకములు. ఈ మూడును ఒకని యందు లభించుట కష్టము."

"సహజబుద్ధి కలిగియుండి, కావ్యాంగవిద్యల అభ్యాసము చేయుచు, మంత్రానుష్ఠాననిష్ఠ గూడ కల కవికి కవిరాజత్వము అతి సమీపమున నుండును అనగా అట్టివాడు 'కవిరాజు' అగును."

మూ. కవీనాం తారతమ్యతస్త్వేష ప్రాయోవాదః.
"ఏకస్య తిష్ఠతి కవేర్గృహ ఏవ కావ్య
మన్యస్య గచ్ఛతి సుహృద్భవనాని యావత్.
న్యస్యావిదగ్ధవదనేషు పదాని శశ్వత్
కస్యాపి సఞ్చరతి విశ్వకుతూహలీవ" 10

వ్యా. కవులలో నున్న తారతమ్యమును బట్టి సాధారణముగ ఈ విధముగ చెప్పుట కలదు:-

"ఒక కవి రచించిన కావ్యము అతని ఇంటిలోనే ఉండును. మరొక కవి వ్రాసిన కావ్యము మిత్రుల గృహముల వరకును పోవును. ఒక్కొక్కని కవిత్వము, ప్రపంచయాత్ర చేయుటకు కుతూహలము కలదా అన్నట్లు, అవిదగ్ధుల (కావ్యరచనాపాటవము లేనివారి) ముఖములందు పదములను ఉంచుచు, ఎల్లప్పుడును పంచరించుచుండును. (అనగా ఈతని కవిత్వము ప్రచురప్రచారము కలదగుటచే కొంచమో, గొప్పగనో, సామాన్య విద్యావంతులు కూడ దీనిని చదువుచుందురు అందుచే వారి ముఖముపై పదములుంచి [పదములు అనగా అడుగులు అని కూడ అర్థము] ఇది విశ్వపరిభ్రమణము చేయును).

మూ. సేయం కారయిత్రీ. భావకస్యోపకుర్వాణా భావయిత్రీ. సా హి కవేః శ్రమమభిప్రాయం చ భావయతి. తయా ఖలు ఫలితః కవేర్వ్యాపార తరు-రన్యథా సోఽవకేశీ స్యాత్. "కః పునరనయోర్భేదో యత్కవిర్భావయతి భావకశ్చ కవిః" ఇత్యాచార్యాః. తదాహుః-

ప్రతిభాతారతమ్యేన ప్రతిష్ఠా భువి భూరిధా
భావకస్తు కవిః ప్రాయో న భజత్యధమాం దశామ్. 11

వ్యా. ఇంతవరకును చెప్పినది కారయిత్రి అను ప్రతిభ. భావకునికి ఉపకరించు ప్రతిభ భావయిత్రి. కవియొక్క వ్యాపార మనెడు వృక్షము ఈ భావయిత్రి ఉన్నపుడే ఫలించును. లేకున్నచో ఆ వృక్షము పుష్పఫలశూన్య మగును. "కవియైనవాడు భావన చేయవచ్చును. భావకుడు కవి కావచ్చును. అట్టి పరిస్థితిలో కవిభావకులకు గాని, భావయిత్రీకారయిత్రీరూపప్రతిభలకు గాని భేద మేమిః" అని ఆచార్యుల మతము. కావుననే ఇట్లు చెప్పబడినది—

"ప్రతిభాతారతమ్యమును బట్టి భూమిపై అనేక విధముల ప్రతిష్ఠ కలుగును. భావకు డైన కవి సాధారణముగ అధమదశను పొందడు."

మూ. 'న' ఇతి కాలిదాసః. 'పృథగేవ హి కవిత్వాద్భావకత్వమ్, భావకత్వాచ్చ కవిత్వమ్, స్వరూపభేదాద్విషయభేదాచ్చ. యదాహః—

"కశ్చిద్వాచం రచయితుమలం శ్రోతుమేవాపరస్తాం
కల్యాణి తే మతిరుభయథా విస్మయం నస్తనోతి.
న హ్యేకస్మిన్నతిశయవతాం సన్నిపాతో గుణానా-
మేకః సూతే కనకముపలస్తత్పరీక్షాక్షమోఽన్యః." 12

వ్యా. 'ఇట్లు చెప్పుట యుక్తము కాదు,' అని కాళిదాసు అభిప్రాయము. ఏలనన - కవిత్వ - భావకత్వముల స్వరూపము వేరు, వాటి విషయము కూడ వేరు. అందుచే కవిత్వముకంటె భావకత్వము భిన్న మైనది. కావుననే ఈ విధముగ చెప్పుచున్నారు:—

"ఒకడు వాక్కును (కవిత్వమును) రచించుటకు మాత్రమే సమర్థుడు; మరి యొకడు దానిని వినుటకు (విని అభినందించుటకు) మాత్రమే సమర్థుడు, ఉత్తమ మైన నీ బుద్ధి రెండు విధములుగను కూడ మాకు ఆశ్చర్యమును కలిగించుచున్నది. ఉత్తమ గుణములకు ఒకే స్థానమున కలయిక ఉండదు కదాః బంగారము ఉత్పత్తి చేసెడి శిల ఒకటి, దాని పరీక్షణము చేయు శిల మరియొకటి."

మూ. "తే చ ద్విధాఽరోచకినః సతృణాభ్యవహారిణశ్చ" ఇతి మఙ్గలః. 'కవయోఽపి భవన్తి' ఇతి వామనీయాః. 'చతుర్ధా' ఇతి యాయావరీయః; మత్సరిణః తత్త్వాభినివేశినశ్చ. "తత్ర వివేకినః పూర్వే; తద్విపరీతాస్తుతతోఽన్యతరాః" ఇతి వామనీయాః.

వ్యా. "వారు (భావకులు) అరోచకులు, సతృణాభ్యవహారులు అని రెండు విధములు" అని మంగళుని అభిప్రాయము. కవులలో కూడ అరోచకులు, సతృణాభ్యవహారులు అనురెండు విధములవా రుందు రని వామనమతానుయాయులు అందురు. మత్సరవంతులు, తత్త్వాభినివేశము (బాగుగ విమర్శించి యథార్థము కనుగొనవలె నను ఆస్థ) కలవారు అను మరి రెండు విధములు కూడ చేర్చుటచే నాలుగు విధము లని యాయావరీయుని అభిప్రాయము. గుణదోష వివేకము కలవారు అరోచకులు, అట్టి వివేకము లేనివారు సతృణాభ్యవహారులు అని వామనమతానుయాయులు చెప్పుదురు. (ఎంతటి ఉత్తమరచన నైనను అరోచకులు అంత తేలికగా మెచ్చరు. సతృణాభ్యవహారులు అన్నింటిని మెచ్చుకొందురు)

మూ "అరోచకితా హి తేషాం నైసర్గికీ జ్ఞానయోనిర్వా. నైసర్గికీం హి సంస్కారశతేనాపి వజ్రమివ కాలికాం తే న జహతి. జ్ఞానయోనౌ తు తస్యాం విశిష్టజ్ఞేయవతి వచసి రోచకితావృత్తిరేవ" ఇతి యాయావరీయః.

వ్యా. వారి అరోచకిత్వము (ఏ రచనను మెచ్చకుండుట) స్వభావ సిద్ధముగ నుండవచ్చును. లేదా జ్ఞానమువలన కలగవచ్చును. (అనగా అనేక గ్రంథపఠనవంతులగువారు అత్యుత్తమరచనలనే మెచ్చుకొందురు కాని అన్నింటిని మెచ్చుకొనరు). మొదటి తరగతికి చెందినవారు సహజసిద్ధ మగు అరోచకితను వంగము (సీసము) నలుపునువలె, ఎన్ని సంస్కారములు చేసినను విడువరు. కాని ఈ అరోచకిత జ్ఞానమువలన ప్రాప్తించిన దైనచో అట్టివారు విశిష్ట మగు జ్ఞేయము గల వాక్కునందు, అనగా ఉత్తమవిషయము గల రచన యందు, రోచకితనే కలిగి యుందురు. (దానిని మెచ్చుకొందురు) అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. కించ సతృణాభ్యవహారితా సర్వసాధారణీ తథా హిః వ్యుత్పిత్సోః కౌతుకినః సర్వస్య సర్వత్ర ప్రథమం సా. ప్రతిభావివేకవికలతా హి న గుణాగుణయోర్విభాగసూత్రం పాతయతి తతో బహు త్యజతి; బహు చ గృహ్ణాతి. వివేకానుసారేణ హి బుద్ధయో మధు నిష్యన్దన్తి పరిణామే తు యథార్థదర్శీ స్యాత్. విభ్రమభ్రంశశ్చ నిఃశ్రేయసం సన్నిధత్తే.

వ్యా. మరియు సత్పణాభ్యవహారిత అనునది (మొదట) అందరికిని సమముగ నుండును. ఏలననవ్యుత్పత్తి సంపాదించుకొనవలె నని అభిలషించు కుతూహలవంతునకు ప్రతివానికిని ప్రారంభమున అన్ని విషయములందును అది అనగా సత్పణాభ్యవహారిత, ఉండును. అనగా ప్రారంభదశలో అతడు ఒక్కటైన మిగల్చకుండ అన్ని విషయములను స్వీకరించును. ప్రతిభా వివేకములు లేకున్నచో ఇది గుణము, ఇది కాదు అనెడు విభాగము స్పష్టముగ తెలియదు. అటు పిమ్మట (కొంతకాలము ఈ విధముగ సత్పణాభ్యవహారిగ నున్న పిమ్మట) చాల విషయములను (నిస్సార మైనవాటిని) విడచి, (సారవంతము లగు) చాలవిషయములను గ్రహించును. బుద్ధులు వివేకానుసారముగా తేనె లొలుకును కదా ? ఈ విధముగ, బుద్ధి పరిణామము లభించిన తరువాత (బుద్ధి పరిపక్వమైన తరువాత) యథార్థమును గ్రహించును. భ్రాంతి తొలగిపోయినచో శ్రేయస్సు లభించును.

మూ. మత్సరిణస్తు ప్రతిభాతమపి న ప్రతిభాతమ్; పరగుణేషు వాచంయమత్వాత్. స పునరమత్సరీ జ్ఞాతా చ విరలః. తదుక్తమ్ :-

"క స్త్వం భోః ! కవిరస్మి కాప్యభినవా సూక్తిః సఖే పఠ్యతామ్
త్యక్తా కావ్యకథైవ సమ్ప్రతి మయా కస్మాదిదం శ్రూయతామ్.
యః సమ్యగ్వివినక్తి దోషగుణయోః సారం స్వయం సత్కవిః
సోఽస్మిన్ భావక ఏవ నాస్త్యథ భవేద్దైవాన్న నిర్మత్సరః" 18

వ్యా. మత్సరవంతుడు విషయమును గ్రహించినను గ్రహించనట్లే. ఏలనన అతడు పరగుణముల విషయమున వాక్సంయమముతో నుండును. (పరగుణములను ప్రశంసింపజాలడు.) గుణగ్రహణశక్తి యుండి మాత్సర్యము లేనివాడు చాల విరలముగ లభించును. కావుననే ఇట్లు చెప్పబడినది :-

"ఓయీ ! నీవెవరవు ?'' "కవిని''. "మిత్రమా ! ఏదైన ఒక క్రొత్త రచన చదువుము.'' "నేనీ మధ్య కావ్యము మాటయే విడిచిపెట్టినాను." "అదెందు వలన ?'' ''ఇదిగో చెప్పుచున్నాను; వినుము. తాను సత్కవియై యుండి గుణ దోషముల సారమును బాగుగ వివేచించి గ్రహింపగల భావకుడే ఈ నాడు లేడు. అథవా దైవవశముచే ఎవడైన ఒక డున్నను, అతడు మాత్సర్యహీనుడుగ ఉండడు.''

మూ. తత్త్వాభినివేశీ తు మధ్యేసహ సంయద్యేకః తదుక్తమ్:-
"శబ్దానాం వివినక్తి గుమ్ఫవిధీనామోదతే సూక్తిభిః
సాన్ద్రం లేఢి రసామృతం విచినుతే తాత్పర్యముద్రాం చ యః.
పుణ్యైః సంఘటతే వివేక్తృవిరహాదన్తర్ముఖం తామ్యతాం
కేషామేవ కదాచిదేవ సుధియాం కావ్యశ్రమజ్ఞో జనః." 14

వ్యా. కాని తత్త్వాభినివేశి (తత్త్వమును తెలుసుకొనవలె నని పట్టుదల కలవాడు) వేయిమందిలో ఒకడుండునేమో; కావుననే ఇట్లు చెప్పబడినది:-

"ఎవడు శబ్దముల గుంఫన విధానమును బాగుగ వివేచింపగలడో, సూక్తులను విని ఆనందించునో, దట్టమైన రసామృతమును ఆస్వాదించునో, తాత్పర్యముద్రను అన్వేషించి గ్రహించునో, కావ్యరచనలో నున్న శ్రమను గుర్తింపగలిగిన అట్టి జనుడు, మంచి వివేచకుడు లభింపకపోవుటచే లోలోననే కుములుచున్న బుద్ధిమంతులలో(కవులలో)ఏ కొలదిమందికో, ఎప్పుడో, పుణ్యములచే లభించును".

మూ. స్వామీ మిత్రం చ మన్త్రీ చ శిష్యశ్చాచార్య ఏవ చ.
కవేర్భవతి హీ చిత్రం కిం హి తద్యన్న భావకః. 15

వ్యా. కవికి భావకుడే స్వామి; మిత్రుడు; మంత్రి; శిష్యుడు; మరియు ఆచార్యుడు. కవికి భావకుడు ఏమి కాడు? ఏమి ఆశ్చర్యము? (కవికి సర్వవిధముల సహాయము చేయువాడు భావకుడే అని అర్థము).

మూ. కావ్యేన కిం కవేస్తస్య తన్మనోమాత్రవృత్తినా
నీయన్తే భావకైర్యస్య వ నిబన్ధా దిశో దశ. 16

వ్యా. "ఏ కవియొక్క రచనలను భావకులు పది దిక్కులందును వ్యాపింపచేతురో అట్టి కవియొక్క, మనస్సులో మాత్రమే ఉండెడు కావ్యముచే ఏమి ప్రయోజనము?"

మూ. సన్తి పుస్తకవిన్యస్తాః కావ్యబన్ధా గృహే గృహే.
ద్విత్రాస్తు భావకమనః శిలాపట్టనికుట్టితాః. 17

వ్యా. పుస్తకలిఖితము లగు కావ్యబంధములు ఇంటింటనుఉన్నవి (ఉండ వచ్చును.) భావకుల మనస్సు లనెడు శిలాఫలకములపై చెక్కినవి మాత్రము

రెండు - మూడే ఉండును.

మూ. సత్కావ్యే విక్రియాః కాశ్చిద్భావకస్యోల్లసన్తి తాః
సర్వాభినయనిర్ణీతా దృష్టా నాట్యసృజా న యాః. 18

వ్యా. సత్కావ్యమునందు;(సత్కావ్యపఠనసమయమునందు), భావకునకు ఒకానొక విధమైన, అనగా వర్ణింపశక్యము కాని, మానసవికారములు కలుగును. అనేకవిధము లగు అభినయములను నిర్ణయించునపుడు, నాట్యశాస్త్రనిర్మాత యగు భరతుడు కూడ, వాటిని గూర్చి ఊహించియుండలేదు.

మూ. వాగ్భావకో భవేత్కశ్చిత్కశ్చిద్ధృదయభావకః
సాత్త్వికైరాఙ్గికైః కైశ్చిదనుభావైశ్చ భావకః. 19

వ్యా. భావకులలో కొందరు (అహో! ఓహో! మొదలైన) మాటలద్వారా భావప్రకటన చేయుదురు. కొందరు హృదయమునందే భావన చేయుదురు. మరికొందరు, సాత్త్వికభావముల ద్వారా, అంగికచేష్టల ద్వారా, అనుభావముల ద్వారా భావావిష్కరణము చేయుదురు.

మూ. గుణాదానపరః కశ్చిద్దోషాదానపరోఽపరః
గుణదోషాహృతిత్యాగపరః కశ్చన భావకః 20

వ్యా. ఒకడు గుణములను స్వీకరించుటయందు ఆసక్తి కలవాడు. మరి యొకడు దోషములను గ్రహించుటయందు ఆసక్తుడు. మూడవరకమైన భావకుడు గుణగ్రహణదోషపరిత్యాగములందు ఆసక్తి కలవాడు.

మూ. అభియోగే సమానేఽపి విచిత్రో యదయం క్రమః
తేన విద్మః ప్రసాదోఽత్ర నృణాం హేతురమానుషః 21

వ్యా. భావుకు లందరును కావ్యార్థభావన చేయుటకై ప్రయత్నము చేయు చుండుట సమానమే యైనను వారిలో, పైన చెప్పినవిధమున, విచిత్రపద్ధతులు కానవచ్చుచున్నవి. దీనిని బట్టి, ఆయా వ్యక్తుల సంపాదించుకొనిన ఒకానొక దివ్య ప్రసాదమే దీని కంతకును హేతు వని తెలుసుకొను చున్నాము.

మూ. న నిసర్గకవిః శాస్త్రే న శుద్ధః కవతే చ యః.
విదమ్బయతి సాత్మానమాగ్రహాగ్రహిలః - కిం.- 22

వ్యా. ఎవడు సహజకవి కాడో, ఎవడు శాస్త్రము నందు పరినిష్ఠిత జ్ఞానవంతుడు కాడో, అట్లయినను కవితారచన చేయుచుండునో, అట్టివాడు కేవలము మొండి పట్టుదలతో తనను తాను పరిహాసపాత్రమునుగా చేసికొనుచున్నాడు. (సః + ఆత్మానమ్ "సోచిలోపేచేత్పాదపూరణమ్" అను సూత్రముచే సులోపము.)

మూ. కవిత్వం న స్థితం యస్య కావ్యే చ కృతకౌతుకః
తస్య సిద్ధిః సరస్వత్యాస్తన్త్రమన్త్రప్రయోగతః. 22

వ్యా. సహజ కవితాశక్తి లేకపోయినను కావ్యము రచింపవలె నని ఆసక్తి కలవానికి సరస్వతీ తంత్రమంత్రముల ప్రయోగము వలన సిద్ధి లభించును.

మూ. పదాన్తరం వేత్తి సుధీః స్వవాక్య పరవాక్యయోః
తదా స సిద్ధో మన్తవ్యః కుకవిః కవిరేవ వా. 23

వ్యా. కుకవి యైనను కవియైనను ఒక కవి ఎపుడు తన వాక్యమునందును, పరుల వాక్యమునందును ప్రయోగించిన పదముల తారతమ్యమును గ్రహింపగలుగునో, అపుడు అతడు సిద్ధుడు(కవితాసిద్ధి కలవాడు) అని గ్రహింపవలెను.

వి. యదాన్తరం అను పాఠము యుక్తము "ఎపుడు స్వపరరచనలలోని తారతమ్యమును గ్రహించునో" అని యర్థము.

మూ. కారయిత్రీ భావయిత్ర్యావితీమే ప్రతిభాభిదే.
అథాతః కథయిష్యామో వ్యుత్పత్తిం కావ్యమాతరమ్ 24

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే చతుర్థోఽధ్యాయః పదవాక్యవివేకః కావ్యవిశేషేషు కారయిత్రీ భావయిత్రీ నామ సమీక్షా.

వ్యా. ఇవి (ఇంతవరకును నిరూపిత మైనవి) కారయిత్రి భావయిత్రి అను ప్రతిభా భేదములు. ఇక ఇటుపైన కావ్యమాత యైన వ్యుత్పత్తిని గూర్చి చెప్పెదము.

బాలానందినిలో చతుర్థాధ్యాయము సమాప్తము.

పఞ్చమోధ్యాయః :- వ్యుత్పత్తిః కావ్యపాకశ్చ.

మూ. "బహుజ్ఞతా వ్యుత్పత్తిః" ఇత్యాచార్యాః. సర్వతోదిక్కా హి కవి వాచః. తదుక్తమ్ :-

ప్రసరతి కిమపి కథఞ్చన నాభ్యస్తే గోచరే వచః కస్య
ఇదమేవ తత్కవిత్వం యద్వాచః సర్వతోదిక్కాః. 1

వ్యా. అనేక విషయములు తెలిసి యుండుటకు వ్యుత్పత్తి యని పేరు అని ఆచార్యుల అభిప్రాయము. కవుల వాక్కులు సర్వతోముఖములుగ (అన్ని విషయములకు సంబంధించినవిగ) ఉండును కదా ? కావుననే ఇట్లు చెప్పబడి యున్నది :-

"అలవాటైన విషయమున, ఏదియో విధముగ, ఏ కొంచెముగనో, ఎవనివాక్కు. బ్రసరించకుండ ఎట్లుండును. (అలవాటుగా తెలిసిన విషయమును గూర్చి ప్రతి యొక్కరును ఏ కొంచెమో వ్రాయ గలిగియే యుందును. అందులో విశేష మేమియు లేదు) వాక్కులు సర్వతోముఖములుగ నుండుటయే, అనగా అనేక విషయములకు సంబంధించి యుండుటయే సత్కవిత్వమునకు లక్షణము."

మూ. 'ఉచితానుచితవివేకో వ్యుత్పత్తిః'' ఇతి యాయావరీయః ప్రతిభా వ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసీ ఇత్యానన్దః. సా హి కవేరవ్యుత్పత్తికృతం దోషమశేష మాచ్ఛాదయతి, తదాహ :-

"అవ్యుత్పత్తికృతో దోషః శక్త్యా సంవ్రియతే కవేః.
యస్త్వశక్తికృతస్తస్య ఝగిత్యేవావభాసతే." 2

శక్తిశబ్దవాచ్యముపచరితః ప్రతిభానే వర్తతే.

"ఏతత్కిం శిరసి స్థితం మమ పితుః? ఖణ్డం సుధాజన్మనో
లాలాటం కిమిదం? విలోచనమిదం, హస్తేఽస్య కిం? పన్నగః.
ఇత్థం క్రౌఞ్చరిపోః క్రమాదుపగతే దిగ్వాససః శూలినః
ప్రశ్నే వామకరోపరోధసుభగం దేవ్యాః స్మితం పాతు వః. 3

వ్యా. వ్యుత్పత్తి యనగా ఉచితానుచితవివేక మని యాయావరీయుని అభిప్రాయము. ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ ఉత్తమమైనది అని ఆనందవర్ధనుడు

చెప్పినాడు అది అవ్యుత్పత్తిచేత కవికి కలిగిన లోపమును పూర్తిగ అచ్ఛాదించును. ఆ విషయమునే చెప్పియున్నాడు:-''కవికి వ్యుత్పత్తి లేని లోపము శక్తిచేత కప్ప బడును కాని శక్తి లేకపోవుటచే కలిగిన దోషము మాత్రము వెంటనే కనబడి పోవును.'' (ఈ శ్లోకము ధ్వన్యాలోకములోనిది).

ఇచట 'శక్తి' శబ్దము ఉపచారముచే (గౌణప్రయోగముచే) ప్రతిభ అను నర్థమున ప్రయుక్తమైనది. (ప్రతిభకు ఉదాహరణము) :-

''నా తండ్రి శిరస్సుపై నున్నది ఇది ఏమి?'' ''చంద్రకళ''. ''లలాట ముపై నున్నది ఏమి?'' ''ఇది నేత్రము''. ''ఈయన హస్తమున ఇది ఏమి?'' ''అది సర్పము''. ''ఈవిధముగ దిగంబరుడైన ఈశ్వరుని విషయమున (బాలుడైన) కుమారస్వామియొక్క ప్రశ్న క్రమముగ వచ్చుచుండగా, ఎడమ చేతితో నతని నోరు మూయుట ద్వారా ఆ ప్రశ్నను అడ్డుకొనుటచే సుందరముగ నున్న, పార్వతియొక్క చిరునవ్వు మిమ్ములను రక్షించుగాక.''

వి. ఇచట కుమారస్వామి పార్వతుల నడుమ జరిగిన ప్రశ్నోత్తరముల వర్ణనము అనుచితముగ నున్నది గాన ఇందు కొంతవరకు కవియొక్క వ్యుత్పత్తి (యాయావరీయమత ప్రకారము) కొరతపడినది. కాని ప్రతిభచే ఆ ప్రశ్నోత్తర ముల కొక క్రొత్త మలుపు ఏర్పరచి కవి ఇచట కావ్యసౌందర్య మంతగ చెడకుండ చేసినాడు.

మూ. ''వ్యుత్పత్తిః శ్రేయసీ'' ఇతి మంగళః. సా హి కవేరశక్తికృతం దోషమశేషమాచ్ఛాదయతి. తథాహి :-

''కవేః సంవ్రియతేఽశక్తిర్వ్యుత్పత్త్యా కావ్యవర్త్మని.
వైదగ్ధీచిత్త (త్ర) చిత్తానాం హేయా శబ్దార్థగుమ్ఫనా.'' 4

వ్యా. ''(ప్రతిభావ్యుత్పత్తులలో) వ్యుత్పత్తి గొప్పది'' అని మంగళుని అభిప్రాయము. అది కవికి శక్తి లేని లోపము నంతను పూర్తిగ కప్పివేయును. ఈ విషయమే ఇట్లు చెప్పబడినది.

''కావ్యమార్గమున, కవి యొక్క అశక్తి వ్యుత్పత్తిచేత కప్పివేయ బడును. వైదగ్ధిచే (వ్యుత్పత్తిచే) చిత్రిత మగు మనస్సు కల పాఠకులకు

(ప్రతిభాకృత మగు) శబ్దార్థగుంఫన హేయమైనది." అనగా కవియొక్క వ్యుత్పత్తిచే ఆకృష్టచిత్తు లగు పాఠకులు, ప్రతిభాకృత మగు శబ్దార్థగుంఫన విషయమున అంతగా ఆదరము చూపరు.

మూ వ్యుత్పత్తిర్యథా :-

కృతః కణ్ఠే నిష్కో న హి కిముత తస్మిం మణిలతా
కృశం లీలాపత్రం శ్రవసి నిహితం కుణ్డలముచి.
న కౌశేయం చిత్రం వసనమవదాతం తు వసితం
సమాసన్నీభూతే నిధువనవిలాసే వనితయా. 6

వ్యా. వ్యుత్పత్తికి ఉదాహరణ మెట్లనగా—

"సురత విలాస సమయము ఆసన్న మైనపుడు, వనిత, కంఠమున సువర్ణాభరణమును ధరింపక సన్నని మణిలతను ధరించెను. కుండలములు తీసి వేసిన శ్రవణములందు సన్నని విలాసార్థ మైన పత్రము ఉంచెను పట్టు వస్త్రమును ధరింపక తెల్లని వస్త్రమును ధరించెను."

వి. ఇచట శబ్దార్థగుంఫనలో అంతగా సౌందర్యము లేకున్నను, సురతానుకూల వేషధారణ వర్ణనము ఔచిత్యజ్ఞాన సముచిత మగుటచే కవికి గల వ్యుత్పత్తిని సూచించుచున్నది.

మూ. "ప్రతిభావ్యుత్పత్తీ మిథః సమవేతే శ్రేయస్యౌ" ఇతి యాయావరీయః. న ఖలు లావణ్యలాభాదృతే రూపసమ్పత్, ఋతే రూపసమ్పదో వా లావణ్యలబ్ధిర్మహతే సౌందర్యాయ.

వ్యా ప్రతిభావ్యుత్పత్తులు రెండును ఒకదానితో ఒకటి కలిసి యున్నచో మంచిది. అని యాయావరీయుని అభిప్రాయము. లావణ్యము లేనిచో రూపసంపద గాని, రూపసంపద లేనిచో లావణ్యము గాని సౌందర్యజనకము కాజాలదు కదా?

వి. ముత్యములలోని కాంతి వలె, శరీరము నందంతటను కనబడు ఒక విధమగు నిగారింపు లావణ్యము. వివిధము లగు అవయవముల సంఘటనము నిర్దుష్టముగ నుండుట రూపము. ఈ రెండింటి కలయిక వలన లభించునది సౌందర్యము.

మూ. ఉభయయోగో యథా :-

జఙ్ఘాకాణ్డోరునాలో నఖకిరణలసత్కేసరాలీ కరాలః
ప్రత్యగ్రాలక్తకాభా ప్రసరకిసలయో మఞ్జుమఞ్జీరభృఙ్గః.
భర్తుర్నృత్యానుకారే జయతి నిజతనుస్వచ్ఛ లావణ్యవాపీ
సమ్భూతామ్భోజశోభాం విదధదభినవో దణ్డపాదో భవాన్యాః. 6

వ్యా. ప్రతిభావ్యుత్పత్తుల సంమేళనమునకు ఉదాహరణ మెట్లనగా:-

"భర్త యొక్క (శివుని యొక్క) నృత్యమును అనుకరించుచు (పార్వతి) అభినయము చేయుటవలన(చేయునపుడు), కాలు అనెడు పెద్దదైన కాడకలదియు, నఖ కిరణము లనెడు ప్రకాశించుచున్న కింజల్కములచే వ్యాప్తమైనదియు, అప్పుడే పెట్టిన లత్తుక యొక్క కాంతి ప్రసారమనెడు చిగుళ్లు కలదియు, మృదువైన(మధురధ్వని చేయుచున్న) అందెలయే తుమ్మెదగా కలదియు, (ఈ విధముగ) తన శరీరము యొక్క స్వచ్ఛమైన లావణ్యమనెడు దిగుడు బావియందు పుట్టిన పద్మము యొక్క శోభను కల్పించుచున్న పార్వతీదేవి యొక్క దండ పాదము సర్వోత్కృష్టముగ నున్నది."

వి నూపురముతో కూడిన పాదమును దండమును దాచినట్లు శీఘ్రముగ దాచినచో అది దండపాదము. "నూపురం చరణం కృత్వా దణ్డపాదం ప్రసారయేత్. క్షిప్తావిద్ధకరం చైవ దణ్డపాదం తదుచ్యతే" అని నాట్యశాస్త్రము (4.148). ఈ విధముగా శాస్త్రవ్యుత్పత్తియు, ఉచితపదాది ప్రయోగముచే దేవీ నృత్యమును వర్ణించుట ద్వారా ప్రతిభయు ఇచట చూపబడినవి. ఇది చండీశతకములోని పద్య మని కావ్యప్రకాశాదులలో నాగేశాదులు చెప్పినారు కాని కావ్యమాలా ప్రచురిత మగు చండీ శతకములో ఈ శ్లోకము లేదు.

మూ. ప్రతిభావ్యుత్పత్తిమాంశ్చ కవిః కవిరిత్యుచ్యతే.స చ త్రిధా-శాస్త్రకవిః, కావ్యకవిః, ఉభయకవిశ్చ. "తేషాముత్తరోత్తరో గరీయాన్" ఇతి శ్యామదేవః. 'న' ఇతి యాయావరీయః, యథా స్వవిషయే సర్వోగరీయాన్. న హి రాజహంసశ్చన్ద్రికాపానాయ ప్రభవతి; నాపి చకోరోఽద్భ్యః క్షీరోద్ధరణాయ, యచ్ఛాస్త్రకవిః కావ్యే రససమ్పదం విచ్ఛినత్తి, యత్కావ్యకవిః శాస్త్రే తర్కకర్కశమప్యర్థ ముక్తివైచిత్త్యేణ శ్లథయతి. ఉభయకవిస్తూ భయోరపి వరీయాన్ యద్యుభయత్ర పరం ప్రవీణః స్యాత్. తస్మాత్తుల్య ప్రభావావేవ శాస్త్రకావ్య కవీ.

వ్యా. ప్రతిభావ్యుత్పత్తులు రెండును ఉన్న కవియే కవియని చెప్పబడును అట్టి కవి – శాస్త్రకవి. కావ్యకవి ఉభయకవి అని మూడు విధములు, ' వీరిలో ఉత్తరోత్తరుడు (మొదటివానికంటె రెండవవాడు, రెండవవానికంటె మూడవ వాడు) గొప్పవాడు'' అని శ్యామదేవుని అభిప్రాయము అది అట్లు కాదని యాయావరీయుని అభిప్రాయము. అది యెట్లనగా – తన తన విషయమున ప్రతి ఒక్కరు గొప్పవాడే. రాజహంస చంద్రికాపానము చేయజాలదు; చకోరము నీటి నుండి పాలను వేరుచేయజాలదు. శాస్త్రకవి (యథాశాస్త్రముగ రచన జేయుటచే) కావ్యమునందు రససంపదను శోభాయుక్తము చేయును. కావ్యకవి, శాస్త్రమునందు తర్కకర్కశమగు విషయమును గూడ ఉక్తివైచిత్ర్యముచే శిథిలముగ (కాఠిన్య రహితముగ) చేయును. అటు శాస్త్రమునందును, ఇటు కావ్యమునందును మంచి ప్రావీణ్యము సంపాదించినయెడలనే ఉభయకవి శాస్త్రకావ్యములు రెండిటియందును గొప్పవాడగును. కావున శాస్త్రకవియు కావ్యకవియు గూడ సమానమైన ప్రభావము కలవారే. (వారిలో తారతమ్యము ఎంచవలసిన పని లేదు)

మూ. ఉపకార్యోపకారకభావం తు మిథః శాస్త్రకావ్యకవ్యోరనుమన్యామహే యచ్ఛాస్త్రసంస్కారః కావ్యమనుగృహ్ణాతి; శాస్త్రైకప్రవణతా తు నిగృహ్ణాతి. కావ్యసంస్కారోఽపి శాస్త్రవాక్యపాకమనురుణద్ధి; కావ్యైకప్రవణతా తు విరుణద్ధి.

వ్యా. శాస్త్రకావ్య-కావ్యకావ్యములకు పరస్పరము ఉపకార్యోపకారకభావమును అంగీకరింతుము. ఏలనన శాస్త్రసంస్కారము కావ్యమును అనుగ్రహించును. (శాస్త్రసంస్కారము కొంతవరకు ఉన్నచో దానివలన కావ్యమునకు శోభ లభించును) కేవలము శాస్త్రదృష్టి ఒక్కటియే ఉన్నచో, అది కావ్యమును నిగ్రహించును (కావ్యశోభను తగ్గించును) అట్లే కావ్యసంస్కారము శాస్త్రవాక్యపాకమునకు అనుగుణముగ నుండి దానికి ఉపకరించును. కేవలము కావ్యదృష్టికి మాత్రమే ఎక్కువ ప్రాధాన్య మిచ్చినచో అది శాస్త్రవాక్యపాకమునకు విరుద్ధముగ నుండును.

మూ. తత్ర త్రిధా శాస్త్రకవిః :- యః శాస్త్రం విధత్తే, యశ్చ శాస్త్రే కావ్యం సంవిధత్తే; యోఽపి కావ్యే శాస్త్రార్థం నిధత్తే. కావ్యకవిః పునరష్టధా- తద్యథా రచనాకవిః, శబ్దకవిః, అర్థకవిః, అలఙ్కారకవిః, ఉక్తికవిః, రసకవిః, మార్గకవిః, శాస్త్రార్థకవిరితి.

వ్యా. శాస్త్రమును రచించువాడు, (ఆనందవర్ధనాదులు) శాస్త్రమునందు కావ్యమును కూర్చువాడు (పండితరాజాదులు) కావ్యమునందు శాస్త్రార్థమును కూర్చువాడు (భట్టి పభృతులు) అని శాస్త్రకవి మూడు విధములు. అట్లే- రచనా కవి, శబ్దకవి, అర్థకవి, అలఙ్కారకవి, ఉక్తికవి, రసకవి, మారకవి, శాస్త్రార్థ కవి అని కావ్యకవి కూడ ఎనిమిది విధములు.

మూ తత్ర రచనాకవిః :-

లోలల్లాఙ్గూలవల్లీవలయితవకులానోకహస్కన్ధగోలై -
ర్గోలాఙ్గూలైర్నదద్భిః ప్రతిరసితజరత్కన్దరామన్దిరేషు
ఖణ్డేషూద్దణ్డపిణ్డీతగరతరలకాః ప్రాపిరే యేన వేలా -
మాలమ్బ్యోత్తాలతల్లస్ఫుటితపుటకినీబన్ధవో గన్ధవాహాః 7

వ్యా. అందు రచనాకవి యెట్లనగా :-

"ఎవనిచే సముద్రతీరమును దాటి కదలుచున్న లాంగూలవల్లులచే (లతలవంటి తోకలచే) చుట్టబడిన వకులవృక్షముల గుంపని ప్రాణులు కల, ధ్వనిచేయుచున్న గోలాంగూలములచే (కొండముచ్చులచే) ప్రతిధ్వనించుచున్న అతిపురాతనమైన గుహామందిరములు గల ద్వీపములయందు, తీవ్రమైన పిండీ-తగర-తరలకవృక్షములుకలవియు (అవృక్షములమీదుగా వచ్చుచున్నవి) అత్యుద్ధతము లగు (ఉత్తాల) సరస్సుల (తల్ల :) లో వికసించినపద్మసమూహముల (పుటకినీ) బంధువులైనవియు అగు వాయువులు పొందబడినవో"

వి ఈ శ్లోకమునందు కేవలము శబ్దానుప్రాసముకొరకై అనేకనిరర్థక శబ్దములు — అనావశ్యకశబ్దములు, ప్రయోగించబడినవి. ఈ విధముగ శ్లోకరచనామాత్రమునందే దృష్టి కలవాడగుటచే ఈ కవి రచనాకవి.

మూ. త్రిధా చ శబ్దకవిర్నామాఖ్యాతార్థభేదేన తత్ర నామకవిః —

విద్యేవ పుంసో మహిమేవ రాజ్ఞః
ప్రజ్ఞేవ వైద్యస్య దయేవ సాధోః.
లజ్జేవ శూరస్య మృజేవ యూనో
విభూషణం తస్య నృపస్య సైవ 8

వ్యా. నామకవి, ఆఖ్యాతకవి, అర్థకవి అను భేదములచే కవి మూడు విధములు. వారిలో నామకవి ఎట్లనగా :-

"పురుషునకు విద్య వలె, రాజుకు మహిమ వలె (ప్రభుత్వము వలె), వైద్యునకు (లేదా పండితునకు) ప్రజ్ఞ వలె, సత్పురుషునకు దయ వలె, శూరునకు లజ్జ వలె, యువకునకు స్నిగ్ధశరీరకాంతి వలె, ఆ రాజునకు ఆమెయే అలంకారము."

వి. ఈ శ్లోకమున అన్నియు నామవాచకములే ప్రయోగింపబడినవి తిఙంతపద మొక్కటి యైనను ప్రయుక్తము కాదు. అందుచే ఈ కవి 'నామకవి.'

మూ. ఆఖ్యాతకవిర్యథా :-

ఉచ్చైస్తరాం జహసురాజహృషుర్జగర్జు
రాజమ్నిరే భుజతటీనికరైః స్ఫురద్భిః.
సన్తుష్టువుర్ముముదిరే బహుమేనిరే చ
వాచం గురోరమృతసమ్భవలాభగర్భామ్. 9

వ్యా. ఆఖ్యాతకవి ఎట్లనగా —

"అమృతము జనించిన దను విషయమును తెలిపెడు బృహస్పతియొక్క వాక్యమును (విని). (దేవతలందరును ఆనందపారవశ్యముచే) బిగ్గరగా నవ్విరి. సంతోషించిరి; గర్జించిరి, జబ్బలుచరచుకొనిరి. స్తుతించిరి; ఆనందించిరి; గౌరవించిరి"

ఈ శ్లోకమున అనేక తిఙంతపదములను ప్రయోగించి ఒక విధముగ శోభను కూర్చుటచే ఈ కవి 'ఆఖ్యాతకవి'. ఆఖ్యాత మనగా తిఙంతపదము.

మూ. నామాఖ్యాతకవిః :-

హతత్విషోన్ధాః శిథిలాంసబాహవః
స్త్రి (స్త్రి) యో విషాదేన విచేతనా ఇవ.
న చుక్రుశుర్నో రురుదుర్న సస్వను
ర్న చేలురాసుర్లిఖితా ఇవ క్షణమ్. 10

వ్యా. నామాఖ్యాతకవికి ఉదాహరణము :-

"నశించిన కాంతికలవారై, అంధలై శిథిలమైన భుజబంధము గల బాహువులు కలవారై, స్త్రీలు, దుఃఖముచే చైతన్యరహితులు వలె అయి, ఆక్రో

శించలేదు; ఏడవలేదు; ధ్వని చేయలేదు, చలించలేదు; క్షణకాలము పాటు వ్రాసిన బొమ్మల వలె ఉండపోయిరి."

వి. ఈ శ్లోకములో పూర్వార్థమున నామ ప్రయోగము, ఉత్తరార్థమున అఖ్యాత ప్రయోగము చక్కగ చేయుటచే ఈ కవి 'నామాఖ్యాతకవి.'

మూ. అర్థకవిః -

దేవీ పుత్రమసూత నృత్యత గణాః కిం తిష్ఠతేత్యుద్భుజే
హర్షాద్ భృంగిరిటావుదాహృతగిరా చాముణ్డయాలిఙ్గితే.
పాయాద్వోజితదేవదున్దుభిఘనధ్వానప్రవృత్తస్తయో -
రన్యోన్యాఙ్గనిపాతజర్జరజరత్ స్థూలాస్థిజన్మా రవః ॥ 11

"దేవి కుమారుని కన్నది. ఓ! ప్రమథులారా! కూర్చున్నా రేమి? నాట్యము చేయండి" అని పలుకుచు ఆనందముతో చేతు లెత్తి నాట్యము చేయుచున్న భృంగిరిటి (ప్రమథగణనాయకులలో ఒకడు)ఆ వాక్యమునే మరల పలికిన చాముండచే (సప్తమాతృకలలో ఒకతె) కౌగలించుకొనబడినవా డగుచుండగా దేవ దుందుభుల ఘనధ్వని ప్రసారమును కూడ జయించినదై, వారిరువురు ఒండొరులను ఢీకొనటచే కలసినవియు, జర్జరములు, జీర్ణములును అగు స్థూలము లగు ఎముకల (కంఠమాలగా ధరించిన ఎముకల) నుండి కలిగిన ధ్వని మిమ్ములను రక్షించు గాక".

వి ఇచట ఈ కవి నామముల ప్రయోగమునకు గాని, అఖ్యాత ప్రయోగమునకు గాని అంతగ ప్రాధాన్య మీయక చమత్కార జనక మగు అర్థమును కూర్చుటయందే ఆసక్తి చూపి యున్నాడు గాన ఇతడు 'అర్థకవి'.

న ప్రాప్తం విషమరణం ప్రాప్తం పాపేన కర్మణా విషమరణమ్
న మృతో భాగీరథ్యాం మృతోఽహము పగూహ్య మన్దభాగీ రథ్యామ్. ॥ 12

వ్యా. శబ్దాలంకారకవి, అర్థాలంకారకవి అను భేదముచే అలంకారకవి రెండు విధములు. వారిలో శబ్దాలంకార కవి ఎట్లనగా :-

"విషమరణము అనగా భయంకర మైన యుద్ధము, పొందబడలేదు. పాపకర్మచేత విష-మరణము, అనగా విషముచే మరణము పొందబడినది. నేను

భాగీరథిలో మరణింపలేక పోయితిని. మన్దభాగి నైన, అనగా దురదృష్టవంతుడ నైన, నేను వీథిని కౌగలించుకొని మరణించితిని- మరణించుచున్నాను.''

వి. ఇచట విషమరణమ్ 'భాగీరథ్యామ్' అను పదముల ఆవృత్తిచే (యమక) శబ్దాలంకారము ఉపయుక్త మైనది. కావున ఈ కవి శబ్దాలంకార కవి.

మూ. అర్థాలఙ్కారః :-

భ్రాన్త జిహ్వాపతాకస్య ఫణచ్ఛత్రస్య వాసుకేః.
దంష్ట్రాశలాకాదారిద్ర్యం కర్తుం యోగ్యోఽస్తి మే భుజః. 18

వ్యా. అర్థాలంకార కవి :-

''తిరుగుచున్న (ఎగురుచున్న) జిహ్వలే పతాకలుగా కలవాడును పడగయే ఛత్రముగా కలవాడును అగు వాసుకికి కోర లనెడు శలాకలు (ఛత్రము నందున్న ఊచలు) లేకుండ చేయగల శక్తి నా భుజమున కున్నది.''

వి. 'జిహ్వాపతాక' 'ఫణచ్ఛత్ర' 'దంష్ట్రాశలాక' శబ్దములలో రూపకాలంకారములు. వాటిచే వాసుకి చక్రవర్తి యను నర్థము ప్రతీత మగుచున్నది. ఈ విధముగ అర్థాలంకారములను కూర్చుటచే ఇతడు అర్థాలంకార కవి.

మూ. ఉక్తి కవిః—

ఉదరమిదమనిన్ద్యం మానినీశ్వాసలావ్యం
స్తనతటపరిణాహో దోర్లతాలేహ్యసీమా.
స్ఫురతి చ వదనేన్దు ర్దృక్ప్రణాలీనిపేయ
స్తదిహ సుదృశి కల్యాః కేలయో యౌవనస్య. 14

వ్యా. ఉక్తికవికి ఉదాహరణము:-

''నిర్దుష్ట మగు ఈ ఉదరము మానినియొక్క శ్వాసలచేత కూడ తెగిపోవును. స్తనతటవైశాల్యము బాహులతలచే నాకతగిన (స్పృశింపదగిన) సరిహద్దులు (ప్రాంతములు) కలది. ముఖపద్మము నేత్రము లనెడు గొట్టములచే త్రాగుటకు వీలుగ నున్నది. ఈ విధముగ ఈ వనితయందు యౌవన విలాసలు మాదకములుగ నున్నవి''

వి. ఈ శ్లోకములో- ఉదరము శ్వాసతగిలినంతనే తెగిపోవుననియు, స్తనవైశాల్యము చేతులను ఒరచుకొనుచున్న దనియు, ముఖచంద్రుని నేత్రములతో త్రాగవచ్చు ననియు చెప్పుటలో చమత్కార మున్నది గాన ఈ కవి ఉక్తికవి.

మూ. యథా వా:-

ప్రతీచ్ఛత్యాశోకీం కిసలయపరావృత్తిమధరః
కపోలః పాణ్డుత్వాదవతరతి తాడీపరిణతిమ్.
పరిమ్లానప్రాయామనువదతి దృష్టిః కమలినీ
మితీయం మాధుర్యం స్పృశతి చ తనుత్వం చ భజతే. 15

వ్యా. మరి యొక ఉదాహరణ మెట్లనగా-

"అధరోష్ఠము అశోకవృక్షసంబంధ మైన కిసలయపరావృత్తిని ఎదురు చూచుచున్నది. గండస్థలము తెల్లగా నుండుటచే తాటిదళముయొక్క పరిణామమును పొందుచున్నది దృష్టి ఎక్కువగా వాడిపోయిన పద్మలతను అనుకరించుచున్నది. ఈ విధముగ ఈమె మాధుర్యమును స్పృశించుచు. కృశత్వమును కూడ పొందుచున్నది."

వి. ఇది విరహావస్థావర్ణన మై యుండును. పరావృత్తి యనగా ఒక వస్తువు నిచ్చి మరి యొక వస్తువును గ్రహించుట ఇది సమమూల్యాదు లగు వస్తువులందే కుదురును. అధరము పూర్వము అశోకప్రవాళము కంటె ఎర్రగా నుండెడిది. ఇప్పుడు ఎరుపు తగ్గుటచే ఆ అశోకప్రవాళముతో వినిమయము చేయుటకు తగినదిగ ఉన్నది తాళీపరిణతి యనగా తాటిమొవ్వులోని ఆకుయొక్క పరిణామ మని యర్థము.

ఇచట గూడ విషయమును చెప్పెడు విధానములో చమత్కార ముండుటచే ఈ కవి ఉక్తికవి. దండి - భోజరాజాదుల మతము ప్రకారము ఇట్టి రచనలలో సమాధి యను గుణముండును. లోకమర్యాదానుసారముగా కవి ఒకదాని ధర్మములను మరొకదానియందు ఆరోపించుట సమాధి అని దండి చెప్పిన సమాధిలక్షణము. "అన్యధర్మ స్తతోన్యత్ర లోకసీమానురోధినా సమ్యగాధీయతే యత్ర స సమాధిః స్మృతో యథా" (కావ్యాదర్శము I ౯౩.) ఈ సమాధిగుణము కావ్యసర్వస్వ మని దండి అభిప్రాయము. "తదేత త్కావ్యసర్వస్వం సమాధిర్నామ

యో గుణః. కవిసార్థః సమగ్రోఽపి తమేన మనుగచ్ఛతి'' (కావ్యాదర్శము. I 100). పై రెండు శ్లోకములలో 'శ్వాసలావణ్యమ్' 'లేహ్యాసీమా' 'ద్యుకస్త్రిణాలీ నిపేయః' 'అధరః ప్రతిచ్ఛతి' ఇత్యాదులు అన్యధర్మముల అన్యత్రారోపణమునకు ఉదాహరణము కోలాదు-''సమాధిః సోఽన్యధర్మాణాం యదన్యత్రాధిరోపణమ్'' అని సమాధిలక్షణము చెప్పి 'ప్రతీచ్ఛత్యాశోకీమ్' ఇత్యాదిశ్లోకమును ఉదాహరణముగ చూపినాడు.

మూ. రసకవిః-

ఏతాం విలోకయ తనూదరి తామ్రపర్ణీ
మమ్భోనిధౌ వివృతశుక్తిపుటోద్ధృతాని.
యస్యాః పయాంసి పరిణాహిషు హారమూర్త్యా
వామభ్రువాం పరిణమన్తి పయోధరేషు 16

వ్యా. రసకవికి ఉదాహరణము :-

''తనుమధ్య యైన ఓ సుందరీ! ఈ తామ్రపర్ణీనదిని చూడుము సముద్రమునందు, విప్పారి యున్న ముత్యపు చిప్పల దొప్పలలో గ్రహింపబడిన దీని జలములు, సుందర భ్రూలతిక లగు యువతుల విశాలపయోధరములపై ముత్యముల రూపమున పరిణతి చెందును''

వి ఇచట కవి తామ్రపర్ణీవర్ణనమును శృంగారరసస్ఫూర్తి కలుగు విధనము చేసి యున్నాడు గాన రసకవి.

మూ. మార్గకవిః –

మూలం బాలకవీరుధాం సురభయో జాతీతరూణాం త్వచః
సారశ్చన్దనశాఖినాం కిసలయాన్యార్ద్రాణ్యశోకస్య చ.
శైరీషీ కుసుమోద్గతిః పరిణమన్మోచం చ సోఽయం గణః
గ్రీష్మేణోష్మహరః పురా కిల దదే దగ్ధాయ పఞ్చేషవే. 17

వ్యా. మార్గకవికి (రీతికవికి) ఉదాహరణము :- ''బాలకము మొక్కల వేళ్లు, జాతివృక్షముల సుగంధము లగు బెరళ్లు, చందనవృక్షముల సారము, అశోకవృక్షము యొక్క చల్లని చిగుళ్లు, శిరీషములసంబంధ మైన పుష్పోద్గమము, పండిన మగు (మగ్గిన) అరటి పండు, వీటియొక్క సముదాయము పూర్వము

ఈశ్వరదగ్గు ఱైన పంచబాణునకు వేడిని తగ్గించు సామగ్రిగా గ్రీష్మఋతువుచే ఇవ్వబడెను.''

ఈ శ్లోకమున సుకుమార మగు వైదర్భీమార్గమును అవలంబించి కవి ఆయా చెట్ల వేళ్లు మొదలు పండ్లవరకును గ్రీష్మోపశాంతికరవస్తువులనుగా ఒక క్రమమున చక్కగా వర్ణించుటచే ఇతడు మార్గకవి. వైదర్భ్యాదిరీతులకు మార్గము లని కూడ దండ్యాదు లుపయోగించిన పేరు.

మూ. శాస్త్రార్థకవిః –

ఆత్మారామా విహితరతయో నిర్వికల్పే సమాధౌ
జ్ఞానోద్రేకాద్విఘటితతమోగ్రన్థయః సత్త్వనిష్ఠాః
యం వీక్షన్తే కమపి తమసాం జ్యోతిషాం వా పరస్తా
త్తం మోహాన్ధః కథమయమముం వేత్తి దేవం పురాణమ్. 18

వ్యా. శాస్త్రార్థకవికి ఉదాహరణము :-

''నిర్వికల్పసమాధియందు ఆసక్తి కలవారును, జ్ఞానోద్రేకమువలన తొలగింపబడిన తమోగ్రంథి కలవారును, సత్త్వగుణమునందే స్థితి కలవారును అగు ఆత్మారాములు మాత్రమే తమస్సులకును, జ్యోతిస్సులకును కూడ దూరమైన యే శ్రీకృష్ణపరమాత్మను చూడగలరో, అట్టి ఈ పురాణపురుషుని, మోహాన్ధు డైన ఈతడు (దుర్యోధనుడు) ఎట్లు చూడగలడు?''

వి. ఇది వేణీసంహారములోని శ్లోకము. ఇచట యోగశాస్త్ర వేదాన్తశాస్త్రము లందు ప్రసిద్ధము లగు విషయములు వర్ణింపబడినవి గాన ఇతడు శాస్త్రకవి.

మూ. ఏషాం ద్విత్రైర్గుణైః కనీయాన్; పఞ్చషైర్మధ్యమః, సర్వగుణయోగీ మహాకవిః.

వ్యా. పైన వర్ణించిన గుణములలో రెండుమూడు గుణములు కలవాడు సామాన్యుడు; ఐదు గుణము లున్నవాడు మధ్యమ కవి, సర్వగుణములును కలవాడు మహాకవి.

మూ. దశ చ తే కవేరవస్థా భవన్తి. తత్ర చ బుద్ధిమదాహార్యబుద్ధ్యోః సప్త. త్రిస్రశ్చ ఔపదేశికస్య తద్యథా కావ్యస్నాతకః, హృదయకవిః, అన్యా

పదేశీ, సేవితా, ఘటమానః, మహాకవిః, కవిరాజః ఆవేశికః, అవిచ్ఛేదీ, సంక్రామయితా చ.

వ్యా. కవికి పది అవస్థ లుండును. బుద్ధిమత్కవికిని, ఆహార్యబుద్ధికవికిని ఏడు అవస్థలు ఉండును, ఔపదేశికునకు మూడు అవస్థ లుండును. అవి ఎట్లనగా - (ఈ అవస్థలను బట్టి కవులు) కావ్యవిద్యాస్నాతకుడు, హృదయకవి,. అన్యాపదేశి, సేవిత, ఘటమానుడు, మహాకవి, కవిరాజు, ఆవేశికుడు, అవిచ్ఛేది, సంక్రామయిత (అని పది విధముల నందురు).

మూ. యః కవిత్వకామః కావ్యవిద్యాగ్రహణాయ గురుకులాన్యుపాస్తే స విద్యాస్నాతకః, యో హృదయ ఏవ కవతే నిహ్నుతే చ స హృదయకవిః. యః స్వమపి కావ్యం దోషభయాదన్యస్యేత్యపదిశ్య పఠతి సోఽన్యాపదేశీ యః ప్రవృత్తవచనః పౌరస్త్యానామన్యతమచ్ఛాయామభ్యస్యతి స సేవితా యోఽనవద్యం కవతే న తు ప్రబధ్నాతి స ఘటమానః యోన్యతరప్రబన్ధే ప్రవీణః స మహాకవిః. యస్తు తత్ర తత్ర భాషావిశేషే తేషు తేషు ప్రబన్ధేషు, తస్మింస్తస్మింశ్చ రసే స్వతన్త్రః స కవిరాజః తే యది జగత్యపి కతిపయే. యో మన్త్రాద్యుపదేశవశాల్లబ్ధసిద్ధిరావేశసమకాలం కవతే స ఆవేశికః. యో యదైవేచ్ఛతి తదైవావిచ్ఛిన్నవచనః సోఽవిచ్ఛేదీ. యః కన్యాకుమారాదిషు సిద్ధమన్త్రః స సంక్రామయితా.

వ్యా. కవిత్వమునందు కోరికతో, కావ్యవిద్యను స్వీకరించుటకై గురుకులముల ఉపాసన చేయువాడు 'విద్యాస్నాతకుడు'. హృదయమునందే (మనస్సులోనే) కవిత్వము చెప్పికొనుచు దానిని మరుగు పరచువాడు. 'హృదయకవి'. తప్పులుండునేమో అను భయముచేత తన కావ్యమును కూడ ఇతరుల కావ్యమని చెప్పి పఠించువాడు 'అన్యాపదేశి'. కవిత్వమును చెప్పుటలో చేయితిరిగి ప్రాచీన కవులలో ఎవరో ఒకరి ఛాయను (పద్ధతిని) అభ్యసించువాడు సేవిత. నిర్దుష్టమగు కవిత్వమును చెప్పకలిగి యుండి ప్రబంధరచనమును చేయని వాడు ఘట మానుడు ఏదియొఒక ప్రబంధమునందు(సంస్కృత ప్రబంధమునందు గాని, ప్రాకృతప్రబంధమునందు గాని) ప్రవీణుడు మహాకవి ఆయా భాషావిశేషము లందును, ఆయా ప్రబంధము లందును, ఆయా రసములను నిర్వహించుటయందును స్వాతంత్ర్యము కలవాడు 'కవిరాజు'. అట్టి కవిరాజులు ఈ ప్రపంచమునందు

చాలా కొద్ది మంది మాత్రమే ఉందురు. మంత్రాద్యుపదేశమువలన కావ్యసిద్ధిని సంపాదించి ఆదేవతావేశము కలిగినపుడు కవిత్వము చెప్పువాడు 'ఆవేశికుడు'. ఇవ్వి కలిగినపు డెల్ల అవిచ్ఛిన్నముగ కవిత్వము చెప్పగలవాడు 'విచ్ఛేది'. తాను మంత్రసిద్ధి పొంది కన్యలయందును, బాలులయందును గూడ సరస్వతిని సంక్రమింప చేయువాడు (చిన్నపిల్లలచేత కూడ కవిత్వము చెప్పింపగలిగిన వాడు) 'సంక్రామయిత'.

మూ. సతతమభ్యాసవశతః సుకవేః వాక్యం పాకమాయాతి. "కః పునరయం పాకః" ఇత్యాచార్యాః 'పరిణామః' ఇతి మఙ్గలః, కోఽ పునరయం పరిణామః" ఇత్యాచార్యాః. సుపాం తిఙాం చ శ్రవః; యా వ్యుత్పత్తిః" ఇతి మఙ్గలః. "సౌశబ్ద్యమేతత్ పదనివేశనిష్కమ్పతా పాకః" ఇత్యాచార్యాః. తదాహుః:-

"ఆవాపోద్ధరణే తావద్యావద్దోలాయతే మనః
పదానాం స్థాపితే స్థైర్యే హన్త సిద్ధా సరస్వతీ." 19

వ్యా॥ ఎల్లప్పుడును అభ్యాసము చేయుటవలన సుకవి యొక్క వాక్యము పాకమును (ఒక విధ మగు పరిణతిని) పొందును. "ఈ పాక మనగా ఏమి?" అని ఆచార్యుల ప్రశ్న. 'పరిణామము' అని మంగలుని సమాధానము. "ఈ పరిణామ మనగా ఏమి?" అని ఆచార్యులు "సుబంతతిఙంతములు వినబడుచుండుట; అదియే వ్యుత్పత్తి" అని మంగలుడు "ఈ సుబన్తతిఙంత శ్రవణము సాధుశబ్ద ప్రయోగము క్రింద వచ్చును. కావున పాక మనగా పదముల కూర్పు కదలకుండ ఉందుటయే" అని ఆచార్యులు. కావుననే ఇట్లు చెప్పబడినది. :- "ఈ పదమా ఆ పదమా అని మనస్సు ఊగులాడునంతవరకే ఆవాపోద్ధరణములకు అవకాశము (ఒక పదము తీసివేసి మరి యొక పదమును పెట్టుచుందుటకు ఆవాపోద్ధరణము అని పేరు.) పదములకు ఒక్కమాటు స్థైర్యము కుదిరినదా-సరస్వతి సిద్ధించినట్లే."

మూ. "ఆగ్రహపరిగ్రహాదపి పదస్థైర్యపర్యవసాయస్తస్మాత్పదానాం పరివృత్తివైముఖ్యం పాకః" ఇతి వామనీయాః. తదాహుః :-

"యత్పదాని త్యజన్త్యేవ పరివృత్తిసహిష్ణుతామ్.
తం శబ్దన్యాయనిష్ణాతాః శబ్దపాకం ప్రచక్షతే." 20

వ్యా. కవియొక్క మొండి పట్టుదలవలన కూడ పదస్థైర్యము కలుగ వచ్చును. అనగా ఒక కవి ఈ పదము ఇచటనే ఉండవలెను. అందు చేతనే అట్లు ప్రయోగించినాను. దీనిని మార్చి మరొక పదమును కూర్చినచో అందము చెడి పోవును. అని మొండిగా వాదించవచ్చును. ఆ విధముగ ఏర్పడిన పదస్థైర్యము పదస్థైర్యముకాదు. అందుచేత మనస్సు దోలాయమాన మైనచో పదస్థైర్యము లేదని దోలాయ మానము కానిచో స్థైర్యము ఉన్నదని కవియొక్క మనః ప్రవృత్తిని బట్టి చెప్ప కూడదు. ఇక నేమనగా పదముల పరివృత్తి చేయుటచే- అనగా ఒక పదము తీసి వేసి మరి యొక పదము చేర్చుటచే సుందరముగ నున్నదా లేదా అని పరీక్షించి అట్లు పదగుంఫనము పరివృత్తిసహ మైనచో పాకము కుదురలే దనియు, పరివృత్తి సహము కాకున్నచో అచట పాక మున్నదనియు వామనమతానుయాయులు చెప్పుదురు. కావుననే వారిట్లు చెప్పిరి. "పదములు పరివృత్తి సహిష్ణుత్వమును త్యజించినచో, పరివృత్తిసహములు కాకున్నచో (అనగా ఒక పదము తీసివేసి మరియొక పదమును ప్రయోగించుటచే సౌంద ర్యము చెడు నన్న పరిస్థితి యున్నచో) దానిని శబ్దన్యాయనిష్ణాతులు శబ్దపాక మని చెప్పుదురు"

మూ. "ఇయమశక్తిః;న పునఃపాకః" ఇత్యవన్తిసున్దరీ. యదేకస్మిన్ వస్తుని మహాకవీనామనేకోఽపి పాఠః పరిపాకవాన్ భవతి; తస్మాద్రసోచితశబ్దార్థ సూక్తి నిబన్ధనః పాకః. యదాహ :-

"గుణాలఙ్కారరీత్యుక్తిశబ్దార్థగ్రథనక్రమః.
స్వదతే సుధియాం యేన వాక్యపాకః స మాం ప్రతి." 21

తదుక్తమ్:-

సతి వక్తరి సత్యర్థే శబ్దే సతి రసే సతి.
అస్తితన్నవినా యేన పరిస్రవతి వాఙ్మధు 22

వ్యా. ఇది (శబ్దములపరివృత్త్యసహిష్ణుత్వము) అశక్తియే కాని పాకము కాదు. (ఒక శ్లోకములో నున్న ఒక పదమును తీసివేసి అందము చెడకుండ, మరియొక పదమును కవి కూర్చలేదన్నచో అది అతని అసామర్థ్యమునకే నిదర్శనము కాని పాకముకాదు) అని అవంతిసుందరి అభిప్రాయము. ఏలనన

ఒకే విషయమును వర్ణించుటలో మహాకవులు నిర్మించిన అనేకవిధము లగు పాఠము పరిపాకవంతముగ కానవచ్చుచున్నది. (అనగా వేరు వేరు పదములను ప్రయోగించి రచించినను పాకము కనబడుచునే ఉన్నది) కావున, పాక మనునది రసమునకు ఉచితము లగుశబ్దములు, అర్థములు సూక్తులు (చక్కని విషయమును చక్కగ చెప్పెడి విధానము) వీటిపై ఆధారపడి యున్నది. ఈ విషయమునే ఆమె ఇట్లు చెప్పినది:-

"గుణములు, అలంకారములు, రీతులు, ఉక్తులు, శబ్దార్థములు - వీటి గ్రంథనము చేసిన క్రమము దేనిచే విద్వాంసులకు రుచికరముగ నుండునో అదియే నా అభిప్రాయము ప్రకారము వాక్యపాకము," ఈ విషయములో ఇట్లు చెప్పియున్నారు:-

"వక్తి ఉండవచ్చును; అర్థ ముండవచ్చును; రస ముండవచ్చును. ఇన్ని యున్నను - ఏది లేనిచో మొక్కి లేని లోపకణాందో అట్టిది ఒకటి ఉన్నది. (అదియే పాకము)"

మూ. "కార్యానుమేయతయా యత్తచ్ఛబ్దనివేద్యః పరం పాకో ఽభిధా విషయః. తత్సహృదయప్రసిద్ధిసిద్ధ ఏవ వ్యవహారాఙ్గమసౌ" ఇతి యాయావరీయః.

వ్యా. "పాకము కేవలము కార్యమును బట్టి ఊహింపదగిన దగుటచే యత్తచ్ఛబ్దములచే చెప్పతగినది. కావున సహృదయుల హృదయప్రసిద్ధిని పట్టి ఇది సిద్ధించి వ్యవహారాంగ మగును" అని యాయావరీయుని మతము.

వి. 'పాక' శబ్దమునకు ఇది అర్థము అని చెప్పుట కష్టము, చమత్కారము అనెడు కార్యమును బట్టి ఇచట చమత్కారజనకముగ నున్నది గాన పాక మున్నది అని ఊహింపవలసినదే. ఈ విధముగ యచ్ఛబ్దతచ్ఛబ్దములను ప్రయోగించి ఏది ఉన్నచో చమత్కార ముండునో అది పాకము. ఏది లేనిచో చమత్కార ముండదో అది పాకము అని మాత్రమే పాకశబ్దార్థమును చెప్పగలము. కావున సహృదహృదయ ప్రసిద్ధిని బట్టి దీని నిర్ణయము చేయవలెను అని రాజశేఖరుని అభిప్రాయము.

మూ. స చ కవిగ్రామస్య కావ్యమభ్యస్యతో నవధా భవతి. తత్రాద్యన్త యోరస్వాదు పిచుమన్దపాకమ్, ఆదావస్వాదు పరిణామే మధ్యమం బదరపాకమ్.

ఆదావస్వాదు పరిణామే స్వాదు మృద్వీకాపాకమ్ ఆదౌ మధ్యమమన్తే చాస్వాదు వార్తాకపాకమ్, ఆద్యన్తయోర్మధ్యమం తిన్త్రిడీపాకమ్, ఆదౌ మధ్యమమన్తే స్వాదు సహకారపాకమ్ ఆదావుత్తమమన్తే చాస్వాదు క్రముకపాకమ్. ఆదావుత్తమమన్తే మధ్యమం త్రపుసపాకమ్ ఆద్యన్తయోః స్వాదు నాలికేరపాకమితి.

వ్యా॥ కావ్యరచనాభ్యాసము చేయు కవి సముదాయములో ఈ పాకము తొమ్మిది విధములుగ ఉండును. ఆదియందును, అంతమునందును గూడ స్వాదుత్వము లేని కావ్యము పిచుమందపాకము. (పిచుమంద మనగా వేపచెట్టు. ఇచట వేపపండు). ప్రారంభమున స్వాదువు కాకున్నను పరిణామమున (అంతమున) మధ్యమముగా నుండు కావ్యము (అనగా కొంతవరకు స్వాదుత్వము కలది) బదరీ (రేగిపండు) పాకము. మొదట స్వాదువుకానిది, పరిణామమున స్వాదువైనది మృద్వీకా (ద్రాక్ష) పాకము. మొదట మధ్యమమై (కొంచము స్వాదువై) అంతమున స్వాదుత్వము లేనిది వార్తాకపాకము. ఆద్యంతములయందు మధ్యమముగ నుండునది తింత్రిడీ (చింతపండు) పాకము. మొదట ఒక విధముగ స్వాదువుగ నుండి చివరకు పూర్తిగ స్వాదువుగ నుండునది సహకార (మామిడిపండు) పాకము. మొదట ఉత్తమమై అంతమున స్వాదుత్వరహిత మైనది క్రముక (పోకపండు) పాకము మొదట ఉత్తమమై అంతమున మధ్యమముగ నుండునది త్రపుసపాకము. త్రపుస మనగా దోసకాయ. ఆద్యంతములయందు మధురమైన కావ్యము నారికేళపాకము.

సూ. తేషాం త్రిష్వపి త్రికేషు పాకాః ప్రథమే త్యాజ్యాః. వరమకవిర్న పునః కుకవిః స్యాత్. కుకవితా హి సోచ్ఛ్వాసం మరణమ్. మధ్యమాః సంస్కార్యాః. సంస్కారో హి సర్వస్య గుణముత్కర్షతి. ద్వాదశవర్ణమపి సువర్ణం పావకపాకేన హేమీభవతి. శేషా గ్రాహ్యాః.

వ్యా. ఈ పాకముల మూడు త్రికములలో మొదటివి త్యాజ్యములు. కవి కాకపోయినను మేలే. కుకవిమాత్రము కాకూడదు. కుకవిత్వము (చెడ్డకవి యగుట) అనునది ప్రాణములతో కూడిన మరణము. మధ్యలో నున్న పాకములు సంస్కారము చేయుటకు వీలైనవి. సంస్కారము అన్నింటికిని గుణోత్కర్ష కలిగించును కదా! పన్నెండు వన్నెల బంగారము కూడ అగ్నిచే పాకము చేసినచో శుద్ధ సువర్ణ మగును. మిగిలిన పాకములు గ్రాహ్యములు. (వాటికి సంస్కారాపేక్ష లేదు).

వి. పైన చెప్పిన పాకములు మూడేసి మూడేసి సముదాయములుగా (త్రికములుగా) ఉన్నవి. పిచుమంద - బదర - మృద్వీకాపాకములు మొదటి త్రికము. వార్తాక - తింతిడీ - సహకారపాకములు రెండవ త్రికము. క్రముక-త్రపుస - నారికేలపాకములు మూడవ త్రికము. వీటిలో మొదటి పాకములు అనగా పిచుమంద - వార్తాక - క్రముకపాకములు, సర్వథా త్యాజ్యములు. మధ్యనున్న పాకములు, అనగా బదర తింతిడీ - త్రపుసపాకములు కొంత సంస్కారము చేసినచో అవి గ్రాహ్యములు. మిగిలిన మూడు పాకములను అనగా మృద్వీకా - సహకార- నారికేళపాకములు సర్వథా గ్రాహ్యములు. వాటికి సంస్కారాపేక్ష లేదు.

మూ. స్వభావశుద్ధం హి న సంస్కారమపేక్షతే. న ముక్తామణేః శాణస్తారతాయై ప్రభవతి.

వ్యా. స్వభావశుద్ధమైనదానికి సంస్కారాపేక్ష ఉండదు కదా? ముత్యమునకు సానబట్టుట దానిని తారముగ (హారములోని మధ్యమణిగా) చేయజాలదు కదా ?

మూ. అనవస్థితపాకం పునః కపిత్థపాకమామనన్తి. తత్ర పలాలధూననేన అన్నకణలాభవత్సుభాషితలాభః.

వ్యా. అవ్యవస్థితమైన పాకము కలదానిని కపిత్థపాక మని యందురు. దానిలో (ఆ కపిత్థపాకములో) పొట్టు చెరగగా చెరగగా అన్నకణ మొకటి లభించినట్లు ఏదైన ఒక సుభాషితము (మంచి శ్లోకము) లభించవచ్చును.

మూ. సమ్యగభ్యస్యతః కావ్యం నవధా పరిపచ్యతే
హానోపాదానసూత్రేణ విభజేత్తద్ధి బుద్ధిమాన్ 23
అయమత్రైవ శిష్యాణాం దర్శితస్త్రివిధో విధిః
కిన్తు వివిధమప్యేతత్త్రిజగత్యస్య వర్తతే 24

వ్యా. బాగుగా అభ్యాసము చేయువానికి కావ్యము, పైన చెప్పినట్లుగా, నాలుగు విధములుగ పరిపాకమును చెందును. దానిని బుద్ధిమంతుడు హానోపాదాన

సూత్రముచే (కొన్ని పాకములు హేయములు కొన్ని ఉపాదేయములు) అనెడు రీతిచే విభజింపవలెను ''

"శిష్యులకొరకై ఇచట మూడు విధము లగు పద్ధతిచూపబడినది. కాని మూడులోకములను పరిశీలించి చూచినచో దీనికి ఇంకను వైవిధ్యమున్నది'' ("వివిధమపి" కి బదులుగా 'వైవిధ్యమ్' అనిఉన్నచో అర్థము సరిగ ఉండును).

ఇతిరాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే శిష్యవిశేషేషు కావ్యపాకకల్పః పఞ్చమోఽధ్యాయః,

బాలానందిలో పంచమాధ్యాయము సమాప్తము.

షష్ఠోఽధ్యాయః— పదవాక్యవివేకః

మూ. వ్యాకరణస్మృతినిర్ణీతః శబ్దో నిరుక్తనిఘణ్ట్వాదిభిర్నిర్దిష్టస్తదభిధేయోఽర్థః. తౌ పదమ్.

వ్యా (ఇది సాధువు అని) వ్యాకరణస్మృతిచే నిర్ణయింపబడినది శబ్దము. నిరుక్తనిఘంట్వాదులచే నిర్దిష్టమై ఆ శబ్దముచే బోధింపబడినది అర్థము. ఈ రెండును కలిసిన పద మని పేరు.

మూ. తస్య పఞ్చ వృత్తయః-సుబ్వృత్తిః,సమాసవృత్తిః, తద్ధితవృత్తిః, కృద్వృత్తిః, తిఙ్వృత్తిశ్చ. గౌరశ్వః పురుషో హస్తీతి జాతివాచినః శబ్దాః. హరో హరిర్హిరణ్యగర్భః, కాలః, ఆకాశం, దిగితి ద్రవ్యవాచినః. శ్వేతః. కృష్ణో, రక్తః,పీతఇతి చ గుణవాచినః. ప్రాదయశ్చాదయశ్చాసత్త్వవచనాః. నగరముపస్థితః పన్థాః; వృక్షమను ద్యోతతే విద్యుత్ ఇతి కర్మప్రవచనీయాః.

పదమునకు సుబ్వృత్తి, సమాసవృత్తి, తద్ధితవృత్తి, కృద్వృత్తి, తిఙ్వృత్తి, అని ఐదు వృత్తులుండును. గౌః, అశ్వః, పురుషః, హస్తీ,- మొదలయిన పదములు జాతివాచకములు (ఇవి గోత్వము, అశ్వత్వము మొదలగు అర్థములను బోధించును) హరః, హరిః హిరణ్యగర్భః, (బ్రహ్మ దేవుడు)కాలః, ఆకాశం, దిక్ మొదలైన శబ్దములు ద్రవ్యవాచకములు. (లింగసంఖ్యాదులతో

అన్వయించునది ద్రవ్యము). శ్వేతః, కృష్ణః, రక్తః, పీతః ఇత్యాదిశబ్దములు గుణవాచకములు. ప్రాదులు (ప్ర, పరా, అప మొదలగునవి), చాదులు, (చ, వా, హ మొదలగునవి) అసత్త్వవాచకములు; అనగా అద్రవ్యవాచకములు, (లింగసంఖ్యాద్యన్వయములేనివి) "నగరం ఉపస్థితః పన్థాః" (మార్గము నగరము దగ్గర నున్నది) "వృక్షం అను విద్యోతతే విద్యుత్" (మెరుపు వృక్షమువైపు మెరయుచున్నది) ఇత్యాదులు కర్మప్రవచనీయములు.

వి అనగా సమీపము అను అర్థమునుబోధించు 'ఉప' అనునదియు, మెరుపు ఎటువైపు మెరిసినదో గుర్తు చెప్పుటకై ప్రయోగింపబడిన 'అను' అనునదియు కర్మప్రవచనీయములు వాటి సంబంధముచే 'నగర, 'వృక్ష' శబ్దములకు "కర్మప్రవచనీయయుక్తే ద్వితీయా" అను పాణినిసూత్రము ననుసరించి ద్వితీయ వచ్చినవి. ఈ విధముగ పైన చెప్పిన ఐదు వృత్తులలో మొదటి దగు సుబ్వృత్తి జాత్యాది భేదముచే ఐదు విధము లని యర్థము.

మూ. "సేయం సుబ్వృత్తిః పఞ్చతయ్యపి వాఙ్మయస్య మాతా" ఇతి విద్వాంసః. సుబ్వృత్తిరేవ సమాసవృత్తిః; వ్యాససమాసా వేవానయోర్భేద హేతూ. సా చ షోఢా ద్వన్ద్వాదిభేదేన. తత్ర షట్సమాసీసమాససూక్తమ్.

వ్యా. పంచవిధము లగు ఈ సుబ్వృత్తి వాఙ్మయమున కంతకును తల్లి యని విద్వాంసుల యభిప్రాయము సుబ్వృత్తియే సమాసవత్తి. అనగా రెండవదైన సమాసవృత్తి సుబ్వృత్తిలో అంతర్గతమే, వీటి భేదమునకు హేతువులు వ్యాససమాసములే (సుబ్వృత్తి విడిగా ఉన్నచో వ్యాసము; రెండు లేక అంతకంటె అధికమైన సుబ్వృత్తులు కలిసి యుండుట సమాసము). అది (సమాసవృత్తి) ద్వంద్వాదిభేదములచే ఆరు విధములు ఆరు సమాసముల పేర్లను కలిపి చెప్పిన సూక్తమిది:-

మూ. ద్వన్ద్వోఽస్మి ద్విగురస్మి చ గృహే న మే సతతమవ్యయీభావః,
తత్పురుష కర్మ ధారయ యేనాహం స్యాం బహువ్రీహిః.

వ్యా. (ఒక నిర్ధనుడు ధనికుని వద్దకు పోయి చెప్పిన వాక్య మిది. ఇది విఘ్నేశుని ప్రపితామహు దగు భట్టముక్తికలశుడు రచించిన దని ప్రసిద్ధి) నేను జంటగా ఉన్నాను. నాకు ద్విగువు అనగా రెండు ఆవులు మాత్రమే ఉన్నవి. నా

గృహమునందు ఎన్నడును అవ్యయీభావము అనగా ఖర్చు లేకపోవుట, లేదు. అందువలన ఓ పురుషుడా! (తత్ - పురుష) దేంచే నేను బహువ్రీహిని (అధికముగు ధాన్యము కలవాడను) అగుదునో అట్టి కర్మము (పనిని) సర్దయించుము (కర్మ + ధారయ). (ఈ చాటుశ్లోకములో ద్వంద్వ - ద్విగు - అవ్యయీభావ - తత్పురుష - కర్మధారయ - బహువ్రీహి అను సమాసనామధేయములు కూడ వచ్చినవి.)

మూ. తద్ధితవృత్తిః పునరనన్తా. తద్ధి శాస్త్రప్రాయోవాదః యదుత "తద్ధితమూఢాః పాణినీయాః". 'మాఞ్జిష్ఠమ్, రౌచనికమ్. సౌరమ్, సైన్ధవమ్, వైయాసీయమ్. ఇతితద్ధితాన్తాః. ప్రాతిపదికవిషయా చేయమ్, కృద్వృత్తిశ్చ ధాతువిషయా. కర్తా. హర్తా, కుమ్భకారో, నగరకారః ఇతి కృదన్తాః.

వ్యా. తద్ధితవృత్తి అనంత మైనది. కావుననే శాస్త్రములలో ''పాణినీయులు తద్ధితలవిషయమున మూఢులు'' అని మామూలుగా చెప్పెడు ఒక మాట కలదు (తద్ధిత ప్రత్యయములు అసంఖ్యాకములుగ ఉండుటచే వాటి నన్నింటిని స్మృతిపథమున నిలుపుట కష్ట మని యర్థము. ప్రాచీనవ్యాకరణములలో నున్న తద్ధిత ప్రత్యయముల నన్నింటిని పాణిని చెప్పలేదు. అందుచే పాణినివ్యాకరణమును మాత్రము అభ్యసించువారు తద్ధితమూఢు లని కూడ దీని యర్థమైయుండును) మాఞ్జిష్ఠమ్ (మంజిష్ఠ అను రంగుపూసిన వస్త్రము) రౌచనికమ్ (గోరోచనముచే ఎర్రనైనది), సౌరమ్; (సూర్యసంబంధ మైనది) సైన్ధవమ్, (సింధుసంబద్ధము) వైయాసీయమ్ (వ్యాసరచితము) ఇత్యాదిపదములు తద్ధిత ప్రత్యయాన్తములు. తద్ధితవృత్తి ప్రాతిపదికలకు సంబంధించినది. (అనగా తద్ధిత ప్రత్యయములు 'మఞ్జిష్ఠా', 'రోచన' మొదలగు ప్రాతిపదికలకు చేర్చబడును). కృద్వృత్తి ధాతు విషయకము. (అనగా 'తృచ్' 'అణ్' మొదలగు కృత్ప్రత్యయములు 'కృ' 'హృ' మొదలగు ధాతువులకు చేర్చబడును) కర్తా, హర్తా, కుమ్భకారః, నగరకారః ఇత్యాదులు కృదన్తములు.

మూ. తిఙ్వృత్తిర్ద్విధా దశలకారీభేదేన. ద్విధా చ సా ధాతు సుబ్ధాతు విషయత్వేన. అపాక్షీత్, పచతి, పక్ష్యతి, ఇతి ధాతవీయాన్యాఖ్యాతాని. అపల్లవయత్, పల్లవయతి, పల్లవయిష్యతి ఇతి సౌబ్ధాతవీయాని.

వ్యా. పది లకారములను బట్టి తిఙ్విభక్తి పది విధములు. (లట్, లిట్, లుట్, లృట్, లేట్, లోట్, లఙ్, లిఙ్, లుఙ్, లృఙ్ అని పది లకారములు) మరల ఆ తిఙ్విభక్తి ధాతువులకు సంబంధించినది, సుబ్ధాతువులకు (నామధాతువులకు) సంబంధించినది అని రెండు విధములు. అపాక్షీత్, పచతి, పక్ష్యతి ఇత్యాదులు ధాతువులకు సంబంధించిన ఆఖ్యాతములు. ('పచ్' ధాతువుయొక్క భూతార్థకలఙ్ 'అపాక్షీత్' = వండెను. వర్తమానార్థకలట్ - పచతి = వండుచున్నాడు భవిష్యదర్థ కలృట్-పక్ష్యతి = వండగలడు. తిఙంతమునకు ఆఖ్యాత మని పేరు.) అపల్లవయత్, పల్లవయతి, పల్లవయిష్యతి ఇత్యాదులు సుబ్ధాతువులనుండి వచ్చిన ఆఖ్యాతములు. ('పల్లవ' అనునది నామవాచకము. దానిని ధాతువుగ పరిగణించి 'తిఙ్' ప్రత్యయములు చేర్చుటచే "అపల్లవయత్" ఇత్యాదిరూపములు సిద్ధించినవి. వీటికి 'చిగుర్చునట్లు చేసెను' ఇత్యాద్యర్థములు.

మూ. తదిదమిత్థంకారం పఞ్చప్రకారమపి పదజాతం మిథః సమన్వీయమానమానన్త్యయ కల్పతే. తజ్జన్మైవ విదుషాం వాదో యతిర్ల "దివ్యం సమాసహస్రం బృహస్పతిర్వక్తా, శతక్రతురధ్యేతా. తథాపి నాన్తః శబ్దరాశేరాసీత్."

మూ. ఈ విధముగ పంచవిధము లగు పదసముదాయము పరస్పరము కలియుటచే అనంతసంఖ్యాక మగును. దీనిని బట్టియే—"వెయ్యి దివ్యసంవత్సరముల పాటు బృహస్పతివక్త; దేవేంద్రుడు అధ్యయనము చేయువాడు; అయినను శబ్దరాశికి అంతము దొరకలేదు" అను ప్రవాదము పండితులలో వ్యాపించియున్నది

మూ. తత్ర ద్యుతిసుబ్వృత్తయో విదర్భాః. వల్లభసమాసవృత్తయో గౌడాః ప్రియతద్ధితా దాక్షిణాత్యాః. కృత్ ప్రయోగరుచయ ఉదీచ్యాః. అభీష్టతిఙ్వృత్తయః సర్వేఽపి సన్తః. శేషం చ విశేషలక్షణాసన్ధానేనావర్గతాఖ్యాతగణః. ఉక్తఞ్చ:

"విశేషలక్షణవిదాం ప్రయోగాః ప్రథితాన్ మే.
ఆఖ్యాతరాశిస్తైరేవ ప్రత్యహం హ్యుపచీయతే.

వ్యా. అందు విదర్భదేశీయులకు సుబ్వృత్తి అనిన ఇష్టము. గౌడులకు సమాసవృత్తి ఇష్టము. దాక్షిణాత్యులకు తద్ధితాంతప్రయోగము ఇష్టము. ఉత్తర దేశీయులకు కృదంతప్రయోగము ప్రియము. ఉత్తరమరచయిత లందరికిని తిఙ్వృత్తి ఇష్టము. వీరందరును తిఙన్తములకు సంబంధించిన విశేషలక్షణములను బాగుగ పరిశీలించి ప్రయోగించుచుండుటచే ఆఖ్యాతగణము (తిఙంతశబ్దసముదాయము) క్రమక్రమముగ పెరిగిపోయినది. ఈ విషయమిట్లు చెప్పబడినది ;-

"లక్షణవిశేషము నెరింగినవారికి ఏ ప్రయోగములు భాసించునో ఆ ప్రయోగములచే ఈ ఆఖ్యాతసముదాయము ప్రతిదినమునను పెరిగిపోవుచున్నది''

వి. ఈ శ్లోకమునందును, పై వాక్యమునందును 'ఆఖ్యాత' శబ్దమునకు కేవలతిఙంత మని మాత్రమే అర్థము కాదు. ఎందరు ప్రయోగించినను వాటి సంఖ్య పెరుగుటకు అవకాశ ముండదు కదా ? అందుచే ఆఖ్యాతశబ్దమునకు తిఙంతఘటితము లగు వాక్యవిశేషముల ప్రయోగ మని యర్థము. ప్రయోక్తల ప్రతిభావిశేషమును బట్టి విచిత్రప్రయోగములు పెరుగుచుండును కదా ?

మూ. పదానా మభిధిత్సితార్థగ్రన్థనాకరః సన్దర్భో వాక్యమ్, "తస్య చ త్రిధా అభిధావ్యాపారః'' ఇత్యౌద్భటాః - వైభక్తః, శాక్తః, శక్తివిభక్తిమ - యశ్చ. ప్రతిపదం శ్రూయమాణాసూపపదవిభక్తిషు కారకవిభక్తిషు వా వైభక్తః. లుప్తాస్వపి విభక్తిషు సమాససామర్థ్యాత్తదర్థావగతౌ శాక్తః. ఉభయాత్మా చ శక్తివిభక్తిమయః. తత్ర వైభక్తః -

వ్యా. చెప్పదలచిన అర్థముయొక్క గ్రథనమునకు (కూర్పునకు) స్థానమగు పదముల కూర్పు వాక్యము. వాక్యముయొక్క అభిధావ్యాపారము (అర్థము బోధించెడు వ్యాపారము) వైభక్తము, శాక్తము, శక్తివిభక్తిమయము అని మూడు విధములుగ నుండు నని ఉద్భటమతానుసారులు చెప్పుదురు. ప్రతిపదమునందును కారకవిభక్తులు, ఉపపదవిభక్తులు స్పష్టముగ వినబడుచున్నచో (అట్టి వాక్యముల అభిధావ్యాపారము) వైభక్తము.

వి. కారకసంజ్ఞను బట్టి వచ్చిన విభక్తి కారకవిభక్తి. ఉదా- "రామాయ పుస్తకం దదాతి'' అనునపుడు, ఇచ్చిన పుస్తకమును తీసికొను రామునకు సంప్రదానకారక మని పేరు ఉండుటచే రామశబ్దమునకు "చతుర్థీసంప్రదానే"

(పా, సూ.) అను నియమముచే చతుర్థీవిభక్తి వచ్చినది. ఇది కారకవిభక్తి. 'రామాయ నమః' అనునపుడు 'నమః' అను పదము ప్రక్క నుండుటచే 'రామ' శబ్దమునకు చతుర్థీవిభక్తి వచ్చినది. ఉపపదమును-అనగా దగ్గర నున్న పదమును, నిమిత్తముగ చేసికొని ఇచట చతుర్థి వచ్చినది గాన ఇది ఉపపదవిభక్తి.

వ్యా. విభక్తులు లోపించినను సమాసముయొక్క సామర్థ్యముచే (శక్తిచే) ఆ లోపించిన విభక్తుల అర్థము గమ్యమాన మైనచో (అట్టి సమాసములతో కూడిన వాక్యము యొక్క అభిధావ్యాపారము) శాక్తము. వైభక్తము శాక్తము, రెండును ఉన్నచో శక్తివిభక్తిమయము

వి అనగా ఒక వాక్యమునందలి పదము లన్నియు వ్యస్తపదము లైనచో దాని అభిధావ్యాపారము వైభక్తము. సమస్తపదము లైనచో శాక్తము, ఉభయ విధము లైనచో శక్తివిభక్తిమయము

వైభక్తమునకు ఉదాహరణ మెట్లగా—

మూ. నమస్తస్మై వరాహాయ లీలయోద్ధరతే మహీమ్.
ఖురయోర్మధ్యగో యస్య మేరుః ఖణఖణాయతే. 8

వ్యా. ఎవని డెక్కల మధ్య చిక్కుకొనిన మేరుపర్వతము (అడుగులు వేసినపుడు) ఖణఖణ మని చప్పుడగుచున్నదో అట్టి, విలాసగా భూమిని పైకి ఎత్తుచున్న, వరాహమూర్తికి నమస్కారము.

వి. ఇందు అన్ని పదములందును విభక్తులు స్పష్టముగ వినవచ్చుచున్నవి గాన ఇది వైభక్తమునకు ఉదాహరణము.

మూ. శాక్తః-

విక్రస్తశత్రుః స్పృహయాలులోకః
ప్రపన్నసామన్త ఉదగ్రసత్త్వః.
అధిష్ఠితౌదార్యగుణోఽసిప త
తిశాపనిర్నాస్తి నృప స్త్వదన్యః. 4

వ్యా. శాక్తమునకు ఉదాహరణము—

భయపడు శత్రువులు కలవాడును, లోకప్రియుడును, శరణుజొచ్చిన సామంతులు కలవాడును,గొప్ప బలము కలవాడును, ఔదార్యగుణవంతుడును,

ఖడ్గముచే జయింపబడిన భూమండలము కలవాడును అగు రాజు,నీకంటె అన్యుడు, లేడు.

వి. ఇచట పదము లన్నియు సమస్తపదములు. వాటిలోని పూర్వపదముల విభక్తులు లోపించినను, సమాసశక్తిచే వాటి యర్థము గమ్య మగుచున్నది.

మూ. యథా వా—

కణ్ఠదోలాయితోద్దామనీలేన్దీవరదామకాః

హరిభీత్యాశ్రితాశేషకాలియాహికులా ఇవ. 5

వ్యా కంఠములందు ఊగులాడుచున్న పెద్దవైన నీలోత్పలమాలికలు గల, వారు, శ్రీకృష్ణునివలన భయముచే ఆశ్రయించిన సమస్తమైన కాలియవంశీయులు కలవారువలె ఉన్నారు.

వి. పూర్వశ్లోకమునందు వలె ఇచట గూడ అన్నియు సమస్తపదములు.

మూ. శక్తివిభక్తిమయః-

అథాగాదేకదా స్పష్టచతురాశాముఖద్యుతిః

తం బ్రహ్మేవ శరత్కాలః ప్రోత్ఫుల్లకమలాసనః. 6

వ్యా. అటు, పిమ్మట ఒకప్పుడు, స్పష్టమైన చతురాశాముఖ కాంతికల, వికసిత కమలాసన మగు శరత్కాలము బ్రహ్మవలె, అతనిని పొందెను.

వి. 'స్పష్టచతురాశాముఖద్యుతిః' అను పదమునకు శరత్కాలపక్షమున—(మేఘములు తొలగుటచే) స్పష్ట మైన నాలుగు దిఙ్ముఖముల కాంతి కలది యనియు, బ్రహ్మ పక్షమున స్పష్టమైన, నాల్గు దిక్కుల వైపును తిరిగి యున్న ముఖముల కాంతి కలవాడు అనియు అర్థము. ''ప్రోత్ఫుల్లకమలాసనః'' అను పదమునకు శరత్పక్షమున వికసించిన పద్మములు, అసనపుష్పములు కలది యనియు, బ్రహ్మపక్షమున వికసించిన పద్మము ఆసనముగా కలవాడు అనియు అర్థము. ఈ శ్లోకములో రెండు పదములు అసమస్తములు; మిగిలినవి సమస్తములు గాన ఇది శక్తి విభక్తి మయమునకు ఉదాహరణము.

మూ. తత్ర వాక్యం దశధా- ఏకాఖ్యాతమ్, అనేకాఖ్యాతమ్, ఆవృత్తాఖ్యాతమ్, ఏకాభిధేయాఖ్యాతమ్, పరిణతాఖ్యాతమ్, అనువృత్తాఖ్యాతమ్, సముచ్చి

తాఖ్యాతమ్, అధ్యాహృతాఖ్యాతమ్, కృదభిహితాఖ్యాతమ్, అనపేక్షితాఖ్యాతమితి. తత్రైకాఖ్యాతమ్-

జయత్యేకపదాక్రాన్త సమస్త భువనత్రయః
ద్వితీయపదవిన్యాస వ్యాకులాభినయః శివః. 7

వ్యా. వాక్యము ఏకాఖ్యాతాది భేదముచే పది విధములు. అందు ఏకాఖ్యాతమెట్లనగా:—

"ఒక్క పాదవిన్యాసముచే ఆక్రమింపబడిన భువనత్రయము కలవాడును, రెండవ పాదవిన్యాసమునకు (స్థానము లేకపోవుటచే) వ్యాకులమైన అభినయము గలవాడును అగు శివుడు సర్వోత్కర్షగా నున్నాడు."

వి. శ్లోకరూప మగు ఈ వాక్యమునందు 'జయతి' అను ఒక్క ఆఖ్యాతము మాత్రమే ఉన్నది.

మూ. అనేకాఖ్యాతమ్. తచ్చ ద్విధా, సాన్తరం నిరన్తరమ్. తయోః ప్రథమమ్—

దేవాసురాస్తమథ మన్థగిరాం విరామే
పద్మాసనం జయజయేతి బభాషిరే చ.
ద్రాగ్భేజిరే చ పరితో బహుమేనిరే చ
స్వాగ్రేసరం విదధిరే చ వవన్దిరే చ. 8

వ్యా. అనేకాఖ్యాతము. సాన్తరము, నిరన్తరము అని అది రెండు విధములు. వాటిలో మొదటిది :-

"సముద్రమథనమునకు సంబంధించిన మాటలు పూర్తియైన పిమ్మట దేవతలును అసురులును, ఆ బ్రహ్మను, 'జయ' 'జయ' అని పలికిరి. వెంటనే అన్ని వైపులనుండి ఆతనిని సేవించిరి. ఆదరించిరి. తమ అగ్రేసరునిగా (ముందుఉండువానినిగా) చేసిరి. మరియు నమస్కరించిరి."

వి ఇచట క్రియాపదమునకును క్రియాపదమునకును మధ్య ఇతరపదము లుండుటచే ఈ వాక్యము సాన్తరానేకాఖ్యాతవాక్యము.

మూ. ద్వితీయమ్ —

త్వం పాసి హంసి తనుషే మనుషే బిభర్షి
విభ్రాజసే సృజసి సంహరసే విరౌషి.
ఆస్సే నిరస్యసి సర (మ) స్యసి రాసి లాసి
సజ్జీకరసే భ్రమసి మేదసి మోదసే చ. 9

వ్యా. రెండవదానికి అనగా నిరన్తరాఖ్యాతవాక్యమున కుదాహరణము—
"నీవు రక్షించుచున్నావు. సంహరించుచున్నావు, విస్తరింపచేయుచున్నావు. మననము చేయుచున్నావు. భరించుచున్నావు. ప్రకాశించుచున్నావు. సృజించుచున్నావు. సంహరించుచున్నావు. ధ్వని చేయుచున్నావు. ఉంటున్నావు నిరసించుచున్నావు. బాగుగా కూర్చుచున్నావు. దగ్గరకు చేర్చుచున్నావు. గ్రహించుచున్నావు. క్రీడించుచున్నావు. ఆద్పాదించుచున్నావు. కలియుచున్నావు ఆనందించుచున్నావు "

ఇచట క్రియాపదము లన్నియు వరుసగా, ఇతరపదముల వ్యవధానము లేకుండ, కూర్చబడినవి గాన ఇది నిరన్తరానేకాఖ్యాతవాక్యమునకు ఉదాహరణము.

మూ. "ఆఖ్యాతపరతన్త్రా వాక్య వృత్తిః; అతో యావదాఖ్యాత మిహ వాక్యాని" ఇత్యాచార్యాః. "ఏకాకారతయా కారకగ్రామస్యైకార్థతయా చ వచోవృత్తేరేకమేవేదం వాక్యమ్" ఇతి యాయావరీయః.

వ్యా. "వాక్యవృత్తి అనగా వాక్యార్థముయొక్క పరిసమాప్తి అఖ్యాతము పై ఆధారపడి యుండును. కావున ఇట్టి స్థలములలో ఎన్ని ఆఖ్యాతము లున్నవో అన్ని వాక్యములు ఉన్నట్లు అంగీకరింపవలెను" అని ఆచార్యుల అభిప్రాయము. "కర్త మొదలైన కారకములు ఏకాకారముగనే ఉండుటచేతను, ఈ వాక్య ప్రయోగమునకు ప్రయోజనము ఒకటే అయి ఉండుటచేతను, (అనేకాఖ్యాతము లున్నను) ఇది ఏకవాక్యమే" అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. ఆవృత్తాఖ్యాతమ్ —

జయత్యమలకౌస్తుభస్తబకితాంసపీఠో హరి
ర్జయన్తి చ మృగేక్షణాశ్చలదపాఙ్గదృష్టిక్రమాః.
తతో జయతి మల్లికా తదను సర్వసంవేదనా
వినాశకరణక్షమో జయతి పఞ్చమస్య ధ్వనిః. 10

వ్యా. ఆవృత్తాఖ్యాతమునకు ఉదాహరణము -

"నిర్మల మైన కౌస్తుభమాణిక్యముచే పుష్పగుచ్ఛములు కలదిగ ఉన్న వక్షఃపీఠము గల విష్ణువు సర్వోత్కర్షగా నున్నాడు. చంచల మైన నేత్రాంతములు గల దృష్టిప్రసారములు గల మృగనయనలు సర్వోత్కర్షగ నున్నారు. అటు పిమ్మట మల్లిక సర్వోత్కర్షగా నున్నది. అనంతరము సకలమానసక్లేశములను తొలగించుటకు సమర్థ మగు కోకిలయొక్క పంచమధ్వని సర్వోత్కర్షముగ నున్నది."

వి. ఇచట 'జయతి' అను ఒకే అఖ్యాతము నాలుగు పర్యాయములు ఆవృత్త మైనది గాన ఇది ఆవృత్తాఖ్యాతమునకు ఉదాహరణము.

మూ. ఏకాభిధేయాఖ్యాతమ్:-

హృష్యతి చూతేషు ఛిరం తుష్యతి వకుశేషు మోదతే మరుతి.
ఇహ హి మధౌ కలకూజిషు పికేషు చ ప్రీయతే రాగీ 11

వ్యా. ఏకాభిధేయాఖ్యాత మెట్లనగా:-

"రాగావిష్టు డైనవాడు ఈ వసంతఋతువునందు, చూతముల విషయమున హర్షించుచున్నాడు. వకులముల(పొగడచెట్లు) విషయమున ఎక్కువ సంతోషించుచున్నాడు. వాయువు విషయమునఆనందించుచున్నాడు. మధురముగా ధ్వనిచేయుచున్న పికముల విషయమున ప్రీతిమంతుడై యున్నాడు."

వి. ఇచట 'రాగి' అను ఒకే కర్త అనేకక్రియాపదములతో సంబంధించి యుండుటచే ఇది ఏకాభిధేయాఖ్యాతమునకు ఉదాహరణము.

పరిణతాఖ్యాతమ్—

సో௨స్మిన్ జయతి జీవాతుః పఞ్చేషోః పఞ్చమధ్వనిః
తే చ చైత్రే విచిత్రైలాకక్కోలీకేలయో௨నిలాః. 12

వ్యా. పరిణతాఖ్యాతమునకు ఉదాహరణము:-

"ఈ చైత్రమాసమున మన్మథుని జీవనౌషధమైన (మన్మథుని ఉజ్జీవింప చేసెడు) కోకిలల పంచమధ్వని సర్వోత్కర్షగ నున్నది విచిత్రముగా ఏలా - కక్కోలీలతలతో క్రీడించుచున్న ఆ వాయువులు కూడ సర్వోత్కర్షగ నున్నవి"

వి. పూర్వార్ధములో నున్న 'జయతి' అను క్రియాపదము ఉత్తరార్ధములో కూడ 'జయన్తి' అను బహువచనరూపముగ మారి (పరిణామమును చెంది) అన్వయించుచున్నది గాన ఇది పరిణతాఖ్యాతమునకు ఉదాహరణము.

మూ. అనువృత్తాఖ్యాతమ్:-

చరన్తి చతురమ్భోధివేలోద్యానేషు దన్తినః
చక్రవాలాద్రికుఞ్జేషు కున్దభాసో గుణాశ్చ తే. 18

వ్యా. అనువృత్తాఖ్యాతమునకు ఉదాహరణము:-

"నీ ఏనుగులు చతుస్సముద్రతీరములందలి ఉద్యానవనములందు సంచరించుచున్నవి. మల్లెపూవులవంటి తెల్లని కాంతులు గల గుణములు కూడ చక్రవాలపర్వతముయొక్క పొదరిండ్లలో సంచరించుచున్నవి."

వి. ఇచట పూర్వార్ధములోని 'చరన్తి' అను క్రియయే ఏమియు మార్పు లేకుండగ ఉత్తరార్ధమునందు కూడ అనువర్తించి అన్వయించినది గాన ఇది అనువృత్తాఖ్యాతమునకు ఉదాహరణము.

మూ. సముచితాఖ్యాతమ్

పరిగ్రహభరాక్రాన్తం దౌర్గత్యగతిచోదితమ్
మనో గన్త్రీవ కుపథే చీత్కరోతి చ యాతి చ. 14

వ్యా. "భార్యాపుత్రాదుల భారముచే ఆక్రమింపబడినదియు, దురదృష్టముయొక్క గతిచే ప్రేరేపింపబడినదియు అగు మనస్సు, (ఎక్కించిన వస్తువుల భారముచే ఆక్రమించబడినదియు, వంకరమార్గముగ ప్రేరితమును అగు) ఎడ్ల

బంతివలె, అమార్గమునందు (విషమముగా నున్న మార్గమునందు) చీత్కారము చేయుచున్నది. నడచుచునే యున్నది."

వి. (కుపథే) 'చీత్కరోతి' 'యాతిచ' అను క్రియాపదములు అటు మనస్సునకును, ఇటు ఎడ్లబండికిని సముచితముగ అన్వయించుచున్నవి గాన ఈ వాక్యము సముచితాఖ్యాతము.

మూ. యథా చ -

స దేవః సా దంష్ట్రి కృతకిటివిలాసస్మితసితా
ద్వయం దిశ్యాత్తుభ్యం ముదమిదముదారం జయతి చ.
ఉదఞ్చద్భిర్భ్యాయ స్తరలితనివేశా వసుమతీ
యదగ్రే యచ్ఛ్వాసైర్గిరిగుడకలీలాముదవహత్. 15

వ్యా. మరియొక ఉదాహరణ మెట్లనగా -

"ఆ దేవుడు-(ఆవరాహమూర్తియు) వరాహముయొక్క సవిలాసస్మితము వలె తెల్లగా నున్న ఆ కోరయు, ఈ ద్వయము నీకు ఆనందమును ఇచ్చుగాక. ఉదారమైన ఈ ద్వయము సర్వోత్కర్షగా నున్నది. మాటిమాటికిని బయల్వెడలుచున్న ఏ వరాహముయొక్క శ్వాసలచే, మాటిమాటికిని చంచల మగునట్లు చేయబడిన స్థితి గల (అనగా ఎగురుచును పడుచును ఉన్న) భూమి ఏ కోరయొక్క అగ్రభాగమునందు బంతియొక్క విలాసను ధరించెనో (బంతి వలె ఉండెనో)"

వి. ఇచట (రెండును ఆనందమును ఇచ్చుగాక; జయించుచున్నవి) 'దిశ్యాత్'. 'జయతి' అనుఆఖ్యాతములు అటు దేవునకును ఇటు దంష్ట్రికును అన్వయించునట్లు సముచితముగ ప్రయోగింపబడినవి.

మూ. అధ్యాహృతాఖ్యాతమ్—

దోర్దణ్డతాణ్డవభ్రష్టముడుఖణ్డం బిభర్తి యః.
వ్యస్తపుష్పాఞ్జలిపదే చన్ద్రచూడః శ్రియే స వః. 16

వ్యా. అధ్యాహృతాఖ్యాతమునకు ఉదాహరణము :-

"ఏ చంద్రశేఖరుడు ఇటు నటు పడిపోయిన పుష్పాంజలి స్థానమున, హస్తముల తాండవముచే రాలిపడిన నక్షత్రసమూహమును ధరించుచున్నాడో

అట్టి చంద్రశేఖరుడు మీ ఐశ్వర్యముకొరకు అగుగాక (అనగా మీకు ఐశ్వర్యము ఇచ్చుగాక.)"

వి అంతకు పూర్వ మున్న పుష్పాంజలి జారిపోయినను దాని స్థానమున, తాండవముచేయునపుడు హస్తాహతమునకు క్రింది పడిపోయిన నక్షత్రసమూహము ఉన్న దని భావము. ఇచట 'అస్తు' లేదా 'భవతు' అను క్రియాపదము అధ్యాహృతము.

మూ. కృదభిహితాఖ్యాతమ్ :-

అభిముఖే మయి సంహృతమీక్షితం

హసితమన్యనిమిత్తకృతోదయమ్.

వినయవారితవృత్తిరిత స్తయా

న వివృతో మదనో న చ సంవృతః. 17

వ్యా. కృదభిహితాఖ్యాతమునకు ఉదాహరణము :-

(ఈ శ్లోకము శాకుంతలములోనిది. దుష్యంతుడు విదూషకునితో పలికిన వాక్యము.) "నేను ఎదురుగా నున్నపుడు (శకుంతలయొక్క) చూపు ఉపసంహరింపబడినది మరి యొక నిమిత్తమేదియో పురస్కరించుకొని ఆమె నవ్వినది. ఈ విధముగ ఆమేచేత, వినయముచే నివారింపబడిన పవృత్తి గల మదనుడు పూర్తిగ వివరింపబడలేదు, అట్లని మరుగుపరచ బడలేదు కూడ."

వి. ఇచట తిఙంతములను ప్రయోగింపలేదు. వాటి అర్థమును 'సంహృతమ్' ఇత్యాదికృదంతశబ్దములే బోధించుచున్నవి గాన ఇది కృదభిహితాఖ్యాతమునకు ఉదాహరణము

మూ. అనపేక్షితాఖ్యాతమ్:-

కియన్మాత్రం జలం విప్ర జానుదఘ్నం నరాధిప

తథాపీయమవస్థా తే న సర్వత్ర భవాదృశాః. 18

వ్యా. అనపేక్షితాఖ్యాతమునకు ఉదాహరణ:-

"ఓ బ్రాహ్మణుడా! ఏ మాత్రము నీరు ఉన్నది? ఓరాజా! మోకాలివరకును ఉన్నది. ఐనను నీ అవస్థ ఇట్లున్నదే ! అంతటను నీవంటివారు ఉండరు కదా?"

వి. ఇచట ఆఖ్యాతముయొక్క ఆవశ్యకత లేదు గాన ఇది అనపేక్షితాఖ్యాతమునకు ఉదాహరణము

మూ. గుణవదలఙ్కృతఞ్చ వాక్యమేవ కావ్యమ్ ''అసత్యార్థాభిధాయిత్వాన్నోపదేష్టవ్యం కావ్యమ్" ఇత్యేకే యథా:-

స్తేమః స్తోకోఽపి నాఙ్గే శ్వసితమవికలం చక్షుషాం సైవ వృత్తిః
మధ్యేక్షీరాబ్ధి మగ్నాః స్ఫుటమథ చ వయం కోఽయమీదృక్ ప్రకారః,
ఇత్థం దిగ్భిత్తిరోధః క్షతవిసరతయా మాంసలైస్త్వద్యశోభిః
స్తోకావస్థానదుస్థైస్త్రిజగతి ధవలే విస్మయన్తే మృగాక్ష్యః. 19

వ్యా. సగుణము, సాలఙ్కారమును అగు వాక్యమే కావ్యము "కావ్యము అసత్యవిషయములను బోధించును గాన దానిని ఉపదేశింపకూడదు (రచింపకూడదు)" అని కొందరి అభిప్రాయము. ఎట్లనగా:- (ఒక కవి రాజుయొక్క కీర్తిని వర్ణించుచు చెప్పుచున్నారు. "ఓరాజా!) దిక్కు లనెడు గోడలు అడ్డుకొనుటచే ప్రసారము ఆగిపోయి నీ కీర్తి ఎక్కువగ ప్రోగుపడిపోయి, చిన్నస్థానములో ఉండుటకు చాల శ్రమపడుచు మూడు లోకములను తెల్లగచేసివేసినది. అపుడు స్త్రీలు (తాము క్షీరసముద్రములో మునిగిపోతి మని భ్రాంతి పడుచు) ఈ విధముగ ఆశ్చర్యపడుచున్నారు:- ''శరీరముమీద కొంచెమైనను తేమ లేదు, శ్వాస మామూలుగానే ఉన్నది. చూపు కూడ యథాపూర్వముగానే ఉన్నది. అయినను మనమందరము క్షీరాబ్ధిలో మునిగిపోయి ఉన్నాము. ఈ పద్ధతి అంతయు క్రొత్తగానున్నదే."

మూ. యథా చ:-

భ్రశ్యద్భూభృద్భుగ్నభోగేశ్వరఫణపవసాధ్మాతపాతాలతాలు-
స్ఫుట్యన్నానాగిరీన్ద్రాగ్రవలభిశిఖరఖరాస్ఫాలలోలామ్బురాశిః.
ఉద్యత్స్ఫారరన్ధ్రధూలీవిధురసురవధూముచ్యమానోపశల్యః
కల్పో ద్యోగస్య యస్య త్రిభువనదమనః సైన్యసమ్మర్ద ఆసీత్. 20

వ్యా. ఇంకను ఎట్లనగా-

''స్వల్పప్రయత్నమును ప్రారంభించిన ఏ రాజుయొక్క క్రిందికి జారిపోవుచున్న భూమిచే వంగిపోయిన ఆదిశేషుని పడగల వాయువుచే నింపబడిన పాతాలో,

పరిభాగము కలదియు, విరిగి పడుచున్న అనేక గిరిశిఖరముల తీవ్రమైన అఘాత ముచే క్షోభించిన సముద్రము కలదియు, పైకి ఎగయుచున్న దట్టమైన పరాగ ముచే వ్యాకులత చెందిన దేవతాస్త్రీలచే విడువబడిన ప్రాంతభూములు కలదియు అగు సైన్యసంమర్దము మూడు లోకములను పీడించునదిగా అయినదో".

వి. పై రెండు శ్లోకములందును కవులు చేసిన కీర్తి-సైన్యభారవర్ణనములు అతిశయోక్తి భరితము లగుటచే అసత్యములు. అట్టి అసత్యకావ్యముల రచన గాని ఉపదేశము గాని వాంఛనీయము కాదని అభిప్రాయము.

మూ. అహుశ్చ:-

దృష్టం కించిదదృష్టమన్యదపరం వాదాలవార్తాశ్రితం
భూయస్తద్ధపురాణతః పరిణతం కించిచ్చ శాస్త్రశ్రుతమ్.
సూక్త్యా వస్తు యదత్ర చిత్రరచనం తత్కావ్యమవ్యాహతం
రత్నస్యేవ న తస్య జన్మ జలధేర్నో రోహణాద్వా గిరేః. 21

వ్యా. కావుననే చెప్పుదురు—

''కొంత విషయము ప్రత్యక్షము; మరికొంత అప్రత్యక్షము; వదరుబోతుల మాటలద్వారా లభించిన విషయము మరికొంత. పుక్కిడిపురాణాల ద్వారా లభించినది మరికొంచెము; శాస్త్రాలతో విన్నది కొంత — ఈ విధముగ అనేకవిధము లగు విషయము మంచిమాటలలో, చిత్రరీతిలో ఏ కావ్యమునందు ఘటింపబడునో అట్టి కావ్యము అడ్డు లేనిది, అనగా నియమరహితమైనది. ఇది రత్నమువలె సముద్రమునుండి గాని, రోహణపర్వతమునుండి గాని ఆవిర్భవించుట లేదు. (అందుచే ఇదేదియో అమూల్యరత్నమని సంతోషించవలసిన పని లేదు.)''

మూ. 'న' ఇతి యాయావరీయః.

''నాసత్యం నామ కించన కావ్యే యస్తు స్తుత్యేష్వర్థవాదః
స న పరం కవికర్మణి శ్రుతౌ చ శాస్త్రే చ లోకే చ. 22

వ్యా. (కావ్యము అనుపదేశ్యము అనునది యుక్తముకాదు) 'అట్లు కాదు' అని యాయావరీయుడు చెప్పుచున్నాడు.

"కావ్యములో అసత్యమేమియు లేదు. స్తుతింపదగినవాటి విషయమున అర్థవాద మనునది కేవలము కావ్యమునందే కాదు; శ్రుతియందును, శాస్త్రమునందును,లోకమునందును కూడఉన్నది."

వి. ఏదైన ఒకయాగాది కర్మను విధించి అది చాలా గొప్పది అని చెప్పుటకై ఆ కర్మను లేదా ఆ కర్మకు సంబంధించిన దేవతను స్తుతించుచు కొన్ని వాక్యములు వేదములో చెప్పబడును. అట్లే ఏదైన ఒక కర్మను నిషేధించి దానిని నిందించుచు కొన్ని వాక్యములు చెప్పబడును అట్టి వాక్యముల అర్థమును యథాతథముగ గ్రహింపవలసిన పని లేదు. ఆ కర్మ చాలా ఉత్తమమైనది, లేదా చెడ్డది అని చెప్పుటమాత్రమే ఈ వాక్యముల ప్రయోజనము. అట్టి వాక్యములకు మీమాంసాశాస్త్రానుసారముగా అర్థవాదము లని పేరు. అట్టి అర్థవాదములు వేద-శాస్త్రాదులలో కూడ ఉన్నవి గాన కేవలము కావ్యమును మాత్రమే దూషింపవలసిన పని లేదని అభిప్రాయము.

మూ. తత్ర శ్రౌతః-

పుష్పిణ్యౌ చరతో జఙ్ఘే భూష్ణురాత్మా ఫలేగ్రహిః.
శేరేఽస్య సర్వే పాప్మానః శ్రమేణ ప్రపథే హతాః. 28

వ్యా. అందు శ్రౌత మగు అర్థవాదమునకు ఉదాహరణము:-

(ఈ శ్లోకము ఐతరేయబ్రాహ్మణములోనిది. దేశసంచారము చేయుట మంచిదని చెప్పుచు ఇంద్రుడు హరిశ్చంద్రకుమారుడగు రోహితునితో అన్న మాటలివి.) "సంచారము చేయువాని పిక్కలు పుష్పించును. అతని ఆత్మ ఫలవంతమగును. పవిత్రతీర్థములు గల మార్గమునందు శ్రమచే (నడచుటచే) త్రొక్కివేయబడినవై అతని పాపము లన్నియు క్రింద శయనించును (నశించును)."

వి. ఇచట దేశసంచారమువలన లాభము కలుగు నని చెప్పుటయందే తాత్పర్యము గాని పిక్కలు పూయును, ఆత్మ ఫలించును,పాపాలు నలిగిపోవును అను అక్షరార్థమునందు తాత్పర్యము కాదు. కాన ఇది అర్థవాదము.

మూ. శాస్త్రీయః-

ఆపః పవిత్రం పథమం పృథివ్యా మపాం పవిత్రం పరమం చ మన్త్రాః
తేషాం చ సామర్గ్యజుషాం పవిత్రం మహర్షయో వ్యాకరణం నిరాహుః.

వ్యాః శాస్త్రీయార్థవాదము ఎట్లనగా-

"ఈభూమి మీద అన్నింటికంటెను పవిత్ర మైనది ఉదకము. ఉదకము కంటెను పవిత్రమైనవి మంత్రములు. సామ-ఋగ్-యజుర్వేదాత్మకము లగు ఆమంత్రములకంటె గూడ వ్యాకరణము పవిత్ర మైనదని మహర్షులు చెప్పుదురు."

వి. ఇచట వ్యాకరణశాస్త్రము చాల ఉత్తమ మైనది అని చెప్పుటయందే తాత్పర్యము కాని అది వేదములకంటె పవిత్రమని చెప్పుటయందు కాదు.

మూ. కిఞ్చ:-

"యస్తు ప్రయుఙ్క్తే కుశలో విశేషే శబ్దాన్యథావద్వ్యవహారకాలే
సోనన్తమాప్నోతి జయం పరత్ర వాగ్యోగవిద్దుష్యతి చాపశబ్దైః. 25

కః? వాగ్యోగవిదేవ. కుత ఏతత్? యో హి శబ్దాన్ జానాత్యపశబ్దానప్యసౌ జానాతి. యథైవ హి శబ్దజ్ఞానే ధర్మః, ఏవమపశబ్దజ్ఞానేఽప్యధర్మః. అథవా భూయానధర్మః ప్రాప్నోతి. భూయాంసో హ్యపశబ్దా అల్పీయాంసః శబ్దాః. ఏకైకస్య హి శబ్దస్య బహవోఽపభ్రంశాః. తద్యథా - గౌరిత్యస్య శబ్దస్య గావీ, గోణీ, గోతా, గోపోతలికా ఇత్యేవమాదయోఽపభ్రంశాః, అథ యోఽవాగ్యోగ విదజ్ఞానమేవ తస్య శరణమ్. నాత్యన్తాయాజ్ఞానం శరణం భవితు మర్హతి. యో హ్యజానన్వై బ్రాహ్మణం హన్యాత్సురాం వా పిబేత్ సోఽపి మన్యే పతితః స్యాత్. ఏవం తర్హి -"సోఽనన్తమాప్నోతి జయం పరత్ర వాగ్యోగవిద్దుష్యతి చాపశబ్దైః" కః? అవాగ్యోగవిదేవ. అథ యో వాగ్యోగవిద్విజ్ఞానం తస్య శరణమ్. క్వపు నరిదం పఠితమ్? భ్రాజా నామ శ్లోకాః. కిం చ భోః శ్లోకా అపి ప్రమాణమ్? కిం చాతః? యది ప్రమాణమయమపి శ్లోకః ప్రమాణం భవితుమర్హతి.

యదుదుమ్బరవర్ణానాం ఘటీనాం మణ్డలం మహత్.
పీతం న గమయేత్స్వర్గం కిం తత్క్రతుగతం నయేత్. 26

ఇతి. "ప్రమత్తగీత ఏష తత్రభవతో యస్త్వప్రమత్తగీతస్తత్ ప్రమాణ మేవ" ఇతి గోనర్దీయః.

వ్యా. (ఇపుడుమహాభాష్యమునందలి పస్పశాహ్నికములో వ్యాకరణ ప్రాశస్త్యమును ప్రతిపాదించిన భాగమును శాస్త్రార్థవాదమునకు ఉదాహరణముగా చూపుచున్నాడు):-

మరియు:- "ప్రయోగవిశేషమునందు కుశలుడై ఎవడు, వ్యవహారకాలమున శబ్దములను నిర్దుష్టముగ ప్రయోగించునో, అట్టి వాగ్యోగవేత్త (వాక్స్వరూప జ్ఞానవంతుడు) పరలోకమున అనంతమగు జయమును పొందును. అపశబ్దములచే దోషమును పొందును." (ఈ శ్లోకమునకు పూర్వపక్షప్రదర్శనపూర్వకముగ గోనర్దీయుడు, అనగా పతంజలి చేసిన వ్యాఖ్యానము). (ఆ అనంతజయమును పొందువాడు) ఎవరు? వాగ్యోగవేత్తయే. ఇది ఏల? శబ్దములు తెలిసినవానికి అపశబ్దములు కూడ తెలియును. శబ్దజ్ఞానము వలన ధర్మము వచ్చునట్లే అపశబ్ద జ్ఞానమువలన అధర్మము కూడ వచ్చును. నిజానికి అధర్మము అధికముగ వచ్చును. ఏలనన అపశబ్దములు అధికసంఖ్యాకములు, శబ్దములు అల్పసంఖ్యాకములు, ఒక్కొక్క శబ్దమునకు ఎన్నియో అపశబ్దము లుండును కదా? అదెట్లనగా 'గౌః' అను ఒక శబ్దమునకు 'గావీ' 'గోణీ' 'గోతా' 'గోపోతలికా" మొదలైనవి అపభ్రంశములు. అవాగ్యోగవిదునకు (ఈ బాధ ఏమియు ఉండదు; అతనికి) అజ్ఞానమే శరణము. (శబ్దములసాధుత్వాసాధుత్వజ్ఞానము లేనివానికి అపశబ్దములు ప్రయోగించినను పాపము రాదు. అతనికి అవి దుష్టశబ్దము లను విషయము తెలియదు కదా అందుచే అతనికి అజ్ఞానమే రక్షకము. అజ్ఞానులగు పశ్వాదులకు బ్రహ్మహత్యాదులు చేసినను ఏ విధముగ పాపము రాదో అట్లే వీనికని). (ఇంత వరకును పూర్వపక్షి అభిప్రాయము. ఇపుడు సిద్ధాంతి తన అభిప్రాయము చెప్పుచున్నాడు):-అజ్ఞానము పూర్తిగ శరణము కాజాలదు. తెలియక బ్రహ్మహత్య చేసినవాడును, తెలియక సురాపానము చేసినవాడును కూడ పతితు డగునుకదా? (తెలిసికొనుటకు శక్తి లేని పశ్వాదులకు అజ్ఞానమువలన చేసిన పాపము పాపము కాక పోయినను, తెలిసికొన సామర్థ్యము కల మానవులకు తెలిసికొనకుండుట కూడ పాపహేతువే అని అభిప్రాయము). అట్లైన అపశబ్దములచే దోషమును పొందువా డెవరు? అవాగ్యోగవిదుడే. వాగ్యోగవిదునకు విజ్ఞానమే శరణము. (అనగా అతడు సుశబ్దజ్ఞాన ముండి సుశబ్దములనే ప్రయోగించును గాన అతనికి, అనంతజయము లభించును. అపశబ్దజ్ఞానమున్నను వాటిని ప్రయోగింపడు గాన దోషము లేదు). ఈ శ్లోకము ఎక్కడ పఠింపబడినది? భ్రాజము లను శ్లోకము లున్నవి; వాటిలో. (కాత్యాయనుడు భ్రాజము లను పేర కొన్ని శ్లోకములను రచించె నని చెప్పుదురు). ఏమయ్యా! శ్లోకములు కూడ ప్రమాణమేనా? ఐతే మాత్రము ఏమి? శ్లోకాలుకూడా ప్రమాణమే అయినచో ఈ శ్లోకము మాత్రము

ఎందుకు కాకూడదు? "తా మవర్ణము లగు (సురా) ఘటములు విశాలమైన సము దాయమును పానము చేసినను స్వర్గము లభింపకున్నచో సౌత్రామణి క్రతువు కోని (అత్యల్ప మైన) మద్యము స్వర్గము నిచ్చునా?" (అనగా వేదములో చెప్పిన రీతిగ సౌత్రామణియజ్ఞము చేసి దానికి అంగముగ కొంచెము మద్యము సేవించి నచో స్వర్గమువచ్చు పక్షమున, మద్యశాలలోనికి పోయి పాత్ర తరువాత పాత్రగా మద్యపానము చేసినచో స్వర్గము ఏలరాదు? అని యర్థము)

అయ్యా! నీవు చెప్పిన ఈ శ్లోకము ప్రమత్తు లెవరో వ్రాసినది. (అందుచే ప్రమాణము కాదు.) అప్రమత్తులు చెప్పినది మాత్రము (శ్లోకమే యైనను) ప్రమాణమే అని గోవర్ధీయుని యభిప్రాయము.

మూ. లౌకికః :-

గుణానురాగమిశ్రేణ యశసా తవ సర్పతా
దిగ్వధూనాం ముఖే జాతమకస్మాదర్ధకుఙ్కుమమ్. 27

వ్యా. లౌకికార్థవాదమున కుదాహరణము:-

"(ఓరాజా!) గుణానురాగముతో కలిసిన వ్యాపించుచున్న నీ కీర్తిచేత, దిగంగనాముఖమునందు అకస్మాత్తుగ అర్ధకుంకుమము (సగముకుంకుమము) ఏర్పడినది".

వి. ఇది శౌర్యాతిశయమును వర్ణించుటకు చెప్పిన అర్థవాదము.

మూ. "అసదుపదేశకత్వాత్తర్హి నోపదేష్టవ్యం కావ్యమ్" ఇత్యపరే. యథా ఏవమ్:-

వయం బాల్యే డిమ్భాం స్తరుణిమని యూనః పరిణతా-
వపీచ్ఛామో వృద్ధాన్పరిణయవిధేస్తు స్థితిరియమ్.
త్వయారబ్ధం జన్మ క్షపయితుమమార్గేణ కిమిదం
న నో గోత్రే పుత్రిః క్వచిదపి సతీలాంఛనమభూత్. 28

వ్యా. "అట్లయినచో అసదుపదేశము చేయునది గాన కావ్యము ఉపదేశింప దగినది కాదు" అని మరి కొందరు చెప్పుదురు. ఎట్లనగా ఇట్లు :-

(ఇది పాతివ్రత్యము నవలంబింతునని చెప్పెడు పుత్రికకు వృద్ధవేశ్యాంగన చేయు ఉపదేశము)- "మేము బాల్యమునందు బాలురను, తారుణ్యమునందు

యువకులను, వార్ధకమున వృద్ధులను, పొందగోరెదము. ఇది (వేశ్యాంగనల) పరిణయ విధానము. ఒప్రతీః ఏమిది! నీవు అమార్గముచే జీవితమును గడుపుటకు ఉద్యుక్తురాలవైతివేః? మన కుటుంబములో పతివ్రతాత్వకలంక మెన్నడును కలుగలేదు."

ఈ శ్లోకమున వివాహపద్ధతియు, పాతివ్రత్యమును దూషింపబడినవి. ఇట్టి అసదుపదేశముల నిచ్చుటచే కావ్యము పరిత్యాజ్యమని అభిప్రాయము.

మూ. "అస్త్యయముపదేశః. కిన్తు నిషేధ్యత్వేన, న విధేయత్వేన" ఇతి యాయావరీయః. య ఏవం విధా విధయః పరస్త్రీషు పుంసాం సంభవన్తి తానవబుధ్యేతేతి కవీనాం భావః.

వ్యా. "వాస్తవమే; ఇట్టి, ఉపదేశ మున్నది. కాని ఇట్టి పని చేయవలె నని కాదు ఈ ఉపదేశను, పరిహరింప వలె నని" అని యాయావరీయు డగు రాజశేఖరుని ఆశయము. పరస్త్రీల విషయమున పురుషులు ఇట్టి ఉపదేశములు చేయు అవకాశ ముండును. ఇట్టి విషయములను జాగ్రత్తగ తెలిసికొనవలెను అని ఏతాదృశశ్లోకరచయిత లగు కవుల అభిప్రాయము *

మూ. కించ "కవివచనాయత్తా లోకయాత్రా. సా చ నిఃశ్రేయసమూలమ్" ఇతి మహర్షయః. యదాహుః -

---

*వాత్స్యాయనుడు కూడ కామసూత్రమునందలి పారదారికాధికరణమున పరభార్యావర్ణనోపాయాదులను వర్ణించి చెప్పి చివరకు - "ఈ చెప్పిన దంతయు ఆచరించవలె నను అభిప్రాయముతో కాదు ఇట్టి వంచనాప్రకారము లుండునని తెలుసుకొని జాగ్రత్తగ నుండుటకు మాత్రమే, అని చెప్పియున్నాడు:-

"సందృశ్య శాస్త్రతో యోగాన్ పారదారిక లక్షితాన్
న యాతి ఛలనాం కశ్చిత్ స్వదారాన్ ప్రతి శాస్త్రవిత్.
పాక్షికత్వాత్ప్రయోగాణామపాయానాఞ్చ దర్శనాత్
ధర్మార్థయోశ్చ వైలోమ్యాన్నాచరేత్పారదారికమ్.
తదేతద్దారగుప్త్యర్థమారబ్ధం శ్రేయసే నృణామ్
ప్రజానాం దూషణాయైవ న విజ్ఞేయో హ్యయం విధిః"
(కామసూత్రము, 5.6-2.60-62)

''కావ్యమయ్యో గిరోయావచ్చరన్తి విశదా భువి.
తావత్సారస్వతం స్థానం కవిరాసాద్య మోదతే". 29

వ్యా. మరియు, లోకయాత్ర కవుల వచనములపై ఆధారపడి యుండును. అట్టి లోకయాత్ర మానవకల్యాణమునకు మూలము. ఈ విషయమునే ఇట్లు చెప్పుదురు :-

"పరిశుద్ధము లైన కావ్యరూపము లగు వాక్కులు ఎంత కాలము వరకు భూలోకమున ప్రచారములో నుండునో అంతవరకును కవి సారస్వతలోకమును పొంది ఆనందించును.''

మూ. కించ -

శ్రీమన్తి రాజ్ఞాం చరితాని యాని
ప్రభుత్వలీలాశ్చ సుధాశినాం యాః
యే చ ప్రభావా స్తపసామృషీణాం
తాః సత్కవిభ్యః శ్రుతయః ప్రసూతాః. 30

వ్యా. మరియు -''రాజుల ఉజ్జ్వలచరిత్రములు, దేవతల ప్రభుత్వవిలాసలు, ఋషీశ్వరుల తపఃప్రభావములు, ఇవన్నియు సత్కవులనుండి ఆవిర్భవించిన శ్రుతులు,"

మూ. ఉక్తఞ్చ :-

ఖ్యాతా నరాధిపతయః కవిసంశ్రయేణ
రాజాశ్రయేణ చ గతాః కవయః ప్రసిద్ధిమ్.
రాజ్ఞా సమోఽస్తి న కవేః పరమోపకారీ
రాజ్ఞో న చాస్తి కవినా సదృశః సహాయః. 31

వ్యా. చెప్పబడినదికూడ —

"కవుల ఆశ్రయమువలన రాజులు ప్రసిద్ధి పొందినారు. రాజుల ఆశ్రయమువలన కవులు ప్రసిద్ధి పొందినారు, కవికి రాజుతో సమానమైన పరమోకారకారి లేదు; రాజుకు కవితో సమానమైన సాహాయ్యకారి లేదు".

మూ. వల్మీకజన్మా స కవిః పురాణః
కవీశ్వరః సత్యవతీసుతశ్చ.

యస్మై ప్రణేతా తదిహానవద్యం
సారస్వతం వర్త్మ న కస్య వన్ద్యమ్. 32

వ్యా. "వల్మీకమునుండి జన్మించిన ఆ ఆదికవియు, సత్యవతీకుమారుడైన వ్యాసకవీంద్రుడును దేనిని నిర్మించి యున్నారో అట్టి నిర్దుష్టమైన సారస్వతమార్గము ఎవనికి ఆదరపాత్రము కాదు?"

మూ. "అసత్యార్థాభిధాయిత్వాన్నోపదేష్టవ్యం కావ్యమ్" ఇతి చ కేచిత్. యథా—

ప్రసర్పన్ ప్రాగ్గ్రీవైర్భృత వనకుక్షిర్ఝణఝణా
కరాలః ప్రాగల్భ్యం వదతి తరుణీనాం ప్రణయిషు
విలాసవ్యత్యాసాజ్జఘనఫలకాస్ఫాలనఘన
స్ఫుటచ్ఛేదోత్సిక్తః కలకనకకాఞ్చీకలకలః. 33

వ్యా. "అసత్యవిషయమును ప్రతిపాదించుట దగుటచే కావ్యము ఉపదేశింప దగినది కాదు" అని కొందరు. ఎట్లనగా — (ఇది ఉపరతివర్ణనము). "రతివిలాసమునందు వ్యత్యాసమువలన (అనగా ఉపరతివలన) జఘనఫలకము యొక్క రాపిడిచే ఘనమైనదియు, స్ఫుటచ్ఛేదమునందు అధికమైనదియు, ఎత్తైన గవాక్షముల ద్వారా ప్రసరించుచు భువనమధ్యము నంతను నింపినదియు, ఝణఝణధ్వనిచే వికటముగ నున్నదియు అగు, బంగారు వడ్డాణముల మధురమైన కలకలధ్వని, నాయకుల విషయమున తరుణుల ప్రాగల్భ్యమును సూచించుచున్నది."

మూ. అపిచ. నిత్యం త్వయి ప్రచురచిత్రకపత్రభఙ్గే
తాటఙ్క-తాడనవిపాణ్డురగణ్డరేఖాః.
స్నిహ్యన్తు రత్నరశనారణనాభిరామ
కామాత్తినర్తితనితమ్బతటాస్తరుణ్యః. 34

వ్యా. మరియు- "ప్రచురమైన చిత్రకములు (బొమ్మలు) గల పత్రరచనలపై కుండలముల తాడనముచే తెల్లనైన గండస్థలములు కలిగినట్టియు (అనగా కుండలముల రాపిడికి చిత్రరచన చెరిగిపోవుటచే తెల్లనైన గండస్థలములు కలిగిన అని యర్థము), రత్నమయములైన వడ్డాణముల ధ్వనిచే మనోహరమగునట్లుగ కామావేశముచే నాట్యమాడునట్లు చేయబడిన నితంబములు కలవారును అగు

యువతులు ఎల్లపుడును నీ విషయమున ప్రేమ కలవారై ఉందురు గాక''

వి. పై రెండు శ్లోకములందును విపరీతరతివర్ణనము అసభ్యముగ నున్నది గాన కావ్యములు త్యాజ్యములు అని భావము.

మూ. ''ప్రక్రమాపన్నో నిబన్ధనీయ ఏవాయమర్థః'' ఇతియాయావరీయః. తదిదం శ్రుతౌ శాస్త్రే చోపలభ్యతే, తత్ర యాజుషః :-

''యోనిరుదూఖలం. శిశ్నం ముసలం మిథునమేతత్ ప్రజననం క్రియతే.''

ఆర్చః :-

''ఉపోప మే పరామృశ మా మే దభ్రాణి మన్యథాః
సర్వాహమస్మి రోమశా గాన్ధారీణా మివావికా.'' 85

శాస్త్రీయః-

యస్యాః ప్రసన్నధవలం చక్షుః పర్యన్తపక్ష్మలమ్.
నవనీతోపమం తస్యా భవతి స్మరమన్దిరమ్,'' 86

వ్యా. ''ప్రసంగానుసారముగ ఇట్టి విషయమును కూర్చినను తప్పు లేదు'' అని యాయావరీయుడు. ఇది (కావ్యములలోనే కాదు); వేదమునందును, శాస్త్రమునందును గూడ కానవచ్చుచున్నది. (అసభ్యవర్ణన లుండుటచే, వేదశాస్త్రములు కూడ హేయములే యగును అని యభిప్రాయము). అందు యజుర్వేదమునకు సంబంధించినది:-

''యోని రోలు, శిశ్నమురోకలి, ఇది మిథునము, సంతానోత్పాదనము చేయబడుచున్నది.'' ఋద్వేగములోనిది:-

(బృహస్పతి దుహిత యగు రోమశ తన పతిని పొందుకై పిలిచినది. రోమరహితము లగు ఆమె అంగములను జూచి అతడు నవ్వెను. అపు డామె ఇట్లు చెప్పినది.) ''నన్ను సమీపించి అలింగనము చేసికొనుము. (నా శరీరమునందలి రోమములు) అల్ప మైన వని భావింపకుము. గాంధారదేశమునకు సంబంధించిన గొఱ్ఱెవలె, నేను దేహమునం దంతటను రోమవంతురాలనై ఉన్నాను.'' (ఋగ్వేదము 2.1.11.7.) (అనగా అజాతరోమ యగు స్త్రీయొక్క సంగమము చేయరాదు అను శాస్త్రమునకు విరోధ మేమియు రాదు అని తాత్పర్యము).

శాస్త్రీయ మగు అసభ్యవర్ణనమున కుదాహరణము;-

"ఏ వనితయొక్క నేత్రము ప్రసన్నమైనదై, తెల్లనిదై, ప్రాంతములందు చిక్కని రెప్పల వెంట్రుకలు కలదై ఉండునో ఆమె యొక్క స్మరమందిరము నవనీతము వలె నుండును."

మూ. పదవాక్యవివేకోఽయమితి కిఞ్చిత్ ప్రపఞ్చితః
అథ వాక్యప్రకారాంశ్చ కాంశ్చిదన్యాన్నిబోధత. 87

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే షష్ఠోఽధ్యాయః పదవాక్యవివేకః.

వ్యా. "ఈ విధముగ కొంతవరకు పదవాక్యవివేకము విశదీకరింపబడినది. ఇపుడిక కొన్ని వాక్యప్రకారములను తెలిసికొనుడు."

కావ్యమీమాంసావ్యాఖ్య యగు బాలానందినిలో షష్ఠాధ్యాయము సమాప్తము.

సప్తమోఽధ్యాయః – వాక్య భేదాః.

మూ. వాక్యం వచనమితి వ్యవహరన్తి, తచ్చ త్రిధా ప్రణేతృభేదేన-బ్రాహ్మం, శైవం, వైష్ణవమితి. తదిదం వాయుప్రోక్తపురాణాదిభ్య ఉపలబ్ధం యదుత బ్రాహ్మం వచః పఞ్చధా స్వాయమ్భువమైశ్వరమార్షమార్షీకమార్షిపుత్రకం చ.

వ్యా. వాక్యమును వచన మని కూడ అందురు. వచనము రచయితల భేదమును బట్టి – బ్రాహ్మము, శైవము, వైష్ణవము అని మూడు విధములు. బ్రాహ్మము మరల–స్వాయంభువము, ఐశ్వరము, ఆర్షము, ఆర్షీకము, ఆర్షిపుత్రకము అని ఐదు విధము లని వాయుపురాణాదులవలన తెలియుచున్నది.

మూ. స్వయమ్భూర్బ్రహ్మా: తస్య స్వాయమ్భువమ్, తన్మనోజన్మానో భృగుప్రభృతయః పుత్రాస్తే ఈశ్వరాః; తేషామైశ్వరమ్ ఈశ్వరాణాం సుతా ఋషయః తేషామార్షమ్. ఋషీణామపత్యాని ఋషీకాః; తేషామార్షీకమ్. ఋషీకాణాం సూనవ ఋషిపుత్రకాః; తేషామార్షిపుత్రకమ్,

వ్యా. 'స్వయంభూః' అనగా బ్రహ్మ. అతని వాక్యము స్వాయంభువము. భృగువు మొదలగువారు అతని మానసపుత్రులు. వారు ఈశ్వరులు. వారి వాక్యము ఐశ్వరము, ఈశ్వరుల సుతులు ఋషులు. వారి వాక్యము ఆర్షము, ఋషుల సంతాన మైనవారు ఋషీకులు. వారి వచనము ఆర్షీకము ఋషీకుల పుత్రులు ఋషిపుత్రులు. వారి వచనము ఆర్షిపుత్రకము.

మూ. స్వయమ్భువః ప్రథమం వచః శ్రుతిః. శ్రుతేరన్యచ్చ స్వాయమ్భువమ్. తదాహుః-

సర్వభూతాత్మకం భూతం పరివాదం చ యద్వదేత్.
క్వచిన్నిరుక్తమోక్షార్థం వాక్యం స్వాయమ్భువం హి తత్ 1

వ్యా. స్వయంభువుయొక్క మొదటి వచనము శ్రుతి. శ్రుతిభిన్న మగు స్వయంభువాక్యమునకు స్వాయంభువ మని పేరు-ఈ విషయమునే చెప్పుదురు:- (బ్రాహ్మవచనమునకు సంబంధించిన ఈ ఐదు విభాగములలో భాషయొక్క క్రమికవికాసమును ప్రతిపాదించుచున్నట్లు కనబడుచున్నది) సర్వభూతస్వరూప మైనది, అనగా సర్వభూతములను గూర్చి వర్ణించునది. జరిగిన యథార్థవిషయములను చెప్పునది (భూతం) నిందాత్మక మైనది(అనగా దోషములను నిందించునది) కొన్ని స్థలములలో మోక్షమును ప్రతిపాదించునది అగు వాక్యము స్వాయంభువము.

మూ. తదేవ శ్లోకరూపాన్తరపరిణతమైశ్వరం వచః ఉక్తఞ్చ:-

వ్యక్తక్రమమసంక్షిప్తం దీప్తగమ్భీరమర్థవత్
ప్రత్యక్షం చ పరోక్షం చ లక్ష్యతామైశ్వరం వచః. 2.

వ్యా. కొంచెము రూపాన్తరముతో పరిణత మగు ఆ స్వాయంభువవచనమే ఐశ్వరవచన మగును. ఈ విషయము కూడ చెప్పబడినది. "స్పష్ట మైన క్రమము కలదియు, సంక్షిప్తము కానిదియు, దీప్తము గంభీరము అయినదియు, అర్థము కలదియు, ప్రత్యక్షము, పరోక్షముఅయిన (అనగా ప్రత్యక్షపరోక్షార్థ ప్రతిపాదకమును) లేదా విషయమును ప్రత్యక్షముగ చెప్పునది ప్రత్యక్షము. కథకు సంబంధించిన వ్యక్తులద్వారా విషయమును చెప్పునది పరోక్షము. వచనము ఐశ్వరవచన మని తెలియవలెను."

మూ. ఆర్షమ్ :- యత్కిఞ్చిన్మన్త్రసంయుక్తం యుక్తం నామవిభక్తిభిః
ప్రత్యక్షాభిహితార్థం చ తదృషీణాం వచః స్మృతమ్. 3.

వ్యా. ఆర్షవచనలక్షణము:- ఏవియో కొన్ని మంత్రములతో కూడినదియు, నామవిభక్తులతో కూడినదియు, ప్రత్యక్షముగ చెప్పబడిన అర్థము కలదియు అగు వచనము ఆర్షవచన మని చెప్పబడినది.

మూ. ఆర్షీకమ్:-

నైగమైర్వివిధైః శబ్దైర్నిపాతబహులం చ యత్
న చాపి సుమహద్వాక్యమృషీకాణాం వచస్తు తత్. 4

వ్యా. ఆర్షీకవచనమునకు లక్షణము:-

"అనేక వైదికములగుశబ్దములతో కూడినదియు, అధికముగ నిపాతములు కలదియు, దీర్ఘవాక్యములు లేనిదియు అగు వచనము ఆర్షీకము.

మూ. ఆర్షిపుత్రకమ్:-

అవిస్పష్టపదప్రాయం యచ్చ స్యాద్బహుసంశయమ్
ఋషిపుత్రవచస్తత్స్యాత్సర్వపరిదేవనమ్. 5
తదుదాహరణాని పురాణేభ్య ఉపలభేత.

వ్యా. ఆర్షిపుత్రకవచనలక్షణము:- "అస్పష్ట మైన పదములు అధికముగా కలదియు, అధికసంశయకారియు, అందరి (లేదా అన్ని విధములైన) పరిదేవనములతో (విలాపములతో) కూడినదియు అగు వచనము ఆర్షిపుత్రకము."

ఈ ఐదు విధముల బ్రాహ్మవచనమునకు ఉదాహరణములను పురాణముల నుండి గ్రహింపవలెను.

వి. ఈ పంచవిధవిభాగము వాయు పురాణములోనున్నది. లక్షణోదాహరణాదులు మాత్రము లేవు.

మూ. సారస్వతాః కవయో నః పూర్వే ఇత్థఙ్కారం కథయన్తి. బ్రహ్మ విష్ణురుద్రగుహబృహస్పతిభార్గవాదిశిష్యైమ చతుఃషష్ట్యావుపదిష్టం వచః పారమేశ్వరమ్. క్రమేణ చ సఞ్చరద్దైవైర్దేవయోనిభిశ్చ యథామత్యుపజీవ్యమానం దివ్యమితి వ్యపదిశ్యతే. దేవయోనయస్తు:-

విద్యాధరాప్సరోయక్షరక్షోగన్ధర్వకిన్నరాః
సిద్ధగుహ్యకభూతాశ్చ పిశాచా దేవయోనయః, 6

వ్యా. ప్రాచీను లగు సారస్వతకవులు మనకు ఈ విధముగ చెప్పుచున్నారు. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, కుమారస్వామి, బృహస్పతి, శుక్రాచార్యులు మొదలగు అరువదినలుగురు శిష్యులకు ఉపదేశించిన వచనము పారమేశ్వరము. కాల క్రమమున దేవతలును, దేవయోను లగు విద్యాధరాదులును తమ తమ బుద్ధి బలము ననుసరించి దీనినే ఆశ్రయించుటచే దీనికి దివ్యవచన మను పేరు వచ్చినది. దేవయోను లెవరనగా-"విద్యాధరులు, అప్సరసలు, యక్షులు, రాక్షసులు, గంధ ర్వులు, కిన్నరులు, సిద్ధులు, గుహ్యకులు, భూతములు, పిశాచములు-వీరు దేవ యోనులు."

మూ. తత్ర పిశాచాదయః శివానుచరాః స్వభూమౌ సంస్కృతవాదినః, మర్త్యే తు భూతభాషయా వ్యవహరన్తో నిబన్ధనీయాః. అప్సరసస్తు ప్రాకృత భాషయా. తద్దివ్యం వచశ్చతుర్ధా వైబుధం, వైద్యాధరం, గాన్ధర్వం, యోగినీగతం చ. శేషాణామప్యేతేష్వేవోపలక్షణం ప్రకృతిసాదృశ్యేన. తత్ర వైబుధమ్:-

"సమాసవ్యాససన్దృబ్ధం శృఙ్గారాద్భుతసమ్భృతమ్,
సానుప్రాసముదారం చ వచః స్యాదమృతాశినామ్." 7

వ్యా. వారిలో శివానుచరు లగు పిశాచాదులు తమ లోకమున సంస్కృత భాషలోను, మర్త్యలోకమున భూతభాషలోను మాటలాడునట్లుకూర్చవలెను. అప్స రసలు ప్రాకృతభాషలో వ్యవహరించునట్లు కూర్చవలెను. ఆ దివ్యవచనము-వైబుధము, వైద్యాధరము, గాంధర్వము, యోగినీగతము, అని నాలుగు విధములు. ఇతరవచనములను ప్రకృతిసాదృశ్యమును బట్టి (ఆయా దేవయోనుల స్వభావ సాదృశ్యమును బట్టి లేదా ఆయాభాషల ప్రకృతుల సాదృశ్యమును బట్టి) ఈ నాల్గు విధము లగు వచనములలోనే అంతర్భావము చేయవలెను. వానిలో వైబుధవచన లక్షణము:-

"సమస్తవ్యస్తపదములతో కూర్చినదియు, శృంగార - అద్భుతరస ములతో కూడినదియు అనుప్రాససహితము, ఉదాత్తముగ నుండునదియు అగు భాష దేవతలభాష, అనగా వైబుధవచనము" ఎట్లనగా:-

మూ. యచ్చన్ద్రకోటికరకోరకభారభాజి
బభ్రామ బభ్రుణి జటాకుహరే హరస్య.

తద్వః పునాతు హిమశైలశిలానికుఞ్జ
ఝాంకారడమ్బరవిరావి సురాపగామ్బుః 8

వ్యా. "చంద్రకళ యొక్క కిరణము లనెడు మొగ్గల భారమును వహించిన రాగిరంగు గల శివుని జటాగుహయందు ఏది తిరుగాడెనో, హిమవత్పర్వత శిలలపై నున్న పొదరిండ్లలోని ఝూంకారధ్వనియొక్క అడంబరముతో ధ్వనిచేయుచున్న ఆ గంగానదీజలము మిమ్ములను రక్షించుగాక."

వి. ఇచట 'చంద్రకోటి' 'హిమశైల' ఇత్యాదిపదములుసమస్తములు. ఇతరపదములు వ్యస్తములు 'కోరకభారభాజి' ఇత్యాదులలో అనుప్రాస మున్నది. అద్భుతరస మున్నది.

మూ. వైదర్భరమ్:-
"శ్లోకానుప్రాసస్ఛాయం చతురోక్తి ప్రసాది చ.
ద్రాఘీయసా సమాసేన విద్ధి వైదర్భకం వచః" 9

వ్యా. వైదర్భరవచనమునకు ఉదాహరణము :- "కొంచెము అనుప్రాస చ్ఛాయకలదియు, సుందరమైన ఉక్తులు కలదియు, ప్రసాదగుణము కలదియు, దీర్ఘ సమాసములు కలదియు అగు వచనము వైదర్భరవచనమని తెలియుము".

మూ. యథా:- ప్రణతసురకిరీటప్రాంశురత్నాంశువంశ
చ్ఛురితనఖశిఖాగ్రోద్భాసమానారుణాఙ్ఘ్రే.
ఉదితతరణిపృన్దోద్దామధామోర్ధ్వనేత్ర
జ్వలననికరదగ్ధానఙ్గమూర్తే నమస్తే. 10.

యథా వా:- భ్రమతి భ్రమరకరమ్బితనన్దనవనచమ్పకస్తబకగౌరః.
వాత్యాహత ఇవ వియతి స్ఫుటలక్ష్మా రోహిణీరమణః. 11

వ్యా. ఎట్లనగా:- "నమస్కరించుచున్న దేవతల కిరీటములందలి దీర్ఘ మైన రత్నకిరణముల సముదాయముచే పూయబడిన నఖశిఖల అగ్రభాగములతో ప్రకాశించుచున్న పాదములు కలవాడా! ఉదయించిన సూర్యసముదాయము వలె తీవ్ర మైన కాంతి గల ఊర్ధ్వ (ఫాల) నేత్రమునందలి అగ్ని సముదాయముచే కాల్చబడిన మన్మథశరీరము కలవాడా! నీకు నమస్కారము".

వి. ఈ శ్లోకములో రెండు దీర్ఘసమాసము లున్నవి. అయినను అర్థము స్పష్టముగ తెలియుటచే ప్రసాదగుణ మున్నది. "ప్రాంశురత్నాంశు" 'ఉద్దామధా

మోర్ధ్వ' ఇత్యాదులలో అను[ప్రాసచ్ఛాయ. ఇంకను ఎట్లనగా:- "(గాలికి ఎగుర గొట్టబడిన) తుమ్మెదలతో గూడిన నందనవనచంపకగుచ్ఛము వలె తెల్లగా నున్న ద్దియు, స్పష్టమైన కలంకము కలదియు అగు చం[ద్రబింబము, గాలికి ఎగురగొట్ట బడినది వలె, ఆకాశమునందు తిరుగుచున్నది."

మూ. గాన్ధర్వమ్:-

''[హస్వైః సమాసైర్భూయోభిర్విభూషితపదోచ్చయా
తత్త్వార్థ[గథన[గాహ్యా గన్ధర్వాణాం సరస్వతీ''. 12
యథా:- నమః శివాయ సోమాయ సగణాయ ససూనవే.
సవృషవ్యాలశూలాయ సకపాలాయ సేన్దవే. 13

వ్యా. గాంధర్వవచనమునకు లక్షణము:- ''అనేకములైన చిన్ని చిన్ని సమాసములచే అలంకరించబడిన పదసముదాయము కలదియు, తత్త్వార్థమును [ప్రతిపాదించుటచే [గాహ్య మైనదియు అగు సరస్వతి గంధర్వులకు సంబం ధించినది.'' ఎట్లనగా:-

''ఉమతోడను, [పమథగణములతోడను. కుమారులతోడను, వృషభ - సర్ప - [తిశూలములతోడను, కపాలముతోడను, చం[దునితోడను కూడిన శివు నకు నమస్కారము''.

ఈ శ్లోకములోని సమాసము లన్నియు చిన్నవి. శివునకు సంబంధించిన ఉత్తమతత్త్వము [ప్రతిపాదింపబడినది.

మూ. యోగినీగతమ్ :-

"సమాసరూపక[ప్రాయం గమ్భీరార్థపద[క్రమమ్.
సిద్ధాన్తసమయస్థాయి యోగినీనామిదం వచః.'' 14

వ్యా. యోగినీగతవచనలక్షణము :- ''సమాసములు, రూపకాలంకార ములు ఎక్కువగ ఉండునది, గంభీరమైన అర్థము గల పదరచన కలది, ఆ యా మతముల సిద్ధాంతములతోడను సమయముల (సం[ప్రదాయముల) తోడను సంబంధించినది యోగినీవచనము''

మూ. యథా-:- దుఃఖేన్ధనైకదహనామృతవర్షమేఘ
సంసారకూపపతనైక కరావలమ్బ.

యోగీన్ద్రవిదర్పణ జగద్గతకృత్స్నతేజః
ప్రత్యక్షచౌరవర వీరపతే నమస్తే. 15

వ్యా. ఎట్లనగా :- "దుఃఖ మనెడు ఇంధనమునకు ఏకైకమగు అగ్ని యైనవాడా ! అమృతవర్షమును కురిపించు మేఘుడా ! (లేదా దుఃఖమే ఇంధనముగా గల అగ్నిని చల్లార్చుటకు అమృతమును వర్షించు ఏకైకమేఘమా !) సంసార మనెడు కూపమునందు పడునపుడు ఏకైకహస్తావలంబ మైనవాడా, యోగీంద్రులకు ఆదర్శ మైనవాడా, అందరు చూచుచుండగనే ప్రపంచమునందలి తేజస్సునంతను అపహరించు చోరశ్రేష్ఠుడా ! వీరాధిపా (శివా !) నీకు నమస్కారము."

మూ. మహాప్రభావత్వాద్భోజఙ్గమపి దివ్యమిత్యుపచర్యతే.
ప్రసన్నమధురోదాత్తసమాసవ్యాసభాగవత్
అనోజస్విపదప్రాయం వచో భవతి భోగినామ్. 16

యథా :- సుసజ్జి (జ్జి) తాం శ్రోత్రసుఖాం సురూపా
మనేకరత్నోజ్జ్వలచిత్రితాఙ్గీమ్,
విద్యాధరేన్ద్రః ప్రతిగృహ్య వీణాం
పినాకినే గాయతి మఙ్గలాని. 17

వ్యా. మహాప్రభావము కలదగుటచే భౌజంగముకూడ, ఉపచారముచే దివ్య మని చెప్పబడుచున్నది. "భోగి (సర్పముల) వచనము ప్రసన్న మైనదిగను, మధురముగను, ఉదాత్తముగను, సమస్తవ్యస్తపదములు కలదిగను, ఓజో రహితము లగు (సమాసరహితము లగు) పదములు అధికముగ కలదిగను (అనగా మృదుబంధముగను) ఉండును." ఉదాహరణ మెట్లనగా:-

"విద్యాధరేంద్రుడు — బాగుగ సిద్ధము చేయబడినదియు, చెవులకు ఇంపైనదియు, మంచి రూపము కలదియు, అనేకరత్నములచే ప్రకాశించుచున్న చిత్రిత మైన అంగము కలదియు అగు వీణను గ్రహించి, ఈశ్వరునికై, మంగళ గీతములను గానము చేయుచున్నాడు."

మూ. "కిమర్థం పునరనుపదేశ్యయోర్బ్రాహ్మపారమేశ్వరయోర్భాషాక్రమ- మార్గయోరుపన్యాసః ?" ఇత్యాచార్యాః. "సోఽపి కవీనాముపదేశపరః" ఇతి -

యాయావరీయః, యతో నాటకాదావీశ్వరాదీనాం దేవతానాం చ ప్రవేశే తద్వ్యాపన్తి వాక్యాని విధేయాని. ఇతిదివ్యమ్

వ్యా. "ఉపదేశ్యములు కాని (చెప్పుటకు అవశ్యకములు కాని) బ్రాహ్మవాక్యమార్గ - పారమేశ్వరవాక్యమార్గములను గూర్చిన ఈ నిరూపణము ఎందులకు?" అని ఆచార్యులందురు. "ఇది కూడ కవుల ఉపదేశముకొరకే" అని యాయావరీయుడు. ఏలనన - నాటకాదులలో, ఈశ్వరాదులు కాని, దేవాదులు కాని ప్రవేశించినపుడు వారి వచనములతో సమాన మైన వాక్యములను ప్రయోగింపవలెను. ఇంతవరకును నిరూపించినది దివ్యము.

మూ. ఇహ హి ప్రాయోవాదో యదుత మర్త్యావతారవ్యవహారరుచేర్భగవతో వాసుదేవస్య వచో వైష్ణవమ్ తన్మానుషమితి వ్యపదిశన్తి, తచ్చ త్రిధా రీతిత్రయభేదేన. తదాహుః-

"వైదర్భీ గౌడీయా పాఞ్చాలీ చేతి రీతయస్తిస్రః,
ఆసు చ సాక్షాన్నివసతి సరస్వతీ తేన లక్ష్యన్తే. 18

వ్యా. మర్త్యావతారవ్యవహారమునందు రుచి గల భగవంతు డగు వాసుదేవుని వచనము వైష్ణవ మని సాధారణముగ చెప్పుచుందురు. దానినే మానుష మనికూడ అందురు. రీతిత్రయభేదము ననుసరించి అది మూడు విధములు. ఈ విషయమునే ఇట్లు చెప్పుదురు:- "వైదర్భి, గౌడీయ, పాఞ్చాలి అని మూడు రీతు లున్నవి. సరస్వతి సాక్షాత్తుగ. వీటియందే నివసించును. అందుచే వీటి లక్షణములు చెప్పబడుచున్నవి."

మూ. రీతిరూపంవాక్యత్రితయం కాకుః పునరనేకయతి. "కాకుర్వ (వ) క్రోక్తిర్నామ శబ్దాలఙ్కారోఽయమ్" ఇతి రుద్రటః. "అభిప్రాయవాన్పాఠధర్మః కాకుః; స కథ మలఙ్కారీ (రః) స్యాత్?" ఇతి యాయావరీయః.

వ్యా. "కాకువక్రోక్తి అనునది శబ్దాలంకారము" అని రుద్రటుడు, "సాభిప్రాయ మగు పాఠధర్మము కాకువు. అది (పాఠధర్మము, అనగా చదివెడు పద్ధతి) అలంకార మెట్లగును?" అని యాయావరీయుడు.

మూ. సా చ ద్విధా -సాకాంక్షా - నిరాకాంక్షా చ. - వాక్యాన్తరాకాంక్షిణీ సాకాంక్షా, వాక్యోత్తరభావినీ నిరాకాంక్షా. తదేవ వాక్యం కాకువిశేషేణ సాకాం

షస్,తదేవ కాక్వన్తరేణ నిరాకాంక్షమ్ ఆక్షేప గర్భా. ప్రశ్నగర్భా, వితర్క-గర్భా చేతి సాకాంక్షా. విధిరూపా, ఉత్తరరూపా, నిర్ణయరూపేతి నిరాకాంక్షా. తత్రాక్షేపగర్భా:-

వ్యా. సాకాంక్షము. నిరాకాంక్షము అని ఆ కాకువు రెండు విధములు. మరి యొక వాక్యమును అపేక్షించునది సాకాంక్షకాకువు. వాక్యమునకు అనంతరమున ఉండు కాకువు నిరాకాంక్షము. ఒకే వాక్యము ఒక రకమైన కాకువును ప్రయోగించినచో సాకాంక్షమగును; మరి యొక విధమగు కాకువును ప్రయోగించినచో నిరాకాంక్ష మగును. సాకాంక్షకాకువు ఆక్షేపగర్భము, ప్రశ్నగర్భము, వితర్కగర్భము అని మూడు విధములు. నిరాకాంక్ష కాకువు విధిరూపము,ఉత్తర రూపము, నిర్ణయరూపము అని మూడు విధములు. అందు ఆక్షేపగర్భకాకువు ఎట్లనగా:-

మూ. యది మే వల్లభా దూతీ తదాహమపి వల్లభా.

యది తస్యాః ప్రియా వాచః తన్మమాపి ప్రియ ప్రియాః. 19

ఏవమేవ నిర్దేష్టుర్విధిరూపా.

వ్యా. అందు ఆక్షేపగర్భకాకువు ఎట్లనగా(నాయకుని తీసికొని వచ్చుటకై పంపిన దూతి అతనిని తీసికొనివచ్చుటకు బదులు అతనితో రమించి వచ్చినది.ఆ దూతిని గూర్చి నాయిక మరి యొక సఖితో మాటలాడు సందర్భమున రెండు నాలుగు పాదములను ఒక విధ మగు స్వరముతో ఉచ్చరించినచో అర్థ మిట్లు వచ్చును):-"నా దూతి (అతనికి) ఇష్టురాలైనచో అపుడు నేను కూడ ఇష్టురాలనా? (కానని అర్థము.ఇదియేఆక్షేపము). ఆమె వాక్కులు ప్రియ మైనచో నావాక్కులు కూడ ప్రియములా? (కావని యర్థము)." (దూతి అవిధముగ మోసము చేయక సహాయకారిణిగనే ఉన్నపుడు ఈ వాక్యములను మామూలు స్వరముతోడనే చదువవలెను. అపుడు అది విధిరూప మగును, "నా దూతిఇష్ట మైనచో నేనును ఇష్ట మైనదానినే. ఆమె వాక్కులు అతనికి ఇష్ట మైనచో నా వాక్కులు కూడ అతనికి ఇష్టమైనవే,"

మూ. ప్రశ్నగర్భా:-

''గతః స కాలో యత్రాసీ న్ముక్తానాం జన్మ వల్లిషు
వర్తన్తే స్మాద్ప్రతం తాసాం హేతవః శుక్తిసమ్పుటాః.'' 20

ఇయమేవోపదేష్టురుత్తరరూపా.

వ్యా. ప్రశ్నగర్భకాకువుకు ఉదాహరణము:-

(ఈ శ్లోకమున 'గతః' వర్తన్తే' అను పదములను ఒక విధమగు స్వరముతో ఉచ్చరించినచో ప్రశ్నించినట్లు అగును. అది కాక మామూలుగ పలికినచో ఉపదేష్ట (చెప్పువాడు) సమాధాన మిచ్చిన ట్లగును "ఏ కాలమున లతలకు ముత్యములు జన్మించెడివో ఆ కాలము గడచిపోయినదా? ఇపుడు వాటికి ముత్యపుచిప్పలు మాత్రమే కారణముగా నున్నవా?'' (ఇది ప్రశ్నగర్భ.) 'గడచిపోయినది' 'కారణముగా నున్నవి' అని పలికినచో ఇది ఉత్తరరూపకాకు వగును.

మూ. వితర్కగర్భా:-

నవజలధరః సన్నద్ధోఽయం న దృప్తనిశాచరః
సురధనురిదం దూరాకృష్టం న నామ శరాసనమ్.
అయమపి పటుర్ధారాసారో న బాణపరమ్పరా
కనకనికషస్నిగ్ధా విద్యుత్ప్రియా న మమోర్వశీ. 21

ఇయ మేవోపదేష్టుర్నిర్ణయరూపా. తా ఇమా స్తిస్రోఽపి నియతనిబన్ధాః. తద్విపరీతాః పునరనన్తాః.

వా. వితర్క గర్భకాకువునకు ఉదాహరణము :-

"ఏమీ! ఇవి విజృంభించుచున్న నూతనమేఘమా? దృప్తనిశాచరుడు కాడా? ఇది తీవ్రమైన ధారాపాతమా! బాణపరంపర కాదా? ఇది ఇంద్రధనుస్సా? బాగుగా లాగిన ధనుస్సు కాదా! ఇది బంగారపు రేఖ వలె సుందర మైన మెరుపా? నా ఊర్వశి కాదా!"

(ఇది ఊర్వశీవిరహముచే ఉన్మత్తు డగు పురూరవుడు మేఘమును చూచి తనలో తాను అనుకొను మాటలు). ఈ శ్లోకమునందే ''ఇది నవజలధరము; దృప్త నిశాచరుడు కాదు" ఇత్యాదివిధమున చెప్పినచో నిర్ణయరూపకాకు వగును.

ఈ మూడు కాకువులును నియాత మైన కూర్పుకలవి. (అనగా ఆక్షేపగర్భకాకువు విధిరూపకాకువుతోడను, ప్రశ్నగర్భకాకువు ఉత్తరరూపకాకువు

తోడను, వితర్కగర్భకాకువు నిర్ణయరూపకాకువుతోను తప్పక సంబంధించి యుండును.) వీటికంటె భిన్నము లగు కాకువులైతే అనంతసంఖ్యాకములు.

మూ. తత్రాభ్యుపగమానునయకాకూ:-

"యుష్మచ్ఛాసనలఙ్ఘనామ్భసి మయా మగ్నేన నామ స్థితమ్
ప్రాప్తా నామ విగర్హణా స్థితిమతాం మధ్యేఽనుజానామపి.
క్రోధోల్లాసిత శోణితారుణగదస్యోచ్ఛిన్దతః కౌరవాన్
నాద్యైకం దివసం మమాసి న గురుర్నాహం విధేయ స్తవ." 22

వ్యా. అందు అభ్యుపగమకాకువునకును (జరిగిన లేక జరుగబోవువిషయమును ఒప్పుకొనుటను సూచించు కాకువు) అనునయ కాకువునకును (అనునయ మనగా బతిమాలుట) ఉదాహరణము:-

(ఇది వేణీసంహారములో కోపోద్రిక్తు డగు భీముడు సహదేవుని ఎదుట యుధిష్ఠురుని గూర్చి పలికిన వాక్యము.)

"నేను మీ ఆజ్ఞను లంఘించుట అనెడు ఉదకమునందు మునిగిన మునుగుదును గాక, మర్యాదాపాలకు లగు అనుజులలో నాకు నింద వచ్చిన వచ్చుగాక. (ఇవి అభ్యుపగమకాకువులు) కోపముచే త్రిప్పబడినదియు, రక్తముచే ఎఱ్ఱనైనదియు అగు గద కలవాడనై కౌరవసంహారము చేయు నాకు నీవు ఒక్క రోజుపాటు గురువు కావు; నేను నీకు విధేయుడను కాను." (ఇచట కాకువు ఇట్లు అగునట్లు చేయుము అని అనునయమును సూచించుచున్నది.)
ఈ విధముగ ఈ శ్లోకపూర్వార్ధమున అభ్యుపగమకాకువు. ఉత్తరార్ధమున అనునయ కాకువు. ఈ కాకువులు ఒకదానితో ఒకటి సంబంధించినవి కావు).

మూ. అభ్యనుజ్ఞోపహాసకాకూ:-

''మథ్నామి కౌరవశతం సమరే న కోపాత్
దుఃశాసనస్య రుధిరం న పిబామ్యురస్తః.
సంచూర్ణయామి గదయా న సుయోధనోరూ
సన్ధిం కరోతు భవతాం నృపతిః పణేన. 23

వ్యా. అభ్యనుజ్ఞోపహాసకాకువులకు ఉదాహరణము:-

(వేణీసంహారమున - యుధిష్ఠిరుడు కౌరవులతో సంధి ప్రయత్నములు చేయుచున్నట్లు విని భీముడు కోపముతో అన్న మాటలు) "యుద్ధమునందు కోపముతో కౌరవశతమును మథించవా! దుశ్శాసనుని వక్షమునుండి రక్తమును త్రాగవా! గదతో సుయోధనుని తొడలను చూర్ణముచేయవా: (ఈ మూడు స్థలములందును ఉపహాసకాకువు) మీ రాజు ఏదియో షరతులకు లొంగి సంధి చేసుకొనుగాక. (ఇచట అభ్యనుజ్ఞా కాకువు. భీముడు సంధికి అభ్యనుజ్ఞ ఇచ్చుచున్నట్లు కనబడుచున్నను అతనికి సంధి అనిష్టము అనునది స్పష్టము).

మూ ఏవం త్రిచతుఃకాకుయోగోఽపి. తత్ర త్రియోగం :-

"సేయం పశ్యతి నో కురఙ్గకవధూ స్తస్యైవముద్వీక్షతే
తస్యాః పాణిరయం న మారుతవలత్పత్రాంగులిః పల్లవః,
తారం రోదితి సైవ నైష మరుతా వేణుః సమాపూర్యతే
సేయం మామభిభాషతే ప్రియతమా నో కోకిలః కూజతి" 24

వ్యా ఈ విధముగ మూడు కాకువులును నాలుగు కాకువులును గూడ ఒకచోట కలిసి ఉండ వచ్చును. అందు మూడు కాకువుల యోగమునకు ఉదాహరణము :-

(విక్రమోర్వశీయములో ఊర్వశీవిరహముచే ఉన్మత్తుడైన పురూరవుని వాక్యము). "ఆమెయే చూచుచున్నది భయపడిన కురంగవధువు ఈ విధముగ చూచుటలేదు. ఇది ఆమె హస్తమే, మారుతముచే కదలుచున్న పత్రము అనెడు వ్రేళ్లు గల చిగురు కాదు, ఆమెయే గట్టిగా ఏడ్చుచున్నది. ఈ వేణువు గాలిచే నింపబడుట లేదు. ఈ ప్రియతమయే నాతో మాటలాడుచున్నది; కోకిల కూయుట లేదు."

వి. "ఆమెయే చూచుచున్నదా? కురంగవధువుచూచుటకాదా!" అని చెప్పినచో మొదటిది ప్రశ్నగర్భకాకువు, రెండవది వితర్కగర్భకాకువు. "ఆమెయే చూచుచున్నది; కురంగవధువు చూచుటలేదు" అని చెప్పినచో నిర్ణయగర్భకాకువు. ఈ విధముగ ఇచట ప్రశ్నగర్భ—వితర్కగర్భ—నిర్ణయ గర్భకాకువుల యోగ మున్నది.

మూ చతుర్యోగః—

"ఉచ్యతాం స వచనీయమశేషం నేశ్వరే పరుషతా సఖి సాధ్వీ
ఆనయైనమనునీయ కథం వా విప్రియాణి జనయన్ననునేయః." 25

సఖ్యా వా నాయికాయా వా సఖీనాయికయోరథ.
సఖీనాం భూయసీనాం వా వాక్యే కాకురిహ స్థితా. 26

వ్యా. నాలుగు విధములగు కాకువుల యోగమునకు ఉదాహరణము :-

(కిరాతార్జునీయమునందలి శ్లోకము శృంగారపరము. తన నాయకుని గూర్చి) నాయికా సఖ్యములు మాటలాడుకొను మాటలు) "అతనిని తిట్టవలసిన తిట్టిన్ని తిట్టుము లేదా అతనిని తిట్టవలసిన తిట్టిన్నియు తిట్టుటయేలా! ఓ సఖీ! అతని విషయమున పరుషత్వము మంచిది గాదు; లేదా మంచిది కాదా? అతనిని త్వరగా మరలి తీసికొని రమ్ము. ఈ విధముగ విప్రియములు చేయువానిని ప్రతిగ్రహించుట ఎట్లు?"

వి. ఈ శ్లోకములో నాలుగు వాక్యములు ఉన్నవి. మొదటి వాక్యమునందు (రెండవ అర్థమున) ప్రశ్నకాకువు రెండవ వాక్యమున (రెండవ అర్థమున) ఉత్తరకాకువు. మూడవ వాక్యమున విధిరూపకాకువు నాల్గవ వాక్యమున విపరీత-గర్భ కాకువు.

ఈ శ్లోకములోని వాక్యములలో ఏది, ఎవరు, ఎవరితో చెప్పినది అను విషయమును శ్లోకములో చెప్పుచున్నారు.

"ఇచట మొదటి రెండు వాక్యములును సఖీ వాక్యములు కావచ్చును లేదా నాయికా వాక్యములు కావచ్చును కాదా ఒకటి సఖీ వాక్యము రెండవది నాయికా వాక్యము కావచ్చును. చివరి రెండు వాక్యములు నాయికా సఖీ వాక్యములు కావచ్చును లేదా చాలమంది సఖులు గూడ వాక్యములు కావచ్చును. వారి వాక్యములలో కాకువు ఉన్నది".

మూ. పదవాక్యవిదాం మార్గో యోఽర్థః ప్రస్థితః।
సర్వాఙ్గాభినయస్త్వేష ... మతః॥ 27

వ్యా. "వైయాకరణ మీమాంసకాదులు చెప్పిన అర్థబోధన విధానము ఒకటిగనున్నదో, సర్వాంగాభినయ అంగికాభినయముల ద్వారా సూచింపబడు

కాకువు దానిని మరొక విధముగ చేయును." అనగా కాకువు చేర్చుటతో దనే ఒక వాక్యము మామూలుగా ప్రతిపాదించు అర్థము పూర్తిగా మారిపోవును.

మూ. అయం కాకుకృతో లోకే వ్యవహారో న కేవలమ్.
శాస్త్రేష్వప్యస్య సామ్రాజ్యం కావ్యస్యాప్యేష జీవితమ్. 28

వ్యా. కాకుస్వరముతో ఈ వ్యహారము లోకమునందే కాదు; శాస్త్రములలో కూడ ఈ కాకువు యొక్క ఆధిపత్యము ఉన్నది:ఇది కావ్యమునకు కూడ జీవితము,"

మూ. కామం వివృణుతే కాకురర్థాన్తరమతన్ద్రితా
స్ఫుటీకరోతి తు సతాం భావాభినయచాతురీమ్. 29

వ్యా. కాకువు అర్థాంతరమును బోధించును అను విషయము వాస్తవమే. కాని దీనినే సరిగ ఉపయోగించునచో సహృదయుల భావావిష్కరణచాతుర్యమును ఆవిష్కరించును",

మూ. ఇత్థం కవిర్నిబధ్నీయాదిత్థం చ మతిమాన్ పఠేత్.
యథా నిబన్ధనిగదక్ష్మాయాం కవిర్నిష్యతి. 30

వ్యా. కవి తన కావ్యమున కాకువును ఈ విధముగ కూర్చవలెను. బుద్ధిమంతుడు ఈ విధముగ ఆ కాకువును సరిగ పలుకుచు పఠింపవలెను. కవి కాకువును ఏ విధముగ కూర్చునో ఆ విధముగనే పాఠకుడు పఠించినచో. (కావ్యమున) ఒకానొక సౌందర్యమును వర్షించును.

మూ. కరోతి కావ్యం ప్రాయేణ సంస్కృతాత్మా యథా తథా
పఠితుం వేత్తి స పరం యస్య సిద్ధా సరస్వతీ. 31

వ్యా. "సంస్కృత మగు బుద్ధి కల కవి సాధారణముగ, కావ్యము నెట్లు రచించునో ఆ విధముగ పఠించుటకు సరస్వతీసిద్ధి కలవాడు మాత్రమే సమర్థుడగును".

మూ. యథా జన్మాన్తరాభ్యాసాత్కణ్ఠే కస్యాపి రక్తతా.
తథైవ పాఠసౌన్దర్యం నైకజన్మవినిర్మితమ్. 32

వ్యా. ''జన్మాంతరాభ్యాసమువలన ఏ ఒక్కనికో కంఠస్వరమునందు మాధుర్యము లభించును. పాఠసౌందర్యముకూడ అట్లే అనేకజన్మల (అభ్యాసము) చే లభించును''.

మూ. ససంస్కృతమపభ్రంశం లాలిత్యాలిఙ్గితం పఠేత్.
ప్రాకృతం భూతభాషాం చ సౌష్ఠవోత్తరముద్గిరేత్. 83

వ్యా. సంస్కృతకవిత్వమును, అపభ్రంశభాషాకవిత్వమును లలితముగ పఠింపవలెను. ప్రాకృతభాషా భూతభాషాకవిత్వములను కూడ అధికసౌష్ఠవముతో పఠింపవలెను.

మూ. ప్రసన్నే మన్ద్రయేద్వాచం తారయేత్తద్విరోధిని.
మన్ద్రతారౌ చ రచయేన్నిర్వాహిణి యథోత్తరమ్. 84

వ్యా. ప్రసాదగుణము గల కవితను గంభీరముగ పఠింపవలెను. తద్విరుద్ధమైనచో అనగా ఓజోగుణము కలదైనచో తారస్వరములో పఠింపవలెను. మొదట ప్రసాదము తరవాత ఓజస్సు ఉన్న కవితను అవశ్యకతానుసారముగ గంభీరస్వరములోను, తారస్వరములోను పఠింపవలెను

మూ. లలితం కాకుసమన్వితముజ్జ్వలమర్థవశకృతపరిచ్ఛేదమ్.
శ్రుతిసుఖవివిక్తవర్ణం కవయః పాఠం ప్రశంసన్తి. 85

వ్యా. లలితమైనదియు, కాకుస్వరముతో కూడినదియు, గంభీరమైనదియు, అర్థానుసారముగ చేసిన పదవిభాగము కలదియు, చెవులకు ఇంపైన స్పష్టోచ్చరితములైన వర్ణములు కలదియు అగు పాఠమును కవులు ప్రశంసింతురు.

మూ. అతితూర్ణమతివిలమ్బిత ముల్బణనాదం చ నాదహీనం చ
అపదచ్ఛిన్నమనావృతమతిమృదుపరుషం చ నిన్దన్తి. 86

వ్యా. అతిశీఘ్రమైనదియు, చాల మందమైనదియు, తీవ్రమైన ధ్వని కలదియు, అతిమంద మైన ధ్వనికలదియు, పదచ్ఛేదము లేనిదియు, అర్థజ్ఞానము లేనిదియు (అనావృతమ్) ఎక్కువమృదువైనదియు, ఎక్కువ పరుషమైనదియు అగు పఠనవిధానమును నిందింతురు.

మూ. గమ్భీరత్వమనైక్య (స్య) ర్యం నిర్వ్యూఢిస్తారమన్ద్రయోః.
సంయుక్తవర్ణలావణ్యమితి పాఠగుణాః స్మృతాః. 87

వ్యా. గంభీరత్వము, హీనస్వరములేకుండుట, తారమంద్రధ్వనులను బాగ రగ నిర్వహించుట, సంయుక్తాక్షరములను చక్కగ ఉచ్చరించుట అనునవి పాఠములో సద్గుణములుగా చెప్పబడినవి.

మూ. యథా వ్యాఘ్రీ హరేత్పుత్రాన్ దంష్ట్రాభిశ్చ న పీడమేత్.
భీతా పతనభేదాభ్యాం తద్వద్వర్ణాన్ ప్రయోజయేత్. 38

వ్యా. ఆడపులి పిల్లలను ఒక చోటినుండి మరియొక చోటునకు తీసికొని వెళ్లుచు, అవి పడిపోవును లేదా వాటికి కోరలు గ్రుచ్చుకొనును అను భయముచే కోరలచే ఏ విధముగ గట్టిగ పీడింపదో, ఆ విధముగనే వర్ణములను ఉచ్చరింప వలెను. (ఈశ్లోకము పాణినీయశిక్షలో కూడ నున్నది.)

మూ. విభక్తయః స్ఫుటా యత్ర సమాసశ్చాకదర్థితః.
అమ్లానః పదసన్ధిశ్చ తత్రపాఠః ప్రతిష్ఠితః. 39

వ్యా. ఏ పద్ధతిలో విభక్తులు స్పష్టముగ వినవచ్చునో, సమాసము చెడ కుండ నుండునో, పదముల సంధులు అస్పష్టముగ నుండవో, అట్టి పద్ధతిలో ఉత్తమపాఠము ప్రతిష్ఠిత మగును.

మూ. న వ్యస్తపదయోరైక్యం న భిదాం తు సమస్తయోః
న చాఖ్యాతపదగ్లానిం విదధీత సుధీః పఠన్. 40

వ్యా. బుద్ధిమంతుడు కవితను పఠించు నపుడు వ్యస్తపదమును కలిపివేయగూడదు. సమస్తపదములను విడదీయగూడదు. క్రియాపదములు అస్పష్టముగ నుండునట్లు చదవకూడదు.

మూ. ఆగోపాలకమాయోషిదాస్తామేతస్య లేహ్యతా
ఇత్థం కవిః పఠన్ కావ్యం వాగ్దేవ్యా అతివల్లభః. 41

వ్యా. ఈ కవిత్వము విద్యాగంధము లేని పశువుల కాపరులకు స్త్రీలకు సైతము ఆస్వాదయోగ్యముగ నుండవలెను అను దృష్టితో కావ్యమును పఠించు కవి వాగ్దేవికి మిక్కిలి ప్రియు డగును.

మూ. యేఽపి శబ్దవిదో నైవ నైవ చార్థవిచక్షణాః
తేషామపి సతాం పాఠః సుష్ఠు కర్ణరసాయనమ్. 42

వ్యా. చతురులు బాగుగ చేయు కవితాపాఠము శబ్దజ్ఞానము లేనివారికిని, అర్థజ్ఞానము లేనివారికిని గూడ కర్ణరసాయనముగ నుండును.

మూ. పఠన్తి సంస్కృతం సుష్ఠు కుణ్ఠాః ప్రాకృతవాచి తే
వారాణసీతః పూర్వేణ యే కేచిన్మగధాదయః. 43

వ్యా. వారాణసికి తూర్పుగా నున్న మగధాదిదేశవాసులు సంస్కృత రచనను చక్కగా చదువుదురు; కాని ప్రాకృతరచనలను పఠించుటకో అసమర్థులు.

మగధదేశము:- ఇది బీహారులోని దక్షిణప్రాంతము. దీని రాజధాని గిరివ్రజము. దీని నిపుడు రాజగృహమందురు. ఇందు విపులగిరి, రత్నగిరి ఉదయగిరి, శోణగిరి, వైభారగిరి అను ఐదు పర్వతములుండుటచే గిరివ్రజ మని పేరు వచ్చినది. పాటలీపుత్రము దీని రెండవ రాజధాని. మగధకు కీకట దేశ మని కూడ పేరు.

మూ. ఆహ స్మ:-
బ్రహ్మన్ విజ్ఞాపయామి త్వాం స్వాధికారజిహాసయా.
గౌడ స్త్యజతు వా గాథామన్యా వాస్తు సరస్వతీ. 44

వ్యా. సరస్వతీదేవి బ్రహ్మతో ఈ విధముగ మొరపెట్టుకొనినదట- "ఓ బ్రహ్మదేవా! నా అధికారమును విడిచిపెట్టివేయవలె నని నిర్ణయించుకొని నీకు విజ్ఞాపన చేయుచున్నాను. గౌడుడు గాథను (ప్రాకృత శ్లోకమును) విడువవైనా విడువవలె లేదా (నీవు) నా స్థానమున మరి యొక సరస్వతి నైనా నియమింపవలె." (గౌడ దేశీయుల నోటిలో ప్రాకృతగాథ అంత దుర్భరముగ నుండునని అభిప్రాయము). గౌడదేశము:- రాజ శేఖరుని అభిప్రాయము ప్రకారము బనారసు మొదలు బంగాలు వరకు ఉన్న దేశము గౌడదేశము. కాని మొత్తము బంగాలు దేశమః గౌడదేశ మని ఐతిహాసికుల అభిప్రాయము. వంగ దేశము మొదలు భువనేశ్వరము వరకు ఉన్న దేశము గౌడదేశ మని "వంగదేశం సమారభ్య భువనేశాన్తగః శివే. గౌడదేశః సమాఖ్యాతః" అని స్కంద పురాణము చెప్పుచున్నది.

మూ. నాతిస్పష్టో న చాశ్లిష్టో న రూక్షో నాతికోమలః
న మన్దో నాతితారశ్చ పాఠీ (ఠే) గౌడేషు బాడబః 45

వ్యా. గౌడదేశమునందలి బ్రాహ్మణుడు పఠనమునందు, అతిస్పష్టముగ గాని, అస్పష్టముగ గాని అతిపరుషముగ గాని అతికోమలముగ గాని, అతి మంద్రముగ గాని, ఎక్కువ తారస్వరముతో గాని ఉండదు.

మూ రసః కోఽప్యస్తు కాప్యస్తు రీతిః కోఽప్యస్తు వా గుణః
సగర్వం సర్వకర్ణాటాష్టంకారోత్తర పాఠినః 46

వ్యా. "రసము ఏమున్నను, రీతి ఏదైనను, గుణము ఏది ఉన్నను కర్ణాట దేశీయులు, సగర్వముగా టంకారమును చేర్చి ("ట ట టా" అని రాగము తీయుచు) చదువుదురు

వి. కర్ణాటదేశము :- ఇది నేటి కర్ణాటము శ్రీరంగపట్టనము, మహిష పురము దీని రాజధానిగ ఉండెడిది.

మూ. గద్యే పద్యేఽథవా మిశ్రే కావ్యే కావ్యమనా అపి
గేయగర్భే స్థితః పాఠే సర్వోఽపి ద్రావిడః కవిః 47

వ్యా. ద్రావిడదేశీయు డగు కవి ప్రతి యొక్కడును, కావ్యజ్ఞానవంతుడై, గద్యకావ్య మైనను, పద్యకావ్య మైనను, చంపూ కావ్య మైనను సంగీత గర్భ ముగ పఠించును.

ద్రవిడదేశము :- దక్షిణ దేశమున కంతకును ఇది సామాన్య నామ ధేయముగా ఉండెడిది. కృష్ణా-పోలార నదులమధ్య నున్న దేశము ద్రవిడదేశ మని కొందరందురు. ఒకప్పుడు కాంచీపురము దాని రాజధానిగ ఉండెడిది.

మూ. పఠన్తి లటభం లాటాః ప్రాకృతం సంస్కృతద్విషః
జిహ్వయా లలితోల్లాపలబ్ధ సౌన్దర్య ముద్రయా 48

వ్యా. సంస్కృతద్వేషు లగు లాటదేశీయులు లలితోచ్చారణముచే పొంద బడిన సౌదర్యముద్ర గల జిహ్వతో ప్రాకృతమును అందముగ పఠింతురు. అనగా వీరి సంస్కృతపాఠము బాగుండదు.

వి లాటదేశము :- గుజరాతులోని దక్షిణభాగము, ఖాన్‌దేశము కలిసి లాటదేశమను పేరుతో ప్రసిద్ధ మైనది. మాహీ-మహానదుల క్రింది భూప్రదేశము ఈ దేశములో నుండెడిది. నేటి భరోచ్, బరోడా, అహమదాబాదు, ఖేడాజిల్లాలు లాటదేశములో నుండెడివి.

మూ. సురాష్ట్ర త్రవణాద్యా యే పఠన్త్యర్పితసౌష్ఠవమ్,
అపభ్రంశావదంశాని తే సంస్కృతవచాంస్యపి. 49

సురాష్ట్ర — త్రవణదేశాదుల కవులు సంస్కృతరచనలను కూడ అపభ్రంశభాషల నంటుతో చక్కగా చదువుదురు. అనగా వారు అపభ్రంశభాషా ప్రియు లగుటచే సంస్కృతమును చక్కగనే చదువుదురు కాని అపభ్రంశ భాషలు చదివిన రీతిలో చదువుదురు.

త్రవణము :- ఇది పశ్చిమభారతములోని దేశము. సౌరాష్ట్రమునకు సమీపమున నున్నది.

మూ. శారదాయాః ప్రసాదేన కాశ్మీరః సుకవిర్జనః.
కర్ణే గుడూచీగణ్డూషస్తేషాం పాఠక్రమః కిము 50

వ్యా. "శారదాదేవి అను గహముచే కాశ్మీరదేశనివాసులు సుకవులే; కాని వారి పఠనపద్ధతి చెవిలో గుడూచీగండూషమును కొట్టుచున్నట్లుండును."

వి. 'గుడూచీ' అనగా తిప్పతీగ. గండూష మనగా పుక్కిట తీసికొనిన ద్రవపదార్థము. బహుశాతిప్పతీగ రసమును లేదా కషాయమును పుక్కిట తీసికొని చెవిపోటు మొదలగు వాటికై పిచకారీకొట్టినట్లు చెవిలో కొట్టుదురుకాబోలు. అది మంచిదేయైనను, చెవికి తాత్కాలికముగ బాధాకరముగ నుండును. అట్లే కాశ్మీరీయులు చదువు పద్ధతి కర్ణకఠోరముగనుండును అని యర్థము.

మూ. తతః పురస్తాత్కవయోయే భవన్త్యుత్తరాపథే
తే మహత్యపి సంస్కారే సానునాసికపాఠినః. 51

వ్యా. దానికి (కాశ్మీరమునకు) తూర్పుగ ఉత్తరాపథమున నివసించు కవులు మంచి సంస్కారవంతులైనను అనునాసికధ్వనితో పఠింతురు.

మూ. మార్గానుగేన నినదేన నిధిర్గుణానాం
సంపూర్ణవర్ణరచనో యతిభిర్విభక్తః.
పాఞ్చాలమణ్డలభువాం సుభగః కవీనాం
శ్రోత్రే మధు క్షరతి కిఞ్చన కావ్యపాఠః. 52

వ్యా. వైదర్భ్యాదిమార్గములకు అనుగుణమైన ధ్వనితో కూడినదియు, అన్ని పాఠగుణములకును నిధియు సంపూర్ణమైన వర్ణోచ్చారణము కలదియు,

యతిస్థానములందు సరిగా విభజింపబడినదియు, సుందర మైనదియు అగు పాంచాలదేశీయుల పాఠము చెవులలో తేనె లొలుకు చున్నట్లుండును.

మూ. లలల్లకారయా జిహ్మం జర్జరస్ఫారరేఫయా
గిరా భుజఙ్గాః పూజ్యన్తే కావ్యభవ్యధియో న తు. 52

వ్యా. వంకరగా ఊగుచున్న లకారోచ్చారణము కలదియు శిథిలముగా సాగదీయబడిన రేఫ కలదియు అగు వాక్కుతో (పఠనరీతితో) విటులు (నాటకాదులలోనివిశకారాదులు) పూజింపబడుదురేమో కాని కావ్యముచే సంస్కృత మగు బుద్ధి కలవారు పూజింపబడరు.

మూ పఞ్చస్థానసముద్భవవర్ణేషు యథాస్వరూపనిష్పత్తిః
అర్థవశేన చ విరతిః సర్వస్వమిదం హి పాఠస్య. 53

వ్యా. పంచస్థానములందు జనించు వర్ణములను తగిన రీతిలో ఉచ్చరించుట, అర్థానుసారముగా నిలుపుచుండుట అనునది పాఠమునకు సర్వస్వము, అనగా చాలా ప్రధాన మైన విషయము.

వి. పంచస్థానములు :- కంఠ, తాలు, మూర్ధ, దంత, ఓష్ఠములు ప్రధాన మైన వర్ణోచ్చారణస్థానములు. 'స్వరతః కాలతః స్థానాత్ ప్రయత్నానుప్రదానతః ఇతి వర్ణవిదః ప్రాహుః'' అని చెప్పిన రీతిగ స్వర-కాల-స్థాన-అభ్యన్తర ప్రయత్న-బాహ్యప్రయత్నములనెడు ఐదును వర్ణోచ్చారణహేతువులే కాని వీటి నన్నింటిని స్థానము లనుట యుక్తము కాదు.

మూ. సకాకుకలనాపాఠప్రతిష్ఠేయం ప్రతిష్ఠితా.
అర్థానుశాసనస్యాథ ప్రకారః పరికీర్త్యతే. 54

ఇతి శ్రీరాజశేఖరకృతే కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే సప్తమోఽధ్యాయః సమాప్తః.

వ్యా. కాకువుతో కూడిన పాఠరీతి ఈ విధముగ నిర్ణయింపబడినది. ఇపుడు అర్థానుశాసనపద్ధతి నిరూపింపబడుచున్నది.

బాలానందినిలో సప్తమాధ్యాయము సంపూర్ణము.

అష్టమోధ్యాయః -- కావ్యార్థయోనయః

మూ. "శ్రుతిః, స్మృతిః, ఇతిహాసః, పురాణం, ప్రమాణవిద్యా, సమయ విద్యా, రాజసిద్ధాన్తత్రయీ, లోకో, విరచనా, ప్రకీర్ణకం చ కావ్యార్థానాం ద్వాదశ యోనయః" ఇత్యాచార్యాః. "ఉచితసంయోగేన, యోక్తృసంయోగేన, ఉత్పాద్యసంయోగేన, సంయోగవికారేణ చ సహ షోడశ" ఇతి యాయావరీయః.

వ్యా. వేదము, మన్వాదివిరచితము లగు స్మృతులు, ఇతిహాసము, పురాణము, ప్రమాణవిద్య (మీమాంసాన్యాయశాస్త్రాదికము), సమయవిద్య (శైవాగమాదికము), రాజసిద్ధాన్తత్రయము (అర్థశాస్త్ర - నాట్యశాస్త్ర - కామశాస్త్ర ములు) లోకము (లౌకికవ్యవహారజ్ఞానము) విరచన (ఇతరకవిరచనలు), ప్రకీర్ణకములు (చతుష్షష్టికళలు, ఆయుర్వేద - జ్యోతిష-వృక్షశాస్త్ర - గజశాస్త్ర - అశ్వశాస్త్రాదులు). ఈ పన్నెండును (రాజసిద్ధాంతములు మూడు, మిగిలినవి తొమ్మిది) కావ్యార్థమునకు మూలకారణములు-అనగా కావ్యవస్తువును వీనినుండి గ్రహింపవలెను—అని ఆచార్యులు చెప్పుదురు. ఉచితసంయోగము: యోక్తృ సంయోగము, ఉత్పాద్యసంయోగము, సంయోగవికారము అను నాలుగును కలిసినచో కావ్యార్థయోనులు పదునెందు అగునని యాయావరీయుని అభిప్రాయము.

మూ తత్ర శ్రౌతః—"ఊర్వశీ హాప్సరాః పురూరవసమైడం చకమే." అత్రార్థే—

చన్ద్రాద్ బుధః సమభవద్భగవాన్నరేన్ద్ర
మాద్యం పురూరవసమైడమసావసూత.
తం చాప్సరాః స్మరవతీ చకమే కిమన్య
దత్రోర్వశీ స్మితవశీకృతశక్రచేతాః. 1

వ్యా. అందు వైదిక మగు కావ్యార్థమూల మెట్టనగా—"ఊర్వశి యను అప్సరస ఇడాపుత్రు డగు పురూరవుని కామించెను" అని శతపథబ్రాహ్మణమున (5.1.2) చెప్పబడినది. ఆ విషయమునే గ్రహించి ఈ శ్లోకము రచింపబడినది.

''చంద్రునకు బుధు డను కుమారుడు జనించెను. ఈ బుధుడు, ఇడాకుమారుడును, చంద్రవంశమునకు మూలపురుషుకుడు అగు పురూరవు డను నరేంద్రుని కనెను. (అతనిసౌందర్యవిషయమున) వేరేమి చెప్పవలెను? చిరునవ్వుచే దేవేంద్రుని కూడ వశము చేసికొనెడు అప్సరస యగు ఊర్వశి, మదనవశం వదయై అతనిని కామించెను.''

మూ. యథా వా :- ''యదేతన్మణ్డలం తపతి తన్మహదుక్థం తా ఋచః స ఋచాం లోకోఽథ యదేతద్దీప్యతే తన్మహావ్రతం తాని సామాని స సామ్నాం లోకోఽథ య ఏష తస్మిన్ మణ్డలే పురుషః సోఽగ్నిః తాని యజూంషి స యజుషాం లోకః సైషా త్రయ్యేవ విద్యా తపతి.''

వ్యా. వేదమూలక మగు అర్థమునకు మరి యొక ఉదాహరణ మెట్లనగా:- (ఇది మహానారాయణోపనిషత్తులోని చతుర్దశానువాకమునందలి మంత్రమునకు అర్థతోనువాదము.) ప్రకాశించుచున్న ఈ మండలము గొప్ప ఉక్థసామము. అవియే ఋక్కులు. అది ఋక్కుల, అనగా ఋగభిమానిదేవతల లోకము. ఆ ప్రకాశించుచున్న కాంతి మహావ్రతము. అవియే సామలు అది సామాధిష్ఠానదేవతల లోకము. ఈ మండలములో నున్న పురుషుడే అగ్ని. అవియే యజుస్సులు. అది యజుస్సుల లోకము. ఈ విధముగ త్రయీవిద్యయే (వేదత్రయమే సూర్యరూపమున) ప్రకాశించుచున్నది.

మూ. అత్రార్థే:-

ఏతద్యన్మణ్డలం ఖే తపతి దినకృతస్తా ఋచోఽర్చీంషి యాని
ద్యోతన్తే తాని సామాన్యయమపి పురుషో మణ్డలేఽఋర్యజూంషి.
ఏవం యం వేత్తి వేదత్రితయమయమయం వేదవేదీ సమగ్రో
వర్గః స్వర్గాపవర్గప్రకృతి రవికృతిః సోఽస్తు సూర్యః శ్రియే వః. 2

వ్యా. ఈ విషయమును గ్రహించి రచించిన కావ్యమునకు ఉదాహరణము:- ఆకాశమున సూర్యమండలము వేడిగా ప్రకాశించుచున్నదే అవి ఋక్కులు. ఏ కిరణములు ప్రకాశించున్నవో అవి సామములు. ఈ మండలములో నున్న సూక్ష్మపురుషుడు యజుర్వేదము. ఈ విధముగ వేదజ్ఞానము గల పండితుల సముదాయముఏ సూర్యుని వేదత్రయమయునిగా తెలుసుకొనుచున్నదో, అట్టివాడును

తాను వికారరహితుడై స్వర్గమునకును మోక్షమునకును కారణభూతుడును అగు సూర్యుడు మీకు ఐశ్వర్య ప్రద మగుగాక.''

మూ. తచ్చేదం వేదహరణం యదిత్థం కథయన్తి :-
''నమోస్తు తస్యై శ్రుతయే యాం దుహన్తి పదే పదే
ఋషయః శాస్త్రకారాశ్చ కవయశ్చ యథామతి '' 3

వ్యా. వేదమునందలి విషయమును స్వీకరించుట యనగా ఇదియే. దీనిని గూర్చి ఈ విధముగ చెప్పుదురు :- ''ఋషులును, శాస్త్రకారులును, కవులును వారి వారి బుద్ధిబలము ననుసరించి దేనిని అడుగడుగునను పితుకుకొనుచుందురో (దేనినుంచి అనేక విషయములను గ్రహించుచుందురో) అట్టి శ్రుతికి నమస్కారము.''

మూ. స్మార్తః:-
బహ్వర్థేష్వభియుక్తేన సర్వత్ర వ్యపలాపినా
విభావితైకదేశేన దేయం యదభియుజ్యతే. 4
వ్యా. స్మృతి ప్రతిపాదిత మగు విషయము :-

''అనేక వస్తువులను అపహరించినట్లు ఆరోపణ చేయగా, 'ఒక్క వస్తువును కూడ అపహరించలేదు' అని బొంకువాని వద్ద, పోయిన వస్తువులలో ఏ ఒక్కటి యైన దొరకినను, వాడు మిగిలిన వస్తువు లన్నింటిని ఈయవలసి యుండును.''

మూ. అత్రార్థే -

హంస ప్రయచ్ఛ మే కాన్తాం గతిస్తస్యాస్త్వయా హృతా
సమ్భావితైకదేశేన దేయం యదభియుజ్యతే 5

వ్యా. ఈ స్మార్తవిషయమును గ్రహించి రచించిన కావ్యము:-

(విక్రమోర్వశీయములో ఊర్వశి కనబడకుండుటచే ఉన్మత్తుడైన పురూరవుడు ఒక హంసను చూచి పలికిన వాక్యము) ''ఓ హంసా! నా ప్రియు రాలిని ఇచ్చివేయుము. (ఆమెను నీవే అపహరించి యుందువు) ఆమె నడక నీచే స్వీకరింపబడినది. పోయిన సొమ్ములోని ఒక అంశమును బట్టి, అపహరించి నట్లుగా చెప్పు సొమ్ము నంతను ఈయవలసి యుండును కదా.''

మూ. ఐతిహాసికం :-

న చ సంకుచితః పన్థా యేన వాలీ హతో గతః
సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలిపథమన్వగాః. 6

వ్యా. ఇతిహాసప్రతిపాదిత మగు విషయము :-

(ఇచ్చిన మాట ప్రకారము సీతాన్వేషణము చేయించుటలో ఆలసించిన సుగ్రీవుని గూర్చి లక్ష్మణుడు కోపముతో అన్న మాటలు, రామాయణము లోనివి). "హతుడై వాలి ప్రయాణము చేసిన మార్గము ఇంకను మూసి వేయలేదు. ఓ ! సుగ్రీవా ! మాటమీద నిలబడుము. వాలి పోయిన మార్గమును అనుసరింప కుము''.

మూ. అత్ర :- మదం నవైశ్వర్యలవేన లమ్భితం
విసృజ్య పూర్వః సమయో విమృశ్యతామ్.
జగజ్జిఘత్సాతురకణ్ఠపద్ధతి
ర్న వాలినైవాహితతృప్తిరన్తకః. 7

వ్యా. ఐతిహాసికార్థమును గ్రహించి వ్రాసిన కావ్యము :-

"క్రొత్తగా వచ్చిన ఐశ్వర్యలేశముచే కలిగిన మదమును విడచి వెనుకటి ప్రతిజ్ఞను స్మరింపుము. జగత్తును తినవలెనను ఇచ్ఛతో తొందరపాటు చెందు చున్న కంఠముయొక్క రీతి గల యమునకు ఒక్క వాలిచేతనే తృప్తి కలుగ లేదు."

మూ. పౌరాణికః:- హిరణ్యకశిపుర్దైత్యో యాం యాం స్మిత్వాప్యవైక్షత
భయభ్రాన్తైః సురైశ్చక్రే తస్యై తస్యై దిశే నమః 8

వ్యా. పౌరాణికార్థము :- "దైత్యుడైన హిరణ్యకశిపుడు, నవ్వుచు నైనను, ఏ ఏ దిక్కును చూచెనో, భయభ్రాంతులైన దేవతలచే ఆయా దిక్కునకు నమస్కారము చేయబడెను.

అత్ర :- స సఞ్చరిష్ణుర్భువనత్రయేఽపి యాం
యదృచ్ఛయా శిశ్రియదాశ్రయః శ్రియః.
అకారి తస్యై ముకుటోపలస్థల
త్కరైస్త్రిసన్ధ్యం త్రిదశైర్దిశే నమః. 9

వ్యా॥ ఈ పౌరాణికార్థమును కూర్చి వ్రాసిన కావ్యము :- "మూడు లోకములందును సంచరించువాడును, లక్ష్మికి ఆశ్రయభూతుడును అగు ఆ హిరణ్యకశిపుడు ఏ దిక్కును యాదృచ్ఛికముగ నైనను ఆశ్రయించెనో, ఆ దిక్కునకు దేవతలచే, తమ కిరీటములపై దోసిళ్లు ఒగ్గుచు, మూడు సంధ్యలందును నమస్కారము చేయబడెను".

మూ. అత్రాహుః-

"శ్రుతీనాం సాఙ్గశాఖానామితిహాసపురాణయోః

అర్థగ్రన్థః కథాభ్యాసః కవిత్వస్యైక మౌషధమ్" 10

వ్యా. ఈ విషయమున ఇట్లు చెప్పుదురు:-

"సాంగములు వివిధశాఖాసహితములు అగు శ్రుతులయొక్కయు, ఇతిహాసపురాణములయొక్కయు అర్థమును స్వీకరించి గ్రథించుట, వాటియందలి కథలను (కూర్చి) అభ్యసించుట కవిత్వమునకు ఏకైక మగు ఔషధము."

మూ. "ఇతిహాసపురాణాభ్యాం చక్షుర్భ్యామివ సత్కవిః.

వివేకాఞ్జనశుద్ధాభ్యాం సూక్ష్మమప్యర్థమీక్షతే" 11

వ్యా. "సత్కవి, వివేక మనెడు అంజనముచే శుద్ధము లైన ఇతిహాసపురాణముల సహాయముచే, అంజనముచే శుద్ధము లగు నేత్రముల సహాయముచేతను వలె సూక్ష్మవిషయమును కూడ చూచును."

మూ. వేదార్థస్య నిబన్ధేన శ్లాఘన్తే కవయో యథా.

స్మృతీనామితిహాసస్య పురాణస్య తథా తథా. 12

వ్యా. "కవులు వేదార్థమును కూర్చుటచే ఏ విధముగ శ్లాఘింపబడుదురో స్మృతీతిహాసపురాణముల అర్థములను కూర్చుటచే కూడ ఆ విధముగనే శ్లాఘింపబడుదురు."

మూ. ద్వివిధః ప్రామాణికో మీమాంసకస్తార్కికశ్చ. తత్ర ప్రథమః. శబ్దస్య సామాన్యమభిధేయం విశేషస్త్వర్థః. అత్ర:-

సామాన్యవాచి పదమప్యభిధీయమానం

మాం ప్రాప్య జాతమభిధేయవిశేష నిష్ఠమ్,

స్త్రీ కాచిదిత్యభిహితే సతతం మనో మే
తామేవ వామనయనాం విషయీకరోతి.

వ్యా. మీమాంసకుడు, తార్కికుడు అని ప్రామాణికుడు రెండు విధములు. అందు మీమాంసకుని మతము ప్రకారము శబ్దమునకు సామాన్యము అభిధేయము; తద్విశేషము దాని అర్థము.

వి. మీమాంసకమతము ప్రకారము 'గో' మొదలగు శబ్దములు 'గోత్వము' అను సామాన్యమును బోధించును. సామాన్య మనగా జాతి. ఈ విధముగ మొదట 'గో'శబ్దమునకు 'గోత్వము' అనిఅర్థము అని ఒక సారి తెలిసికొనిన వానికి తరువాత ఎన్ని గోవులను చూచినను 'ఇదిగోవు' అను బోధ కలుగును. అట్లు కాక ఒక గోవ్యక్తిని గూర్చి మాత్రమే 'ఇయం గౌః' అను వాక్యముచే మొదట జ్ఞానము కలిగి యున్నచో క్రొత్త గోవును చూచి నపుడెల్ల అతనికి క్రొత్తగా 'ఇది గోవు'అని ఎవరో చెప్పుచుండవలెను. అది అసంభావ్యము, అను భవవిరుద్ధము. కావున 'గౌః' అను శబ్దమునకు 'గోత్వము' అనియే ముఖ్య మైన అర్థము ఒకమారు ఈ అర్థము తెలిసికొనినవాడు తరువాత ఏ గోవును చూచినను ఈ గోత్వము దానియందుండుటచే 'గౌః' అని తెలిసికొనును, 'గాం ఆనయ' 'గాం నయ' (గోవును తీసికొని రమ్ము; గోవును తీసికొని పొమ్ము) ఇత్యాదివాక్యములలో 'గో' శబ్దమునకు. వాస్తవమున గోత్వ మనియే యర్థ మైనను, గోత్వమును తీసికొనివచ్చుట తీసికొనివెళ్లుట అనునవి కుదరవు గాన, గోవ్యక్తి (ఫలానాగోవు) అని విశేషార్థము చెప్పబడును.

పైన చెప్పిన మీమాంసకమతమును మనస్సులోనుంచుకొని వ్రాసిన పద్యము:-

''సామాన్యవాచక మగు పదముగూడ, నా విషయమున విశేషార్థబోధక మగుచున్నది, (సామాన్యముగ స్త్రీవి బోధించు పదమును ప్రయోగించి)'ఒకానొక స్త్రీ' అని చెప్పగనే నా మనస్సు ఎల్లప్పుడును ఆ వామనయననే స్మరించు చుండును''

మూ. తర్కేషు సాంఖ్యీయః-
నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః
ఉభయోరపి దృష్టోఽన్తస్త్వనయోస్తత్త్వదర్శిభిః.

వా. తర్కములలో సాంఖ్యుల కఠిమత మైన తర్కము :- "అసత్తైన (లేని) పదార్థము సత్తు (ఉన్నది) కాజాలదు, సత్తైన పదార్థము అసత్తు కాజాలదు. అనగా లేనిది క్రొత్తగా పుట్టదు, ఉన్నదినశించదు. తత్త్వదృష్టి కలవారు ఈ సదసత్తుల యథార్థస్వరూపమును తెలిసుగలుగుచున్నారు."

అత్ర:- య ఏతే యజ్వానః ప్రథితమహసో యేప్యవనిపా
మృగాక్ష్యో యాశ్చైతాః కృతమపరసంసారకథయా.
అమీ యే దృశ్యన్తే ఫలకుసుమనమ్రాశ్చ తరవో
జగత్యేవం రూపా విలసతి మృదేషా భగవతీ. 14

వ్యా. ఈ సాంఖ్య సిద్ధాంతమును చేర్చి కూర్చిన కావ్యము:-

"ఇతర ప్రపంచ విషయము చెప్పనేల! ఈ యాగము చేసిన వారు, ప్రసిద్ధమైన కీర్తిగల ఈ రాజులు, ఈ మృగాక్షులు, ఫలములతోదను పుష్పముల తోదను వంగిన ఈ వృక్షములు, ఈ విధముగ ఏస్థావరజంగమాత్మక ప్రపంచము కలదో దాని రూపముతో భగవతియైన మృత్తికయే కనబడుచున్నది."

వి. సోమయాగాదికము చేసినవారు, రాజులు, వీరందరును పూర్వము లేనివారు ఎచటి నుండియో రాలేదు, మొదటినుండియు ఉన్న మృత్తికయే ఆ యా రూపములలో కనబడుచున్నది, అని బోధించుచున్న ఈ వాక్యము సాంఖ్య మతానుసారము చెప్పబడినది.

మూ. న్యాయవైశేషికీయః :- "స కింసామగ్రీక ఈశ్వరః కర్తా?" ఇతి పూర్వపక్షః. "నిరతిశయైశ్వర్యస్య తస్య కర్తృత్వమ్" ఇతి సిద్ధాన్తః- అత్ర:-

కిమీహః కింకాయః స ఖలు కిముపాయస్త్రిభువనం
కిమాధారో ధాతా సృజతి కిముపాదాన ఇతి చ.
అతర్క్యైశ్వర్యే త్వయ్యనవసరదుఃస్థో హతధియః
కుతర్కోఽయం కాంశ్చిన్ముఖరయతి మోహాయ జగతః. 15

వ్యా. న్యాయవైశేషికశాస్త్రములకు సంబంధించిన అర్థము. "జగత్కర్త యని మీరు చెప్పెదు ఆ ఈశ్వరుడు ఏ సామగ్రితో సృజించును?" అని పూర్వపక్షము. అతని ఐశ్వర్యమునకు (సామర్థ్యమునకు) అవధులు లేవు.

అందుచే ఆతని కర్తృత్వమువిషయమున ఏ ఆశంకలు చేయవలసిన పని లేదు.'' అని సిద్ధాంతము; ఈ యర్థమును కూర్చి రచించిన కావ్యము (పుష్పదంతవిరచిత మహిమ్నస్తోత్రములోనిది):- ''సృజించుటలో ఈశ్వరుని అభిప్రాయమేమి? ఆతనికి ఎట్టి శరీర మున్నది? ఏ ఉపాయములు అవలంబించును? ఆతనికి ఆధార మేది? ఏ ఉపాదానకారణముతో ఈ త్రిభువనమును సృజించును? ఈ విధముగ పాడుబుద్ధిలో కలుగునదియు, అనావశ్యకమును, కావుననే చివరికి నిలువజా లనిదియు అగు ఈ కుతర్కము, ఊహింపరాని ఐశ్వర్యము గల నీ విషయమున, కేవలము జగత్తును మోహింపచేయుటకు మాత్రమే, కొందరిని వదరునట్లు చేయు చున్నది''

మూ. బౌద్ధీయః- వివక్షాపూర్వా హి శబ్దాస్తామేవ వివక్షాం సూచయేయుః. అత:-

భవతు విదితం. శబ్దా వక్తుర్వివక్షితసూచకాః
స్మరవతి యతః కాన్తే కాన్తాం బలాత్పరిచుమ్బతి.
న న న మ మ మా మా మాం స్ప్రాక్షీర్నిషేధపరం వచో
భవతి శిథిలే మానగ్రన్థౌ తదేవ విధాయకమ్ ।౮

వ్యా. బౌద్ధమతాంగీకృత మగు విషయము-శబ్దప్రయోగమునకు వెనుక ''ఈ విషయమును చెప్పవలెను'' అనెడు వక్తయొక్క ఇచ్ఛ ఉండును. ఆ ఇచ్ఛనే శబ్దములు సూచించును అనిబౌద్ధుల అభిప్రాయము. అనగా ప్రయోగించిన శబ్దముల అర్థమును ప్రయోక్తయొక్క వివక్షనుపట్టి నిర్ణయింపవలెను గాని వాటి స్థూలార్థమును గ్రహింపరా దని అభిప్రాయము. బౌద్ధులలో, విజ్ఞానవాదుల మతము ప్రకారము బాహ్యపదార్థము లనునవి లేవు విజ్ఞానమే, అనగా మనలోపల నున్న జ్ఞానమే బాహ్యపదార్థరూపమున భాసించుచున్నది. కావున ఎవరైన ఒక వాక్యమును ఉచ్చరించగనే అది వినువారి మనస్సులో తాత్కాలిక మగు ఒక మార్పును కలిగించి మాటలాడువారి మనస్సులో నున్న భావమును (వినువారిమనస్సునకు) అందజేయును ఈ విషయమునే తత్త్వసంగ్రహములోని శ్లోకము స్పష్టీకరించుచున్నది:- ''వివక్షానుమితిశ్లిష్టమాకారం బాహ్యభావతః. వ్యవస్యతోః ప్రవృత్తిశ్చేత్తదేవాస్మన్మతం పునః.'' కావున చెప్పదలచినదే తప్ప అంతకు మించిన అర్థమేదియు లేదు. ఈ విషయమును దృష్టిలో నుంచుకొని వ్రాసిన కావ్యము :-

"శబ్దములు వక్తచే వివక్షితములగు అర్థమును సూచించును అను విషయము తెలియబడుగాక. ఏలనన-మన్మథవశంవదుడగు ప్రియుడు ప్రియురాలిని బలాత్కారముగ చుంబనచేయుచుండగా-"వద్దు,వద్దు,వద్దు; నన్నుస్పృశించకుము, స్పృశించకుము"అని ఆమె పలికినవాక్యము పైకి నిషేధించునట్లు కనబడినను,మాన గ్రంథిశిథిలమైనపిమ్మట పలికిన వాక్యమగుటచే,అదియే విధాయక మగుచున్నది."

వి. అట్లు చేయవద్దని చెప్పుచున్నట్లు పైకి కనబడినను ఈ మాటలలో 'అట్లు చేయుము' అని ఆమె మనస్సులో నున్న భావమే సూచింపబడుచున్నది గాన శబ్దములు వక్తృవివక్షాసూచకములు అను బౌద్ధుల సిద్ధాంతము యుక్తమే అని యర్థము.

మూ లౌకాయతికః- భూతేభ్యశ్చైతన్యం మదశక్తివత్. అత్ర :-

బహువిధమిహ సాక్షిచిన్తకాః ప్రవదన్త్యన్యమితః కలేవరాత్.
అపి(చ)స సుదతి తేచ (స)చిన్తకాః ప్రలయం యాన్తి
సహైవ చిన్తయా 17.

వ్యా. మద్యమును తయారుచేయు అనేకవస్తువుల కలయికవలన మాదకతాశక్తి ఆవిర్భవించినట్లు కలిసిన భూతములవలన చైతన్యశక్తి కలుగును. అంతియేకాని పాంచభౌతిక మైనశరీరముకంటె వేరుగ చైతన్యము (ఆత్మ) అనునది లేదు అని లౌకాయతికులు (చార్వాకులు) చెప్పుదురు. ఆ విషయమును కూర్చి రచించిన కావ్యము:-

"ఈ శరీరముకంటె భిన్న మైన ఆత్మపదార్థ మేదియో ఒకటి యున్న దని ఆత్మను గూర్చి చింతన చేయువారు అనేకవిధములుగా చెప్పుచుందురు. కాని, ఓ సుందరీ! (అందమైన పలువరసకలదానా!) నిన్నుగూర్చి చింత చేయువారు ఆ చింతతో కూడ ప్రలయమును పొందుదురు."

వి. నీ చింతకలుగగనే వారు ప్రలయమును పొందుదురు. 'ప్రలయ' శబ్దమునకు స్మృతితప్పుట, నశించుట అని రెండర్థములు. కాముకుల పక్షమున- "ఆమెను గూర్చిన చింత కలుగగనే వారు ఒడలు మరచిపోవుదురు" అని యర్థము. రెండవ అర్థమును గ్రహించిన పక్షమున వారు, ఆ చింతయు కూడ నశించిపోవుటచే వారి శరీరముకంటె భిన్న మైన చైతన్య మనునది ఎక్కడ యున్నది? అందుచే లౌకాయతికుల అభిప్రాయమే యుక్తమని భావము.

మూ. ఆర్హతాః- శరీరపరిమాణ ఆత్మా. అన్యథా శరీరావైయర్థ్యమాత్మావైయర్థ్యం వా. అత్ర:-

శరీరమాత్రమాత్మానం యే వదన్తి జయన్తి తే.
తచ్చుమ్బనేఽపి యజ్జాతః సర్వాఙ్గపులకోఽస్య మే. 18

వ్యా. ఆత్మ శరీరముతో సమాన మైన పరిమాణము కలది. అట్లు కానిచో అనగా శరీరముకంటె ఆత్మ చిన్నది గాని పెద్దది కాని అయినచో, శరీరము వ్యర్థము కావలసివచ్చును లేదా ఆత్మ వ్యర్థము కావలసి వచ్చును; అని జైనుల సిద్ధాంతము. ఈ విషయమును గ్రహించి రచించిన కావ్యము:-

"ఆత్మ శరీరముతో సమాన మైన ప్రమాణము కలది అని ఎవరు చెప్పుచున్నారో వారు సర్వోత్కర్షగా నున్నారు ఏలనన ఆమె యొక్క చుంబనమాత్రము చేతనే నా శరీరము నందంతటను గగుర్పాటు కలిగినది. అనగా శరీరము ఎంత ఉన్నదో ఆత్మ కూడ అంతయే ఉన్నది; కావుననే కేవల అధరస్పర్శ కలిగినను శరీరమునందంతటను గగుర్పాటు కలిగినది. ఆత్మ శరీరములో ఏదో ఒక మూల మాత్రమే ఉన్నచో అది ఉన్నచోట మాత్రమే గగుర్పాటు కలిగి యుండెడిది.

మూ. సర్వపార్షదత్వాత్కావ్యవిద్యాయాస్తానిమానన్యాంశ్చార్థాన్వ్యుత్పత్తయే ప్రత్యవేక్షేత. ఆహుశ్చ:-

యాంస్తర్కకర్కశానర్థాన్సూక్తిష్వాద్రియతే కవిః
సూర్యాంశవ ఇవేన్దౌ తే కాఞ్చిదర్పన్తి కాన్తతామ్. 19

వ్యా. కావ్యవిద్య అన్ని విద్యలకు వెనుకవెనుకనే నడచునది గాన, కావ్యవిద్యావ్యుత్పత్తి సంపాదించుకొనుటకై, ఈ విషయములను, ఇట్టి ఇతర విషయములనుగూడ పరిశీలింపవలెను. కావుననే చెప్పుదురు:-

"కవి తన కావ్యములలో, తర్కకర్కశము లగు ఏ విషయములను కూర్చునో, అవి చంద్రునియందు సూర్యకిరణములు వలె ఒక విధ మగు సౌందర్యమును పెంచును."

వి. స్వతః తీక్ష్ణము లైనను సూర్యకిరణములు చంద్రునియందు సంక్రమించి శైత్యాహ్లాదములను కలిగించును. అట్లే శాస్త్రీయక్లిష్టవిషయములు గూడ కావ్యములలో మనోహరములుగ కన్పట్టును.

మూ. సమయవిద్యాసు శైవసిద్ధాన్తీయః:-
ఘోరఘోరతరాతీత బ్రహ్మవిద్యాకలాతిగః
పరాపరపదవ్యాపీ పాయాద్వః పరమేశ్వరః 20

వ్యా. సమయవిద్యలలో (మతములకు సంబంధించిన సిద్ధాంతములలో) శైవసిద్ధాంతమునకు సంబంధించినది:-

"ఘోరఘోరతరములకు అతీతమైన బ్రహ్మ-విద్యా- కళలను అతిక్రమించినవాడును. పర-అపరపదములను వ్యాపించిన వాడును అగు పరమేశ్వరుడు మిమ్మలను రక్షించుగాక".

"ఘోర ఘోరతర- బ్రహ్మ-విద్యా-కళా-పరాపరములు శైవమతమునకు సంబంధించిన విషయములు.

మూ పాఞ్చరాత్రః :- నాద్యన్తరన్తః కవయః పురాణాః
సూక్ష్మాబృహన్తోఽప్యనుశాసితారః.
సర్వేజ్వరాన్ ఘ్నన్తు మమానిరుద్ధ
ప్రద్యుమ్న సఙ్కర్షణ వాసుదేవాః 21

పాంచరాత్రమునకు ఉదాహరణము :- "ఆద్యన్తరహితులును, విద్యాస్వరూపులును, ప్రాచీనులును, సర్వవ్యాప్తులైనను సూక్ష్మస్వరూపము కలవారును, సర్వరక్షకులును అగు అనిరుద్ధ - ప్రద్యుమ్న-సంకర్షణ-వాసుదేవులు నా జ్వరముల నన్నింటిని (తాపములను) తొలగించెదరు గాక".

వి. పాంచరాత్రసిద్ధాంతమున అనిరుద్ధ-ప్రద్యుమ్న - సంకర్షణ - వాసుదేవము లను నలుగు వ్యూహములు అంగీకరింపబడినవి. ఈ వ్యూహములు కూడ భగవత్స్వరూపములు.

మూ. బౌద్ధసిద్ధాన్తీయః :-
"కలికలుషకృతాని యాని లోకే మయి నిపతన్తు విముచ్యతాం స లోకః
మమ హి సుచరితేన సర్వసత్త్వాః పరమసుఖేన సుఖాసనీం ప్రయాన్తు"
ఏవంసిద్ధాన్తాన్తరేఽపి

వ్యా. బౌద్ధసిద్ధాంతమునకు సంబంధించిన విషయమును కూర్చి రచించిన వాక్యము,

లోకములో కలికృతము లగు పాపఫలము లెన్ని యున్నవో అవన్నియు నాకే చెందుగాక. లోకము ముక్తి పొందుగాక, నా పుణ్యమును స్వీకరించి సకల జీవులు సుఖముగ, సుఖావని యను స్వర్గమును చేరెదరు గాక".

వి. బౌద్ధమతమునందలి మహాయానము ప్రకారము బోధిసత్త్వుడు స్వశ్రేయస్సుకొరకై ప్రయత్నింపరాదు. తన పుణ్యమును ప్రపంచములో బాధపడుచున్నవారికి ఇచ్చి వారలను ఉద్ధరింపవలెను. వారి పాపమును తాను స్వీకరించి దాని ఫలితమును తాను అనుభవింపవలెను.

వ్యా. ఇతరసిద్ధాంతముల విషయమున గూడ నిట్లే తెలియవలెను.

మూ. రాజసిద్ధాన్తత్రయ్యామర్థశాస్త్రీయః -
శమవ్యాయామాభ్యాం పరివిహితతన్త్రస్య నృపతేః
పరం ప్రత్యావాపః ఫలతి కృతసేకస్తరురివ.
బహువ్యాజం రాజ్యం న సుకరమరాజప్రణిధిభి
ర్దురారాధా లక్ష్మీరనవహితచిత్తం ఛలయతి. 28

వ్యా. రాజసిద్ధాంతత్రయిలో అర్థశాస్త్రమునకు సంబంధించిన విషయము ఎట్లనగా :- (అర్థశాస్త్ర-కామశాస్త్ర-నాట్యశాస్త్రముల విషయమున రాజులకే ఎక్కువ శ్రద్ధాసక్తు లుండుటచే కాబోలు వీటికి రాజసిద్ధాంతత్రయి యని పేరు పెట్టినారు) "శమవ్యాయామములచే ఏర్పాటుచేయబడిన రాజ్యపరిపాలనా విధానము గల రాజునకు, శత్రువువిషయమున ఆవాపము, చేయబడిన జలసేకము గల (నీళ్లుపోసిన) చెట్టువలె ఫలించును. రాజప్రణిధులు అనగా గూఢచారులు లేని వారిచే, అనేకవ్యాజములు,అనగా వినాశకారణములు కల రాజ్యము అంత సులభముగ పరిపాలింప శక్యమైనది కాదు. ఆరాధించుటకు చాల కష్టమైన లక్ష్మి అవధానము లేని చిత్తము కలవానిని, మోసగించును".

వి. శమ మనగా శాంతి. వ్యాయామ మనగా ఉద్యమము. ఉద్యమము వలన కర్మారంభములను చేయగా యోగము, అనగా అలబ్ధము లగు వస్తువుల లాభము, కలుగును. కావున వ్యాయామము యోగసాధనము. శమము, అనగా రాజ్యములో శాంతి, ఉన్నచో సంపాదించినవాటిని అనుభవించుటకు అవకాశము లభించును.అదియే క్షేమము. ఈ శమవ్యాయామములకు మూలకారణము సంధి-విగ్రహ-యాన - ఆసన-ద్వైధీభావ-సంశ్రయము లనెడు షాడ్గుణ్యము. ఈ

విషయము చాణక్యుని అర్థశాస్త్రమున-"శమవ్యాయామౌ యోగక్షేమయోర్యోనిః. కర్మారమ్భాణాం యోగారాధనో వ్యాయామః. కర్మఫలోపభోగానాం క్షేమారాధనః శమః. శమవ్యాయామయోర్యోనిః షాడ్గుణ్యమ్" అను సూత్రములలో (6-97-2) చెప్పబడినది. ఆవాపమనగా సేనానివేశము చేసి, మిగిలిన సైన్యమును తగు స్థానములందు నిలుపుట "దణ్డబాహుల్యమావాపః" అని అర్థశాస్త్రము (10-157.5) ఈ విధముగ ఈ శ్లోకములోని శమ-వ్యాయామ-ఆవాప-షడ్గుణ్యాదిశబ్దముల ప్రయోగము కవికిగల అర్థశాస్త్రజ్ఞానమును సూచించుచున్నది.

మూ. నాట్యశాస్త్రీయః -

ఏవం ధారయ దేవి బాహులతికామేవం కురుష్వాఙ్గకం
మాత్యుచ్చైర్నమ కుఞ్చయాగ్రచరణం మాం పశ్య తావత్స్థితమ్
దేవీం నర్తయతః స్వవక్త్రమురజేనామ్భోధరధ్వానినా
శమ్భోర్వః పరిపాన్తు లమ్బితలయచ్ఛేదాహతాస్తాలికాః 24

వ్యా. నాట్యశాస్త్రీయవిషయమునకు ఉదాహరణము:- "ఓదేవీ! బాహులతను ఈ విధముగ ఎత్తుము. శరీరమును ఈ విధముగ చేయుము అంత ఎక్కువగా వంగకుము. పాదాగ్రమును వంచుము. ఇదిగో నేను ఎట్లు నిలచి ఉన్నానో చూడుము. ఈ విధముగ పార్వతీదేవిని నర్తింపచేయుచున్న (నాట్యము నేర్పుచున్న.) ఈశ్వరుని మేఘమువలెధ్వనించుచున్న ముఖమురజముతో కూడినవియు, లంబితలయచ్ఛేదమునందు, అనగా విలంబిత మనెడు లయవ్యవధానమునందు, ప్రయోగింపబడినవియు అగు కరతాలధ్వనులు మిమ్ములను రక్షించుగాక."

ఇచట నాట్యాభ్యాసమునకు సంబంధించిన వివిధభంగిములు వర్ణింపబడినవి. "అఙ్గభూతా హి తాలస్య యతిపాణిలయాః స్మృతాః. త్రయో లయాస్తు విజ్ఞేయాః ద్రుతమధ్యవిలమ్బితాః" అను నాట్యశాస్త్రోక్త విలంబితలయము కూడ నిర్దిష్టమైనది ఇది యంతయు కవియొక్క నాట్యశాస్త్రజ్ఞానమును సూచించుచున్నది.

మూ కామసూత్రీయః:-

నాశ్చర్యం త్వయి యల్లక్ష్మీః క్షిప్రాద్భోక్షజమాగతా
అసౌ మన్దరతస్త్వం తు ప్రాప్తః పమరతస్తయా. 25

వ్యా. కామసూత్రమునకు సంబంధించినది:-

"లక్ష్మి విష్ణువును విడచి నిన్ను చేరిన దనగా ఇందు ఆశ్చర్య మేమియును లేదు. అతడు ఆలక్ష్మిచే మందరపర్వతముద్వారా (క్షీరాబ్ధిమథనమున) పొంద బడినాడు: కాని నీవు సమరములో (యుద్ధములో) పొందబడినావు''

వి. ఇచట శ్లేషచే 'మన్దరతః' 'సమరతః' అనుపదములకు మందరతి చేయువాడు, సమరతి చేయువాడు అనిఅర్థము. యువతి మందరతము చేయు వృద్ధుని విడచి సమరతి చేయగలిగిన యువకుని చేరును అను కామశాస్త్రము ననుసరించి, మందరతు డగు విష్ణువు విడచి, సమరతుడ వగు నిన్ను లక్ష్మి చేరిన దనగా ఆశ్చర్య మేమియు లేదు అను నర్థము ఇచట కూర్చబడినది.

మూ. లౌకికస్తు ద్విధా-ప్రాకృతో వ్యుత్పన్నశ్చ. తయోః ప్రథమః-

స్ఫుటితపితరీబన్ధక్షామ్యో విపక్షగృహేఽప్యభూత్
ప్రియతమ!యయోః స్నేహగ్రన్థిస్తథా ప్రథమం స నౌ.
జనవదధునా సద్మన్యావాం వసావ ఇహైవ తౌ
ధిగపరిచితం ప్రేమ స్త్రీణాం చిరాయ చ జీవితమ్ 26

వ్యా. ప్రాకృతము, వ్యుత్పన్నము అని లౌకికవస్తువు రెండు విధములు. అందు ప్రాకృతమునకు ఉదాహరణము:-

వి. కవులు సమాజమునందలి అన్ని వర్గములవారి ప్రవృత్తులను బాగుగ తెలిసి కొని తమ కావ్యములందు కూర్చవలెను. సమాజములోని ప్రాకృతజనుల ఆచారవ్యవహారాదులు, భావావిష్కరణవిధానము ఒక విధముగ నుండును. అధిక మగు విద్యాసంస్కృత్యాదులు కలవారి పద్ధతులు మరొక విధముగ నుండును. ఈ క్రింది రెండు శ్లోకములలో ప్రాకృతజనుల సంభాషణాదివిధానము వర్ణింపబడినది

ఒక ప్రాకృతస్త్రీ తన ప్రియునితో అన్న మాటలివి. ''ఓ ప్రియతమా! పూర్వము మన మిరువురము వేరు వేరు గృహములలో నున్నపుడు గూడ మన ప్రేమ బద్ధలైన కుండ అతుకు వలె(గట్టిగ) క్షామ్యమై యుండెడిది. ఇపుడు ఒకే ఇంటిలో అంతగ పరిచయము లేని సామాన్యజనులము వలె నివసించుచున్నాము. స్త్రీలయొక్క ఇట్టి అపరిచితప్రేమను గూర్చియు, అనగా సరియైన మమతాబుద్ధి

లేని ప్రేమను గూర్చియు, (ఇట్టిపరిస్థితులలోకూడ) చాలకాలము బ్రతికి ఉండు టను గూర్చియు నింద యగుగాక"

వి. ఇచట చెప్పెడువిధానము, స్థూలశరీర బంధోపమానాదికము ప్రాకృత జనులలో కనబడునది గాన ఇది ప్రాకృతార్థగ్రథనమునకు ఉదాహరణము. ఇదే భావమును అధిక మగు విద్యాసంస్కృత్యాదులు ఉన్నవారు చెప్పిన ఎట్లుండునో క్రింది శ్లోకమువలన స్పష్ట మగును.

''పురాభూదస్మాకం ప్రథమమవిభక్తా తనురియం
తతో ను త్వం ప్రేయానహమపి హతాశా ప్రియతమా.
ఇదానీం నాథ స్త్వం వయమపి కలత్రం కిమపరం
మయాప్తం ప్రాణానాం కులిశకఠినానాం ఫలమిదమ్''.

"పూర్వము మన శరీరము అభిన్నముగ ఉండెడిది. కొంతకాలము తరు వాత నీవు ప్రేయాంసుడ వైనావు, దురదృష్టవంతురాల నగు నేను ప్రియతమ నైనాను. ఇపుడు నీవు నాథుడవు; నేను కళత్రమును. వజ్రము వలె కఠినము లైన నా ప్రాణములకు ఫలిత ము లభించినది." అని దీని భావము.

మూ. యథా వా :-

ఇక్షుదణ్డస్య మణ్డస్య దధ్నః పిష్టకృతస్య చ
వారాహస్య చ మాంసస్య సైష గచ్ఛతి ఫాల్గునః. 27

వ్యా. ప్రాకృతార్థమునకు మరి యొక ఉదాహరణ మెట్లనగా-''ఇక్షుదండ మునకును, గంజికిని, పెరుగునకును, పిండితో తయారుచేయు పదార్థములకును, అరణ్యవరాహమాంసమునకును అనుకూల మగు ఈ ఫాల్గునమాసము వెళ్ళిపోవు చున్నది.''

వి. ఇచట ఫాల్గునమాసములో గ్రామీణజనులు అనుభవించు పదార్థములు వర్ణింపబడినవి.

మూ. ద్వితీయో ద్విధా-సమస్తజనజన్యః కతిపయజనజన్యశ్చ. తయోః ప్రథమోఽనేకధా; దేశానాం బహుత్వాత్, తత్ర దాక్షిణాత్యః -

పిబన్త్యాస్వాద్య మరిచం తామ్బూలవిశదైర్ముఖైః
ప్రియాధరాపదంగాని మధూని ద్రమిలాఙ్గనాః. 28

యథా వా :-

విరమ మదన కస్త్వం చైత్ర కా శక్తిరిన్దో

రిహ హి కుసుమబాణాః కుణ్ఠితాగ్రాః స్ఫలన్తి.

హృదయభువ ఇమాస్తాః కున్తలప్రేయసీనాం

ప్రహతికిణకఠోరగ్రన్థయో వజ్రసారాః. 29

వ్యా. రెండవది అంగా వృత్త్యర్థము, సమస్త జనజన్యము, (అందరి జనులకు సంబంధించునది), కతిపయజనజన్యము (కొందరు జనులకు మాత్రమే సంబంధించునది) అని రెండువిధములు. వీటిలో మొదటిదైన సమస్తజనజన్యము అనేకవిధములుగ నుండును. ఏలనన దేశములు అనేకవిధముగ నున్నవి కదా! అందు దక్షిణదేశమునకు సంబంధించినది:-

"ద్రవిడదేశస్త్రీలు తాంబూలముచే విశదము లగు ముఖములతో మిరియపు గింజను కొరికి, ప్రియుల అధరోష్ఠముచే నంజుగా గల మధువులను త్రాగుచున్నారు"

వి. ఇచట ద్రవిడాంగనలు ఎక్కువగ తాంబూలము సేవించుట, దానిచే నాలుక బెరడుకట్టుకొనిపోవును గాన మధువుయొక్క రుచి తెలియుటకై ముందుగా మిరియపు గింజలు కొరికి ఇటుపై మధువును ఆస్వాదించుట మొదలగు విషయములు మొత్తము దక్షిణదేశమునకు సంబంధించినవి.

వ్యా. మరి యొక ఉదాహరణ మెట్లనగా:-

"ఓ! మదనుడా! విరమింపుము. ఓ! (వసంతమా) చైత్రమాసమా! నీవెంత? చంద్రుని శక్తి యెంత? కుసుమబాణములు ఇచట మొనపోయిన అగ్రములు కలవై వ్యర్థమగుచున్నవి. దెబ్బలచే కాయలు కాచి కఠినమైన గ్రంథులు గల కుంతలదేశాంగనల ఈ హృదయభూములు వజ్రమువంటి సారము కలవి."

వి. ఇచట వర్ణిత మగు విషయము కూడ దాక్షిణాత్య దేశమైన కుంతల దేశమున కింతకును సంబంధించినది.

వి. ఉదీచ్యః-

నేపాలోర్ధ్వ పల్లభైః సార్ధమార్ద్రైణమదమణ్డనాః

గస్తిపర్ణకపాలీషు నయన్తి గ్రీష్మయామినీః 30

వ్యా. ఉత్తరదేశీయ మగు అర్థమునకు ఉదాహరణము :- "నేపాళ దేశ స్త్రీలు ఆర్ద్రమైన కస్తూరియే అలంకారముగా కలవారై, ప్రియులతో గూడ, గ్రంథిపర్ణవృక్ష పంక్తులయందు, గ్రీష్మఋతు రాత్రులందు గడపుచున్నారు."

మూ. ద్వితీయః :- మిథ్యామీలదరాలపక్ష్మణి వలత్యన్తః కురఙ్గీదృశో

దీర్ఘాపాఙ్గనదీతరఙ్గతరలే తల్పోన్ముఖం చక్షుషి.

పత్యుః కేలిమతః కథాం విరమయన్నన్యోన్యకణ్డూయనా-

త్కోఽయం వ్యాహరతీత్యుదీర్య నిరగాత్సవ్యాజమాలీజనః 81

వ్యా. కతిపయజనజన్య మగు అర్థమునకు ఉదాహరణము:-

''అసత్యముగనే మూసుకొనిపోవుచున్న వక్రమైన రెప్పలు గలదియు, దీర్ఘమైన అపాంగము అనెడు నదియొక్క తరంగము వలె చంచలమైనదియు అగు హరిణేక్షయొక్క నేత్రము, శయ్య వైపు ప్రసరించుచుండగా సవిలాస సంభాషణము చేయుచున్న భర్తయొక్క కథను (ఆలాపమును) నిలిచిపోవునట్లు చేయుచు, సఖీజనము ఒకరి నొకరు గోకికొని, 'ఎవరో పిలుచుచున్నట్టున్నదే' అని పలుకుచు బైటకు వెడలిపోయెను.''

వి. ఇది కొందరు వ్యక్తులకు మాత్రమే సంబంధించిన విషయము గాన కతిపయజనజన్యము.

మూ. కవిమనీషానిర్మితం కథాతన్త్రమర్థమాత్రం వా విరచనా. తత్రాద్యా:-

అస్తి చిత్రశిఖో నామ ఖడ్గవిద్యాధరాధిపః

దక్షిణే మలయోత్సఙ్గే రత్నవత్యాః పురః పతిః. 82

తస్య రత్నాకరసుతా శ్రియోదేవ్యాః సహోదరీ.

స్వయంవరవిధావాసీత్కలత్రం చిత్రసున్దరీ. 83

వ్యా. కవియొక్క బుద్ధిచేత నిర్మిత మగు కథాకథనమునకు లేదా వస్తు మాత్ర కథనమునకు 'విరచన' అని పేరు. అందు మొదటిది ఎట్లనగా :-

''దక్షిణమలయ పర్వత ప్రాంతమున, రత్నవతీ నగరమునకు అధిపతి యగు చిత్రశిఖు డను ఖడ్గ (?) విద్యాధరరాజు ఉన్నాడు. రత్నాకరుని కుమార్తెయు, (కావుననే) రత్నాకరసుత-అనగా సముద్రకన్య యగు, లక్ష్మీ దేవికి సహోదరియు (సమానురాలనియు, సోదరి యనియు అర్థద్వయము) చిత్రసుందరి ఆతనికి స్వయంవరమునందు భార్యగా అయినది."

వి. ఈ రచన కథారూపమున సాగినది.

మూ. ద్వితీయా :-

జ్యోత్స్నాం లిమ్పతి చన్దనేన స పుమాన్ సి ఇృత్యసౌమాలతీ-

మాలాం గన్ధజలై ర్మధూని కురుతే స్వాదూన్యసౌ ఫాణితైః.

య స్తస్య ప్రథితాన్గుణాన్ ప్రథయతి శ్రీవీరచూడామణే

స్తారత్వం స చ శాణయా మృగయతే ము క్తాఫలానామపి 84

వ్యా. రెండవదానికి ఉదాహరణము:- "వీరశ్రేష్ఠుడైన అతని లోక ప్రసిద్ధము లగు గుణములను ఎవడు ప్రచారము చేయుటకు ప్రయత్నించునో అతడు వెన్నెలకు చందనమును పూయుచున్నాడు; మాలతీమాలను గంధజలములచే తడుపుచున్నాడు. బెల్లముచే తేనెను తీయగా చేయుచున్నాడు. సానచే ముత్యములను పెద్దవి చేయుచున్నాడు"

ఇచట వర్ణన కవి స్వతంత్రముగ కల్పించినది.

మూ. అత్రాహుః-

నీచై ర్నార్థ(థ)కథాసర్గే(ర్గో)యస్య న ప్రతిభాక్షయః

స కవిగ్రామణీరత్ర శేషా స్తస్య కుటుమ్బినః. 85

వ్యా. ఈ విషయమున పండితులు చెప్పుదురు:- "ఎవని కథాసృష్టి క్రింది తరగతికి చెందినది కాదో, ఎవని ప్రతిభ కూడ క్షీణింపదో అతడే కవుల నాయకుడు. మిగిలినవారందరును అతని క్రింద నుండు కుటుంబులు."

'గ్రామణిః' అనగా గ్రామాధిపతి. కొన్ని కుటుంబములు కలిసినచో గ్రామము. అతడు కవిగ్రామణి యైనచో. ఇతరకవు లందరును అతని పరిపాలనలో నుండు కుంటుబికులు అని అర్థము.

మూ. అభిహితేభ్యో యదన్యత్ త్ప్రకీర్ణకమ్, తత్ర హస్తిశిక్షయః-

మేఘానాం క్షణహాసతాముపగతో హారః ప్రకీర్ణో దిశా

మాకాశోల్లసితామితామరవధూపీనస్తనాస్ఫాలకః.

తుణ్డాశ్చన్ద్రి ఇవోల్బణో మదవశాదైరావణప్రేరితః

పాయాద్వః పరిపాకపాణ్డులవలీ శ్రీతస్కరః శీకరః 86

వ్యా. పైన చెప్పిన వానికంటె భిన్న మైనది పక్కిన్నకము. అంమ గజ శిక్షకు సంబంధించినది-

"క్షణకాలము పాటు మేఘముల హాసముగ నేర్పడినదియు, దిక్కుల చిమ్మబడిన హారముగ నైనదియు, ఆకాశమునందు సంచరించుచున్న అసంఖ్యాకు లగు దేవతాస్త్రీల పీన స్తనములను ఒరచుకొనునదియు, పొడిచేసిన చంద్రుడు వలె తీవ్రమైనదియు, అనగా తీవ్ర ప్రకాశము కలదియు, పరిపాకముచే తెల్లగా నైన లవలీలతయొక్క శోభను అపహరించునదియు, మదోద్రేకముచే ఐరావణముచే చిమ్మబడినదియు, శోభాజనక మైనదియు అగు జలశీకరము (నీటితుంపర) మిమ్ము లను రక్షించుగాక"

మూ. రత్న పరీక్షీయః-

ద్వౌ వజ్రవర్ణౌ జగతీపతీనాం. సద్భిః ప్రదిష్టౌ న తు సార్వజన్యౌ.
యః స్యాజ్జపావిద్రుమభఙ్గశోణో యో వా హరిద్రారస సన్నికాశః. 87

వ్యా. రత్నపరీక్షకు సంబంధించిన అర్థము:-

"ఏది జపాపుష్పము వలెను, పొగడపు ముక్కవలెను ఎఱ్ఱగా నుండునో అదియు, పసుపుయొక్క రసముతో ఏది సమానముగా నుండునో అదియు, వజ్రముల ఈ రెండు వర్ణములును, సత్పురుషులచే, రాజులకు మాత్రమే చెప్పబడినవి. అందరును ధరించదగినవి కావు".

మూ. ధనుర్వేదీయః-

స దక్షిణాపాఙ్గనివిష్టముష్టిం నతాంసమాకుఞ్చితసవ్యపాదమ్
దదర్శ చక్రీకృతచారుచాపం ప్రహర్తుమభ్యుద్యమతమాత్మయోనిమ్.

వ్యా. ధనుర్వేదమునకు సంబంధించిన విషయము:-

''అతడు (శివుడు), దక్షిణ (కుడి) నేత్రాంతమునందు ఉంచబడిన పిడికిలి కలవాడును, వంగిన భుజము కలవాడును, వంచబడిన కుడి కాలు కల వాడును, (తనను) కొట్టుటకు ప్రయత్నించుచున్న వాడునుఅగు మన్మథుని చూచెను.'' (ఇదికుమార సంభవములోనిది) 6.89

మూ. యోగశాస్త్రీయః

యః సర్వేషాం హృదయకమలే ప్రాణినామేక హంస
స్త్వం జాగర్షి స్వపిషి చ ముహుర్బుధ్యసే నాపి బుద్ధః
తం త్వారాధ్య ప్రవితతధియో బన్ధభేదం విధాయ
ధ్వస్తాతఙ్కా విమలమహసస్తే భవన్తో భవన్తి. 39

వ్యా. యోగశాస్త్రమునకు సంబంధించిన విషయము:-

"సకల ప్రాణుల హృదయ కమలమునందు ఏకైక హంస స్వరూపుడవైన ఏ నీవు జాగరూకుడవై ఉందువో, స్వప్నావస్థలో ఉందువో, (అన్నిటిని) తెలుసుకొనుచుందువో, కాని (ఇతరులచే) తెలియబడవో, అట్టి నిన్ను ఆరాధించి, తొలగిన భయము కలవారై, స్వచ్ఛమైన కాంతి కలవారై, పూజ్యులుగ అగుచున్నారు."

మూ. ఏవం ప్రకీర్ణకాన్తరమపి ఉచిత సంయోగః-
పాణ్డ్యోఽయమంసార్పితలమ్బహారః క్లృప్తాఙ్గరాగో హరిచన్దనేన.
ఆభాతి బాలాతపరక్తసానుః సనిర్ఝరోద్గార ఇవాద్రిరాజః 40

వ్యా. ఇతర ప్రకీర్ణవిషయములను గూడ ఈ విధముగనే గ్రహింపవలెను. ఉచితవస్తువుల సంయోగమునకు ఉదాహరణము :- "మెడలో వ్రేలాడుచున్న పొడవైన ముత్యాలహారము కలవాడును, హరిచందనముచే కల్పింపబడిన అంగరాగము గలవాడును అగు ఈ పాండ్యదేశరాజు నీరుటెండలచే ఎర్రనైన చరియలు కలదియు, సెలయేళ్ళ ప్రవాహముతో కూడినదియు అగు పర్వతరాజైన హిమాలయము వలె ఉన్నాడు".

వి. ఇది రఘువంశములో ఇందుమతీస్వయంవర ఘట్టములోని శ్లోకము. (7.60). ఇచట పాండ్యదేశరాజు తనకు తగిన హారహరిచందనములతో కూడినట్లు వర్ణింపబడినది గాన ఇది ఉచితసంయోగమునకు ఉదాహరణము.

మూ. యోక్త్రసంయోగః -
కుర్వద్భిః సురదన్తినో మధులిహామస్వాదు దానోదకం
తన్వానైర్న ముహుర్ముహో భగవతశ్చక్షుఃసహస్రవ్యథామ్.
మజ్జన్స్వర్గతరఙ్గిణీజలభరే పఙ్కీకృతే పాంసుభిః
యద్యాత్రావ్యసనం నినిన్ద విమనాః స్వర్లోకనారీజనః. 41

వ్యా. యోక్త్రసంయోగమునకు ఉదాహరణము :-

వి. యోక్తృసంయోగ మనగా కలియువాని సంయోగము. అనగా సంయుక్తమైనట్లు వర్ణింపబడునవి సంయుక్తము లగుటకు వీలైనవి అని యర్థము. దీనికి విరుద్ధము ఉత్పాద్యసంయోగము, అనగా సంయుక్తము లగుచున్నట్లు వర్ణితములగు వస్తువులు వాస్తవముగ సంయుక్తములు కాజాలవు, కవికల్పనచే వాటి సంయోగము వర్ణింపబడును.

వ్యా. "ఐరావణముయొక్క మదోదకమును తుమ్మెదలకు రుచి లేనిదానినిగా చేయుచున్నదియు, ఇంద్రుని నేత్రసహస్రమునకు వ్యథను కలిగించుచున్నదియు అగు పరాగములచే పంకముగా మార్చబడిన స్వర్గంగాజలమునందు మునిగిపోవుచున్న స్వర్గస్త్రీజనము బాధపడుచున్న మనస్సు కలదై ఏ రాజుయొక్క యుద్ధయాత్రావ్యసనము నిందించెనో".

మూ. ఉత్పాద్య సంయోగః

ఉభౌ యది వ్యోమ్ని పృథక్ప్రవాహా వాకాశగఙ్గాపయసః పతేతామ్.
తేనోపమీయేత తమాలనీల మాముక్తముక్తాలతమస్య వక్షః. 42

వ్యా. ఉత్పాద్య సంయోగమునకు ఉదాహరణము:- "రెండు వేరు వేరు ఆకాశగంగాప్రవాహములు ఆకాశమునందు నిట్టనిలువుగా ప్రవహించినచో, అపుడు తమాలమువలె నీలమైనదియు, ముత్యాలహారము ధరించినదియు అగు ఈ శ్రీకృష్ణుని వక్షస్థలమును అట్టి ఆకాశముతో పోల్చ వీలుండవచ్చును."

వి. ఇచట ఆకాశమునకు గంగాప్రవాహద్వయసంయోగము కవికల్పితము గాన ఇది ఉత్పాద్య సంయోగము. ఇది శిశుపాలవధమునందలి శ్లోకము (3.8).

మూ. సంయోగవికారః

గుణానురాగమిశ్రేణ యశసా తవ సర్పతా
దిగ్వధూనాం ముఖే జాతమకస్మాదర్ధకుంకుమమ్. 43

వ్యా. సంయోగ వికారమనగా సంయోగమునందు, లేదా సంయోగముచే ఏర్పడిన వికారము. దీనికి ఉదాహరణము :- "గుణానురాగముతో

మిశ్రమైన, వ్యాపించుచున్న నీ కీర్తిచే దిగ్వధువుల ముఖమునందు అకస్మాత్తుగా సగము కుంకుమము ఏర్పడినది."

వి. ఎఱ్ఱని గుణానురాగము తెల్లని కీర్తి కలిసి వ్యాపించుటచే సగము కుంకుమము మాత్రమే ఏర్పడుట అను వికారము కలిగినది.

మూ. యథా వా:-

> ఉన్మాద్యత్యమ్బురాశి ర్విదలతి కుముదం సంకుచ న్త్యమ్బుజాని
> స్యన్ద న్తే చన్ద్రికాన్తాః పతితసుమనసః స న్తి శేఫాలికాశ్చ.
> పీయ న్తే చన్ద్రికామ్భః క్రమసరలగలం కిం చ కిఞ్చిచ్చకోరా
> శ్చన్ద్రే కర్పూరగౌరద్యుతికృతి నభసో యాతి చూడామణిత్వమ్.

వ్యా. మరియొక ఉదాహరణము ఎట్లనగా "కర్పూరమువలె" తెల్లనైన కాంతి గల చంద్రుడు ఆకాశమునకు చూడామణి యగుచుండగా, సముద్రమునకు మత్తెక్కుచున్నది. కలువ దళితమగుచున్నది. పద్మములు సంకోచించుచున్నవి చంద్రకాన్తములు జలమును స్రవించుచున్నవి. శేఫాలికా పుష్పములు రాలి పోవుచున్నవి. క్రమముగా కంఠమును తడుపుకొనుచు చకోరములు చంద్రికా జలమును త్రాగుచున్నవి"

వి ఇచట చంద్రికాసంయోగమువలన ఆ యావస్తువులకో కలిగిన అనేక విధము లగు వికారములు వర్ణింపబడినవి,

> మూ. ఇదం కవిభ్యః కథితమర్థోత్పత్తిపరాయణమ్.
> ఇహ ప్రగల్భమానస్య న జాత్వర్థకదర్థనా. 44

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే అర్థానుశాసనే షోడశకావ్యార్థయోనయః అష్టమోధ్యాయః

వ్యా: కవులకు, ఈ విధముగ అర్థోత్పత్తికి ప్రధానహేతు వగునది చెప్పబడినది. ఈ విషయమునందు సామర్థ్యముసంపాదించినవానికి అర్థదారిద్ర్య మెన్నటికిని కలుగదు.

భావానందినిలో అష్టమాధ్యాయము సంపూర్ణము.

నవమోధ్యాయః--అర్థవ్యాప్తిః

మూ. "స త్రిధా" ఇతి ద్రౌహిణిః. దివ్యో దివ్యమానుషో, మానుషశ్చ. సప్తధా ఇతి యాయావరీయః పాతాలీయో, మర్త్యపాతాలీయో, దివ్యపాతాలీయో, దివ్యమర్త్య పాతాలీయశ్చ, తత్ర దివ్యః-

వ్యా॥ దివ్యము, దివ్యమానుషము, మానుషము అను భేదములచే ఆ యర్థము మూడు విధము లని ద్రౌహిణి అభిప్రాయము. పాతాలీయము మర్త్యపాతాలీయము దివ్యపాతాలీయము, దివ్యమర్త్యపాతాలీయము అను మరి నాలుగు భేదములు కూడ కలుపుటచే ఏడు విధము లని యాయావరీయుని అభిప్రాయము. అందు దివ్యమునకు, అనగా స్వర్గలోకసంబంధివిషయమునకు, ఉదాహరణము:-

మూ. స్మృత్వా యన్నిజవారవాసగతయా వీణాసమం తుంబురో
రుద్గీతం నలకూబరస్య విరహోదుత్కణ్ఠ్యాలం రంభయా.
తేనైరావణకర్ణచాపలముషా శక్రోఽపి నిద్రాం జహౌ
ద్ధ్యాయః కారిత ఏవ హాసిని శచీవక్త్రే దృశాం సంభ్రమమ్. 1

వ్యా. తనయొక్క (ఇంద్రునియొక్క). వేశ్యాగృహములో నున్న రంభ (నలకూబరుని) స్మరించి, ఆతని విరహముతో బాధపడుచు తుంబురుని వీణాధ్వని వలె మధురముగ గానము చేయగనే, ఐరావణముయొక్క కర్ణముల చాపలమును అపహరించిన ఆ గానముచే దేవేంద్రుడు కూడ నిద్రను విడచినవాడై, నవ్వుచున్న శచీదేవియొక్క ముఖమునందు మరల నేత్రముల సంభ్రమమును (కంగారుగా చూపుల ప్రసారమును) చేయునట్లు చేయబడినాడు.''

వి. దేవేంద్రుడు దేవతాప్రభు వగుటచే అప్సరసలందరును వంతుప్రకారము వచ్చి ఆతని అంతఃపురములో వారికై నిర్దిష్టమైన ఒక గృహమున ఉండవలెను. అది వారి వారవాసము రంభ తన వంతు ప్రకారము వచ్చి అచట నున్నను ఆమె దృష్టి యంతయు తన ప్రియుడైన నలకూబరునిపై (కుబేరునికూమారుడు) ఉండుటచే విరహాక్రాంతయై ఆమె మధురముగ పాడ మొదలిడినది. ఐరావణము కూడ

చెవులు కదల్చుట మాని ఆ గీతమును వినుచున్నవి. అది వినగనే దేవేంద్రుడు కంగారుగా లేచి ప్రక్కనే ఉన్న శచీదేవి ఏమనుకొనునో అని నేత్రములను ఆమెపై ప్రసరింపచేసినాడు. విషయ మంతయు తెలిసిన శచీదేవి నవ్వుచున్నది. ఈ విధముగ ఈ శ్లోకార్థమంతయు స్వర్గలోకములోని దివ్యవస్తువులకు సంబంధించి యున్నది.

మూ. దివ్యమానుషస్తు చతుర్ధా—దివ్యస్య మర్త్యగమనే, మర్త్యస్య చ స్వర్గగమనే ఇత్యేకో భేదః. దివ్యస్య మర్త్యభావే, మర్త్యస్య చ దివ్యభావ ఇతి ద్వితీయః. దివ్యేతివృత్తపరికల్పనయా తృతీయః. ప్రభావావిర్భూతదివ్యరూపతయా చతుర్థః. తత్ర దివ్యస్య మర్త్యాగమనమ్:-

వ్యా. దివ్యమానుషము నాలుగు విధములు. దివ్యపురుషుడు మర్త్యలోకమునకు వెళ్ళుట, మర్త్యుడు స్వర్గమునకు వెళ్ళుట అనునది ఒక భేదము. దివ్యపురుషుడు మర్త్యుడగుట, మర్త్యుడు దివ్యపురుషుడగుట అనునది రెండవ భేదము. మర్త్యుని విషయమున దివ్యేతివృత్తమును కల్పించుట మూడవ భేదము. ప్రభావముచే మర్త్యునకు దివ్యరూప మావిర్భవించుట నాల్గవ భేదము. అందు దివ్యపురుషుడు మర్త్యలోకమునకు వెళ్లుటకు ఉదాహరణము:-

మూ. శ్రియః పతిః శ్రీమతి శాసితుం జగజ్జగన్నివాసో వసుదేవసద్మని
వసన్దదర్శావతరన్త మమ్బరాద్ధిరణ్యగర్భాఙ్గభువం మునిం హరిః 2

వ్యా. "జగత్తును పరిపాలించుటకు, శ్రీమంతమగు వసుదేవ గృహమునందు నివసించుచున్నట్టియు, జగన్నివాసుడును, శ్రీపతియు అగు శ్రీ కృష్ణుడు ఆకాశమునుండి దిగుచున్న, బ్రహ్మపుత్రుడైన నారదుని చూచెను."

మూ. మర్త్యస్య స్వర్గగమనమ్:-

పాణ్డోర్నన్దన నన్దనం వనమిదం సఙ్కల్పజైః సిద్ధిభిః
క్రీడాపానక కేలి కల్పతరుమ ద్వన్ద్వైః సుధాలేహినామ్.
అప్యత్రేన్దుశిలాలవాలవలయం సన్తానకానాం తలే
జ్యోత్స్నాసంగలదచ్ఛ నిర్ఝరజలైర్యత్నం వినా పూర్యతే 3

వ్యా. మర్త్యుడు స్వర్గమునకు వెళ్లుటకు ఉదాహరణము:-

"ఓ! అర్జునా! ఇది నందనవనము. ఇచట కల్పవృక్షములలో, దేవతా మిథునములు మానసిక సంకల్పముచే జనించిన మధువులతో ఆ పాన క్రీడలను చేసికొనుచుందురు. ఇచట సంతానకవృక్షముల మొదళ్లలోని చంద్రకాంత మణులతో నిర్మించిన కుదుళ్లు వెన్నెలచే స్రవించుచున్న నిర్మలమైన జలప్రవాహములచే అప్రయత్నముగ నింపబడుచున్నవి"

వి. ఇచట మర్త్యుడైన అర్జునునకు స్వర్గమునకు వెళ్లినట్లు వర్ణింపబడినది.

మూ. దివ్యస్య మర్త్యభావః :—

ఇతి వికసతి తస్మిన్నన్వవాయే యదూనాం
సమజని వసుదేవో దేవకీ యత్కళత్రమ్.
కిముపరమథ తస్మాత్షోడశస్త్రీసహస్ర
ప్రణిహితపరిరమ్భః పద్మనాభో బభూవ. 4

వ్యా. దివ్యపురుషుడు మర్త్యుడుగ ఆవిర్భవించుట:

"ఈ విధముగ వృద్ధి పొందుచున్న యాదవవంశమునందు వసుదేవుడు జనించెను. అతని భార్య దేవకి. ఆగనినుండి, పదహారువేల స్త్రీల ఆశ్లేషమును అనుభవించిన పద్మనాభుడు (శ్రీ కృష్ణుడు) జనించెను"

మూ. మర్త్యస్య దివ్యభావః—

ఆకాశయానకటకోటికృతైకపాదా
స్త్రద్హేమదణ్డయుగలావలమ్బి హస్తైః
కౌతూహలాత్తవ తరఙ్గవిఘట్టితాని
పశ్యన్తి దేవి మనుజాః స్వకళేబరాణి. 5

వ్యా. మర్త్యుడు దివ్యత్వమును పొందుటకు ఉదాహరణము :-

"ఓ దేవీ! (గంగా!) (స్వర్లోక) విమానముయొక్క అగ్రభాగమునందు (మెట్టుపై) ఒక పాద ముంచి, హస్తములచే ఆ విమానముయొక్క సువర్ణమయ దండముల ద్వయమును గ్రహించి, మానవులు, నీ తరంగములచే ఇటునటు ఊగులాడుచున్న తమ కళేబరములను వేడుకతో చూచుచున్నారు."

వి. గంగానదిలో (ప్రయాగక్షేత్రమున) ప్రాణత్యాగము చేసినవారు స్వర్గమునకు పోవుట ఇచట వర్ణింపబడినది.

మూ. దివ్యేతి వృత్తపరికల్పనా:-

జ్యోత్స్నా పూర ప్రసరవిశదే సైకతేఽస్మిన్ సరయ్వా
వాదద్యూతం చిరతరమభూత్సిద్ధయూనోః కయోశ్చిత్.
ఏకో బ్రూతే ప్రథమనిహతం కైటభం కంసమన్యః
స త్వం తత్త్వం కథయ భవతా కో హత స్తత్ర పూర్వమ్. 6

వ్యా. దివ్య మగు ఇతివృత్తముయొక్క కల్పనకు ఉదాహరణము ఎట్లనగా-

"జ్యోత్స్నా ప్రవాహముయొక్క ప్రసారముచే స్వచ్ఛమైన ఈ సరయూనది యొక్క ఇసుకతిన్నెయందు ఎవరో ఇద్దఱు సిద్ధయువకుల మధ్య వాగ్వాదరూప మగు ద్యూతము (అనగా పందెము వేసికొని చేసిన వాగ్వాదము) జరిగినది. (విష్ణువుచే) మొదట కైటభుడు చంపబడెను అని మొదటివాడు అనగా రెండవవాడు మొదట కంసుడు చంపబడెను అని అనెను. ఓరాజా! నీచేత వారిలో మొదట ఎవరు చంపబడినారో నిజము చెప్పుము."

వి. ఇచట ఈ కల్పన ద్వారా కవి మర్త్యు డగు రాజును మహావిష్ణు వని ప్రశంసించి యున్నాడు గాన ఇది దివ్యకథాకల్పనము.

మూ. ప్రభావావిర్భూత దివ్యభావః-

మాగాః పాతాలముర్వి స్ఫురసి కిమపరం పాట్యమానః కుదైత్య
త్రైలోక్యం పాదపీత ప్రథిమ న హి బలే పూరయస్యూనమంఘ్రేః.
ఇత్యుత్స్వప్నాయమానే భువనభృతి శిశావఙ్కసుప్తే యశోదా
పాయాచ్చక్రాఙ్కపాద ప్రణతిపులకిత స్మేరగణ్డస్థలా వః. 7

వ్యా. ప్రభావముచే అవిర్భూతమగుదివ్యభావమునకుదాహరణము :-

"ఓభూమీ! పాతాలమునకు దిగిపోకుము. ఓరి దుష్టదైత్యుడా! ఒక మూల చీల్చి వేయబడుచు ఇంకను ఏమో కదలుచున్నావేమి? ఓబలీ! మూడు లోకముల వైశాల్యము కూడ (రెండు) పాదన్యాసములచే త్రాగివేయబడినది. (మూడవ) అడుగునకు లోటైన ప్రదేశమును చూపుము." ఒడిలో నిద్రపోవుచున్న, సకలభువనపోషకు డగు శిశువు ఈ విధముగ కలవరించుచుండగా, చక్ర

చిహ్నములతో కూడిన పాదమునకు నమస్కరించుటచే గగుర్పాటు చెందిన వికసించిన గండస్థలము కల యశోద మిమ్ములను రక్షించుగాక."

వి. ఇచట బాలు డగు శ్రీకృష్ణుడు తాను పూర్వమెత్తిన వరాహ-నరసింహ - వామనావతారములకు సంబంధించిన విషయములను గూర్చి కలవరించుచున్నట్లు వర్ణించుటచే ఇది ప్రస్తుతము మానుషరూపములో నున్న శ్రీకృష్ణునకు సహజ మగు ప్రభావముచే దివ్యత్వము ఆవిర్భూత మైనట్లు చెప్పిన ట్లైనది. 'పాదప్రణతి' అనుటకు బదులు 'పాదప్రహతి' అను పాఠమున్నచో సమంజసముగ ఉండును. బలిని గూర్చి కలవరించుచు పాదము చాపగానే అది యశోద గండస్థలమునకు తగిలి, అంతవరకు ఆమాటలు విన్న ఆమెకు గగుర్పాటు కలిగిన దనినచో యుక్తముగ నుండును.

మూ. మర్త్యః- వధూః శ్వశ్రూస్థానే వ్యవహరతి పుత్రః పితృపదే
పదే రిక్తే రిక్తే వినిహితపదార్థాన్తరమితి.
నదీస్రోతోన్యాయాదకలితవివేకక్రమఘనం
న చ ప్రత్యావృత్తిః ప్రవహతి జగత్పూర్ణమథ చ. 8

వ్యా మర్త్యలోకవ్యవహారమునకు ఉదాహరణము :-

"అత్తగారి స్థానములో ఇపుడు కోడలు వ్యవహరించుచున్నది. తండ్రి స్థానములో కుమారుడు వ్యవహరించుచున్నాడు. ఈ విధముగ ఒక్కొక్క స్థానము ఖాళీ అయినపుడు అచట మరి యొక పదార్థమును చేర్చుచుండగా, నదీప్రవాహన్యాయముచే, తెలియబడని వివేకము గల క్రమముచే ఘనమైన ఈ జగత్తు ప్రవహించుచునే ఉన్నది; పోయినవి తిరిగివచ్చుట అనునది లేదు; ఐనను ఎప్పుడును పూర్ణముగనే ఉన్నది.

వి. నదిలోని పాత జలప్రవాహము పోయి క్రొత్త జలప్రవాహము వచ్చుచుండును. కాని చూచువారికి ఇది తెలియక నది ఎల్లప్పుడును ఒకే విధముగ నున్నట్లు కనబడును. అట్లే జగత్ప్రవాహములోని ఈ క్రమమును గూర్చిన వివేకము స్థూలముగ చూచువారికి ఉండదు ఈ విధముగ ఈ శ్లోకమున మర్త్యలోకవ్యవహారము చక్కగ చిత్రించబడినది.

మూ. పాతాలీయః:-"కర్కోటః కోటికృత్యః ప్రణమతిపురతస్తక్షకే దేహచక్షుః
సజ్జః సేవాఞ్జలిస్తే కపిలకులికయోః స్తౌతి చ స్వస్తికః స్తామ్.

పద్మః సద్మైష భక్తేరవలగతి పురః కంబలోయం బలోయం
సోత్సర్పః సర్పరాజో వ్రజతు నిజగృహం ప్రేష్యతాం శంఖపాలః 9.

వ్యా. పాతాలమునకు సంబంధించిన అర్థము:-

"కర్కోటకుడు కోటి పర్యాయములు నమస్కారము చేయుచున్నాడు. నీ ఎదుట నిలచి ఉన్న తక్షకునిపై దృష్టిని ప్రసరింపచేయుము. కపిల-కులికులు నీ సేవకై కట్టిన దోసిలి సిద్ధముగ నున్నది స్వస్తికుడు నిన్ను స్తుతించుచున్నాడు, ఈ పద్మడు భక్తికి గృహముగా నున్నాడు. ఈ కంబలుడు నీ ఎదుట పడి యున్నాడు. ఈ బలుడు పైకి లేచుచున్నాడు. సర్పరాజైన వాసుకి స్వగృహమునకు వెళ్లగాక—అనగా స్వగృహమునకు వెళ్లుటకు అనుమతి ఇమ్ము. శంఖపాలుడు(ఇంటికి) పంపబడుగాక."

వి. ఇచట పాతాలమునకు సంబంధించిన సర్పములు వర్ణింపబడినవి.

మూ. మర్త్యపాతాలీయః-

ఆర్ద్రావలే వ్రజ న వేత్స్యపకర్ణ కర్ణం
ద్విః సన్దధాతి న శరం హరశిష్యశిష్యః.
తత్సాన్ప్రతం సమితి పశ్య కుతూహలేన
మర్త్యైః శరైరపి కిరీటికిరీటమాథమ్ 10

వ్యా. మర్త్యపాతాలలోకములు రెండింటికిని సంబంధించిన అర్థము.

"ఓఆర్ద్రావలీ! వెళ్ళుము. ఓ అపకర్ణుడా! కర్ణుని సంగతినీకు తెలియదు హరశిష్యుడైన పరశురాముని శిష్యుడు(కర్ణుడు) (ఒక) బాణమును రెండు పర్యాయములు సంధించడు. ఇంక ఇపుడు-మర్త్యబాణములచే కూడ యుద్ధమునందు అర్జునుని కిరీటము ఎట్లు ఖండింపబడునో, కుతూహలముతో చూడుము."

వి. కర్ణార్జునుల మధ్య ఘోరయుద్ధము జరుగుచున్నది. ఖాండవదహనసమయమున అర్జునునిపై పగబూనిన అశ్వసేనుడనే సర్పము కర్ణునకి తెలియకుండగా అతని అమ్ములపొదిలో ప్రవేశించి అందులో ఉన్న సర్పముఖబాణమును ఆశ్రయించి యోగబలముచే అదృశ్యముగ నుండెను. కర్ణుడు అర్జునుని చంప నిశ్చయించి ఆబాణమును ప్రయోగించెను. శ్రీకృష్ణుడది గ్రహించి గుర్రములు మోకాళ్లపై పడునట్లు చేయుటచే అర్జునుని కంఠమునకు గురిచేసిన బాణము అతని

కిరీటమును మాత్రము ఖండించెను. ఆ సర్పము మరల కర్ణునివద్దకు వచ్చి మరి యొకసారి తనను ప్రయోగింపవలసినదిగా కోరినపుడు కర్ణుడు పలికిన మాట లివి. అశ్వసేనునికి అర్ధాగ్రివలి యను నామాంతరముండి యుండవచ్చును.

ఒక మాట చెప్పినను వినక మరల ఆ మాటయేపలుకుటచే విసుగు చెంది కాటోలు కర్ణుకు 'అపకర్ణ' అని సంబోధించినాడు. చెవులు లేనివాడా అని యర్థము. సర్పమునకు కండ్లే చెవులని చెప్పుదురు గాన సర్పమని కూడ అర్థము.

మూ ఇహాపి పూర్వవత్సమ స్తమిశ్రభేదానుగమః.

వ్యా. ఇచట గూడ దివ్యమానుషమునందు వలె మిశ్రభేదము లన్నియు చూచుకొనవలెను. అనగా మర్త్యుడు పాతాళమునకు వెళ్ళినపుడు లేదా పాతాళీయుడు మర్త్యలోకమునకు వచ్చినపుడును ఒక భేదము. మర్త్యుడు పాతాళీయు డైనపుడు లేదా పాతాళీయుడు మర్త్యు డైనపుడును రెండవభేదము. మర్త్యేతివృత్త కల్పనము మూడవభేదము. పాతాళీయు డైన పిమ్మట కూడ ప్రభావవశముచే మర్త్యరూపావిర్భావము నాల్గవభేదము.

మూ. దివ్యపాతాళీయః:-

స పాతు వో యస్య శిఖాశ్మకర్ణికం
స్వదేహనాలం ఫణపత్రసంచయమ్
విభాతి జిహ్వాయుగలోల కేసరం
పినాకినః కర్ణకుజ్జపఙ్కజమ్. 11

వ్యా. దివ్యపాతాళీయార్థ ద్వయముయొక్క కలయికకు ఉదాహరణము "శిరోరత్నమే కర్ణికగా (పద్మము మధ్యలోనుండు దుద్దు) కలవియు, తన దేహమే నాళముగా కలదియు, పడగయే ఆకుల సముదాయముగా కలదియు, జిహ్వాద్వయమే చంచలమైన కేసరములు కలదియు అగు ఏ పినాకియొక్క కర్ణాలంకారమైన సర్ప మనెడు పద్మము ప్రకాశించుచున్నదో అట్టి పినాకపాణి మిమ్ములను రక్షించుగాక."

వి ఇచట దివ్యపురుషుడైన శివుడును, పాతాళలోకమునకు సంబంధించిన సర్పమును వర్ణింపబడినవి.

మూ. స్వర్గమర్త్యపాతాళీయః—

ఆస్తీకో౽స్తి మునిః స్మ విస్మయకృతః పారీక్షితీయాన్మఖా
త్త్రాతా తక్షకలక్ష్మణః ఫణభృతాం వంశస్య శక్రస్య చ.
ఉద్వేలన్మలయాద్రి చన్దనలతా స్వాన్దోలన ప్రక్రమే
యస్యాద్యాపి సవిభ్రమం ఫణివధూవృన్దైర్యశో గీయతే 12

వ్యా. దివ్య-మర్త్య-పాతాలీయార్థవర్ణనము:—

''ఆశ్చర్యకరమైన, పరీక్షిత్కుమారుడగు జనమేజయుడు చేసిన యజ్ఞమునుండి తక్షకుడు ప్రధానవ్యక్తిగా గల సర్పవంశమును, ఇంద్రుని కూడ రక్షించిన ఆస్తీకుడను పేరు గల ముని ఉండెడివాడు. మలయాద్రియందు వ్యాపించి యున్న చందనలతల యందు సవిలాసముగ ఉయ్యాలలూగుటకు ప్రారంభించినపుడు నాగాంగనలు, నేడు కూడ ఆతని కీర్తిని గానము చేయుచుందురు''

వి. ఇచట దివ్యుడైన ఇంద్రుని, మర్త్యుడైన ఆస్తీకుని, పాతాళీయులైన నాగులను వర్ణించుటచే ఇది దివ్యమర్త్యపాతాలీయము

మూ. సో౽యమిత్థంకారముల్లిఖ్యోపజీవ్యమానో నిస్సీమార్థసార్థః సమ్పద్యతే ''అస్తు నామ నిస్సీమార్థసార్థః; కిన్తు ద్విరూప ఏవాసౌ విచారిత సుస్థో౽విచారితరమణీయశ్చ. తయోః పూర్వమాశ్రితాని శాస్త్రాణి, తదుత్తరం కావ్యాని'' ఇత్యౌద్భటాః.

వ్యా. ఈ విధముగ కూర్చి ఉపజీవ్యమాన మగు అనగా కావ్యవస్తువుగ సీకృత మగు అర్థము అనంతవిధములుగ నుండును. ''అర్థసముదాయము అనంతముగ ఉన్న ఉండవచ్చును. కాని ప్రధానముగ ఈ అర్థసముదాయము—విచారితరమణీయము, అవిచారితరమణీయము అని రెండు విధములు. (బాగుగా పరిశీలించినచో అందముగా నుండు విషయము విచారితరమణీయము బాగుగా పట్టి పరిశీలించనంతవరకు మాత్రమే అందముగా నుండునది అవిచారితరమణీయము) వీటిలో విచారితరమణీయ మగు అర్థము నాశ్రయించి శాస్త్రములు ప్రవర్తించును. అవిచారితరమణీయార్థము నాశ్రయించి కావ్యములు ప్రవర్తించును'' అని ఉద్భటమతానుయాయుల అభిప్రాయము.

మూ. యథా:- అపాం లఙ్ఘయితుం రాశిం రుచా పింజరయన్నభః
ఖముత్పపాత హనుమాన్ నీలోత్పలదలద్యుతిః. 13

వ్యా. ఎట్లనగా:- "తనకాంతిచే ఆకాశమును పచ్చని వర్ణము కలదానినిగ చేయుచు (ఆకాశవర్ణము తనపై సంక్రమించుటచే) తాను నీలోత్పలమువంటి కాంతికలవాడగుచు హనుమంతుడు సముద్రమును లంఘించుటకు ఆకాశముపైకి ఎగిరెను."

వి. ఇచట వినగనే బాగుగనే ఉన్నట్లు కనపడినను ఆలోచించగా ఆకాశము పింజరవర్ణమగుటయు, హనుమంతుడు నీలోత్పలదలశ్యాముడగుటయు అసంభావ్యము గాన ఇది అవిచారితరమణీయార్థము.

మూ. యథావా:- తే ఆకాశమసిశ్యామముత్పత్య పరమర్షయః
ఆసేదురోషధిప్రస్థం మనసా సమరంహసః.

యథా చ:- "తదేవ వారి సిన్ధూనాం మహత్త్వే మార్త్రిషామితి" ఇత్యాది.

వ్యా. మరియొక ఉదాహరణ మెట్లనగా :- "మనస్సుతో సమానమైన వేగముగల ఆ పరమర్షులు కత్తివలె నల్లగా నున్న ఆకాశము లోనికి ఎగిరి ఓషధిప్రస్థమును చేరిరి."

వి. ఇది కుమారసంభవములోని శ్లోకము (6.36). ఇచట ఎట్టి వర్ణము లేని ఆకాశమును నల్లగా నున్నట్లు వర్ణించుటచే ఇది అవిచారితరమణీయ మగు అర్థము.

వ్యా. మరియొక ఉదాహరణము ఎట్లనగా:- "నదిలోని జలము అదియే; అనగా మనము పూర్వము చూచినదే. నక్షత్రాది జ్యోతిస్సుల స్థైర్యము ఎంత గొప్పది."

వి. నదులలో పాత నీరు పోయి క్రొత్త నీరు వచ్చుచుండుటచే పూర్వము చూచిన నీరే ఇపుడు కూడ ఉన్నదని చెప్పుటయు, నక్షత్రాదులకు కూడ చలన ముండుటచే అవి స్థిరముగ నుండునని చెప్పుటయు అవిచారితరమణీయము.

మూ. "న స్వరూపనిబన్ధనమిదం రూపమాకాశస్య సరిత్సలిలాదేర్వా. కిన్తు ప్రతిభాసనిబన్ధనమ్. న చ ప్రతిభాసస్తావత్త్వేన వస్తున్యవతిష్ఠతే. యది తథా స్యాత్సూర్యాచన్ద్రమసోర్మణ్డలే దృష్టా పరిచ్ఛిద్యమానద్వాదశాఙ్గులం ప్రమాణే పురాణాద్యాగమనివేదితధరావలయమాత్రేన స్తః" ఇతి యాయావరీయః. ఏవం నక్షత్రాదీనాం, సరిత్సలిలాదీనామన్యేషాం చ యథాప్రతిభాసం చ వస్తునః స్వరూపం శాస్త్రకావ్యయోర్నిబన్ధోపయోగి. శాస్త్రే యథా:-

వ్యా. "ఇచట వర్ణించిన ఆకాశరూపము గాని, సరిత్సలిలాదుల రూపము గాని వాటి యథార్థస్వరూపమునకు సంబంధించినది కాదు: ఇక నేమనగా, అవి ఏ విధముగ మన కంటికి కనబడుచున్నవో ఆ విధముగ వర్ణింపబడినవి. ఈ ప్రతిభాస వస్తువునందు తాదాత్మ్యముతో ఉండదు అనగా వాస్తవమైన వస్తువు మనకు కనబడు రీతిలో ఉండదు అట్లు కానిచో, చూచుటకు చిన్నవిగ నుండి పం డెండు అంగుళముల ప్రమాణము కలవి వలె ఉన్న సూర్యచంద్రమండలములు పురాణాద్యాగమములలో చెప్పిన విధముగ భూవలయ ప్రమాణముతో సమానమైన ప్రమాణము కలవి కాక పోవలసి వచ్చును "అని యాయావరీయుని అభిప్రాయము. నక్షత్రాదుల విషయమునను, సరిత్సలిలాదులవిషయమునను ఇతరవస్తువుల విషయమునను ఇట్లే గ్రహించవలెను ప్రతిభాసము ననుసరించి అనగా మనకు కండ్లకు కనబడిన విధముగ వస్తుస్వరూపవర్ణనము శాస్త్ర — కావ్యములు రెండిం టిలోను ఉపయోగించును. శాస్త్రమునందెట్లనగా:-

మూ. ప్రశాన్తజలకృత్యజ్జే విమలే వియదమ్బుని
తారాకుముదసమ్పన్నే హంసాయత ఇవోడురాట్. 16

వ్యా. "తొలగిపోయిన మేఘము లనెడు పంకముగల దియు, నక్షత్రము లనెడు కలువలతో కూడినదియు అగు, నిర్మలమైన ఆకాశ మనెడు ఉదకము నందు చంద్రుడు హంస వలె నున్నాడు."

వి. ఇచట చేసిన ఆకాశనక్షత్రాదివర్ణనము, ప్రతిభాసము ననుసరించి చేయబడినది. ఇట్టి వర్ణనము అలంకారశాస్త్రసమ్మతము.

మూ. కావ్యాని పునరేతన్మయాన్యేవ. "అస్తు నామ నిస్సీమార్థసార్థః. కిన్తు రసవత ఏవ నిబన్ధో యుక్తో న నీరసస్య" ఇతి ఆపరాజితిః. యదాహ :-

వ్యా. కావ్యములు మొదటి నుండి చివరివరకును ఇట్టి అవిచారిత రమణీయార్థములతో నిండి యుండును "అర్థసముదాయము అనంతముగ ఉండ వచ్చును. కాని (కావ్యమునందు) సరస మగు అర్థమునే కూర్చవలెను గాని నీరస మైనదానిని కూర్చ కూడదు" అని అపరాజితి అభిప్రాయము కావుననే అత డిట్లు చెప్పియున్నాడు:-

మూ. "మజ్జనపుష్పావచయనసన్ధ్యాచన్ద్రోదయాదివాక్యమిహ
సరసమపి నాతిబహుళం ప్రకృతరసానన్వితం రచయేత్. 18

యస్తు సరిద దిసాగరపురతురగరథాదివర్ణనే యత్నః
కవిశక్తిఖ్యాతిఫలో వితతధియాం నో మతః స ఇహ." 17

వ్యా ''జలక్రీడలు, పుష్పావచయము, సంధ్య, చంద్రోదయాదికము, వీటి వర్ణనము సరసమే యైనను, ప్రకృతరసమునకు అననుకూలముగ నుండువిధముగ, అతి విస్తృతముగ, కావ్యములలో చేయగూడదు.''

"నదీ-పర్వత-సముద్ర-నగర-తురగ-రథాదుల వర్ణనమునందు చేయు ఈ ప్రయత్నమునకంతకును, ప్రయోజనము కేవలము కవియొక్క శక్తిని చూపు కొనుటయే. విశాలబుద్ధి కలవా రెవరును ఇట్టి దానిని కావ్యములో అంగీకరింపరు'

మూ 'అమ్' ఇతియాయాయావరీయః అస్తి దానుటాయమానో రసస్యానుగుణో విగుణశ్చార్థః కావ్యే తు కవివచనాని రసయన్తి విరసయన్తి చ;నార్థాః. అన్వయవ్యతిరేకాభ్యాం చేదముపలభ్యతే.

వ్యా ఆపరాజితి చెప్పినది యుక్తమే యని రాజశేఖరుని యభిప్రాయము. రసమునకు అనుగుణముగ నున్నట్లు కనబడు విషయములును, అననుకూలముగ నున్నట్లు కనబడు విషయములును ఉన్న మాట వాస్తవమే. కాని కావ్యములో, సరసత్వమును సంపాదించునవియు, విరసత్వమును సంపాదించునవియు కూడ కవివచనములే కాని అర్థములు కావు. అనగా ఆ విషయమును కూర్చెడు విధానములో సరసత్వము నీరసత్వములు ఉన్నవి కాని విషయములో లేవని యర్థము ఈ విషయము అన్వయ వ్యతిరేకములచే స్పష్ట మగుచున్నది.

వి. ''యత్సత్త్వే యత్సత్త్వమన్వయః యదభావే యదభావః వ్యతిరేకః'' ఒకటి యున్నపుడు రెండవది కూడ ఉన్నదని చెప్పుటకు వీలున్నచో అది అన్వయము, ఒకటి లేనిచో రెండవది కూడ ఉండదని చెప్పుటకు వీలైనచో అది వ్యతిరేకము. ఈ అన్వయ వ్యతిరేకములను, బట్టి కార్యకారణ భావము నిర్ణయింపబడును. ఉదాహరణమునకు-అగ్ని యున్నచో ధూమముండును, అగ్ని లేనిచో ధూమము కూడ ఉండదు అందుచే అగ్ని కారణము, ధూమము కార్యము అని నిర్ణయింపబడును,

మూ. తత్ర సరిద్వర్ణనరసవత్తా :-
ఏతాం విలోకయ తలోదరి తామ్రపర్ణీ-
మమ్భోనిధౌ వివృతశుక్తిపుటోద్ధృతాని.

యస్యాః పయాంసి పరిణాహిషు హారమూర్త్యా
వామభ్రువాం పరిణమన్తి పయోధరేషు. 18

వ్యా. సరిద్వర్ణనము సరసముగా నుండుటకు ఉదాహరణము: —

"ఓ! అరిచేయివంటి ఉదరము కలదానా! ఈ తామ్రపర్ణీనదిని చూడుము. సముద్రములో, తెరచుకొని యున్న ముత్యపు చిప్పలలో గ్రహింపబడిన దీని ఉదకములు, అందమైన కనుబొమ్మలు గల యువతుల విశాలములైన పయోధరములందు హార రూపమున పరిణమించుచున్నవి."

వి. ఈ వర్ణనము శృంగార రసానుగుణముగ నున్నది.

మూ. అద్రివర్ణన రసవత్తా:

ఏతాస్తా మలయోపకణ్ఠసరితామేణాక్షి! రోధోభువ-
శ్చాపాభ్యాసనికేతనం భగవతః ప్రేయో మనోజన్మనః.
యాసు శ్యామనిశాసు పీతతమసో ముక్తామయీశ్చన్ద్రికాః
పీయన్తే వివృతోర్ధ్వచఞ్చువిచలత్కణ్ఠం చకోరాఙ్గనాః 19

వ్యా. అద్రివర్ణనము సరసముగా నుండుటకు ఉదాహరణము:-

"ఓహరిణాక్షీ! ఇవి, మలయపర్వతప్రాంతమునందలి నదులయొక్క ఆ ప్రసిద్ధములైన తీరములు. ఇవి భగవంతుడైన మన్మథుడు చాపాభ్యాసమును చేయు, అతిప్రియమైన స్థానములు. ఇచట, కృష్ణపక్షరాత్రులందు, చీకట్లను త్రాగివేసిన (తొలగించిన) ముక్తామయములైన అనగా ముత్యముల రూపము గల చంద్రికలను, చకోరాంగనలు, ముక్కులు పైకి ఎత్తితెరచి, కంఠమును కదల్చుచు పానము చేయుచుండును"

వి. కృష్ణపక్షమునందుకూడ ఈ నదీతీరములలోని ముక్తాకాంతులను చూచి చంద్రిక లను భ్రాంతిచే వాటిని చకోరాంగనలు ఆస్వాదించుచున్నవని భావము. ఇది అద్భుతశృంగార రసములకు అనుగుణమగు పర్వతవర్ణనము.

మూ. సాగరవర్ణనరసవత్తా:-

ధత్తే యత్కిలికిఞ్చితైకగురుతామేణీదృశాం వారుణీ
వైధుర్యం విదధాతి దమ్పతిరుషాం యచ్చన్ద్రికార్ద్రం నభః.

యచ్చ స్వర్గసదాం వయః స్మరసుహృన్నిత్యం సదా సమ్పదాం
యల్లక్ష్మీరధిదైవతం చ జలధేస్తత్సర్వమస్యేష్టితమ్. 20

వ్యా. సాగరవర్ణనము సరసముగ నుండుటకు ఉదహరణము "మద్యము స్త్రీలకు కిలికించితము విషయమున ఏకైకగురువుగా నుండుట, చంద్రికచే అర్ధ్రమైన ఆకాశము దమ్పతుల కోపమును శిథిలము చేయుట, దేవతల వయస్సు ఎల్లప్పుడును మన్మథునితో మైత్రి కలదై యుండుట, లక్ష్మి సంపదలకు అధిదేవతయై యుండుట, ఇది యంతయు సముద్రుని మనోహరమైన చేష్టయే"

వి. కిలికించిత మనగా సవిలాసచేష్టలు. మద్యము, చంద్రుడు, అమృతము లక్ష్మి ఈ నాలుగును సముద్రమునుండి జనించినవి. మద్యసేవనము యువతుల విలాసచేష్టలను అధికము చేయును. చంద్రోదయముతో దంపతుల ప్రణయ కలహములు శిథిలము లగును. అమృతపానముచే దేవతలు నిత్యయౌవనులై కామ భోగముల ననుభవించుచుందురు. లక్ష్మి ఐశ్వర్యరూపిణి. వీటి కన్నింటికిని మూల కారణము సముద్రుడే. ఈ విధముగ ఇచట సముద్రవర్ణనము శృంగారరసాను గుణముగ నున్నది. ఇది రాజశేఖరుని బాలరామాయణములోని శ్లోకము(10.44)

మూ. ఏవం పురతురగాది వర్ణనరసవత్తాపి. విప్రలమ్భేప్య (తి) రసవత్తా :-

విధర్మాణో భావాస్తదుపహితవృత్తేర్న ఘటయే
సరూపత్వాదన్యే విహితవిఫలౌత్సుక్యవిరసాః.
తతః స్వేచ్ఛం పూర్వేష్వసజదితరేభ్యః ప్రతిహతం
క్వ హీనం ప్రేయస్యా హృదయమిదమన్యత్ర రమతామ్ 21

వ్యా. పురతురగాదివర్ణనము కూడ సరసముగ నుండుటకు ఈ విధముగనే ఉదాహరములను చూచుకొనవలెను. విప్రలంభమునందు కూడ కవివచనము నీరసముగ ఉండవచ్చుననుటకు ఉదాహరణము:-

వి. సరసత్వము, నీరసత్వము అనునవి చెప్పెడి విధానములో (కవివచ నములో) నుండును గాని విషయములో నుండవు అను విషయమును ప్రతిపాదిం చుటకై రాజశేఖరుడు అన్వయోదాహరణరూపమున మూడు శ్లోకములను చూపి ఈ క్రింది శ్లోకమును వ్యతిరేకోదాహరణముగ చూపుచున్నాడు. అందుచే "అతి రసవత్తా" అనుటకు బదులు 'అరసవత్తా' అను పాఠ మున్న బాగుండును,

విప్రలంభశృంగారము అతిసుకుమార మైన రసమగుటచే దీనిని ఎంతో నేర్పుతో చిత్రించవలెను, కాని కవి అసమర్థు డైనచో ఇది కూడ నీరసముగనే ఉండు నని భావము

వ్యా. (ఇవి నాయికావియోగముతో బాధపడుచున్నవాని మాటలు) "ఆమెచే ఉపహిత మగు మనోవృత్తి గల అనగా ఆమెను గూర్చియే చింతించు చున్న, నాకు విధర్మము లైన పదార్థములు అనగా ఆమెతో పోలిక లేని పదార్థములు మనఃస్థైర్యమును కూర్పజాలవు, ఇతర పదార్థములు ఆమెతో సామ్యము కలవగుటచే వ్యర్థ మగు ఔత్సుక్యమును కలిగించి చివరకు విరసములే యగుచున్నవి. ఈ విధముగ మొదటి (విధర్మ) పదార్థములతో స్వేచ్ఛా పూర్వకముగ లగ్నము కానిదియు, రెండవ రకపు (సరూప) పదార్థములనుండి కొట్టబడినదియు ప్రియురాలితో శూన్య మైనదియు అగు నా హృదయము మరి ఏవస్తువును చూచి ఆనందింపవలెను?"

ఇచ్చట విప్రలంభశృంగార చిత్రణమునకై కవి చేసిన ప్రయత్నము అంతగ సఫలము కాలేదు ఇందులకు కారణము ఆతని శక్తిదారిద్ర్యమే కాని అర్థదోషము కాదని భావము.

మూ. కుకవిర్విప్రలమ్భేఽపి రస్వత్తాం నిరస్యతి
అస్తు వస్తుషు మా వా భూత్ కవివాచి రసస్థితిః.

వ్యా. "కుకవి విప్రలంభ శృంగారమును కూడ నీరసముగ నుండునట్లు చేయును. రసము వస్తువులందు ఉండవచ్చును లేకపోవచ్చును అనగా వస్తువు సహజముగ సరసము కావచ్చును కాకపోవచ్చును, కాని రస మనునది ప్రధానముగ కవివాక్కునందే ఉండును."

మూ. "యథా తథా వాస్తు వస్తునో రూపమ్. వక్తృప్రకృతి విశేషాయత్తా తు రసవత్తా, తథా చ యమర్థం రక్తః స్తౌతి తం విరక్తో వినిందతి మధ్యస్థస్తు తత్రోదాస్తే" ఇతి పాల్యకీర్తిః

వా. వస్తు స్వరూపము ఎట్లున్నను రసవత్త్వ మనునది వక్తయొక్క స్వభావవిశేషముపై ఆధారపడి యున్నది. కావుననే రాగవంతుడు స్తుతించిన వస్తువునే రాగము లేనివాడు నిందించును. మధ్యస్థుడు ఆ వస్తువు విషయమున ఉదాసీనుడుగ నుండును." అని పాల్యకీర్తి యభిప్రాయము.

వి పాల్యకీర్తి ప్రసిద్ధుడగు ఒక వైయాకరణుడు. జైనమతస్థుడు. ఇత నికి శాకటాయను డని కూడ నామాంతర ముస్నదట. ఇతడు నిరుక్తములో పేర్కొన్న శాకటాయనుని కంటె అర్వాచీనుడై యుండును.

మూ. యేషాం వల్లభయా సమం క్షణమివ స్ఫారా క్షపా క్షీయతే
తేషాం శీతతరః శశీ విరహిణాముల్కేవ సన్తాపకృత్.
అస్మాకం న తు వల్లభా న విరహస్తేనోభయభ్రంశినా
మిన్దూ రాజతి దర్పణాకృతిర యం నోష్ణో న వా శీతలః. 23

వ్యా. "ప్రియురాలితో కలిసి యున్న ఎవరికి సుదీర్ఘమైన రాత్రి కూడ ఒక క్షణము వలె గడచిపోవునో వారికి చంద్రుడు చాల చల్లగా ఉండును. విరహులకు ఆ చంద్రుడే ఉల్క (కొరవి) వలె సంతాపమును చేయును. మాకు ప్రియురాలును లేదు విరహమును లేదు. అందుచే రెండునూ లేని మాకు చంద్రుడు ఒక అద్దము వలె కన్పట్టుచున్నాడు ఈ చంద్రుడు వేడిగాను లేదు; చల్లగా కూడ లేదు."

మూ." విదగ్ధభణితిభఙ్గినివేద్యం వస్తునో రూపం, న నియతస్వభావమ్" ఇత్యవన్తిసున్దరీ. తదాహ :-

వస్తుస్వభావోఽత్ర కవేరతన్త్రః గుణాగుణావుక్తివశేన కావ్యే
స్తువన్నిబధ్నాత్యమృతాంశుమిన్దుం నిన్దంస్తు దోషాకరమాహ ధూర్తః 24

వ్యా. (పై వాక్యములో 'న' అను పదము లేకున్నచో సరిగ నుండును. దీని అర్థమేమనగా)-"వస్తుస్వరూపము నియతమైన స్వభావము కలదిగానే ఉండును. దానినే విదగ్ధులైన కవులు వచోభంగులచే చెప్పుచుందురు" అని అవన్తిసుందరి యభిప్రాయము. ఈ విషయమునే అమె ఇట్లు చెప్పుచున్నది- "కావ్యమునందు, కవికి వస్తుస్వభావముతో పనిలేదు. అతడు చెప్పెడు పద్ధతిని బట్టి గుణాగుణములు కనబడుచుండును. ధూర్తుడైన కవి చంద్రుని ప్రశంసింపదలచినపుడు 'అమృతాంశుః' అని యనును. ఆ చంద్రునే నిందింపదలచి నపుడు 'దోషాకరః' అని యనును."

వి. 'దోషాకర' శబ్దమునకు 'దోషా కరోతి' అను వ్యుత్పత్తిచే రాత్రిని చేయువాడనియు, 'దోషాణాం ఆకరః' అను విగ్రహముచే దోషములకు నిధి యనియు అర్థములు.

మూ. 'ఉభయముపపన్నమ్' ఇతి యాయావరీయః. స పునర్ద్వేధా- ముక్తక ప్రబన్ధ విషయత్వేన తావపి ప్రత్యేకం పఞ్చధా. శుద్ధః, చిత్రః, కథోత్థః, సంవిధానకభూః, ఆఖ్యానకవాంశ్చ. తత్ర ముక్తేతివృత్తః శుద్ధః స ఏవ సప్రపఞ్చశ్చిత్రః. వృత్తేతివృత్తః కథోత్థః. సమ్భావితేతివృత్తః సంవిధానకభూః పరికల్పితేతివృత్తః ఆఖ్యానకవాన్.

వ్యా. (పాల్యకీర్తి చెప్పినదియు అవన్తిసుందరి చెప్పినదియు) ఉభయము కూడ యుక్తమే అని యాయావరీయుడు.

పూర్వోక్తమగు సప్తవిధమగు అర్థము ముక్తకవిషయము, ప్రబంధ విషయము అని మరల రెండువిధములు ఆ రెండును ఒక్కొక్కటి శుద్ధము, చిత్రము, కథోత్థము, సంవిధానకభువు, ఆఖ్యానకవత్ అని ఐదేసి విధములు. అందు ఇతివృత్తము లేనిది శుద్ధము, ఆ శుద్ధమే కొంచెము విస్తృత మైనచో చిత్రము. ప్రాచీన మగు ఇతివృత్తము కలది కథోత్థము, సంభావిత మగు ఇతివృత్తము కలది అనగా "ఈ కథ ఇట్లు జరిగి ఉండవచ్చును" అని అనిపించు కథ గలది సంవిధానకభువు. కల్పిత మైన ఇతివృత్తము కలది ఆఖ్యానకవత్తు.

మూ. తత్ర ముక్తకే శుద్ధః :-

సా పత్యుః ప్రథమాపరాధకరణే శిక్షోపదేశం వినా
నో జానాతి సవిభ్రమాఙ్గవలనావక్రోక్తిచిత్రాం గతిమ్.
స్వచ్ఛైరచ్ఛకపోలభిత్తిగళితైః పర్యస్తనేత్రోత్పలా
బాలా కేవలమేవ రోదితి లుఠల్లోలోదకైరశ్రుభిః. 25

వ్యా. అందు ముక్తములలో శుద్ధముక్తకమున కుదాహరణము. ఈ శ్లోకము అమరుకములోనిది. అప్రగల్భ యగు నాయికను గూర్చి ఒక సఖి మరియొక సఖితో చెప్పినమాట ఇది.

''భర్త ప్రథమాపరాధము, అనగా ఇతర కాంతాసక్తి మొదలగు అపరాధమును తొలిసారిగా, చేసినపుడు ఆమె సఖుల ద్వారా శిక్షోపదేశములు లేకుం

రగా సవిలాసమగు అవయవచాలనము చేతను వక్రోక్తి చేతను చిత్రమైన రీతిని ఎరుగదు. కేవలము, అజాల స్వచ్ఛముగ నున్నవియు, స్వచ్ఛమైన కపోలభిత్తి నుండి జారుచున్నవియు, దొరలుచున్న చంచలమైన ఉదకములు (బిందువులు) గలవియు అగు కనీళ్ళతో వ్యాప్తమైన నేత్రోత్పలములు కలదై ఏడ్చుచున్నది"

వి. ఈ ముక్తకములో కథ ఏదియు లేదు. కేవలము నాయికయొక్క స్థితి వర్ణింపబడినది. అందుచే ఇది శుద్ధముక్తకము.

మూ. చిత్రః- దూరాదుత్సుకమాగతే వివలితం సమ్భాషిణి స్ఫారితం
సంశ్లిష్యత్యరుణం గృహీతవసనే కోపాఞ్చితభ్రూలతమ్
మానిన్యాశ్చరణానతివ్యతికరే బాష్పామ్బుపూర్ణం క్షణా-
చ్చక్షుర్జాతమహో ప్రపఞ్చచతురం జాతాగసి ప్రేయసి. 26

వ్యా. చిత్రముక్తకమునకు ఉదాహరణము:—

ఈ శ్లోకము కూడ అమరుకము లోనిది. అపరాధియగు నాయకుడు భ్రతిమాలుచున్నపుడు నాయికయొక్క స్థితి వర్ణింపబడినది.

"అపరాధము చేసిన ప్రియుడు దూరమునందుండగా ఔత్సుక్యముతో కూడినదియు, దగ్గరకు వచ్చినపుడు త్రిప్పబడినదియు, అతడు మాటలాడుచున్నపుడు పెద్దదిగ చేయబడినదియు, ఆశ్లేషణము చేయునపుడు ఎర్రగా నున్నదియు వస్త్రమును గ్రహించినపుడు కోపముచే వంచబడిన కనుబొమ్మలు కలదియు, పాదములకు నమస్కరించినపుడు కన్నీటితో నిండినదియు అగు ఆ మానిని యొక్క నేత్రము క్షణములో, అనేక భావములను విస్తరించుటలో నేర్పుగలదిగా అయినది.''

ఈ ముక్తకములో నాయికయొక్క నేత్ర ప్రసార రీతి అతి విస్తృతముగ చిత్రింపబడుటచే ఇది చిత్రముక్తకము.

మూ. కథోత్థః—

దత్త్వా రుద్ధగతిః ఖసాధిపతయే దేవీం ధ్రువస్వామినీం
యస్మాత్ ఖణ్డితసాహసో నివవృతే శ్రీశర్మగుప్తో నృపః.
తస్మిన్నేవ హిమాలయే గురుగుహాకోణక్వణత్కిన్నరే
గీయన్తే తవ కార్తికేయనగరస్త్రీణాం గణైః కీర్తయః 27

వ్యా. కథోత్థ ముక్తకమునకు ఉదాహరణము.

"శ్రీశర్మగుప్తరాజు, అద్దుకొనబడిన గమనము కలవాడై, ఖండిత మైన సాహసము కలవాడై ఖసాధిపతికి, దేవియైన ధ్రువస్వామినిని ఇచ్చివేసి ఏ హిమాలయమునుండి తిరిగి వచ్చినాడో క్రౌంచపర్వతగుహయొక్క (సురుగుహ) కోణమునందు ధ్వనిచేయుచున్న కిన్నరులు గల ఆ హిమాలయమునందే, కుమారస్వామి నగరమునందలి స్త్రీలగణములచేత నీ కీర్తులు గానము చేయబడుచున్నవి."

వి. ఈ శ్లోకములో ఇతిహాసమునకు సంబంధించిన ఒక విషయము చెప్పబడినది. హిమాలయప్రాంతరాజ్యమునకు సంబంధించిన ఒక కుషాన్ వంశీయుడైన రాజు (అతడే ఇచట ఖసాధిపతి యని చెప్పబడినాడు) సముద్రగుప్తుని కుమారుడైన రామగుప్తుని తనపైకి దండెత్తి రాగా అతనిని జయించి చివరకు అతనిని విడుచుటకు ఒకనిబంధనముగ అతిలోకసుందరి యగు అతని రాణి ధ్రువస్వామినిని కోరెను. రామగుప్తుడు అందుకు అంగీకరించెను. (ఈ రామగుప్తుడే లేఖక ప్రమాదముచే శ్రీశర్మగుప్తుడని ఇచట చెప్పబడినాడు) అవమానకర మగు ఈ సంధిని గూర్చి విని అతని సోదరుడగు (ద్వితీయ) చంద్రగుప్తుడు ధ్రువ స్వామినీవేషముతో శత్రు నివాసమునకు వెళ్ళి అతనిని సంహరించి ఇట్టి అవమానకర మగు సంధికి ఒడబడిన ఆ రామగుప్తుని గూడ పరిమార్చి రాజ్యమును లాగికొని, ధ్రువస్వామినిని తాను వివాహ మాడెనట. విశాఖదత్తుడు వ్రాసినట్లుగ శృంగారప్రకాశాదులవలన తెలియుచున్న 'దేవీచంద్రగుప్త' నాటకమున కథావస్తువు ఇదియే అయియుండును. ఈ ఐతిహాసిక ఘటనకు సంబంధించిన ప్రమాణములు ప్రాచీనశిలాశాసనాదులలో కూడ లభించుచున్నవి. కాని ఈ కథకు సంబంధించిన వారి నామధేయాదుల విషయమున ఐతిహాసికులలో కొంత విప్రతిపత్తి కనబడుచున్నది. కథమాత్రము ఐతిహాసిక మనుటలో సందేహము లేదు. ఈ ఐతిహాసికసంఘటనను బాణుడు కూడ హర్షచరిత్రములో (ఆరవఉచ్ఛ్వాసము) సూచించినాడు. ఈ విధముగ కథకు సంబంధించిన దగుటచే ఇది కథోత్థముక్తకము.

మూ సంవిధానకభూః —

దృష్ట్వైకాసనసంస్థితే ప్రియతమే పశ్చాదుపేత్యాదరా-

దేకస్యా నయనే నిమీల్య విహితక్రీడానుబన్ధచ్ఛలః.

ఈషద్వక్రితకన్ధరః సపులకః ప్రేమోల్లసన్మానసా
మన్తర్హాసవలత్కపోలఫలకాం ధూర్తోఽపరాం చుమ్బతి. 28

వ్యా. సంవిధానకభువు అగు ముక్తకము :-

"ధూర్తు డగు నాయకుడు, తన ఇద్దరు ప్రేయసులు ఒకే ఆసనముపై కూర్చుండి యుండగా చూచి, వెనుకనుండి మెల్లగా వచ్చి, ఆటకొరకై చేయు చున్నట్లు వంకతో ఒకతె యొక్క నేత్రములను మూసి, పులకములతో కూడిన వాడై, కొంచెము మెడను ప్రక్కకు త్రిప్పి, ప్రేమతో వికసించిన మనస్సుకల దియు, లోలోన నవ్వుకొనుటచే ఉబ్బిన చెక్కిళ్లు కలదియు అగు రెండవ నాయి కను చుంబించుచున్నాడు"

వి. ఇట్లు చేయుట సంభావ్యమే గాన ఈ ముక్తములోని అర్థము సంవిధానకభువు (ఏర్పాటుపై ఆధారపడినది).

మూ. యథాచ—

"కుర్వన్నార్యకుఙ్కుమామ్బుకపిశితవపుషం యత్తదా రాజహంసీం
క్రీడాహంసో మయాసావజని విరహితశ్చక్రవాకీభ్రమేణ
తస్యైతత్పాప్మనో మే పరిణమతి ఫలం యత్పురే ప్రేమబన్ధా
దేకత్రావాం వసావో న చ దయిత దృశాప్యస్తి నౌ సన్నికర్షః." 29

వ్యా. మరియొక ఉదాహరణ మెట్లనగా :-

"నేను ఒకవాడు ఆడ రాజహంసశరీరమును కుంకుమోదకముచే ఎఱ్ఱగ చేసి, పెంపుడు (మొగ) హంసను, చక్రవాకి యను భ్రాంతిచే విరహము కల దానినిగా చేసితిని. (అనగా ఆ రాజహంసి ప్రక్కనే ఉన్నను మొగ హంస దానిని చూచి చక్రవాక మని భ్రాంతిపడుటచే ఆ రెండింటికి విరహము ప్రాప్తించినది). ఓ ప్రియా! ఆ పాపమే నేడు పండినది. ఎందుచేత ననగా ఇంత ప్రేమ బంధముతో కూడిన మనము ఒకే పట్టణములో నివసించుచున్నాము; ఐనను చూపులు కలియుటకు కూడ అవకాశము లేకుండపోయినది."

వి. ఈ ముక్తకములో వర్ణించిన విషయము కూడ అసంభావ్యము కాదు, అందుచే ఇది సంవిధానకభువు.

మూ. ఆఖ్యానకవాన్,

"అర్థిజనార్థధృతానాం వనకరిణాం ప్రథమకల్పితైర్దశనైః
చక్రే పరోపకారీ హైహయజన్మా గృహం శమ్భోః." 80

వ్యా. ఆఖ్యానకవత్తు అగు ముక్తకమునకు ఉదాహరణము.

"పరోపకారపరాయణు డగు కార్తవీర్యార్జునుడు, యాచకులకై పట్టి సంరక్షింపబడిన వనగజములయొక్క, ప్రప్రథమముగా మొలచిన దంతములతో ఈశ్వరునకు ఒక మందిరమును నిర్మించెను."

వి. ఈ ముక్తకములో కూడ కథ యున్నది గాని అది కవిప్రతిభా కల్పితమై అతిశయోక్తిపూర్ణముగా నున్నది. అందుచే ఇది ఆఖ్యానకవత్తు.

మూ. నిబన్ధే శుద్ధః—

"స్తిమితవికసితానాముల్లసద్భ్రూలతానాం
మసృణముకులితానాం ప్రాన్తవిస్తారభాజామ్.
ప్రతినయననిపాతే కించిదాకుఞ్చితానాం
సుచిరమహమభూవం పాత్రమాలోకితానామ్" 81

వ్యా. నిబంధమునందు శుద్ధమైన అర్థమునకు ఉదాహరణ మెట్లనగా :- ఇది మాలతీమాధవములోని శ్లోకము. నాయకు డగు మాధవుడు నాయిక యగు మాలతి తనను చూచిన విధానమును వర్ణించి చెప్పుచున్నాడు :-

"నిశ్చలములగ నుండి వికసించినవియు, కదలుచున్న సన్నని కను బొమ్మలు కలవియు, స్నిగ్ధములైనవియు, ముకులీభవించినవియు, చివరిభాగము నందు విస్తరించినవియు, ఎదుట నున్న నేత్రములు ప్రసరించినపుడు కొంచెము వంచబడినవియు అగు (ఆమె) చూపులకు, నేను చాలకాలము (సేపు) పాత్రుడ నైతిని"

వి. ఇది మాలతీమాధవ మను నిబంధములో నున్న, ఇతివృత్తరహిత మగు అర్థము గాన ప్రబంధగతశుద్ధార్థము.

మూ. చిత్రః - అలసవలితముగ్ధస్నిగ్ధనిష్పన్దమన్దై
రధికవికసదన్తర్విస్మయస్మేరతారైః.
హృదయమశరణం మే పక్ష్మలాక్ష్యాః కటాక్షై-
రపహృతమపవిద్ధం పీతమున్మీలితం చ. 82

వ్యా. ప్రబంధగతచిత్రార్థమునకు ఉదాహరణము:-

"అలసముగ త్రిప్పబడినవియు, సుందర మైనవియు, స్నేహముతో నిండినవియు, నిశ్చల మైనవియు, మంద మైనవియు, అధికముగ వికసించుచున్నవియు, లోపల నున్న విస్మయముచే నవ్వుచున్నట్లు ఉన్న గ్రుడ్లు కలవియు అగు, చక్కని రెప్పలు గల ఆమె కటాక్షములచే, శరణశూన్య మైన నా హృదయము అపహరింపబడినది; పీడింపబడినది; త్రాగివేయబడినది; మరియు, పెకిలించి వేయబడినది."

వి. ఈ శ్లోకము కూడ మాలతీమాధవ మను ప్రబంధములోనిది ఇచట మాధవుడు మాలతీకటాక్షములను అతిసుందరముగ చిత్రించినాడు. అందుచే ఇది ప్రబంధగత చిత్రార్థమున కుదాహరణము.

మూ. కథోత్థః-

"అభిలాషముదీరితే న్ద్రియః స్వసుతాయామకరోత్ప్రజాపతిః
అథ తేన నిగృహ్య విక్రియామభిశప్తః ఫలమేతదన్వభూత్, 83.

వ్యా ప్రబంధములో కథోత్థార్థమునకు ఉదాహరణము:-

"(మన్మథునిచే) ప్రేరేపింపబడిన ఇంద్రియములు గలవాడై బ్రహ్మ తన కుమార్తెయందు అభిలాషను చేసెను. అపుడు అతడు వికారమును నిగ్రహించుకొని మన్మథుని శపించెను. అందుచే ఇతడీ ఫలమును అనుభవించెను."

వి రుద్రుని కోపాగ్నిచే దగ్ధుడగు మన్మథుని గూర్చి అతని భార్యయగు రతీదేవి విలపించుచుండగా ఆమె నోదార్చుటకై అశరీరవాణి చెప్పిన మాట లివి. ఇచట పూర్వకథ చెప్పబడుటచే ఇది కథోత్థార్థము.

మూ. సంవిధానకభూః :-

"క్రోధం ప్రభో సంహర సంహరేతి యావద్గిరః ఖే మరుతాం చరన్తి,
తావత్స వహ్నిర్భవనేత్రజన్మా భస్మావశేషం మదనం చకార" 84

వ్యా. ప్రబంధములో సంవిధానకజన్య మగు అర్థమునకు ఉదాహరణము:-

"హే! ప్రభో! క్రోధమును ఉపసంహరించుము, ఉపసంహరించుము-అని దేవతల మాటలు ఆకాశములో వ్యాపించులోపలనే ఈశ్వరుని నేత్రమునుండి జనించిన ఆ అగ్ని మన్మథుని భస్మమాత్రశేషుని చేసివేసినది."

వి ఇది కుమారసంభవములో మన్మథదాహమట్టములోని శ్లోకము. ఇందు వాస్తవముగ జరుగుటకు వీలైన విషయము కూర్పబడినది. గాన ఇది ప్రబంధములోని సంవిధానకభువు అగు అర్థము.

మూ. ఆఖ్యానకవాన్ :-

''పత్యుః శిరశ్చన్ద్రకలామనేన స్పృశేతి సఖ్యా పరిహాసపూర్వమ్.
సా రఞ్జయిత్వా చరణౌ కృతాశీర్మాల్యేన తాం నిర్వచనం జఘాన.'' 85

వ్యా. ప్రబంధములో ఆఖ్యానవత్తునకు ఉదాహరణము :-

ఇది కుమారసంభవములో, పార్వతీదేవిని పెండ్లి కూతురుగ అలంకరించు ఘట్టమునందలి శ్లోకము. ''పాదములకు పారాయణ పెట్టిన పిమ్మట – "ఈ పాదముతో నీ భర్త శిరస్సుపై నున్న చంద్రకళను స్పృశింతువుగాక'' అని పరిహాసపూర్వకముగ సఖురాలిచే పలుకబడిన ఆ పార్వతి, మాటలాడకుండగా ఆమెను చేతిలో నున్న పుష్పమాలతో కొట్టెను.''

వి. ఇది కవిప్రతిభాకల్పిత మగు అర్థము.

మూ. కిఞ్చ-సంస్కృతవత్సర్వాస్వపి భాషాసు, యథాసామర్థ్యం, యథారుచి, యథాకౌతుకం చావహితః స్యాత్. శబ్దార్థయోశ్చాభిధానభిధేయ వ్యాపారప్రగుణతామపబుధ్యేత. తదుక్తమ్:-

ఏకోఽర్థః సంస్కృతోక్త్యా స సుకవి(ర)రచనః ప్రాకృతేనాపరోఽస్మిన్
అన్యోఽపభ్రంశగీర్భిః కిమపరమపరో భూతభాషా క్రమేణ.
ద్విత్రాభిః కోఽపి వాగ్భిర్భవతి చతసృభిః కిఞ్చ కశ్చిద్వివేక్తుమ్,
యస్యేత్థం ధీః ప్రగల్భా స్నపయతి సుకవేస్తస్య కీర్తిర్జగన్తి. 86

వ్యా. ఇంకొక విషయ మేమనగా కవి, సంస్కృతమునందువలె, ఇతర భాష లన్నిటియందును గూడ తన సామర్థ్యమును బట్టి, తన అభిరుచినిబట్టి.తన కౌతుకమును బట్టి సావధానచిత్తుడై ఉండవలెను. శబ్దార్థముల అభిధానాభిధేయ వ్యాపారవైశిష్ట్యమును బాగుగ తెలియవలెను. అనగా ఏ అర్థవిశేషమును బోధించుటకు ఏ శబ్దమును ఉపయోగించిన బాగుండునో స్పష్టముగ తెలిసి ఉండవలెను, ఈ విషయమే చెప్పబడినది:-

"ఒక విషయమును చెప్పుటకు (కొన్ని భావములను ఆవిష్కరించుటకు) సంస్కృతభాష చాల అనుకూలముగ నుండును. ఒక విషయమును చెప్పుటకు ప్రాకృతభాష అనువుగ నుండును. కొన్ని విషయములను ప్రతిపాదించుటకు అపభ్రంశభాష అనుకూలముగ నుండును. ఇంకను ఏమనగా - ఒక విషయమును బోధించుటకు భూతభాష (పైశాచీ ప్రాకృతము) బాగుండును. కొన్ని విషయములు ప్రతిపాదించుటకు రెండు మూడు భాషలు అనుకూలముగ నుండును. కొన్ని విషయములను నాలుగు భాషలలో ఆవిష్కరింపవచ్చును. ఎవని బుద్ధి ఈ విధముగ ప్రగల్భముగ నుండునో అనగా ఏ కవికి వివిధభావావిష్కరణ యోగ్యము లగు వివిధభాషల జ్ఞాన ముండునో అతని కీర్తి జగత్తులను కప్పివేయును".

మూ. ఇత్థంకారం మనైరర్థైర్వ్యుత్పన్నమనసః కవేః.

దుర్గమేఽపి భవేన్మార్గే కుణ్ఠితా న సరస్వతీ 87

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే అర్థానుశాసనే అర్థవ్యాప్తిర్నవమోధ్యాయః

వ్యా. ఈ విధముగ మనము లైన వివిధార్థములు వ్యుత్పత్తి గల కవి యొక్క సరస్వతి దుర్గమమార్గమునందు గూడ కుంఠితము కాదు (అప్రతిహతముగ ప్రసరించును).

బాలానందినిలో నవమాధ్యాయము సమాప్తము

దశమోఽధ్యాయః

కవిచర్యా - రాజచర్యా చ :-

మూ గృహీతవిద్యోపవిద్యః కావ్యక్రియాయై ప్రయతేత. నామధాతుపారాయణే అభిధానకోశః, ఛన్దోవిచితిః, అలఙ్కారతన్త్రం చ కావ్యవిద్యాః. కలాస్తు చతుఃషష్టిరుపవిద్యాః. సుజనోపజీవ్యకవిసన్నిధిః, దేశవార్తా, విదగ్ధవాదో, లోక

యా[త్రా. విద్వద్గోష్ఠ్యశ్చ కావ్యమాతరః పురాతనకవినిబన్ధాశ్చ. అపిచ :-

శ్లో. స్వాస్థ్యం [ప్రతిభాభ్యాసో భక్తిర్విద్వత్కథా బహు[శ్రుతతా
స్మృతిదార్ఢ్యమనిర్వేదశ్చ మాతరోఽష్టౌ కవిత్వస్య. 1

వ్యా. విద్యలను, ఉపవిద్యలను అభ్యసించిన పిమ్మట కావ్యరచనకు [ప్రయత్నించవలెను. నామపారాయణ ధాతుపారాయణములు (అనగా నామముల స్వరూపమును ధాతువుల స్వరూపమును తెలుపు వ్యాకరణశాస్త్రము), శబ్దకోశము, ఛందశ్శాస్త్రము, అలంకారశాస్త్రము అన నవి కావ్యవిద్యలు. అనగా కావ్యరచనకు ఉపయోగించు ప్రధానవిద్యలు. చతుఃషష్టికలలు ఉపవిద్యలు. సుజనులకు ఉపజీవ్యులైన కవుల సాహచర్యము (ఎవనిపై ఆధారపడి ఇతరులు జీవింతురో అతడు ఉపజీవ్యుడు. సుజనులకు ఉపజీవ్యు లనగా సుజనులకు మార్గము చూపగలవారు), వివిధదేశములకు సంబంధించిన విషయముల జ్ఞానము, వాక్చతురులతో సంభాషణము, లోకవ్యవహారజ్ఞానము, విద్వాంసుల గోష్ఠులు, ప్రాచీనకవుల కావ్యములు ఇవన్నియు కావ్యహేతువులు. మరియు :-

"స్వాస్థ్యము, ప్రతిభ, అభ్యాసము, భక్తి, విద్వాంసుల సహవాసము, బహు శాస్త్రజ్ఞానము, దృఢమైన జ్ఞాపకశక్తి, దిగులు చెందకుండుట ఈ ఎనిమిదియు కవిత్వమునకు తల్లులు - జనకములు"

మూ. అపిచ — నిత్యం శుచిః స్యాత్. త్రిధా చ శౌచం:- వాక్శౌచం, మనఃశౌచం, కాయశౌచం చ. [ప్రథమే శాస్త్రజన్మనీ; తార్తీయీకంతు—సనఖచ్ఛేదౌ పాదౌ, సతామ్బూలం ముఖం, సవిలేపనమా[త్రం వపుః, మహార్ఘమనుల్బణం చ వాసః, సకుసుమం శిర ఇతి. శుచిశీలనం హి సరస్వత్యాః సంవననమామనన్తి

వ్యా. మరియు కవి ఎల్లప్పుడును శుచిగా ఉండవలెను. వాక్శౌచము, మనఃశౌచము, కాయశౌచము అని శౌచము మూడు విధములు. మొదటి రెండును, అనగా వాక్శౌచ — మనఃశౌచములు శాస్త్రము వలన కలుగునవి. అనగా వ్యాకరణాదిశాస్త్రాభ్యాసము చేత వాక్శౌచము, యోగవేదాన్తాదిశాస్త్రాభ్యాసము చేత మనఃశౌచమును కలుగు నని యర్థము. మూడవదైన శరీరశౌచ మెట్టిదనగా — గోళ్లు తీసివేసినపాదములు, తాంబూలముతో గూడిన ముఖము, చందనాదివిలేపమును మాత్రము చేసిన శరీరము (ఈ విలేపనము కూడ అత్యధికసంఖ్యాకవస్తువులతో

చేసికొనగూడదు), మంచి శుభ్రమైనదియు, కొట్టవచ్చినట్లు మోటుగా కనబడనిదియు అగు వస్త్రము. పుష్పములను ధరించిన శిరస్సు. పరిశుద్ధ మగు శీలమే లేదా పరిశీలనమే సరస్వతిని గౌరవించుట అని చెప్పుదురు.

మూ. స యత్స్వభావః కవి స్తదనురూపం కావ్యమ్. "యాదృశాకారశ్చిత్రకరస్తాదృశాకారమస్య చిత్రమ్" ఇతి ప్రాయోవాదః. స్మితపూర్వమభిభాషణం, సర్వత్రోక్తిగర్భమభిధానమ్, సర్వతో రహస్యాన్వేషణమ్, పరదూషణవైముఖ్యమనభిహితస్య, అభిహితస్య తు యథార్థమభిధానమ్.

వ్యా. కవి స్వభావము ఎట్లుండునో, అతని కావ్యము కూడ దానికి అనురూపముగానే ఉండును. (కావుననే) చిత్రకారుని ఆకార మెట్లుండునో, అతని చిత్రరువు ఆకారము కూడ అట్లే ఉండు నని సాధారణముగ చెప్పుట కలదు. చిరునవ్వు నవ్వుచు మాటలాడుట, అంతటను మంచి ఉక్తులతో గూడిన సంభాషణము, అంతటను రహస్యమును (సారమును) అన్వేషించుట ఇతరులు అడగనప్పుడు పరకావ్యములలోని దోషములను ఎత్తి చూపుటయందు విముఖత్వము, వారు అడిగినప్పుడు మాత్రము ఉన్న దున్నట్లు చెప్పుట (ఇవి యన్నియు కవి యగువాడు అభ్యసింపవలెను)

మూ. తస్య భవనం సుసంమృష్టమ్, ఋతుషట్కోచితవివిధస్థానమ్, అనేకతరుమూలకల్పితాపాశ్రయవృక్షవాటికం, సక్రీడాపర్వతకం, సదీర్ఘికాపుష్కరిణీకం, ససరిత్సముద్రావర్తకం, సకుల్యాప్రవాహం, సబర్హిణహరిణహారీతం, ససారసచక్రవాకహంసం, సచకోరక్రౌఞ్చకురరశుకసారికం, ఘర్మక్లాన్తి చౌరం, సభూమిధారాగృహయన్త్రలతామణ్డపకం, సదోలాప్రేఙ్ఖశ్చ స్యాత్. కావ్యాభినివేశఖిన్నస్య మనస స్తన్నిర్వేదచ్ఛేదాయాజ్ఞామూకపరిజనం విజనం వా తస్య స్థానమ్. అపభ్రంశభాషణప్రవణః పరిచారకవర్గః, సమాగధభాషా భినివేశిన్యః పరిచారికాః, ప్రాకృతసంస్కృతభాషావిద అన్తఃపురికాః మిత్రాణి చాస్య సర్వభాషావిన్తి భవేయుః; సదఃసంస్కారవిశుద్ధ్యర్థమ్.

వ్యా. అతని గృహము శుభ్రముగ తుడిచి, అలికి, ముగ్గులు పెట్టినదై ఉండవలెను అగృహమునందు ఆరు ఋతువులకును తగిన వివిధస్థానము లుండవలెను. అనగా మారుచున్న ఋతువుల ననుసరించి సుఖముగ సమయమును

గరుపుటకు అను వగు వేరువేరు స్థానములు ఆ గృహములో ఉండవలెను. అనేక వృక్షముల మూలమునందు కల్పింపబడిన లతామండపములు గల వృక్షవాటిక యుండవలెను. ('అపాశ్రయ' మనగా క్రిందఆధారము లేవియు లేకుండ ఏర్పరుప బడిన లతామండపాదికము). క్రీడాపర్వత ముండవలెను. దిగుడుబావులు, పద్మ సరస్సులు ఉండవలెను. (కృత్రిమము లగు) నదీసముద్రములు, సుడిగుండము లుండవలెను. కాలువల ప్రవాహములుండవలెను నెమళ్ళు, లేళ్ల హారీతపక్షులు, సారసములు, చక్రవాకములు, హంసలు, చకోరములు, క్రౌంచములు, గోరింకలు, సారికలు ఉండవలెను (సభూమిగృహధారాయన్త్రి... అని పాఠమున్నచో భాగుండును) భూగృహములతోడను జలధారాయంత్రములతోడను, లతామండప ములతోడను కూడినదై గ్రీష్మఋతుసంతాపమును తొలగించునదై యుండవలెను. ఊయెల ఉండవలెను. కావ్యాభినివేశముచే (కావ్యపరిశీలన రచనాదులచే) అలసిన మనస్సునకు, ఆ అలసట తీరువరకును ఆ స్థానము, తాను ఆజ్ఞాపించగనే మౌన ముగ నుండెడు జనులు కలదై యుండవలెను, లేదా నిర్జనముగ నైన ఉండవ లెను. అపభ్రంశభాషయందు ఆసక్తి కలవారైన పరిచారకు లుండవలెను మాగధ భాషయందు ఆసక్తి గల పరిచారికలు ఉండవలెను (ఇచట 'సమాగధ' అనున పుడు 'స' అనావశ్యకము లేదా మాగధభాషతో కూడ ఇతరదేశభాషలందు పరి చారికలు నిష్ణాతలై యుండవలె నని అర్థము చెప్పవలెను). అంతఃపురస్త్రీలు ప్రాకృతసంస్కృతభాషలలో ప్రవీణలై యుండవలెను, సభాసంస్కారశుద్ధికై ఈతని మిత్రులు కూడ సకలభాషావేత్తలై యుండవలెను. అనగా సకలభాషా విదు లగు మిత్రులతో గోష్ఠి జరుపు అలవాటు ఉన్నచో సభలలో పాల్గొనుటకు మంచి సంస్కారము లభించును. పరిచారకాదులుగూడ ఆ యా భాషలలో నిష్ణా తులైనచో ఆ పరిచయముచే కవికి సదఃసంస్కారవిశుద్ధి కలుగును.

మూ. సర్వభాషాకుశలః, శీఘ్రవాక్. చార్వక్షరః, ఇఙ్గితాకారవేదీ, నానాలిపిజ్ఞః, కవిః లాక్షణికశ్చలేఖకః స్యాత్. తదసన్నిధావతిరాత్రాదిషు పూర్వోక్తానామన్యతమః.

వ్యా. సకలభాషలలో కుశలుడును, శీఘ్రముగ మాటలాడువాడును, అంద మైన వ్రాత కలవాడును, పరేంగితాకారములను గుర్తింపగలిగినవాడును, అన్ని లిపులు తెలిసినవాడును, స్వయముగ కవిత్వము చెప్పగలిగినవాడును, లక్షణ

వేత్రయు అగు లేఖకుడు ఒకడు కవికి ఉండవలెను అర్ధరాత్ర్యాది సమయమున అట్టి లేఖకుడు దగ్గర లేకున్నచో వెనుక చెప్పినవారిలో, అనగా పరిచారక - పరిచారికా-అన్తఃపురవనితా-మిత్రులలో, ఎవరైన ఒకరు కవికి సహాయకులుగ ఉండవలెను.

మూ. స్వభవనే హి భాషానియమం యథా ప్రభుర్విదధాతి తథా భవతి. శ్రూయతే హి మగధేషు శిశునాగో నామ రాజా; తేన దురుచ్చారానష్టౌ వర్ణానపాస్య స్వాన్తఃపుర ఏవ ప్రవర్తితో నియమః; టకారాదయశ్చత్వారో మూర్ధన్యాః తృతీయవర్జమ్ ఊష్మాణస్త్రయః, క్షకారశ్చేతి.

వ్యా. ప్రభువు తన భవనమునందు భాష ఎట్లు ఉండవలె నని విధించునో అట్లే అగును. మగధదేశమున శిశునాగు డను రాజు ఉండెడివాడట. అతడు, ఉచ్చరించుటకు కష్టముగా నుండెడు ఎనిమిది అక్షరములను, టకారాది మూర్ధన్యాక్షరములను, (ట, ఠ, డ, ఢ,) మూడవది (స) తప్ప మిగిలిన మూడు ఊష్మాక్షరములను (శ, ష, హ,) క్షకారమును నిషేధించి తన అంతఃపురము నందే నియమమును ప్రవర్తింపచేసెనట

మూ. శ్రూయతే చ సూరసేనేషు కువిన్దో నామ రాజా, తేన పరుషసంయోగాక్షరవర్జమన్తఃపుర ఎవేతి సమానం పూర్వేణ. శ్రూయతే చ కున్తలేషు సాతవాహనో నామ రాజా. తేన చ ప్రాకృతభాషాత్మకమన్తఃపుర ఏవేతి సమానం పూర్వేణ శ్రూయతే చోజ్జయిన్యాం సాహసాఙ్కో నామ రాజా; తేన చ సంస్కృతభాషాత్మకమన్తఃపుర ఏవేతి సమానం పూర్వేణ.

వ్యా. సూరసేన దేశమునందు కువిందు డను రాజు ఉండెడివాడట. అతడు పరుషాక్షరములను సంయోగాక్షరములను నిషేధించి అంతఃపురమునందే ఇతాక్షరికము వెనుకటివలెనే (అనగా భాషానియమమును ప్రవర్తింపచేసెను.) కుంతల దేశమున సాతవాహను డనెడు రాజు ఉండెడి వాడట. అతడు తన అంతఃపురమునందు ప్రాకృతభాషనే మాటలాడవలె నని నియమించెను. ఉజ్జయినిలో సాహసాంకు డనే రాజు ఉండెడివాడట. అందు తన అంతఃపురములో సంస్కృత భాషలో మాత్రమే మాటలాడవలె నని నియమించెను.

మూ. తస్య సమ్పుటికా సఫలకఖటికా, సముద్గకః సలేఖనీకమషీభాజనాని తాడిపత్రాణి భూర్జత్వచో వా, సలోహకణ్టకాని తాలదలాని సుసమ్మృష్టాభిత్తయః సతతసన్నిహితాః స్యుః. "తద్ధి కావ్యవిద్యాయాః పరికరః" ఇత్యాచార్యాః. "ప్రతిభైవ పరికరః" ఇతి యాయావరీయః

వ్యా. పలక-కఠికతో కూడిన ఒక చిన్న మరత పెట్టె, ఒకపెట్టె, కలము తోడను సిరా బుడ్డితోడను కూడిన తాడిపత్రములు (ఇవి తాటి యాకులు కావు; అట్టివే సిరాతో వ్రాయుటకు తగిన మరియొక చెట్టు ఆకులు కావలెను లేదా భూర్జవృక్షముయొక్క బెరడు, గంటముతో పాటు తాటి యాకులు, శుభ్రముగ తుడిచి ఉంచిన గోడలు (లేదా విశాలములైన పలకములు) ఆతనికి (కవికి) ఎల్లప్పుడును అందుబాటులో ఉండవలెను ఏలనన ఇవి అంతయు కావ్యవిద్యకు కావలసిన సాధనసామగ్రి" అని ఆచార్యుల అభిప్రాయము; కవికి కావలసిన ప్రధానమైన సాధనసామగ్రి ప్రతిభయే యని రాజశేఖరుని చెప్పుచున్నాడు.

మూ. "కవిః ప్రథమమాత్మానమేవ కల్పయేత్-కియాన్మే సంస్కారః? క్వ భాషావిషయే శక్తోఽస్మి? కింరుచిర్లోకః పరివృఢో వా? కీదృశి గోష్ఠ్యాం వినీతః? క్వాస్యచేతః సంసజతే? ఇతి బుద్ధ్వాభాషావిశేషమాశ్రయేత" ఇత్యాచార్యాః. "ఏకదేశకవేరియం నియమతన్త్రిణా; స్వతన్త్రస్య కవేః పునరేకభాషావత్సర్వా అపి భాషాః స్యుః" ఇతి యాయావరీయః,

వ్యా. కవి ముందుగ తనను గూర్చి పరీక్షించుకొనవలెను. నా సంస్కారమెంత యున్నది? ఏ భాషావిషయమున నాకు కావ్యరచనాసామర్థ్య మున్నది? లోకములోజనులయొక్కయు ప్రభువుయొక్కయు అభిరుచి దేనివైపు ఉన్నది? వీరు ఏ విషయమున గట్టివారు? ఎట్టి గోష్ఠిలో వీరికి పరిచయ మున్నది? వీరి చిత్తము ఏ విషయమున లగ్న మగును? ఈ విషయము లన్నింటిని బాగుగ పరిశీలించి భాషావిశేషము నాశ్రయించవలెను అని ఆచార్యుల అభిప్రాయము. "ఈ విధ మగు నియమము నియంత్రణము కూడ ఏకదేశకవికి మాత్రమే; అనగా ఏదో ఒక భాషలో మాత్రమే ప్రావీణ్య మున్నవానికి మాత్రమే. స్వతంత్రుడగు వానికి అన్ని భాషలును ఏకభాషవలెనే ఉండును" అని యాయావరీయుని అభిప్రాయము.

మూ దేశవిశేషేణ చ భాషాశ్రయణం దృశ్యతే తదుక్తమ్ :-

> గౌడాద్యాః సంస్కృతస్థాః పరిచితరుచయః ప్రాకృతే లాటదేశ్యాః
> సాపభ్రంశప్రయోగాః సకలమరుభువష్టక్క భాదానకాశ్చ.
> ఆవన్త్యాః పారియాత్రాః సహదశపురజైర్భూతభాషాం భజన్తే
> యో మధ్యేమధ్య దేశం నివసతి స కవిః సర్వభాషానిషణ్ణః" 2

వ్యా. దేశ విశేషమును బట్టి భాషావిశేషాశ్రయణము కానవచ్చుచున్నది. ఈ విషయమే చెప్పబడినది:-

"గౌడాది దేశములవారు సంస్కృత ప్రవీణులు. లాటదేశీయులు ప్రాకృత భాషలో అధికరుచి గలవారు. సమస్తమైన మరుభూమికి సంబంధించినవారును, టక్క—భాదానకదేశములకు సంబంధించినవారును అపభ్రంశభాషా ప్రయోగమును చేయుదురు. అవన్తీదేశీయులును, పారియాత్రదేశీయులను, దశపురదేశీయులును భూతభాషను సేవింతురు. మధ్యదేశ మధ్యలో నివసించు కవి సర్వ భాషలందును నిపుణుడు."

వి. మరుదేశ మనగా నేటి రాజస్థాన్ ప్రదేశము. 'మరు' అనునది మార్వాడ్ అయినది. టక్కదేశము:-విపాశాసింధునదుల మధ్య నున్న దేశము. దీనికి వాహీక మని కూడ పేరు. శాకలము (నేటి స్యాల్‌కోట్) దీని రాజధాని. మద్ర ఆరట్టదేశములు కూడ ఈ దేశములోని భాగములు. రాజతరంగిణి ప్రకారము టక్కదేశము చంద్రభాగానదీ (చినాబ్) తీరమున నున్నది. భాదా నక దేశము:- ఇది మహాభారతములో వర్ణించిన 'భాటధానము' కావచ్చును. ఇది శతద్రు నదికిని, వినశనకును మధ్య ఉండి యుండవచ్చును. ఇది పాలి గ్రంథములలో వర్ణించిన భాదీయము లేదా భాదీయనగరము కావచ్చునని కొందరి అభిప్రాయము పారియాత్రము:- ఇది ఒక కుల పర్వతము. వింధ్య పర్వతశ్రేణి పశ్చిమ భాగమునకు సంబంధించి కాంబేలోయ వరకును విస్తరించిన పర్వతము. దశపురము:- మాలవా ప్రాంతమునకు చెందిన మందసౌరు నగ రమునకు పూర్వము దశపుర మని పేరు. కొందరి అభిప్రాయము ప్రకారము చర్మణ్వతీ నదీతీరమున నున్న ధౌల్‌పురమే దశపురము.

> జాతీయాల్లోకసామ్మత్యం కవిః కుత్ర మమేతి చ
> అసమ్మతం పరిహరేన్మతేఽభినివిశేత చ 3

వ్యా "లోకమునకు ఏది సమ్మతమోతన కేది సమ్మతమో తెలిసికొని అసమ్మత మైనదానిని పరిహరించి, సమ్మతమైనదాని విషయమున పట్టుదలతో ప్రయత్నము చేయవలెను'',

మూ. జనాపవాదమాత్రేణ న జుగుప్సేత చాత్మని
జానీయాత్స్వయమాత్మానం యతో లోకో నిరఙ్కుశః 4

వ్యా. కేవలము జనాపవాదమును బట్టి (కొందరు బాగులేదన్న మాత్రముచే) తనను తాను దూషించుకొనకూడదు, తనకు తానే సరిగ వెల కట్టుకొన వలెను. ఏలనన లోకము నిరంకుశ మైనది. (అందుచే లోకులు ఇష్టము వచ్చినట్లు మాటలాడుచుందురు.)

మూ. గీతసూక్తిరతిక్రాన్తే స్తోతా దేశాన్తరస్థితే
ప్రత్యక్షే తు కవౌ లోకః సావజ్ఞః సుమహత్యపి 5

వ్యా. కవి మరణించిన పిదప ఆతనిని గూర్చి పాటలు వ్రాయుదురు. దేశాంతరములో నున్న కవిని స్తుతింతురు కవి ప్రత్యక్షముగ దగ్గరనే ఉన్నచో అత డెంత గొప్పవాడైనను లోకులు అనాదరమును చూపుదురు.

మూ. ప్రత్యక్షకవికావ్యం చ రూపం చ కులయోషితః
గృహవైద్యస్య విద్యా చ కస్మైచిద్యదిరోచతే. 6

వ్యా. ఎదురుగా నున్న కవియొక్క కావ్యము, కులాంగనయొక్క సౌందర్యము, గృహవైద్యుని విద్యయు ఏ ఒక్కనికో రుచించును.

మూ. ఇదం మహాహాసకరం విచేష్టితం పరోక్తి పాటచ్చరతాఠతోఽపి యత్.
సదుక్తిరత్నాకరతాం గతాన్కవీన్ కవిత్వమాత్రేణ సమేన నిన్దతి. 7

వ్యా, పరోక్తుల చౌర్యము చేయువాడు కూడ, తనకును వారికిని సమముగనున్న కవిత్వమును మాత్రము పురస్కరించుకొని, అనగా తానును కవియే వారును కవులే అను కారణముచే, ఉత్తమ కావ్యసముద్రులైన మహాకవులను గూడ నిందించును. ఇది ఎంతయు హాస్యకర మగు చేష్ట.

వచః స్వాదు సతాం లేహ్యం లేశస్వాద్వపికౌతుకాత్
బాలస్త్రీహీనజాతీనాం కావ్యం యాతి ముఖాన్ముఖమ్ 8

వ్యా. సత్కవుల మధురమైన వాక్కు (సర్వజనా) ఆస్వాద్యమైన

యుందురు. బాలురును, స్త్రీలును, హీనజాతికిచేందినవారును రచించిన కావ్యము కొంచెము మధుర మైనను, కౌతుకమువలన(అనగా ఇది చిన్నపిల్లవాడు రచించినది ఇది స్త్రీ రచించినది అనెడు వేడుకచేత) ఒకనోటినుండి మరియొక నోటికి వెళ్లు చుండును; అనగా ప్రసిద్ధి పొందును.

మూ. కార్యావసరసజ్జానాం పరివ్రాజాం మహీభుజామ్.
కావ్యం సద్యఃకవీనాం చ భ్రమత్యహ్ని దిశో దశ. 9.

వ్యా. "సమయానుకూల ముగ కవిత్వము వ్రాయుటకు సిద్ధముగా నున్న వారియొక్కయు (అనగావివాహ-ఉత్సవ-యుద్ధాదిసమయములందు సమయాను కూలముగ కవిత్వము వ్రాయువారని అర్థము), (దేశభ్రమణముచేయు) పరివ్రాజ కులయొక్కయు రాజుల యొక్కయు, ఆశువిత్వము చెప్పువారి యొక్కయు కావ్యము అతిశీఘ్రముగ పది దిక్కులందును సంచరించును."

మూ. పితుర్గురోర్నరేంద్రస్య సుతశిష్యపదాతయః
అవివిచ్యైవ కావ్యాని స్తువన్తి చ పఠన్తి చ. 10

వ్యా. "పుత్రులు, శిష్యులు, భటులు మొదలగువారు (వరుసగ) తండ్రి యొక్కయు గురువుయొక్కయు, రాజుయొక్కయు కావ్యములను, బాగుగ పరిశీలింపకయే స్తుతించుచుందురు, మరియు పఠించుచుందురు."

మూ. కించ "నార్ధకృతం పఠేత్; అసమాప్తిస్తస్య ఫలమ్" ఇతి కవి రహస్యమ్, న నవీనమేకాకినః పురతః. స హి స్వీయం బ్రువాణః కతరేణ సాక్షిణా జీయేత? న చ స్వకృతిం బహుమన్యేత. పక్షపాతో హి గుణదోషౌ విపర్యాస యతి. న చ దృప్యేత్. దర్పలవోఽపి సర్వసంస్కారానుచ్ఛినత్తి. పరైశ్చ పరీక్షయేత్. యదుదాసీనః పశ్యతి న తదనుష్ఠాతేతి ప్రాయోవాదః. కవిమానినం తుఛన్దోనువర్తనేన రఞ్జయేత్. కవిమ్మన్యస్య హి పురతః సూక్తమరణ్య రుదితం స్యాత్. విప్లవేత చ. తదాహః-

"ఇదం హి వైదగ్ధ్యరహస్యముత్తమం పఠేన్న సూక్తిం కవిమానినః పురః
న కేవలం తాం న విభావయత్యసౌ స్వకావ్యబన్ధేన వినాశయత్యపి. 11

వ్యా. మరియు-"పరము పూర్తియైన కావ్యమును ఎవరును చదవకూడదు అట్లు చదువుటకు ఫలము అసమాప్తియే -అనగా అట్లు చదివిన కావ్యము ఎన్నటికిని పూర్తి కాదు" అనునది రహస్యము. తన నవీన రచనను ఒంటరిగా ఉన్న శ్రోతయెదుట చదువరాదు. ఇది నాదని అని అతడు చెప్పమొదలిడినచో నాదేనని నిరూపించుటకు సాక్షి ఎవరుందురు? తన రచనను తానే ప్రశంసించకూడదు. పక్షపాతబుద్ధి యనునది గుణదోషములను తలక్రిందులు చేయును (అనగా తనకావ్యములోని దోషములు కూడ గుణములుగనే కనబడును: ఇతరుల కావ్యములలోని గుణములు దోషములుగ కనబడును). గర్వించరాదు. ఏ కొంచెము గర్వము కలిగినను ఉన్న సంస్కారము లన్నిటిని నశింపచేయును. తన కావ్యమును ఇతరులచే పరీక్షింప చేయవలెను. ఉదాసీనుడు (పక్షపాతబుద్ధి లేని మధ్యస్థుడు) చూడ గలిగిన దానిని రచయిత చూడజాలడు అనునది ప్రసిద్ధముగ చెప్పుచుండెడు విషయము. కవిత్వాభిమానము కలవానిని, అతడు చెప్పినట్లు విని, రంజింపచేయవలెను. తానే మహాకవి నని తలచెడువాని యెదుట కవితాపఠనము అరణ్యరోదనమే కదా? ఆ కవిత కూడ చెడిపోవును. ఆవిషయమునే ఇట్లు చెప్పినాడు:-

"కవిత్వాభిమానము కలవాని ఎదుట కవితను ఎన్నడును పఠింపరాదు. ఇదియే ఉత్తమమైన వైదగ్ధ్యము(నేర్పు) యొక్క రహస్యము అతడాకవిత్వము గ్రహింపకపోవుటయే కాదు, దానిలో తన కవిత్వమును చేర్చి దానిని పాడు చేయును కూడ".

మూ. అనియతకాలాః ప్రవృత్తయో విప్లవన్తే తస్మాద్దివసం నిశాం చ యామక్రమేణ చతుర్ధా విభజేత్. స ప్రాతరుత్థాయ కృతసన్ధ్యావరివస్యః సారస్వతం సూక్తమధీయీత తతో విద్యావసథే యథాసుఖమాసీనః కావ్యస్య విద్యా ఉపవిద్యాశ్చానుశీలయేదాప్రహరాత్. న హ్యేవంవిధమన్యత్ప్రతిభాహేతుర్యథా ప్రత్యగ్రసంస్కారః.

వ్యా. ఏ కార్యము లైనను, నిశ్చితసమయములందు చేయకున్నచో అవి చెడిపోవును. అందుచే(కవి)పగటిని రాత్రిని గూడ జాములలో క్రమము(తిగంటలు ఒకజాము) నాలుగు విధములుగ విభజింపవలెను. ప్రొద్దుటనే లేచి, సంధ్యోపాసన ముగించుకొని, సారస్వతసూక్తమును పారాయణ చేయవలెను. అటు పిమ్మట విద్యాగృహమున (చదువుకొనెడు గదిలో) సుఖముగ కూర్చుండి, కావ్య

విద్యలను, ఉపవిద్యలను ఒక జాము సేపు పరిశీలింపవలెను. ప్రత్యగ్రసంస్కార మువంటి ప్రతిభాహేతువు మరేదియు లేదు కదా!

(ఎప్పటి కప్పుడు శాస్త్రాదుల నభ్యసించి ఉపస్థితిలో నుంచుకొనుట ప్రత్యగ్ర సంస్కారము. ఎప్పటికిని క్రొంగ్రొత్తగనే సంపాదించు సంస్కారము)

మూ. ద్వితీయే కావ్యక్రియామ్. ఉపమధ్యాహ్నం స్నాయాదవిరుద్ధం భుఞ్జీత చ. భోజనాన్తే కావ్యగోష్ఠీం ప్రవర్తయేత్. కదాచిచ్చ ప్రశ్నోత్తరాణి భిన్దీత. కావ్యసమస్యా-ధారణామాతృకాభ్యాసః, చిత్రా యోగా ఇత్యాయామత్రయమ్.

వ్యా. రెండవ జాములో కావ్యరచన చేయవలెను. దాదాపు మధ్యాహ్నమగుసరికి స్నానము చేసి అవిరుద్ధముగ (అత్యధికము కాకుండగా, అత్యల్పము కాకుండగా, ఆరోగ్యవర్ధకము అగు పదార్థముల) భోజనము చేయవలెను. భోజనాంతమున కావ్యగోష్ఠి నడుపవలెను. ఒక్కొకప్పుడు ప్రశ్నోత్తరములను (అనగా ప్రశ్నోత్తరరూపము లగు ప్రహేళికలను) భేదించవలెను. అనగా పొడుపుకథలవంటి సమస్యలను ఇచ్చివాటికి సమాధానములను చెప్పుట అను గోష్ఠిని నడపవలెను. కావ్యసమస్యలు, ధారణామాతృకాభ్యాసము, చిత్రయోగములు మొదలగువాటిని మూడుజాముల వరకును నిర్వహింపవలెను.

వి. ప్రశ్నోత్తరభేదనమునకు ఉదాహరణము 'కింకరోతి, కియత్కాలమ్' ఇత్యాదికము ఏకాదశాధికరణమున చూపబడును. అసంగతార్థమైన ఒక పద్యపాదము నీయగా దానిని పూరించుట మొదలైనవి కావ్యసమస్యలు. ధారణామాతృక అనగా మనస్సులో విషయమును స్థిరముగ ధరించుటకు ఉపకరించునది.

''వస్తు కోశస్తథా ద్రవ్యం లక్షణం హేతురేవ చ.
ఇత్యేతే ధారణాదేవ్యాః పఞ్చాఙ్గరుచిరం వపుః''

కామసూత్ర (1. 3. 16)వ్యాఖ్య యగు జయమంగలలో చెప్పబడినది. (కథావస్తువు, కోశము, ద్రవ్యము, లక్షణము, హేతువు అను ఈ ఐదును ధారణాదేవి సుందరమైన శరీరముయొక్క ఐదు అంగములు అని దీని యర్థము. కావ్యాదర్శతృతీయపరిచ్ఛేదాదులలో వర్ణించిన చిత్రరచనలు చిత్రయోగములు.

మూ. చతుర్థే ఏకాకినః పరిమితపరిషదో వా పూర్వాహ్ణభాగవిహితస్య కావ్యస్య పరీక్షా. రసావేశతః కావ్యం విరచయతో న చ వివేక్త్రీ దృష్టిః; తస్మా

దముపరీక్షేత అధికస్య త్యాగః, న్యూనస్య పూరణమ్, అన్యథాస్థితస్య పరివర్తనం, ప్రస్మృతస్యానుసన్ధానం చ. ఇత్యాహ్నికమ్

వ్యా. చతుర్థయామమున, ఏకాకిగ కాని, పరిమితపరిషత్తులో ఉండి గాని, పూర్వాహ్ణమునందు రచించిన కావ్యమును పరీక్షింపవలెను. రసావేశముతో కావ్యమును రచించువాని దృష్టి ఆ సమయమున సరిగ వివేచింపజాలదు. అందుచే రచనాసమయము దాటిపోయిన తరువాత కావ్యమును పరీక్షించుకొనవలెను. అధికముగ నున్నదానిని త్యజింపవలెను. తక్కువగ నున్నదానిని పూరింపవలెను. మార్పుచేయవలసిన చోట మార్పు చేయవలెను. మరచిపోయినదానిని కూర్పవలెను. ఇది పగటిభాగమున చేయదగిన కృత్యము.

మూ. సాయం సన్ధ్యాముపాసీత సరస్వతీం చ. తతో దివా విహితపరీక్షితస్యాభిలేఖన మాప్రదోషాత్ యావదార్ధ్రి స్త్రీయమభిమన్యేత. ద్వితీయతృతీయా సాధు శయీత, సమ్యక్ స్వాపో వపుషోవరమారోగ్యాయ. చతుర్థే స ప్రయత్నం ప్రతిబుధ్యేత బ్రాహ్మే ముహూర్తే మనః ప్రసీదత్తాంస్తానర్థానధ్యక్షయతి. ఇత్యాహోరాత్రికమ్

వ్యా. సాయంకాలమున సంధ్యోపాసన చేయవలెను. సరస్వతిని కూడ ఉపాసింపవలెను. బాగా రాత్రి అగు వరకును, పగలు వ్రాసి పరీక్షించిన కావ్యమును వ్రాయవలెను. అర్తి ఉన్నంతవరకును, అనగా సంభోగవాంఛ యున్నంతవరకును, స్త్రీ సంబంధమును పొందవలెను. ద్వితీయతృతీయయామములలో బాగుగ నిద్రింపవలెను. మంచి నిద్ర శరీరమునకు మంచి ఆరోగ్యమునిచ్చును. చతుర్థయామమున ప్రయత్నపూర్వకముగ (బద్ధకించకుండగ) మేల్కొనవలెను. బ్రాహ్మముహూర్తమున మనస్సు ప్రసన్నమై ఆయా విషయములను సాక్షాత్కరింప చేయును. ఇది దివసమున కంతకును సంబంధించిన కార్యక్రమము.

మూ. చతుర్విధశ్చాసౌ — అసూర్యమ్పశ్యో, నిషణ్ణో, దత్తావసరః, ప్రాయోజనికశ్చ. యోగుహాగర్భ— భూమిగృహాదిప్రవేశాన్నైష్ఠికవృత్తిః కవతే అసావసూర్యమ్పశ్యః. తస్య సర్వే కాలాః.

వ్యా. అసూర్యంపశ్యుడు, నిషణ్ణుడు, దత్తావసరుడు, ప్రాయోజనికుడు అని కవి నాల్గు విధములు. గుహామధ్యమును గాని, భూగృహమును గాని ప్రవేశించి నిష్ఠతో కవిత్వము రచించువాడు అసూర్యంపశ్యుడు. వీనికి అన్ని సమయములు అనుకూలములే (అనగా బ్రాహ్మముహూర్తాదినియమము లేదు.)

మూ. యః క వ్యక్రియాయామభినివిష్టః కవతే న చ నైష్ఠికవృత్తిః స నిషణ్ణః. తస్యాపి త ఏవ కాలాః.

వ్యా. కావ్యరచనయందు పట్టుదలతో ప్రవర్తించి కావ్యరచన చేయువాడు నిషణ్ణుడు. కాని ఇతడు కావ్యరచనకై నిష్ఠను అవలంబింపడు. ఇతనికి కూడ అన్ని కాలములును అనుకూలములే.

మూ. యః సేవాదికమవిరన్ధానః కవతే,స దత్తావసరః తస్యకతిపయే కాలాః. నిశాయాస్తురీయో యామార్ధః సహి సారస్వతో ముహూర్తః. భోజనానన్తరసౌహిత్యం హి స్వాస్థ్యముపస్థాపయతి; వ్యవాయోపరమః. యదార్తివినివృత్తిరేకమేకాగ్రతాయతనం:యాప్యయానయాత్రా. విషయాన్తరవినివృత్తం హి చిత్తం యత్ర యత్ర ప్రణిధీయతే తత్ర తత్ర గుడూచీలాగం లగతి యదా యదా దాత్మనః క్షణికతాం మన్యతే స స కావ్యకరణకాలః.

వ్యా. తన సేవాదివృత్తులకు భంగము కలుగకుండు విధమున కావ్యరచన చేయువాడు దత్తావసరుడు. అతనికి కొన్ని సమయములు అనుకూలములు. రాత్రియందలి చతుర్థయామము యొక్క అర్ధభాగయ(అనుకూలము). అది సారస్వతముహూర్తము కదా? భోజనానంతరము తృప్తిమనస్సుకు స్వాస్థ్యమును కలిగించును. మైథునానంతరము రిరంసానివృత్తి ఏకాగ్రతకు ప్రధానస్థానము. పల్లకిలో ప్రయాణము. ఇతరవిషయములనుండి నివృత్తమైన చిత్తము ఏ ఏ వస్తువుపై నిలుపబడునో ఆ యా వస్తువుపై గుడూచివలెలగ్నమగును. (సేవాదివ్యాప్తుడగు ఈ దత్తావసరుడు) ఎప్పుడెప్పుడు తనకు తీరిక ఉన్నట్లు అనుకొనునో అది యంతయు కావ్యరచనానుకూల మగు కాలమే. (తిప్పతీగ కషాయము రోగముపై తప్పక పని చేయును. లేదా దానిరసము బట్టపై పడినచో ఆ కర్రు పోదు కాబోలు. అందుచే గుడూచివలె లగ్నమగును అని చెప్పియుండును).

మూ. యస్తు ప్రస్తుతం కిఞ్చన సంవిధానకముద్దిశ్య కవతే, స ప్రాయోజనికః. తస్య ప్రయోజనవశాత్కాలవ్యవస్థా

వ్యా. తాత్కాలిక మగు ప్రయోజనమును దేనినైన ఉద్దేశించి కవిత్వము చెప్పువాడు ప్రాయోజనికుడు. (సమరగీతములు మొదలగునవి వ్రాయువారు ఇందుకు ఉదాహరణము). ప్రయోజనమును బట్టి అట్టివాని కాలవ్యవస్థ యుండును.

మూ. బుద్ధిమదాహార్యబుద్ధ్యోరియం నియమముద్రా. ఔపదేశికస్య పున రిచ్ఛైవ సర్వే కాలాః సర్వాశ్చ నియమముద్రాః.

వ్యా. ఈ నియమము లన్నియు బుద్ధిమదాహార్యబుద్ధుల కు మాత్రమే. ఔపదేశికునకు మాత్రము అతని ఇచ్ఛయే కాలము అతని ఇచ్ఛయే అన్ని నియమములు ను.

మూ. పురుషవద్యోషితోఽపి కవీభవేయుః సంస్కారో హ్యాత్మని సమవైతి, న స్త్రైణం పౌరుషం వా విభాగమపేక్షతే శ్రూయన్తే, దృశ్యన్తే చ రాజపుత్ర్యో, మహామాత్యదుహితరో, గణికాః, కౌతుకి భార్యాశ్చ శాస్త్రప్రహత బుద్ధయః కవయశ్చ

వా. పురుషులవలెనే స్త్రీలు కూడ కవులు కావలెను. (శాస్త్రాభ్యాసాదిజన్య) సంస్కార మనునది ఆత్మకు సంబంధించి యుండును; అంతియే కాని స్త్రీత్వము, పురుషత్వము అను విభాగమును అపేక్షింపదు. రాజుల కుమార్తెలు, మహా మాత్యుల కుమార్తెలు, వేశ్యాస్త్రీలు, ఉత్సాహవంతుల భార్యలు మొదలగు స్త్రీలు శాస్త్రాభ్యాసమునందు నలిగిన బుద్ధికలవారుగను. కవులుగను గూడ వినబడు చున్నారు, చూడబడుచున్నారు కూడ.

మూ. సిద్ధం చ ప్రబన్ధమనేకాదర్శగతం కుర్యాత్. యదిత్థం కథయన్తి:-

"నిక్షేపో విక్రయో దానం దేశత్యాగోఽల్పజీవితా
త్రుటికో వహ్నిరమ్భశ్చ ప్రబన్ధోచ్ఛేదహేతవః." 12

వ్యా. సిద్ధ మైన ప్రబంధమునకు అనేకములైన ఆదర్శములను (ప్రతులను) తయారుచేయవలెను. ఏలనన ఇట్లు చెప్పుదురు :- "ఇతరులవద్ద దాచుటకై ఉంచుట, అమ్మివేయుట, దానము చేయుట, దేశత్యాగము, అకాలమర ణము, కొంతగ్రంథమునశించుట (త్రుటికః) (చెదలు మొ.కూడకావచ్చును) అగ్ని, జలము, ఇవి ప్రబంధనాశమునకు హేతువులు.

దారిద్ర్యం వ్యసనాసక్తిరవజ్ఞా మన్దభాగతా
దుష్టే ద్విష్టే చ విశ్వాసః పఞ్చ కావ్యమహాపదః. 13

వ్యా. దారిద్ర్యము, దుర్వ్యసనాసక్తి, అనాదరభావము, దురదృష్టము, దుష్టుని, శత్రువును విశ్వసించి వారి కిచ్చుట ఈ ఐదును కావ్యమునకు మహా పదలు; అనగా వ్రాసిన కావ్యము నశించుటకు హేతువులు.

మూ. పునః సమాపయిష్యామి. పునః సంస్కరిష్యామి, సుహృద్భిః సహ వివేచయిష్యామి ఇతి కర్తురాకులతా, రాష్ట్రోపప్లవశ్చ ప్రబన్ధవినాశకారణాని.

వ్యా. కొంతకాల మైన తరువాత పూర్తిచేసెదను, మరల ఒక మారు సంస్కరించెదను, మిత్రులతో కూడ కలిసి వివేచించెదను; అని కర్తకు వ్యాకులత్వము, అనగా రచయిత కావ్యమునకు అనేక ప్రతులను తయారుచేయించు విష మున ఒక నిర్ణయమునకు రాలేక పోవుట, రాష్ట్రోపద్రవము ప్రబంధవినాశకారణా ములు

వి. ఇచట 'వినాశకారణాని' అను బహువచనప్రయోగము చింత్యము.

మూ. అహన్యహని శవిభాగేన య ఇత్థం కవతే కృతీ
ఏకావలీవ తత్కావ్యం సతాం కణ్ఠేషు లమ్బతే 14

వ్యా. ఈవిధముగ ఏ బుద్ధిమంతుడు ప్రతిదినంగళ్లను విభజించుకొని కావ్యమును రచించునో, అతని కావ్యము. ఒంటిపేట హారము వలె, సత్పురు షుల కంఠమునందు వ్రేలాడును (కంఠమును ఆశ్రయించి యుండును)

మూ. యథా యథాభియోగశ్చ సంస్కారశ్చ భవేత్కవేః
తథా తథా నిబన్ధానాం తారతమ్యేన రమ్యతా. 15

వ్యా. కవియొక్క, పట్టుదలయు, సంస్కారమును ఏ యే విధముగ ఉండునో అతని కావ్యముల రమ్యత కూడ అట్టితారతమ్యముతోడనే ఉండును,

మూ. ముక్తకే కవయోఽనన్తాః సఙ్ఘాతే కవయః శతమ్.
మహాప్రబన్ధే తు కవిరేకో ద్వౌ దుర్లభాస్త్రయః 16

వ్యా. ముక్తకములు వ్రాయు కవులు అసంఖ్యాకులు. శ్లోకముల సము దాయమును వ్రాయు కవులు నూరుమంది ఉండవచ్చును. మహాప్రబంధమురచింప గల కవి ఒకడు గాని ఇద్దరు కాని ఉండవచ్చును; ముగ్గురు లభించుట కష్టము.

వి. ఒకే విషయమును గూర్చి వ్రాసిన అనేకశ్లోకములకు సంఘాత మని పేరు. "సంఘాతః ఏకార్థవిషయః ఏకకర్తృకః పద్యసంఘాతః శరత్సంఘాత ద్రవిడసంఘాతాదివత్'' అని తరుణవాచస్పతి కావ్యాదర్శవ్యాఖ్యలో (1.18) వ్రాసినాడు.

మహా ప్రబంధ మనగా సంస్కృతమహాకావ్యము. "మహా కావ్యరూపః పురుషార్థఫలః సమస్తవస్తువర్ణనాప్రబన్ధః సర్గబన్ధః సంస్కృత ఏవ" అని లోచనము.

మూ. అత్రాహ స్మ-

ఇహ్యాపి స్వేచ్ఛయా కామం ప్రకీర్ణమభిధీయతే.
అనుజ్ఝితార్థసమ్బన్ధః ప్రబన్ధో దురుదాహరః. 17

ప్రకీర్ణకవిత్వము అనగా పరస్పరసంబంధము లేని వివిధ విషయములకు సంబంధించిన కవిత్వము, స్వేచ్ఛచే అత్యధికముగ చెప్పవచ్చును. విడువబడని అర్థసంబంధము గల అనగా అనుస్యూత మైన అర్థము గల ప్రబంధము చెప్పుట మాత్రము చాల కష్టము

వి. ఇది శిశుపాలవధములోని శ్లోకము. II.78 దీనిని రాజశేఖరుడు తాను చెప్పు విషయమునకు అనుగుణముగ సమన్వయించుకొని ఇచట ఉదాహరించినాడు. "అనేకవిషయములపై ఇష్టము వచ్చినట్లు మాట్లాడవచ్చును గాని, ఒక నియమబద్ధ రీతిలో విషయమును ప్రతిపాదించుట చాలకష్టము" అని దీనికి ఆ ఘట్టమునకు అనుగుణ మైన భావము.

మూ. రీతిం విగాహ్య విగణయ్య గుణాన్విగాహ్య
శబ్దార్థసార్థమనుసృత్య చ సూక్తిముద్రాః.
కార్యో నిబన్ధవిషయే విదుషా ప్రయత్నః
కే పోతయన్త్రరహితా జలధౌ ప్లవన్తే. 18

వ్యా. రీతుల చింతనము చేసి, గుణములను పరిగణించి, శబ్దార్థసముదాయములో ప్రవేశించి సూక్తుల ముద్రలను అనగా పద్ధతులను అనుసరించి, పండితులు నిబంధముల విషయమున ప్రయత్నము చేయవలెను. పోతయంత్రము (నావ) లేనిచో ఎవరు సముద్రములో తేలగలరు?

మూ. లీఢాభిధోపనిషదాం సవిధే బుధానా
మభ్యస్యతః ప్రతిదినం బహుదృశ్వనోఽపి.
కిఞ్చిత్ కదాచన కథంచన సూక్తిపాకా
ద్వాక్తత్త్వమున్మిషతి కస్య చిదేవ పుంసః. 19

వ్యా "ఎన్నియో శాస్త్రములను చూచినవాడైనను, అభిధారహస్యము నంతను ఆకళించుకొని యున్న పండితుల సమీపమున ప్రతిదినము అభ్యాసము

చేయుచున్నవారైనను, ఏ ఒక్క పురుషునికో, సూక్తిపాకము లభించి, ఎప్పుడో ఎటులనో, కొంచెము కావ్యయథార్థస్వరూపము హఠాత్తుగ (మానసమున) స్ఫురించును.''

మూ. ఇత్యనన్యమనోవృత్తేస్సః శేషేఽస్య క్రియాక్రమే.
ఏకపత్నీవ్రతం ధత్తే కవేర్దేవీ సరస్వతీ. 20

వ్యా. ఈ విధముగ సమస్తమైన ఈ క్రియాక్రమమునందు నిశ్చలమైన మనోవృత్తి గల ఈ కవి విషయమున, దేవియైన సరస్వతి ఏకపత్నీవ్రతమును (ఒకే పతి కలిగియుండుట అను వ్రతమును) ధరించును. అనగా అట్టివానికి పూర్తిగ సరస్వత్యనుగ్రహము లభించును.

మూ. సిద్ధిః సూక్తిషు సా తస్య జాయతే జగదుత్తరా.
మూల్యచ్ఛాయాం న జానాతి యస్యాః సోఽపి గిరాం గురుః. 21

వ్యా. "కావ్యము విషయమున అతనికి, జగత్తు అంతటియందును శ్రేష్ఠమైన ఎట్టి సిద్ధి కలుగు ననగా, ఆ బృహస్పతి గూడ దాని (ఆ కవితాసిద్ధి యొక్క) మూల్యముయొక్క ఛాయ నైనను తెలియజాలడు.''

మూ. రాజా కవిః కవిసమాజం విదధీత, రాజని కవౌ సర్వో లోకః కవిః స్యాత్. స కావ్యపరీక్షాయై సభాం కారయేత్. సా షోడశభిః స్తమ్భైశ్చతుర్భిర్ద్వారై రష్టభిర్మత్తవారణీభిరుపేతా స్యాత్. తదనులగ్నం రాజ్ఞః కేలిగృహమ్. మధ్యేసభం చతుఃస్తమ్భాన్తరాహస్తమాత్రోత్సేధా, సమణిభూమికా వేదికా. తస్యాం రాజాసనమ్. తస్య చోత్తరతః సంస్కృతాః కవయో నివిశేరన్. బహుభాషాకవిత్వేయో యత్రాధికం ప్రవీణః స తేన వ్యపదిశ్యతే. యస్త్వనేకత్ర ప్రవీణః స సంక్రమ్యతత్ర తత్రోపవిశేత్.

వ్యా. రాజు తాను కవియై, కవిసమాజమును ఏర్పరుపవలెను. రాజు కవి యైనచో జనులందరును కవు లగుదురు. కావ్యపరీక్షకై రాజు సభ నేర్పరుపవలెను. ఆ సభాభవనమున పదహారుస్తంభములు, నాలుగు ద్వారములు, ఎనిమిది వసారాలు లేదా పైనకట్టిన చిన్నగదులు (మత్తవారణికి 'కర్ణేతపాలిక' అని కూడ పేరు. "గజదన్తైః కృతాశాలా విజ్ఞేయా మత్తవారణీ".) ఉండవలెను. దానితో సంబంధించి రాజుయొక్క కేళీగృహ ముండవలెను. 'సభామధ్యమున, నాలుగు స్తంభముల నడుమ, గజము ఎత్తైనదియు, మణిశిల్పములతో చదునుచేసినదియు

అగు వేదిక ఉండవలెను. ఆ వేదికపై రాజాసనము ఉండవలెను. రాజుకు ఉత్తర మున సంస్కృతకవులు కూర్చుండవలెను. కొందరు బహుభాషాకవులైనచో ఏ కవి ఏ భాషలో ఎక్కువ ప్రవీణుడో ఆతనిని ఆ భాషాకవిగా చెప్పవలెను. అనేక భాషలలో ప్రావీణ్య మున్నచో అతడు మారి మారి ఆ యా భాషాకవుల మధ్య కూర్చుండవలెను.

మూ॰ తతః పరం వేదవిద్యావిదః ప్రామాణికాః, పౌరాణికాః, స్మార్తాః, భిషజో, మౌహూర్తికా అన్యేఽపి తథావిధాః. పూర్వేణ ప్రాకృతాః కవయః. తతః పరం నటనర్తక-గాయన-వాదక-వాగ్జీవన-కుశీలవ-తాలావచరా అన్యేఽపి తథావిధాః. పశ్చిమేనాపభ్రంశినః కవయః; తతః పరం చిత్రలేప్యకృతో, మాణిక్యబన్ధకాః, వైకటికాః స్వర్ణకారవర్ధకిలోహకారా అన్యేఽపి తథావిధాః దక్షిణతో భూతభాషాకవయః తతః పరం భుజఙ్గగణికాః ప్లవకశౌభికజమ్భక మల్లాః శస్త్రోపజీవినోఽన్యేఽపి తథావిధాః.

వ్యా. సంస్కృతకవుల తరువాత వేద వేదాంగాదివిద్యావేత్తలు, దర్శన శాస్త్రవిదులు, పౌరాణికులు, స్మృతిపండితులు, వైద్యులు, జ్యోతిష్కులు, అట్టి వారేయితరులు, (మాంత్రికతాంత్రికాదులు) కూర్చుండవలెను. రాజుకు తూర్పుగ ప్రాకృతకవులు, వారి తరువాత నటులు, నర్తకులు, గాయకులు, సంగీతవాద్యవాదకులు, వాగ్జీవనులు (మాటలతో జీవించువారుఅనగాకథాకథకులు) కుశీలవులు (నాట్యక తెరవెనుకనుండిగాని, ప్రత్యక్షముగగాని గీతములను గానముచేయువారు) హస్తతాళములతో నాట్యము చేయువారు, ఇంకను అట్టివారు కూర్చుండవలెను.

వి. ప్రాచీనలోకవృత్తమును రసభావసమన్వితముగ అభినయించువాడు నటుడు. డోంబీ, శ్రీగదితము మొదలగు చిన్న రూపకములలో అభినయించు వాడు నర్తకుడు.

వ్యా. రాజుకుపశ్చిమమున అపభ్రంశభాషాకవులు, వారి తరువాత చిత్రకారులు-శిల్పకారులు, మాణిక్యములను అలంకారములలో బిగించువారు, రత్నపరీక్షకులు (వైకటికాః) స్వర్ణకారులు, వడ్రంగులు కమ్మరులు, అట్టివారే యైన ఇతరులు కూర్చుండవలెను. రాజుకు దక్షిణమున భూతభాషాకవులు, వారి తరువాత విటులు, వేశ్యాస్త్రీలు, త్రాడుపై నాట్యము చేయువారు, సర్పములను

ఆడించెడువారు ఇంద్రజాలికులు, మల్లురు ఆయుధజీవులు, అట్టివారైన ఇతరులు కూర్చుండవలెను.

మూ. తత యథాసుఖమాసీనః కావ్యగోష్ఠీం ప్రవర్తయేత్, భావయేత్, పరీక్షేత చ. వాసుదేవ - సాతవాహన - శూద్రక - సాహసాఙ్కాదీన్ సకలాన్స భాపతీన్దానమానాభ్యామనుకుర్యాత్.

వ్యా. ఆ సభలో సుఖముగ కూర్చున్నవారై కావ్యగోష్ఠిని నడుపవలెను, (కావ్యార్థముల) భావన చేయవలెను. పరీక్షింపవలెను. దానమానములచే వాసుదేవ-సాతవాహన-శూద్రక - సాహసాంకాదు లగు, సభాపతులుగ వ్యవహరించిన ప్రాచీన రాజులను అనుకరింపవలెను.

మూ. తుష్టాః పుష్టాశ్చాస్య సభ్యా భవేయుః స్థానే చ పారితోషికం లభేరన్. లోకోత్తరస్య చ కావ్యస్య యథార్హాపూజా కవేర్వా. అన్తరాన్తరా చ కావ్యగోష్ఠీం శాస్త్రవాదానను జానీయాత్. మధ్వపి నానవదంశం స్వదతే.

వ్యా. సభ్యులు సంతుష్టులై, పరిపుష్టులై యుండవలెను, తగు సమయములందు పారితోషికములు పొందుచుండవలెను. లోకోత్తర మగు కావ్యమునకు గాని, కవికి గాని తగు విధముగ సంమానము చేయవలెను కావ్యగోష్ఠి జరుగుచున్నపుడు మధ్య మధ్య శాస్త్రవాదములను గూడ అనుమతింపవలెను. నంజు లేని మధువైనను రుచింపదు కదా!

మూ. కావ్యశాస్త్రవిరతౌ విజ్ఞానిష్వభిరమేత. దేశాన్తరగతానాం చ విదుషా మన (న్య) ద్వారా సఙ్గం కారయేత్; ఔచిత్యాద్యావర్తిస్సతి పూజాం చ. వృత్తికామాంశ్చోపజాపేత్ సంగృహ్ణీయాచ్చ. పురుషరత్నానా మేక ఏవ రాజోదన్యాన్ భాజనమ్. రాజచరితం చ రాజోపజీవినోఽప్యనుకుర్యుః రాజ్ఞ ఏవ హ్యసావుపకారో యద్రాజోపజీవినాం సంస్కారః.

వ్యా. కావ్యగోష్ఠికిని శాస్త్రగోష్ఠికిని విరామము కలిగినపుడు శిల్పం గోష్ఠిలో క్రీడించవలెను: దేశాంతరమునుండి వచ్చిన పండితుల పరిచయము ఇతరుల ద్వారా (సభాసదులకు) చేయించవలెను. ఔచిత్యమును పురస్కరించుకొని వారు తమరాజ్యమునం దున్నంతవరకును, పూజ (సన్మానము) కూడ చేయించవలెను. వృత్తికొరకై వచ్చిన విదేశీయులను రహస్యోపాయములచే తన వైపు ఆకర్షించుకొని, వారిని సంగ్రహింపవలెను. పురుషరత్నములకు రాజు

అనెడు ఒక్క సముద్రమే స్థానము. రాజసేవకులు (మంత్రిసేనాపత్యాదులు) కూడ రాజచరితమునే అనుకరింపవలెను. రాజసేవకులు సంస్కారవంతులై యున్నచో దీవరికి ఉపకారము రాజునకే కదా?

మూ. మహానగరేషు చ కావ్యశాస్త్రపరీక్షార్థం బ్రహ్మసభాః కారయేత్. తత్ర పరీక్షోత్తీర్ణానాం బ్రహ్మరథయానం పట్టబన్ధశ్చ.

వ్యా. కావ్యశాస్త్రపరీక్షలు జరుపుటకై మహానగరములలో బ్రాహ్మణ సభలను ఏర్పరుపవలెను అక్కడ పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి బ్రహ్మరథముపై ఊరేగింపు, పట్టవస్త్రధారణము లభింపవలెను.

మూ. శ్రూయతే చోజ్జయిన్యాం కావ్యకారపరీక్షా :-

"ఇహ కాలిదాసమేణ్ఠావత్రామరరూపసూర భారవయః
హరిచన్ద్ర చన్ద్రగుప్తౌ పరీక్షితావిహ విశాలాయామ్." 22

వ్యా. ఉజ్జయినిలో కావ్యరచయితల పరీక్ష జరిగినట్లు వినబడుచున్నది- "ఈ విశాలానగరములో కాలిదాసభర్తృమేంఠులు పరీక్షింపబడినారు ఇచటనే అమర-రూప-అర్యసూర-(ఒక బౌద్ధకవి) భారవులు పరీక్షింపబడినారు. హరిచంద్ర-చంద్రగుప్తులు కూడ ఇచటనే పరీక్షింపబడినారు."

మూ. శ్రూయతే చ పాటలిపుత్రే శాస్త్రకారపరీక్షా :-

"అత్రోపవర్షవర్షావిహ పాణినిపిఙ్గలావిహ వ్యాడిః.
వరరుచిపతఞ్జలీఇహ పరీక్షితాః ఖ్యాతిముపజగ్ముః" 23

వ్యా. పాటలిపుత్రపురమున శాస్త్రకారుల పరీక్ష జరుగుచుండెడి దని వినబడుచున్నది:- "ఉపవర్ష-వర్షులు, పాణిని-పింగలులు వ్యాడి, వరరుచి పతంజలులు,, వీరందరును ఇచట పరీక్షితులై ఖ్యాతి గాంచిరి."

మూ:- ఇత్థం సభాపతిర్భూత్వా యః కావ్యాని పరీక్షతే
యశస్తస్య జగద్వ్యాపి స సుఖీ తత్ర తత్ర చ. 24

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే కవిచర్యా, రాజచర్యా చ దశమోధ్యాయః

వ్యా. ఈ విధముగ సభాపతిగ నుండి ఎవరు కావ్యములను పరీక్షించుదురో అతని కీర్తి జగద్వ్యాప్తమై యుండును. అతడు అంతటను సుఖవంతు డగును.

బాలానందినిలో దశమాధ్యాయము సమాప్తము

ఏకాదశోఽధ్యాయః - శబ్దహరణమ్.

మూ. పరప్రయుక్తయోః శబ్దార్థయోరుపనిబన్ధో హరణమ్. తద్ద్విధా—పరిత్యాజ్యమనుగ్రాహ్యం చ. తయోః శబ్దహరణమేవ తావత్ పఞ్చధా-పదతః, పాదతః అర్థతః, వృత్తతః, ప్రబన్ధతశ్చ.

వ్యా. హరణ మనగా. పరులు ప్రయోగించిన శబ్దార్థములను తమ కావ్యములలో కూర్చుట. పరిత్యాజ్యము (పరిహరింపదగినది) అనుగ్రాహ్యము (అంగీకరింపదగినది) అని హరణము రెండు విధములు. వానిలో అనగా శబ్దార్థహరణములలో, పదహరణము, పాదహరణము, అర్థహరణము. వృత్తహరణము, ప్రబంధహరణము అని శబ్దహరణమే ఐదు విధములు.

మూ. "తత్రైకపదహరణం న దోషాయ" ఇత్యాచార్యాః. "అన్యత్ర ద్వ్యర్థపదాత్" ఇతి యాయావరీయః. తత్ర శ్లిష్టస్య శ్లిష్టపదేన హరణమ్:—

వ్యా. అందు ఏకపదహరణము దోషము కాదని ఆచార్యులు చెప్పుదురు. "ఈ వచనము ద్వ్యర్థము లగు పదములకంటె భిన్నములగు పదములవిషయమునవే ప్రవర్తించును" అని రాజశేఖరుడు చెప్పుచున్నాడు.

వి. అనగా ఏకపదహరణము దోషము కాకపోవచ్చును గాని ఆ ఏకపదము రెండర్థములు గల పదమైనచో దోషమే అనియర్థము శ్లిష్టపదమును పూర్తిగా శ్లిష్టపదముగా హరించుటకు ఉదాహరణము ఎట్లనగా—

మూ. దూరాకృష్టశిలీముఖవ్యతికరాన్నో కింకిరాతానిమా
నారాద్వ్యావృతపీతలోహితముఖాన్ కిం వా పలాశానపి.
పాన్థాః కేసరిణం న పశ్యత పురోఽప్యేనం వసన్తం వనే
మూఢా రక్షత జీవితాని శరణం యాత ప్రియాం దేవతామ్. 1

వ్యా. "ఓః పాంథులారా! దూరమునుండి ఆకర్షింపబడిన తుమ్మెదలు గల ఈ కింకిరాత(అశోక)వృక్షములను(ఆకర్ణాంతము లాగబడిన బాణములు గల ఈ కిరాతులను-"కిమ్ + కిరాతాన్" అని పదచ్ఛేదము), సమీపమున విస్తరింపచేయ

బడిన, పచ్చగను, ఎర్రగను ఉన్న ఆ గభాగములు గల పలాశవృక్షములను, (సమీపము ననే తెరవబడినవియు, లాగబడిన రక్తముకలవియు అగు ముఖములు గల రాక్షసులను) ఎదుటనే ఉన్న ఈ కేసరవృక్షమును, వసన్తమును, వశమునందు చూచుటలేదా? (వనమునందు ఎదుటనే నివసించి యున్న సింహమును చూచుట లేదా?) ఓమూఢులారా! దేవతయగు ప్రియురాలిని (మీ ఇష్టదేవతను) శరణము పొందుడు జీవితములను రక్షించుకొనుడు."

వి. ఈ శ్లోకమున 'శిలీముఖ' 'కింకిరాత' "పీతలోహితముఖ" 'పలాశ' మొదలగు పదములు శ్లిష్టములు, ఇందులోని 'దూరాకృష్టశిలీముఖ' 'కింకిరాత' పదములను యథాతథముగ గ్రహించి ఈ క్రింది శ్లోకము వ్రాయబడినది. అట్టి శ్లిష్టపదహరణము అయుక్తమనియర్థము.

మూ. యథా చ-

మా గాః పాన్థ ప్రియాం త్యక్త్వా దూరాకృష్టశిలీముఖమ్.
స్థితం పన్థానమావృత్య కింకిరాతం న పశ్యసి. 2

వ్యా. పూర్వశ్లోకమునందలి శ్లిష్టపదములను గ్రహించి వ్రాసిన మరియొక శ్లోక మెట్లనగా-

"ఓపాన్థుడా! ప్రియురాలిని విడచి వెళ్లకుము. దూరమునుండి ఆకర్షింపబడిన తుమ్మెదలు కలదియు, (ఆకర్ణాంతము లాగబడిన బాణము కలవాడును) మార్గమును ఆవరించి ఉన్నదియు (ఉన్నవాడును) అగు అశోకవృక్షమును (కిరాతుని) చూచుట లేదా?"

మూ. శ్లిష్టపదైకదేశేన హరణమ్-
నాశ్చర్యం యదనార్యాప్తావస్త్రప్రీతిరయం మయి
మాంసోపయోగం కుర్వీత కథం క్షుద్రహితో జనః. 3

వ్యా. శ్లిష్టపదముయొక్క ఒక భాగమును మాత్రమే హరించుటకు ఉదాహరణము-

అనార్యుడు లభించిన పిమ్మట ఇతనికి నా విషయమున ప్రేమ తగ్గినదన్నచో ఆశ్చర్య మేమియును లేదు. క్షుద్రహితు డగు జనుడు (క్షుద్రులకు హితుడు; క్షుత్తు అనగా ఆకలి లేనివాడు అని రెండర్థములు) నన్ను ఉపయో

గముకలవానినిగా (మాం + సోపయోగమ్). మాంసముయొక్క ఉపయోగమును ఎట్లు చేయును?"

మూ యథా చ—

కోపాన్మానిని కిం స్ఫురత్యతితరాం శోణాధరస్తేఽధరః
కిం వా చుమ్బనకారణాద్దయిత నో వాయోర్వికారాదయమ్.
తస్మాత్సుభ్రు సుగన్ధిమోహితరసం స్నిగ్ధం భజస్వాదరా
న్ముగ్ధే మాం సరసం బ్రువన్నితి తయా గాఢం సమాలిఙ్గితః 4.

వ్యా. ఇంకను ఎట్లనగా—(శ్లిష్టపదములో ఒక భాగమును హరించుటకు ఉదాహరణము):-

"ఓమానినీ! అతిసుందర మగు నీ అధరము ఎక్కువగ అదరుచున్నది- ఇది కోపమువల్లనా లేక చుంబనమువల్లనా? ఓ ప్రియతమా! (అది ఏదియును) కాదు. ఇది వాయువికారమువలన. అటులైనచో, ఓ! అందమైన కనుబొమ్మలు గల ముగ్ధా! మంచి గంధముకలవాడును (కలదియు), అనురాగముతో నిండిన వాడును (రుచికలదియు) స్నేహభరితుడును(మెత్తగ నున్నదియు) అగు సరసుడ నైన నన్ను (మాం + సరసమ్) (మాంసరసమును)(మాంసరసమ్) ఆదరముతో సేవించుము. ఈ విధముగ పలుకుచున్న ఆ నాయకుడు ఆమెచే గాఢముగ అలింగనముచేయబడెను."

వి. పూర్వశ్లోకములో "మాంసోపయోగమ్" అను శ్లిష్టపదమునందలి భాగమగు 'మాంస' శబ్దము ఈ శ్లోకమున హరింపబడినది.

మూ. శ్లిష్టస్య యమకేన హరణమ్—

హ(బం)లమపారపయోనిధివిస్తృతం ప్రహరతా హలినా సమరాఙ్గణే.
విజయశశ్చ శశాఙ్కకలామలం నిరవధీరితమాకులమాసురమ్. 5

వ్యా. శ్లిష్టపదమును యమకముచే (యమకమునిమిత్తము) హరించుటకు ఉదాహరణము:-

యుద్ధరంగమునందు, అపారసముద్రము వలె విస్తృతమైన సైన్యమును కొట్టిన బలరామునిచే, చంద్రకళల వలె నిర్మలమైన, అనంతమైన (నిరవధి) తనయొక్క కీర్తి, కులపర్వతములవరకును, దేవలోకము వరకును (ఆసురం)

వ్యాపింపచేయబడినది. (వ్యాకులమైన, అసురసమూహము కూడ, అత్యధికముగ కంపింపచేయబడినది అని నాల్గవపాదమునకు రెండవ అర్థము).

మూ. యథా చ—

దలయతా విశిఖైర్బలమున్మదం నిరవధీరితమాకులమాసురమ్.
దశసు దిక్షు చ తేన యశః సితం నిరవధీరితమాకులమాసురమ్. 6

వ్యా. మరియును ఎట్లనగా — ఈ క్రింది శ్లోకమున పూర్వశ్లోక చతుర్థ పాదము యమకముకొరకై, యథాతథముగ హరింపబడినది. :-

"బాణములచే ఛేదించుచున్న అతనిచే, మదోద్ధతమైన ఆ రాక్షససైన్యము వ్యాకులమగు విధమున, అత్యధికముగ చిమ్మివేయబడినది (ఈరితమ్). తెల్లనిదియు, అనంతమును అగు కీర్తికూడ, కులపర్వతములవరకును, స్వర్గము వరకును వ్యాపింపచేయబడినది.

మూ. శ్లిష్టస్య ప్రశ్నోత్తరేణ హరణమ్—
"యస్యాం భుజఙ్గవర్గః కర్ణాయతే క్షణం కామినీవదనం చ" యథా చ—
కింకరోతి కియత్కాలం వేశ్యావేశ్మని కాముకః
కీదృశం వదనం వీక్ష్య తస్యాః కర్ణాయతేక్షణమ్. 7

వ్యా. శ్లిష్టపదములను ప్రశ్నోత్తరరూపమున హరించుటకు ఉదాహరణము:-

"ఏ నగరమునందు విటుల సముదాయము క్షణకాలముపాటు కర్ణునివలె ప్రవర్తించునో, అనగా సర్వస్వమును దానము చేయునో (కర్ణాయతే + క్షణమ్). కామినీముఖము కూడ కర్ణములవరకును దీర్ఘమైన నేత్రములు కలదో (కర్ణాయత + ఈక్షణమ్.)"

మరియు ఎట్లనగా—ఈ క్రింది శ్లోకమున, పైవాక్యమునందలి 'కర్ణాయతే క్షణమ్' అను శ్లిష్టపదము ప్రశ్నోత్తరరూపమున గ్రహింపబడినది.

(ప్రశ్న) కాముకుడు వేశ్యాగృహమునందు, ఆమెయొక్క ఎట్టి ముఖమును చూచి, ఎంతకాలము, ఏమి చేయును.? (ప్రత్యుత్తరము) — 'కర్ణాయతేక్షణమ్'— కర్ణములవరకు దీర్ఘములైన నేత్రములు గల ఆమె ముఖమునుచూచి, క్షణకాలము కర్ణుకువలె ప్రవర్తించును."

మూ. యమకస్య యమకేన హరణమ్—

వరదాయ నమో హరయే పతతి జనోయం స్మరన్నపి న మోహరయే.
బహుశశ్చక్రన్ద హతా మనసి దితిర్యేన దైత్యచక్రం దహతా. 8.

యథా చ—

చక్రం దహతారం చక్రన్ద హతారం
ఖడ్గేన తవాజౌ రాజన్నరినారీ. 9

వ్యా. యమకమును యమకముచే హరించుట:-

"ఏ విష్ణువును స్మరించినంతమాత్రముచేతగూడ జనుడు మోహవేగమున పడడో, అట్టి వరదుడైన విష్ణువునకు నమస్కారము. దైత్యసముదాయమును దహించివేసిన (దైత్యచక్రం+దహతా) ఏ విష్ణువుచే మనస్సునందు పీడింపబడినదై దితిదేవి అనేకపర్యాయములు ఏడ్చినదో (చక్రన్ద+హతా)"

మరియు ఎట్లనగా — పై శ్లోములో యమకస్థానమునప్రయుక్త మగు 'చక్రం దహతా' ఈ క్రింది శ్లోకార్ధములో గూడ యమకస్థానమున గ్రహింపబడినది:-

ఓరాజా! యుద్ధమునందు శత్రుసముదాయమును (అరం చక్రమ్) దహించి వేయుచున్న నీ ఖడ్గముచే మిక్కిలి పీడింపబడినదై (అరం హతా) శత్రుస్త్రీగణము ఆక్రందించెను," లేదా 'అరం' అనునానిని 'చక్రన్ద' అనుదానితో అన్వయించి 'మిక్కిలి ఆక్రందించెను,' అని అర్థము చెప్పవచ్చును.

మూ. ఏవమన్యోన్యసమన్వయేఽన్యేఽపి భేదాః. నన్విదముపదేశ్యమేవ న భవతి. యదిత్థం కథయన్తి :-

పుంసః కాలాతిపాతేన చౌర్యమన్యద్విశీర్యతి (తే)
అపి పుత్రేషు పౌత్రేషు వాక్చౌర్యం చ న శీర్యతి (తే) 10

వ్యా. ఈ విధముగ పూర్వోక్తభేదములను ఒక దానితో ఒకటి చేర్చుటచే మరి కొన్ని భేదములు కూడ ఏర్పడును.

(ప్రశ్న). ఇట్టి శబ్దచౌర్యమును గూర్చి ఉపదేశింపరాదు కదా? ఏమనగ పెద్దలు ఇట్లు చెప్పుదురు:-

ఒక పురుషుడు చేసిన ఇతరచౌర్యము లన్నియు, కాలము గడచిపోవుటతో నశించును (విస్మృతములగును), వాక్చౌర్యము మాత్రము ఆతని పుత్రులందును, పౌత్రులందును గూడ నశింపదు;(అనగా కొన్ని తరములవరకును, వాక్చౌర్యకృత మగు అపకీర్తి అనువర్తించుచునే ఉండును).

'శీర్యతే' అనునది శౄధాతువు. కర్మకర్తరిప్రయోగము గాన ఆత్మనేపదమున ఉండవలెను.

మూ. అయమప్రసిద్ధః ప్రసిద్ధిమానహమ్; అయమప్రతిష్ఠః, ప్రతిష్ఠావానహమ్; అప్రక్రాన్తమిదమస్య సంవిధానకం. ప్రక్రాన్తం మమ; గుడూచీవచనోఽయం. మృద్వీకావచనోఽహమ్; అనాదృతభాషావిశేషోఽయం, అహమాదృతభాషావిశేషః; ప్రశాన్తజ్ఞాతృకమిదమ్;దేశాన్తరితకర్తృకమిదమ్ ఉచ్ఛ(త్స)న్ననిబన్ధమూలమిదమ్, మ్లేచ్ఛితకోపనిబన్ధనమిదమ్ - ఇత్యేవమాదిభిః కారణైః శబ్దహరణే అర్థహరణే చ వా అభిరమేత" ఇత్యవన్తిసున్దరీ.

వ్యా. అర్థహరణశబ్దహరణములు అనుచితములు గాన వాటినిగూర్చి ఉపదేశింపరాదు అనుదానికి సమాధానముగ అవంతిసుందరి ఈ విధముగ చెప్పుచున్నది. కొన్ని సమయములలో అర్థహర శబ్దహరణములు కూడ చేసి ప్రసిద్ధిపొందుటకు ప్రయత్నింపవలె నని ఆమె అభిప్రాయము,

"ఈ కవి అప్రసిద్ధుడు; నేను ప్రసిద్ధుడను. ఈతనికి కవిగా మంచి ప్రతిష్ఠ లేదు, నాకున్నది. ఈతని శబ్దార్థ రచనావిధానము ప్రసంగానుగుణముగ లేదు; నాది ఉన్నది. ఈతనిది గుడూచీపాకము (కటుపాకము); నాది ద్రాక్షాపాకము. ఈతనికి భాషలో నున్న అందచందములు (విశేష = Idiom etc.) సరిగ తెలియవు; నాకు తెలుసును.(అందుచేత అతని శబ్దార్థములే నా కావ్యములో నేనుపయోగించినను వాటి శోభ ఇనుమడించును అని అర్థము). ఈతని కావ్యము నుండి గ్రహించినను ఎవరును తెలిసికొనజాలరు. దీని రచయిత దేశాంతరములో నున్నాడు (అందుచే ఎవరును నేనాతని నుండి హరించినట్లు తెలిసికొనజాలరు). ఈ శబ్దార్థములకు మూల మగు నిబంధము ఇపుడు ఉచ్ఛిన్నమైపోయినది అనగా పఠనపాఠనములలో లేదు. దీనికి మూలము అపశబ్దభూయిష్ఠ మగు 'నిబంధము

లేదా మ్లేచ్ఛభాషలో వ్రాసిన నిబంధము (అందుచే ఆ మూల గ్రంథముల నెవరును చదవరు గాన నేను నిర్భయముగ హరింపవచ్చును). ఇత్యాది కారణము లచే శబ్దార్థహరణమును గూర్చి ఉపదేశించుట అంతగ అయుక్తము కాదని అవంతిసుందరి అభిప్రాయము.

ఎంత వలదనినను శబ్దార్థహరణము జరుగుచునే యుండును. పూర్వము సంస్కృతవాఙ్మయాదులనుండి శబ్దార్థహరణము చేసెడివారు: ఇపుడు ఆంగ్ల ఫ్రెంచి వాఙ్మయాదులనుండి కూడ అపహరించి తమ సొత్తుగా చెప్పుకొను చున్నారు. ఇట్లు చేయుటకు కారణములను చెప్పుచు కొన్ని పరిస్థితులలో ఇది అనింద్యమే అని అవన్తిసుందరి సూచించినది.

మూ. "త్రిభ్యః పదేభ్యః ప్రభృతి త్వశ్లిష్టేభ్యో హరణమ్" ఇత్యాచార్యాః

యథా:-

స పాతు వో యస్య జటాకలాపే స్థితః శశాఙ్కః స్ఫుటహారగౌరః
నీలోత్పలానామివ నాలపుఞ్జే నిద్రాయమాణః శరదీవ హంసః.

యథా చ :-

స పాతు వో యస్య హతావశేషా స్తత్తుల్యవర్ణా ఞ్జనరఞ్జితేవ.
లావణ్యయుక్తేష్వపి విత్రస న్తి దైత్యాః స్వకాన్తానయనోత్పలేషు. 12

వ్యా. ఒక్క పదమును స్వీకరించినను, దోషము లేదు అని ఆచార్య మతముగా వెనుక చెప్పబడినది. ఒక్క పదమే యైనను అది శ్లిష్టపద మైనచో దోషమే యని యాయావరీయుని యభిప్రాయ మని కూడ చెప్పబడినది. ఇపుడు బహుపదములను గూర్చి వారి మతమును చెప్పుచున్నారు. "అశ్లిష్టము లగు పదములను మూడింటిని లేదా అంతకంటె అధికసంఖ్యలో ఉన్నవాటిని (ఒకే క్రమమున) గ్రహించినచో అది హరణ మగును"అని ఆచార్యులు చెప్పుచున్నారు. రెండు పదము లైనను దోషము కానట్లు ఇచట ఆచార్యుల మతమని చెప్పి నట్లైనది. ఎట్లనగా :-

"ఏ ఈశ్వరుని జటాకలాపములో, స్ఫుటహారము వలె శుభ్రవర్ణుడై యున్న చంద్రుడు, శరత్కాలమునందు, నల్లకలువల కాడల మధ్య నిద్రించుచున్న హంస వలె నున్నాడో అట్టి ఈశ్వరుడు మిమ్ములను రక్షించు గాక."

ఇంకను ఎట్లనగా :- "ఏ విష్ణువు సంహరింపగా మిగిలిన దైత్యులు, ఆతనితో సమానమైన వర్ణము గల అంజనముచే రంజితము లైన తమ కాంతల నేత్రోత్పలములను జూచి, అవి అందముగనే ఉన్నను, భయపడుచుందురో అట్టి విష్ణువు మిమ్ములను రక్షించుగాక."

ఇచట మొదటి శ్లోకములో నున్న "స పాతు వో యస్య" అను నాలుగు పదములు రెండవ శ్లోకములో యథాతథముగ గ్రహింపబడినవి గాన ఇది శబ్దహరణ మని ఆచార్యుల అభిప్రాయము.

మూ. 'న' ఇది యాయావరీయః. ఉల్లేఖవాన్ పదసన్దర్భః పరిహరణీయః; నాప్రత్యభిజ్ఞాయాతః పాదోఽపి. తస్యాపి సామ్యే న కిఞ్చన దుష్టం స్యాత్.

యథా:- ఇత్యుక్తవానుక్తివిశేషరమ్యం మనః సమాధాయ జయోపపత్తౌ.
ఉదారచేతా గిరమిత్యుదారాం ద్వైపాయనేనాభిదధే నరేన్ద్రః. 18

యథా చ:-ఇత్యుక్తవానుక్తివిశేషరమ్యం రామానుజన్మా విరరామ మానీ.
సంక్షిప్తమాప్తావసరం చ వాక్యం సేవావిధిజ్ఞైః పురతః ప్రభూణామ్.

వ్యా. అది అట్లు కాదని యాయావరీయుడు చెప్పుచున్నాడు. ఉల్లేఖము గల పదసందర్భమును పరిహరింపవలెను.

వి. అనగా ఒక కవి ప్రయత్నపూర్వకముగ కూర్చిన పదసముదాయమును పరిహరింపవలెను. పదముల సంఖ్యతో పని లేదు. ఆ పదసముదాయము ఒక దృష్టివిశేషముతో కూర్చిన దగుటచే పఠితల మనస్సులో స్థిరముగ నుండిపోవును. మరియొక కవి దానిని గ్రహించి శ్లోకము వ్రాసినపుడు అతడు చేసిన పదహరణము కొట్టవచ్చినట్లు తెలిసిపోవును అని భావము.

వ్యా. గుర్తుపట్టుటకు వీలులేని విధమున నుండు, అనగా అంతగవిశేషమేమియు లేని పాదమునైనను గ్రహింపవచ్చును. (అది హరణముగా పరిగణింపబడదు.) అట్టి పాదముయొక్క సామ్య మున్నను దోష మేమియు లేదు.

వి. రాజశేఖరుని అభిప్రాయ మేమనగా – పూర్వకవులనుండి గ్రహించినవి రెండు పదములా, మూడు పదములా, లేక అంతకంటె అధికమా అను దానిని బట్టి హరణదోషమును నిర్ణయింపరాదు. పూర్వకవిరచనలో నున్న ఒక పదసము

దాయము, దాని స్థితిని బట్టి అతిప్రధానమైనచో, పదముల సంఖ్య అత్యల్పమే యైనను దానిని గ్రహింపరాదు. అట్టి ప్రాధాన్యము లేని పక్షమున పదమునే కాదు, పూర్తి పాదము నైనను గ్రహింపవచ్చును. అది హరణముగ పరిగణింపబడదు. ఇందులకు ఉదాహరణముగ రెండు శ్లోకములను చూపుచున్నారు. మొదటి శ్లోకమునందలి మొదటి పాదమును రెండవ శ్లోకములో యథాతథముగ గ్రహించినను, ఆ పాదమున కంత ప్రాధాన్యము లేకుండుటచే అది హరణదోషము కాదు. కాని తరువాత చూపిన రెండు శ్లోకములలో, మొదటి శ్లోకమునందలి చతుర్థపాదము (శఙ్కరక్షీరసిన్ధవే) రూపకాలంకారయుక్తముగ కవిచే ప్రయత్నపూర్వకముగ నిర్మింపబడినది. ఈ పదసందర్భమును గ్రహించుటచే రెండవ శ్లోకము పాదహరణదోషదుష్టము.

వ్యా. ఎట్లనగా - (ఇది కిరాతార్జునీయములోని శ్లోకము iii. 10). "జయప్రాప్తివిషయమున మనస్సును నిలిపి, ఉక్తివిశేషముతో రమ్య మగునట్లు ఈ విధముగ పలికిన, ఉదారచిత్తు డగు యుధిష్ఠిరుడు, ద్వైపాయనునిచే ఉదార మగు వాక్యమును ఈ విధముగ పలకబడెను "

ఇంకను ఎట్లనగా-"ఉక్తి విశేషముచే రమ్య మగునట్లుగా ఈ విధముగ పలికిన, మానవంతు డగు లక్ష్మణుడు, విరమించెను. సేవావిధిని ఎరిగినవారు ప్రభువుల ఎదుట, సంక్షిప్తమును సమయానుకూలమును అగు వాక్యమునే(పలుకుదురు)."

మూ. ఉల్లేఖవాన్యథా :-
నమః సంసారనిర్వాణవిషామృతవిధాయినే
సప్తలోకోర్మిశజ్గాయ శఙ్కరక్షీరసిన్ధవే.
యథా చ :- ప్రసరద్బిన్దునాదాయ శుద్ధామృతమయాత్మనే
నమోఽనన్తప్రకాశాయ శఙ్కరక్షీరసిన్ధవే. 16

వ్యా. ఉల్లేఖము గల అనగా ప్రయత్నపూర్వకముగ కూర్చబడిన శబ్దసందర్భమునకు ఉదాహరణ మెట్లనగా :-

"సంసారము, మోక్షము అనెడు విషమును, అమృతమును కల్పించినదియు, సప్తలోకము లనెడు తరంగములు కలదియు అగు శంకరుడనెడు క్షీరసముద్రమునకు నమస్కారము"

మరియు ఎట్లనగా-"ప్రసరించుచున్న బిందువు నాదము అనెడు బిందువుల నాదము కలదియు, శుద్ధ మైన మోక్షమనెడు అమృతముతో నిండినట్టిదియు, అనంత మైన ప్రకాశ మనెడు ఆకాశమువంటి ప్రకాశము కలదియు అగు శంకరు డనెడు క్షీరసముద్రమునకు నమస్కారము"

వి. బిన్దువు; నాదము :- ప్రలయాంతమునందు, ప్రాణుల కర్మల నను సరించి పరమేశ్వరునకు సృష్టి చేయవలె ననెడు ఇచ్ఛ కలుగును. ఈ ఇచ్ఛకు మాయావృత్తి యని పేరు. అటుపిమ్మట త్రిగుణాత్మక మగు అవ్యక్తము జనిం చును. అదియే బిందువు. దీనినే శక్తితత్త్వ మందురు ఆ బిందువులోని అచిదం శము బీజము; చిదచిన్మిశ్ర మగు అంశము నాదము; చిదంశము బిందువు. శక్తి తత్త్వాత్మక మగు బిందువునుండి ఆవిర్భవించిన నాదమునకు శబ్దబ్రహ్మ యని నామాంతరము. ఇది (నాదము) వర్ణాదివిశేషరహితము, జ్ఞానప్రధానము, చేతన మిశ్రము అగు సృష్ట్యుపయోగ్యవస్థావిశేషము. ఈ జగదుపాదాన మగు నాదము నకు 'రవము' "పరావాక్" ఇత్యాది నామధేయములు కూడ కలవు. నాదస్వరూ పము ప్రపంచసారమున ఈ విధముగ వివరింపబడినది. "బిన్దోస్తస్మాద్భిద్యమా నాత్ రవోఽవ్యక్తాత్మకోఽభవత్.స ఏవ శ్రుతిసంపన్నైః శబ్దబ్రహ్మేతి గీయతే" (I. 45) ఈ బిందునాదముల ఆవిర్భావస్థానము పరబ్రహ్మయే గాన శంకరుడు ప్రకృతశ్లోకమున "ప్రసరద్బిన్దునాదాయ" అని వర్ణింపబడినాడు.

మూ. "పాద ఏవాన్యథాత్వకరణకారణం న హరణమ్; అపి తు స్వీకరణమ్" ఇత్యాచార్యాః యథా:-

త్యాగాధికాః స్వర్గముపాశ్రయన్తే త్యాగేన హీనా నరకం వ్రజన్తి
న త్యాగినాం కించిదసాధ్యమస్తి త్యాగో హి సర్వవ్యసనాని హన్తి 17

యథా చ:- త్యాగో హి సర్వవ్యసనాని హన్తీ త్యలీకమేతద్ భువి సమ్ప్రతీతమ్
జాతాని సర్వవ్యసనాని తస్యాస్త్యాగేన మే ముగ్ధవిలోచనాయాః. 18

వ్యా. ప్రసిద్ధ శ్లోకములో ఉన్న ఒక పాదమును భావమును మార్చుటకై గ్రహించి మరియొక శ్లోకమును వ్రాసినచో అందులకు కారణము హరణము కాదు, స్వీకరణమే: అనగా అట్టి అభిప్రాయముతో ఒక ప్రాచీన శ్లోకపాదమును గ్రహించినచో అది హరణదోషము కాదు అని ఆచార్యుల అభిప్రాయము. ఎట్ల నగా :-

"అధికముగ త్యాగము చేయువారు స్వర్గమును ఆశ్రయింతురు. త్యాగము లేనివారు నరకమునకు పోవుదురు. త్యాగవంతులకు సాధ్యము కానిదేదియును లేదు. త్యాగము సర్వకష్టములను నశింపచేయును కదా.''

ఇంకను ఎట్లునగా-''త్యాగము సర్వకష్టములను నశింపచేయును అను లోకప్రసిద్ధి అసత్యము సుందరనేత్రి యగు ఆమెను విడచుటచే నాకు కష్టము లన్నియు వచ్చినవి.''

వి. ఇచట 'త్యాగో హి సర్వవ్యసనాన హన్తి' అను పాదము, ప్రాచీన శ్లోకములో దాని కున్నఅర్థమును మార్చుటకై గ్రహింపబడినది గాన ఇది పాద హరణదోషము కాదు అని ఆచార్యుల మతము.

మూ. తదిదం స్వీకరణాపరనామధేయం హరణమేవ. తద్వదర్థ ప్రయోగేఽపి. యథా -

పాదస్తే నరవర దక్షిణే సముద్రే
పాదోఽన్యో హిమవతి హేమకూటలగ్నే
ఆక్రామత్యలఘు మహీతలం త్వయీత్థం
భూపాలాః ప్రణతిమపాస్య కిం ను కుర్యుః. 19

యథా చోత్తరార్ధే –

ఇత్థం తే విధృతపదద్వయస్య రాజ
న్నాశ్చర్యం కథమివ సీవనీ న భిన్నా. 20

వ్యా, ఒకపాదమును పూర్తిగ గ్రహించినపుడు, అట్లు గ్రహించుటలోని అభిపాయ మేమైనను అది హరణమే యగును, 'స్వీకరణము' అనునది దీనికొక మారుపేరు మాత్రమే (అని రాజశేఖరుని) యభిప్రాయము.

వి. ఇంతవరకును పాదతఃశబ్దహరణము అను ద్వితీయభేదము విశదీకరింపబడినది.

వ్యా. శ్లోకార్ధగ్రహణవిషయమున గూడ ఇట్లే గ్రహింపవలెను ఎట్లనగా:- "ఓరాజా ! నీపాద మొకటి దక్షిణసముద్రమున ఉన్నది. రెండవ పాదము హేమకూటముతో సంబంధించిన హిమవత్పర్వతముపై నున్నది ఈ విధముగ నీవీ భూమినంతను ఆక్రమించుచుండగా రాజులందరును వంగక ఏమి చేయుదురు ?"

పూర్వార్ధమును అట్లే గ్రహించి ఉత్తరార్ధమును మార్చి వ్రాయగా - "ఓరాజా! ఈ విధముగ రెండు పాదములను దాచి నిలబడియున్న నీ సీవని (త్రికసంధి-పిరుదులుకలిసియున్న స్థానము) చీల్చుకొనిపోలేదనిన ఆశ్చర్యముగ నున్నది".

వి. ఇచట పూర్వార్ధహరణము దోషము. ఇది 'అర్థతః శబ్దహరణము' అను శబ్దహరణ తృతీయభేదము.

అవ. ఈ అర్ధహరణమునే మరి యొక విధముగ, అనగా శ్లోకములోని ఒక పాదమును ఒక చోట మరియొక పాదమును మరియొక చోట గ్రహించి మొత్తము రెండు పాదములను గ్రహించుటచే అర్ధహరణము చేయుటగూడ, ఉండు నని చెప్పుచున్నాడు.

మూ. ఏవం వ్యస్తార్థప్రయోగేఽపి. యథా-
తత్తావదేవ శశినః స్ఫురితం మహీయో
యావన్న తిగ్మరుచిమణ్డలమభ్యుదేతి.
అభ్యుద్గతే సకలధామనిధౌ తు తస్మి
న్నిన్దోః సితాభ్రశకలస్య చ కో విశేషః. 21

యథా చ - తత్తావదేవ శశినః స్ఫురితం మహీయో
యావన్న కిఞ్చిదపి గౌరతరా హసన్తి.
తాభిః పునర్విహసితాననపఙ్కజాభి
రిన్దోః సితాభ్రశకలస్య చ కో విశేషః. 22

వ్యా. వ్యస్తమైన అనగా దూరదూరముగ నున్న రెండు పాదముల రూపములలో నున్న శ్లోకార్ధమును గ్రహించుటకు ఉదాహరణ మెట్లనగా-

"సూర్యమండల ముదయించనంతవరకే చంద్రకాంతి మహత్త్వపూర్ణమై యుండును. సూర్యు డుదయించిన పిమ్మట తెల్లని మేఘఖండమునకును, చంద్ర బింబమునకు భేద మేమిఉన్నది?"

ఇంకను ఎట్లనగా-

"గౌరశరీరచ్ఛాయ గల ఆ సుందరులు నవ్వనంతవరకే చంద్రుని కాంతి మహత్తరముగ కనబడును. వారి ముఖపద్మములు వికసించెనా - చంద్రునకును తెల్లని మేఘఖండమునకును భేదమే తెలియదు."

వి. ప్రాచీనశ్లోకములోని ప్రథమచతుర్థపాదములను గ్రహించి రెండవ శ్లోకములో శ్లోకార్థహరణము చేయబడినది.

మూ. పాద ఏవాన్యథాకరణం న స్వీకరణం పాదోనహరణం వా. యథా:-
అరణ్యే నిర్జనే రాత్రావన్తర్వేశ్మని సాహసే.
న్యాసాపహ్నవనే చైవ దివ్యా సమ్భవతి క్రియా. 23

యథా చోత్తరార్ధే-
"తన్వఙ్గీ యది లభ్యేత దివ్యా సమ్భవతి క్రియా". 24

వ్యా. శ్లోకములోని నాలుగు పాదములలో ఒక పాదమును మాత్రమే మార్చి మిగిలిన మూడు పాదములను యథాతథముగ గ్రహించినచో దానిని స్వీకరణ మని గాని, పాదోనహరణ మని గాని (అనగా ఒక పాదము తక్క-శ్లోకమునంతను హరించుట యని గాని) చెప్పుటకు వీలులేదు. (అనగా పెరోడీ యందు వలె మూల శ్లోకమునే పూర్తిగా గ్రహించి నట్లగును). ''నిర్జనమైన అరణ్యమునందును, రాత్రియందును, గృహ మధ్యమునందును, (బందిపోటువంటి) సాహసకృత్యములందును, దాచుటకై ఇచ్చిన వస్తువును అపహరించినపుడును దివ్యక్రియ సంభవించును".

వి. ఇది నారదస్మృతిలోని శ్లోకము. అపరాధమును నిర్ణయించి అపరాధిని శిక్షించుటకు సాక్షు లుండవలెను. కాని నిర్జనారణ్యాదులలో జరిగిన అపరాధములకు సాక్షులుండరు గాన అట్టి పరిస్థితులలో దివ్యపరీక్ష చేయవలె నని ఈ శ్లోకము చెప్పుచున్నది. నిందితుని చేతిలో కాలిన ఇనుప గుండు పెట్టి అతని చేయి కాలకున్నచో అతడు నిర్దోషియనియు, కాలినచో దోషియనియు నిర్ణయింతురు. ఇట్టి పరీక్షలకు దివ్యపరీక్ష అని పేరు. ఇట్టి పరీక్షలు అనేక విధము లున్నట్లు ధర్మశాస్త్ర గ్రంథములవలన తెలియుచున్నది.

వ్యా. ఉత్తరార్ధమునం దెట్లనగా-
పూర్వోక్త పరిస్థితులలో - "సుందరాంగి లభించినచో దివ్యక్రియ (సంభోగము) సంభావ్య మగును.''

వి. పై శ్లోకములోని మూడవ పాదమును మాత్రము మార్చి ఈ శ్లోకము రచించుటచే భావము మారిపోయినది. అయినను దీనిని స్వీకరణ మని

కాని, హరణ మని కాని అనరాదు; అని రాజశేఖరుని అభిప్రాయము. నేటి పేరోడీలు అనునవి ఈ విధమైనవే.

మూ. యథా వా:-యస్య కేశేషు జీమూతాః నద్యః సర్వాఙ్గ సన్ధిషు.
కుక్షౌ సముద్రాశ్చత్వార స్తస్మై తోయాత్మనే నమః.

యథాచోత్తరార్ధే- 25

"కుక్షౌ సముద్రాశ్చత్వారః స సహేత స్మరానలమ్."

వ్యా. ఒక్క పాదమును మాత్రమే మార్చి శ్లోకాంతరము వ్రాయుటకు ఉదాహరణాంతర మెట్లనగా-

"ఎవని కేశములయందు మేఘము లున్నవో, సమస్తశరీరసంధుల యందును నదు లున్నవో, కుక్షియందు నాలుగు సముద్రము లున్నవో అట్టి జల స్వరూపు డగు పరమాత్మకు నమస్కారము''

ఉత్తరార్ధములో పాదపరివర్తనము చేసి వ్రాయగా-'ఎవని కేశములందు ......సముద్రము లున్నవో అట్టివాడుమాత్రమే మన్మథాగ్నిని సహింపగలగ వచ్చును.''

వి. పై రెండు ఉదాహరణములందును ఒక పాదమును మాత్రమే మార్చి మిగిలిన మూడు పాదములను యథాతథముగ గ్రహించుట జరిగినది. ఆ మూడు పాదముల అర్థము రెండు శ్లోకములందును సమానమే.

అవ. కాని ఒక కవి మూడు వేరు వేరు శ్లోకములనుండి మూడు పాదములను గ్రహించి, తానొక పాదమును కల్పించి ఒక శ్లోకమును కూర్పవచ్చును. మూడు పాదములకు మూల శ్లోకములలో నున్న అర్థము వేరు. ఈ శ్లోకములో అర్థము వేరు. అట్టి రచన వాస్తవ మైన కవిత్వమే యని రాజశేఖరుడు చెప్పుచున్నాడు.

మూ. భిన్నార్థానాం తు పాదానామేకేన పాదేనాన్వయనం కవిత్వమేవ. యథా-

కిమిహ కిమపి దృష్టం స్థానమస్తి శ్రుతం వా
వ్రజతి దినకరోఽయం యత్ర నాస్తం కదాచిత్.
భ్రమతి విహగసార్థానిత్థమాపృచ్ఛమానో
రజనివిరహభీతశ్చక్రవాకో వరాకః. 26

యథా చ:-జయతి సితవిలోలవ్యాలయజ్ఞోపవీతీ
ఘనకపిలజటాన్తర్భ్రాన్తగఙ్గాజలౌఘః.
అవిదితమృగచిహ్నామిన్దులేఖాం దధానః
పరిణతశితికణ్ఠశ్యామకణ్ఠః పినాకీ. 27

యథా చ:-కుముదవనమపశ్రి శ్రీమదమ్భోజఖణ్డం
త్యజతి ముదములూకః ప్రీతిమాంశ్చక్రవాకః.
ఉదయమహిమరశ్మిర్యాతి శీతాంశురస్తం
హతవిధిలసితానాం హీ విచిత్రో విపాకః 28

యథా చ :- కిమిహ కిమపి దృష్టం స్థానమస్తి శ్రుతం వా
ఘనకపిలజటాన్తర్భ్రాన్తగఙ్గాజలౌఘః.
నివసతి న పినాకీ యత్ర యాయాం తదస్మిన్
హతవిధిలసితానాం హీ విచిత్రో విపాకః.

వ్యా. భిన్నార్థము లగు పాదములను ఒక పాదముతో అన్వయించుట కవిత్వమే యగును. ఎట్లనగా -

"ఏ స్థానమునందు ఈ సూర్యుడు ఎన్నటికిని అస్తమించడో అట్టి స్థానమేదైన ఉన్నట్లు ఎవరైనా చూచినారా ? లేక విన్నారా ?" అని పక్షుల నన్నింటిని అడుగుచు, పాపము ! రాత్రివిరహమువలన భయపడిన చక్రవాకము తిరుగుచున్నది."

ఇంకను ఎట్లనగా :- "కదలుచున్న తెల్లని సర్పమే యజ్ఞోపవీతముగ గలవాడును, దట్టమైనవియు కపిలవర్ణములును అగు జటల మధ్యమున తిరుగాడుచున్న గంగాజలప్రవాహము కలవాడును మృగచిహ్నము లేని చంద్రరేఖను ధరించుచున్నవాడును, ముదిమి చెందిన నెమలివలె నల్లని కంఠము గలవాడును, పినాకధారియు అగు శివుడు సర్వోత్కర్షగ నున్నాడు''.

ఇంకను ఎట్లనగా —"కలువల సముదాయము శోభారహితమై యున్నది. పద్మసముదాయము శోభాయుక్తమై యున్నది. గుడ్లగూబ సంతోషమును త్యజించుచున్నది. చక్రవాకము సంతసించుచున్నది. సూర్యుడు ఉదయించుచున్నాడు; చంద్రుడు అస్తమించుచున్నాడు. ఈ పాడు దైవముయొక్క విలాసల విపాకము విచిత్రము కదా !'' (శిశుపాలవధము 11,64) ఇంకను

ఎట్లనగా — "దట్టమైనవియు, కపిలవర్ణము కలవియు అగు జటల మధ్య తిరుగాడుచున్న గంగాజలప్రవాహము గల పినాకధారి యగు శివుడు ఏ స్థానమున ఉండదో అట్టి స్థాన మెచటనైనను, ఏదైనను (మీరు) చూచినారా లేక విన్నారా? (ఉన్నచో) నేనచటకి పోవుటకు వీలగును కదా! ఈ పాడుదైవముయొక్క విలాసల విపాకము విచిత్రము కదా!"

వి. ఇవి శివునివిషయమున అపరాధము చేసి ఆతని దండనమునుండి తప్పించుకొనుటకై ప్రయత్నము చేయువాని మాటలై యుండును. ఇచట కవి మూతవ పాదమును మాత్రము తాను రచించి మిగిలిన మూడు పాదములను పై మూడు శ్లోకములనుండి గ్రహించినాడు. కాని ప్రకరణభేదముచే ఆ మూడు పాదముల అర్థములు కూడ మార్పుచెందినవి. అందుచే ఇట్టి రచనను కవిత్వమనవచ్చు నని రాజశేఖరుని అభిప్రాయము.

మూ. పాదోనవత్కతిపయపదప్రయోగోఽపి. యథా:—
"యా వ్యాపారవతీ రసాన్ రసయితుం కాచిత్కవీనాం నవా
దృష్టిర్యా పరినిష్ఠితార్థవిషయోన్మేషా చ వైపశ్చితీ.
తే ద్వే అప్యవలమ్బ్య విశ్వమనిశం నిర్వర్ణయన్తో వయం
శ్రాన్తా నైవ చ లబ్ధమబ్ధిశయన త్వద్భక్తితుల్యం సుఖమ్" 30
యథా చ చతుర్థపాదే—

"శ్రాన్తా నైవ చ లబ్ధముత్పలదృశాం ప్రేమ్ణః సమానం సుఖమ్"
వ్యా. కతిపయపదప్రయోగము కూడ పాదోనము వంటిదే. ఎట్లనగా:-

వి. ప్రాచీనశ్లోకములలోని ఒక్క పాదమును మాత్రము మార్చి మిగిలిన మూడింటిని యథాతథముగ గ్రహించినచో దానిని సంగ్రహణ మని గాని, పాదోనహరణ మని గాని చెప్పరాదు అని వెనుక చెప్పబడినది. అట్లే పాదమును పూర్తిగ కాక దానిలోని కొన్ని పదములను మార్చి ప్రయోగించినను దానిని కూడ సంగ్రహణ మని గాని కతిపయపదోనహరణ మని గాని చెప్పరాదు అని అర్థము.

వ్యా. రసములను ఆస్వాదించుటకై ప్రయత్నించునది యగు కవులయొక్క ఏ నూతనదృక్పథము కలదో, పరినిష్ఠితము లగు విషయములను గ్రహించునది యగు పండితుల ఏ దృక్పథము కలదో ఆ రెండు దృక్పథములను కూడ ఆశ్ర

యించి, ఈ ప్రపంచము నంతను నిత్యము, పరిశీలించి పరిశీలించి అలసిపోయి నాము. ఓ! క్షీరాబ్ధిశయనా! (ఎంత చేసినను) నీ భక్తితో సమాన మగు సుఖ మును పొందజాలక పోయితిమి.''

ఇంకను ఎట్లనగా-చతుర్థపాదమున- ''అలసిపోయినాము, కాని నల్లకలు వల వంటి నేత్రములు గల యువతుల ప్రేమతో సమానమైన సుఖము పొంద బడలేదు.''

వి. నాల్గవపాదములోని ''అబ్ధిశయన త్వద్భక్తితుల్యం'' అను కొన్ని పదములను మార్చి ''ఉత్పలదృశాం ప్రేమ్ణః సమానం'' అను పదములను చేర్చి శ్లోకము వ్రాసినను అది సంగ్రహణము గాని, హరణము కాని కాదు. (ఇది కూడ పేరోడి వంటిదే).

మూ. పాదైకదేశగ్రహణమపి పదైకదేశోపలక్షణమ్. యథా

''అసకలహసితత్వాత్ క్షాళితానీవ కాన్త్యా

ముకుళితనయనత్వాద్వ్యక్తకర్ణోత్పలాని.

పిబతి మధుసుగన్ధీన్యాననాని ప్రియాణాం

త్వయి వినిహితభారః కున్తలానామధీశః.'' 81

యథా చోత్తరార్ధే-

''పిబతు మధుసుగన్ధీన్యాననాని ప్రియాణాం

మయి వినిహితభారః కున్తలానామధీశః.''

వ్యా. పాదైకదేశము అనునది పదైకదేశమునకు కూడ ఉపలక్షణము. ఎట్లనగా :-

వి. వెనుక పాదమునందలి కొన్ని పదములను మార్చుటను గూర్చి చెప్ప బడినది. అది పదైకదేశమునకు కూడ ఉపలక్షణము. అనగా పదములోని కొంత భాగమును, ఒకటి రెండు వర్ణములను, మార్చినను అది స్వీకరణమని గాని, అపహారమని కాని చెప్పరాదు. చెప్పవలసిన దానిలో కొంత భాగమును మాత్రమే చెప్పుట ఉపలక్షణము. చెప్పినదానిని పట్టి చెప్పని దానిని ఊహించుకొన వచ్చును. ''కాకేభ్యో దధి రక్ష్యతామ్'' (పెరుగును కాకులు తినివేయకుండ చూడుము) అని చెప్పినపుడు అచట నున్న కాకపదముచే పెరుగును తినివేయు మార్జాలాది సకలజంతువులను గూడ గ్రహించవలెను. కాకశబ్దమునకు దధ్యుప ఘాతకములందు లక్షణ.-''ఈ శ్లోకము కున్తలేశ్వరదౌత్య మను - కాళిదాసరచిత

కావ్యములోని దని ప్రసిద్ధి. కాళిదాసు విక్రమాదిత్యుని దూతగ కుంతలేశ్వరుని వద్దకు వెళ్ళి వారిరువురికిని సఖ్యము కూర్చినట్లు చెప్పుదురు. ఆ కుంతలేశ్వర దౌత్యములోని మూడు శ్లోకములు మాత్రమే, అలంకారగ్రంథోదాహృతములై లభించుచున్నవి. ఈ శ్లోకమున కాళిదాసు కుంతలేశ్వరుని గూర్చి విక్రమాదిత్యునితో చెప్పుచున్నాడు.

"కుంతలాధీశ్వరుడు భారమునంతయు నీపై ఉంచి, మందహాసముతో కూడినవగుటచే కాంతిచే కడిగివేయబడినవి వలె ఉన్నట్టియు, మూసిన నేత్రములు కలవగుటచే స్పష్టముగ కనబడుచున్న కర్ణోత్పలములు(చెవులలోని నల్లకలువలు) కలవియు. మద్యముచే సుగంధము కలవియు అగు ప్రియురాంధ్ర ముఖములను పానము చేయుచున్నాడు"

వి. ఇది విని విక్రామాదిత్యుడు 'పిబతి' 'త్వయి' అనుపదములలోని అక్షరములను (పదైకదేశమును=పదములోఒకభాగమును) మార్చి 'పిబతు' 'మయి' అని చేసి ఆశ్లోకమునే పఠించెను,...నాయందు భారమునంతయుఉంచి... ... పానముచేయు గాక" అని యర్థము.

మూ. వాక్యస్యాన్యథావ్యాఖ్యానమపి న స్వీకరణం హరణం వా.యథా:-

"సుభ్రు!త్వంకుపితేత్యపాస్తమశనం త్యక్తా కథా యోషితాం
దూరాదేవమయోజ్ఝితాః సురభయః స్రగ్దామధూపాదయః.
కోపం రాగిణి ముఞ్చ మయ్యవనతే దృష్టే ప్రసీదాధునా
సద్యస్త్వద్విరహాద్భవన్తి దయితే సర్వా మమాన్ధా దిశః.

ఏతచ్చ కాన్తాప్రసాదనపరం వాక్యం కుపితదృష్టిపరతయా వ్యాఖ్యాతమ్. న స్వీకృతం, హృతం వా.

వ్యా. ఒక వాక్యమును మరి యొక విధముగ వ్యాఖ్యానించినను అది స్వీకరణ మని కాని, హరణ మని కాని చెప్పరాదు. ఎట్లనగా-

"అందమైన కనుబొమ్మలు కల ఓప్రియురాలా! నీవు కోపగించుటచే భోజనమును విడిచితిని. స్త్రీల కథను కూడ త్యజించితిని. పరిమళించు మాలికలు ధూపములు మొదలగునవి కూడ దూరముగ విడచితిని అనురాగవంతుడనైన నాయందు కోపమును విడిచిపెట్టుము. నమ్రుడనైన, నీ ఎదుటనే కనబడుచున్న, నాయందు ఇపుడు అనుగ్రహింపుము, నీ విరహముచే నాకు దిక్కు లన్నియు ఒక్క మారుగ అంధ మైపోవును" ।

ప్రియురాలిని అనుగ్రహింపచేసికొనుటను బోధించు ఈ వాక్యము కండ్లకలక మొదలగు వాటిచే దూషిత మగు దృష్టిని గూర్చి చెప్పినట్లుగ వ్యాఖ్యానింపబడినది. ఇట్లు మరి యొక అర్థము కల్పించినను ఇచట స్వీకరణముగాని, హరణముగాని లేదు.

వి. కుపితదృష్టిపక్షమున 'దృష్టే' 'రాగిణి' అనునవి కూడ సంబోధన ప్రథమాన్తములు. ,'అందమైన కనుబొమ్మలు కల ఓదృష్టీ ! నీవు ప్రకోపించుటచే భోజనమును విడచితిని. .... ఓ ఎరుపెక్కినదానా ! ప్రకోపమును విడిచిపెట్టుము. (బాధతో) వంగిపోయిన నా విషయమున ప్రసన్నవు కమ్ము అనగా ప్రసాదమును పొందుము. .... అంధమైపోవును.''

మూ. యత్తు పరకీయం స్వీయమితి ప్రోక్తానామన్యతమేన కారణేన విలపన్తి తన్న కేవలం హరణమ్, అపి తు దోషోదాహరణమ్. ముక్తక ప్రబన్ధ విషయం తత్.మూల్య క్రయోపి హరణమేవ. వరమప్రాప్తిర్యశసో న పునర్దుర్యశః

వ్యా. పైన చెప్పిన కారణములలో (పద్ధతులలో) ఏదియో ఒక కారణమును పురస్కరించుకొని పరకీయరచన కూడ తమదే అని కొందరు విలపించుచుందురు- అది హరణము మాత్రమే కాదు. (స్వీయ) దోష ప్రకటనము కూడ. ఇట్టి హరణము ముక్తకములందును ప్రబంధములందును కూడ ఉండుటకు అవకాశమున్నది. ఇతరుల కావ్యమును మూల్యముచే కొని తనదని చెప్పుకొనుట కూడ హరణమే. యశస్సు లభింపకపోయినను మంచిదే కాని దుర్యశము (అపకీర్తి లేదా దుష్టమార్గమున లభించిన కీర్తి) మంచిది కాదు.

మూ. సభాపతిస్తు ద్విధా - ఉపజీవ్య, ఉపజీవకశ్చ (ఇతి). తత్రోపజీవన మాత్రేణ న కశ్చిద్దోషః. యతః సర్వోఽపి పరేభ్య ఏవ వ్యుత్పద్యతే కేవలం తత్ర సముదాయో గురుః.

వ్యా. ఉపజీవ్యుడు, ఉపజీవకుడు అని సభాపతి రెండు విధములు. (ఎవనిపై ఇతరులు ఆధారపడుదురో అతడు ఉపజీవ్యుడు. ఇతరులపై ఆధారపడువాడు ఉపజీవకుడు). ఉపజీవకుడైనంతమాత్రమున దోష మేమియును లేదు. ఏలనన ప్రతిఒక్కడును ఇతరులనుండియే వ్యుత్పత్తి సంపాదించును. ఉపజీవకుడగు సభాపతి విషయమున విశేష మేమనగా సభ్యుల సముదాయము అతనికి గురువుగ నుండును.

ని. శబ్దహరణమును గూర్చి చర్చించు సందర్భమున సభాపతిని గూర్చిన ఈ వాక్యములు లేఖక ప్రమాదముచే ఎచటనో ఉండవలసినవి ఇచట పడిన వేమో అనిపించుచున్నది. బహుశా ఈ వాక్యములు దశమాధ్యాయములో చివర ఉన్న "వాసుదేవ ... సభాపతీన్ దానమానాభ్యామను కుర్యాత్" అను వాక్యము తరువాత ఉండియుండును.

మూ. "తద్వదుక్తిహరణమ్" ఇత్యాచార్యాః యథా-
"ఊరుద్వన్ద్వం సరసకదలీకాణ్డసబ్రహ్మచారి."
యథా చ- "ఊరుద్వయం కదలకన్దలయోః సవంశం
శ్రోణిః శిలాఫలకసోదరసన్నివేశా.
వక్షః స్తనద్వితయతాడిత కుమ్భశోభం
సబ్రహ్మచారి శశినశ్చ ముఖం మృగాక్ష్యాః." 38

వ్యా. "ఉక్తి హరణము కూడ శబ్దహరణము వంటిదే" అని ఆచార్యుల అభిప్రాయము. (ఉక్తి యనగా ఒక విషయమును చమత్కారముగ నుండునట్లు చెప్పుట. ఉదాహరణమునకు- 'సమానముగ నున్నది' అని చెప్పుటకు బదులు "సబ్రహ్మచారి" అనగా 'కలిసి చదువుకున్నది' అని చెప్పినచో చమత్కార మున్నది.) ఎట్లనగా:-

"ఊరుద్వయము సరసములైన కదలీ కాండముల సబ్రహ్మచారి అనగా సహపాఠి = సమానమైనది".

ఇంకను ఎట్లనగా-

"ఆ మృగాక్షియొక్క ఊరుద్వయము కదలీ స్తంభములతో సమానమైన వంశము కలది-కదలీ స్తంభముల వంశమునందు పుట్టినది. కటి ప్రదేశము శిలా ఫలకమునకు సహోదరమైన సన్నివేశము కలది. వక్షఃస్థలము స్తనద్వయముచే కొట్టబడిన కుంభశోభ గలది. ముఖము చంద్రునకు సబ్రహ్మచారి యైనది."

వి. ఈ కవి పూర్వశ్లోకమునందలి 'సబ్రహ్మచారి' అను ఉక్తిని గ్రహించి తాను కూడ ఆ పదమునే కాక తత్సదృశములగు 'సవంశమ్' 'సోదర' అను ఉక్తిద్వయమును కూడ కల్పించి ప్రయోగించినాడు కావున ఇది కూడ పదాపహారము వంటిదే.

మూ. "ఉక్త యో హ్యర్థాన్తరసఙ్క్రాన్తా న ప్రత్యభిజ్ఞాయన్తే; స్వదన్తే చ. తదర్థాస్తు హరణాదపి హరణం స్యుః" ఇతి యాయావరీయః.

వ్యా. "ఉక్తులు ప్రసిద్ధార్థముకంటె భిన్నమైన అర్థమును బోధించును గాన వానిని గుర్తించుట (ఇతరులనుండి హరింపబడిన వని గుర్తించుట) కష్టము; అవి రుచికరముగ కూడ ఉండును. వాని అర్థములు మాత్రము హరణమును మించిన హరణములు, లేదా హరింపబడినదానినుండి హరించినవి అగును" అని యాయావరీయుని అభిప్రాయము.

మూ. నాస్త్యచౌరః కవిజనో నాస్త్యచౌరో వణిగ్జనః
స నన్దతి వినా వాచ్యం యో జానాతి నిగూహితుమ్. 84

వ్యా. చౌర్యము చేయని కవి లేడు. చోరుడు కాని వర్తకుడు లేడు. దొంగతనమును ఎట్లు కప్పుకొనవలెనో తెలిసినవాడు నిందల పాలు కాకుండగ ఆనందించును.

మూ. ఉత్పాదకః కవిః కశ్చిత్కశ్చిచ్చ పరివర్తకః
ఆచ్ఛాదకస్తథాచాన్యస్తథా సంవర్గకోఽపరః. 85

వ్యా. ఒక్కొక్క కవి నూతనమార్గములను సృజించును. ఒక్కొక్కడు మార్పులు చేయును. ఒక్కొక్కడు హరించినదానిని కప్పిపుచ్చును. ఒక్కొక్కడు తనదిగా చేసివేసికొనును.

మూ. శబ్దార్థోక్తిషు యః పశ్యేదిహ కించన నూతనమ్.
ఉల్లిఖేత్కించన ప్రాచ్యం మన్యతాం స మహాకవిః

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే ఏకాదశోఽధ్యాయః శబ్దహరణాని.

ఎవడు శబ్దమునందును, అర్థమునందును, ఉక్తులయందును ఏదైన ఒక నూతన విషయమును చూడగలుగునో, ఏదైన ఒక ప్రాచీనవిషయమును చక్కగ చిత్రించునో ఆతడు మహాకవి యని గ్రహింప వలెను.

బాలానందినిలో ఏకాదశాధ్యాయము సమాప్తము.

ద్వాదశోఽధ్యాయః

శబ్దార్థహరణేషు కవి ప్రభేదాః ప్రతిబిమ్బకల్పవికల్పస్య చ సమీక్షా.

మూ. పురాణకవిక్షుణ్ణే వర్త్మని దురాపమస్పృష్టం వస్తు; తతశ్చ తదేవ సంస్కర్తుం ప్రయతేత" ఇత్యాచార్యాః. 'న' ఇతి వాక్పతిరాజః

''అసంసారముదారైః కవిభిః ప్రతిదినగృహీతసారోఽపి
అద్యాప్యభిన్నముద్రో విభాతి వాచాం పరిస్పన్దః" 1

వ్యా. "ప్రాచీనకవులచే క్షుణ్ణమైన, అనగా అనాదికాలము నుండి ఎందరో మహాకవులు నడచిన, మార్గమునందు, వారు స్పృశించని వస్తువు లభించుట కష్టము. అందుచే వారందరును స్పృశించిన వస్తువునే సంస్కరించుటకు ప్రయత్నించవలెను" అని ఆచార్యుల అభిప్రాయము. 'ఇది యుక్తము కాదు' అని వాక్పతిరాజు.

''సంసారప్రారంభము నుండియు మహాకవులచే ప్రతిదినము, గ్రహింపబడిన సారముకలదైనను, నేటికిని సీలువిడగొట్టని, వాక్ప్రవాహము సర్వోత్కర్షతో నున్నది''.

వి. వాక్పతిరాజు ఈ అభిపాయమును 'గౌడవహో' కావ్యములో (84-87) చెప్పిఉన్నాడు.

మూ. తత్ప్రతిభాసాయచ పరప్రబన్ధేష్వవదధీత. "తదవగాహనే హి తదేకయోనయోఽర్థాః పృథక్ పృథక్ ప్రథన్తే," ఇత్యేకే. "తత్రత్యానామర్థానాం ఛాయయా పరివృత్తిః ఫలమ్," ఇత్యపరే. "మహాత్మనాం హి సంవాదిన్యో బుద్ధయ ఏకమేవార్థముపస్థాపయన్తి. తత్పరిత్యాగాయ తానాద్రియేత" ఇతి చ కేచిత్.

వ్యా. అది (అనగా ఇతరులు స్పృశించని అర్థము) ప్రతిభాసించుటకై ఇతరుల ప్రబంధముల విషయమున అవధానమును చూపవలెను. ప్రాచీనప్రబంధ

ములను పరిశీలించినచో ప్రప్రథమముగ ఆ ప్రబంధములలో ఆవిర్భవించిన (కూర్చబడిన) విషయములు ఎట్లు వేరువేరుగ భాసించునో తెలియును'' అని కొందరి అభిప్రాయము. ''వాటిని బాగుగ పరిశీలించినచో అందలి విషయములను ఛాయా రూపమునమార్చి (ఉన్నదున్నట్లుగకాక కొంచెము మార్చి, తమ ప్రబంధ ములలో చేర్చుకొనుటకు వీలుండును. ఇదియే) ఫలము అని మరి కొందరి అభి ప్రాయము. ''మహాత్ముల బుద్ధులు సంవాదము కలవై ఉండును. అనగా ఒకే విధముగ ఆలోచించును. అందుచే అవి ఒకే విషయమును కూర్చుచుండును. కావున వాటిని త్యజించుటకై వాటిని పరిశీలింపవలెను'' అని కొందరు చెప్పుదురు,

మూ. 'న' ఇతి యాయావరీయః. సారస్వతం చక్షురవాఙ్మనసగోచరేణ ప్రణిధానేన దృష్టమదృష్టం చార్థజాతం స్వయం విభజతి. తదాహుః—''సుప్త స్యాపి మహాకవేః శబ్దార్థౌ సరస్వతీ దర్శయతి. తదితరస్య తత్ర జాగ్రతోఽ ప్యంధం చక్షుః. అన్యదృష్టచరే హ్యర్థే మహాకవయో జాత్యన్ధాస్తద్విపరీతే తు దివ్యదృశః. న తత్ త్ర్యక్షః, సహస్రాక్షో వా యచ్చర్మచక్షుషోఽపి కవయః పశ్యన్తి. మతిదర్పణే కవీనాం విశ్వం ప్రతిఫలతి. కథం ను వయం దృశ్యామహే ఇతి మహాత్మనా మహంపూర్వికయైవ శబ్దార్థాః పురో ధావన్తి. యత్సిద్ధప్రణిధానా యోగినః పశ్యన్తి తత్ర వాచా విచరన్తి కవయ ఇత్యనన్తా మహాకవిషు సూక్తయః (ఇతి).

వ్యా. 'కాదు' (ఇట్లు చెప్పుట యుక్తము కాదు) అని యాయావరీయుడు చెప్పుచున్నాడు. సారస్వతనేత్రము, వాక్కుకు కాని, మనస్సుకు కాని అందని ఏకాగ్రతయొక్క సహాయముచే దృష్టము అగు విషయములను అదృష్టము అగు విషయములను స్వయముగనే వేరు చేసి చూపును. కావుననే ఇట్లు చెప్పుదురు— ''మహాకవి నిద్రపోవుచున్నను, సరస్వతి అతనికి శబ్దార్థములను చూపును. మహాకవి కానివాడు మేల్కొని ఉన్నను వాని నేత్రము అంధమే. ఇతరులచే పూర్వమే చూడబడిన అర్థముల విషయమున మహాకవులు జాత్యంధులు. (వారికా విషయములు కనబడనే కనబడవు.) ఇతరార్థముల విషయమున దివ్య దృష్టి కలవారు. కవులు చర్మచక్షువులే యైనను, వారు చూడగలిగిన విషయము లను మూడునేత్రములుగల శివుడు కాని, వేయినేత్రములు గల ఇంద్రుడు కాని చూడజాలడు. కవుల బుద్ధియనెడు అద్దమునందు ప్రపంచ మంతయు ప్రతిబింబిం

చుడు. మనము వీని దృష్టికోనికి ఎట్లు వచ్చెదమా అను అహమహమికతో (నేను ముందు నేను ముందు అను పోటీతో) శబ్దార్థములు,మహాకవుల ఎదుటకు, పరువెత్తుచు వచ్చును. చిత్తైకాగ్రతను సంపాదించుకొనిన యోగులు ఏ విషయమును చూడగలరో, ఆ విషయమున కవులు వాక్కులతో సంచరింతురు. కావున మహాకవుల విషయమున సూక్తులు అనంతములు. అనగా మహాకవులకు సూక్తులకొరత అనునది ఉండదు."

మూ. "సమస్తమస్తి" ఇతి యాయావరీయః. కిన్తు త్రిపథమర్థమధ్యగిష్మహి-యదుతాన్యయోనిర్నిహ్నుతయోనిరయోనిశ్చ.తత్రాఽన్యయోనిర్ద్విధా ప్రతిబిమ్బకల్ప, ఆలేఖ్య ప్రఖ్యశ్చ. నిహ్నుతయోనిరపి ద్విధా-తుల్యదేహితుల్యః పరపుర ప్రవేశసదృశశ్చ. అయోనిః పునరేకాద్యశః (రేక) ఏవ. తత్ర

అర్థః స ఏవ సర్వో వాక్యాన్తరవిరచనా పరం యత్ర.
తదపరమార్థవిభేదం కావ్యం ప్రతిబిమ్బకల్పం స్యాత్.

యథా :-

వ్యా. "మహాకవుల విషయమున చెప్పిన దంతయు వాస్తవమే" అని యాయావరీయుడు. కాని-కావ్యార్థము అన్యయోని యనియు నిహ్నుతయోని యనియు, అయోని యనియు మూడు విధము లని చదివియున్నాము-

వి. పూర్వమే ఒక కవిచే చెప్పబడి యున్నది అన్యయోని. పూర్వ మెవరు చెప్పిరో తెలియనిది నిహ్నుతయోని. కప్పబడిన మూలము కలది అనియర్థము. మూల మేదియు లేనిది అయోని.

వ్యా. వీనిలో ప్రతిబింబకల్పము (ప్రతిబింబముతో సమానమైనది) ఆలేఖ్యప్రఖ్యము (చిత్తరువు వంటిది) అని అన్యయోని రెండు విధములు. తుల్యదేహితుల్యము (అనగా మనిషికిని మనిషికిని పోలిక ఉన్నట్లు ఉండునది) పరపుర ప్రవేశసదృశము (వేషము మార్చి శత్రుపురములోనికి ప్రవేశించుటతో సమానము) అని నిహ్నుతయోని కూడ రెండు విధములు. అయోని మాత్రము ఒక విధముననే ఉండును. అందు :-

"ఏ కావ్యమునందు అర్థమంతయు ప్రాచీనరచనలో నున్నదే - ఉండునో,

కేవలము వాక్యరచన మాత్రము వేరుగ నుండునో, అది వాస్తవమున భేదము లేని అట్టి కావ్యము ప్రతిబింబకల్పము." ఎట్లనగా :-

మూ. తే పాన్తు వః పశుపతేరలినీలభాసః
కణ్ఠప్రదేశఘటితాః ఫణినః స్ఫురన్తః.
చన్ద్రామృతామ్బుకణసేక సుఖప్రరూఢై
ర్యైరఙ్కురై రివ విరాజతి కాలకూటః. 3

యథా చ : "జయన్తి నీలకణ్ఠస్య నీలాః కణ్ఠే మహాహయః
గలద్గఙ్గామ్బుసంసిక్తకాలకూటాఙ్కురా ఇవ." 4

వ్యా. "తుమ్మెదల వలె నల్లని కాంతి కలవియు, ఈశ్వరుని కంఠ ప్రదేశమునందు కూర్చబడినవై ప్రకాశించుచున్న ఆ సర్పములు మిమ్ములను రక్షించుగాక; వేటిచే (శివుని కంఠములో నున్న, కాలకూటము, చంద్రుని యందలి అమృతకణముల సేకముచే అనాయాసముగ మొలచిన అంకురములతో వలె ప్రకాశించుచున్నదో." (అనగా ఆ సర్పములు కాలకూటమునుండి బయలు దేరిన అంకురముల వలె ఉన్న వని యర్థము.)

మరి యొక ఉదాహరణ మెట్లనగా :-

"స్రవించుచున్న గంగోదకముచే తడపబడిన కాలకూటముయొక్క అంకురములవలె నున్న నున్న నీలకంఠకంఠగతములగు నల్లని మహాసర్పములు సర్వోత్కృష్టములుగ ఉన్నవి."

ఏ పూర్వశ్లోకములో నున్న కాలకూటాంకురత్వకల్పనమునే ఇచట గూడ కవి, చంద్రామృత బిందువులకు బదులు గంగోదకసేకము వంటి చిన్న మార్పులు చేసి, కూర్చియున్నాడు గాన ఇది ప్రతిబింబకల్ప మగు అర్థ హరణము బింబమునకును ప్రతిబింబమునకును అంతగ భేదముండదు.

మూ కియతాపి యత్ర సంస్కారకర్మణా వస్తు భిన్నవద్భాతి.
తత్కథితమర్థచతురై రాలేఖ్య ప్రఖ్యమితి కావ్యమ్. 4

తత్రైవార్థే యథా -

"జయన్తి ధవలవ్యాలాః శమ్భోర్జూటావలమ్బినః
గలద్గఙ్గామ్బు సంసిక్త చన్ద్రకన్దాఙ్కురా ఇవ." 5

వ్యా. "ఒకే వస్తువు (అర్థము) కొంచెము సంస్కారముచే మరియొక అర్థము వలె కన్పట్టినచో ఆ కావ్యము ఆలేఖ్య ప్రఖ్య మని అర్థజ్ఞులు చెప్పుదురు."

పూర్వ శ్లోకములలోనిక్షిఅర్థమునే ఆలేఖ్యప్రఖ్యముగ చిత్రించుటకు ఉదాహరణమెట్లనగా:-

"స్రవించుచున్న గంగోదకములచే తడసిన చంద్రుడనెడు దుంపయొక్క అంకురములా అన్నట్లున్న, శంభుజటాజూటస్థితము లగు తెల్లని సర్పములు సర్వోత్కర్షతో నున్నవి."

వి. ఇచట,కవి పూర్వశ్లోకమునుండియే అర్థమును గ్రహించి,కాలకూటాంకురము లనుటకు బదులు చంద్రాంకురము లని వర్ణించి క్రొత్త అర్థమా అనునట్లు కనబడు విధమున చేసినాడు. అందుచే ఇది ఆలేఖ్య ప్రఖ్యకావ్యము.

మూ. విషయస్య యత్ర భేదేఽప్యభేదబుద్ధిర్నితాన్తసాదృశ్యాత్.
తత్తుల్యదేహితుల్యం కావ్యం బధ్నన్తి సుధియోఽపి. 6

యథా:- అపీనాదౌ కృత్వా భవతి తురగో యావదవధిః
పశుర్ధన్యస్తావత్ప్రతివసతి యో జీవతి సుఖమ్.
అమీషాం నిర్మాణం కిమపి తదభూద్గకరిణాం
వనం వా క్షోణీభృద్భవనమథవా యేన శరణమ్. 7

అత్రార్థః-"ప్రతిగృహముపలానామేక ఏవ ప్రకారో
ముహురుపకరణత్వాదర్చితాః పూజితాశ్చ.
స్ఫురతి హతమణీనాం కిన్తు తద్ధామ యేన
క్షితిపతిభవనే వా స్వాకరే వా నివాసః." 8

వ్యా. "ఎచట, విషయము భిన్నమైనదే యైనను, అత్యధికసాదృశ్యముండుటచే అభిన్నమైనట్లు కనబడునో ఆ కావ్యము తుల్యదేహితుల్యము. ఇట్టి తుల్యదేహితుల్యార్థహరణము కల కావ్యమును సత్కవులు కూడ కూర్చుచుందురు, ఎట్లనగా :- గొఱ్ఱెలు మొదలు గుఱ్ఱములవరకును గల (గోమహిష్యాది) పశువు లన్నియు ధన్యములు; ఏలనన అవి ప్రతిగృహమునందును (వసతౌ వసతౌ = ప్రతివసతి) సుఖముగ జీవించును. ఈ పాడు ఏనుగుల సృష్టి అదేమియో విలక్షణ

మైనది. ఏలనన అవి వనమునందైన నివసింపవలెను లేదా రాజగృహములందైన నివసింపవలెను'' (సామాన్యుల గృహములందు నివసింపజాలవు).

ఈ విషయమునే మఱియొకవిధముగ చెప్పిన శ్లోకము:-

"శిలలకు ప్రతిగృహమునందును ఒకే పద్ధతి యుండును; అవి ఉపకరణములగుటచే (గృహనిర్మాణాదులకు) మాటిమాటికిని కొనబడును; (ప్రతిమాదిరూపమున) పూజింపబడును. ఈ పాటు మణుల కాంతివిశేషము ప్రకాశించుచున్నది ఆ కారణముచేతనే వీటికి నివాసము రాజగృహమునందైన ఉండును లేదా తమ గనిలోనైన ఉండును.''

వి. పూర్వశ్లోకములో నున్న భావమునే గ్రహించి, గజములకు మారుగ మణులను వర్ణించినాడు కవి. అందుచే ఇది తుల్యదేహితుల్యార్థహరణము. ఆలేఖ్యప్రఖ్యమును గూర్చి "తత్క్షితిమర్థచతురైః" అని చెప్పుటచేతను, 'తుల్యదేహితుల్య' మును గూర్చి ''బధ్నన్తి సుధియోఽపి'' అని చెప్పుటచేతను ఈ రెండు విధములగు అర్థహరణములును.రాజశేఖరుని అభిప్రాయము ప్రకారము, దూష్యములు కావని తెలియుచున్నది.

మూ. మూలైక్యం యత్ర భవేత్పరికరబన్ధస్తు దూరతోఽనేకః
తత్పరపురప్రవేశప్రతిమం కావ్యం సుకవిభావ్యమ్. 9

యథా:- యస్యారాతినితమ్బినీభిరభితో వీక్ష్యామ్బరం ప్రావృషి
స్ఫూర్జద్గర్జితనిర్జితామ్బుధిరవస్ఫారాభ్రవృన్దాకులమ్.
ఉత్సృష్టప్రసభాభినేఙణనభయస్పష్టప్రమోదాకులైః
కించిత్కుఞ్చితలోచనాభిరసకృద్ఘ్రాతాః కదమ్బానిలాః. 10

అత్రార్థః:-ఆచ్ఛిద్య ప్రియయా కదమ్బకుసుమం యస్యారిదారైర్నవం
యా తాభజ్గవిధాయినో జలముచాం కాలస్య చిహ్నం మహత్.
హృష్యద్భిః పరిచుమ్బితం నయనయోర్న్యస్తం హృది స్థాపితం
సీమన్తే నిహితం కథఞ్చన తతః కర్ణావతంసీకృతమ్. 11

వ్యా. 'ఎచట మూలము ఒకటే యైనను అనేకవిధము లగు పరికరబంధము (బాహ్యాడంబరము లేదా ఇతరవిషయముల సంగ్రథనము) ఉండునో ఆ కావ్యము పరపురప్రవేశప్రతిమము. ఇది కూడ సుకవుల భావనకు అర్హమైనదే'', ఉదాహ

రణ మెట్లనగా — "ఏ రాజుయొక్క శత్రువుల స్త్రీలు వర్షకాలమునందు, గంభీరమైన గర్జనములచే జయింపబడిన సముద్రధ్వని గల అతివిస్తృత మగు మేఘముల సముదాయముచే వ్యాకుల మైన ఆకాశమును నలుపైపులందును చూచి, హటాత్తుగ యుద్ధయాత్రకై (ఆరాజు) వచ్చుననెకు భయము తొలంగిపోవుటచే ఆనందాశ్రువులను కార్చుచు, కనులు కొంచెము మూసికొని కదంబవృక్షముల మీదుగ వీచుచున్న వాయువులను అనేకపర్యాయములు ఆఘ్రాణించిరో".

ఈ అర్థమునే గ్రహించి—"సంతసించుచున్న ఎవని శత్రువుల భార్యలు యుద్ధయాత్రకు భంగమును కలిగించు వర్షకాలముయొక్క గొప్పచిహ్న మైన నూతన మగు కదంబపుష్పమును, ప్రేమపూర్వకముగ కోసి, ముద్దుపెట్టుకొనిరి. నేత్రములపై అద్దుకొనిరి; వక్షముపై ఉంచుకొనిరి. పాపటపై ధరించిరి; అటు పిమ్మట ఏదో విధముగ కర్ణావతంసముగ చేసికొనిరి."

వి. మొదటి శ్లోకమునందలి ప్రధానవిషయమునే మరి కొన్ని వర్ణనలు చేర్చి రెండవ శ్లోకమున చెప్పుట జరిగినది. కావున ఇది పరపుర ప్రవేశ ప్రతిమము. పరపుర మనగా శత్రుపురము, లేదా ఇతరుల పురము అని అర్థము చెప్ప వచ్చును. శత్రువుల పురమును ప్రవేశించువారు తమ వాస్తవస్వరూపము తెలియ కుండు విధమున క్రొత్త వేషమును ధరింతురు. ఇతరుల పురము ప్రవేశించువారు కూడ తమ సహజవేషము కాక ఆడంబరపూర్ణ మగు వేషమును ధరింతురు. అట్లే పూర్వకవి చెప్పిన విషయమునే క్రొత్త వేషముతో కూర్చుటచే దీనికి ఆ పేరు వచ్చినది.

మూ. తదేతచ్చతుష్టయనిబన్ధనాశ్చ కవీనాం ద్వాత్రింశద్ధరణోపాయాః. అమీషాం చార్థానామన్వర్థాశ్రయస్కాన్తవచ్చత్వారః కవయః. పఞ్చమశ్చాదృష్ట చరార్థదర్శీ. తదాహుః.

"భ్రామకశ్చుమ్బకః కిఞ్చ కర్షకో ద్రావకశ్చ సః
స కవిర్లౌకికోఽన్యస్తు చిన్తామణి రలౌకికః." 12

వ్యా. పైన వివరించిన ప్రతిబింబకల్పార్థము మొదలగు నాలుగు విధము లగు అర్థములను బట్టి కవులకు ముప్పదిరెండు అర్థహరణోపాయములు లభించి నవి. (ఈ ద్వాత్రింశద్భేదములు మున్ముందు స్పష్టము కాగలవు.) ఈ నాలుగు విధముల అర్థములకు సంబంధించిన కవులు అయస్కాన్తము వలె సార్థకములగు

నాలుగుసంజ్ఞలతో ఒప్పుదురు. పూర్వాదృష్టము కాని అర్థమును చూడగలిగిన కవి ఐదవవాడు, అనగా అయోన్యర్థకవి. కావుననే ఇట్లు చెప్పుచున్నారు.

"లౌకికకవి భ్రామకుడు, చుంబకుడు, కర్షకుడు, ద్రావకుడు అని నాలుగు విధములు. అలౌకికకవి యగుఐదవవాడైతే చింతామణియే."

వి. దీనిని బట్టి అయస్కాంతములో నాలుగు రకములున్నట్లు తెలియు చున్నది. ఎదుట నున్నవస్తువును తిరుగు నట్లు చేయునది భ్రామకము. దగ్గరకు వచ్చి తనకు తగులుకొనునట్లు చేయునది చుంబకము. దూరముగా నున్నదానిని లాగునది కర్షకము. కరిగి పోవునట్లు చేయునది ద్రావకము. అట్లే పరివర్తితకల్పార్థహర్త భ్రామకుడు; ఆలేఖ్యప్రఖ్యార్థహర్త చుంబకుడు. తుల్యదేహితుల్యార్థహర్త కర్షకుడు. పరపురప్రవేశసదృశార్థహర్త ద్రావకుడు. ఇక ఐదవ వాడగు అయోన్యర్థగ్రథకుడు చింతామణి.

మూ. తన్వానోఽనన్యదృష్టత్వం పురాణస్యాపి వస్తునః
యోఽప్రసిద్ధ్యాదిభిర్భ్రామ్యత్యసౌ స్యాద్భ్రామకః కవిః. 13

వ్యా. "ప్రాచీనకావ్యములలో నున్న అర్థమును కూడ, అది అప్రసిద్ధమై యుండుట మొదలగు కారణములచే, "ఇది పూర్వమెచ్చటను చూడబడలేదు" అని ప్రచారము చేయుచు ఇతరులను భ్రమపడునట్లు చేయువాడు భ్రామకకవి.

వి. 'భ్రామ్యతి' అనునది అంతర్భావితణిజర్థము.

మూ. యశ్చుమ్బతి పరస్యార్థం వాక్యేన స్వేన హారిణా
స్తోకార్పితనవచ్ఛాయం చుమ్బకః స కవిర్మతః. 14

వ్యా. "ఏ కవి మనోహరమగు తన వాక్యముచే కొంచెము నూతన చ్ఛాయను కల్పించి పరుని అర్థమును చుంబించునో (స్వీకరించునో) అతడు చుంబకకవి."

మూ. పరవాక్యార్థమాకృష్య యః స్వవాచి నివేశయేత్
సముల్లేఖేన కేనాపి స స్మృతః కర్షకః కవిః. 15

వ్యా. "పరవాక్యార్థమును ఆకర్షించి దానిని ఏదియొక ఉక్తివైచిత్ర్యము ద్వారా తన వాక్కునందు చేర్చుకొనువాడు కర్షకకవి"

మూ. అప్రత్యభిజ్ఞేయతయా స్వవాక్యే నవతాం నయేత్
యో ద్రావయిత్వా మూలార్థం ద్రావకః స భవేత్కవిః 16

వ్యా. "ఏ కవి మూలార్థమును కరిగించివేసి, గుర్తింపవీలుకానిదానినిగ చేసి, తన వాక్యములో నూతన మైనదన్నట్లు చూపునో అతడు ద్రావకకవి."

మూ. చిన్తాసమం యస్య రసైకసూతిరుదేతి చిత్రాకృతిరర్థసార్థః
అదృష్టపూర్వో నిపుణైః పురాణైః కవిః స చిన్తామణిరద్వితీయః 17

వ్యా. రసమునకు మూలకందమును, విచిత్రరూపమును. అతినిపుణు లగు ప్రాచీనకవులచేత కూడ చూడబడనిదియు అగు అర్థసముదాయము, ఏ కవికి (నుండి) ఆలోచించినవెంటనే వెలువడునో, అతడు సాటి లేని చింతామణి.

మూ. తస్య చాయోనిరర్థః. స చ త్రిధా లౌకికాలౌకికభేదేన; తయోర్మి శ్రత్వేన చ. తత్ర లౌకికః.

వ్యా. అతని అర్థము అయోని. లౌకికము, అలౌకికము, లౌకికాలౌకిక మిశ్రము అను భేదములచే అది మూడు విధములు. అందు లౌకికార్థ మెట్లనగా—

మూ. మా కోశకారలతికే వహ వర్ణగర్వం
కిం ధమ్బరేణ చణికే తవ కౌసుమేన
పుణ్డ్రేక్షుయష్టిరియమేకతరా చకాస్తు
యా స్యన్దతే రసమృతేఽపి చ యన్త్రయోగాత్. 18

వ్యా. ఓ కోశకారలతా! రంగును చూచుకొని గర్వపడకుము. ఓచణికా! నీ పుష్పాడంబరముచే ఏమి ప్రయోజనము? యంత్రసంబంధము లేకపోయినను రసమును స్రవించు ఈ చెరకుకర్ర ఒకటియే ప్రకాశించుగాక.

వి. ఇందు లౌకికము లగు లతాదులు అపూర్వరీతిలో వర్ణింపబడినవి.

మూ. అలౌకికః—

"దేవీ పుత్రమసూత నృత్యత గణాః కిం తిష్ఠతేత్యుద్భుజే
హర్షాద్భృఙ్గిరిటావుదాహృతగిరా చాముణ్డయాలిఙ్గితే
పాయాద్వో జితదేవదున్దుభిఘనధ్వానప్రవృత్తిస్తయో
రన్యోన్యాఙ్కనిపాతజర్జరజరత్స్నాయ్వస్థిజన్మా రవః." 19

వ్యా. అలౌకిక మగు అయోన్యర్థమును కూర్చుటకు ఉదాహరణము:-

వి. ఈ శ్లోకము పంచమాధ్యాయమున అర్థకవికి ఉదాహరణముగా చూపబడినది. ఇందు దివ్యపురుషుల వృత్తాంతము ఎవరును వర్ణింపని రీతిలో వర్ణితమైనది గాన ఇది అలౌకికాయోన్యర్థవర్ణనమునకు ఉదాహరణము.

మూ. మిశ్రః—

"స్థితే కుక్షేర న్తర్మురజయిని నిఃశ్వాసమరుతో
జనన్యా స్తన్నాభీసరసిజపరాగోత్కరముచః.
నిపీతాః సానన్దం రచితఫణభ ర్త్రేణ హలినా
సమన్తాదస్యాసుః ప్రతిదివసమేనాంసి భవతః" 20

వ్యా. లౌకికాలౌకికమిశ్ర మగు అయోన్యర్థమునకు ఉదాహరణము :-

"శ్రీమహావిష్ణువు గర్భములో నుండగా, అతని నాభికమలమునందలి పుప్పొడిని విరజిమ్ముచున్నట్టివియు, పడగలను గొడుగుగా పట్టిన బలరామునిచే (బలరాముడు ఆదిశేషావతారము గాన ఆదిశేషునిచే అని యర్థము)ఆనందపూర్వకముగ త్రాగబడినవియు అగు, తల్లియైన దేవకియొక్క నిఃశ్వాసవాయువులు, ప్రతిదినమునందును, నీపాపములను నలుమూలల చిమ్మివేయుగాక (తొలగించుగాక)."

వి. ఇచట పూర్వ మేకవియు వర్ణింపని విషయము వర్ణింపబడినది గాన ఇది అయోన్యర్థము. దేవకి లౌకికస్త్రీ; విష్ణుశేషులు దివ్యపురుషులు. అందుచే మిశ్రము.

మూ. తేషాం చ చతుర్ణామర్థానామ్—
చత్వార ఏతే కథితా మయైవ యేఽర్థాః కవీనాం హరణోపదేశే.
ప్రత్యేకమష్టత్వవశాద్భవన్తి ద్వాత్రింశతా తేఽనుగతాః ప్రభేదైః. 21

వ్యా. వెనుక చెప్పిన అర్థచతుష్టయములో—

"కవులకు హరణమును గూర్చి చెప్పు సందర్భమున నాచే ఏ నాలుగు అర్థములు (అనగా ప్రతిబింబకల్పము, ఆలేఖ్యప్రఖ్యము అను అన్యయోని భేదములును, తుల్యదేహితుల్య, పరపురప్రవేశసదృశము లనెడు నిహ్నుతయోని భేదములను) చెప్పబడినవో అవి ఒక్కొక్కటి ఎనిమిదేసి భేదములు కలవగుటచే మొత్తము ముప్పది రెండు భేదము లగును."

మూ. తత్ర ప్రతిబిమ్బకల్పవికల్పాః-

వ్యా. అందు ప్రతిబింబకల్పార్థ భేదములు ఎనిమిదియు ఎట్లనగా-

వి. వ్యస్తకము, ఖండము, తైలబిందువు, నటనేపథ్యము, ఛందోవినిమయము, హేతువ్యత్యయము, సంక్రాంతకము, సంపుటము అను ఎనిమిది భేదములకు లక్షణోదాహరణములు చూపుచున్నాడు.

మూ. స ఏవార్థః పౌర్వాపర్యవిపర్యాసాత్ వ్యస్తకః.

యథా:-''దృష్ట్వాన్యేభం ఛేదముత్పాద్య రజ్జ్వా
యన్తుర్వాచం మన్యమానస్తృణాయ.
గచ్ఛన్రుద్ధే నాగరాజః కరిణ్యా
ప్రేమ్ణా తుల్యం బన్ధనం నాస్తి జన్తోః''. 22

అత్రార్థే:-నిర్వివేకమనసోఽపి హి జన్తోః
ప్రేమబన్ధన మశృంఖలదామ.
యత్ప్రతి ప్రతిగజం గజరాజః
ప్రస్థితశ్చిరమధారి కరిణ్యా.'' 23

వ్యా. ఆ విషయమునే వెనుకముందులు మార్చి చెప్పుట వ్యస్తకము. ఎట్లనగా-

''ఇతరగజమును చూచి, రజ్జువును ఛేదించుకొని, మావటివాని మాటను గడ్డిపరకను వలె లక్ష్యపెట్టక వెళ్ళిపోవుచున్న గజరాజు, ఆడఏనుగచే ఆపివేయబడినది. ప్రాణికి ప్రేమతో సమానమైన బంధనము లేదు'' ఈ విషయమునందే-

''వివేకశూన్యమైన ప్రాణికి కూడ ప్రేమ అనునది శృంఖలము, కాదు కాని బంధనము. ఏలననగా, శత్రుగజమును గూర్చి వెళ్ళనున్న గజరాజు, ఆడ ఏనుగుచే చాలసేపు ఆపివేయబడినది.''

వి. పూర్వశ్లోకోక్త విషయమునే, ఈ శ్లోకమున క్రమము మార్చి చెప్పుట జరిగినది. అందుచే ఇది వ్యస్తకము.

మూ. వ్యూహతోఽర్థస్యార్థపదయనం ఖణ్డమ్.

యథా :- "పురా పాణ్డు ప్రాయం తదను కపిశిమ్నా కృతపదం
తతః పాకోద్రేకాదరుణగుణ సంవర్గితవపుః.
శనైః శోషారమ్భే స్థపుటనిజవిష్కమ్భవిషమం
వనే వీతామోదం బదరమరసత్వం కలయతి." 24

అత్రార్థే:- "పాకక్రియా పరిచయప్రగుణీకృతేన
సంవర్గితారుణగుణం వపుషా నిజేన.
ఆపాదితస్థపుటసంస్థితి శోషపోషా
దేతద్వనే విరసతాం బదరం బిభర్తి". 25

వ్యా విస్తృతమైన అర్థమునుండి సగము మాత్రమే గ్రహించుట ఖండము. ఎట్లనగా

"వనమునందలి బదరము (రేగికాయ) మొదట తెల్లగా నున్నట్లుండి తరువాత కపిశవర్ణమును పొంచినదై, అటుపిమ్మట పాకాతిశయమువలన ఎరుపుతో కప్పబడిన శరీరము కలదై, మెల్లమెల్లగ ఎండుట ప్రారంభింపగనే తన వర్తులాకారము ముణుచుకొనిపోవుటచే (స్థపుట = ముణచుకొనిపోయిన; విష్కమ్భ = వర్తులము) మిట్టపల్లములు ఏర్పడినదై, సువాసన తొలంగిపోయి, రసవిహీనమగుచున్నది."

ఈ అర్థమునే గ్రహించి వ్రాసిన మరి యొక శ్లోకము:-

"ముదురుటచే రెట్టింపు ప్రమాణము కలదైన తన శరీరముతో కప్పబడిన (వ్యాప్తమగునట్లు చేయబడిన) ఎరుపు గలదైన,వనమునందలి ఈ రేగికాయ, ఎండిపోవుటచే ముదుచుకొనిపోయిన స్థితిని పొందినదై, విరసత్వమును ధరించుచున్నది."

వి. పూర్వశ్లోకవర్ణిత మగు బదరఫలస్థితియే ఈ శ్లోకమునందు కూడ వర్ణింపబడినది. అయినను పూర్వశ్లోకమునందలి పాండుప్రాయత్వ, కపిశత్వ, వీతామోదత్వములు ఇందు చెప్పకుండుటచే ఇది ఖండము.

మూ. సంక్షిప్తార్థవిస్తరేణ తైలబిన్దుః:-

యథా:- యస్యత న్త్రిభరాక్రాన్త్యా పాతాలతలగామినీ
మహావరాహదంష్ట్రియా శ్రాయః సస్మార మేదినీ. 26

అత్రార్థే:-యస్యత్రాసాత్ నిమజ్జత్ పృథులమణిశిలాశల్యవేల్లత్ఫణాన్తే
క్లాన్తే పత్యాహీనాం చలదచలమహాస్తమ్భసమ్భారసీమా.
సస్మారస్ఫారచన్ద్రద్యుతి పునరవని స్తద్ధిరణ్యాక్షవక్షః
స్థూలాస్థి శ్రేణిశాణానికషణసితమస్యాః దంష్ట్రాగ్రముగ్రమ్.72

వ్యా. సంక్షిప్తముగ చెప్పిన అర్థమును విస్తరించి చెప్పినచో తైలబిందువు. (నీటిపై తైలబిందువును వేసినచో అది విస్తరించును గాన దీని కాపేరు) ఎట్లనగా:-

"ఏ రాజు సైన్యభారముయొక్క ఆక్రమణముచే పాతాలమునకు పోవు చున్న భూమి, మాటి మాటికిని, మహావరాహముయొక్క కోరను గూర్చి స్మరిం చెనో". ఈవిషయమునే గ్రహించి-

"ఏ రాజుయొక్క సైన్యభారముచే క్రిందికి దిగిపోవుచున్న పెద్దవైన మణు లనెడు శల్యములచే కంపించి పోవుచున్న పడగల అగ్రభాగము గల ఆదిశేషుడు అలసిపోయినవాడగుచుండగా. కదలిపోవుచున్న పర్వతము లనెడు మహాస్తం భాగములు గల భూమి, వెంటనే అధిక మైన చంద్రకాంతి వంటి కాంతి కందియు, ఆహిరణ్యాక్షవక్షమునందలి స్థూలము లైన ఎముకల పంక్తి యనెడు శాణమునందు ఒరయుటచే తెల్లగా అయినదియు, ఉగ్రమైనదియు అగు దంష్ట్రాగ్రమును (వరాహము కోర యొక్క అగ్రభాగమును) మరల స్మరించెనో"

వి. పూర్వశ్లోకమున భూమి వరాహదంష్ట్రను స్మరించెను అని మాత్రమే వర్ణింపబడినది. ఇచట ఆదిశేషుని ఫణాగ్రములు వంగిపోవుట, హిరణ్యాక్షుని వక్షస్థలాస్థిభేదనము మొదలగు విషయములు కూడ అధికముగ చేర్చబడినవి.

మా అన్యతమభాషానిబద్ధం భాషాన్తరేణ పరివర్త్యత ఇతి నటనేపథ్యమ్. యథా:-

"నేచ్ఛఇ పాసాసంకీ కాఓ దిణ్ణం పి పహిఅఘరిణీఏ
ఓహత్తకరయలోగ్గలియవలయమజ్ఝట్ఠిఅం పిణ్డం." 28

అత్రార్థే:-"దత్తం పిణ్డం నయనసలిలక్షాలనాధౌతగణ్డం
ద్వారోపాన్తే కథమపి తయా సజ్ఞమాశానుబన్ధాత్.
వక్రగ్రీవశ్చలనతశిరాః పార్శ్వసఞ్చారిచక్షుః
పాశాశఙ్కీ గలితవలయం నైవ మశ్నాతి కాకః." 29

వ్యా॥ ఒక భాషలో నున్న విషయమును మరియొక భాషలోనికి మార్చి చెప్పుట నటనేపథ్యము ఎట్లనగా:-

''నేచ్ఛతి పాశాశఙ్కీ కాకో దత్తమపి పథికగృహిణ్యా.
అవనతకరతలోద్గలితవలయమధ్యస్థితం పిణ్డమ్.''
అని సంస్కృతచ్ఛాయ.

''పాంథుని భార్యచే ఇవ్వబడినదియు, క్రిందికి వంగిన చేతినుండి జారి పోయి' వలయము మధ్యలో నున్నదియు అగు అన్నపిండమును, పాశమునుగా శంకించుచు, కాకి తీసికొనుటకు ఇచ్ఛగించుటలేదు.''

వి. పాంథవనిత వియోగముచే చాల కృశించి పోయినది. ఆమె కాకికి అన్నము ముద్ద వేయుటకై వంచిన చేతినుండి గాజు జారిపోయి క్రింద పడినది. అది తనను బంధించుటకై వేసిన పాశ మని భయపడి, కాకి ఆ గాజు మధ్య నున్న అన్నమును తినుటలేదు.

వ్యా. ఈ విషయమునే గ్రహించి వ్రాసిన మరి యొక శ్లోకము :-

''భర్తృసంగమాశ ఇంకను మానసమున నెలకొనియుండ, ఆమె, కన్నీటితో కడిగివేయుటచే శుభ్రమైన గండస్థలము కలుగునట్లుగా, పిండమును, ఎటులనో ద్వారప్రాంతమునందు ఉంచినది. వక్రమైన కంఠముకలదియు, కదలు చున్న వంచబడిన శిరస్సు కలదియు, పార్శ్వములందు త్రిప్పబడిన నేత్రములు కలదియు అగు కాకి, జారిన వలయయుతో కూడిన ఆ అన్నపుముద్దను, అచట పాశ మున్నదను భయముచే, తినుటలేదు''.

వి. ప్రాకృతభాషా పద్యములోనున్న విషయమునే ఇచట కవి సంస్కృత పద్యరూపమున కూర్చినాడు.

మూ. ఛన్దసా పరివృత్తిశ్ఛన్దో వినిమయః. యథా:-
''కాన్తే తల్పముపాగతే విగలితా నీవీ స్వయం బన్ధనాత్
తద్వాసః శ్లథమేఖలాగుణధృతం కిఞ్చిన్నితమ్బే స్థితమ్.
ఏతావత్సఖి వేద్మి కేవలమహం తస్యాఙ్గసఙ్గే పునః
కోసౌ కాస్మి రతం ను కిం కథమపి స్వల్పాపి మే న స్మృతిః. 30

అత్రార్థే:-

"ధన్యాస్తు యాః కథయథ ప్రియసఙ్గమేపి
విశ్రబ్ధచాటుకశతాని రతాన్తరేషు.
నీవీం ప్రతి ప్రణిహితస్తు కరః ప్రియేణ
సఖ్యః శపామి యది కిఞ్చిదపి స్మరామి" 81

వ్యా. ఒక ఛందస్సులో కూర్చిన అర్థమును మరి యొక ఛందస్సులో కూర్చుట ఛందోవినిమయము. ఉదాహరణ మెట్లనగా:-

"ప్రియుడు తల్పము చేరగనే పోకముడి తనంతతానే బంధనమునుండి జారిపోయినది. వదులైపోయిన వడ్డాణము త్రాడుకు తగుల్కొనిన ఆ వస్త్రము కొంచెము మాత్రమే నితంబముపై నుండెను. ఓ సఖీ ఇంతమాత్రమే ఎరుగుదును. కాని ఆతని శరీరస్పర్శ కలిగిన పిమ్మట. అతడెవరు: నేనెవరు; సురత మనగా ఏమి ? అది ఎట్లు జరిగినది ? ఏటి విషయమై నాకు స్వల్పమైనను స్మృతి లేదు." ఇది అమరుకములోనిది.

ఈ విషయమునే గ్రహించి వ్రాసిన మరి యొక శ్లోకము :-

"ఓ ! చెలికత్తెలారా ! మీరు ప్రియసంగమమునందు, సురతమధ్యము నందు కూడ విశ్వాసభరితములైన అనేక చాటువాక్యములను చెప్పకలిగి ఉన్నారన్నచో మీరు ధన్యలు. ప్రియుడు పోకముడివైపు హస్తమును చాచినాడు. అంతే ఇంక ఏమైనస్మరింతు నన్నచో ఒట్టే !"

ఇది విజ్జిక యను స్త్రీకవి రచించినట్లు ప్రసిద్ధి. మొదటిది శార్దూలవిక్రీడిత వృత్తము, రెండవది వసన్తతిలకము ఇట్లు వృత్తభేదమే కాని అర్థమొక్కటియే.

మూ. కారణపరావృత్త్యా హేతువ్యత్యయః, యథా :—
"తతోరుణపరస్పన్దమస్లీకృతరుచిః శశీ
దధ్రే కామపరిక్షామకామినీగణ్డపాణ్డుతామ్." 82

అత్రార్థే :— సమం కుసుమచాపేన గర్భిణీగణ్డపాణ్డునా
ఉదయాద్రిశిరఃసీమ్ని నిహితం పదమిన్దునా. 83

వ్యా. కారణమును మార్చినచో హేతువ్యత్యయము :-

"అటుపిమ్మట అరుణుని ప్రకాశముచే మందముగా చేయబడిన కాంతి గల చంద్రుడు కామముచే (విరహముచే) కృశించిన కామినియొక్క గండస్థలము (తెలుపువంటి) తెలుపును ధరించెను."

ఈ అర్థము మరి యొక విధముగ ఎట్లనగా :-

"గర్భిణిస్త్రీయొక్క గండస్థలము వలె తెల్లగా నున్న చంద్రునిచే, మన్మథునితో కూడ, ఉదయాద్రిశిఖరాగ్రమున పదము ఉంచబడెను."

వి. పై రెండు శ్లోకములందును చంద్రుడు స్త్రీయొక్క తెల్లని చెక్కిలితో పోల్చబడినాడు. మొదటి శ్లోకములో విరహము గండపాండుత్వమునకు కారణమని చెప్పబడినది; రెండవ శ్లోకములో గర్భిణీత్వము కారణముగ చెప్పబడినది. కావున ఇది హేతువ్యత్యయమునకు ఉదాహరణము.

మూ. దృష్టస్య వస్తునోఽన్యత్ర సంక్రమితిః సంక్రాన్తమ్ :-

యథా:- స్నానార్ద్రార్ద్రైర్ధుతకబరీబన్ధలోలైరిదానీం
శ్రోణీభారః కృతపరిచయైః పల్లవైః కున్తలానామ్.
అప్యేతేభ్యో నభసి పతతః పఙ్క్తిశో వారిబిన్దూన్
స్థిత్వోద్గ్రీవం కువలయదృశాం కేలిహంసాః పిబన్తి. 84

అత్రార్థే:- "సద్యఃస్నాతజపత్తపోధనజటాప్రాన్తస్రుతాః ప్రోన్మత్తైః
పీయన్తేఽమ్బుకణాః కురఙ్గశిశుభిస్తృష్ణావ్యథా విక్లవైః.
ఏతాం ప్రేమభరాలసాం చ సహసా శుష్యన్ముఖామాకులః
శ్లిష్యన్ రక్షతి పక్షసమ్పుటకృతచ్ఛాయః శకున్తః ప్రియామ్." 85

వ్యా. ఒకచోట చూడబడినదానిని మరి యొక స్థానమునకు సంక్రమింప చేయుట సంక్రాంతము. ఎట్లనగా :-

"స్నానము చేయుటచే ఎక్కువ తడిగా ఉన్నవియు, దులిపిన కేశపాశము నుండి శిథిలములైనవియు అగు స్త్రీల కేశాగ్రములతో శ్రోణీభారము ఏర్పడిన సంబంధము కలదైనది. ఈ కుంతలాగ్రములనుండి వరుసగ ఆకాశమునందు పడు

చున్న జలబిందువులను, ఆ కువలయనయనల క్రీడాహంసలు, మెడ పైకెత్తి, నిలబడి, త్రాగుచున్నవి."

ఈ విషయమును గ్రహించి వ్రాసిన మరి యొక శ్లోకము :-

"అప్పుడే స్నానము చేసి జపము చేసికొనుచున్న తపోధనుల జటాగ్రములనుండి స్రవించుచున్న జలకణములు, దప్పికతో వ్యాకులమైన లేడిపిల్లలచే కంఠములెత్తి త్రాగబడుచున్నవి. ప్రేమభారముతో నిండినదియు, హటాత్తుగా ఎండిపోవుచున్న ముఖము కలదియు అగు తన ఈ ప్రియురాలిని, ఈ పక్షి, కంగారుపడుచున్నదై కౌగలించుకొని (సమీపమునకుచేరి) దొప్పల వలె నున్న రెక్కలచే చేయబడిన నీడ గలదై, రక్షించుచున్నది".

వి. ఇచట, కుంతలాగ్రములనుండి స్రవించుచున్న జలబిందువులను పెంపుడుహంసలు త్రాగుచున్నవి అను విషయమును తీసికొని, రెండవ శ్లోకములో ఆ త్రాగుటను లేళ్ళకు కూర్చుట జరిగినది కావున ఇది సంక్రాంతకము.

మూ. ఉభయవాక్యార్థో పాదానం సమ్పుటః. యథా.-
విన్ధ్యస్యాద్రేః పరిసరనదీ నర్మదా సుభ్రు సైషా
యాదోభర్తుః ప్రథమగృహిణీం యాం విదుః పశ్చిమస్య.
యస్యామన్తః స్ఫురితశఫరత్రాసహాసాకులాక్షీ
స్వైరం స్వైరం కథమపి మయా తీరముత్తారితాసి. 86

యథా:- నాభీగుహాబిలవిశచ్చలవీచిజాత
మఞ్జుధ్వనిత్రుటితకఙ్కణకుక్కుభాని.
రేవాజలాన్యవిరలం గ్రహిలీక్రియన్తే
లాటాఙ్గనాభిరపరాహ్ణనిమజ్జనేషు. 87

అత్రార్థే:- యద్వ్యాగ్యాభిర్జగాహే గురుశకులకులాస్ఫాలనత్రాసహాస
వ్యస్తోరుస్తమ్భికాభిర్ధిశి దిశి సరితాం దిగ్జయప్రక్రమేషు.
అమ్భోగమ్భీరనాభీకుహరకవలనోన్ముక్తపర్యాయలోల
త్కల్లోలాబద్ధముగ్ధధ్వనిచకితరణత్కుక్కుభం కామినీభిః. 88

వ్యా. రెండు శ్లోకములనుండి రెండు వాక్యార్థములను హరించి మరి యొక శ్లోకము రచించుట సంపుటము. ఎట్లనగా — "ఓ! అందమైన కనుబొమ్మలు

కలదానా॥ ఇది వింధ్యపర్వత ప్రాంతనది యైన నర్మద. ఇది పశ్చిమ సముద్రముయొక్క ప్రథమభార్య యని చెప్పుదురు ఏ నదియందు, లోపల కదలుచున్న మత్స్యములవలన కలిగిన భయముచే కలిగిన నవ్వుచే వ్యాకులమైన నేత్రములు కలదానవై, మందమందముగ నాచే ఎటులనో తీరమునకు చేర్పబడితివో.''

మఱి యొక వాక్యార్థ మెట్లనగా:- ''నాభిగుహారంధ్రములందు ప్రవేశించుచున్న చంచల మైన తరంగములవలన కలిగిన మధురధ్వని వినుటచే భయముచే లేదా సజాతీయపక్షుల ధ్వని యను భ్రాంతిచే మధురముగా ధ్వని చేయుచున్న కుక్కుభపక్షులు గల రేవానదీజలములు, ఎల్లప్పుడును, లాటదేశస్త్రీలచేత, అపరాహ్ణసమయములందు కలుషము చేయబడుచున్నవి.''

ఈ రెండుశ్లోకములలోని అర్థములను గ్రహించి వ్రాసిన శ్లోక మెట్లనగా:-

''దిగ్విజయసమయములందు, పెద్దవైన శకులమను పేరుగల మత్స్యముల సముదాయము ఢీకొనుటవలన త్రాసముతో కూడిన హాసముతో ఎగుడుదిగుడుగా చేయబడిన ఊరు స్తంభములు (స్తంభములవంటి తొడలు) గల ఏ రాజవర్గీయలైన వనితలచేత, (వారి) లోతైన నాభికుహరములయందు ప్రవేశించి తిరుగుట బైటకు వచ్చుట (అను క్రియల)చే పర్యాయముచే చంచలమైన తరంగములచే ఏర్పడిన మధురధ్వనులచే ఉలిక్కిపడిన కుక్కుభపక్షులు గల, ఏ నదియొక్క జలము ప్రవేశింపబడినదో.''

వి. మత్స్యాస్ఫాలనముచే స్త్రీలు భయపడుట అను అర్థమును మొదటి శ్లోకమునుండియు స్త్రీల నాభికుహరములందు ప్రవేశించిన జలముయొక్క ధ్వనిచే కుక్కుభములు చకితము లైన వను అర్థమును రెండవ శ్లోకమునుండియు గ్రహించి మూడవ శ్లోకము రచింపబడినది గాన ఇందు రెండు విభిన్నార్థములు కలియుటచే సంపుటము.

మూ. సోఽయం కవేరకవిత్వదాయీ సర్వథా ప్రతిబిమ్బకల్పః పరిహరణీయః. యతః-

పృథక్త్వేన న గృహ్ణన్తి వస్తు కావ్యాన్తరస్థితమ్.
పృథక్త్వేన న గృహ్ణన్తి స్వవపుః ప్రతిబిమ్బితమ్. 89

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవి రహస్యే ప్రథమేఽ-
ధికరణే శబ్దార్థహరణేషు కవి ప్రభేదాః, ప్రతిబిమ్బకల్పవికల్పస్య సమీక్షా
ద్వాదశోఽధ్యాయః.

వ్యా. కవికి అకవి యను అపకీర్తిని కలిగించు ఈ ప్రతిబింబకల్పమును సర్వథా పరిహరింపవలెను. ఏలనన "మరియొక కావ్యములో (శ్లోకములో) ఉన్నంత మాత్రమున ఒక అర్థము, భిన్న మైనదవి ఎవరును అనుకొనరు. ప్రతిబింబించిన తమ దేహమును చూచి అది మరియొక దేహ మని భావింపరు"

బాలానందినిలో ద్వాదశోధ్యాయము సమాప్తము.

త్రయోదశోధ్యాయః

అర్థహరణేష్వాలేఖ్యప్రఖ్యాది భేదాః

మూ. ఆలేఖ్యప్రఖ్యపరిసఙ్ఖ్యాః:- సదృశసఞ్చారణం సమ్రకమః. యథా:-

ఆస్త్రాదివేశ్మని దిశో వరుణప్రియాయా
స్తిర్యక్కృతశ్చ్ఛదపయ స్త్రిణమాస్థితాయాః.
గణ్డైకపార్శ్వమివ కుంఙ్కుమపఙ్కచుమ్బి
బిమ్బం రుచామధిపతేరరుణం రరాజ. 1

యథా చ:- ప్రాగ్దిశః ప్రతికలం విలసన్త్యాః
కుఙ్కుమారుణకపోలతలేన.
సామ్యమేతి కలితోదయరాగః
పశ్య సున్దరి తుషారమయూఖః. 2

వ్యా. ఆలేఖ్యప్రఖ్య మగు అర్థహరణముయొక్క భేదములు:- (సమ్రకమము, విభూషణమోషము, వ్యుత్క్రమము, విశేషోక్తి, ఉత్తంసము, నటనేపథ్యము, ఏకపరికార్యము, ప్రత్యాపత్తి అనునవి దీని భేదములు.) అందు సమాన మగు అరమును సంకమింపచేయుట సమకమము. ఉదాహరణ మెటనగా.

"సూర్యుని ఎఱ్ఱనైన బింబము, అస్తాద్రిగృహమునందు ఏ కారణము వలననో అర్ధముగ తిరిగి ఇరుకుగా కూర్చుండి యున్న పశ్చిమదిఙ్నాయికయొక్క, కుంకుమపంకము పూసిన గండస్థలముయొక్క ఒక భాగము వలె ప్రకాశించెను.'

ఇంకను ఎట్లనగాః- "ఓసుందరీ! ఉదయరాగముతో కూడిన చంద్రుడు, ప్రతిక్షణమునందును ప్రకాశించుచున్న ప్రాగ్దిశానాయికయొక్క కుంకుమారుణమగు కపోలతలముతో సామ్యమును పొందుచున్నాడు. చూడుము"

వి. పూర్వశ్లోకమున అస్తమించుచున్న సూర్యుని బింబము ప్రతీచీదిశాంగనయొక్క చెక్కిలితో పోల్చబడినది. ఈ శ్లోకమున ఉదయించుచున్న చంద్రబింబము ప్రాచీదిశాంగనాకపోలముతో పోల్చబడినది. సదృశసంధారణము ఈ ఆలేఖ్యప్రఖ్యార్థభేదమునకును ప్రతిబింబకల్పార్థసప్తమభేదమగు సంక్రమమునకును పోలిక లున్నవి.

మూ. అలంకృతమనలంకృత్యాభిధీయత ఇతి విభూషణమోషః. యథా:-
కువలయసితి మూలే బాలచన్ద్రాఙ్కురాభం
తదను ఫలి తతో౽గ్రే పాకపీతామ్రపీతమ్
అభినవరవిరోచిర్ధూమధూమ్రం శిఖాయా
మితి వివిధవికారం దీప్యతే దైపమర్చిః." 3

అత్రార్థే :- "మనాఙ్మూలే నీలం తదను కపిశోన్మేషముదరే
తతః పాణ్డు స్తోకం స్ఫురదరుణలేఖం చ తదను,
శిఖాయామాధూమ్రం ధృతవివిధవర్ణక్రమమితి
క్షణాదర్చిర్దైపం దలయతి తమః పుఞ్జితమపి." 4

వ్యా. అలంకారసహితమగు అర్థమును అలంకారములు తీసివేసి చెప్పుట విభూషణమోషము. (దీనికిని ప్రతిబింబకల్పార్థ ప్రథమభేదమగు 'భంగము' నకును సామ్యమున్నది) ఎట్లనగా :- "దీపజ్వాల మూలమునందు నల్లకలువవలె నీలమైనదిగను, తరువాత బాలచంద్రాంకురము కాంతి వంటి కాంతి కలదిగను, దానిపైన పక్వమగుటచే పచ్చబడిన మామిడిపండు వలె పచ్చగను, దానిపైన నూతనమైన సూర్యునివంటి కాంతికలదిగను, అగ్రభాగమున మామముచే ధూమ్రవర్ణముగను - ఈ విధముగ వివిధాకారములు కలదై ప్రకాశించెను."

ఈ అర్థమునే (ఉపమాలంకారములు తీసివేసి) గ్రహించిన ఉదాహరణ మెట్లనగా:—

"మూలమునందు కొంచెము నీలమైనదియు, అటుపిమ్మట కపిశవర్ణమైన ఉన్మేషము (వికాసము) కలదియు, అటుపైన మధ్యభాగమునందు తెల్లగా నున్నదియు, దానిపైన ప్రకాశించుచున్న అరుణకాంతి కలదియు, శిఖయందు ధూమ్రవర్ణము కలదియు అగు దీపజ్వాల పోగుపడియున్న తమస్సును కూడ చీల్చివేయుచున్నది."

మూ. క్రమేణాభిహితస్యార్థస్య విపరీతాభిధానం వ్యుత్క్రమః. యథా తత్రైవ:-

''శ్యామం శిఖాభువి మనాగరుణం తతోధః
శ్వేతావపాణ్డురఘనం చ తతోఽప్యధస్తాత్.
ఆపిఞ్జరం తదను తస్య తలే చ నీల-
మన్ధం తమఃపటల మర్దతి దైపమర్చిః. 5

వ్యా. ఒక క్రమములో చెప్పిన విషయమును దాని విపరీతక్రమములో చెప్పుట వ్యుత్క్రమము. ఆ దీపవర్ణనమునందే ఉదాహరణము ఎట్లనగా-

''అగ్రభాగమునందు నల్లగా నున్నదియు, దాని క్రింద కొంచెము ఎఱ్ఱగా నున్నదియు, దానికంటె కూడ క్రింద కొంచెము తెల్లగను లావుగను ఉన్నదియు, దాని క్రింద కొంచెము పింజరవర్ణమైనదియు, అడుగున నీలవర్ణమైనదియు అగు దీపజ్వాల దట్టమైన తమస్సును తొలగించుచున్నది.''

పూర్వశ్లోకములలో దీపజ్వాల మొదటినుండి అగ్రభాగమువరకు వర్ణింపబడినది. ఈ శ్లోకమున అగ్రభాగమునుండి మూలమువరకును వర్ణింపబడినది. ఈ వ్యుత్క్రమమునకును, ప్రతిబింబకల్పార్థభేద మగు వ్యత్యస్తకమునకును సామ్య మున్నది.

మూ. సామాన్యనిబన్ధే విశేషాభిధానం విశేషోక్తిః. యథా :—

''ఇత్యుద్గతే శశిని పేశలకాన్తదూతీ
సంలాపసఞ్చలితలోచనమానసాభిః.
అగ్రాహి మణ్డనవిధిర్విపరీతభూషా
విన్యాసహాసితసఖీజనమఙ్గనాభిః''. 6

అత్రార్థే:- ''చకార కాచిత్సితచన్దనాఙ్కే కాఞ్చీకలాపం స్తనభారపృష్ఠే
ప్రియం ప్రతి ప్రేషితచిత్తవృత్తిర్నితమ్బబిమ్బే చ బబన్ధ హారమ్.''

వ్యా. ఒక శ్లోకములో సామాన్యరూపమున చెప్పిన విషయమును గ్రహించి విశేషరూపమున వర్ణించుట విశేషోక్తి. ఉదాహరణ మెట్లనగా :-

"చంద్రుడు ఈ విధముగా ఉదయించగా, మధురములైన ప్రియదూతీ సంభాషణములచే చలించిన నేత్రములు, మనస్సులును గల స్త్రీలచే, అలంకారము లను విపరీతముగ ధరించుటచే సఖీజనము నవ్వునట్లుగా, అలంకరణ విధి గ్రహింపబడెను."

ఈ విషయమునందే—అనగా అలంకారములను తారుమారుగ ధరించుట అని సామాన్యరూపమున చెప్పిన విషయమునే గ్రహించి, ఏ అలంకారము ఏ విధముగ విపరీతముగ ధరింపబడినదో విశేషరూపమున చెప్పుచు, వ్రాసిన శ్లోకము :-

''ప్రియునివద్దకు పంపబడిన మనోవృత్తి గల ఒక నాయిక తెల్లని చందనము పూసిన స్తనభారముయొక్క పైభాగమున వడ్డాణమును (ఆరోజులలో వడ్డాణము బంగారుపూసలు మొదలగునవి గ్రుచ్చి తయారుచేసెడివారు) ఉంచెను. హారమును నితంబముపై కట్టెను."

వి. ఈ విశేషోక్తికిని ప్రతిబింబకల్పార్థభేద మగు తైలబిందువునకును పోలిక లున్నవి.

మూ. ఉపసర్జనస్యార్థస్య ప్రధానతాయాముత్తంసః. యథా :-

"దీపయన్నథ నభః కిరణౌఘైః కుఙ్కుమారుణపయోధరగౌరః.
హేమకుమ్భ ఇవ పూర్వపయోధేరున్మమజ్జ శనకైస్తుహినాంశుః''. 8

అత్రార్థే :- ''తత స్తమః శ్యామలపట్టకఞ్చుకం
విపాటయన్త్యా ఇవ దదృశ్యతా న్తరా.
నిశాతరుణ్యాః స్థితశేషకఙ్కుమ
స్తనాభిరామం స(శ)కలం కలావతః." 9

వ్యా. అప్రధాన మైన అర్థమును ప్రధానముగ కూర్చినచో ఉత్తంసము. ఎట్లనగా :-

"ఇంతలో కిరణసముదాయములచే ఆకాశమును ప్రకాశింపచేయుచు, కుంకుమముచే ఎఱ్ఱనైన స్తనమువలెగౌరవర్ణము గల చంద్రుడు పూర్వసము ద్రమునుండి, బంగారుకుంభమువలె, మెల్లగ పైకి లేచెను." (కిరాతార్జు నీయము. 9.18)

ఈ అర్థమునందే-"అటుపిమ్మట నిశాతరుణి యొక్క. తమస్సు అనెడు నల్లని పట్టురవికెను చీల్చివేయుచు, కొంచెము మిగిలిపోయిన కుంకుమము గల స్తనము వలె మనోహర మైన చంద్రుని బింబము, మధ్యయందు కొంచెము కనబడెను."

వి. పూర్వశ్లోకమున "కుఙ్కుమారుణపయోధరగౌరః" అను విశేషణముచే చంద్రునకు స్తనసామ్యము మాత్రము చెప్పబడినది. రెండవ శ్లోకమున తమస్సును కూడ పట్టకంచుకముతో పోల్చుటచే చంద్రుని ఈ స్తనసాదృశ్యము నకు మరి కొంత ప్రాధాన్య మీయబడినది గాన ఇది ఉత్తమము.

మూ. తదేవ వస్తూక్తివశాదన్యథా క్రియత ఇతి నటనేపథ్యమ్

యథా :- ఆననేన్దుశశలక్ష్మ కపోలే సాదరం విరచితం తిలకం యత్.

తత్ప్రియే విరచితావధిభఙ్గేధౌతమీక్షణజలైః సరలాక్ష్యాః 10

అత్రార్థే:- శోకాతిరిక్తాసరఖణ్డితానాం సిక్తాః కపోలేషు విలాసినీనామ్.

కాన్తేషు కాలాత్యయమాచరత్సు స్వల్పాయుషః పత్రలతా బభూవుః.11

వ్యా. అవిషయమునే చెప్పెడు విధానమును మార్చి మరి యొక విధముగ చెప్పినచో అది నట నేపథ్యము. ఎట్లనగా:-

"అచపలాక్షి ముఖచంద్రునిలో మచ్చగా, కపోలమునందు ఏ తిల కము ఉంచబడెనో, అది. ప్రియుడు తాను వచ్చెద నన్న అవధికి భంగము చేయగా, కన్నీళ్లచే కడిగివేయబడినది."

ఈ అర్థమునందే మరియొక శ్లోకము:- "వాసరఖండిత లగు విలాసినుల కపోలములందలి పత్రలతారచనలు, ప్రియులు ఆలస్యము చేయుటచే, శోకాశ్రు వులచే తడపబడినవై, స్వల్పమైన ఆయుర్దాయము కలవై అయినవి"

వి. వాసర మనగా "ఈ రోజున ఇక్కడకు వచ్చెదను"ఇత్యాదివిధమున నిర్ణయించుకొనిన దివసము. ఆ నిర్ణయము ప్రకారము రాకుండ ప్రియునిచే మోస గింపబడిన నాయికలు వాసరఖండితలు. కపోలమునందలి తిలకము అని పూర్వ శ్లోకోక్త మైనదానిని ఈ శ్లోకమున పత్రరచనగ మార్చి చెప్పుట జరిగినది.

మూ పరికరసామ్యే సత్యపి పరికార్యస్యాన్యథాత్వాదేకపరికార్యః.
(యథా):-

అవ్యాద్ గజేన్ద్రవదనః స ఇమాం త్రిలోకీం
యస్యోద్ధతేన గగనే మహతా కరేణ.
మూలావలగ్నసితదన్తబిసాఙ్కురేణ
నాలాయితం తపనబిమ్బసరోరుహస్య." 12

అత్రార్థే:- "సరలకరదణ్డనాలం గజవపుషః పుష్కరం విభోర్జయతి.
మూలబిసకాణ్డభూమౌ యత్రాభూదేకదంష్ట్రైవ." 13

వ్యా వర్ణనావిధానము ఒకటే యైనను ప్రధానవర్ణ్యము వేరుగ నున్నచో అది ఏక పరికార్యము. ఎట్లనగా:-

"ఆకాశములోనికి ఎత్తబడినదియు, గొప్పదియు, మూలమునందు లగ్నమైన తెల్లని దంత మనెడు తామర తూడు కలదియు అగు ఏగజవదనుని తొండము, సూర్యబింబ మనెడు పద్మమునకు కాడగ అయినదో అట్టి గజవదనుడు మూడు లోకములను రక్షించుగాక."

ఈ అర్థమునే గ్రహించి వ్రాసిన మరి యొక శ్లోకము :-

"సరలమైన తొండమే కాడగా గలదైన గజశరీరుడైన ప్రభువుయొక్క పుష్కర మనెడు పుష్కరము (పుష్కర మనగా తొండముయొక్క అగ్ర భాగము, పద్మము అని రెండర్థములు) సర్వోత్కర్షగ నున్నది. దేనియందు, ఒక దంతము మూలమునందుండు తామరతూడుయొక్క స్థానమున (తామర తూడువలె) ఉండెనో"

మొదటి శ్లోకమున ప్రధానవర్ణ్యవస్తువు గజేంద్రవదనుడు. రెండవ శ్లోకమున పుష్కరాగ్రము.

మూ. వికృతేః ప్రకృతి పాపఠం పత్యాపత్తిః యథా:-
"రవిసఙ్క్రాన్తసౌభాగ్యస్తుషారావిలమణ్డలః
నిఃశ్వాసాన్ధ ఇవాదర్శశ్చన్ద్రమా న ప్రకాశతే." 14

అత్రార్థే :- తస్యాః పతిదన్తిసపాదా
త్పదో ముక్తం మహాభాసే,

నిఃశ్వాసబాష్పాపగమే ప్రసన్నః
ప్రసాదమాత్మీయమివాత్మదర్శః." 15

వ్యా. వికారమునుండి మరల యథాపూర్వస్థితిని పొందించుట ప్రత్యాపత్తి. ఎట్లనగా:-

"సూర్యునియందు సంక్రమించిన సౌందర్యము కలవాడును, మంచుచేత వ్యాకులమైన మండలము కలవాడును అగు చంద్రుడు నిట్టూర్పు తగులుటచే మాసిపోయిన అద్దము వలె ప్రకాశించుటలేదు."

ఈ అర్థమునే గ్రహించి అద్దమునకు సంక్రమించిన మాలిన్యరూప మగు వికారము తొలగిపోయినట్లు వర్ణించిన శ్లోకము ఎట్లనగా:- (ఇది రఘువంశములోనిది. ఇందుమతీస్వయంవరానంతరము అజుడు ఇందుమతీసమేతుడై స్వదేశమునకు వెళ్ళుచుండగా అసూయాపరులైన ఇతరరాజులు అతనిపైకి యుద్ధమునకై వచ్చిరి. వారినందరిని అతడు జయించిన తరువాత ఇందుమతి స్థితిని వర్ణించు శ్లోక మిది.)

"శత్రువులవలన కలిగిన విషాదము తొలగిపోయిన ఆమె ముఖము, నిశ్వాసమునకు సంబంధించిన బాష్పము (పైన కమ్మిన ఆవిరి) తొలగుటచే తన సహజ నిర్మలత్వమును పొందిన అద్దము వలె ప్రకాశించెను."

మూ. తా ఇమా ఆలేఖ్యప్రఖ్యస్య భిదాః. సోఽయమనుగ్రాహ్యో మార్గః. ఆహుశ్చ:-

"సోయం భణితివైచిత్ర్యాత్సన్నపి వస్త్వంతరః
నటవద్వర్ణికాయోగాదన్యథాత్వమివార్చ్ఛతి" 16

వ్యా. ఈ ఎనిమిదియు ఆలేఖ్య పఖ్యార్థముయొక్క భేదములు. ఈ మార్గము గ్రాహ్యము కావుననే ఇట్లు చెప్పుచున్నారు :- "సను స్తమైన ఈ వస్తు ప్రపంచము (పై చూపిన అర్థములన్నియు). ఉక్తివైచిత్ర్యముచే (పాత్రానుగుణమగు) రంగులువేసికొనుటచే నటుడువలె, క్రొత్తదివలె అగును."

మూ. అథ తుల్యదేహితుల్యస్య భిదాః. తస్యైవ వస్తునో విషయాంతరయోజనాదన్యరూపాపత్తి ర్విషయపరివర్తః. యథా:-

"యే సీమన్తితగాత్రభస్మరజసో యే కుమ్భకద్వేషిణో
యే లీఢాః శ్రవణాశ్రయేణ ఫణినా యే చన్ద్రశైత్యద్రుహః.
తే కుప్యద్గిరిజావిభక్తవపుషశ్చిత్తవ్యథాసాక్షిణః
స్థాణోర్దక్షిణనాసికాపుటభువః శ్వాసానిలాః పాన్తు వః." 17

అత్రార్థే :-

యే కీర్ణక్వథితోదరాబ్ధిమధవో యే మ్లాపితోరః స్రజో
యే తాపాన్తరశేన తల్పఫణినా పీతప్రతీపోజ్ఝితాః.
తే రాధాస్మృతిసాక్షిణః కమలయా సాసూయ మాకర్ణితా
గాఢాన్తర్దవథోః ప్రగప్రసరలాః శ్వాసా హరేః పాన్తు వః. 18

వ్యా. మరి యొక విషయముతో సంబంధము ఏర్పరచుటచే, ఒకే వస్తువు మరియొక రూపమును ధరించుట విషయపరివర్తనము. ఎట్లనగా :- ఏవి శరీరము నందలి భస్మపరాగమును రేఖలుగా చేయుచున్నవో, ఏవి కుంభకమును (శ్వాసను లోపల నిరోధించుటకు కుంభక మని పేరు) ద్వేషించుచున్నవో అనగా కుంభకమునకు విరుద్ధముగ నున్నవో, ఏవి శ్రవణమును ఆశ్రయించి యున్న సర్పముచే ఆస్వాదింపబడినవో, ఏవి చంద్రుని శైత్యమునకు ద్రోహము చేయుచున్నవో. అట్టి, కోపించిన పార్వతిచే విభజించుకొనబడిన శరీరము గల (అర్ధనారీశ్వర రూపుడైన) ఈశ్వరుని చిత్తవ్యథకు సాక్షులుగా నున్న, (ఆ శివుని) కుడి నాసికాపుటమునుండి వెలువడుచున్న శ్వాసవాయువులు మిమ్ములను రక్షించుగాక."

(ఇది రాజశేఖరకృతబాలభారతము నందలి శ్లోకము. 1. 2)

ఈ అర్థమునందే—

"ఏవి ఉదరాబ్ధిమునందలి మధువును మరిగిపోవునట్లు చేసి చిమ్మివేయుచున్నవో, ఏవి వక్షఃస్థలమునందలి మాలికలను వాడిపోవునట్లు చేయుచున్నవో, తాపముచే బాధచెందిన, తల్పమైన ఆదిశేషునిచే, ఏవి పానము చేయబడి ఎదురుగా (వెంటనే) విడిచివేయబడినవో అట్టివియు, రాధయొక్క స్మృతికి సాక్షులును, లక్ష్మిచే అసూయతో వినబడినవియు, చాల వేడిగ నున్నవియు, సరళమైనవియు అగు, గాఢమైన అంతస్తాపము గల విష్ణువుయొక్క శ్వాసలు మిమ్ములను రక్షించుగాక."

వి. వెనుకటి శ్లోకమున ప్రణయకలహకృతవిరహతాపముచే ఈశ్వరుడు ఉష్ణశ్వాసలను విడుచుచున్నట్లు వర్ణింపబడినది. ఇచట రాధావియోగతాపముచే విష్ణువు ఉష్ణశ్వాసలను విడచుచున్నట్లు వర్ణింపబడినది. ఈ విధముగ ఉష్ణశ్వాస రూప మగు ఒక వస్తువు భిన్నవర్ణనాచమత్కారముచే వేరుగ నున్నట్లు కనబడుచున్నది.

మూ. ద్విరూపస్య వస్తునోఽన్యతమ(ర)రూపోపాదానం ద్వన్ద్వవిచ్ఛిత్తిః. యథా:—

"ఉత్క్లేశం కేశబన్ధః కుసురశరరిపోః కల్మషం వః స ముష్యా-
ద్యత్తేన్దుం వీక్ష్య గఙ్గాజలభరలులితం బాలభావప్రభూతామ్
క్రౌఞ్చారాతిశ్చ ఫణ్టాస్ఫురితశఫరికామోహలోలేక్షణశ్రీః
సద్యః ప్రోద్యన్మృణాలీగ్రహణరసలసత్పుష్కరశ్చ ద్విపాస్యః" 19

అత్రార్థే:—

"దిశ్యాద్ధూర్జటిజూటకోటిసరితి జ్యోత్స్నాలవోద్భాసినీ
శాశాఙ్కీ కలికా జలభ్రమివశాద్ ద్రాగ్దృష్టనష్టా సుఖమ్.
యాం చఞ్చచ్ఛఫరీభ్రమేణ ముకులీకుర్వన్ ఫణాలీం ముహు
ర్మహ్యేల్లక్ష్యమహర్నిమ్నక్షతితమామాకుఞ్చనప్రాణ్యైః." 20

వ్యా. (ప్రాచీన శ్లోకమున) రెండు రూపములలో వర్ణిత మగు వస్తువు యొక్క ఒక రూపమును గ్రహించుట ద్వన్ద్వవిచ్ఛిత్తి. ఎట్లనగా :—"దేనియందు. గంగాజల ప్రవాహము నందు నలిగిపోవుచున్న చంద్రుని చూచి, బాల్యముచే, కుమారస్వామి, అనాయాసముగా సంచరించుచున్న చేప అనెడు భ్రాంతిచే చంచలమైన నేత్రలక్ష్మి కలవాడుగను, గజాననుడు, అప్పుడే బయలుదేరుచున్న తామరతూడును గ్రహించుటకై ఆసక్తిచే కదలుచున్న తుండాగ్రము కలవాడుగను అయినారో. అట్టి మన్మథారియొక్క జటాజూటము మీ సకలక్లేశకారణమైన పాపమును అపహరించుగాక" 'ఉత్క్లేశమ్' అనుదానిని క్రియావిశేషణముగ గ్రహించి-'సకలక్లేశములును నశించు విధమున' అను నర్థము చెప్పవచ్చును.

పైశ్లోకములోని శఫరభ్రాంతి అను అంశమును మాత్రము గ్రహించి వ్రాసిన మరియొక శ్లోకము :-

"ఈశ్వరుని జటాజూటాగ్రమునందలి గంగానదియందు కొంచెము వెన్నెలతో ప్రకాశించుచున్నదియు, జలముయొక్క సుడిగుండముచే లేదా జలమునందు తిరుగుటచే, ఒకసారి కనబడి వెంటనే కనబడకుండపోవుచు ఉన్న చంద్రకల సుఖము నిచ్చుగాక. కదలుచున్న మత్స్య మనెడు భ్రమచే సర్పము, మాటిమాటికిని పడగల పంక్తిని ముడుచుకొనుచు, గురి తప్పిపోవు చుండగా, దేహమును ముడుచుకొనుచు దీర్ఘముగ చేయుచు దేనిని గ్రహింపుటకు ఇచ్ఛయించు (ప్రయత్నించు) చున్నదో."

వి. పూర్వశ్లోకమున మృణాలరూపమునను శఫరీరూపమునను చంద్ర కళను వర్ణింపగా ఈ శ్లోకమున అది శఫరీరూపముననే వర్ణింపబడినది.

మూ పూర్వార్థానామర్థాన్తరై ర న్తరణం రత్నమాలా.

యథా:- "కపాలే మార్జారః పయ ఇతి కరాన్ లేఢి శశినః
తరుచ్ఛిద్రప్రోతాన్ బిసమితి కరేణుః కలయతి.
రతాన్తే తల్పస్థాన్ హరతి వనితాప్యంశుకమితి
ప్రభామత్తశ్చన్ద్రో జగదిదమహో! విభ్రమయతి." 21

అత్రార్థే :- "జ్యోత్స్నాభిర్దుగ్ధబుద్ధ్యా కవలితమసకృద్భాజనే రాజహంసైః
స్వాంసే కర్పూరపాంసుస్ఫురణరభసతః సమ్భృతం సున్దరీభిః.
పుష్పైర్వ్యస్తం స్తనాన్తాత్ప్రచయమితి రహఃసమ్భృమే వల్లభానాం
లీఢం ద్రాక్సిన్ధువారేష్వళినవసుమనోలమ్పటైః షట్పదైశ్చ." 22

వ్యా. ప్రాచీనార్థములను ఇతరార్థములతో కలుపుట రత్నమాల, ఎట్లనగా:-

"మూకుడులో పడిన చంద్రకిరణములను చూచి పాలు అనుకొని పిల్లి నాకుచున్నది. వృక్షముయొక్క (ఆకుల) రంధ్రమునుండి క్రిందికి దిగుచున్న కిరణములను, (ఆడ) ఏనుగు తామరతూడు అని అనుకొనుచున్నది. శయ్యపై పడిన ఆ కిరణములను వస్త్రమను భ్రాంతిచే, వనిత, సురతాంతమునందు, ప్రోగుచేసుకొనుచున్నది. కాంతిచే మత్తుడైన చంద్రుడు ఈ జగత్తున కంతకును భ్రాంతికలిగించుచున్నాడు. ఏమి ఆశ్చర్యము!". ఈ అర్థమునందే — "పాత్రలో నున్న వెన్నెలయొక్క కాంతి, పాలు అనెడి భ్రాంతిచే, రాజహంసలచే మాటిమా టికిని కబళింపబడినది. తమ వక్షముపై కర్పూరపరాగమును ప్రాసుకొను తొంద

రలో, స్త్రీలచే ప్రోగుచేయబడినది. ఏకాన్త క్రీడాసంభ్రమమునందు, పురుష లచేత, వస్త్రమను బుద్ధిచే ప్రియురాంర్ర స్తనతటమునుండి తొలగింపబడినది. నూతనపుష్పములందాసక్తి గల తుమ్మెదలచే, తొందరగా, సిందువారవృ క్షములందు, నాకబడినది."

వి. ఇచట, మొదటి పద్యములో నున్న అర్థమే, వేరు రీతిలో చిత్రింప బడినది.

సూ. సంఖ్యావైషమ్యేణార్థ ప్రణయనం సంఖ్యోల్లేఖః.
యథా:- నమన్నారాయణచ్ఛాయాచ్ఛురితాః పాదయోర్నఖాః
త్వచ్ఛన్ద్రమివ సేవన్తే రుద్ర రుద్రేన్దవో దశ. 28

అత్రార్థే:- ఉమైకపాదామ్బురుహే స్ఫురన్నఖే కృతాగసో యస్య శిరః సమాగమే
షడాత్మతామాశ్రయతీవ చన్ద్రమాః స నీలకణ్ఠః ప్రియమాతనోతు వః.

వ్యా. ప్రాచీనశ్లోకములో నున్న సంఖ్యకంటె భిన్న మగు సంఖ్యను కూర్చుట సంఖ్యోల్లేఖము. ఎట్లనగా:—

"ఓరుద్రా ! నీ పాదనఖములు నమస్కరించుచున్న నారాయణుని శరీర కాంతిచే పూయబడినవి (అందుచే) (మిగిలినపదిమంది) రుద్రులకు సంబధించిన చంద్రులు నీ (శిరస్సుపైనున్న) చంద్రుని సేవించుచున్నవా అన్నట్లున్నది."

వి. ఎఱ్ఱగ ప్రకాశించు గోళ్ళలో నారాయణుని నీలశరీరచ్ఛాయ ప్రతి బింబించుటచే అది కలంకము వలె నుండి పది నఖములు పది చంద్రులవలె నున్నవి. రుద్రులు పదకొండుగురు గాన మిగిలిన పదిమంది రుద్రుల శిరస్సులపై నున్న చంద్రులు ఈ రుద్రుని శిరముపై నున్న చంద్రుని సేవించుటకై వచ్చి నారా అని ఉత్ప్రేక్ష.

ఈ అర్థమునందే (సంఖ్యాభేదముచే ఎట్లనగా) :-

"అపరాధము చేసిన ఏ శివుని శిరస్సు ప్రకాశించుచున్న నఖములు గల పార్వతియొక్క ఒక పాదపద్మమును స్పృశింపగనే చంద్రుడు ఆరు దేహ ములు కలవాడై నట్లు ఆయెనో, అట్టి నీలకంఠుడు మీకు ప్రియమును చేకూర్చు గాక."

వి. ఐదు నఖములందు ప్రతిఫలించుటచే మొత్తము ఆరుగురు చంద్రు లైనట్లున్న దని భావము. వెనుకటి శ్లోకమున దశ (ఏకాదశ) సంఖ్యను మార్చి మరి యొక సంఖ్య ఇచట వర్ణింపబడినది.

కాని పార్వతియొక్క ఒక్క పాదముపై నున్న నఖములందే ప్రతిఫలించుటకు కారణమేమియో కవి సూచించలేదు. అర్ధనారీశ్వర రూపమును మనస్సులో నుంచుకొని అట్లు చెప్పె నన్నచో శివుని శిరస్సుమాత్రమే వంగుట అసంగతము. లేదా కుడిభాగము మాత్రము ఎడమ పాదముపైనుంచబడె నని సమర్థించుకొనవలెను.

మూ. సమమభిధాయాధికస్యోపన్యాసశ్చూలికా. ద్విధా చ సా సంవాదినీ విసంవాదినీ చ. తయోః ప్రథమా యథా :-

''అఙ్గణే శశిమరీచిలేపనే సుప్తమిన్దుకరపుఞ్జసన్నిభమ్,
రాజహంసమసమీక్ష్య కాతరా రౌతి హంసవనితాత్రుగద్గదమ్.'' 25

అత్రార్థే :- చన్ద్రిప్రభా ప్రసరహాసిని సౌధపృష్ఠే
దుర్లక్షపక్షతిపుటాం న వివేద జాయామ్.
మూఢశ్రుతిర్ఝుభరనూపురనిఃస్వనేన
వ్యాహారిణీమపి పురో గృహరాజహంసః. 26

ద్వితీయా తత్రైవార్థే యథా:-

జ్యోత్స్నాజలస్నాయిని సౌధపృష్ఠే వివిక్తముక్తాఫలపుఞ్జగౌరమ్.
వివేద హంసీ దయితం కథఞ్చిచ్చలత్తులాకోటికలైర్నినాదైః." 27

వ్యా. ప్రాచీనశ్లోకములో నున్న ఒక అర్థముతో తుల్య మగు అర్థమును చెప్పి, అంతకంటె అధికమగు విషయమును కూడ కూర్చుట చూళిక. సంవాదిని అనియు విసంవాదిని అనియు అది రెండు విధములు. (సంవాదిని అనగా ప్రాచీనశ్లోకోక్తవిషయమును అనుసరించి యున్నది. విసంవాదిని అనగా దానికి విరుద్ధముగ నున్నది.) వాటిలో మొదటిదానికి ఉదాహరణ మెట్లనగా:-

''చంద్రకిరణములచే పూయబడిన వాకిలియందు నిద్రించుచున్నదియు, చంద్రకిరణసముదాయముతో సమాన మెనదియు అగు రాజహంసను చూడజాలక,

దుఃఖించుచున్నదై, ఆడుహంస, కన్నీటితో గద్గదస్వరము కలుగునట్లుగా, విలపించుచున్నది.'' (ఇది కుమారదాసుని జానకీహరణములోని శ్లోకము. 8 85)

ఈ అర్థమునందే:- "ఇంటిలో నుండెడు పెంపుడు రాజహంస, ధ్వని చేయుచున్న నూపురముల ధ్వనిచేత మూఢమైన చెవులు కలదై, వెన్నెలయొక్క ప్రసాదముచే నవ్వుచున్న (తెల్లగానున్న) సౌధోపరిభాగమునందు చూడశక్యము కాని (కానరాని) రెక్కలుగల భార్యను (తన భార్య యగు రాజహంసిని) అది ఎదుట ధ్వని చేయుచున్నను గుర్తింప లేదు.''

వి. వెనుకటి శ్లోకమున రాజహంసి రాజహంసను గుర్తింపజాలకపోయినది అని మాత్రమే చెప్పబడినది. ఈ శ్లోకమునందు ఆ విషయమునే కొంచెము మార్చి చెప్పుచు నూపురస్వనాదులగు క్రొత్త విషయములు కూడ కూర్పబడినవి. ఇది సంవాదినీ చూళిక. రాబోవు శ్లోకమున ఏతదర్థవిరుద్ధ మగు గుర్తించుట చెప్పబడినది గాన అది విసంవాదినీ చూళిక.

వ్యా. ఆ అర్థమునందే విసంవాదినీచూళిక ఎట్లనగా :-

''వెన్నెలనీటిచే స్నానము చేయించబడిన సౌధోపరిభాగమునందు, ఆడు హంస, శుభ్రమైన ముత్యముల రాశివలె తెల్లగా నున్న తన ప్రియుని, కదలు చున్న నూపురముల ధ్వనివలె మధురములైన ధ్వనులచే ఎటులనో గుర్తించినది''

మూ. నిషేధస్య విధినా నిబన్ధో విధానాపహారః. యథా :-

కురబక కుచాఘాతక్రీడారసేన వియుజ్యసే
బకులవిటపిన్ స్మర్తవ్యం తే ముఖాసవసేచనమ్.
చరణఘటనాశూన్యో యాస్యస్యశోక సశోకతా
మితి నిజపురత్యాగే యస్య ద్విషాం జగదుః ప్రియాః. 28

అత్రార్థే :- ముఖమదిరయా పాదన్యాసైర్విలాసవిలోకితై
ర్బకులవిటపీ రక్తాశోక స్తథా తిలకద్రుమః.
జలనిధితటీకాన్తారాణాం క్రమాత్ కకుభాం జయే
ఝగితి గమితా యద్వర్గ్యాభిర్వికాసమహోత్సవమ్. 29

వ్యా. నిషేధమును విధిరూపమున నిబంధించుట విధానాపహారము. ఎటనగా :- "ఓకురవకమా! కుచముల ఆఘాతము అనెడు క్రీడారసమునుండి

దూరము కాగలవు. వకులవృక్షమా! నీకు (నేను చేసిన) ముఖమధుసేవనము స్మరింపదగినది. ఓ అశోకమా! (మా) పాదస్పర్శతో శూన్యమైనదానవై సశోకత్వమును పొందగలవు. ఈ విధముగ ఎవని శత్రుస్త్రీలు, తమ పురమును విడిచిపోవుచు పలికిరో."

ఈ అర్థమునందే :

"దిగ్విజయము చేయుచున్నపుడు ఏ రాజుపక్షమునకు చెందిన స్త్రీలచే, సముద్రతటమునందలి అరణ్యములలోని వకులవృక్షము, రక్తాశోకవృక్షము, తిలకవృక్షము, క్రమముగ ముఖమదిరచేతను, పాదవిన్యాసములచేతను, విలాస దృష్టులచేతను వికాసమహోత్సవమును పొందింపబడినవో."

వి. పూర్వశ్లోకమున కురవకాదులకు యువతీకుచాఘాతాదిదోహదము లేకుండుటచే పుష్పవికాసము లేనట్లు వర్ణింపబడినది. ఈ శ్లోకమున అట్టి దోహదాదులు ఉన్నట్లు వర్ణింపబడినవి.

మూ. బహూనామర్థానామేకత్రోపసంహారో మాణిక్యపుఞ్జః.

యథా:- శైలచ్ఛలేన స్వం దీర్ఘం భుజముత్తమ్య భూవధూః
విలాసభ్యాః కరోతీవ శశాఙ్కతిలకం ముఖే. 80

యథా చ:- ఫుల్లాతిముక్తకుసుమస్తబకాభిరామ
దూరోల్లసత్కిరణకేసరమిన్దుసింహమ్।
దృష్ట్వోదయాద్రిశిఖరస్థితమన్ధకార
దుర్వారవారణఘటా వ్యఘటన్త సద్యః. 81

యథా చ:- సంవిధాతుమభిషేకముదాసే మన్మథస్య లసదంశుజలౌఘః.
యామినీవనితయా తతచిహ్నః సోత్పలో రజతకుమ్భ ఇవేన్దుః." 82

యథా చ:- ఉదయతి పశ్య కృశోదరి దలితత్వక్షీర (తవక్షీర) (త్వచిసార)
కరణిభిః కిరణైః.
ఉదయాచలచూడామణిరేష పురో రోహిణీరమణః 83

యథా చ:- ఉదయతి నవనీతపిణ్డపాణ్డుః
కుముదవనాన్యవఘట్టయన్ కరాగ్రైః

ఉదయగిరితటస్ఫుటాట్టహాసో
రజనివధూముఖదర్పణః శశాఙ్కః. 84

యథా చ:- ప్రోషితైః కేన్దుహంసేఽస్మిన్నస్నావివ తమోమ్బుభిః
నభస్తడాగే మదనస్మారాకుముదహాసిని. 85

అత్రార్థే:- రజనిపురన్ధ్రిశో(?)ధతిలకస్తిమిరద్విపయూథకేసరీ
రజతమయోభిషేకకలశః కుసుమాయుధమేదినీపతేః.
అయముదయాచలైకచూడామణి రభినవదర్పణో దిశా
ముదయతి గగనసరసి హంసస్యహాసన్నివ విభ్రమం శశీ. 86

వ్యా. అనేకార్థములను అనగా అనేకప్రాచీనశ్లోకములలో నున్న అర్థములను ఒక చోట కూర్చుట మాణిక్యపుంజము. ఎట్లనగా:- "భూమి యనెడు స్త్రీ, పర్వత మనెడు మిషచే, దీర్ఘమైన తన భుజమును పైకి ఎత్తి రాత్రి యనెడు సఖి యొక్క ముఖమునందు, చంద్రు డనెడు తిలకమును ఉంచుచున్నదా అన్నట్లుండెను''

ఇంకను ఎట్లనగా :- ''వికసించిన అతిముక్తలతాపుష్పముల గుత్తివలె మనోహర మైనవియు, దూరముగ వ్యాపించుచున్నవియు అగు కిరణము లనెడు జూలుగల, ఉదయాద్రిశిఖరముపై నున్న చంద్రు డనెడు సింహమును చూచి వెంటనే అంధకార మనెడు దుర్వారము లగు ఏనుగుల గుంపులు చెదిరిపోయినవి.,,

ఇంకను ఎట్లనగా :- ''జలసముదాయమువంటి ప్రకాశించుచున్న కిరణములు, స్పష్టమైన కలంకము గల చంద్రుడు, నల్లకలువలతో కూడిన రజత కుంభము వలె, మన్మథుని అభిషేకము చేయుటకై వనితవంటి రాత్రిచేత పైకి ఎత్తబడెను.,.

మరి యొక శ్లోకమెట్లనగా :- "నలగకొట్టబడిన తవక్షీర మనెడు మూలము వలెనున్న ('త్వచిసార'అను పాఠమున్నచో-''చీల్చబడిన వెదురు బద్దల వలె నున్న''అని యర్థము) కిరణములతో-ఓ కృశోదరీ చూడుము; ఉదయాచలమునకు చూడామణిగ నన్న ఈ చంద్రుడు ఎదుట, ఉదయించుచున్నాడు.,,

మరి యొక శ్లోక మెట్లనగా :- ''వెన్నముద్ద వలె తెల్లనైనవాడును. కరాగ్రములచేకలువల వనములను విడదీయుచున్నవాడును, (వికసింపచేయుచున్న)

ఉదయాద్రియొక్క స్ఫుటమైన అట్టహాస మైనవాడును, రజని అనెడు స్త్రీయొక్క అర్ధ మైన వాడును అగు, చంద్రుడు ఉదయించుచున్నాడు.''

మరియొక శ్లోక మెట్లనగా :- ''దూరముగా పోయిన చంద్రుడనెడు ఏకైక హంస కలదియు, నక్షత్రము లనెడు కలువలతో నవ్వుచున్నదియు అగు ఆకాశ మనెడు తటాకమునందు మన్మథుడు తమస్సు లనెడు ఉదకములతో స్నానము చేసెనా అన్నట్లుండెను.''

ఈ అర్థములను గ్రహించి వ్రాసిన శ్లోక మెట్లనగా :- ''రాత్రి యనెడు స్త్రీ యొక్క లోధతిలక మైనవాడును, చీకట్లనెడు ఏనుగుల గుంపునకు సింహమును, మన్మథమహారాజు యొక్క అభిషేకరజతకలశమును, ఉదయపర్వత మునకు ప్రధానచూడామణియు, దిక్కులం నూతనమైన సింహ మైనవాడును అగు చంద్రుడు గగనసరస్సునందు, హంసయొక్క విలాసను పరిహసించుచున్నవాడు వలె ఉదయించుచున్నాడు.

౨. వెనుకటి ఆరు శ్లోకములలో నున్న రూపకములను కొన్నిటిని ఈ శ్లోకమున కూర్చుట జరిగినది గాన ఇది మాణిక్యపుంజము.

మూ. కన్దభూతోఽర్థః కన్దలాయమానైర్విశేషైరభిధీయత ఇతి కన్దః. యథా:-

"విశిఖాముఖేషు విసరతి పుఞ్జీభవతీవ సౌధశిఖరేషు.
కుముదాకరేషు వికసతి శశికలశపరిస్రుతా జ్యోత్స్నా." 37

అత్రార్థే :- వియతి విసర్పతీవ కుముదేషు బహూభవతీవ యోషితాం
ప్రతిఫలతీవ జరఠశరకాణ్డపాణ్డుషు గణ్డభిత్తిషు.
అమ్బుసి వికసతీవ లసతీవ సుధాధవలేషు ధామసు
ధ్వజపటపల్లవేషు లలతీవ సమీరచలేషు చన్ద్రికా. 38

"స్ఫటికమణిఘట ఇవేన్దుస్తస్యామపిధానమాననమివాఙ్కః
క్షరతి చిరం తేన యథా జ్యోత్స్నా మనసారధూలిరివ." 39

''సితమణికలశాదిన్దోర్వారిజహరిత్తృణపిధానతో గలితైః
రజనిభుజిష్యా సించతి నభోఽఙ్గణం చన్ద్రికామ్భోభిః'' 40

''సంవిధాతుమభిషేకముదాసే మన్మథస్య లసదంశుజలౌఘః
యామినీవనితయా తతచిహ్నః సోత్పలో రజతకుమ్భఇవేన్దుః'' 41

వ్యా. మూలకందమైన అర్థము అంకురముల వలె విశేషములచే చెప్పబడినచో అది కందము ఎట్లనగా:-

''చంద్రు దనెడు కలశమునుండి స్రవించిన వెన్నెల వీథుల కొనలలో ప్రసరించుచున్నది. మేడల శిఖరములయందు పోగుపడుచున్నట్లున్నది. కలువల సరస్సులలో వికసించుచున్నది.''

ఈ అర్థమునందు:- ''వెన్నెల ఆకాశమునందు ప్రసరించుచున్నట్లున్నది. కలువలలో మిక్కుట మగుచున్నట్లున్నది. ముదిరిన రెల్లుకాడ వలె తెల్లనైన స్త్రీల గండభిత్తులయందు ప్రతిబింబించుచున్నట్లున్నది. ఆకాశమునందు వికసించు చున్నట్లున్నది. సున్నముచే తెల్లనైన గృహమునందు మెరయుచున్నట్లున్నది. వాయువుచే కదలుచున్న ధ్వజపటాగ్రములందు కదులుచున్నట్లున్నది.''

వి. పూర్వశ్లోకములో మొదటి మూడు పాదములలో నున్న అర్థము ఈ శ్లోకమున 'వియతి విసర్పతీవ' 'కుముదేషు బహూభవతీవ' లసతీవ సుధాధవలేషు ధామసు' అను వాక్యములలో విశేషరూపమున చెప్పబడినది. క్రింది మూడు శ్లోకములలో, పూర్వశ్లోకచతుర్థపాదార్థము విస్తరింపబడినది, కావున ఈ నాలుగు శ్లోకముల అర్థములు అంకురములు. పూర్వశ్లోకార్థము కందము.

(రెండవ ఉదాహరణము):- ఇచట 'తస్యామపిధాన' అనుటకు బదులు ''తస్యాపపిధాన'' అన్న పాఠమున్నచో యుక్తము.

''చంద్రుడు స్ఫటికమణిమయఘటము వలె నున్నాడు. కలంకము, ఆ కలశముయొక్క మూత లేని ముఖము వలె నున్నది. కావుననే వెన్నెల కర్పూర పరాగము వలె చాలసేపు కారిపోవుచున్నది''(మూడవ ఉదాహరణము):-''రాత్రి యనెడు సేవకురాలు, చంద్రుడనెడు స్ఫటికమణికలశమునుండి, లేడి యనెడు హరితవర్ణములైన తృణముల ఆచ్ఛాదనమునుండి జారిన, వెన్నెల యనెడు ఉదకములతో ఆకాశ మనెడు వాకలిని తడుపుచున్నది.''

'సంవిధాతుమ్' ఇత్యాది శ్లోకము మాణిక్యపుంజో దాహరణముగ కూడ చూపబడినది.

మూ. తా ఇమాస్తుల్యదేహితుల్యస్య పరిసంఖ్యాః. "సోఽయముల్లేఖ వాననుగ్రాహ్యో మార్గః" ఇతి సురానన్దః. తదాహ:-

"సరస్వతీ సా జయతి ప్రకామం దేవీ శ్రుతిః స్వస్త్యయనం కవీనామ్.
అనర్ఘతామానయతి స్వశక్త్యా యోల్లిఖ్య యత్కిఞ్చిదిహార్థరత్నమ్"42

వ్యా. ఇవి తుల్యదేహితుల్యార్థముయొక్క భేదములు. "నూతనార్థోల్లేఖముతో కూడిన ఈ అర్థము గ్రాహ్యమే" అని సురానందుడు చెప్పుచున్నాడు. ఈ విష యమున చెప్పుచున్నాడు:-

"కవులకు మంగళకారణభూతురాలును లేదా ఖ్యాతికి కారణభూతురాలును, శ్రుతిసారభూతయు అగు ఆ సరస్వతీదేవి మిక్కిలి సర్వోత్కర్షముతో నున్నది. ఏ సరస్వతి సామాన్య మగు అర్థ మనెడు రత్నమును కూడ తన భంగిచే జాసి, అమూల్యమైనదానినిగ చేయునో" (అనగా వాగ్భంగి విశేషముచే సామాన్యార్థము కూడ చమత్కారజనకమగును అని భావము.

మూ. అథ పరపురప్రవేశసదృశస్య భిదాః:- ఉపనిబద్ధస్య వస్తునో యుక్తిమతీ పరివృత్తిర్హుడుయుద్ధమ్

యథా:- కథమసౌ న భజత్యశరీరతాం హతవివేకపదో హతమన్మథః
ప్రహరతః కదలీదలకోమలే భవతి యస్య దయా న వధూజనే. 43

అత్రార్థే:- కథకుసౌ మదనో న నమస్యతాం
స్థితవివేకపదో మకరధ్వజః.
మృగదృశాం కదలీసదృశం వపు
ర్యదభిహన్తి శరైః కుసుమోద్భవైః. 44

వ్యా. ఇకపరపురప్రవేశసదృశార్థముయొక్క భేదములు. (ఇవి కూడ– హుండుయుద్ధ- ప్రతికఞ్చుక-వస్తుసంచార-ధాతువాద–సత్కార–జీవంజీవక–భావ ముద్రా-తద్విరోధు లని ఎనిమిది విధములు.

ప్రాచీనశ్లోకమున కూర్చిన వస్తువును యుక్తి పూర్వకముగ మార్చి చెప్పుట హుండుయుద్ధము. (హుండు = గొఱ్ఱె).

ఎట్లనగా :- "అరిటాకు వలె కోమలమైన వధూజనమును కొట్టుచున్న ఏ మన్మథునకు దయ అనునది లేదో, అట్టి వివేకరహితు డగు ఈ పాపు మన్మథుడు అశరీరత్వమును పొందకుండ ఎట్లుండును ?,,

ఈ అర్థమునందే—(ఈ యర్థమునే యుక్తిపూర్వకముగ మార్చి చెప్పుటకు ఉదాహరణము) :—

"వివేకవంతు డగు ఈ మకరధ్వజుడైన మన్మథుడు ఏల నమస్కరింప బడకుండును ? (మన్మథుని ఏల నమస్కరింపరాదు ?) ఏలననగా—అరిటాకు వలె సుకుమార మగు మృగనయనల శరీరమును ఈతడు పుష్పమయములైన బాణములతో కొట్టుచున్నాడు.,,

మూ. ప్రకారాన్తరేణ విసదృశం యద్వస్తు తస్య నిబన్ధః ప్రతికఞ్చుకమ్. యథా :-

> "మాద్యచ్చకోరేక్షణ తుల్యధామ్నో ధారాం దధానా మధునః పతన్తీమ్
> చఞ్చ్వగ్రదష్టోత్పలనాలహృద్యా హంసీవ రేజే శశిరత్నపాత్రీ " 45
>
> అత్రార్థే :- మసారపాత్రేణ బభౌ దధానా కాచిత్సురాం విద్రుమనాలకేన
> పల్లారవల్లీం దధతేవ చఞ్చ్వా కేలీశుకేనాఞ్జలినా ధృతేన.46

వ్యా. ప్రాచీనరచనలో నున్న వస్తువుతో పోలిక లేని వస్తువును ప్రకారాంతరముచే కూర్చుట ప్రతికఞ్చుకము.

ఎట్లనగా :- "మదించిన చకోరపక్షి నేత్రములతో సమానమైన కాంతి గల మధువుయొక్క పడుచున్న ధారను దరించి యున్న చంద్రకాంతమయమధు పాత్ర ముక్కున ఉత్పలనాలమును కరచికొని మనోహరముగ నున్న ఆడహంస వలె ప్రకాశించెను.,,

ఈ అర్థమునందే- "పొగడములతో చేసిన కొమ్ముగల మరకతమాణిక్య వికారమైన మధుపాత్రతో మద్యమును ధరించియున్న ఒక వనిత, ముక్కున వల్లారపుష్పమంజరిని గ్రహించి యున్న పెంపుడు చిలుకను దోసిలిలో పట్టుకున్నది వలె ప్రకాశించెను."

ప్రతికంచుక మనగా వేరురంగు చొక్కా. మొదటి శ్లోకమున నల్లది కొమ్ముతో నున్న తెల్లని పానపాత్రను వర్ణింపగా రెండవ శ్లోకమున ఎఱ్ఱని కొమ్ము గల ఆకుపచ్చని పానపాత్ర వర్ణింపబడినది.

మూ. ఉపమానస్యోపమాన్తరపరివృత్తిర్వస్తుసంచారః.

యథా:- "అవిరలమివ దామ్నా పౌణ్డరీకేణ బద్ధః
స్నపిత ఇవ చ దుగ్ధస్రోతసా నిర్భరేణ.
కవలిత ఇవ కృత్స్నశ్చక్షుషా స్ఫారితేన
ప్రసభమమృతమేఘేనేవ సాన్ద్రేణ సిక్తః." 47

అత్రార్థే:- "ముక్తానామివ రజ్జవో హిమరుచేర్మాలాః కాలానామివ
క్షీరాబ్ధేరివ వీచయః క్లమముషః పీయూషధారా ఇవ.
దీర్ఘాపాఙ్గనదీం విలఙ్ఘ్య సహసా లీలానుభావాఞ్చితాః 48
సద్యః ప్రేమభరోల్లసా మృగదృశో మామభ్యషిఞ్చన్ దృశః."

వ్యా॥ ఒక ఉపమానమును మార్చి మరి యొక ఉపమానమును ప్రయోగించుట వస్తుసంచారము. ఎట్లనగా:- (ఈ శ్లోకము మాలతీమాధవీయములోనిది. నాయకుడు మిత్రునితో చెప్పుచున్నాడు) "(ఆమె నన్ను చూచినపుడు) — పద్మముల మాలతో దట్టముగ కట్టబడినట్లైతిని. అత్యధికమగు పాల ప్రవాహములో ముంచబడినట్లు ఐతిని. వికసింపచేసిన నేత్రముతో పూర్తిగ మ్రింగివేయబడినట్లైతిని. దట్టమైన అమృతమేఘముచే బలాత్కారముగ తడపబడినట్లైతిని."

ఈ అర్థమునందే :- "విలాససమంచితములును, ప్రేమభారముతో ప్రకాశించుచున్నవియూ అగు ఆ మృగాక్షి చూపులు దీర్ఘమగు నేత్రాంత మనెడు నదిని వెంటనే దాటి ముత్యములతో తయారుచేసిన త్రాళ్ళు వలె, చంద్రకళల మాలలు వలె, క్షీరాబ్ధితరంగములు వలె, శ్రమను తొలగించు అమృతధారలు వలె, వెంటనే నన్ను తడిపివేసినవి."

వి. పూర్వశ్లోకమున, చూపులకు పద్మమాలాదులు ఉపమానముగ చెప్పబడినవి, ఈ శ్లోకమున ముక్తారజ్జ్వాదులు ఉపమానములు.

మూ. శబ్దాలఙ్కారస్యార్థాలఙ్కారేణాన్యథాత్వం ధాతువాదః. యథా :-
"జయన్తి బాణాసురమౌలిలాలితా దశాస్యచూడామణిచక్రచుమ్బినః
సురాసురాధీశశిఖాన్తశాయినో భవచ్ఛిదస్త్ర్యమ్బకపాదపాంసవః" 49

అత్రార్థే :- సన్మార్గాలోకనప్రౌఢసిత టీకృతజనవః
జయన్త్యపూర్వవ్యాపారాః పురారేః పాదపాంసవః". 50

వ్యా. శబ్దాలంకారమునకు అర్థాలంకారమును ప్రయోగించుట ధాతువాదము ఎట్లనగా :—

"బాణాసురుని శిరస్సుపై లాలింపబడినట్టియు, దశవదనుని శిరస్సు లందలి మాణిక్యముల సముదాయమును స్పృశించునవియు, దేవతాధీశుల యొక్కయు, అసురాధీశులయొక్కయు శిఖాంతమునందు శయనించునవియు. సంసారచ్ఛేదకములును అగు ఈశ్వర పాదపరాగములు సర్వోత్కర్షగ నున్నవి." (ఇది బాణభట్టుని కాదంబరిలోనిది).

వి. ఈ శ్లోకములో లకార-చకార - శకారాదుల ఆవృత్తిచే వృత్త్యను ప్రాసాలంకార మను శబ్దాలంకారము.

వ్యా. ఈ అర్థమునందే :- "సన్మార్గమును చూచుటకు తగిన సామ ర్థ్యముచే రజోరహితులుగ చేయబడిన ప్రాణులు గలవియు, కావుననే అపూర్వ మైన వ్యాపారము కలవియు అగు; మహేశ్వరుని పాదపరాగములు, సర్వో త్కర్షగ నున్నవి."

వి. ఇచట పరాగములు, రజస్సు లేకుండ చేసి చూడకల్గునట్లు చేయుట విరుద్ధము, కాని రజఃశబ్దమునకు రజోగుణ మను అర్థమును గ్రహించుటచే విరోధపరిహారము. కావున ఇచట పూర్వశ్లోకవర్ణితములగు శివపాదపాంసువులనే వర్ణించుచు శబ్దాలంకారమునకు మారుగ విరోధాభాస మను అర్థాలంకారము ప్రయోగింపబడినది.

మూ. తస్యైవ వస్తున ఉత్కర్షేణాన్యథాకరణం సత్కారః.

యథా :- స్నానార్ద్రార్ద్రైర్వ్రిధుతకబరీబన్ధలోలై రిదానీం
శ్రోణీభారః కృతపరిచయః పల్లవైః కున్తలానామ్.
అప్యేతేభ్యో నభసి పతతః పఙ్క్తిశో వారిబిన్దూన్
స్థిత్వోద్గ్రీవం కువలయదృశాం కేవిహంసాః పిబన్తి". 51

అత్రార్థే:-శ్లో: "లక్ష్మ్యాః క్షీరనిధేరుదక్తవపుషో వేణీలతాగ్రచ్యుతా
యే ముక్తాగ్రథనామసూత్రసుభగాః ప్రాప్తాః పయో బిన్దవః.
తే వఃపాన్తు విశేషసస్పృహదృశాదృష్టాశ్చిరం శార్ఙ్గిణా
హేలోద్గ్రీవబలేశహంసవనితాలీఢాః సుధాస్వాదవః." 52

వ్యా. ప్రాచీన శ్లోకవర్ణితమగు విషయమునే, కొంచెము ఉత్కృష్ట మగు అంశమును కూర్చి మరి యొక విధముగ చేయుట సత్కారము. ఎట్లనగా -

''స్నానార్ద్రార్ద్రైః'' మొ. (ఇది సంసృష్టమునకు ఉదాహరణముగ ద్వాదశాధ్యాయమున చూపబడినది.) ఈ యర్థమునందే-

"క్షీరసముద్రమునుండి అప్పుడే బయటకు వచ్చిన తడిసిన శరీరము గల లక్ష్మియొక్క వేణీలతయొక్క అగ్రభాగమునుండి జారినవియు, ('అసూత్రసుభగామ్' అని ద్వితీయైకవచనాన్తపాఠ మున్న బాగుండును) దారము లేకపోయినను సుందరముగా నున్న ముత్యముల కూర్పును పొందిన (ముత్యముల కూర్పువలె నున్న) వియు, అత్యధిక మగు ఆసక్తితో కూడిన చూపులతో విష్ణువుచే చాలసేపు చూడబడినవియు, సవిలాసముగ మెడలు పైకెత్తి సముద్రమునందలి హంసవనితలచే ఆస్వాదింపబడినవియు, అమృతమువలె మధురమైనవియు అగు క్షీరబిందువులు మిమ్ములను రక్షించుగాక.''

వి. "కేశాగ్రములనుండి జారుచున్న వారిబిందువులను హంసలు త్రాగుట" అను విషయమును ప్రాచీనశ్లోకమునుండి గ్రహించి దానికి ఇచట లక్ష్మి-నారాయణాదుల సంబంధము కల్పించుటచే ఏర్పడిన ఉత్కర్షతో వర్ణించుట జరిగినది గాన ఇది సత్కారము.

మూ. పూర్వం సదృశః పశ్చాద్భిన్నో జీవఞ్జీవకః. యథా:-
"నయనోదరయోః కపోలభాగే రుచిమద్రత్నగణేషు భూషణేషు.
సకలప్రతిబిమ్బితేన్దుబిమ్బా శతచన్ద్రాభరణేవ కాచిదాసీత్.'' 58
అత్రార్థే:- ''భాస్వత్కపోలతలకుణ్డలహారిహార
సన్మేఖలామణిగణప్రతిబిమ్బితేన.
చన్ద్రేణ భాతి రమణీ రమణీయకాన్తి
శోభాభిభూతవపుషేవ నిషేవ్యమాణా.

వ్యా. మొదట సాదృశ్యము కలిగి యుండి తరువాత వేరుగా నుండునది జీవంజీవకము. ఎట్లనగా—

"నేత్రమధ్యములందును, కపోలములందును, ప్రకాశించుచున్న రత్నగణములు గల అలంకారములందును, ప్రతిబింబించిన సకల (పూర్ణ) చంద్రబింబము గల ఒక వనిత, అనేకచంద్రులే ఆభరణముగ కలది వలె అయెను.''

ఈ అర్థమునందే :— ''ప్రకాశించుచున్న కపోలతలములందును, కుండల-కంకణ- మేఖలలోని మాణిక్యసముదాయమునందును ప్రతిబింబించిన చంద్రునితో

ఆ రమణి, సుందరముఖశోభచే తిరస్కరింపబడిన శరీరము గల ఆ చంద్రునిచే సేవింపబడుచున్నది వలె ప్రకాశించుచున్నది."

వి. పూర్వశ్లోకప్రారంభమునందు, ఈ శ్లోకము ప్రారంభమునందు కూడ చంద్రుడు ప్రతిబింబించుట వర్ణింపబడినది. కాని ఉత్తరార్థమున ఉత్ప్రేక్ష ఒకటి అధికముగా చేర్చబడినది.

మూ. ప్రాక్తనవాక్యాభిప్రాయనిబద్ధో భావముద్రా :-

యథా - తామ్బూలవల్లీపరిణద్ధపూగా స్వేలాలతాలిఙ్గితచన్దనాసు.
తమాలపత్రాస్తరణాసు రన్తుం ప్రసీద శశ్వన్మలయస్థలీషు.''

అత్రార్థే :- "నిశ్చేతనానామపి యుక్తయోగదో నూనం స ఏనం మదనోఽధితిష్ఠతి
ఏలా యదాశ్లిష్యతీహ చన్దనం పూగద్రుమం నాగలతాధిరోహతి''ఇతి

వ్యా. ప్రాచీనవాక్యముయొక్క అభిప్రాయమును అనగా అందలి నిగూఢ భావమును కూర్చుట భావముద్ర ఎట్లనగా :- (ఈ శ్లోకము రఘువంశములోని ఇందుమతీ స్వయంవరఘట్టములోనిది. దక్షిణదేశరాజును చూపి సునంద యను సఖి ఇందుమతితో చెప్పిన మాట లివి.)

''తాంబూలలతలచే చుట్టుకొనబడిన పోకచెట్లు కలవియు, ఏలాలతలచే అలింగితము లగు చందనవృక్షములు కలవియు, తమాలపత్రముల ఆస్తరణములుగలవియు అగు మలయప్రాంతస్థలులయందు ఎల్లప్పుడును విహరించుటకు అనుగ్రహింపుము." అనగా ఈ రాజును వివాహమాడుము.

ఈ అర్థమునందే- "నిశ్చేతనపదార్థములకుకూడ యుక్తమైన సంబంధమును కూర్చు మన్మథుడు ఈతనిని ఆశ్రయించి యున్నాడు. నిశ్చయము. ఏల ననగా, ఏలకుల తీగ ఇచట చందనవృక్షమును కౌగలించుకున్నది. తాంబూల లత పోకచెట్టుపైకి ఎక్కుచున్నది."

పూర్వశ్లోకమున, తాంబూలవల్లి పూగవృక్షములను, ఏలాలతలు చందన వృక్షములను అలింగనము చేసికొని యున్నట్లు వర్ణించుటలోని భావము ఈ శ్లోకమున స్పష్టీకరింపబడినది.

మూ. పూర్వార్థపరిపన్థినీ వస్తురచనా తద్విరోధీ

యథా:- ''హారో వక్షసి దన్తపత్రవిశదం కర్ణే దలం కౌముదం
మాలా మూర్ధ్ని దుకూలినీ తనుభృతా కర్పూరశుకౌ స్తనౌ

వక్త్రే చన్దనబిన్దురిన్దుధవలం బాలం మృణాలం కరే
వేషః కిం సిత ఏష సున్దరి శరచ్చన్ద్రాత్త్వయా శిక్షితః 57

అత్రార్థే:- "మూర్తిర్నీలదుకూలినీ మృగమదైః ప్రత్యఙ్గపత్త్రక్రియా
బాహూ మేచకరత్నకఙ్కణభృతౌ కణ్ఠే మసారావలీ.
వ్యాలమ్బాలకవల్లరీకమలికం కాన్తాభిసారోత్సవే
యత్సత్యం తమసా మృగాక్షి విహితం వేషే తవాదార్యకమ్" 58

వ్యా. ప్రాచీనరచనలో నున్న అర్థమునకు విరుద్ధ మగు అర్థమును కూర్చిన రచన తద్విరోధి అనగా భావముద్రావిరోధి. ఎట్లనగా:- "వక్షః స్థలము నందు హారము; కర్ణమునందు దంతపుదువ్వెన్న వలె తెల్ల నైన తెల్లకలువ రేకు; (కౌముదస్' అనుదానిని 'కౌముదీ' అనిమార్చి 'మాలా' కు విశేషణము చేయవలెను) శిరస్సుపై తెల్లకలువల మాల: తెల్లని పట్టువస్త్రము ధరించిన శరీరము; కర్పూరము పూయుటచే తెల్లనైన స్తనములు; ముఖమునందు మంచి గంధపుతిలకము; హస్తమునందు చంద్రుని వలె తెల్ల నైన బాలమృణాలము-ఈ తెల్లని వేష మంతయు, ఓసుందరి! నీచే శరత్కాలచంద్రునినుండి నేర్చుకొన బడినదా?" (ఇవి శుక్లపక్షాభిసారికతో పలికిన మాటలు),

ఈ అర్థమునందే:- "శరీరము నీలిరంగు పట్టుచీర కలది; కస్తూరిచే శరీరావయవములపైపత్త్రరచన;బాహువులు ఇంద్రనీలమణికంకణములను ధరించినవి; కంఠమునందు మరకతమణిహారము, లలాటము వ్రేలాడుచున్న ముంగురులు కలది. ఓ ! మృగాక్షీ కాన్తాభిసారోత్సవసమయమున ఇట్టి వేషమును ధరించుటలో నీకు తమస్సుచే గురుత్వము చేయబడినది. (తపస్సు నీకు గురు వైనది)".

వి. ఈ శ్లోకమున పూర్వశ్లోకమునందలి శుక్లపక్షాభిసారికకు విరుద్ధమైన కృష్ణపక్షాభిసారిక వర్ణింపబడినది కావున ఇది భావముద్రావిరోధి.

మూ. ఇత్యర్థహరణోపాయా ద్వాత్రింశదుపదర్శితాః
హానోపాదాన విజ్ఞానే కవిత్వం తత్ర మాం ప్రతి. 59

వ్యా. "ఈ విధముగ ముప్పదిరెండు అర్థహరణోపాయములు చూపబడినవి. నా అభిప్రాయము ప్రకారము, వీటిలో ఏ అంశములను త్యజింపవలెనో, ఏ అంశములను స్వీకరింపవలెనో తెలిసికొనగల్గుటయే కవిలక్షణము,"

మూ. కించైతే హరణోపాయా జ్ఞేయాః సప్రతియోగినః
అర్థస్య వైపరీత్యేన విజ్ఞేయా ప్రతియోగితా. 60

వ్యా. "మరియు ఈ హరణోపాయములకు ప్రతియోగులు ఉన్నవను విషయమును కూడ తెలియవలెను. ప్రతియోగి అనగా చెప్పిన అర్థమునకు విపరీతమైన అర్థము."

వి. ఇచట చెప్పిన అర్థహరణోపాయములకు విరుద్ధముగ చేసినచో అది హానోపాయము. అనగా అట్టి విధముగ అర్థమును గ్రహింపరాదు.

శ్లో :- శబ్దార్థశాసనవిదః కతి నో కవన్తే
యద్వాఙ్మయం శ్రుతిధనస్య చకాస్తి చక్షుః.
కిన్త్వస్తి యద్వచసి వస్తు నవం సదుక్తి-
సన్దర్భిణాం స ధురి తస్య గిరః పవిత్రాః 61

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే అర్థహరణేష్వాలేఖ్యప్రఖ్యాదిభేదాస్త్రయోదశోఽధ్యాయః.

వ్యా. మరియు-"శబ్దశాసనార్థశాసనవేత్తలు అనగా వైయాకరణనైయాయిక—మీమాంసకాదులు, ఎందరు కవిత్వము చెప్పుట లేదు ? ఏలనన శ్రుతిధనుని, అనగా విశిష్టశాస్త్రాభ్యాసము చేసినవాని వాఙ్మయనేత్రము బాగుగ ప్రకాశించును. కాని ఎవని వాక్కునందు నూతనమైన వస్తువు ఉన్నదో అతడే సత్కావ్యరచయితలలో అగ్రగణ్యుడు. అతని వాక్కులు పవిత్రమైనవి.

బాలానందినిలో త్రయోదశాధ్యాయము సమాప్తము.

చతుర్దశోఽధ్యాయః- జాతిద్రవ్యక్రియా సమయస్థాపనా

మూ. అశాస్త్రీయమలౌకికం చ పరమ్పరాయాతం యమర్థముపనిబధ్నన్తి కవయః స కవిసమయః.

వ్యా. కవులు, అశాస్త్రీయము, లోకవిరుద్ధము అగు ఏ పరంపరాప్రాప్తమగు (అనగా సంప్రదాయమును బట్టి అనుస్యూతముగా వచ్చుచున్న) అర్థమును తమ కావ్యములందు కూర్చుచుందురో అది కవిసమయము.

మూ. ''నన్వేష దోషః. కథంకారం పునరుపనిబధ్నాన్తి?'' ఇత్యాచార్యాః. "కవిమార్గానుగ్రాహే కథమేష దోషః'' ఇతి యాయావరీయః. ''నిమిత్తం తర్హి వాచ్యమ్" ఇత్యాచార్యాః. 'ఇదమభిధీయతే' ఇతి యాయావరీయః

వ్యా. శాస్త్రవిరుద్ధము లోకవిరుద్ధమైనది దోషము కదా? దీనిని కావ్యములలో కూర్చుట ఎట్లు?'' అని ఆచార్యులు. "కవిమార్గము ననుగ్రహించు ఈ కవిసమయము దోష మెట్లగును?'' అని యాయావరీయుడు. ''అట్లైన దానికి హేతువును చెప్పవలెను'' అని ఆచార్యులు. ''ఇదిగో చెప్పుచున్నాము" అని యాయావరీయుడు.

వి. భామహోద్భటదండ్యాదులు కావ్యసమయములను గూర్చి ఏమియు చెప్పలేదు. కాని శాస్త్రలోకవిరుద్ధార్థగ్రథనము దోష మని వారు చెప్పినారు. రాజశేఖరుడు పరంపరాగతము లగు కవిసమయములు గ్రాహ్యములే అని ప్రతిపాదించుచున్నాడు.

మూ. పూర్వే హి విద్వాంసః సహస్రశాఖం సాఙ్గం చ వేద మవగాహ్య, శాస్త్రాణి చావబుద్ధ్య, దేశాన్తరాణి, ద్వీపాన్తరాణి, చ పరిభ్రమ్య, యానర్థానుపలభ్య ప్రణీతవన్తస్తేషాం దేశకాలాన్తరవశేన అన్యథాత్వేఽపి తథాత్వేనోపనిబన్ధః యః స కవిసమయః. కవిసమయశబ్దశ్చాయం మూలమపశ్యద్భిః ప్రయుక్తో రూఢశ్చ. తత్ర కశ్చిదాన్యత్వేన వ్యవస్థితః కవిసమయేనార్థః, కశ్చిత్పరస్పరోపక్రమార్థం స్వార్థాయ ధూర్తైః ప్రవర్తితః.

వ్యా. ప్రాచీనవిద్వాంసులు. సహస్రశాఖశాకలదియు, సాంగమును అగు వేదమును అధ్యయనము చేసి, శాస్త్రములను పఠించి, దేశాంతరములందును, ద్వీపాంతరములందును సంచరించి, ఏ విషయములను గ్రహించి రచించిరో ఆ విషయములు దేశాంతరములందును, కాలాంతరమునందును వేరు విధముగ నున్నను, వాటిని అటులనే, అనగా వారు చెప్పిన విధముననే కూర్చుటకు కవిసమయ మని పేరు. మూలమును చూడక ప్రయోగమాత్రమును చూచిన తరువాతి కవులచే ప్రయుక్త మగు ఈ 'కవిసమయ' శబ్దము ఇపుడు రూఢమైపోయినది.

కొన్ని విషయములు చిరకాలమునుండి కవిసంప్రదాయసిద్ధముగ వచ్చుచు కవిసమయలుగ స్థిర మైపోయినవి. కొన్ని విషయములను ధూర్తులు తమ ప్రయోజనములను సాధించుకొనుటకై, వారిలో వారు సంప్రదించుకొని ప్రారంభించిరి.

వి. కవిసమయములలో రెండు విధము లైనవి కనబడుచున్నది. వాటిలో అతిప్రాచీనకాలమునుండి వచ్చు కవిసమయములకు దేశాంతరములందో, ద్వీపాంతరములందో, కాలాంతరమునందో, మనకు లభ్యమానములు కాని శాస్త్రములందో ఆధారము ఉండవచ్చును. అవి పరిగ్రాహ్యములే. కాని కొన్ని కవిసమయము లనునవి ప్రచారములో నున్నవి కదా అని కొందరు ధూర్తులు, వారిలో వారు సంప్రదించుకొని క్రొత్తవాటిని కల్పించినారు. భామహాదులు దోషము లని పేర్కొన్న శాస్త్రలోకాదివిరుద్ధార్థము లనగా ఇట్టి కాల్పనికకవిసమయములే. అవి మాత్రము పరిగ్రాహ్యములు కావని రాజశేఖరుని అభిప్రాయము. కవిసమయములను గూర్చి ఇంత విస్తృతవర్ణనము ప్రప్రథమముగ రాజశేఖరుడే చేసినాడు. హేమచంద్రాదు లితనినుండియే గ్రహించి కొన్ని నూతనోదాహరణములు మాత్రమే చేర్చినారు.

మూ. స చ త్రిధా–స్వర్గ్యో, భౌమః, పాతాలీయశ్చ. స్వర్గ్యపాతాలీయ యోర్భౌమః ప్రధానః, స హి మహావిషయః. స చ చతుర్ధా–జాతి–ద్రవ్య–గుణ–క్రియారూపార్థతయా. తేఽపి ప్రత్యేకం త్రిధా–అసతో నిబన్ధనాత్, సతోఽప్య నిబన్ధనాత్, నియమతశ్చ.

వా. స్వర్గము (స్వర్గసంబంధి) భౌమము (భూలోకసంబంధి) పాతాలీయము అని కవి సమయము మూడు విధములు, స్వర్గ్యపాతాలీయములకంటె భౌమము

ప్రధానము. (ఇచట షష్ఠీ ప్రయోగము చింత్యము). ఏలనన దాని విషయము అతివిస్తృతము. జాతి-ద్రవ్య-గుణ-క్రియారూప మగు అర్థముగ అది (భోమకవి సమయసిద్ధార్థము) నాలుగు విధములు. జాత్యాద్యర్థములు కూడ లేని దానిని కూర్చుట, ఉన్నదానిని నిబంధింపకుండుట. నియమిత రూపమున కూర్చుట అను మూడు భేదములచే ఒక్కొక్కటి మూడేసి విధములు.

మూ. తత్ర సామాన్యస్యాసతో నిబన్ధనం యథా:-

నదీషు పద్మోత్పలాదీని, జలాశయ మాత్రేఽపి హంసాదయః, యత్ర తత్ర పర్వతేషు సువర్ణరత్నాదికం చ.

వ్యా. అందు లేని సామాన్యమును (జాతిని) ఉన్నట్లువర్ణించుట ఎట్లనగా:- నదులలో పద్మములు. కలువలు మొదలగునవియు, ప్రతిజలాశయమునందును హంసాదులును, పర్వత మను పేరు కల ప్రతిదానిపైనను బంగారము, రత్నములు మొదలగునవియు ఉన్నట్లు వర్ణించుట.

మూ. నదీపద్మాని యథా:-

దీర్ఘీకుర్వన్ పటు మదకలం కూజితం సారసానాం

ప్రత్యూషేషు స్ఫుటితకమలామోద మైత్రీకషాయః

యత్ర స్త్రీణాం హరతి సురతగ్లానిమఙ్గానుకూలః

శిప్రావాతః ప్రియతమ ఇవ ప్రార్థనాచాటుకారః" 1

వ్యా. నదిలో పద్మము లున్నట్లు వర్ణించుటకు ఉదాహరణము : (ఈ శ్లోకము మేఘ సందేశములోనిది) "ఏ ఉజ్జయిని నగరమునందు, మదముచే మధురమైనదియు గంభీరమైనదియు అగు సారసపక్షుల కూజితమును దీర్ఘ మగునట్లు చేయుచున్నదియు, ప్రాతఃకాలములందు వికసించిన పద్మముల సువాసన యొక్క సంబంధముచే కషాయమైనదియు, శరీరమునకు సుఖకరమైనదియు అగు, శిప్రానదినుండి వీచు వాయువు, ప్రార్థనయందు చాటువాక్యములను పలుకు, ప్రియతముడు వలె సురతమువలన కలిగిన స్త్రీల అలసటను తొలగించుచున్నదో,"

వి. ప్రవాహరూపములో నున్న నదిలో పద్మము లుండవు. అయినను శిప్రానదిలో పద్మము లున్నట్లు వర్ణింపబడినది.

మూ. నదీనీలోత్పలాని :-

"గగనగమనలీలాలమ్బితాన్ స్వేదబిన్దూన్
మృదుభిరనిలవారైః ఖేచరాణాం హరన్తీమ్
కువలయవనకాన్త్యా జాహ్నవీం సోఽత్యపశ్యత్
దినపతిసుతయేవ వ్యక్తదత్తాఙ్కపాలీమ్." 2

ఏవం నదీకుముదాద్యపి.

వ్యా. నదియందు నీలోత్పలవర్ణనము :- "మృదువైన వాయుసముదాయములచే, ఆకాశప్రయాణలీలచే కలిగిన దేవతల స్వేదబిందువులను హరించుచున్నదియు, నల్లకలువల వనముయొక్క కాంతిచే, యమునానదిచే ఒడిలోనికి తీసికొనబడినదివలె కనబడుచున్న, జాహ్నవిని, అతడు చూచెను."

వ్యా. నదిలో కుముదాదులు (తెల్లకలువ మొదలగునవి) ఉన్నట్లు వర్ణన కూడ ఇట్లే గ్రహింపవలెను.

మూ. సలిలమాత్రే హంసా యథా—

ఆసీదస్తి భవిష్యతీహ స జనో ధన్యో ధనీ ధార్మికః
యః శ్రీకేశవవత్కరిష్యతి పునః శ్రీమత్కుడుఙ్గేశ్వరమ్.
హేలాన్దోలితహంససారసకులక్రేఙ్కారసమ్మూర్ఛితై
రిత్యాఘోషయతీవ తన్నవనదీ యచ్చేష్టితం వారిభిః." 3

వ్యా. ప్రతిజలమునందును హంసలున్నట్లు వర్ణనమునకు ఉదాహరణము:-

ప్రకరణము తెలియకపోవుటచే దీని అర్థము అస్పష్టముగ నున్నది. కుడుంగేశ్వరము ఏదైన క్షేత్రము కావచ్చును.

"ఈ కుండుంగేశ్వరమును ఎవడు మరల, శ్రీకేశవుడు వలె, ఐశ్వర్యభరితమైనదానినిగా చేయునో ఆ జనుడు ధన్యుడుగను, ధనవంతుడుగను, ధార్మికుడుగనుఅయి ఉండెను, ఉన్నాడు, కాగలడు' అని నూతనముగా నేర్పడిన ఈ నది విలాస పూర్వకముగా ఊగుచున్న హంసలయొక్కయు, సారస పక్షులయొక్కయు, క్రేంకారధ్వనులతో వ్యాప్తము లైన ఉదకములచే ఏ శ్రీకేశవుని చేష్టను చాటించుచున్నట్లున్నదో."

వి. ఇచట క్రొత్తగా వర్షాములచే ఏర్పడిన నదిలో హూక హంసాదు లున్నట్లు వర్ణింపబడినది.

మూ. పర్వతమాత్రే సువర్ణం యథా:—

శ్లో. నాగావాసశ్చిత్రపోతాభిరామః స్వర్ణస్ఫీతి వ్యాప్తదిక్చక్రవాలః
సామ్యాత్సఖ్యం జగ్మి వానమ్బురాశే రేష ఖ్యాతస్తేన జీమూతభర్తా" 4

వ్యా. ప్రతి పర్వతమునందును బంగార మున్నట్లు వర్ణనమునకు ఉదాహరణ మెట్లనగా:- "నాగములకు (ఏనుగలు, సర్పములు) నివాసస్థాన మైనట్టియు, చిత్రమైన పోతములచే (లోయలు; ఓడలు మనోహర మైనదియు, స్వర్ణము యొక్క (బంగారము; మంచి జలము అధిక్యముచే వ్యాప్తమైన దిక్చక్రము కలదియు అగు ఈ పర్వతము, సామ్యముండుటవలన సముద్రముతో సఖ్యమును పొందినది. అందుచేతనే ఇది జీమూతభర్త (మేఘములను మోయునది, మేఘములను పోషించునది) అని ప్రసిద్ధి పొందినది"

మూ. రత్నాని యథా:—

శ్లో. "నీలాశ్మరశ్మిపటలాని మహేభముక్త
సూత్కారసీకరవిసృష్ట తటాన్తరేషు.
ఆలోకయన్తి సరలీకృతకణ్ఠనాలాః
సానన్దమమ్బుదధియాత్ర మయూరనార్యః" 5

వ్యా. పర్వతమాత్రమున రత్నము లున్నట్లు వర్ణనమునకు ఉదాహరణము:— "ఈ పర్వతమునందు, చరియల మధ్యలందు, మహాగజములచే విడువబడిన సూత్కారముల తుంపురులను విడచుచున్న ఇంద్రనీలమాణిక్యముల కాంతి సముదాయములను, ఆడనెమళ్లు, చాపబడిన కంఠనాలములు కలవై, మేఘము లనెడు బుద్ధిచే ఆనందపూర్వకముగ చూచుచున్నవి."

లేని జాతిని ఉన్నట్లుగ వర్ణించుటకు ఇతరోదాహరణములను గూడ ఇట్లే చూచుకొనవలెను.

మూ. సతోఽప్య నిబన్ధనమ్. తద్యథా:-న మాలతీ వసన్తే. న పుష్పఫలం చన్దనద్రుమేషు. న ఫలమశోకేషు. తత్ర ప్రథమః.

శ్లో "మాలతీ విముఖశ్చైత్రో వికాసీ పుష్పసమ్పదామ్
ఆశ్చర్యం జాతిహీనస్య కథం సుమనసః ప్రియాః" 6

వ్యా. ఉన్నదానిని కూడ వర్ణింపకుండుట. ఎట్లనగా:- వసంతమున మాలతీపుష్పములులేనట్లును, చందనవృక్షములందు పుష్పఫలములు లేనట్లును, అశోకములందు ఫలములు లేనట్లును వర్ణించుట అందు మొదటిదానికి ఉదాహరణము:- "పుష్పసంపదలను వికసింపచేయు చైత్రము (వసంతము) మాలతి విషయమున విముఖముగ నున్నది. జాతిహీనునకు (జాతి అనగా మాలతి ఉత్తమజాతి) సుమనస్సులు (పుష్పములు, దేవతలు) ఎట్లు ప్రియమైనవో ఆశ్చర్యము:

మూ, ద్వితీయముః:-
''యద్యపి చన్దనవిటపీ విధినా ఫలకుసుమవర్జితో విహితః.
నిజవపుషైవ పరేషాం తథాపి సన్తాపమపహరతి,'' 7

వ్యా. రెండవ దానికి ఉదాహరణము;- ''చందనవృక్షము, దైవముచే పుష్పఫలములులేనిదిగచేయబడినను, తన దేహముచేతనే (పరుల సంతాపమును) తొలగించుచున్నది.''

మూ. తృతీయః:-
శ్లో॥ దైవాయత్తే హి ఫలేకిం క్రియతామేతదత్ర తు వదామః
నాశోకస్య కిసలయైర్వృక్షాన్తరపల్లవాస్తుల్యాః.'' 8

వ్యా. మూడవదానికి ఉదాహరణము:- ''ఫలము దైవాధీన మైనపుడు మన మేమి చేయగలముః కాని ఈ విషయమున ఒక్కమాట మాత్రము చెప్పగలము. ఏ ఇతరవృక్షముల పల్లవములను ఆశోకకిసలయములకు సరిదూగవు.''

మూ. అనేకత్ర ప్రవృత్తవృత్తీనామేకత్రాచరణం నియమః. తద్యథా-సముద్రేష్వేవ మకరాః: తామ్రపర్ణ్యామేవ మౌక్తికాని. తయోః ప్రథమః-

"గోత్రాగ్రహారం నయతో గృహత్వం స్వనామముద్రాఙ్కితమమ్బురాశిమ్.
దాయాదవర్గేషు పరిస్ఫురత్సు దంష్ట్రావలేపో మకరస్య వన్ద్యః'' 9

వ్యా. అనేకవస్తువుల విషయమున ప్రవర్తించుటకు అవకాశ మున్న అర్థమును ఒకదానియందే ప్రవర్తింపచేయుట నియమము. అది ఎట్లునగా- సముద్రమునందే మకరములుండుట అనగా మకరములు సముద్రమునందే కాక నదు

లలో కూడ ఉండవచ్చును ఐనను 'మకరాలయ' శబ్దమును సముద్రవిషయముననే ఉపయోగింతురు. తామ్రపర్ణీ నదియందే ముత్యములుండును. అందు మొదటి దానికి ఉదాహరణము:- ''భూమ్యగమునందున్న హారమైనదియు, (మకరాలయము అని) తన నామముద్రచే చిహ్నితమును అగు సముద్రమును తన గృహముగ చేసికొనిన మకరమునకు ప్రకాశించుచున్న దాయాదవర్గములందు (అనగా మర్త్యాదుల మధ్యయందు) కోరలవలన కలిగిన గర్వము ప్రశంసనీయము."

మూ. ద్వితీయః-

"కామం భవన్తు సరితో భువి సుప్రతిష్ఠాః
స్వాదూని సన్తు సలిలాని చ శుక్తయశ్చ.
ఏతాం విహాయ వరవర్ణిని తామ్రపర్ణీం
నాన్యత్ర సమ్భవతి మౌక్తికకామధేనుః."

వ్యా. రెండవది (అనగా-తామ్రపర్ణిలో మౌక్తికవర్ణనము).

"ఓసుందరీ భూమియందు మంచి ప్రతిష్ఠ గల ఎన్నో నదులున్నచో ఉండవచ్చును. (వీటియందు) మధుర మైన ఉదకములును. ముత్యపుచిప్పలును కూడ ఉండవచ్చును కాని ఈ తామ్రపర్ణీనది తప్ప మౌక్తికముల కామధేను వైన మరి యొక నది ఎచ్చటను ఉండదు."

మూ. అసతోఽపి ద్రవ్యస్య నిబంధనం-తద్యథా. ముష్టిగ్రాహ్యత్వం, సూచీభేద్యత్వం చ తమసః. కుమ్భోపవాహ్యత్వం చ జ్యోత్స్నాయాః. తత్ర ప్రథమమ్:-

అవ. ఇంతవరకును జాతికి సంబంధించిన భేదత్రయమును చూపి, ఇపుడు ద్రవ్యగతభేదత్రయమును చూపుచున్నాడు:-

వ్యా. లేని ద్రవ్యమును కూడ వర్ణించుట ఎట్లనగా-తమస్సును పిడికిళ్లతో పట్టుకొనుటకు వీలయినట్లును, సూదులతో గ్రుచ్చుటకు వీలయినట్లును వర్ణించుట; వెన్నెలను కడవలతో ఎత్తి పోయుటకు వీలగ నున్నట్లు వర్ణించుట. అందు మొదటిదానికి ఉదాహరణము:-

మూ. తనులగ్నా ఇవ కకుభః భూవలయం చరణచారమాత్రమివ.
దివమివ చాలికదఘ్నం ముష్టిగ్రాహ్యం తమః కురుతే. 11

వ్యా. పిడికిళ్లతో పట్టుకొనుటకు వీలైనంత దట్టముగ నున్న అంధకారము దిక్కులను దేహమునకు తగులుచున్నాయా అన్నట్లుగాను, భూవలయమును అడుగువేసినంత మాత్రమే ప్రమాణము కలదానినిగాను, ఆకాశమును లలాట మంతమాత్రమే ఎత్తైనదానినిగను చేయుచున్నది"

మూ యథా చ :- "పిహితే కారాగారే తమసి చ సూచీముఖాగ్రనిర్భేద్యే
మయి చ నిమీలితనయనే తథాపి కాన్తావనం వ్యక్తమ్." 12

వ్యా ఇంకను ఎట్లనగా. (తమస్సు సూచీభేద్య మగుటకు ఉదాహరణము) "కారాగారము మూసివేయబడినను, అంధకారము సూచీముఖాగ్రముచే భేదింప దగిన విధముగ నున్నను, నేను కండ్లుమూసుకొని యున్నను, ప్రియురాలి ముఖము స్పష్టముగా కనబడుచున్నది." (ఇది రాజశేఖరుని విద్ధసాలభంజికలోనిది)

మూ. ద్వితీయమ్:-

"యన్త్రిద్రావితకేతకోదరదలస్రోతః శ్రియం బిభ్రతీ
యేయం మౌక్తికదామగుమ్ఫనవిధేర్యోగ్యచ్ఛవిః ప్రాగభూత్.
ఉత్సేద్యా కలశీభిరఞ్జలిపుటైర్గ్రాహ్యా మృణాలాఙ్కురైః
పాతవ్యా చ శశిన్యముగ్ధవిభవే సా వర్తతే చన్ద్రికా," 13

వ్యా. రెండవపదానికి ఉదాహరణము:- "యంత్రముచే ద్రవముగ చేయ బడిన మొగలిపూవు మధ్యలోని దలముల ప్రవాహపు కాంతిని ధరించిన ఏ వెన్నెల మొదట, ముత్యాలహారమును గ్రుచ్చుటకు తగినంత కాంతి కలదై ఉండెనో! ఆ వెన్నెలయే ఇపుడు, చంద్రుడు పూర్తిగా నున్న వైభవము కలవాడగుచుండగా కలశలచే తోడతగినదిగను, దోసిళ్ళతో గ్రహింపదగినదిగను మృణాలాంకురములచే (వాటిని గొట్టములుగ చేసికొని) త్రాగుటకువీలైనదిగను ఉన్నది. "(విద్ధసాలభంజిక).

మూ. ద్రవ్యస్య సతోఽనిబన్ధనం తద్యథా- కృష్ణపక్షే సత్యా అపి జ్యోత్స్నాయాః శుక్లపక్షేత్యన్ధకారస్య తయోః ప్రథమమ్:-

"దద్మశాతే జనైస్తత్ర యాత్రాయాం సకుతూహలైః
బలభద్రప్రలమ్బఘ్నౌ పక్షావివ సితాసితౌ." 14

ద్వితీయామ్:— "మాసి మాసి సమా జ్యోత్స్నా పక్షయోః శుక్లకృష్ణయోః
తత్రైకః శుక్లతాం యాతో యశః పుణ్యైరవాప్యతే" 15

వ్యా. ఉన్న ద్రవ్యమును వర్ణించకపోవుట ఎట్లనగా- కృష్ణపక్షములో వెన్నెల ఉన్నను వర్ణింపకపోవుట, శుక్లపక్షమున అంధకారమున్నను వర్ణింపబడుట. వాటిలో మొటటిది:— "శుక్లపక్షకృష్ణపక్షముల వలె, (తెల్లగను నల్లగను ఉన్న) ఆ బలరామశ్రీకృష్ణులు, ఆ యాత్రయందు. కుతూహలముతో కూడిని జనులచే చూడబడిరి."

రెండది:- "శుక్లపక్ష కృష్ణపక్షములు రెడింటియందును, ప్రతిమాసమునందును వెన్నెల సమముగనే ఉండును. కాని వాటిలో ఒకదానికి శుక్లపక్ష మని పేరు వచ్చెను. కీర్తి పుణ్యములచేతనే లభించును."

మూ. ద్రవ్యనియమస్తద్యథా:- మలయ ఏవ చన్దనస్థానమ్. హిమవానేవ భూర్జోత్పత్తిస్థానమ్. తత్ర ప్రథమః

"తాపాపహారచతురో నాగావాసః సురప్రియః
నాఽన్యత్ర మలయాద్దేర్దృశ్యతే చన్దనద్రుమః" 15

ద్వితీయః:- "న్యస్తాక్షరా ధాతురసేన యత్ర భూర్జత్వచః కుఞ్జరబిన్దుశోణాః
వ్రజన్తి విద్యాధరసున్దరీణామనఙ్గలేఖక్రియయోపయోగమ్" 16

వ్యా. ద్రవ్యనియమ మెట్లనగా-మలయపర్వత మొక్కటియే చందన వృక్షస్థానమనియు, హిమవత్పర్వతమొక్కటియే భూర్జవృక్షముల ఉత్పత్తిస్థానమనియు వర్ణించుట. అందు మొదటిది:-

"తాపమును తొలగించుటకు సమర్థ మైనదియు, నాగములకు నివాసస్థానమైనదియు, దేవతలకు ఇష్ట మైనదియు అగు చందనవృక్షము మలయపర్వతము తప్ప మరి యెచటను కానరాదు."

రెండవది:-(ఇది కుమారసంభవములోనిది). ఏ హిమవత్పర్వతమునందు, ధాతురసముచే ఉంచబడిన అక్షరములుకలవియు, ఏనుగుల శరీరమునందలి చుక్కల వలె ఎఱ్ఱనైనవియు అగు భూర్జవృక్షముల బెరళ్లు, విద్యాధరస్త్రీలకు మన్మధపీణలుగా ఉపయోగపడుచున్నవో,"

వి. చందన-భూర్జవృక్షములు ఇతరపర్వతాదులపై కూడ ఉన్నను ఈ మలయహిమాలయములపైన మాత్రమే ఉన్నట్లు వర్ణింపబడినవి.

మూ. ప్రకీర్ణద్రవ్యకవిసమయస్తు - తద్యథా - క్షీరక్షారసముద్రయో రైక్యమ్; సాగరమహాసముద్రయోశ్చ. తయోః ప్రథమః:-

"శీతాం హరిర్భవతు రత్నమనన్తమన్త ర్లక్ష్మీప్రసూతిరితి నో వివదామ హే త్వామ్.

హా! దూరదూర సపయా స్తృషితస్య జన్తోః కిన్త్వత్ర కూపపయసః స మరోర్ఘమన్యః." 17

వ్యా. ఇతరములగు వివిధద్రవ్యములకు సంబంధించిన కవిసమయ మెట్ల నగా - క్షీరసముద్ర - క్షారసముద్రములకును సాగరమహాసముద్రములకును ఏకత్వమును వర్ణించుట. వాటిలో మొదటిది -

"ఓ సముద్రమా ! నీపై విష్ణువు శయనించుగాక; నీలోపల అనన్తమైన రత్నము లుండునుగాక. నీవు లక్ష్మికి తండ్రివి అను విషయమున కూడ మాకు వివాదము లేదు. కాని అత్యంతము రసవిహీనమైన ఉదకము గల నీవు, దప్పి గొన్న జంతువునకు, కూపములందు ఉదకము గల ఎడారికంటె కూడ నీచుడవు."

వి. ఎడారిలో నీరు త్రాగుటకు కూపములైన ఉండును, నీలో అవి కూడ లేవని అర్థము. ఇచట పూర్వార్థములో చెప్పిన విషయములు క్షీరసముద్రమునకు సంబంధించినవి. ఉత్తరార్థములోని విషయములు లవణసముద్రమునకు సంబంధించినవి. అయినను ఈ రెండు సముద్రములును ఒకటే అన్నట్లు వర్ణించాడు కవి.

మూ. ద్వితీయః :- రఙ్గత్తరఙ్గభ్రూభఙ్గై స్తర్జయన్తీమివాపగాః.

స దదర్శ పురో గఙ్గాం సప్తసాగరవల్లభామ్. 18

వ్యా. రెండవది:- కదలుచున్న తరంగము లనెడు కనుబొమ్మవిరుపు లచేత ఇతరనదులను భుళిపించుచున్నది వలె ఉన్నదియు, సప్తసాగరములకు ప్రియురాలైనదియు అగు గంగను అతడు ఎదుట చూచెను.

వి. గంగ పూర్వసాగరమునందే ప్రవేశించుటచే పూర్వసాగరవల్లభ. కాని సాగరమునకును మహాసాగరమునకును అభేదము నంగీకరించి గంగ సప్తసాగ రవల్లభ యనికవి వర్ణించినాడు. ఆయాదిక్కులందున్నది సాగరము. ఈ సాగ రము లన్నియు కలిపి మహాసముద్రము.

మూ. అసతోఽపి క్రియార్థస్య నిబన్ధనం యథా. చక్రవాకమిథునస్య భిన్నతటాశ్రయణం, చకోరాణాం చన్ద్రికాపానం చ. తత్ర ప్రథమః-

"సఙ్క్షిపతా యామవతీ స్తటినీనాం తనయతా పయః పూరాన్.
రథచరణాహ్వయవయసాం కిం నోపకృతం నిదాఘేన." 19

ద్వితీయః- "ఏతాస్తామలయోపకణ్ఠసరితా మేణాక్షి రోధోభువ
శ్చాపాల్యాసనికేతనం భగవతః ప్రేయో మనోజన్మనః.
యాసు శ్యామనిశాసు పీతతమసో ముక్తామయీశ్చన్ద్రికాః
పీయన్తే వివృతోర్ధ్వచఞ్చువిచలత్కణ్ఠం చకోరాఙ్గనాః" 20

వ్యా. లేకపోయినను క్రియారూప మగు అర్థమును కూర్చుట ఎట్లనగా- చక్రవాకమిధునము రాత్రి వేరు వేరు నదీతటములను ఆశ్రయించుట; చకోరములు వెన్నెలను త్రాగుట. అందు మొదటిది:-

"రాత్రులను చిన్నావాటినిగ చేయుచున్నట్టియు, నదుల జలపూరమును సన్నగ చేయుచున్నదియు అగు గ్రీష్మఋతువుచే చక్రవాక పక్షులకు ఏమి ఉపకారముచే యబడలేదు?

రెండవది:- "ఏతాస్తాః...." అను శ్లోకము అద్రివర్ణనరసవత్తకు ఉదాహరణముగ నవమాధ్యాయమునందు చూపబడినది.

మూ. సతోఽపి క్రియార్థస్యానిబన్ధనమ్ తద్యథా - దివానీలోత్పలనామ వికాసః నిశానిమిత్తశ్చ శేఫాలికాకుసుమానాం అవిస్రంసః (విస్రంసః) తత్ర ప్రథమః-

అవిఖ్య పత్రమసితాగురుణాభిరామం
రామాముఖే క్షణసభాజితచన్ద్రబిమ్బే.
జాతః పునర్వికసనావసరోఽయమిస్యే
త్యుక్త్వా సఖీ కువలయం శ్రవణే చకార" 21

వ్యా. క్రియారూప మగు అర్థము ఉన్నను దానిని వర్ణింపకుండుట ఏట్లనగా -పగలు నీలోత్పలములు (వికసించినను) వికసింప వని వర్ణించుటరాత్రి యను నిమిత్తముచే శేఫాలికాకుసుమములు (రాలిపోయినను) రాలిపోనట్లు వర్ణించుట. అందు మొదటిది:-

క్షణమునందు (పత్రరచనాక్షణమునందు) సత్కరింపబడిన చంద్ర బింబము గల నాయికయొక్క ముఖమునందు, సఖురాలు, నల్లని అగురు వలె మనోహరమైన పత్రమును వ్రాసి, 'ఇది మరల వికసించుటకు సమయమువచ్చి నది' అని పలుకుచు, కలువను చెవిపై ఉంచెను''

వి. ముఖమునందు కాలాగురువుచే చేసిన పత్రరచన కలంకమువలె నుండుటచే ఆ క్షణమున ముఖమునకు చంద్రసాదృశ్యము లభించినది. అది పగటిసమయమె యైనను ఈ ముఖచంద్రసంబంధముచే కలువ వికసించు నని లేదా : ఇక రాత్రి రానున్నది గాన అది వికసించునని సఖురాలి అభిప్రాయము.

మూ. ద్వితీయః —

త్వద్విప్రయోగే కిరణై స్తథోగ్రై ర్దగ్ధాస్మి కృత్స్నం దివసం సవిత్రా
ఇతీవ దుఃఖం శశినే గదన్తీ శేఫాలికా రోదితి పుష్పబాష్పైః. 22

వ్యా. రెండవదానికి ఉదాహరణము :- ''నీ వియోగసమయమునందు, సూర్యుడు, పగలంతయు తన తీవ్రము లగు కిరణములచే నన్ను కాల్చివేసినాడు" అని తన దుఃఖమును చంద్రునకు చెప్పుకొనుచు శేఫాలికాలత పుష్పము లనెడు కన్నీటి బిందువులతో ఏడ్చుచున్నట్లున్నది.''

వి. ఈ శ్లోకమునందు శేఫాలికాకుసుమములు రాత్రియందు రాలుచున్నట్లు వర్ణింపబడినది. అందుచే పైనున్న వాక్యమున 'అవిస్రంసః' అనుటకు బదులు 'విస్రంసః' అని ఉండవలె నని తోచును. పగలు కూడ శేఫాలికాకుసుమములు రాలుట ఉన్నను అట్లు వర్ణింపక రాత్రియందే వర్ణించుట అని యర్థము.

మూ. నియమస్తు తద్యథా - గ్రీష్మాదౌ సమ్భవతోఽపి కోకిలానాం విరుతస్య వసన్త ఏవ, మయూరాణాం వర్షాస్వేవ విరుతస్య నృత్తస్య చ నిబన్ధః. తయోః ప్రథమః-

వసన్తే శీతభీతేన కోకిలేన వనీ రుతమ్.
అన్తర్జలగతాః పద్మాః శ్రోతుకామా ఇవ స్థితాః." 23

వ్యా. నియమము ఎట్లనగా :- గ్రీష్మాదులందు కోకిల విరుతము సంభావ్య మైనను దానిని వసన్తమునందే వర్ణించుట, మయూరముల నృత్తవిరుతములను వర్షాకాలమునందు మాత్రమే వర్ణించుట. వానిలో మొదటిది :-

"వసంతఋతువునందు శీతబాధవలన భయపడిన కోకిలచే వనమునందు (చేయబడిన) ధ్వనిని వినుటకా అన్నట్లు జలములోపల నున్న పద్మములు పైకి లేచినవి."

మూ. ద్వితీయః- మణ్డలీకృత్య బర్హాణి కణ్ఠైర్మధురగీతిభిః
కలాపినః ప్రనృత్యన్తి కాలే జీమూతమాలిని. 24

వ్యా. రెండవది:- "మేఘపంక్తులతో నిండిన కాలమునందు, నెమళ్లుమధుర ధ్వనులు గల కంఠములతో, పింఛములను మండలాకారములుగ చేసి నాట్యము చేయుచున్నవి."

మూ. కవీనాం సమయః సోఽయం జాతిద్రవ్యక్రియాగతః.
గుణస్యైవ తతః స్వర్గ్యః పాతాలీయశ్చ కథ్యతే. 25

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽధికరణే జాతిద్రవ్యక్రియాసమయస్థాపనా చతుర్దశోఽధ్యాయః.

వ్యా. ఇది (ఇంతవరకును చెప్పినది) జాతి-ద్రవ్య-క్రియలకు సంబంధించిన కవిసమయము, గుణములకు సంబంధించిన కవిసమయము, తరువాత స్వర్గ్యపాతాలీయకవిసమయము (పంచదశషోడశాధ్యాయములలో) చెప్పబడుచున్నది.

బాలానందినిలో చతుర్దశాధ్యాయము సమాప్తము.

పఞ్చదశోఽధ్యాయః-
గుణసమయస్థాపనా.

మూ. అసతో గుణస్య నిబన్ధనం యథా- యశోహాసప్రభృతేః శౌక్ల్యమ్; అయశసః పాపప్రభృతేశ్చ కార్ష్ణ్యం, క్రోధానురాగప్రభృతేశ్చ రక్తత్వమ్. తత్ర యశః శౌక్ల్యమ్:-

వ్యా. లేని గుణమును ఉన్నట్లుగా వర్ణించుట ఎట్లనగా- కీర్తి, నవ్వు మొదలగువానిని తెల్లగా నున్నట్లును, అపకీర్తి, పాపము మొదలగువానిని నల్లగా

నున్నట్లును, క్రోధము, అనురాగము మొదలగుదానిని ఎఱ్ఱగ నున్నట్లును (వర్ణింతురు). అందు కీర్తి శుక్లముగ నున్న దనుటకు ఉదాహరణము—

మూ. స్తైమః స్తోకోఽపి నాఙ్గే శ్వసితమవికలం చక్షుషాం సైవ వృత్తిః
మధ్యేక్షీరాబ్ధి మగ్నాః స్ఫుటమథ చ వయంకోఽయమీదృక్ ప్రకారః
ఇత్థం దిగ్భిత్తిరోధః క్షతవిసరతయా మాంసలైస్త్వద్యశోభిః
స్తోకావస్థానదుః స్థైస్త్రిజగతి ధవలే విస్మయన్తే మృగాక్ష్యః" 1

వ్యా. ఈ శ్లోకము షష్ఠాధ్యాయమున ఉదహరింపబడినది. (చూ. పే.)

మూ. హాసశౌక్ల్యమ్:- "అట్టహాసచ్ఛలేనాస్యాద్యస్య ఫేనౌఘపాణ్డురాః
జగత్క్షయ ఇవాపీతాః క్షరన్తి క్షీరసాగరాః" 2

వ్యా. నవ్వునకు శుక్లత్వము :- "ప్రతియుకాలమునందు త్రాగబడినవియు నురుగుయొక్క సమూదాయముచే తెల్లనైనవియు అగు క్షీరసాగరములు, అట్టహాస మను మిషచే ఎవని ముఖమునుండి స్రవించుచున్నవో".

మూ. అయశః కృష్ణత్వమ్ :-
ప్రసరన్తి కీర్తయస్తే తవ చ రిపూణామకీర్తయో యుగపత్
కువలయదళసంవలితాః ప్రతిదిశమివ మాలతీమాలాః". 3

వ్యా. అపకీర్తి నల్లగ నుండుటకు :- "నీ కీర్తులును, నీ శత్రువుల అపకీర్తులును, ఒక్క మారుగ, (నల్ల) కలువల రేకులతో కలిపి గ్రుచ్చిన మాలతీ మాలల వలె, అన్నిదిక్కులందును ప్రసరించుచున్నవి."

మూ. పాపకార్ష్ణ్యమ్ :-
ఉత్ఖాతనిర్మలమయూఖకృపాణలేఖా
శ్యామాయితా తనురభూద్ధయకన్ధరస్య
సద్యః ప్రకోపకృతకేశవవంశనాశ
సంకల్పసంజనితపాపమలీమసేవ. 4

వ్యా. పాపము నల్లగా నుండుటకు :- "కోపావేశముచే కలిగిన కేశవుని వంశమును నశింపచేయువలె నను సంకల్పమువలన జన్మించిన పాపముచే మలినమైనది వలె, ఆ హయగ్రీవుని శరీరము, వెంటనే, గ్రుచ్చబడినదియు, నిర్మలమైన కిరణములు కలదియు అగు ఖడ్గరేఖచే నల్లదిగ అయినది."

మూ. క్రోధరక్తతా — అస్థానకుట్టిమతల ప్రతిబిమ్బితేనకోప ప్రభా ప్రసరపాటల విగ్రహేణ.

భౌమేన మూర్ఛితరసాతలకుక్షిభాజా భూమిశ్చచాల చలితోదరవర్తినేవ. 5

వ్యా. "సభామండపమునందలి చపటాపై ప్రతిబింబించిన వాడును, కోప కాంతియొక్క ప్రసారముచే ఎఱ్ఱనైన శరీరముకలవాడును, (ప్రతిబింబించుటచే) మూర్ఛిత మగు పాతాలముయొక్క కుక్షిని ప్రవేశించినవాడును. చలించుచున్న వాడును అగు నరకాసురునిచే, భూమి, అతడు తన ఉదరములోను నున్నప్పుడు కదలగా చలించినట్లు చలించినది."

వి. నరకాసురుడు. భూపుత్రుడు అతని కోపారుణదేహము మణికుట్టిమము పై ప్రతిబింబించుటచే అది భూగర్భమున ప్రవేశించినట్లున్నది. అతడు చలించగా, గర్భస్థశిశువు చలించి నపుడు తల్లి చలించినట్లు భూమి చలించినది అని ఉత్ప్రేక్ష.

మూ. అనురాగరక్తతా యథా :-
''గుణానురాగమిశ్రేణ యశసా తవ సర్పతా
దిగ్వధూనాం ముఖే జాతమకస్మాదర్ధకుఙ్కుమమ్.'' 6

వ్యా. అనురాగము ఎఱ్ఱగా నుండు నని వర్ణించుటకు ఉదాహరణము :- ఈ శ్లోకము అష్టమాధ్యాయమున సంయోగవికారమునకు ఉదాహరణముగ చూప బడినది. (చూ).

మూ. సతోఽపి గుణస్యానిబన్ధనమ్. కున్దకుడ్మలానాం, కామిదన్తానాం చ రక్తత్వం, కమలముకుల ప్రభృతేశ్చ హరితత్వం, ప్రియఙ్గుపుష్పాణాం చ పీతత్వమ్.

వ్యా. లోకములో ప్రసిద్ధముగ నున్న గుణమును కూర్చకుండుట. కుంద కుడ్మలములు, కాముకుల దంతములును ఎఱ్ఱగానుండును; (కాని కవులువాటిని తెల్లగనున్నట్లు వర్ణించుచుందురు, తామర మొగ్గలు మొదలగునవి ఆకుపచ్చగ నుండును. (కాని వాటిని తెల్లగ నున్నట్లు వర్ణింతురు.) ప్రియంగుపుష్పములు పచ్చగ నుండును, (కాని వాటిని నల్లగ నుండున్నట్లు వర్ణింతురు).

మూ. కున్దకుడ్మలాద్యరక్తతా:-
ద్యోతితాన్తస్సభైః కున్దకుడ్మలాగ్రదతః స్మితైః
స్నపితేవాభవత్తస్య శుద్ధవర్ణా సరస్వతీ. 7

వ్యా కుందకుడ్మలాదులను (మల్లిమొగ్గలు మొదలైనవాటిని) ఎఱ్ఱగ నున్నట్లు వర్ణింపకుండుటకు ఉదాహరణము:- (ఈ శ్లోకము శిశుపాలవధము లోనిది. 2. 7). "మల్లి మొగ్గల అగ్రభాగముల వంటి దంతములు గల శ్రీ కృష్ణునియొక్క, సభామధ్యమును ప్రకాశింపచేయు చిరునవ్వులచే, స్నానము చేయించబడినదా అనునట్లు సరస్వతి శుద్ధవర్ణయై (శుద్ధమైన రంగుకలది, శుద్ధమైన అక్షరములు కలది అని యర్థము) అయినది.

మూ. పద్మకులాహరితత్వమ్:-
ఉద్దణ్డోదరపుణ్డరీకముకుల భ్రాన్తిస్పృశా దంష్ట్రయా
మగ్నాం లావణసైన్ధవేఽమ్బుని మహీముద్యచ్ఛతో హేలయా
తత్కాలాకులదేవదానవకులైరుత్తాలకోలాహలం
శౌరేరాదివరాహవాలమవతాదభ్రంలిహాగ్రం వపుః. 8

వ్యా. పద్మముల మొగ్గలు పచ్చగా నున్నట్లు వర్ణింపకుండుటకు ఉదాహరణము:- "ఉదరమునందలి పెద్దదైన పద్మపు మొగ్గ యనెడు భ్రాంతిని కలిగించు కోరతో, లవణసముద్రోదకమునందు మునిగి పోయియున్న భూమిని విలాసగ, ఆ సమయమున వ్యాకులతచెందిన దేవదానవసమూహములచే అత్యధికముగ చేయబడిన కోలాహలము కలుగునట్లుగా, పైకి ఎత్తుచున్న శ్రీమహావిష్ణువుయొక్క ఆదివరాహవిలాసమును ధరించిన, ఆకాశమునంటుచున్న, శరీరము రక్షించుగాక."

వి. ఇచట పద్మపుమొగ్గ తెల్లగ నుండు నను అభిప్రాయముతో తెల్లని కోరకు ఉపమానముగ ఈయబడినది.

మూ. ప్రియంగుపుష్పాపీతత్వమ్:-
"ప్రియగుశ్యామమమ్బోధరస్త్రీణాంస్తనమణ్డలమ్.
అఙ్కుర్తుమివ స్వచ్ఛాః సూతే మౌక్తికసమ్పదః" 9

వ్యా. ప్రియంగుపుష్పములు పచ్చగానున్నట్లు వర్ణింపక మరియొక విధముగ వర్ణించుటకు ఉదాహరణము:- "సముద్రము ప్రియంగుపుష్పముల వలె

శ్యామవర్ణమైన అంతర్దేశము సమంతముగా స్తనమండలమును అలంకరించుటకా అన్నట్లు మౌక్తికసమృద్ధులను పుట్టించుచున్నది."

మూ. గుణనియమస్తు తద్యథా - సామాన్యోపాదానే మాణిక్యానాం శోణతా, పుష్పాణాం శుక్లతా మేఘానాం కృష్ణతా చ. తత్ర

ప్రథమః - "సాంయాత్రికై రవిరతోపహృతాని కూలైః
శ్యామాసు తీరవ(న)నరాజిషు సమ్భృతాని,
రత్నాని తే దదతి కచ్చిదిహాయతాక్షి
మేఘోదరోదితదినాధిపబిమ్బశఙ్కామ్. 10

వ్యా. గుణనియమము ఎట్లనగా - మాణిక్యములను సామాన్యరూపమున గ్రహించునపుడు (అన్నియు) ఎఱ్ఱగా నున్నట్లు వర్ణించుట, పుష్పములను సామాన్యరూపమున వర్ణించునపుడు (అన్నింటిని) తెల్లగా నున్నట్లు వర్ణించుట, మేఘములను సామాన్యరూపమున వర్ణించునపుడు నల్లగా నున్నట్లు వర్ణించుట. అందు మొదటిది :-

"ఓవిశాలలోచనా ! నావికులు (నౌకలలో వర్తకముచేయువారు నిరంతరము తీసికొని వచ్చి, నల్లనైన తీరవనములపంక్తులయందు రాసులుగ ప్రోగు చేసిన రత్నములు మేఘమధ్యమునుండి బైటకు వచ్చిన సూర్యు డనెడు శంకను కల్గించుచున్నవికదా ?"

వి. వేరు వేరు రత్నములు వేరు వేరు రంగులలో నున్నను, వాటిని 'రత్నములు' అని సామాన్యరూపమున గ్రహించినపుడు ఇచట అవి ఎఱ్ఱగ నున్నట్లు వర్ణింపబడినది.

మూ పుష్పశుక్లతా :-

"పుష్పం ప్రవాలోపహితం యది స్యాన్ముక్తాఫలం వా స్ఫుటవిద్రుమస్థమ్
తతోऽనుకుర్యాద్విశదస్య తస్యాస్తామ్రౌష్ఠపర్యస్తరుచః స్మితస్య". 11

వ్యా. సామాన్యరూపమున పుష్పమును తెల్లగ నున్నట్లు వర్ణించుటకు ఉదాహరణము :- (ఇదికుమారసంభవములోని శ్లోకము. 1.44)

"పుష్పమును చిగురుపై ఉంచినచో, ముత్యమును పెద్ద పొగడముపై ఉంచినచో అపుడు అవి ఆ పార్వతియొక్క ఎఱ్ఱని పెదవులపై వ్యాపించిన కాంతిగల, తెల్లని చిరునవ్వును అనుకరించవచ్చును."

మూ. మేఘకార్ష్ణ్యమ్ :- మేఘశ్యామేన రామేణ పూతవేదిర్విమానరాట్
మధ్యే మహేన్ద్రనీలేన రత్నరాశిరివాబభౌ.'' 12

వ్యా. మేఘము నలుపునకు ఉదాహరము:—

"మేఘశ్యాముడైన రామునిచేత పవిత్రీకృతమైనవేదిక గల ఆ విమాన రాజము, మధ్యయందు మహేంద్రనీల మాణిక్యముతో కూడిన రత్నరాశి వలె ప్రకాశించెను".

మూ. కృష్ణనీలయోః,కృష్ణహరితయోః కృష్ణశ్యామయోః. పీతర క్తయోః. శుక్లగౌరయోరేకత్వేన నిబన్ధనం చ కవిసమయః. కృష్ణనీలయోరైక్యమ్:—

శ్లో. ''నదీం తూర్ణం కర్ణోఽప్యనుస్మృతపులినాం దాక్షిణాత్యాఙ్గనాభిః
సముత్తీర్ణో వర్ణాముభయతటచలా (తలా) బద్ధ వానీరహారామ్.
తటే సహ్యస్యోచ్చైః స్వపనిబలివహో భాతి నీలః స యస్యాః
ప్రియస్యాంశే పీనే లులిత ఇవ ఘనః కేశపాశః సుకేశ్యాః''

వ్యా. కృష్ణ హరిత (ఆకుపచ్చ) వర్ణములను, కృష్ణశ్యామవర్ణములను, పీత (పచ్చని) రక్తవర్ణములను, శుక్ల-గౌర (పచ్చదనముకలిసిన తెలుపు వర్ణములను ఒకటిగ వర్ణించుట గూడ కవిసమయము. అందుకృష్ణ-నీలవర్ణముల ఏకత్వమునకు ఉదాహరణము:-

సహ్యపర్వతముయొక్క ఉన్నతతటముపై, ఏ నదియొక్క నీలవర్ణము గల జలప్రవాహము, ప్రియునియొక్క బలిసియున్న బుజముపై వ్రేలాడునట్లు విదల్చబడిన, అందమైన కేశపాశము గల యువతియొక్క దట్టమైన కేశపాశము వలె ఉన్నదో అట్టిదియు, దాక్షిణాత్యాంగ లచే అనుసరింపబడిన ఇసుకతిన్నెలు కలదియు, రెండు తీరములందును దట్టముగ పెరిగిన నీటిప్రబ్బలిచెట్లే హారముగ కలదియు అగు వర్ణానదిని, కర్ణుడు, శీఘ్రముగా దాటెను."

వి. నీలవర్ణము గల ప్రవాహమును నల్లని కేశపాశముతో పోల్చుటచే కృష్ణ హరితయోరైక్యమ్.

''మరకతసదృశం చ యామునం స్ఫటికశిలావిమలం చ జాహ్నవమ్.
తదుభయముదకం పునాతు వో హరిహరయోరివ సఙ్గతం వపుః''. 14

"యమునానదీజలము మరకతమాణిక్యవర్ణముతో సమానమైనది. గంగా నదీజలము స్ఫటికమణి వలె స్వచ్ఛమైనది కలిసిన హరిహరుల శరీరము వలె నున్న ఆ ఉదకద్వయము మిమ్ములను పవిత్రము చేయుగాక"

వి. యమునానదీజలము నల్లగా నుండును. అయినను దానిని మరకత సదృశ మని వర్ణించుటచే కృష్ణవర్ణమునకును (ఆకుపచ్చ) హరిద్వర్ణమునకు ఐక్యము నంగీకరించినట్లైనది.

మూ. కృష్ణశ్యామలయోరైక్యమ్,
"ఏతత్సున్దరి నన్దనం శశిమణి స్నిగ్ధాంఘ్రివాలద్రుమం
మన్దాకిన్యభిషిక్తమౌక్తికశిలే మేరోస్తటే నన్దతి.
యత్ర శ్యామనిశాసు ముఞ్చతి మిలన్మన్దప్రదోషానిలా
ముద్దామామరయోషితామభిరతం కల్పద్రుమశ్చన్ద్రికామ్." 15

వ్యా. కృష్ణ-శ్యామల (దామనచాయ) వర్ణములకు ఐక్య మెట్లనగా—"ఓసుందరీ! చంద్రకాంతమాణిక్యములచే నున్నగా నున్న కుదుర్లతోకూడిన వృక్షములు గల ఈ నందనవనముల మందాకినీచేత తడపబడిన ముక్తావికారమైన శిలలు గల మేరుతటముపై ప్రకాశించుచున్నది. దేనియందు, కల్పవృక్షము, శ్యామములైన (నల్లనైన) రాత్రులందు (కృష్ణపక్షరాత్రులందు) సుందరులైన దేవతాస్త్రీల రతానుగుణముగ, మందమైన సాయంకాలీనమారుతముతో కలిసిన, వెన్నెలను విడచును."

వి. ఇచట శ్యామవర్ణమునకును కృష్ణవర్ణమునకు అభేదమును అంగీకరించి 'కృష్ణనిశాసు' అని కాక 'శ్యామనిశాసు' అని చెప్పబడినది.

మూ. పీతరక్తయోరైక్యమ్.
"లేఖయా విమలవిద్రుమభాసా సన్తతం తిమిరమిన్దురుదాసే
దంష్ట్రయా కనకటఙ్కపిశఙ్గ్యా మణ్డలం భువ ఇవాదివరాహః" 16

వ్యా. పీతవర్ణ-రక్తవర్ణముల ఐక్యమున కుదాహరణము:-
"ఆదివరాహము సువర్ణఖండము వలె పచ్చనైన కోరచే భూమండలమును వలె, నిర్మలమైన పగడము వంటి కాంతి గల లేఖచే, చంద్రుడు దట్టముగా నున్న అంధకారమును తొలగించెను."

వి. ఇచట పీతరక్తవర్ణములకు ఐక్యము అంగీకరించి ఎఱ్ఱని చంద్రకళ పచ్చని కోరతో పోల్చబడినది.

మూ. శుక్లగౌరయోరైక్యమ్. 17

"కైలాసగౌరం వృషమారురుక్షోః పాదార్పణానుగ్రహపూతపృష్ఠమ్.
అవేహి మాం కింకరమష్టమూర్తేః కుమ్భోదరం నామ నికుమ్భపుత్రమ్.

వ్యా. శుక్లగౌరవర్ణముల ఐక్యమునకు ఉదాహరణము :—
(ఈ శ్లోకము రఘువంశద్వితీయసర్గలోనిది 2.28)

"కైలాసము వలె గౌరవర్ణము గల వృషభమును ఆరోహింపనిచ్చ గల అష్టమూర్తి యగు శివుని పాదము ఉంచుట అనెడు అనుగ్రహముచే పవిత్రము చేయబడిన వీపుకలవాడును, నికుంభుని పుత్రుడును, కుంభోదరు డను పేరుగల వాడును అగు ఈశ్వరకింకరునిగా నన్ను తెలిసికొనుము."

వి. రఘువంశములో ప్రసిద్ధపాఠము "నికుమ్భమిత్రమ్". ఇచట గౌర శ్వేతవర్ణములకు ఐక్యము నంగీకరించి, శ్వేతవర్ణ మగు కైలాసము గౌరవర్ణము కలదిగ వర్ణింపబడినది.

మూ. ఏవం వర్ణాన్తరేష్వపి. చక్షురాదేరనేకవర్ణోప వర్ణనమ్. తత్ర చక్షుష్యః శుక్లతా :-

"తిష్ఠన్త్యా జనసంకులేఽపి సుదృశా సాయం గృహప్రాఙ్గణే
తద్ద్వారం మయి నిస్పృహాలసతనౌ వీక్షామ్యదుప్రేక్షతి.
హ్రీనమ్రాననయైవ లోలసరలం నిఃశ్వస్య తత్రాన్తరే
ప్రేమార్ద్రాః శశిఖణ్డపాణ్డిమముషో ముక్తాః కటాక్షచ్ఛటాః" 18

వ్యా. ఇతరవర్ణముల పరస్పరైక్య విషయమున గూడ ఇట్లే గ్రహించవలెను. నేత్రాదులను అనేకవర్ణములు కలవానినిగా వర్ణించుట కవిసమయము. అందు నేత్రమునకు శుక్లత్వము:-

"సాయంకాలమున ఇంటి ముంగిట జనసంకులముగ నున్నను, అచట నున్న ఆ సుందరి, సిగ్గుచే ముఖమును వంచుకొనియే యుండి, చంచలముగను సరలముగను నిట్టూర్చి, అలసటచే దుర్బర మైన శరీరము గలవాడనై ఆ ద్వారమును గూర్చి మెల్ల మెల్లగ నడచి వెళ్లుచున్న నాపై ఆ నడుమనే, ప్రేమార్ద్రములును, చంద్రఖండముయొక్క తెలుపును హరించునవియు అగు కటాక్షపంక్తులను విడచినది."

మూ. శ్యామతా:-
''అథ పథి గమయిత్వా రమ్యక్లుప్తోపకార్యే
కతిచిదవనిపాలః శర్వరీః శర్వకల్పః.
పునరవిశదయోధ్యాం మైథిలీదర్శినీనాం
కువలయితగవాక్షాం లోచనైరఙ్గనానామ్'' 19

వ్యా. నేత్రములకు శ్యామత్వ మెట్లనగా:- (ఈ శ్లోకము రఘువంశము లోనిది ౧. 18. 'పునః' కు బదులుగా 'పురమ్' అను పాఠము ప్రసిద్ధముగ నున్నది) ''అటుపిమ్మట ఈశ్వరునితో తుల్యుడగు దశరథమహారాజు, అందముగా ఏర్పరుపబడిన గుడారములు గల మార్గమునందు కొన్ని రాత్రులను గడపి, మైథిలిని చూచెడు స్త్రీల నేత్రములచే నల్లకలువలు కలదిగ చేయబడిన గవాక్షములు గల అయోధ్యను మరల ప్రవేశించెను.''

వి. కువలయములతో పోల్చుటచే ఇచట నేత్రములు శ్యామవర్ణము అని సూచిత మైనది.

మూ. కృష్ణతా:-
''పాదన్యాసక్వణితరశనా స్తత్ర లీలావధూతై
రత్నచ్ఛాయాఖచితవలిభిశ్చామరైః క్లాన్తహస్తాః.
వేశ్యా స్త్వత్తో నఖపదసుఖాన్ ప్రాప్య వర్షాగ్రబిన్దూ
నామోక్ష్యన్తే త్వయిమధుకరశ్రేణిదీర్ఘాన్ కటాక్షాన్. 20

వ్యా. నేత్రముల కృష్ణత్వమునకు ఉదాహరణము. (ఇది మేఘసందేశములోనిది. 1.35) ''ఆ మహాకాలమందిరమున, పాదన్యాసములచే మ్రోగుచున్న వడ్డాణములు కలవారును, విలాసపూర్వకముగ కదల్పబడుచున్నవియు, కంకణ రత్నకాంతులచే పూయబడిన దండములు గలవియు అగు చామరములచే అలసిన హస్తములు కలవారును అగు వేశ్యలు, నీనుండి, నఖక్షతములపై సుఖకరముగ నున్న వర్షప్రారంభమునందలి జలబిందువులను పొంది, నీపై, తుమ్మెదలపంక్తుల వలె దీర్ఘము లైన కటాక్షములను ప్రసరింపచేయగలరు.''

ఇచట, నేత్రములు నల్లగ నుండుటచే తుమ్మెదలతో పోల్చబడినవి.

మూ. మిశ్రవర్ణతా:-

తాసు తీర్య గ్వజ పరిచిత భ్రూలతావి భ్రమాణాం
పక్ష్మోత్క్షేపాదుపరివిలసత్కృష్ణశార ప్రభాణామ్.
కున్దక్షేపానుగమధుకర శ్రీముషామాత్మబిమ్బం
పాత్రీకుర్వన్ దశపురవధూనేత్రకౌతూహలానామ్. 21

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేధికరణే
గుణసమయస్థాపనా పఞ్చదశోఽధ్యాయః.

నేత్రములకు మిశ్రవర్ణత్వ మెట్లనగా— (ఇది మేఘసందేశములోని శ్లోకము. 1. 47)

ఆ చర్మణ్వతీనదిని దాటి, భ్రూలతలవిలాసలనుచూపుననియు, రెప్పలను పైకి ఎత్తుటచే ప్రకాశించు నల్లనివియు, శారవర్ణమైనవియు అగు కాంతులు కలవియు, కుందపుష్పముల కదలికను అనుసరించి ఎగురుచున్న తుమ్మెదల కాంతిని అపహరించునవియు అగు దశపురదేశస్త్రీనేత్రకౌతూహలములకు (అనగా వారి సాభిలాషము లగు దృష్టులకు నీ శరీరమును పాత్రమునుగ చేయుచు వెళ్ళుము.

వి. కృష్ణ-రక్త-శ్వేతవర్ణములు కలిసిన వర్ణము శారవర్ణము.

బాలానందినియందు పంచదశాధ్యాయము సమాప్తము.

షోడశోఽధ్యాయః-స్వర్గ్యపాతాలీయ కవి రహస్యస్థాపనా.

మూ. భౌమవత్స్వర్గ్యోఽపి కవిసమయః. విశేషస్తు:-చన్ద్రమసి శశహరిణయోరైక్యమ్. యథా:-

"మాభైః శశాఙ్క మమ సీధుని నాస్తి రాహుః
ఖే రోహిణీ వసతి కాతర కిం బిభేషి.
ప్రాయో విదగ్ధవనితానవసఙ్గమేషు
పుంసాం మనః ప్రచలతీతి కిమత్ర చిత్రమ్". 1

వ్యా. స్వర్గ్యకవిసమయము కూడా భౌమకవిసమయము వలెనే ఉండును. కాని కొన్ని (భౌమకవిసమయములలో లేని) విశేషము లేవి అనగా:-

చంద్రునిలో నున్న చెవులపిల్లికిని, లేడికిని ఏకత్వము వర్ణింపబడును. ఎట్లనగా:- (వి. మద్యపానము చేయుచున్న ఒక ప్రౌఢవనిత మద్యపాత్రలో ప్రతిబింబించి కదలుచున్న చంద్రుని ఉద్దేశించి ఇట్లు పలుకుచున్నది):

వ్యా "చెవులపిల్లి చిహ్నముగా కల ఓ చంద్రుడా! భయపడకుము; నా మద్యమునందు రాహువు లేదు. (నీ భార్యయైన) రోహిణి (ఎక్కడనో) ఆకాశమున నివసించుచున్నది. ఓపిరికివాడా! ఎందుకు భ య ప డె ద వుః (నిజమేః) క్రొత్తగ ప్రౌఢాంగనాసంగము చేయునపుడు, సాధారణముగ పురుషుల మనస్సు (భయముతో) చలించును, ఇందు ఆశ్చర్యమేమి కున్నది"

వి. నీవిట్లు వణకుటకు తగు కారణము లేదు. నీ శత్రు వైన రాహువు ఇచటలేదు. నీ భార్య యగు రోహిణి నీవు పరస్త్రీసంగము చేయుచుండ చూచు నను భయము కూడ లేదు. ఆమె ఎచ్చటనో దూరముగ నున్నది. ఇక నీ భయమునకు కారణము ప్రౌఢాంగనానవసంగమమే అయి ఉండవలెను అని భావము. ఇచట చంద్రుడు శశాంకుడుగ వర్ణింపబడినాడు.

ఇచట 'మాభైషీః' అనుటకుబదులు 'మాభైః' అని ప్రయోగింపబడినది. అందుచే 'మాభీః' అనుపాఠమున్నచో యుక్తమని తోచుచున్నది. "భీఃమా మాస్తు" అని అర్థము.

మూ. యథా చ :-

''అఙ్కాధిరోపితమృగశ్చన్ద్రమా మృగలాంఛనః

కేసరీ నిష్ఠురాక్షిప్తమృగయూథో మృగాధిపః" 3

వ్యా. మరి యొక ఉదాహరణము ఎట్లనగా:- (ఇది శిశుపాలవధములోనిది; 2.88) "ఒడిలో లేడిని కూర్చుండ బెట్టుకొనిన చంద్రుడు 'మృగలాంఛనుడు'. అనగా మృగమే చిహ్నముగా కలవాడు. నిష్ఠురముగా పీడింపపడిన మృగములు గల సింహము 'మృగరాజు'.

వి. అనగా మృదువుగా నున్నవానికంటె పరుషముగ ప్రవర్తించువానికే ప్రజలు భయపడుచు ఆతనిని గౌరవింతురు అని యర్థము. ఇచట చంద్రుడు మృగలాంఛను డని చెప్పుటచే, కవులు శశమును, మృగమును (లేడి) అభిన్నములుగ గ్రహింతు రని భావము.

మూ. కామకేతనే మకరమత్స్యయో రైక్యం యథా:-
''చాపం పుష్పమయం గృహాణ మకరః కేతుః సముచ్ఛ్రీయతాం
చేతోలక్ష్యభిదశ్చ పఞ్చ విశిఖాః పాణౌ పునః సన్తు తే.
దగ్ధా కాపి తవాకృతేః ప్రతికృతిః కామోసి కిం గూహసే
రూపం దర్శయ నాత్ర శంకరభయం సర్వే వయం వైష్ణవాః''. 3

వ్యా. మన్మథుని కేతనముపై నున్న మకర-మత్స్యములకు ఐక్యము. ఎట్లనగా:- (అతిలోక సౌందర్యవంతు డగు ఒకనిని చూచి ఎవరో పలికిన మాటలివి) :- ''పుష్పమయ మగు ధనస్సును ధరించుము. మకరరూప మగు కేతువును ఎగురవేయుము. చిత్త మనెడు లక్ష్యమును భేదించు బాణము లైదును నీ చేతిలో నుండుగాక. పూర్వము కాల్చివేయబడినది అది ఏదియో నీ ఆకారము యొక్క ప్రతికృతి. నీవు మన్మథుడవే. ఎందుకు దాగెదవు? నీ యథార్థ స్వరూపమును చూపుము. ఇక్కడ శంకరునివలన భయము లేదు. మేమందరము వైష్ణవులమే".

ఈ శ్లోకములో మకరము మన్మథుని కేతన మని చెప్పబడినది,

మూ. యథాచ :- ''మీనధ్వజస్త్వమపి నో న చ పుష్పధన్వా
కేళిప్రకాశ తవ మన్మథతా తథాపి.
ఇత్థం త్వయా విరహితస్య మయోపలబ్ధాః
కాన్తాజనస్య జననాథ చిరం విలాపాః'' 4

వ్యా. మరియు ఎట్లనగా- "ఓ! కేళిప్రకాశా! (రహస్య కేళులయందు ప్రకాశించువాడా!) నీవు మీనధ్వజుడవు కావు. పుష్పధన్వుడవు (పుష్పమే ధనస్సుగా కలవాడు) కావు. అయినను నీకు (సౌందర్యముచే లేదా నన్ను పీడించుట లేదా మనస్సును పీడించుట అను గుణముచే) మన్మథత్వ మున్నది'' ఓ! మహారాజా! నీ విరహమును పొందిన స్త్రీ జనముయొక్క ఈ విధము లగు విలాపములు నాచే వినబడినవి." ఇచట మీనము కామకేతనముగ వర్ణింపబడినది.

మూ. యథా వా :- ఆపాతమారుతవిలోడితసిన్ధునాథో
హాత్కారభీతపఠివర్తితమత్స్యచిహ్నమ్.
ఉల్లఙ్ఘ్య యాదవమహోదధిభీమవేలాం
ద్రోణాచలం పవనసూనురివోద్ధరామి. 5

వ్యా. మరి యొక ఉదాహరణ మెట్లనగా - ఇది సింధురాజగు జయద్రథుని రక్షించు చున్న కౌరవసైన్యములో ప్రవేశింప నున్న భీవసేనుని వాక్యమై యుండును. "వేగముచే కలిగిన వాయువుచే క్షోభింపచేయబడిన సింధు దేశరాజైన జయద్రథుడు కలవాడనై (హనుమంతుని పక్షమున సముద్ర మని యర్థము) హాహాకారము (సింహనాదము) చే భయపడిన, వెనుకకు తిరిగి పోవు చున్న మత్స్యచిహ్నుడు (అనగా మన్మథావతారమును శ్రీకృష్ణుని కుమారుడును అయిన ప్రద్యుమ్నుడు) కలిగిన (హనుమత్పక్షమున—...తల్క్రిందులగుచున్న మత్స్యములు చిహ్నముగా కలది యని అర్థము) యాదవముహాసముద్రభయం రకతీరమును లంఘించి, వాయుపుత్రు డైన హనుమంతుడు సంజీవనినిమిత్తము ద్రోణాచలమునువలె, ద్రోణుడనెడు పర్వతమును పెకిలించివేసెదను."

ఇచట గూడ మన్మథునకు మత్స్యకేతనత్వము వర్ణింపబడినది.

మూ. అత్రినేత్రసముద్రోత్పన్నచన్ద్రయోరైక్యమ్-

వన్ద్యావిశ్వసృజో యుగాదిగురవః స్వాయమ్భువాః సప్త యే
తత్రాత్రిర్దివి సన్దధే నయనజం జ్యోతిః స చన్ద్రోఽభవత్.
ఏకా యస్య శిఖణ్డమణ్డనమభూద్దేవస్య శమ్భోః కలా
శేషాభ్యోఽమృతమాప్నువన్తి చ సదా స్వాహాస్వధాజీవినః. 6

వ్యా. అత్రిముని నేత్రమునుండి జనించిన చంద్రునకును, సముద్రము నుండి జనించిన చంద్రునకును ఏకత్వము.

"బ్రహ్మ (మానస) పుత్రులును, యుగప్రారంభమున ఆవిర్భవించిన గురువులును, నమస్కరింపదగినవారును అగు ఏ, ఏడుగురు ప్రపంచస్రష్ట లగు ప్రజాపతులు కలరో, వారిలో, అత్రిమహర్షి, నేత్రమునుండి జనించిన జ్యోతి స్సును ఆకాశమునందు ఉంచెను. అతడు చంద్రు డయ్యెను. ఆ చంద్రుని ఒక కళ భగవంతు డగు ఈశ్వరుని శిరోమాణిక్యముగ నున్నది. మిగిలిన కళల నుండి, దేవతలును, పితృదేవతలును, ఎల్లప్పుడును అమృతమును పొందు చున్నారు."

వి. దేవతలకు ఏదైన హవిస్సు సమర్పించునపుడు "స్వాహా" అని ఉచ్చరింతురు: పితృదేవతలకు సమర్పించునపుడు 'స్వధా' అని ఉచ్చరింతురు. అందుచే దేవతలకు స్వాహాజీవులనియు, పితృదేవతలకు స్వధాజీవులనియు పేర్లు.

మూ. యథా చ:- "యదిన్దోరన్వేతి వ్యసనముదయం వా నిధిరపా

ముపాధి స్త్రాయం జయతి జనికర్తుః ప్రకృతితా.

అయం కః సమ్బన్ధో యదనుహరతే తస్య కుముదం

విశుద్ధాః శుద్ధానాం ధ్రువమనభిసన్ధిప్రణయినః" 7

ఇంకను (చంద్రుడుసముద్రమునుండి పుట్టినాడనుటకు) ఉదాహరణ మెట్లనగా:- "సముద్రుడు చంద్రుని ఉదయమునుకాని, వ్యసనమునుకాని అనుసరించుచున్నాడు (చంద్రోదయమున పొంగును, లేనపుడు తగ్గిపోవును) అందులకు అతడు చంద్రునికి జనకుడు అనునది కారణముగ నున్నది. కాని కలువ అతనిని అనుసరించుటకు కారణమేమి? విశుద్ధమైనవారు, విశుద్ధమైనవారి విషయమున, అకారణముగనే ప్రేమకలవారై ఉందురు. ఇది సత్యము."

మూ. బహుకాలజన్మనోఽపి శివచన్ద్రమసో బాలత్వమ్:-

"మాలాయమానామరసిన్ధుహంసః కోటీరవల్లీకుసుమం భవస్య.

దాక్షాయణీవిభ్రమదర్పణశ్రీ బాలేన్దుఖణ్డం భవతః పునీతాత్." 8

వ్యా. బాలకాలమునకు పూర్వమే జనించిన వాడైనను, శిరస్సుపైనున్న చంద్రుడు ఎప్పటికి బాలుడుగనే నుండుట:-

"మాలవలె నున్న గంగానదియందలి హంసయు, శివుని జటాజూట లతయందలి పుష్పమును, సతీదేవియొక్క విలాసార్థమైన అద్దమువంటి కాంతి కలదియు అగు బాలేందుఖండము మిమ్ములను పవిత్రము చేయుగాక."

మూ. కామస్య మూర్తత్వం చ యథా:-

"అయం స భువనత్రయప్రథితసంయమః శఙ్కరో

బిభర్తి వపుషాధునా విరహకాతరః కామినీమ్.

అనేన కిల నిర్జితా వయమితి ప్రియాయాః కరం

కరేణ పరితాడయన్ జయతి జాతహాస్యః స్మరః" 9

యథా చ:-"ధనుర్మాలా మౌర్వీ క్వణదలికులం లక్ష్యమబలా

మనో భేద్యం శబ్దప్రభృతి య (తయ) ఇమే పంచ విశిఖాః.

ఇయాన్ జేతుం యస్య త్రిభువనమనఙ్గస్య విభవః

స వః కామః కామాన్ దిశతు దయితాపాఙ్గవసతిః." 10

వ్యా. మన్మథుడు సశరీరు డని కూడ వర్ణించుటకు ఉదాహరణము ఎట్లనగా— "మూడు లోకములందును ప్రసిద్ధ మైన సంయమము గల ఆ శంకరుడు ఇపుడు విరహమునుండి భయపడుచున్నవాడై భార్యను శరీరమునందే ధరించు చున్నాడు. ఈతడు మమ్ములను ఓడించినాడట!" అని పలుకుచు, ప్రియురాలి హస్తముపై హస్తముతో చరచుచు నవ్వుచున్న మన్మథుడు సర్వోత్కర్షతో నున్నాడు."

మన్మథుడు శరీరరహితుడనివర్ణించుటకు ఉదాహరణము:- "పుష్పమాల ధనస్సు, ధ్వని చేయుచున్న తుమ్మెదల సముదాయము నారి. అబలలమనస్సు భేదింపదగిన లక్ష్యము. శబ్దము మొదలైన (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు) ఈ ఐదును బాణములు. శరీరరహితు డైన ఏ మన్మథునకు. త్రిభువనమును జయించుటకు, ఇంతమాత్రము సామగ్రియే ఉన్నదో, (అనగా ఇంత స్వల్ప సామగ్రితో మూడు లోకములను కూడ జయింపగలిగిన) అట్టి ప్రియాకటాక్షని వాసి యగు మన్మథుడు మీకు కామములను ఇచ్చు గాక,"

మూ. ద్వాదశానామప్యాదిత్యానామైక్యమ్:

"యస్యాధోధస్తథోపర్యుపరి నిరవధి భ్రామ్యతో విశ్వమశ్వై-

రావృత్తాలాతలీలాం రచయతి రయతో మణ్డలం చణ్డధామ్నః.

సోఽవ్యాదుత్తప్తకార్తస్వరసరలశరస్పర్ధిభిర్ధామదణ్డై-

రుద్దణ్డైః ప్రాపయన్వః ప్రచురతమతమస్తోమమస్తం సమస్తమ్" 11

వ్యా. ద్వాదశాదిత్యులకు ఐక్యము:-

"క్రిందను పైపైనను కూడ అనంత మగు ప్రపంచమునంతను అశ్వములతో సంచరించుచున్న, తీక్ష్ణకాంతి గల ఏ సూర్యుని మండలము, త్రిప్పబడు చున్న కొఱవియొక్క లీలను ధరించుచున్నదో, కాల్చిన బంగారముతో చేసిన పొడవైన బాణములను పోలినతీవ్రమైనకాంతిదండములచే (కిరణములచే) సమస్తమైన, అంధకారసమూహమును నశింపచేయుచున్న ఆ సూర్యుడు మిమ్ములను రక్షించుగాక"

వి. వేరు వేరు లోకములలో వేరు వేరు సూర్యు లున్నట్లు పురాణాదుల వలన తెలియుచున్నను. ఈ అన్ని లోకములందును సంచరించు సూర్యుడు ఒక్కడే అన్నట్లు ఇచట వర్ణింపబడినది,

మూ. నారాయణమాధవయోశ్చ యథా:-
"యేన ధ్వస్తమనోభవేన బలిజిత్కాయః పురాస్త్రీకృతో
యోగఙ్గాం చ దధే న్ధకక్షయకరో యో బర్హిపత్రప్రియః.
యస్యాహుః శశిమచ్ఛిరోహర ఇతి స్తుత్యం చ నామామరాః
సోఽవ్యాదిష్టభుజఙ్గహారవలయస్త్వాం సర్వదో మాధవః" 12

వ్యా. నారాయణమాధవులకు ఏకత్వవర్ణనము ఎట్లనగా :- (ఈ శ్లోకమున శ్లేషచే శివమాధవు లిరువును వర్ణింపబడినారు) శివపక్షమున :- "నశింపచేయ బడిన మన్మథుడు కల ఎవనిచే, పూర్వము విష్ణువుయొక్క శరీరము అస్త్రముగ చేయబడినదో (పురా + అస్త్రీకృతః) అంధకాసురుని నశింపచేసిన ఎవడు గంగను ధరించెనో, ఎవనికి నెమలి వాహనముగా (పత్ర) గల కుమారస్వామి ప్రియుడో, ఎవని శిరస్సు చంద్రునితో కూడినదో, స్తుత్యమైన "హరుడు" అను ఎవని నామ ధేయమును దేవతలు ఉచ్చరించుచుందురో అట్టి, ఇష్టమైన భుజంగహారములును వలయములును కల, పార్వతీపతి యైన శివుడు (సర్వదా + ఉమాధవః) నిన్ను రక్షించుగాక." మాధవుని పక్షమున :- "జన్మరహితు డగు ఎవనిచే శకటము నశింపచేయబడినదో; అనగా శకటాసురుడు నశింపచేయబడినాడో, (ధ్వస్తం + అనః + అభవేన), బలిని జయించిన తన దేహము పూర్వము స్త్రీగా (మోహిన్య వతారమున) (పురా = స్త్రీకృతః) చేయబడినదో, అంధకులకు (యాదవులకు) నివాసమును (క్షయ) కల్పించిన ఎవడు గోవర్ధనపర్వతమును, (వరాహావతార మున) భూమిని ధరించెనో (యః + అగం + గామ్), ఎవనికి నెమలిపింఛము ఇష్టమో, రాహువుయొక్క శిరస్సును హరించినవాడు (శశిమత్ = చంద్రుని పీడించురాహువు) అను స్తుత్యమైన నామధేయమును దేవతలు ఉచ్చరించుచుందురో, అట్టి, ఇష్టమైన భుజంగసంహారి (గరుత్మంతుడు) గలవాడును, రవమునందు అనగా శబ్దబ్రహ్మమునందు లీను డగువాడును, (ఇష్టభుజంగహా + రవలయః), సర్వమును ఇచ్చువాడును అగు మాధవుడు (సర్వదః + మాధవః) నిన్ను రక్షించుగాక."

వి. వామనమోహినీవరాహాద్యవతారములను దాల్చిన నారాయణుడును, మాధవుడు (శ్రీకృష్ణుడును) ఒక్కరే అన్నట్లు ఈ శ్లోకము వర్ణించుచున్నది.

మూ. ఏవం దామోదరశేషకూర్మాదేః కమలాసమ్పదోశ్చ,

యథా :- దోర్మన్దేరితమన్దరేణ జలధేరుత్థాపితా యా స్వయం
యాం భూత్వా కమఠః పురాణకకుదన్యస్తాముద స్తమ్భయత్.
తాం లక్ష్మీం పురుషోత్తమః షునరసౌ లీలాళ్చిత భ్రూలతా—
నిర్దేశైః సమపీవిశత్ప్రణయినాం గేహేషు దోష్ణి క్షితిమ్.'' 18

వా, దామోదర-శేష- కూర్మాదులకును లక్ష్మి-సంపదలకును ఐక్యము ఎట్లనగా:-

''బాహువుచే మందముగ ప్రక్కకు తొలగించబడిన మందర పర్వతము గల విష్ణువుచే ఏ లక్ష్మి స్వయముగ (చేయూత నిచ్చి సముద్రమునుండి పైకి తీయబడినదో. కూర్మముగా అయి, ఏ భూమిని తన అతిపురాణ మగు వీపుపై ఉంచి నిలిపెనో అట్టి లక్ష్మిని ఈ పురుషోత్తముడు విలాసగా కదల్చబడిన కను బొమ్మలచే చేసిన ప్రేరణచే తన భక్తుల గృహములలో ప్రవేశింపచేసెను; అట్టి భూమిని తన భుజముపై ఉంచుకొనెను.''

వి. భూమిని ధరించినది ఆదిశేషుడు. కాని ఇచట కూర్మము భూమిని మోసినట్లు వర్ణింపబడినది. ఇట్లే క్షీరసముద్రము నుండి వచ్చిన లక్ష్మియే ఐశ్వర్య మని వర్ణింపబడినది. ఈ విధముగ ఈ శ్లోకమున శేష-కూర్మములకును, లక్ష్మి-సంపదకును ఐక్యము వర్ణింపబడినది. ఇచట దామోదరుని ప్రసక్తి యేమియు లేదు. అందుచే పై వాక్యమున "ఏవందామోదరాదేః". శేషకూర్మాదేః కమలా సమ్పదోశ్చ యథా" అను పాఠ ముండి యుండును. పూర్వశ్లోకములో నారాయణ మాధవులకు ఏకత్వమును చెప్పినట్లే దామోదరాదులకు చెప్పవచ్చును అని యర్థము. శేష కూర్మాదుల అభేదము క్రొత్త విషయము. దానికి ఈ శ్లోకము ఉదాహరణముగ చూపబడినది.

మూ. భౌమస్వర్గ్యవత్పాతాలీయోఽపి కవిసమయః. తత్రనాగసర్పయో రైక్యమ్:-

''హేనాగరాజ! బహుమస్య నితమ్బభాగం
భోగేన గాఢమభివేష్టయ మన్దరాద్రేః.
సోఢావిషహ్య వృషవాహన యోగలీలా
పర్యఙ్కబన్ధనవిధే స్తవ కోఽతిభారః. 14

వ్యా. భౌమస్వర్గ్య కవిసమయముల వలె పాతాలీయకవి సమయము కూడ ఉన్నది. అందు-నాగసర్పముల ఐక్యమునకు ఉదాహరణము:- ఓ నాగరాజా! ఈ

మందరపర్వతముయొక్క విశాలమైన మధ్య ప్రదేశమును, నీ శరీరముచేత గట్టిగ చుట్టబెట్టుము. శివుడు యోగాభ్యాస సమయమున కట్టిన సంపింపశక్యము కాని పర్యంకబంధనమును సహించిన నీకు అతిభార మనునది ఏది యున్నది?"

వి. ధ్యానసమయమున ఆసనమును స్థిరముగ ఏర్పరచుకొని, ఆ ఆసనము కదలకుండగ నుండునట్లు మోకాళ్లమీదుగ ఏదైన వస్త్రాదికమును నడుమునకు గట్టిగ బిగించికట్టుట పర్యంకబంధనము శివుడు వాసుకిని ఈ విధముగ కట్టినా డని యర్థము. ఇచట సర్పములును నాగములును అభిన్నములే యని గ్రహించి సర్పరాజు నాగరాజుగ వర్ణింపపడినాడు.

మూ. దైత్యదానవాసురాణామైక్యం యథా-తత్ర హిరణ్యాక్ష-హిరణ్యకశిపు-ప్రహ్లాద-విరోచన-బలి-బాణాదయోదైత్యాః. విప్రచిత్తి-శమ్బర-నముచి-సులోమ ప్రభృతయో దానవాః. బల-వృత్ర-విక్షురస్త-వృషపర్వాదయోఽసురాః. తేషామైక్యం యథా:-

జయన్తి బాణాసురమౌలిలాలితా దశాస్యచూడామణి చక్రచుమ్బినః.
సురాసురాధీశశిఖాన్తశాయినో భవచ్ఛిదస్త్ర్యమ్బక పాదపాంసవః 15

వ్యా. దైత్య-దానవ-అసురలకు ఐక్యమెట్లనగా :- అందు హిరణ్యాక్ష-హిరణ్యకశిపు-ప్రహ్లాద-విరోచన-బలి-బాణాదులు దైత్యులు. విప్రచిత్తి-శంబర-నముచి-పులోమాదులు దానవులు. బల-వృత్ర-విక్షురస్త - వృషపర్వాదులు అసురులు వీరి అందరి ఐక్యమును వర్ణించుటకు ఉదాహరణము:- (ఇది కాదంబరిలోని శ్లోకము.)

''బాణాసురుని శిరస్సుపై లాలింపబడినవియు, రావణుని శిరస్సులందలి మాణిక్యములను స్పృశించునవియు, సురాధిపతులయొక్కయు, అసురాధీశుల యొక్కయు శిరస్సుల అగ్రమున శయించునవియు, సంసారమును నశింపచేయునవియు అగు ఈశ్వరుని పాదరాగములు సర్వోత్కర్షగ నున్నవి.''

వి. బాణుడు దైత్యుడైనను అసురుడుగ వర్ణింపబడినాడు.

మూ. యథా చ :- ''తం శమ్బరాసురశరాశనిశల్యసార -
కేయూరరత్నకిరణారుణబాహుదణ్డమ్.
పీనాంసలగ్నదయితాకుచపత్రభఙ్గం
మీనధ్వజం జితజగత్త్రితయం జయేత్కః". 16

యథా చ :- అస్తి దైత్యో హయగ్రీవః సుహృద్వేశ్మసు యస్య తాః.
ప్రథయన్తి బలం బాహ్వోః సితచ్ఛత్రస్మితాః శ్రియః. 17

యథా చ హయగ్రీవం ప్రతి :-
దానవాధిపతే భూయో భుజో౽యం కిం న నీయతే
సహాయతాం కృతాన్తస్య క్షయాభిప్రాయసిద్ధిషు. 18

యథా చ :- మహాసురసమాజే౽స్మిన్ న చైకో౽ప్యస్తి సో౽సురః.
యస్య నాశనినిష్పేషనీరాజితమురఃస్థలమ్. 19

వ్యా. ఇంకను ఎట్లనగా :- "శంబరాసురుని వజ్రాయధమువంటి శరముల శల్యములయొక్క సారము వలె నున్న బాహుపురులయందలి రత్నకిరణములచే ఎఱ్ఱనైన బాహుదండము కలవాడును, బలిసిని భుజమునందు లగ్నమైన, ప్రియురాలి కుచమునందలి పత్రరచన కలవాడును, జయింపబడిన మూడు లోకములు కలవాడును అగు మన్మథుని ఎవడు జయింపగలడు ?"

వి. ఇచట దానవుడైన శంబరుడు అసురుడుగ వర్ణింపబడినాడు.

వ్యా. ఇంకను ఎట్లనగా :- "స్నేహితుల గృహములందు శ్వేతచ్ఛత్రములతో చిరునవ్వు నవ్వుచున్న లక్ష్మి ఎవని బాహుబలమును వ్యక్తీకరించుచున్నదో అట్టి హయగ్రీవు డను దైత్యుడు ఉన్నాడు."

"ఈ హయగ్రీవుని గూర్చియే ఇంకను ఎట్లనగా - "దానవాధిపతి యైన ఓహయగ్రీవా ! లోకక్షయమును గూర్చిన అభిప్రాయము సిద్ధించుటకై, నీ ఈ భుజము, యమునకు సహాయముగ గ్రహింపబడుట లేదా ?"

వి. ఒకే కావ్యమునందలి ఈ శ్లోకములలో మొదటిదానిలో హయగ్రీవుడు దైత్యుడనియు, రెండవదానిలో దానవుడనియు చెప్పబడినది.

వ్యా. ఇంకను ఎట్లనగా - "ఈ మహాసురసమాజములో, ఎవని వక్షస్థలము వజ్రాయుధప్రహారముచే నీరాజన మీయబడలేదో అట్టి అసురుడు ఒక్కడును లేడు."

వి. ఇచట దైత్యదానవాదు లందరును అసుర లని చెప్పబడినారు,

మూ. ఏవమన్యే౽పి భేదాః:-
"సో౽యం కవీనాం సమయః కావ్యే సుప్త ఇవ స్థితః
స సామ్ప్రతమిహాస్మాభిర్యథాబుద్ధి ప్రబోధితః" 20

ఇతి రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽ ధికరణే స్వర్గ్యపాతాలీయకవిరహస్యస్థాపనా షోడశోఽధ్యాయః

వ్యా. కవిసమయములకు సంబంధించిన ఇతర భేదములు కూడ ఇట్లే ఊహింపతగినవి.

"ఈ కవిసమయము కావ్యములో నిద్రపోవుచున్నట్లున్నది. అది, ఇపుడు, నాచే బుద్ధ్యనుసారముగ మేల్కొల్పబడినది",

కవిసమయములను మహాకవులు తమ కావ్యములలో ఉపయోగించి యున్నారు. కాని ఎవరును వాటిని స్పష్టముగ గుర్తింపలేదు. నేనే ఇదంప్రథమముగ వీటిని బైటకు తీసినాను అని రాజశేఖరుని అభిప్రాయము.

బాలనందిలో షోడశాధ్యాయము సమాప్తము.

సప్తదశోఽధ్యాయః-దేశవిభాగః

మూ. దేశం కాలం చ విభజమానః కవిర్నార్థదర్శనదిశి దరిద్రాతి. జగత్ జగదేకదేశాశ్చ దేశః. ద్యావాపృథివ్యాత్మకమేకం జగదిత్యేకే. తదాహుః.

"హలమగు బలస్యైకోఽనడ్వాన్ హరస్య న లాఙ్గలం
క్రమపరిమితా భూమిర్విష్ణోర్న గౌర్న చ లాఙ్గలమ్,
ప్రవహతి కృషిర్నాద్యాప్యేషాం ద్వితీయగవం వినా
జగతి సకలే నేదృగ్ దృష్టం దరిద్రకుటుమ్బకమ్." 1

వ్యా. దేశమును, కాలమును విభజించి తెలిసికొనగలిగిన కవి అర్థమును చూచు విషయమున దారిద్ర్యవంతుడు కాడు. జగత్తు, జగత్తులోని భాగములును, దేశము. స్వర్లోకభూలోకాత్మకమగునది అంతయు ఒక్క జకత్తే అని కొందరి అభిప్రాయము కావుననే ఇట్లు చెప్పుచున్నారు.

"బలరాముని వద్ద ఎద్దులు లేని నాగలి ఉన్నది, ఈశ్వరుని దగ్గర ఉన్నది ఒక్కటే ఎద్దు; నాగలి లేదు. విష్ణువునకు పాదన్యాసములచే (క్రమముగను)

కొలిచిన భూమి ఉన్నది కాని ఎద్దును లేదు నాగలియు లేదు. వీరు ముగ్గురు కలిసినను రెండవ ఎద్దు లేకుండగ వ్యవసాయము సాగదు. సకల జగత్తునందును ఇట్టి దరిద్రకుటుంబము చూడబడలేదు"

వి. ఈ శ్లోకమున భూలోకస్వర్గలోకములను రెండింటిని కలిపి ఒక్క జగత్తుగ వర్ణించినాడు కవి.

మూ. 'దివస్పృథివ్యౌ ద్వే జగతీ' ఇత్యపరే. తదాహుః-
"రుణద్ధి రోదసీ చాస్య యావత్కీర్తి రనశ్వరీ.
తావత్కిలాయమధ్యాస్తే సుకృతీ వైబుధం పదమ్'' 2

వ్యా. స్వర్గలోకము, పృథివి అనునవి రెండు జగత్తులని కొందరు చెప్పుదురు. కావుననే ఇట్లు చెప్పుచున్నారు:-

"ఇతని కీర్తి, అనశ్వరమై ఎంతకాలమువరకు భూలోకస్వర్గలోకములను అక్రమించి యుండునో, అంతవరకును, ఈ పుణ్యాత్ముడు, స్వర్గలోకమును అధిష్ఠించి యుండునట."

వి. ఇచట స్వర్గలోకము వేరు జగత్తు, భూలోకము వేరు జగత్తు అనునట్లు సూచితమైనది. కాని ఈ భేదము అంతగ స్పష్టముగ లేదు. ''ద్యావాపృథివ్యౌ రోదస్యౌ'' అని అమరము.

మూ. ''స్వర్గ మర్త్యపాతాళ భేదాత్తిస్ర ఇతి జగన్తి'' ఇత్యేకే.
యథాహుః :- "త్వమేవ దేవ పాతాలమాశానాం త్వం నిబన్ధనమ్.
త్వం చామర మరుద్భూమిరేకో లోకత్రయాయసే.'' 3

వ్యా. స్వర్గము, మర్త్యలోకము అను భేదముచే మూడు జగత్తులని కొందరు చెప్పుదురు. కావుననే ఇట్లు చెప్పుదురు:- ''ఓ దేవా! నీవే పాతాలము. 'పాతా + అలమ్' అను పద చ్ఛేదముచే బాగుగా రక్షింపువాడవని రాజపక్షమున అర్థము. నీవు దిక్కులకు ఆధారము; అనగా భూలోకము, రాజపక్షమున అందఱికును కారణభూతుడవు అని అర్థము. నీవే దేవతలకును, మరుత్తులకు స్థానమైన స్వర్గము. రాజపక్షమున — చామరముల గాలికి స్థానమైనవాడవు అని యర్థము. ఈ విధముగ నీవొక్కడవే లోకత్రయమువలె నున్నావు"

మూ. ''తాన్యేవ భూర్భువస్స్వః" ఇత్యన్యే. తదాహుః—

"నమస్త్రిభువనాభోగభృతిఖేదభరాదివ.
నాగనాథాఙ్కపర్యఙ్కశాయినే శార్ఙ్గధన్వనే." 4

వ్యా. "ఈ మూడు లోకములే భూలోకభువర్లోకసువర్లోకములు" అని మరి కొందరందురు. కావుననే ఇట్లు చెప్పుదురు:- త్రిభువనవైశాల్యమునంతను (విశాలములైన మూడు భువనములను) మోయుటవలన కలిగిన అధిక మగు అలసటవలననా అన్నట్లు ఆదిశేషుని శరీర మనెడు పర్యంకమునందు శయినించిన శార్ఙ్గధన్వునకు (శ్రీమహావిష్ణువునకు) నమస్కారము.

మూ. "మహర్జన స్తపః సత్యమిత్యేతైః సహ సప్త" ఇత్యపరే

తదాహుః- "సంస్తమ్భినీ పృథునితమ్బతటైర్ధరిత్ర్యాః
సంవాహినీ జలముచాం చలకేతుహస్తైః.
హర్షస్య సప్తభువనప్రథితోరుకీర్తేః
ప్రాసాదపఙ్క్తిరియముచ్ఛిఖరా విభాతి." 5

వ్యా. "మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము అను వాటితో కలిసి ఏడు లోకములు" అని మరికొందరు. కావుననే చెప్పుదురు:- "విశాలములైన మధ్యభాగములచే భూమిని నిలబెట్టుచున్నదియు, కదలుచున్న ధ్వజము లనెడు హస్తములచే మేఘములను (అంచెలవారిగా) నడుపుచున్నదియు, ఏత్తైన శిఖరములు కలదియు అగు, సప్తభువనములలో ప్రసిద్ధమైన గొప్ప కీర్తిగల హర్షవర్ధనుని ఈ ప్రాసాదముల పంక్తి ప్రకాశించుచున్నది."

వి. ఇచట ఏడు లోకము లని చెప్పబడినది.

మూ. "తాని సప్తభిర్వాయుస్కన్ధైః సహ చతుర్దశ" ఇతి కేచిత్.

తదాహుః:- "నిరవధి చ నిరాశ్రయం చ యస్య
స్థితమనువర్తితకౌతుకప్రపఞ్చమ్.
ప్రథమ ఇహ భవాన్ స కూర్మమూర్తి
ర్జయతి చతుర్దశలోకవల్లికన్దః." 6

వ్యా. "ఏడు వాయుస్కంధములతో కలసి ఆ భువనములు పదునాలుగు" అని కొందరు. ఈ విషయములనే ఇట్లు చెప్పుచున్నారు:- "అవధులు లేనిదియు ఆశ్రయము లేనిదియు, అగు ఎవని స్థితి ప్రపంచముయొక్క కౌతుకము అవిచ్ఛి

న్నముగ నుండునట్లు చేయునో, అట్టివాడును, పదునాలుగులోకము లనెడు లతకు అంకురమైనవాడును అగు ఆ ఆది కూర్మమూర్తి వైన నీవు సర్వోత్కర్షగ నున్నావు''

వి. ఏడు వాయుస్కంధములు మేఘనక్షత్రమండలాదులకు ఆధారముగ నున్న వని పద్మపురాణమున చెప్పబడినది :-

ఆవహః ప్రవహశ్చైవ సంవహశ్చోద్వహ స్తథః
వివహాఖ్యః పరివహః పరావహ ఇతి క్రమాత్.
సప్తైతే మారుతస్కన్ధా మహర్షిభిరుదీరితాః.
ఆవహో వర్తయేద్వాయు మేఘోల్కావృష్టివిద్యుతః
వర్తయేత్ప్రవహశ్చాథ తథా మార్తాణ్డమణ్డలమ్.
వర్తయేదుద్వహశ్చాపి తథా నక్షత్రమణ్డలమ్.
సంవహో మారుతస్కంధ స్తథా శీతాంశుమణ్డలమ్
పంచమో వివహాఖ్యశ్చ తథైవ గ్రహమణ్డలమ్.
సప్తర్షిచక్రం స్వర్గఙ్గాం షష్ఠః పరివ హస్తథా.
పరావహ స్తథా వాయుర్వ ర్తయేద్ధ్రువమణ్డలమ్.''
మూ. ''తాని సప్తభిః పాతాళైః సహైకవింశతిః'' ఇతి కేచిత్.
తదాహుః :- ''హరహాస హరావాసహరహారనిభప్రభాః
కీర్తయ స్తవ లిమ్పన్తు భువనాన్యేకవింశతిమ్.'' 7

వ్యా. అవి ఏడు పాతాలము లతో (అతల-వితల-సుతల-తలాతల-మహాతల-రసాతల - పాతాలములు) కలిసి ఇరువదియొక్కటి అని కొందరు చెప్పుదురు. ఈ విషయమునే ఇట్లు చెప్పుదురు :- ''ఈశ్వరుని నవ్వుతోడను, ఈశ్వరుని నివాసము (కైలాసము) తోడను, ఈశ్వరుని హారము (వాసుకి) తోడను సమాన మగు కాంతులు గల నీ కీర్తులు ఇరువదియొక్క భువనములను పూయు గాక.''

మూ. ''సర్వముపపన్నమ్ ' ఇతి యాయావరీయః. అవిశేషవివక్షా యదేకయతి, విశేషవివక్షా త్వనేకయతి. తేషు భూర్లోకః పృథివీ. తత్ర సప్త మహాద్వీపాః.

''జమ్బూద్వీపః సర్వమధ్యే తతశ్చ ప్లక్షో నామ్నా శాల్మలోఽతః కుశోఽతః క్రౌఞ్చః శాకః పుష్కరశ్చేత్యథైషాం బాహ్యాబాహ్యే సంస్థితిర్మణ్డలీభిః". 8

వ్యా. ఇది యంతయు ఉపపన్నమే అని యాయావరీయుడు. ఏలనన, భేదవివక్ష లేనిచో జగత్తంతయు ఒక్కటే అను బుద్ధి ఏర్పడును. భేదవివక్షచే (అనగా వేరు వేరు లోకములు అను దృష్టితో చూచినచో) అనేకలోకము లున్నట్లుండును. వాటిలో భూర్లోకమనగా (ఈ) పృథివి. ఈభూర్లోకమునందు ఏడు మహాద్వీపము లున్నవి.

"ఈ ఏడు ద్వీపముల మధ్య జంబూద్వీప మున్నది. దాని తరువాత, క్రమముగ, ప్లక్ష-శాల్మల-కుశ-క్రౌఞ్చ-శాక-పుష్కరములను మహాద్వీపము లున్నవి. ఈమహాద్వీపము లన్నియు ఒకదాని బైట ఒకటిగ గోళాకారమున నున్నవి"

మూ. ''లావణోరసమయః సురోదకః సార్పిషో దధిజలః పయఃపయాః
స్వాదువారి రుదధిశ్చ సప్తమస్తాన్పరీత్య త ఇమే వ్యవస్థితాః" 9

వ్యా ''ఈ ద్వీపముల చుట్టు, లవణ-ఇక్షురస-సురా-ఘృత-దధి-క్షీర-మధురజలసముద్రము లున్నవి.

మూ. ''ఏక ఏవాయం లావణః సముద్ర'' ఇత్యేకే. తదాహుః-
''ద్వీపాన్యష్టాదశాత్ర క్షితిరపి నవభిర్విస్తృతా స్వాఙ్గఖణ్డై-
రేకోఽమ్భోధిర్దిగన్తప్రవిసృతసలిలః ప్రాజ్యమేతత్సురాజ్యమ్.
తస్మిన్నప్యాజికేలివ్యతికరవిజయోపార్జితే వీరపర్యే
చక్రే పుష్టేన దాతుం తదిదమితి ధియా వేధసే యశ్చుకోప'' 10

వ్యా. ఈ లవణసముద్రము ఒక్కటియే యని కొందరు. కావుననె చెప్పుచున్నారు:- "ఇచట పదునెనిమిది ద్వీపము లున్నవి, భూమి కూడ తొమ్మిది ఖండములుగ విస్తృత మైనది. (కాని) దిగన్తములవరకును వ్యాపించిన ఉదకముగల సముద్రము మాత్రము ఒక్కటే. ఈ ద్వీపము లన్నింటిపై విస్తృతమైన ఈ రాజ్యము యుద్ధ కేలిసంబంధముచే సంపాదింపబడిన విజయము గల ఎవరో ఒకానొక వీరశ్రేష్ఠునకు ఒక ముద్దగా ఇచ్చుటకై సృష్టింపబడినది అను బుద్ధిచే, ఎవడు బ్రహ్మపై కోపగించెనో"

వి. ఇది ఎవరిశ్లోకమో తెలియక పోవుటచే భావ మంత స్పష్టముగ లేదు. బ్రహ్మ ఇన్ని ద్వీపములను కలిపి ఒక్క సముద్రముతో చుట్టి సృష్టించుటచే ఎవడో ఒక్క మహావీరుడు మాత్రమే ఒక్క ముద్దగ ఈ రాజ్యమునంతను తీసి కొనుసు అనేకసముద్రము లున్నచో అనేకులు వేరువేరురాజ్యములను పొందుటకు అవకాశ ముండెడిది కదా అని ఎవరైన ఒక వీరు డనుకొనుచుండవచ్చును. ఏమై నను భావము అంత తృప్తికరముగ లేదు. 'ఏతత్సు + రాజ్యమ్' అని పదచ్ఛేదము చేయబడినది. ఇచట సముద్ర మొకటే యని చెప్పబడినది.

మూ. త్రయః ఇత్యన్యే, తదాహ :-

> ''ఆకమ్పితక్షితిభృతా మహతా నికామం
> హేలాభిభూతజలధిత్రితయేన యస్య.
> వీర్యేణ సంహతిభిదా విహతోన్నతేన
> కల్పాన్తకాలవిసృతః పవనోఽనుచక్రే". 11

వ్యా. ''సముద్రములు మూడు'' అని మరికొందరు. అది ఇట్లు చెప్పుదురు.

" కదల్పబడిన రాజులు కలదియు (ప్రలయపవనపక్షమున కదల్పబడిన పర్వతములు కలది అని యర్థము), మిక్కిలి గొప్పదియు, అనాయాసముగ తిర స్కరింపబడిన మూడు సముద్రములు కలదియు, శత్రువుల (వస్తువుల) కల యికను భేదించినదియు, నశింపచేయబడిన ఉద్ధతులు (ఉన్నతస్థానములు) కల దియు అగు ఎవని వీర్యముచే కల్పాంతమునందు వ్యాపించిన వాయువు అనుక రింపబడెనో."

మూ.యథా వా:-మాతఙ్గానామభావే మదమలినముఖైః ప్రాప్తమాశాకరీన్ద్రైః

> జాతే రత్నాపహారే దిశి దిశి తతయో భాన్తి చిన్తామణీనామ్.
> ఛిన్నే షూద్యానవాపీతరుషు విరచితాః కల్పవృక్షా రిపూణాం
> యస్యోదఞ్చత్త్రివేలావలయవలభుజాం మానసీ సిద్ధిరాసీత్. 12

వ్యా. మరి యొక ఉదాహరణము ఎట్లనగా–"మూడు సముద్రతీరములచే వలయిత మగు భూమియొక్క ఫలములను అనుభవించుచుండెడివారగు, ఆతని శత్రువులకు, ఏనుగులు లేకపోయినను, మలినములగు ముఖములు గల దిగ్గజములు లభించినవి; రత్నము లన్నియు అపహరింపబడినను ప్రతిదిక్కునందును చింతా

ముఖ్య సముదాయములు ప్రకాశించుచున్నవి; ఉద్యానవాపీతీరములందలి వృక్షములు సేవింపబడినను కల్పవృక్షములు లభించినవి; ఈ విధముగ మానసికసిద్ధి (కోరినవెంటనే సిద్ధి) ఆయినది." అనగా వారు నిహతులై స్వర్గమునకు పోయిరి అని యర్థము.

మూ. 'చత్వారః' ఇత్యపరే. తదాహుః—

''చతుఃసముద్రవేలోర్మిరచితైకావలీలతమ్.

మేరుమప్యద్రిముల్లఙ్ఘ్య యస్య క్వాపి గతం యశః.'' 18

వ్యా. కొందరు నాలుగు సముద్రము లున్నవని చెప్పుదురు. కావుననే ఇట్లు చెప్పుదురు:- ''అతని కీర్తి చతుః సముద్రతీరములందలి తరంగములచే నిర్మింపబడిన సన్నని ఒంటిపేట హారము గల మేరుపర్వతమును గూడ లంఘించి ఎచటికో పోయినది.''

మూ. "భిన్నాభిప్రాయతయా సర్వముపపన్నమ్" ఇతి యాయావరీయః. సప్తసముద్రీ వాదినస్తు శాస్త్రైదనపేతా ఏవ. తదాహుః :-

అగస్త్యచులుకోత్సృష్ట (క్షిప్త) సప్తవారిధి వారిణి.

ముహూర్తం కేశవేనాపి తదన్తః పూతరాయితమ్.

వ్యా. వేరువేరు అభిప్రాయములను పట్టి వెనుక చెప్పిన మతము లన్నియు సరియైనవే అని యాయావరీయుడు. సప్త సముద్రములున్న వని చెప్పువారు మాత్రము శాస్త్ర విరుద్ధ మతము కలవారు కారు. ఇట్లు చెప్పుచున్నారు:- "అగస్త్యుని చులుకమునందు గ్రహింపడిన సప్త సముద్రముల జలమునందు, కేశవుడు కూడ క్షణకాలము పాటు ఆ నీటిమధ్యలోనుండు క్షుద్రజలజంతువు వలె అయినాడు''

వి. చులుక మనగా ఆచమనము చేయుటకు బొటనవ్రేలు, చూపుడు వ్రేలు మడిచి పట్టిన అరచేయి. పూతర = క్షుద్రమైన జలజంతువు. కేశవుడు సాగరశయను డగుటచే నీటితో పాటు అగస్త్యుని చులుకములోనికి వచ్చె నని యర్థము. ఇచట సముద్రములు ఏడని చెప్పబడినది.

మూ. "కవి ప్రసిద్ధ్యావా౽విమృష్టపరమార్థం సర్వముప పన్నమ్" (ఇతి యాయావరీయః)

''మధ్యే జమ్బూద్వీపమాద్యో గిరీణాం
మేరుర్నామ్నా కాఞ్చనః శైలరాజః
యో మూర్తా ౘ (యోఽమర్త్యానా) మోషధీనాం నివాసం
యశ్చావాసః సర్వవృన్దారకాణామ్. 14
''తమేవ మవధీకృత్య దేవేనామ్బుజ జన్మనా.
తిర్యగూర్ధ్వ మధస్తాచ్చ విశ్వస్య రచనా కృతా.'' 15

వ్యా. లేదా కవి ప్రసిద్ధిచేత గూడ, పరమార్థమును విమర్శింపనంత వరకును అంతయు ఉపపన్నమే (అని యాయావరీయుడు)

''ఏది మూర్తీభవించిన ఓషధులకు నిధియో, ఏది సకలదేవతలకును నివాసస్థానమో అట్టిదియు, పర్వతములలో మొదటిదియు అగు మేరుపర్వత మనెడు పర్వతము జంబూద్వీపమధ్యమున నున్నది''.

''దానిని అవధిగ చేసికొని, భగవంతుడగు బ్రహ్మచే,అడ్డముగను,పైకిని, క్రిందికిని, ప్రపంచ సృష్టి చేయబడినది.''

మూ. స భగవాన్ మేరురాద్యో వర్షపర్వతః. తస్య చతుర్దిశమిలావృతం వర్షమ్. తస్యోత్తరేణ త్రయో వర్షగిరయః, నీలః. 'శ్వేతః, శృఙ్గవాంశ్చ' రమ్యకం, హిరణ్మయం, ఉత్తరాః కురవ ఇతి చ క్రమేణ త్రీణి తేషాం వర్షాణి. దక్షిణే నాపి త్రయ ఏవ; నిషధో, హేమకూటో, హిమవాంశ్చ హరివర్షం, కింపురుషం, భారతమితి చ త్రీణి వర్షాణి. తత్రేదం భారతం వర్షమస్య చ నవ భేదాః - ఇన్ద్రద్వీపః, కసేరు-మాన్, తామ్రపర్ణో, గభస్తిమాన్, నాగద్వీపః, సౌమ్యో, గన్ధర్వో, వరుణః, కుమారీద్వీపశ్చాయం నవమః

వ్యా. పూజ్య మగు ఆ మేరుపర్వతము మొదటి వర్షపర్వతము. దానికి నాలుగు దిక్కులందును ఇలావృతవర్ష మున్నది. దానికి ఉత్తరముగ నీలము, శ్వేతము, శృంగవంతము అను మూడు వర్షపర్వతములు. ఆ మూడు వర్షపర్వతములకును వరుసగ – రమ్యకము, హిరణ్మయము, ఉత్తరకురుదేశము అను మూడు వర్షములు. దానికి దక్షిణముగ నిషధము, హేమకూటము, హిమవత్పర్వతము అను మూడు వర్షపర్వతములు. (ఆ మూడు వర్షపర్వతములకును సంబంధించి క్రమముగ) హరివర్షము, కింపురుషము, (టిబెట్) భారతము అని మూడువర్షములున్నవి. వాటిలో ఇది భారతవర్షము. ఈ భారతవర్షమునకు – ఇంద్రద్వీపము (బర్మా), కసేరుమతు (సింగపూర్), తామ్రపర్ణము (సిలోన్)

గభస్తిమత్తు (భారతదేశదక్షిణపశ్చిమ ప్రాంతము), నాగద్వీపము (పశ్చిమ భారతము), సౌమ్యము (పశ్చిమోత్తరభారతము), గంధర్వము (కాబూల్), వరుణము (మధ్యఆసియా) ఈ కుమారీద్వీపము (భరతఖండము) అను తొమ్మిది భేదము లున్నవి.

మూ. పఞ్చశతాని జలం, పఞ్చ స్థలమితి విభాగేన ప్రత్యేకం యోజన సహస్రావధయో దక్షిణాత్సముద్రాద్రిరాజం హిమవన్తం యావత్పరస్పర మగమ్యాస్తే.

వ్యా. ఒక్కొక్కటి వెయ్యి యోజనముల (యోజనమనగా పది మైళ్లు) అవధి గల ఆ తొమ్మిది ద్వీపములును, ఐదు వందల భాగములు జలము, ఐదు వందల భాగములు స్థలము అను రీతిలో విభాగముచే, దక్షిణసముద్రమునుండి పర్వతరాజైన హిమవత్పర్వతమువరకు వ్యాపించి యుండి, పరస్పరము అగమ్య ములుగ (ఒకదానినుండి ఒకదానికి సులభముగ వెళ్లుటకు శక్యము కానివిగ) ఉన్నవి.

మూ. తాన్యేతాని యో జయతి స సమ్రాడిత్యుచ్యతే. కుమారీపురాత్ప్రభృతి బిన్దుసరోఽవధి యోజనానాం దశశతీ చక్రవర్తిక్షేత్రమ్. తాం విజయమాన శ్చక్రవర్తీ భవతి.

వ్యా. వీటి నన్నింటిని జయించినవాడు సమ్రాట్టు. కుమారీపురము (కన్యాకుమారి) మొదలు, బిందుసరస్సు (హిమాలయముపై, గంగోత్రినుండి రెండు మైళ్ళదూరములో నున్న ఒక పవిత్రప్రదేశము) వరకును గల వెయ్యి యోజనముల దేశమునకు చక్రవర్తిక్షేత్ర మని పేరు. ఈ దేశమునంతను జయించువాడు చక్రవర్తి యగును.

మూ. చక్రవర్తిచిహ్నాని తు :-

''చక్రం రథో మణిర్భార్యా నిధిరశ్వో గజస్తథా
ప్రోక్తాని సప్త రత్నాని సర్వేషాం చక్రవర్తినామ్''. 16

వ్యా. చక్రవర్తిచిహ్నము లేవనగా-''చక్రము, రథము, మణి, భార్య, నిధి, అశ్వము, గజము ఈ ఏడును చక్రవర్తిచిహ్నములు.''

మూ. అత్ర చ కుమారీద్వీపే —

విన్ధ్యశ్చ పారియాత్రశ్చ శుక్తిమానృక్షపర్వతః
మహేన్ద్రసహ్యమలయాః సప్తైతే కులపర్వతాః. 17

వ్యా. ఈ కుమారీద్వీపములో, వింధ్యము, పారియాత్రము, శుక్తిమంతము, ఋక్షము, మహేంద్రము, సహ్యము, మలయము అను ఈ ఏడును కులపర్వతములు

వి. వింధ్యపర్వతము :- ప్రసిద్ధమైన వింధ్యపర్వతశ్రేణి. పారియాత్రము :- ఇది వింధ్యకు సంబంధించిన పశ్చిమోత్తరపర్వతశ్రేణి. శుక్తిమాన్ :- పారియాత్రఋక్షపర్వతములను కలుపు వింధ్యపర్వతశ్రేణి. ఋక్షపర్వతము :- బంగాళాఖాతమునుండి నర్మదోత్పత్తిస్థానము వరకును వ్యాపించిన పూర్వవింధ్యపర్వతశ్రేణి. మహేంద్రపర్వతము :- ఒరిస్సాలోని గంజాం ప్రాంతములో ఉన్నది ఇది కలింగదేశపు ఉత్తరసరిహద్దులో నున్నది. సహ్యపర్వతము :- దక్షిణమున కావేరి మొదలు ఉత్తరమున గోదావరివరకును వ్యాపించియున్న పడమటికనుమలలోని ఉత్తరభాగము. మలయము :- వీటిదక్షిణభాగము,

మూ. తత్రవిన్ధ్యాదయఃప్రతీతస్వరూపాః. మలయవిశేషాస్తు చత్వారః. తేషు ప్రథమః :-

''ఆమూలయష్టేః ఫణివేష్టితానాం సచ్చన్దనానాం జననన్దనానామ్.
కక్కోలకైలామరిచైర్యుతానాం జాతీతరూణాం చ స జన్మభూమిః.''

వ్యా. అందు వింధ్యాదులు ప్రసిద్ధస్వభావములు. మలయవిశేషములు మాత్రము నాలుగున్నవి. (అనగా మలయపర్వతమున నాలుగుభాగము లున్నవి) వాటిలో మొదటిది :-

''ఆమలయపర్వతము, మ్రానువరకును సర్పములచే చుట్టబడినవియు, జనులకు ఆనందకరములును అగు ఉత్తమమైన చందనవృక్షములకును, కక్కోలకములతోడను, ఏలా (ఏలకుల) లతలతోడను, మరిచ (మిరియము) లతతోడను కూడిన జాతీ (జాజికాయ)వృక్షములకును ఉత్పత్తిస్థానము.''

మూ. ద్వితీయః

'యస్యోత్తమాం మౌక్తికకామధేనురుపత్యకామర్చతి తామ్రపర్ణీ
రత్నేశ్వరో రత్నమహానిధానం కుమ్భోద్భవస్తం మలయం పునాతి.' 19
''తత్ర ద్రుమా విద్రుమనామధేయా వంశేషు ముక్తాఫలజన్మ తత్ర.
మదోత్కటైః కేసరికణ్ఠనాదైః స్ఫుటన్తి తస్మిన్ ఘనసారవృక్షాః''. 20

వ్యా. మలయపర్వతముయొక్క రెండవ భాగము:

''ముత్యములకు కామధేను వైన (ఉత్పత్తి స్థానమైన)తామ్రపర్ణినది. దేని యొక్క ఉత్తమ మైన పైభాగమును అలంకరించుచున్నదో, రత్నములకు గొప్ప నిధి యైన ఆ మలయపర్వతమును, రత్నేశ్వరు డైన అగస్త్యుడు పవిత్రము చేయుచున్నాడు ''

''దానిపై విద్రుమము లను పేరు గల వృక్షము లున్నవి. అచట వేదుళ్ల నుండి ముత్యములు పుట్టును. దానిపై నున్న కర్పూరవృక్షములు మదోద్ధతము లైన సింహకంఠధ్వనులచే బద్ధలగును"

మూ. తృతీయః :

''విలాస భూమిః సకలామరాణాం పదం నృణాం గౌర్మునిపుఙ్గవస్య.

సదా ఫలైః పుష్పలతా ప్రవాలై రాశ్చర్య మూలం మలయః స తత్ర 21''

వ్యా. మూడవ భాగము:-''సమస్త మైన దేవతలకును విలాస భూమియు, మానవులకు నివాస స్థానమును, అగస్త్యుని గృహమును అగు ఆ మలయ పర్వతము, అచట, ఎల్లప్పుడును ఫలములతోడను, పుష్పములతోడను, లతల చిగుళ్ళ తోడను—ఆశ్చర్యమునకు మూలముగ నున్నది.'

మూ. చతుర్థః-

సా తత్ర చామీకరరత్నచిత్రైః ప్రాసాదమాలా వలభీవిటఙ్కైః

ద్వారార్గలాబద్ధ సురేశ్వరాఙ్కా లఙ్కేతి సా రావణరాజధానీ. 22

''ప్రవర్తతే కోకిలనాదహేతుః పుష్పప్రసూః పఞ్చమ జన్మదాయీ.

తేష్వశ్చతుర్ష్వప్యపి వసన్తమిత్ర మదఙ్కతో దక్షిణమాతరిశ్వా. 23

వ్యా. నాల్గవ భాగము ''బంగారము తోడను రత్నములతోడను చిత్రవర్ణము లైన ప్రాసాదపంక్తులయందలి పై కప్పులతోడను, శిఖరములతోడను (ప్రకాశించుచున్నదియు), ద్వారముయొక్క గడియకు కట్టబడిన సురాధిపతియే చిహ్నముగా గల, లంకయనెడు రావణరాజధాని ఆ మలయపర్వముపై నున్నది." (దీనిని బట్టి లంకలో నున్న పర్వతమునకు కూడ మలయ మని పేరున్నట్లు తెలియుచున్నది).

''కోకిలల నాదమునకు కారణమైనదియు, పుష్పములను వికసింపచేయునదియు (పుట్టించునదియు) పంచమధ్వనిని కలిగించునదియు (పైన 'కోకిల నాద హేతుః' అని చెప్పబడినది గాన దీనికి గాయకులు పంచమస్వరముతో పాదు

నట్లు చేయునది అని భావము చెప్పవలెను) వసంతుని మిత్రుడును అగు దక్షిణ వాయువు ఆ నాలుగు మలయపర్వతభాగములనుండియు, ఉత్తరాభిముఖమై వీచు చుండును."

మూ. పూర్వాపరయోః సముద్రయోర్హిమవద్విన్ధ్యయోశ్చాన్తరమార్యావర్తః. తస్మింశ్చాతుర్వర్ణ్యం చాతురాశ్రమ్యం చ. తన్మూలశ్చ సదాచారః. తత్రత్యో వ్యవహారః ప్రాయేణ కవీనామ్.

వ్యా. పూర్వాపర (తూర్పు—పడమర) సముద్రములకును, హిమవద్వింధ్యములకును మధ్యనున్న దేశము ఆర్యావర్తము. ఈ ఆర్యావర్తమునందు చతుర్వర్ణవ్యవస్థ, ఆశ్రమచతుష్టయవ్యవస్థ ఉన్నవి. ఇచటి సదాచారము ఈ చాతుర్వర్ణ్య-చాతురాశ్రమముల పై ఆధారపడి యున్నది. సాధారణముగ కవులు అచటి వ్యవహారమును తమ కావ్యములలో కూర్చుచుందురు.

మూ. తత్ర వారాణస్యాః పురతః పూర్వదేశః. యత్రాఙ్గ-కలిఙ్గ-కోసల-తోసల-ఉత్కల—మగధ-ముద్గర-విదేహ-నేపాల - పుణ్డ్ర - ప్రాగ్జ్యోతిష-తామ్రలిప్తక-మలద-మల్లవర్తక-సుహ్మ—బ్రహ్మోత్తర-ప్రభృతయో జనపదాః. బృహద్గృహ—లోహితగిరి - చకోర—దర్దుర - నేపాల - కామరూపాదయః పర్వతాః. శోణలౌహిత్యౌనదౌ. గఙ్గా-కరతోయా-కపిశాద్యాశ్చనద్యః లవలీ-గ్రన్థిపర్ణక-అగురు-ద్రాక్షాకస్తూరికాదీనాముత్పాదః.

వ్యా. వారాణసికి తూర్పున నున్నది పూర్వదేశము. ఈ పూర్వదేశమునందు - అంగ (భాగల్‌పూర్ - మాంఘీర్‌నగరముల మధ్య నున్న ప్రాంతము), కలింగ (ఒరిస్సా - ఆంధ్రదేశములమధ్యనున్న సముద్రతీరభూమి), కోసల (అయోధ్యకు దక్షిణమున నున్నది. ఉత్తరకోసల - కోసలము లను పేర్లతో రెండు భాగము లున్నవి. ఉత్తరకోసలమునకు అయోధ్యయు, కోసలమునకు కుశావతియురాజధానులు), తోసల (దక్షిణకోసలము), ఉత్కల (కలింగదేశము యొక్క ఉత్తరభాగము = ఒరిస్సా) మగధ (బీహార్ లేదా దక్షిణబీహార్) ముద్గర (బీహారులోని 'మాంఘీర్'), విదేహ (తీరభుక్తి లేక 'తిర్‌హుట్'), నేపాల, పుండ్ర (తూర్పుబెంగాలులోని 'మాల్దా' మండలము. పుండ్రవర్ధన మని నామాంతరము), ప్రాగ్జ్యోతిష (అస్సామ్‌లోని కామరూప్ లేదా 'కామాఖ్య') తామ్రలిప్తక(బెంగాల్‌లోని మిధనపూర్ జిల్లాలో రూపనారాయణపశ్చిమతీరమునందున్న

'తామలుక్') మలద (బీహారులో, షాహాబాద్‌జిల్లాలోని కొంతభాగము), మల్లవర్తక (బీహారు - ఒరిస్సాలలోని హజారీబాఘ్-మాన్‌భూమ్‌మండలములు), సుహ్మ (బంగాలాఖాతము దగ్గర వంగదేశసమీపమున కపిశానదికి ఉత్తరముగనున్న దేశము), బ్రహ్మోత్తర (బర్మా) మొదలగు జనపదములు ఉన్నవి. బృహద్గృహము (ఎవరెస్టుశిఖరము) లోహితగిరి (తూర్పున ఉన్న హిమాలయపర్వతపంక్తి), చకోర (మీర్జాపూర్‌లోని చరణాద్రి లేక చూనార్) దర్దుర (తూర్పుననున్న వింధ్యపర్వతశ్రేణికి చెందిన "దేవపుర్‌పర్వతశిఖరము". కాళిదాసు చెప్పిన దర్దురము నీలగిరియైయుండును) నేపాల, కామరూప (నీలపర్వతము లేదా నీలకూటపర్వతము. దీనిపై కామాఖ్యాదేవి మందిర మున్నది), పర్వతములు ఉన్నవి. శోణము (ఇది పాట్నాదగ్గర గంగతో కలియు 'శోణ్' నదము) లౌహిత్యము (బ్రహ్మపుత్ర) అను నదములుకలవు. (తూర్పుగ ప్రవహించునవి నదులు; పడమటగ ప్రవహించునవి నదములు). గంగ, కరతోయ (బెంగాలులోని రంగ్‌పూర్, దినపూర్, బోగ్రాజిల్లాలలో ప్రవహించే ఒక నది. బ్రహ్మపుత్రలో కలియును), కపిశ (సింఘమ్-ఒరిస్సాలలో ప్రవహించే సువర్ణరేఖానది. ఋక్షపర్వతమునుండి ఉద్భవించినది) అను నదులు ఉన్నవి. ఈ పూర్వదేశమున, లవలి, గ్రంథిపర్ణక, అగురు, ద్రాక్ష, కస్తూరి మొదలగునవి జనించును.

మూ. మాహిష్మత్యాః పరతో దక్షిణాపథః. యత్ర మహారాష్ట్రమాహిషకాశ్మక - విదర్భ - కున్తల - క్రథకైశిక సూర్పారక - కాఞ్చీ కేరల - కావేర - మురల - వానవాసక - సింహల - చోడ - దణ్డక - పాణ్డ్య - పల్లవ - గాఙ్గ - నాశిక్య - కౌఙ్కణ - కొల్లగిరి - వల్లర ప్రభృతయో జనపదాః. విన్ధ్యదక్షిణపాద-మహేన్ద్ర - మలయ - మేకల - పాల - మఞ్జర - సహ్య - శ్రీపర్వతాదయః పర్వతాః. నర్మదా - తాపీ - పయోష్ణీ - గోదావరీ - కావేరీ - భీమరథీ - వేణా-కృష్ణవేణా - వంజురా - తుంగభద్రా - తామ్రపర్ణీ - ఉత్పలావతీ - రావణగఙ్గాద్యా నద్యః. తదుత్పత్తిర్మలయోత్పత్త్యా వ్యాఖ్యాతా.

వ్యా. మాహిష్మతికి (ఇండోర్‌కు నలుబదిమైళ్ళలో నర్మదానది కుడిఒడ్డున ఉన్న మహేశ్వరము లేదా మహేష్) దిగువ దక్షిణాపథము. ఈ దక్షిణాపథమున మహారాష్ట్రము, మాహిషకము (నర్మదక్రింద నున్నదేశము. దీని రాజధాని మాహిష్మతి). అశ్మకము (గోదావరీ-మాహిష్మతీనగరముల మధ్య నున్నది. విదర్భలోని భాగము), విదర్భము (బీరార్, ఖన్దేశ్, వెనుకటి హైదరాబాదు

రాష్ట్రములోని కొన్ని భాగములు కలిసి విదర్భదేశము). కుంతలము (గోదావరీ కృష్ణానదుల మధ్య నున్న కొంతభాగము కర్ణాటక — విదర్భంలోని కొన్ని భాగములు కలిసి కుంతలదేశ మని పూర్వము ప్రసిద్ధము) క్రథకైశికము (కొన్ని ప్రాచీన గ్రంథముల ననుసరించి ఇది విదర్భకే మరియొక పేరు. కాని రాజశేఖరుడు దీనిని విదర్భసమీపమున నున్న మరి యొక దేశముగ పేర్కొనుచున్నాడు.) సూర్పారకము (బొంబాయికి 37 మైళ్ళలో ఉన్న థానాజిల్లాలోని 'సోపారా') కాంచి, కేరలము, కావేర(కావేరీ ప్రాంతము) మురల (మీరట్ ప్రాంతము. ఈ ప్రాంతమున 'మురలా' లేక 'మూలముఖా' నది ప్రవహించిభీమానదిలో కలియుచున్నది.) వానవాసక (ఉత్తర కనరా ప్రాంతము) సింహలము, చోళదేశము (చోళదేశములోని తంజావూర్, దక్షిణఆర్కాట్ జిల్లాలు చోళదేశము చోళదేశములోని ఇతర ప్రాంతములను రాజశేఖరుడు 'కాంచి' 'కావేరము' అని పేర్కొనియున్నారు), దండకము (రాజశేఖరుని ప్రకారము తొండిమండలము-దీనికే దిండివన మని కూడ పేరు, దండకారణ్యము. (వాస్తవమున మహారాష్ట్రాదులు కూడ దండకలోనికే వచ్చును) పాండ్యము (నేటి తిరునల్వేలి, మధుర జిల్లాలు) పల్లవము (పల్లవరాజులు పాలించినకాంచీపరిసర ప్రదేశము), గాంగము(కొంగు దేశము, నేటి కోయంబత్తూరు-సేలంజిల్లాలు), నాశిక్యము(నాసిక్;దీనికిపంచవటియనికూడా పేరు) కొంకణము (పడమటి కనుమలకును అరేబియా సముద్రమునకును మధ్య దేశము. దీనికి పరశురామక్షేత్ర మని పేరు. కాళిదాసు దీనిని 'అపరాంతము' అని పేర్కొనెను), కోల్లగిరి (కూర్గ. దీనికి 'కోలగిరి' 'కొడగు' అని కూడ పేర్లు. ప్రస్తుతము కర్ణాటరాజ్యములో నున్నది.) వల్లారము (నేటి వెంకటగిరి, చిత్తూరు, నెల్లూరు ప్రాంతము) మొదలైన జనపదము లున్నవి. వింధ్యపర్వతమునకు దక్షిణము వైపున నున్న చిన్న పర్వతములు, మహేంద్రము, మలయము, మేకలము (ఇది వింధ్యపర్వతశ్రేణికి సంబంధించినది. దీనికి అమరకంటక మని కూడ పేరు. ఇచటనే నర్మద ఆవిర్భవించినది). పాలమంజర (మహాద్ దగ్గర నున్న 'పాల'. ఇది యే గ్రీక్ ఇతిహాసికుడు చెప్పిన 'పాలైపటామై' అను నౌకా స్థానము) సహ్యము, శ్రీ పర్వతము (శ్రీశైలము) మొదలగు పర్వతము లున్నవి. నర్మద, తాపీ (వింధ్యనుండి బయల్వెడలి అరేబియా సముద్రములో ప్రవేశించు తపతీనది), పయోష్ణి (తాపీనదికి ఉపనదియైన 'పూర్ణా'నది) గోదావరి కావేరి, భైమరథి(కృష్ణానదికి ఉపనదియైన భీమానది), వేణ(కృష్ణానదికి ఉప

నది యైన వేణానది), కృష్ణవేణ (కృష్ణానదియే 'వేణా'నదితో కలిసిన పిదప 'కృష్ణవేణ' అను పేరు పొందినది) వఞ్జుర(దీనికి 'మంజుల''బంజుల'అని కూడ పేర్లు.గోదావరికి ఉపనది యైన'మంజీరా'నది).తుంగభద్ర ('తుంగా''భద్రా' నదులు కలిసి 'తుంగభద్ర' అయినది. ఈ తుంగభద్ర కృష్ణానదికి ఉపనది), తామ్రపర్ణి (తిరునల్వేలి జిల్లాలో ప్రవహించు నది). ఉత్పలావతి (ఇది కూడ తామ్రపర్ణితో పాటు తిరునల్వేలి జిల్లాలో ప్రవహించుచున్నది), రావణ గంగ (ఇది లంకలోని ఏదైన నదియై యుండును) మొదలైన నదు లున్నవి. దక్షిణా పథమున లభించు వస్తువులను గూర్చికూడ వెనుక మలయ పర్వతజన్యవస్తువులను గూర్చి చెప్పుటచే చెప్పినదైనది. (మలయమున లభించు చందనాదులు దక్షిణా పథమున లభించు నని యర్థము)

మూ. దేవసభాయాః పరతః పశ్చాద్దేశః. తత్ర దేవసభ-సురాష్ట్ర-దశేరక-త్రవణ-భృగుకచ్ఛ-కచ్ఛీయ - ఆనర్త-అర్బుద - బ్రాహ్మణవాహ-యవన ప్రభృతయో జనపదాః. గోవర్ధన-గిరినగర-దేవసభ-మాల్యశిఖరార్బుదాదయశ్చ పర్వతాః.సరస్వతీ-శ్వభ్రవతీ-వార్తఘ్నీ-మహీ- హిడిమ్బాదా-నద్యః. కరీర-పీలు-గుగ్గులు-ఖర్జూర-కరభాదీనాముత్పాదః.

వ్యా. దేవసభకు పశ్చిమముగ నున్నది పశ్చాద్దేశము. ఈ పశ్చాద్దేశమున-దేవసభ (దేవాస్ రాజ్యము. దీనికే ఉదయపురి అని కూడ పేరు. ఇచట ఢేబర్ సరస్సు ఉన్నది. సరస్వతీ - సబర్మతీనదులు ఇచట ఆవిర్భవించి పశ్చిమభారతమున ప్రవహించుచున్నవి), సురాష్ట్ర (గుజరాత్ ఉత్తరప్రాంతమునందలి కత్తెవాడ్ మొదలైన ప్రదేశములు), దశేరకము (మాల్వా), త్రవణము (సురాష్ట్ర సమీపప్రాంతము), భృగుకచ్ఛ ('బ్రోచ్', దాని పరిసరప్రాంతములు), కచ్ఛీయ (నేటి 'కచ్' ప్రాంతము. దీనికి మరుకచ్ఛ మని కూడ ప్రాచీననామధేయము), ఆనర్త (ఉత్తరగుజరాతులోని కొన్ని ప్రాంతములు, మాల్వాలోని కొన్ని ప్రాంతములు కలిసి ఆనర్తదేశము. దానికి 'ఆనర్తపురము' రాజధానిగ ఉండెడిది. ఈ పురమునకు కాలాంతరమున ఆనందపుర మనియు, నేడు 'వడ్‌నాగర్' అనియు పేర్లు వచ్చినవి), అర్బుదము (రాజపుతానాలోని 'మౌంట్‌అబు'), బ్రాహ్మణ - వాహము (నేటి 'బ్రాహ్మణాబాద్', సింధునదీప్రాంతమున అతి ప్రాచీననగరము, ఇది పాకిస్తాన్‌లోని హైదరాబాదుకు 47 మైళ్లదూరమున ఈశాన్యమున ఉన్నది) యవనదేశము (బలూచిస్తానుకు ఆగ్నేయముగ నున్న ప్రాంతమై యుండును)

మొదలగు జనపదము లున్నవి. గోవర్ధనము (మథురజిల్లాలో బృందావనమునకు 18 మైళ్లదూరమున నున్నది), గిరినగరము ('నేటి గిర్నార్' కథైవాడ్‌లోని జునాగఢ్ సమీపమున నున్నది. పురాణప్రసిద్ధ మైన 'రైవతకగిరి' ఇదియే) దేవసభపర్వతము (దేవసభప్రాంతమున నున్నది. చూ. పై), మాల్యశిఖరము (మాలవప్రాంతములో వింధ్యపర్వత శ్రేణికి చెందిన ఒక పర్వతమై యుండును,) అర్బుదము (మౌంట్‌ఆబు) మొదలైన పర్వతము లున్నవి. సరస్వతి (ఉదయపురప్రాంతమునుండి బయల్వెడలి, బరోడా ప్రాంతములోని పట్టాన్ మీదుగా ప్రవహించుచున్నది. ఇది ఉత్తరదేశములోని సరస్వతికంటె భిన్న మైనది; పశ్చిమభారతములోనిది); శ్వభ్రవతి (ఉత్తరగుజరాత్‌లోని సాబర్మతి), వార్త్రఘ్ని (సబరమతికి ఉపనది యైన 'వాత్రక: ఈ రెండును కైరా దగ్గర కలియును), మహి (మాల్వాప్రాంతములోనిది) హిడింబ (వింధ్యపర్వతము నందుఉద్భవించిన చర్మణ్వతీనది. 'చంబల్' అని నేటి పేరు. 'ఏటావా' సమీపముననున్న ఏకచక్రపురమువద్ద యమునలో కలియుచున్నది. లేదా ఇది శిప్రానదికి ఉపనదియైన 'గంభీరానది' కూడ కావచ్చును.) మొదలైన నదులు ఉన్నవి. ఈ పశ్చిమభారతమున కరీర - పీలు - గుగ్గులు - ఖర్జూర-కరభాదులుపండును. (కరీరమనగా ఒకవిధమైన ముళ్ళుచెట్టు. అడవులలో పెరుగును. కరభమనగా ఒంటెపిల్ల. ఒక సుగంధద్రవ్యము: ఇచట రెండవ అర్థమై యుండును.)

మూ. పృథూదకాత్పరతః ఉత్తరాపథః, యత్ర శక-కేకయ-వోక్కాణ-హూణ - వాణాయుజ - కామ్బోజ - వాహ్లీక - వహ్లవ - లింపాక - కులూత - కీర - తంగణ - తుషార - తురుష్క - బర్బర - హరహూరవ - హూహుక - సహుడ - హంసమార్గ - రమఠ - కరకణ్ఠప్రభృతయోజనపదాః. హిమాలయ - కలిన్ద - ఇన్ద్రకీల - చన్ద్రాచలాదయః పర్వతాః. గఙ్గా - సిన్ధు - సరస్వతీ - శతద్రు - చన్ద్రభాగా - యమునా - ఇరావతీ - వితస్తా - విపాశా - కుహూ - దేవికాద్యా నద్యః. సరల - దేవదారు - ద్రాక్షా - కుఙ్కుమ - చమర - అజిన - సౌవీర - స్రోతోఞ్జన - సైన్ధవ - వైదూర్య - తురఙ్గాణాముత్పాదః.

వ్యా. పృథూదకము(పంజాబులోని కర్నాల్ జిల్లాలో ఉన్న "పెహోవా". ఇది పశ్చిమథానేశ్వరమునుండి 14 మైళ్ళ దూరములో ఉన్నది) నకు అవతల ఉన్నదేశము ఉత్తరాపథము. అచట శక (లాహోరు ప్రాంతమునందలి 'శాకలము' లేదా "శైల్‌కోట్". దానిని డెమిట్రియస్ అను గ్రీకురాజు ప్రప్రథమమున

భారతదేశమునందలి గ్రీకురాజ్యమునకు రాజధానిగా చేసినాడు), కేకయ (పంజాబులో 'బియాస్' 'సట్లెజ్' నదుల మధ్య నున్న దేశము), వోక్కాణ (అఫ్ఘనిస్తానములోని 'హెలనా' 'గజినీ' ల మధ్య నున్న దేశము. లేదా 'హిందూకుష్' కును 'బదక్‌సాన్' కును అవలనున్న 'పామీర్స్' కావచ్చును), హూణ(సింధునదికి ఉపనదులైన 'వాక్ష్' 'అక్ష్' నదుల మధ్య నున్న దేశము), వనాయుజ (అరేబియా)కామ్బోజ(అఫ్ఘనిస్థాన్), వాహ్లీక (బియాస్-సతలెజ్ నదుల మధ్య కేకయ దేశమున కుత్తరముగ నున్న దేశము. ఇచటి జనులకు 'వాహీకులు' బాహీకులు' 'ఆ ర్త్రికులు' అని పేరు. ఈ దేశమునకు త్రిగర్తదేశ మని కూడ పేరు), పహ్లవ (పల్లపురము. నేటి 'బల్లవార్'. ఇది కాశ్మీరుకు ఆగ్నేయముగ నున్నది), లింపాక (కాబూలు నదికి ఉత్తరపు ఒడ్డున నున్న "లంఘన్". దీనిని హ్యూయిన్‌త్సాంగ్ "లాపో" అని టోలెమీ "లంబటో" అని పేర్కొన్నారు.) కులూత (పంజాబులోని కంగ్రా జిల్లాలోని 'కులు'), కీర (కిర్తార్ పర్వత శ్రేణికి ఉత్తరముగా, అఫ్ఘనిస్థాన్‌లోని దక్షిణమున నున్న ప్రాంతము), తంగణ (రామగంగానదీ- సరయూనదుల మధ్య నున్న ప్రదేశము). తుషార (బాల్ఖ్ – బాదక్‌షాన్‌లతో సహా అక్సస్‌నదియొక్క పైలోయకు 'తుఖార' లేదా 'తుషార' అని పేరు), తురుష్క (తూర్పు తుర్కిస్తాన్), బర్బర(సింధునదీతీరమున వాయవ్యదిశలోనున్న బర్బరి. దీనికే బర్బరిక, బర్బరికమ్ అని కూడ పేర్లు. ఇవి చందనమునకు ప్రసిద్ధము. బెలూచిస్తాన్‌లోని ఉత్తరభాగమును కూడ బర్బరమని కొందరు చెప్పుదురు.) హరహూరవ (సింధు- ఝీలంనదుల మధ్య నున్నదేశము), హూహంక (కాశ్మీరదేశపు ఉత్తర భాగము), సహుడ (పశ్చిమ అఫ్ఘనిస్తాన్; ప్రస్తుతము 'సఫాదకో' 'సబ్ జవార్'లు ఉన్న ప్రదేశము), హంసమార్గ (భారతదేశమునుంచి టిబెట్టుకు పోవుటకు 'నిటి' అను పర్వతమధ్యమార్గము. దీనికి క్రౌంచరంధ్రమని కూడ పేరు.) రమఠ (రౌమక పర్వతసమీపదేశము). కరకంఠ ('కారకోరమ్' లోయ కాని, బన్నుజిల్లాలోని 'నిలి' పర్వతప్రాంతము కాని కావచ్చును.) మొదలగు జనపదము లున్నవి. హిమాలయము, కలిందము (హిమాలయములోని ఒక భాగము, యమున జన్మస్థానము). ఇంద్రకీలము (హిమాలయమునకు సంబంధించిన ఒక శిఖరము), చంద్రాచలము (ఇది కూడ హిమాలయపర్వత శ్రేణిలోనిదే. దీనినుండి చంద్రభాగానది జనించినది) మొదలగు పర్వతము లున్నవి. గంగ, సింధునది, సరస్వతి

(థానేశ్వర-స్థాణ్వీశ్వర ప్రదేశముల మీదుగ ప్రవహించి 'వినశనము' అను చోట ఎడారిలో విలీన మైపోయినది. ఇదే పేరుతో పశ్చిమతీరమునందు కూడ మరి యొకనది కలదు), శతద్రు (సట్లెజ్), చంద్రభాగ (చీనాబ్), యమున, ఇరావతి (రావినది) వితస్త (ఝీలమ్‌నది), విపాశ ('సట్లెజ్' నదికి ఉపనది యైన 'బియాస్'నది), కుహూ (కాబూల్‌నది. ఇది వేదములలో 'కుభా' అనియు గ్రీకుల రచనలలో 'కోఫెన్' అనియు వర్ణింపబడినది) దేవిక (రావీ నదికి ఉపనది యైన 'దీగ్' నది) మొదలైన నదు లున్నవి. సరల - దేవ దార్వాదివృక్షములు, ద్రాక్ష, కుంకుమము, చమరము, అజినములు, సౌవీరఫల ములు, స్రోతోంజనము, సైన్ధవము (లవణము), వైదూర్యములు, అశ్వములు ఇచట ఉత్పన్న మగును.

మూ. తేషాం మధ్యే మధ్యదేశ ఇతి కవివ్యవహారః. న చాయం నాను గన్తా శాస్త్రార్థస్య. యదాహుః -

"హిమవద్విన్ధ్యయోర్మధ్యం యత్ప్రాగ్వినశనాదపి
ప్రత్యగేవ ప్రయాగాచ్చ మధ్యదేశః ప్రకీర్తితః" 24

వ్యా. ఈ దేశముల మధ్య నున్న ప్రాంతమునకు మధ్యదేశమని కవుల వ్యవహారము. ఇది శాస్త్రార్థమునకు విరుద్ధమైన వ్యవహారము కాదు. ఏలనన ఇట్లు చెప్పుచున్నారు :-

"వినశనమునకు (సరస్వతి ఎడారిలోనికి ప్రవహించి అదృశ్యమైపోయిన ప్రదేశము) తూర్పుగను, ప్రయాగకు పశ్చిమముననను, హిమవద్వింధ్యపర్వతముల మధ్య నున్న దేశము 'మధ్యదేశము' అని చెప్పబడుచున్నది." (మనుస్మృతి).

మూ. తత్ర చ యే దేశాః, పర్వతాః, సరితో ద్రవ్యాణాముత్పాదశ్చ తత్ప్రసిద్ధిసిద్ధమితి న నిర్దిష్టమ్.

"ద్వీపాన్తరాణాం యే దేశాః పర్వతాః సరితస్తథా
నాతిప్రయోజ్యాః కవిభిరితి గాఢం న చిన్తితాః. 25

వ్యా. మధ్యప్రదేశములో నున్న పర్వతములు, నదులు, అచట జనించిన ద్రవ్యములు ప్రసిద్ధములే గాన వాటిని గూర్చి విస్తృతముగ చెప్పలేదు.

"ద్వీపాంతరములలో నున్న దేశములు, పర్వతములు, నదులు మున్నగు

వాటిని గూర్చి కవులు అధికముగ వర్ణింపరాదు. అందుచే వాటిని గూర్చి ఇచట అధికముగ చర్చించలేదు."

మూ. "వినశనప్రయాగయోర్గఙ్గాయమునయోశ్చాన్తరమన్తర్వేదీ. తదపేక్షయా దిశో విభజేత" ఇత్యాచార్యాః. "తత్రాపి మహోదయం మూలమవధీకృత్య" ఇతి యాయావరీయః.

వ్యా. "వినశనప్రయాగలకును, గంగాయమునలకును మధ్యనున్న దేశమునకు 'అంతర్వేది' అని పేరు. ఈ అంతర్వేదిని కేంద్రముగ చేసికొని దిక్కులను విభజింపవలెను" అని ఆచార్యులు చెప్పుదురు. అందును మహోదయమును అనగా కాన్యకుబ్జమును కేంద్రముగ చేసికొనవలె నని యాయావరీయుని అభిప్రాయము. (కాన్యకుబ్జమునకు గాధిపుర మని కూడ నామంతరము).

మూ. "అనియతత్వాద్దిశామనిశ్చితో దిగ్విభాగః" ఇత్యేకే. తథా హి యో వామనస్వామినః పూర్వః స బ్రహ్మశిలాయాః పశ్చిమః; యో గాధిపురస్య దక్షిణః స కాలప్రియస్యోత్తర ఇతి.

వ్యా. దిక్కులు అనియతములు గాన దిగ్విభాగము అనిశ్చితము అని కొందరు చెప్పుదురు. ఏలనన - వామనస్వామికి తూర్పుగ నున్న ప్రదేశము బ్రహ్మశిలకు పశ్చిమ మగును. గాధిపురమునకు దక్షిణమున నున్నది కాలప్రియునకు ఉత్తర మగును.

వి. ఇచట రాజశేఖరుడు కాన్యకుబ్జమునకు (నేటి కనోజ్) ఆనాడున్న నాలుగు సరిహద్దులను సూచించి యున్నాడు. బ్రహ్మగిరి తూర్పుసరిహద్దు. వామనస్వామి పశ్చిమమున సరిహద్దు. గాధిపురము ఉత్తరపు సరిహద్దు. కాలప్రియ దేవాలయము దక్షిణపుసరిహద్దు. శ్రీరాముడు మహోదయపురమున అనగా కాన్యకుబ్జమున వామనునకు ఒక దేవాలయమును కట్టించినట్లు పద్మపురాణములో నున్నది. అది కాన్యకుబ్జమునకు పడమటి సరిహద్దై యుండును. బ్రహ్మశిల అనునది (ఇది కూడ బ్రహ్మదేవాలయము కావచ్చును) తూర్పుసరిహద్దు గాధిపుర మనునది కూడ కాన్యకుబ్జములోని భాగము. ఇది ఉత్తరపు సరిహద్దు. కాలప్రియానాథుని దేవాలయము దక్షిణసరిహద్దు.

భవభూతి తన నాటకములలో పేర్కొన్న కాలప్రియానాథుడు ఈ కాన్యకుబ్జకాలప్రియానాథుడే కాని విదర్భదేశీయుడు కాదని కొందరి పండితుల అభిప్రా

యము. అతడు కన్యకుబ్జాధీశ్వరు డగు యశోవర్మ ఆస్థానములో నుండుటచే అచటి కాలప్రియానాథుని వర్ణించుట సహజము.

కావున ఈ ప్రదేశము తూర్పున నున్న దని గాని దక్షిణమున నున్న దని గాని చెప్పుటకు వీలు లేదు. ఉదాహరణమునకు — వామనస్వామికి తూర్పున ఉన్నదనుకొనినది బ్రహ్మశిలకు పశ్చిమమున నుండును. గాధిపురమునకు దక్షిణముగా నున్నదనుకొనినది కాలప్రియానాథునికి ఉత్తరముగ ఉండవచ్చును అని వీరి అభిప్రాయము.

మూ. అవధినిబన్ధనమిదం రూపమ్. ఇతర త్వనియత మేవ ఇతి యాయావరీయః. "ప్రాచ్యప్రాచీ ప్రతీచ్యుదీచ్యః చతస్రో దిశః" ఇత్యేకే. తదాహుః-

వ్యా. "ఈ విభాగ మంతయు ఏదియో ఒకదానిని అవధిగ చేసికొని చేసినదే కాని అవధి లేనిచో ఈ విభాగము అనియతముగనే ఉండును" అని రాజశేఖరుడు. తూర్పు, పడమర, దక్షిణము, ఉత్తరము అని నాలుగు దిక్కు లని కొందరు. కావుననే ఇట్లు చెప్పుదురు.

మూ. "చతసృష్వపి దిక్షు రణే ద్విషతః ప్రతి యేన చిత్రచరితేన
విహితమపూర్వమదక్షిణమపశ్చిమమనుత్తరం కర్మ." 26

వ్యా. "శత్రువుల విషయమువ, నాలుగు దిక్కులందును, విచిత్రమైన చరితము గల ఈతనిచే, అపూర్వము (తూర్పుదిక్కు లేనిది; పూర్వ మెన్నడును ఎవ్వరును చేయనిది అని రెండర్థములు), అదక్షిణము (దక్షిణ దిక్కు లేనిది. దాక్షిణ్యము అనగా దయ లేనిది); అపశ్చిమము (పశ్చిమదిక్కు లేనిది); ఇటుపై ఎన్నడు జరుగనిది), అనుత్తరము (ఉత్తరదిక్కు లేనిది, దేనికంటె గొప్పది లేదో అట్టిది) అగు కర్మ చేయబడినది". (విరోధాభాసాలంకారము).

మూ. "ఐన్ద్రీ, ఆగ్నేయీ, యామ్యా, నైరృతీ, వారుణీ, వాయవ్యా, కౌబేరీ ఐశానీ, చాష్టౌ దిశః" ఇత్యేకే. తదాహుః-

"ఏకం జ్యోతిర్దృశౌ ద్వే త్రిజగతి గదితాన్యబ్జజాస్యైశ్చతుర్భి-
ర్భూతానాం పఞ్చమం యాన్యలమృతుషు తథా షట్సు నానావిధాని.
యుష్మాకం తాని సప్త త్రిదశమునినుతాన్యష్టదిగ్భాఞ్జి భానో-
ర్యాన్తి ప్రాహ్ణే నవత్వం దశ దధతు శివం దీధితీనాం శతాని". 27

వ్యా. తూర్పు. ఆగ్నేయము, దక్షిణము. నైరృతి, పశ్చిమము, వాయవ్యము, ఉత్తరము, ఈశాన్యము, అని దిక్కులు ఎనిమిది" అని కొందరు చెప్పుదురు. కావుననే ఇట్లు వర్ణింతురు:-

"ఏవి మూడులోకములందు ఏకైకమైన జ్యోతిస్సో, రెండు నేత్రములో (సూర్యకాంతిలేనిచో నేత్రములు వ్యర్థములు కదా!) బ్రహ్మయొక్క నాలుగు ముఖములచే ప్రశంసింపబడినవో, మహాభూతములలో ఐదవ భూతమో, ఆరు ఋతువులయందు అనేక రీతులను ధరించునో, అట్టివియు, సప్తఋషులచే స్తుతింబడినవియు, ఎనిమిది దిక్కులయందును వ్యాపించినవియు, ప్రాతః కాలమునందు నవత్వమును (నూతనత్వము, నవసంఖ్య అని అర్థద్వయము) పొందుచున్నవియు అగు సూర్యుని పదివందల కిరణములు మీకు మంగళమును ఇచ్చుగాక."

వి. ఒకటి నుండి పదివరకును గల సంఖ్యలను చమత్కారముగ కూర్చి సూర్యకిరణములను వర్ణించు ఈ మయూరకవికృతసూర్యశతకములోని శ్లోకమునందు దిక్కులు ఎనిమిది అని చెప్పబడినది.

మూ "బ్రాహ్మీ, నాగీయా చ ద్వే; తాభ్యాం సహ దశైతాః" ఇత్యపరే. తదాహుః :-

"దశదిక్తటపర్యన్తసీమసఙ్కటభూమికే
విషమా స్థూలలక్ష్యస్య బ్రహ్మాణ్డగ్రామకే స్థితిః." 28

వ్యా. "బ్రాహ్మి (ఊర్ధ్వదిక్కు), నాగీయ (అధరదిక్కు) అని మరి రెండు దిక్కులున్నవి. వాటితో కలిసి పది దిక్కు లని" మరి కొందరు. అందుచేతనే ఇట్లు వర్ణింతురు.

"పదిదిక్కుల ప్రాంతము లనెడు సరిహద్దులలో ఇరుకైన ప్రదేశము గల ఈ బ్రహ్మాండ మనెడు కుగ్రామమునందు, మహాదాతయైన వాని (స్థూలలక్ష్యుడనగా దాత "స్యు ర్వదాన్యస్థూలలక్ష్యదానశౌణ్డాబహుప్రదే" అని అమరుడు) స్థితి చాల కష్టభూయిష్ఠమై యుండును". (అతని దాతృత్వమునకు ఈ బ్రహ్మాండము చాలదు అని అర్థము).

మూ. సర్వమస్తు. వివక్షాపరతన్త్రా హి దిశామియత్తా. తత్ర చిత్రస్వాత్యన్తరే ప్రాచీ, తదనుసారేణ ప్రతీచీ, ధ్రువేణోదీచీ, తదనుసారేణావాచీ, అన్తరేణ విదిశః, ఊర్ధ్వం బ్రాహ్మీ, అధస్తాన్నాగీయేతి.

వ్యా. అందరు చెప్పినదియు యథార్థమే. ఏలనన దిక్కుల సంఖ్య వివక్షపై (చెప్పువారి ఇచ్ఛపై) ఆధారపడి యుండును. (దిక్కులను సరిగ నిర్ణయించు విధానమెట్లనగా) - చిత్రాస్వాతినక్షత్రముల మధ్య నున్నది తూర్పు దిక్కు. పశ్చిమదిక్కు దానిని పట్టియుండును, అనగా దానికి ఎదురుగనుండునది పశ్చిమదిక్కు. ధ్రువనక్షత్ర మున్నది ఉత్తరము. దక్షిణదిక్కు దానిని పట్టి యుండును. దిక్కులమధ్య నున్నవి విదిక్కులు. పైదిక్కు బ్రాహ్మి. క్రింది దిక్కు నాగీయ.

మూ. ద్వివిధో వ్యవహారః కవీనాం ప్రాక్సిద్ధో విశిష్టస్థానావధి సాధ్యశ్చ. తత్ర ప్రాక్సిద్ధే ప్రాచీ-

"ద్విత్రై స్త్రిర్వ్యోమ్ని పురాణ మౌక్తికమణిచ్ఛాయైః స్థితం తారకై
ర్జ్యోత్స్నాపానభరాలసేన వపుషా సుప్తాశ్చకోరాఙ్గనాః.
యాతోఽస్తాచల చూలముద్వసమధుచ్ఛత్రచ్ఛవిశ్చన్ద్రమాః
ప్రాచీ బాలబిడాలలోచనరుచాం జాతా చ పాత్రం కకుప్." 29

వ్యా. కవులలో దిక్కులకు సంబంధించిన వ్యవహారము రెండు విధములైనది కానవచ్చుచున్నది-ఒకటి పూర్వసిద్ధమైనది: రెండవది ఏదో ఒక స్థానమును అవధిగా తీసికొని ఏర్పడినది. అందు పూర్వసిద్ధ మగు వ్యవహారమున తూర్పుదిక్కు వర్ణనమునకు ఉదాహరణము:-

"పాత ముత్యముల వలె వెలవెలబారిన కాంతి గల రెండు మూడు నక్షత్రములు, ఆకాశముమీద, మిగిలిపోయినవి. వెన్నెలను పానము చేసిన మత్తుచే అలసమైన శరీరముతో చకోరాంగనలు నిద్రపోవుచున్నవి. వసపోయిన (అనగా ఎండిపోయిన) తేనెపట్టువంటి కాంతిగల చంద్రుడు అస్తాద్రిని చేరినాడు. తూర్పుదిక్కు పిల్లిపిల్ల కండ్ల వంటి కాంతులకు పాత్ర మైనది. (తూర్పున పిల్లిపిల్ల కండ్ల కాంతివంటి కాంతి ప్రసరించుచున్నది.)"

వి. (ఇది విద్ధసాలభంజికలోనిది 1.2) ఇచట 'ఇచటి నుండి తూర్పు' అని అవధిని దేనిని గ్రహింపకుండ పూర్వప్రసిద్ధమైన తూర్పుదిక్కు గ్రహింపబడినది.

మూ. దక్షిణా:-

"దక్షిణో దక్షిణామాశాం యియాసుః సోఽధికం బభౌ.
జిహాసుర్దక్షిణామాశాం భగవానివ భాస్కరః". 80

వ్యా. "(దిగ్విజయయాత్రకై) దక్షిణదిక్కువైపు వెళ్ళదలచిన, సమర్థుడైన ఆ రాజు, దక్షిణదిక్కును విడువదలచిన, సూర్యభగవానుడు వలె ప్రకాశించెను"

వి. సూర్యుడు దక్షిణమున నున్నప్పుడు దక్షిణాయమున కొంచెము ఉష్ణత్వము తగ్గియుండును. దక్షిణమును విడచి ఉత్తరాయణమున ఉత్తరమునకు పోవునపుడు తీక్ష్ణముగా నుండును. అందుచే రాజు దక్షిణమును విడచుచున్న సూర్యునితో పోల్చబడెను.

"పశ్య పశ్చిమ దిగన్తలమ్బినా నిర్మితం మితకథే వివస్వతా.
దీర్ఘయా ప్రతిమయా సరోమ్భసస్తాపనీయమివ సేతుబన్ధనమ్." 81
(కు. సం. 8. 82).

వ్యా. పశ్చిమదిక్కునకు ఉదాహరణము:- "ఓ మితభాషిణి! పశ్చిమదిగంతమునందు వ్రేలాడుచున్న సూర్యునిచే, దీర్ఘమైన తన ప్రతిమచేత, సరస్సునందలి జలమునకు బంగారు సేతువు నిర్మింపబడినట్లున్నది; చూడుము."

మూ. ఉత్తరా:-

"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ వగాహ్య స్థితః పృథివ్యా ఇవ మానదణ్డః. 82
(కు. సం. 1. 1)

వ్యా. ఉత్తరదిక్కునకు ఉదాహరణము:- "పూర్వాపరసముద్రములను చొచ్చుకొని, భూమిని కొలచుటకై ఉంచిన మానదండము (కొలకఱ్ఱ) వలె నున్న దేవతాత్మయైన, హిమాలయ మనెడు పర్వతరాజు ఉత్తరదిక్కున ఉన్నాడు."

మూ. విశిష్టస్థానావధౌ తు దిగ్విభాగే పూర్వపశ్చిమౌ యథా:-

"యాదాంసి హే చరత సంతతగోత్రతన్త్రం
పూర్వేణ చన్దనగిరేరుత పశ్చిమేన.
నో చేన్నిరన్తరధరాధరసేతుసూతి
రాకల్పమేష న విరంస్యతి వో వియోగః." 83
(బాలరామాయణము 7. 45)

వ్యా స్థానవిశేషమును అవధిగ గ్రహించి దిగ్విభాగము చేయునపుడు, పూర్వపశ్చిమదిక్కుల వర్ణనమునకు ఉదాహరణము:-

"ఓ! జలజంతువులారా! మలయపర్వతమునకు తూర్పున గాని, పశ్చిమమున గాని, మీ అవిచ్ఛిన్నకుటుంబవ్యవహారమును నడుపుకొనుడు. అట్లు కానిచో, అవకాశము లేకుండ పర్వతములతో కట్టుచున్న సేతువువలన ఏర్పడిన మీ వియోగము, కల్పాంతమువరకును విరమించదు."

వి. మీ కుటుంబములోని కొందరు ఇటు వైపు, కొందరు అటు వైపు ఉన్నచో, ఇపుడు మధ్యకట్టుచున్న ఈ సేతువును దాటి మీరు మరల కలుసుకొనజాలరు అని భావము.

మూ. దక్షిణోత్తరౌ:-

"కాఞ్చ్యాః పురోదక్షిణదిగ్విభాగే తథోత్తరస్యాం దిశి వారిరాశేః.
కర్ణాన్తచక్రీకృతదారుదాపో రత్యా సమం సాధు వసత్యనఙ్గః" 84

వ్యా. "అవధిని బట్టి దక్షిణోత్తరదిశల వర్ణనమున కుదాహరణము :- "కాంచీపురికి అవతల దక్షిణమువైపున, సముద్రమునకు ఉత్తరమున, మన్మథుడు, కర్ణాంతమువరకును, చక్రమువలె వంగునంతగా లాగబడిన సుందరమైన ధనస్సు కలవాడై, భార్యతో కలిసి చక్కగ నివసించుచున్నాడు."

మూ. ఉత్తరాదావప్యుత్తరదిగభిధానమ్, అనుత్తరాదావప్యుత్తరదిగభిధానమ్. తయోః ప్రథమమ్ :-

"తత్రాగారం ధనపతిగృహానుత్తరేణాస్మదీయం
దూరాల్లక్ష్యం సురపతిధనుశ్చారుణా తోరణేన.
యస్యోద్యానే కృతకతనయః కాన్తయా వర్ధితో మే
హస్తప్రాప్యస్తబకవినతో బాలమన్దారవృక్షః." 85 (మేసం. 2.12)

వ్యా. ఉత్తరదిక్కు మొదలగువాటి యందు మరల ఉత్తరదిక్కును వర్ణించుట, ఉత్తరదిక్కు కానివాటియందు, కూడ ఉత్తరదిక్కును వర్ణించుట. వాటిలో మొదటిది :- "ఆ అలకాపురిలో, కుబేరుని గృహమునకు ఉత్తరముగా, మా గృహము, ఇంద్రధనుస్సు వలె సుందరమైన తోరణముతో (ప్రధాన ద్వారముయొక్క పైభాగము) దూరమునుండియే కనబడుచుండును. దీని ఉద్యానవనమునందు, నా ప్రియురాలిచే పెంచబడిన పెంపుడుకొడుకైనదియు, చేతు

లకు అందెడు పుష్పగుచ్ఛములలో వంగినదియు అగు చిన్న మందారవృక్షము ఉన్నది.''

వి. ఇచట ఉత్తరదిక్కున ఉన్న అలకాపట్టణములో మరల ఉత్తరదిక్కు పేర్కొనబడినది.

మూ. ద్వితీయమ్ :-

సహ్యాద్రేరుత్తరే భాగే యత్ర గోదావరీనదీ
పృథివ్యామిహకృత్స్నాయాం స ప్రదేశో మనోరమః.

వ్యా. రెండవదానికి (ఉత్తరదిక్కు కానిదానియందు ఉత్తరదిక్కును పేర్కొనుటకు) ఉదాహరణము :- ''సహ్యాద్రికి ఉత్తరభాగమున, గోదావరి ప్రవహించు ప్రదేశము, ఈ మొత్తము భూమండలములో చాల మనోహరమైనది.''

వి. దక్షిణమున నున్న సహ్యాద్రికి ఉత్తరమున నున్న ప్రదేశ మిచట పేర్కొనబడినది.

మూ. ఏవం దిగన్తరేష్వపి. తత్రదేశ-పర్వత-నద్యాదీనాం. దిశాం చ యః క్రమ స్తం తథైవ నిబధ్నీయాత్. సాధారణం తూభయత్ర లోకప్రసిద్ధి తశ్చ. తద్వద్వర్ణనియమః. పౌరస్త్యానాం శ్యామోవర్ణః. దాక్షిణాత్యానాం కృష్ణః. పాశ్చాత్యానాం పాణ్డుః. ఉదీచ్యానాం గౌరః. మధ్యదేశ్యానాం కృష్ణః, శ్యామో, గౌరశ్చ. పౌర స్త్యశ్యామతా:-

శ్యామేష్వఙ్గేషు గౌడీనాం సూత్రహారైక. హారిషు
చక్రీకృత్య ధనుః పౌష్పమనఙ్గో వల్గు వల్గతి. ౩౬

వ్యా. ఇతర దిక్కుల విషయమున గూడ ఇట్లే తెలియవలెను. అందు, దేశములు, పర్వతములు, నదులు మొదలగునవియు, దిక్కులును ఏ క్రమమున నుండునో ఆ క్రమముననే వాటిని వర్ణింపవలెను. (అనగా-ఏ పర్వతనద్యాదులు ఏ దేశములందు ఏ దిక్కులందు ఉండునో వాటి నా విధముగనే వర్ణింపవలెను.) సాధారణవస్తువులను, అనగా అనేకదేశములందు గాని, అనేకదిక్కులందు గాని ఉండు వస్తువులను, క్రమముతోడను, క్రమము లేకుండగను ఉభయవిధముల వర్ణింపవచ్చును. లేదా లోకప్రసిద్ధి ననుసరించి వర్ణింపవలెను.

రంగుల (దేహచ్ఛాయల) నియమము కూడ అట్లే. పౌరస్త్య (తూర్పు) దేశీయుల రంగు చామన. దాక్షిణాత్యుల రంగు నలుపు. పాశ్చాత్యుల రంగు తెలుపు. ఉత్తరదేశీయుల రంగు పచ్చన. మధ్యదేశీయుల రంగు నలుపు, చామనచాయ, పచ్చన కూడ. పౌరస్త్య దేశీయుల చామనచాయకు ఉదాహరణము:-

"ఒక్క, ఒంటి పేట ముత్యాలహారము తోడనే మనోహరములుగా నున్న గౌడాంగనల, చామనచాయ గల అవయవములందు, (అనగా వారి శరీరముల నాశ్రయించి యుండి), మన్మథుడు తన పుష్పధనస్సును చక్రమువలె అగునట్లు లాగుచు, అందముగ కొట్టుచున్నాడు."

వి. గౌడదేశము తూర్పున నున్నది. అందుచే గౌడాంగనల వర్ణము చామనచాయగ వర్ణింపబడినది.

మూ. దాక్షిణాత్య కృష్ణతా:-
ఇదం తాసాం తప్తద్రుతకనకగోల ప్రతికృతి
క్రమాన్మన్ద జ్యోతిర్గలతి నభసో బిమ్బవలయమ్.
ఇతశ్చ ప్రాచీనః సరతి మురలీగణ్డమలిన
స్తరుచ్ఛాయాచక్రైః స్తబకిత ఇవ ధ్వాన్తవిసరః. 87

వ్యా. దాక్షిణాత్యుల నలుపుకు ఉదాహరణము :- "కరిగించిన బంగారు గోలమువంటి కాంతి గల ఈ సూర్యబింబము, క్రమముగమందమైన కాంతి గలదై, ఆకాశమునుండి జారుచున్నది. ఇక, మురలదేశస్త్రీల గండస్థలముల వలె మలినముగ (చామనచాయతో) ఉన్నదియు, వృక్షచ్ఛాయాచక్రములచే గుత్తులుగ ఏర్పడినట్లున్నదియు అగు, తూర్పుదిక్కును సంబంధించిన, ఈ అంధకార సముదాయము, ప్రసరించుచున్నది."

వి. మురలదేశమనగా నేటి కేరళ్ ప్రాంతము. ఇది దక్షిణదేశము గాన అచటి స్త్రీలు శ్యామవర్ణలుగా వర్ణింపబడినారు.

మూ. పాశ్చాత్యపాణ్డుతా:-
"శాఖాస్మేరం మధుకవలనా కేలిలోలేక్షణానాం
శృఙ్గస్త్రీణాం వకుళముకులం కున్తలీభావమేతి,

కిం చేదానీం యవనతరుణీపాణ్డుగణ్డస్థలీభ్యః
కాన్తిః స్తోకం రచయతి పదం నాగవల్లిచ్ఛదేషు." 38

వ్యా. పాశ్చాత్యదేశీయుల పాండుత్వమునకు ఉదాహరణము:-

"కొమ్మలలో వికసించుచున్న (చిరునవ్వు నవ్వుచున్న) బొగడమొగ్గ, మకరందమును ఆస్వాదించుట యను కేళియందు చంచలమైన నేత్రములు గల భృంగస్త్రీలకు కుంతలములుగ అగుచున్నది. మరియు ఇప్పుడు, యవనయువతుల గండస్థలములనుండి (బైటకు వచ్చిన) కాంతి తాంబూలలతాపర్ణములయందు కొంచెముకొంచెము స్థానము నేర్పరచుకొనుచున్నది."

వి. తాంబూలపర్ణములు ముగ్గి తెల్లబడుచున్న వని యర్థము. పశ్చిమదిశకు చెందినవారు గాన వారి చెక్కిళ్లు తెల్లగ నున్నట్లు వర్ణింపబడినది.

మూ. ఉదీచ్యగౌరతా:-

"పుష్పైః సంప్రతి కాఞ్చనారతరవః ప్రత్యఙ్గమాలిఙ్గితాః
బాహ్లీకీదశనవ్రణారుణతరైః పత్త్రైరశోకోఽఞ్చితః.
జాతం చమ్పకమప్యుదీచ్యలలనాలావణ్యచౌర్యక్షమం
మాఞ్జిష్ఠైర్ముకులైశ్చ పాటలతరోరన్యైవ కాచిల్లిపిః." 39

వ్యా. ఉత్తరదేశీయుల గౌర వర్ణమున కుదాహరణము:-

"కాంచనారవృక్షములు, ఇపుడు, ప్రతి అవయవమునందును, పుష్పములచే అలింగింపబడినవి. వాహ్లీకస్త్రీల దంతక్షతముల వలె మిక్కిలి ఎఱ్ఱగా నున్న ఆకులతో అశోకవృక్షము ప్రకాశించుచున్నది. (పచ్చని) చంపక పుష్పము గూడ ఉత్తరదేశ వనితల లావణ్యమును అపహరించు సామర్థ్యము కలదిగ అయినది. మంజిష్ఠ వలె ఎఱ్ఱగా నున్న మొగ్గలతో పాటలవృక్షముయొక్క శోభ అనన్యాదృశముగ నున్నది."

మూ. యథా వా:-

"కాశ్మీరీగాత్రలేఖాసు లోలల్లావణ్యవీచిషు
ద్రావయిత్వేవ విన్యస్తం స్వర్ణం షోడశవర్ణకమ్." 40

వ్యా. ఇంకను ఎట్లనగా:- "చలించుచున్న లావణ్య తరంగములు గల కాశ్మీరవనితల శరీరలతలందు పదహారు వన్నెల బంగారము కరిగించి ఉంచినట్లున్నది."

మూ. మధ్యదేశ్యకృష్ణతా యథా:-
"యుధిష్ఠిరక్రోధవహ్నేః కురువంశైకదాహినః
పాఞ్చాలీం దదృశుః సర్వే కృష్ణాం ధూమశిఖామివ." 41

వ్యా. మధ్యదేశనివాసుల కృష్ణవర్ణమునకు ఉదాహరణము : -"అచట నున్న వారందరును, పాంచాల దేశరాజ పుత్రియైన ఆ ద్రౌపదిని, కురువంశమును దహింపచేయు ఏకైక సాధనమైన, యుధిష్ఠిర క్రోధాగ్ని యొక్క నల్లని ధూమ శిఖను వలె చూచిరి."

మూ. తద్వన్మధ్యదేశ్యశ్యామతా. న కవిమార్గే శ్యామకృష్ణయోః, పాణ్డు గౌరయోర్వా మహాన్విశేష ఇతి కవిసమయేష్వవోచామ.

వ్యా. మధ్యదేశీయుల దామనదాయకు కూడ ఉదాహరణము నిట్లే తెలియ వలెను. కవిసంప్రదాయమునందు శ్యామ-కృష్ణవర్ణములకును, పాండుగౌరవర్ణము లకును పెద్దభేదమేమియు లేదని కవిసమయములందు చెప్పియున్నాము.

మూ. మధ్యదేశగౌరతా:-
"తవ నవ నవనీతపిణ్డగౌరే ప్రతిఫలదుత్తరకోసలేన్ద్రపుత్ర్యాః (త్రి).
అవగతమలికే మృగాఙ్కబిమ్బం మృగమదపత్త్రనిభేనలాంఛనేన" 42

వ్యా. మధ్యదేశీయుల గౌరవర్ణమునకు ఉదాహరణము:-
"ఓఉత్తరకోసలరాజకుమారీ! నవనీతపు ముద్ద వలె గౌరవర్ణమైన నీ లలాటమునందు ప్రతిబింబించిన చంద్రబింబము, కస్తూరితో రచించిన పత్రర చనతో సమానమైన కలంకమును బట్టి, గుర్తించబడినది."

మూ. విశేషస్తు — పూర్వదేశే రాజపుత్ర్యాదీనాం గౌరః పాణ్డుర్వా వర్ణః. ఏవం దక్షిణదేశేఽపి తత్ర ప్రథమః-

"కపోలే జానక్యాః కరికలభద న్తద్యుతిముషి
స్మరస్మేరః స్ఫారోడ్డమరపులకంవక్త్రకమలమ్,
ముహుః పశ్యన్ శృణ్వన్ రజనిచరసేనాకలకలం
జటాజూటగ్రంథిం ద్రఢయతి రఘూణాం పరివృఢః." 43

వ్యా. విశేష మేమనగా- పూర్వదేశములకు సంబంధించిన రాజపుత్రికలు మొదలగు వారికి మాత్రము గౌరవర్ణము గాని, పాంశువర్ణము గాని ఉండును.

దక్షిణదేశమునందు కూడ ఇట్లే. అందు మొదటిదానికి ఉదాహరణము:- (ఈ శ్లోకము హనుమన్నాటకములో నున్నది.)

''గున్న ఏనుగుదంతపు కాంతిని అపహరించు జానకీకపోలమునందు, అత్యధికములును, వ్యాప్తములును అగు పులకములు గల (తన)ముఖపద్మమును చూచుకొనుచున్నవాడును, మన్మథసుందరుడును అగు రఘుకులశ్రేష్ఠుడు(తనతో యుద్ధమునకై వచ్చుచున్న ఖరదూషణాది) రాక్షసుల సైన్యముయొక్క కలకల ధ్వనిని మాటిమాటికిని వినుచు జటాజూటముయొక్క ముడిని బిగించుకొనుచున్నాడు.''

వి. 'స్ఫారోద్గమరపులకే' అను సప్తమ్యంతపాఠమున అది 'కపోలే' అనుదానికి విశేషణము. సీత కపోలము భయముచే పులకిత మగుచున్న దని యర్థము. తన జటాగ్రంథిని బిగించి కట్టుకొనుటకు శ్రీరాముడు సీత చెక్కిలిని అద్దముగ ఉపయోగించినా డని భావము. సీత జన్మభూమి యగు విదేహదేశము తూర్పుదేశములలో చేరుటచే సీత చామనచాయగ నున్నట్లు వర్ణింపవలసి యున్నను, ఆమె రాజకుమారి యగుటచే గౌరవర్ణగ వర్ణింపబడినది.

మూ. ద్వితీయః- తాంసాంమాధవపత్నీనాం సర్వాసాం చన్ద్రవర్చసామ్
శబ్దవిద్యేవ విద్యానాం మధ్యే జజ్వాల రుక్మిణీ. 44

వ్యా. రెండవదానికి ఉదాహరణము :- ''చంద్రుని వంటి కాంతి గల ఆ శ్రీకృష్ణుని భార్య లందరిలోను రుక్మిణి, విద్యలలో వ్యాకరణవిద్య వలె, ప్రకాశించెను''.

వి. విదర్భదేశము దక్షిణాపథములోని దగుటచే వైదర్భియైన రుక్మిణి నల్లగా నుండవలెను. కాని ఆమె రాజపుత్రి యగుటచే చంద్రవర్ణుల కంటె కూడ అధికప్రకాశవంతురాలుగ వర్ణింపబడినది.

మూ, ఏవమన్యదపి యథాసమ్భవమూహ్యమ్.
నిగదితనయవిపరీతం దేశవిరుద్ధం వద న్తి విద్వాంసః
తత్పరిహార్యం యత్నా త్తదుదాహృతయస్తు దోషేషు. 45

ఇత్థం దేశవిభాగో ముద్రామాత్రేణ సూత్రితః సుధియామ్.
యస్తు జిగీషత్యధికం పశ్యతు మద్భువనకోశమసౌ. 46

ఇతి శ్రీ రాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే ప్రథమేఽ
ధికరణే సప్తదశోఽధ్యాయః.

వ్యా. ఇతర విషయములను గూడ యథాసంభవముగ ఇట్లే ఊహించ వలెను.

"ఇంతవరకును చెప్పిన రీతికి విరుద్ధముగ నుండుదానిని, విద్వాంసులు దేశవిరుద్ధ మందురు. దానిని ప్రయత్న పూర్వకముగా పరిహరింపవలెను. దేశ విరుద్ధముల ఉదాహరణములు దోషములలోనికి వచ్చును.''

''ఈ విధముగ దేశవిభాగము సూచనాప్రాయముగ, ధీమంతులకొరకై చెప్పబడినది. అధికముగ తెలిసికొనవలె నని కోరిక గలవారు నేను రచించిన భువనకోశమును పరిశీలించవలెను.''

బాలానన్దినిలో స ప్తదశాధ్యాయము సమా ప్తము.

అష్టాదశోఽధ్యాయః

కాలవిభాగః

మూ. కాష్ఠా నిమేషా దశ పఞ్చ చైవ త్రింశచ్చ కాష్ఠాః కథితాః కలేతి.
త్రింశత్కలాశ్చైవ భవేన్ముహూర్త స్తైస్త్రింశతా రాత్ర్యహనీ
సమేతే 1.

వ్యా. "పదిహేను నిమేషములు ఒక కాష్ఠ. ముప్పై కాష్ఠలు ఒక కల. ముప్పై కలలు ఒక ముహూర్తము. ముప్పది ముహూర్తములతో కలసి రాత్రి-పగళ్లు (ఒక దివసము) అగును''

మూ. తే చ చైత్రాశ్వయుజమాసయోర్స(యోస్సమేత)వతః చైత్రాత్పరం ప్రతిమాసం మౌహూర్తికీ దివసవృద్ధిః. నిశాహానిశ్చ త్రిమాస్యాః. తతః పరం మౌహూర్తికీ నిశావృద్ధిః, దివసహానిశ్చ. ఆశ్వయుజాత్పరతః పునరేతదేవ విపరీతమ్.

వ్యా. రాత్రి, పగలు, ఇవి చైత్రమాసమునందును, ఆశ్వయుజమాసము నందును సమప్రమాణములో నుండును. చైత్రముతరువాత ప్రతిమాసమునందును మాసమునకు ఒక్కొక్క ముహూర్తము చొప్పున, మూడు మాసముల పాటు,

పగటి భాగము పెరుగును; రాత్రి భాగము తరుగుచుండును. అటు పిమ్మట మాసమున కొక ముహూర్తముచొప్పున రాత్రిభాగము పెరుగును, పగటిభాగము తరుగును. అశ్వయుజము తరువాత ఇదే విపరీతముగ జరుగును. అనగా-మూడు మాసములపాటు రాత్రి పెరిగి పగలు తరుగును. తరువాత మూడు మాసముల పాటు పగలు పెరిగి. రాత్రి తరుగును.

మూ. రాశితో రాశ్యన్తరసంక్రమణముపలక్షితో మాసః. వర్షాది దక్షిణాయనమ్. శిశిరాద్యుత్తరాయణమ్. ద్వ్యయనః సంవత్సర ఇతి సౌరం మానమ్. పఞ్చదశాహో రాత్రః పక్షః, వర్ధమానసోమః శుక్లో, వర్ధమానకృష్ణిమా కృష్ణఇతి పిత్ర్యం మాసమానమ్. అమునా చ వేదోదితః కృత్స్నోఽపి క్రియాకల్పః.

వ్యా. సూర్యుడు ఒక రాశినుండి మరి యొక దానికి సంక్రమించు కాలము మాసము. వర్షఋతువుతో ప్రారంభ మగునది దక్షిణాయనము. శిశిరఋతువుతో ప్రారంభ మగునది ఉత్తరాయణము. రెండు అయనములు కలది సంవత్సరము. ఇది సౌరమానము. పదిహేను అహోరాత్రములు పక్షము వృద్ధిపొందు చంద్రుడుగల పక్షము శుక్లపక్షము: చీకటి వృద్ధిపొందు పక్షము కృష్ణపక్షము. ఇది పితృదేవతలకు సంబంధించిన మాసమానము. వేదప్రతిపాదిత మగు సమస్తమైన కర్మకలాపము ఈ కాలమానము ననుసరించి జరుగును.

మూ. పిత్ర్యమేవ వ్యత్యయితపక్షం చాన్ద్రమసమ్. ఇదమార్యావర్తవాసినశ్చ, కవయశ్చ మానమాశ్రితాః. ఏవం చ ద్వౌ పక్షౌ మాసః ద్వౌ మాసావృతుః. షణ్ణాం ఋతూనాం పరివర్తః సంవత్సరః. స చ చైత్రాదిరితి దైవజ్ఞాః. శ్రావణాదిరితి లోకయాత్రావిదః. తత్ర నభాః, నభస్యశ్చ వర్షాః. ఇషః, ఊర్జశ్చ శరత్. సహః, సహ్యశ్చ హేమన్తః. తపస్తపస్యశ్చ శిశిరః. మధుర్మాధవశ్చ వసన్తః. శుక్రః, శుచిశ్చ గ్రీష్మః.

వ్యా. పిత్ర్యమాసమునందే పక్షములను మార్చినచో, అనగా ముందు కృష్ణపక్షము, పిదప శుక్లపక్షము గ్రహించినచో, చాంద్రమసమాస మగును. ఆర్యావర్తమునందు నివసించువారును, కవులును ఈ మాసమునే ఆశ్రయింతురు. ఈ విధముగ రెండు పక్షము లొక మాసము. రెండు మాసములు ఒక ఋతువు. ఆరు ఋతువులు దొరలినచో సంవత్సరము. సంవత్సర ప్రారంభము చైత్రమాసముతో అగు నని జ్యోతిశ్శాస్త్రవిదులు చెప్పుదురు. శ్రావణమాసముతో

అగునని లౌకిక వ్యవహారవిదులు చెప్పుదురు. అందు శ్రావణ-భాద్రపదములు వర్షరుతువు, ఆశ్వయుజ-కార్తికములు శరదృతువు. మార్గశిర-పుష్యమాసములు హేమన్త ఋతువు. మాఘ-ఫాల్గునములు శిశిరర్తువు. చైత్ర-వైశాఖములు వసన్త ఋతువు. జ్యేష్ఠ-ఆషాఢమాసములు గ్రీష్మఋతువు.

మూ. తత్ర "వర్షాసు పూర్వో వాయుః" ఇతి కవయః. "పాశ్చాత్యః; శారత్స్యస్తు ప్రతిహన్తా" ఇత్యాచార్యాః తదాహుః.

"పురోవాతా హతా ప్రాక్పృట్ పశ్చాద్వాతా హతా శరత్" ఇతి
తదాహుః-"ప్రావృష్యమ్భోభృతామ్భోదభరనిర్భరమమ్బరమ్.
కదమ్బకుసుమామోదా వాయవో వాన్తి వారుణాః." 8

వ్యా. అందు, "వర్షకాలమున తూర్పుగాలులు వీచును" అని కవులు చెప్పుదురు. "వర్షకాలమునందు పడమటి గాలులేవీచును. తూర్పుగాలి వర్షకాలము నంతము చేయును" అని ఆచార్యు లందురు. కావుననే ఇట్లు చెప్పుదురు:- "తూర్పుగాలులు వీచిన వర్షకాలము అంతమగును; పశ్చిమగాలులు వీచిన శరదృతువు అంత మగును". కావుననే ఇట్లు చెప్పుదురు.

"వర్షకాలమున ఆకాశము నీటితో నిండిన మేఘములచే కప్పబడి యుండును. కదంబపుష్పముల సువాసనలతో గూడిన పశ్చిమవాయువులు వీచును."

మూ. "వస్తువృత్తిరతన్త్రమ్; కవిసమయః ప్రమాణమ్." ఇతి యాయావరీయః తదాహుః:-

"శారత్స్యస్తోయదర్తోః పవన ఇవ పతత్పావకస్యేవ ధూమో
విశ్వస్యేవాదిసర్గః ప్రణవ ఇవ పరం పావనం (నో)వేదరాశేః.
సన్ధ్యానృత్తోత్సవేచ్ఛోరివ మదనరిపోర్నన్దినాన్దీనినాదః
సౌరస్యాగ్రే సుఖం వో వితరతు వినతానన్దనః స్యన్దనస్య. 4

"వర్షర్తుప్రారంభమున వాయువువలె, అరణిని మథించు నపుడు పడనున్న అగ్నికి మొదట ధూమము వలె, ప్రపంచమునకు ప్రారంభమున మొదటి సృష్టి యగుమహదహంకారాదికము వలె, వేదరాశికి అగ్రమున పవిత్ర మగు ఓంకారము వలె, సంధ్యానృత్యోత్సవమును చేయదలచిన శివునకు నంది చేసిన నాంధీధ్వని (ప్రారంభమంగళధ్వని) వలె, సూర్యుని రథముయొక్క ఎదుటి భాగమున నున్న అనూరుడు మీకు సుఖము నిచ్చుగాక. "(సూర్యశతకము.౬౬)

వి. ఇచట వర్షకాలము తూర్పుగాలులతో ప్రారంభ మగునని వర్ణింప బడినది.

మూ. శరద్యనియతదిక్కో వాయుః. యథా-
"ఉషస్సు వపురాకృష్టజడావశ్యాయశీకరాః
శేఫాలికలికాకోశకషాయామోదినోఽనిలాః" 5

వ్యా. శరత్కాలమున వాయువునకు దిఙ్నియమము ఉండదు. (ఏ దిక్కు నండి యైనను వీచవచ్చును.) ఎట్లనగా:-

"(శరత్కాలమునందు) "ప్రాతః కాలములందు, చల్లనైన మంచు తుంపరలను లాగికొని వచ్చునవియు, శేఫాలి మొగ్గల కషాయమైన (పూచైన) సువాసనలతో కూడినవియు అగు వాయువులు వీచినవి."

మూ. "హేమన్తే పాశ్చాత్యో వాయుః" ఇత్యేకే. 'ఉదీచ్య' ఇత్యపరే, 'ఉభయమపి' ఇతి యాయావరీయః. తయోః పాశ్చాత్యః:-

భఞ్జన్భూర్జద్రుమాలీస్తుహినగిరితటే షూర్ధతాస్త్వక్కరాలాః
రేవామ్భఃస్థూలవీచీచయచకితచలద్బాతకాన్ వ్యాధునానః.
పాశ్చాత్యో వాతి వేగాద్ధుతతుహినశిలాశీకరాసారవర్షీ
మాతఙ్గక్షుణ్ణసాన్ద్రస్రుతసరలసరత్సారసారీ సమీరః. 6

వ్యా. హేమంతర్తువులో పడమటి వాయువు వీచునని కొందరు. ఉత్తరపు గాలి యని మరికొందరు. రెండును అని యాయావరీయుడు. అందు పాశ్చాత్య వాయువుకు ఉదాహరణము : "హిమగిరితటములపై బయలుదేరినదియు, కఠిరమైన బెరడు గల భూర్జవృక్షపంక్తులను విరుగగొట్టుచున్నదియు, రేవానదీజలముల పెద్ద తరంగముల సముదాయమునుండి భయపడిన, చలించుచున్న, చాతకపక్షులను ఊపివేయుచున్నదియు, కరిగిన మంచుటాళ్ల తుంపురులను, అవిచ్ఛిన్నముగ వర్షించుచున్నదియు, ఏనుగులచే నలగగొట్టబడినవియు, దట్టముగా స్రవించుచున్నవియు అగు సరలవృక్షముల స్రవించుచున్న సారమును (పాలను) ప్రసరింపచేయునదియు అగు పడమటి గాలి వీచుచున్నది."

ఉదీచ్యః-"లమ్పాకీనాం కిరన్తశ్చికురవిరచనాం రల్లకాన్హాసయన్తః
చుమ్బన్తశ్చన్ద్రభాగాసలిలమవికలం భూర్జకాణ్డైకచణ్డాః.

ఏతే కస్తూరికైకప్రణయసురభయో వల్లభా వాహ్లవీనాం
కౌలూతీకేలికారాః పరిచయితహిమం వాయవో వాన్త్యుదీచ్యాః.

వ్యా. ఉత్తరపు గాలికి ఉదాహరణము:-

"లంపాకదేశస్త్రీల చికురరచనను (కేశబంధమును) చిమ్మివేయు చున్నట్టియు. రల్లకమృగములను నాట్యమాడించునట్టియు, నిర్మలమైన చంద్ర భాగానదీజలమును చుంబించుచున్నవియు, భూర్జవృక్షముల కాండములందు (శాఖలందు) ఎక్కువ తీవ్రమైనవియు, కస్తూరీమృగముల ప్రణయముచే (సంబంధముచే) పరిమళించుచున్నవియు, వహ్లవదేశస్త్రీలకు చాల ప్రియ మైనవియు, కైలూతదేశస్త్రీలతో పరియాచకము లాడుచున్నవియు అగు ఉత్తర దిగ్వాయువులు, ప్రోగుచేయబడిన మంచుకలుగనట్లుగా, వీచుచున్నవి.''

మూ. శిశిరేఽపి హేమన్తవదుదీచ్యః పాశ్చాత్యో వా. వసన్తే దక్షిణః తదుక్తమ్:-

"ధున్వన్ లఙ్కావనాలీర్ముహురలకలతా లాసయన్ కేరలీనా
మన్ధ్రీధమ్మిల్లబన్ధాన్ సపది శిథిలయన్ వేల్లయన్ న్నాగవల్లీః
ఉద్దామం దాక్షిణాత్యో (మ) మిలితమలయజః సారథిర్మీనకేతోః
ప్రాప్తః సీమన్తినీనాం మధుసమయసుహృన్మానచౌరః సమీరః."

వ్యా. శిశిరఋతువునందు గూడ, హేమంతర్తువునందు వలె ఉత్తరపు గాలి గాని, పడమటి గాలి కానిఉండును. వసంతమునందు దక్షిణవాయువు ఉండును. అది చెప్పబడినది:-

''లంకలో నున్న వనపంక్తులను కదల్చుచు, కేరలస్త్రీల ముంగురులను నాట్య మాడించుచు, ఆంధ్రస్త్రీల కేశబంధములను శిథిలము చేయుచు, తాంబూలీ లతలను ఆడించుచు, స్పృశింపబడిన చందనవృక్షములు కలదియు, మన్మథుని సారథియు, స్త్రీల ప్రణయకోపమును అపహరించునదియు, వసంతమునకు మిత్రుడును అగు దక్షిణసమీరము వచ్చినది,''

మూ. "అనియతదిక్కో వాయుర్గ్రీష్మే'' ఇత్యేకే. నైరృతః'' ఇత్యపరే 'ఉభయమపి' ఇతి యాయావరీయః. తత్ర ప్రథమః :-

వాత్యాచక్రకచుమ్బితామ్బరభువః స్థూలా రజోదణ్డకాః
సంగ్రథ్నన్తి భవిష్యదభ్రపటలస్థూణావితర్కం నభః.

కించాన్యన్మృగతృష్ణకామ్బువిసరైః పాత్రాణి పీతార్ణసాం
సిన్ధూనామిహ సూత్రయన్తి దివసేష్వాగామినీం సమ్పదమ్ 8

వ్యా. గ్రీష్మఋతువునందు వాయువు దిక్కుయొక్క నియమము లేనిదై వీచును అని కొందరు. నైరృత దిక్కునుండి వీచును అని మరికొంద రందురు. రెండును అని యాయావరీయుడు. అందు మొదటి దానికి ఉదాహరణము:-

"సుడిగాలిచే స్పృశింపచేయబడిన ఆకాశప్రదేశము గల స్థూలములైన దండాకారము లగు పరాగములు(పరాగస్తంభములు)ఆకాశమును రాబోవు మేఘసముదాయముతో ఏర్పడు స్తంభము లనెడు వితర్కము కలదానినిగా చేయుచున్నవి; అనగా ఆకాశమునందు అట్టిస్తంభము లనెడు బుద్ధిని కలిగించుచున్నవి. ఇంకను ఏమనగా ఉదకములు లేని నదుల పాత్రలు (నదీమార్గములు) పగటి భాగములయందు ఎండమావుల ద్వారా ఏర్పడిన కనబడుచున్న జలసముదాయములచే, రాబోవు (జల) సంపదను సూచించుచున్నవి.

వి. ఇచట వాయువులు ఈదిక్కునుండి వచ్చుచున్నవి అని విశేష రూపమున చెప్పలేదు,

మూ. ద్వితీయః :- సోఽయం కరైస్తపతి వహ్నిమయైరివార్కః
సాఙ్గారవిస్తరభరేవ ధరా సమగ్రా.
వాయుః కుకూలమివ వర్షతి నైరృతశ్చ
కార్శానవైరివ శరైరశిదనశ్చ హన్తి. 9

వ్యా. రెండవదానికి ఉదాహరణము:- "సూర్యుడు అగ్నిమయములు వలెనున్న కిరణములతో తపింపచేయుచున్నాడు. భూమి యంతయు బొగ్గునిప్పులు పరచి నట్లునిది. నైరృతదిక్కునుండి వచ్చుచున్న వాయువు పొట్టునిప్పును (లేదా ఊకనిప్పును) వర్షించుచున్నట్లునది. మన్మథుడు కూడ అగ్నిమయములు వలెనున్న బాణములతో కొట్టుచున్నాడు,"

అవ. ఇపుడు ఏ ఋతువులో ఏ ఏ విషయములను వర్ణింపవలెనో చెప్పుచు మొదట వర్షర్తువును గూర్చి చెప్పుచున్నారు:-

మూ. కిఞ్చ:- "గర్భాన్ బలాకాసు నివేశయన్తః
వంశాఙ్కురాన్ స్వైర్నినదైః సృజన్తః.
రజోఽమ్బుదాః ప్రావృషి ముద్రయన్తో
యాత్రోద్యమంభూమిభృతాం హరన్తి" 10

వ్యా. "వర్షకాలమున మేఘములు, ఆడకొంగలకు గర్భములను కలిగించుచు, తమ ఉరుములచే వెదుళ్ల అంకురములను సృజించుచు, పరాగమును అణచివేయుచు, రాజుల యుద్ధయాత్రాప్రయత్నమును నిలిపివేయుచున్నవి."

వి. వర్షకాలమున మేఘసంబంధమువలన ఆడుకొంగలు గర్భము ధరించుననియు, ఉరుములకు వెదురు పొదలలో హటాత్తుగ అంకురములు భూమినుండి పైకి వచ్చు ననియు వర్ణింతురు.

మూ. "స సల్లకీసాలశిలీన్ధ్రియూథీప్రసూనదః పుష్పితలాఙ్గలీకః.
దగ్ధోర్వరాసున్దరగన్ధబన్ధురర్ఘత్యయం వారిముదామనేహా." 11

వ్యా. సల్లకీ-సాల-శిలీంధ్ర-యూథీవృక్షములపై పుష్పములను పుట్టించునదియు, పుంష్పిచిన లాంగలీవృక్షములు కలదియు, (గ్రీష్మమునందు) కాలియున్న భూమియందు సుగంధమును కలిగించునదియు అగు వర్షకాలము గౌరవార్హమైనది లేదా అమూల్య మైనది.

మూ. వనాని నీలీదలమేచకాని ధారామ్బుధౌతా గిరయః స్ఫురన్తి.
పూతామ్బసా భిన్నతటాస్తటిన్యః సాన్ద్రేన్ద్రగోపాని చ శాద్వలాని. 12

వ్యా. వనములు నీలిపత్రములచే నల్లగా నున్నవి. పర్వతములు వర్షధారోదకములచే కడిగివేయబడినవై ప్రకాశించుచున్నవి. పొర్లిపోవుచున్న ఉదకముచే నదులు తెగిపోయిన గట్లుకలవి. పచ్చికబయళ్లు దట్టముగా నున్న ఇంద్రగోప కీటములు (ఒకవిధమగు ఎఱ్ఱనిసిల్కువంటి శరీరముగల పురుగులు) కలవి."

మూ. చకోరహర్షీ యతిచారచౌరో వియోగినీవీక్షితనాథవర్త్మా.
గృహాన్ ప్రతి ప్రస్థితపాన్థసార్థః కాలోఽయమాధ్మాతనభాః పయోదైః. 13

వ్యా. మేఘములచే పూరింపబడిన ఆకాశముగల ఈకాలము, చకోరములకు హర్షమును కలిగించునది. సంన్యాసుల సంచారమును హరించు నది. వియోగినులచే ఎదురుచూడబడు ప్రియుల మార్గముకలది. గృహములను గూర్చి ప్రయాణమై వెళ్లు బాటసారుల సముదాయము కలది.

వి. చకోరములు వెన్నెలను భుజించుపక్షులుకావున "చకోరహర్షీ" అనుటకు బదులు 'మయూరహర్షీ' అను పాఠము యుక్తము. వర్షకాలము నాలుగు మాసములును సంన్యాసులకు దేశసంచారము నిషిద్ధము.

మూ. "యా కేలియాత్రా కిల కామినీభిర్యా తుఙ్గహర్మ్యాగ్రవిలాసశయ్యా.
చతుఃసమం యన్మృగనాభిగర్భం సా వారిదర్తోః ప్రథమాతిథేయీ." 14

వ్యా. "విలాసార్థమైనయాత్రయు (picnic), యువతులతో ఉన్నతప్రాసాదాగ్రములందు శయ్య, కస్తూరితో కలసిన చతుఃసమము, ఇది వర్షాకాలము యొక్క మొదటి అతిథిపూజ."

వి. వర్షాకాలము రాగనే వీటిని సేవింతు రని యర్థము. ఈ కాలమున కేళియాత్రలే కాని దూరయాత్రలుండవు. కుంకుమకేసరములు, కస్తూరి, చందనము, కర్పూరము- వీటిని సమమైన పాళ్ళలో కలిపి తయారు చేసిన మైపూతకు చతుఃసమ మని పేరు.

మూ. చలచ్చటులచాతకః కృతకురఙ్గరాగోదయః
సదర్దురరవోద్యమో మదభరప్రగల్భోరగః.
శిఖణ్డికులతాణ్డవాముదితమద్గుకఙ్కాహ్వయో
వియోగిషు ఘనాగమః స్మరవిషం విషం ముఞ్చతి. 15

వ్యా. "చలించుచున్న, చపలమైన చాతకపక్షులు కలదియు, లేళ్ళకు అనురాగమును పుట్టించునదియు, కప్పల రొదలతో కూడినదియు, మదభారముచే ప్రగల్భములైన సర్పములు కలదియు, నెమళ్ల తాండవముచే సంతసించు మద్గుపక్షులను, కంకపక్షులను కలదియు, అగు వర్షకాలము వియోగుల విషయమున విష (జల) రూప మగు మన్మథవిషమును వర్షించును."

మూ. దలత్కుటజకుడ్మలః స్ఫుటితనీపపుష్పోత్కరో
ధవప్రసవబాన్ధవః ప్రచితమఞ్జరీకార్జునః.
కదంబకలుషాంబరః కలితకేతకీ కోరక
శ్చలన్నిచులసఞ్చయో హరతి హన్త మర్మాత్మయః. 16. వర్షా.

వ్యా. విడుచుచున్నకుటజకుడ్మలములు (మొగ్గలు) కలదియు, వికసించిన నీపపుష్పసముదాయము కలదియు, ధవవృక్షముల పుష్పములకు బంధు వైనదియు, బాగుగ ఏర్పడిన పూలగుత్తులు గల అర్జునవృక్షములు కలదియు, కదంబవృక్షము వలె నల్లనైన ఆకారము కలదియు, మొగలి మొగ్గలతో కూడినదియు, చలించుచున్న నీటిప్రబ్బలి తీగల సముదాయము కలదియు అగు వర్షర్తువు; ఆహా! ఎంత మనోహరముగ నున్నది! ఇది వర్షర్తువర్ణనము.

మూ. ప్రాగ్గ(క్ల)ర్గ యన్తి విమదాన్ మయూరాన్
ప్రగల్భయన్తి కురరద్విరేఫాన్.
శరత్సమభ్యేతి వికాస్యపద్మా
నున్మీలయన్తి కుముదోత్పలాని. 17

వ్యా. "పోయిన మదము గల నెమళ్లను ఝళిపించుచు, గోరింకలను, తుమ్మెదలను ప్రగల్భమైన వాటినిగ చేయుచు, శరదృతువు, పద్మములను వికసింపచేసి, తెల్ల కలువలను, నల్లకలువలను వికసింపచేయుచు, వచ్చుచున్నది."

"సా భాతి పుష్పాణి నివేశయన్తీ బన్ధూకబాణాసన కుఙ్కుమేషు
శేఫాలికా సప్తపలాశ కాశ భాణ్డీర సౌగన్ధిక మాలతీషు." 18

వ్యా. "బన్ధూక-బాణ-అసన-కుంకుమములయందును, శేఫాలికలు, ఏడాకుల అరటిచెట్లు, రెల్లు, భాండీరము, సౌగంధికము, మాలతి-వీటియందును పుష్పములను ఆవిర్భవింపచేయుచు శరదృతువు ప్రకాశించుచున్నది."

మూ. సఖఞ్జరీటా సపయః ప్రసాదా సా కస్య నో మానస మాచ్ఛినత్తి.
కాదమ్బ కారణ్డవచక్రవాక ససారసక్రౌఞ్చ కులానుయాతా. 19

వ్యా. "ఖంజరీట పక్షులతో గూడినదియు, నిర్మలమైన ఉదకములతో కూడినదియు, కాదంబ కారండవ-చక్రవాక-సారస-క్రౌంచ పక్షుల సముదాయముతో కూడినదియు అగు శరదృతువు ఎవరి మనస్సును ఆకర్షింపదు?"

మూ. ఉపానయన్తీ కలహంసయూథ మగస్త్యదృష్ట్యా పునతీ పయాంసి
ముక్తాసు శుభ్రం దధతీ చ గర్భం శరద్విచిత్రైశ్చరితైశ్చకాస్తి 20

వ్యా. "కలహంసల గుంపులను చేర్చునదియు, అగస్త్యుని (అగస్త్యనక్షత్రముయొక్క) ఉదయముచే ఉదకములను శుభ్రము చేయుచున్నదియు, ముత్యపు చిప్పలయందు శుభ్రమైన గర్భమును ఉంచుచున్నదియు అగు శరదృతువు విచిత్రమైన చరిత్రములతో ప్రకాశించుచున్నది."

మూ. క్షితిం ఖనన్తో వృషభాః ఖురాగ్రై రోధో విషాణైర్ద్విరదా రదన్తః
శృఙ్గం త్యజన్తో రురవశ్చ జీర్ణం కుర్వన్తి లోకానవలోకనోత్కాన్ 21

వ్యా. "దెక్కల అగ్రములచే భూమిని త్రవ్వుచున్న వృషభములును, దంతములచే తీరములను త్రవ్వుచు ధ్వనిచేయుచున్న ఏనుగులును, జీర్ణమైన (చిమికిపోయిన) శృంగమును విదలిచివేయుచున్న రురుమృగములును, జనులను చూచుటయందు ఆసక్తి కలవారినిగా చేయుచున్నవి"

మూ. అత్రావదాతద్యుతి చన్ద్రికామ్బు నీలావభాసం చ నభః సమన్తాత్.
సురేభవీథీదివసావతారో జీర్ణాభ్రఖణ్డాని చ పాణ్డురాణి. 22

వ్యా. ఈ శరదృతువునందు వెన్నెలనీరు నిర్మలమైన కాంతికలది. ఆకాశ మంతటను నీలకాంతి కలది. (సురేభవీథీదివసావతారః-అర్థము అస్పష్టము) జీర్ణములైన మేఘఖండములు తెల్లగా నున్నవి.

మూ. మహానవమ్యాం నిఖిలాస్త్రపూజా నీరాజనా వాజిభటద్విపానామ్
దీపాలికాయాం వివిధా విలాసా యాత్రోన్ముఖైరత్ర నృపైర్విధేయా

వ్యా. ఈ శరదృతువునందు, విజయ యాత్రకై బయలుదేరిన రాజుల చేత మహానవమినాడు చేయబడు సమస్త ఆయుధముల పూజయు, అశ్వములు, భటులు, గజములు వీటి నీరాజనము వర్ణింపదగినది. దీపాలియందు అనేకవిధములగు విలాసలు కూడా వర్ణింపదగినవి.

మూ. వ్యోమ్ని తారతరతారకోత్కరః స్యన్దనప్రచరణక్షమా మహీ
భాస్కరః శరది దీప్రదీధితి ర్బుధ్యతే చ సహమాధవః సురైః 24

వ్యా. శరదృతువునందు ఆకాశమున పెద్ద నక్షత్రసముదాయ ముండును. భూమి రథసంచారమునకు యోగ్యముగ నుండును. సూర్యుడు అధికకాంతిగల కిరణములు కలవాడై యుండును. శ్రీమహావిష్ణువు దేవతలతోకూడా మేల్కొనును.

మూ కేదార ఏవ కలమాః పరిణామరమ్యాః
ప్రాచీన మామలక మర్హతి పాకనీలమ్.
ఏర్వారుకం స్ఫుటననిర్గతగర్భగన్ధ
మమ్లీభవన్తి చ జరత్త్రపుసీ ఫలాని. 25

వ్యా. "వరిచేలు పొలములోనే ముగ్గిపోవుటచే రమ్యముగ నున్నవి. పాకముచే నీలవర్ణము కలదైన ప్రాచీనామలకము (పెద్ద ఉసిరికాయ) ప్రశంసనీయముగ నున్నది. దోసకాయ (పండి) బద్దలగుటచే బైటకు ప్రసరించుచున్న సువాసన కలది. పెద్దదోసకాయలు పులుపెక్కుచున్నవి."

మూ. గేహాజిరేషు నవశాలికణాపపాత గన్ధాసు భావసుభగేషు కృషీవలానామ్
ఆనన్దయన్తి ముసలోల్లసనావధూతపాణిస్ఖలద్వలయపద్ధతయో వధూట్యః 26

వ్యా. నూతనమైన వరిధాన్యపుగింజలను పోయుటచే బయలుదేరిన సువాసనల అనుభవముచే సుందరమైన, వ్యవసాయదారుల ఇండ్ల వాకిళ్ళలో, రోకళ్ళను ఆడించుటకై కదలుచున్న హస్తములయందు గంగలలాడుచున్న వలయములు గల స్త్రీలు ఆనందము కలిగించుచున్నారు.

మూ. తీక్ష్ణం రవిస్తపతి నీచ ఇవాచిరాఢ్యః
శృఙ్గం రురుస్త్యజతి మిత్రమివాకృతజ్ఞః.
తోయం ప్రసీదతి మునేరివ ధర్మచిన్తా (న్తం)
కామీ దరిద్ర ఇవ శోషముపైతి పఙ్కమ్. 27

వ్యా. "కొద్దికాలము క్రితమే ధనికుడైన నీచుడు వలె సూర్యుడు తీక్ష్ణముగా తపింపచేయుచున్నాడు కృతజ్ఞత లేనివాడు మిత్రుని వలె రురుమృగము శృంగమును పరిత్యజించుచున్నది. ముని యొక్క ధర్మచింతవలె (ధర్మపరమైన మనస్సువలె) ఉదకము ప్రసన్నమగుచున్నది. కోరికలు మిక్కుటముగా గల దరిద్రుడు వలె బురద శుష్కించిపోవుచున్నది."

మూ. నద్యో వహన్తి కుటిలక్రమయుక్తశుక్తి
రేఖాఙ్కవాలపులినోదరసుప్తకూర్మాః.
అస్యాం తరఙ్గితనుతోయపలాయమాన
మీనానుసారిబకదత్తకరాంఘాలాః. 28

వ్యా. "ఈ శరదృతువునందు, వంకర యైన క్రమమునందు (ప్రవాహ మార్గమునందు) కలిసిన ముత్యపుదిప్పల (నత్తగుల్లల) పంక్తులచే చిహ్నితము లగు చిన్న ఇసుకతిన్నెలపై నిద్రించుచున్న కూర్మములు కలవియు, తరంగములు గల, సన్నని ఉదకమునందు పరుగెత్తుచున్న మీనములను అనుసరించు కొంగలచే ఇవ్వబడిన వికటమైనదున్నుటలు కలవియు (అనగా ఆమీనములను పట్టుకొనుటకై కొంగలు నీటిమీదుగా ఎగురుటచే నీటిపై 'నాగలిచాలుపడినట్లు కనబడుచున్నది) అగు నదులు ప్రవహించుచున్నవి."

మూ. అపఙ్కిలతటాపటః శఫరఫాణ్టపాలోజ్జ్వలః
పతత్కురరకాతరభ్రమదదభ్రమీనార్భకః.

ఉతత్క్రమత సైకతశ్చం చకోటవాదాటితః
సగిత్సలిలసఞ్చయః శరది మేదురః సీదతి.'' 29 శరత్

వ్యా. ''పంకము లేని తీరములయందలి గోతులు కలదియు, మత్స్యములచే అనాయాసముగ ఏర్పరుపబడిన (ఫాంట) దాలులచే (ఫాలమనగా నాగలి చివర నుండు తీక్ష్ణమైన భాగము; దానిచే భూమిపై ఏర్పడిన దాలు అని యర్థము. నాగలి కొనలవలె నున్న మత్స్యములు ఇటునటు తిరుగు చుండుటచే నాగలిదాలులవలె గీతలు పడుచున్న వని యర్థము) ప్రకాశించుచున్నదియు, పట్టుకొనుటకై వచ్చి మీద పడుచున్న కురరములనుండి భయపడి తిరుగుచున్న అనేకములైన చిరు చేపలు కలదియు, దొర్లు చున్న తాబేళ్లతోగూడిన ఇసుకతిన్నెలు కలదియు, సంచరించుచున్న కొంగలచే ధ్వనికలదిగ చేయబడినదియు, చిక్కగ నున్నదియుఅగు నదీజలసముదాయము శరత్కాలమున తగ్గిపోవుచున్నది.'' ఇది శరత్కాల వర్ణనము.

మూ. ద్విత్రిముచుకున్దకలికత్రిచతురముకులః క్రమేణ లవలీషు.
పఞ్చషఫలినీకుసుమో జయతి హిమర్తుర్నవావతరః. 30

వ్యా. ''ముచుకుందవృక్షముపై రెండు మూడు మొగ్గలు కలదియు, లవలీలతలయందు క్రమముగ బయలుదేరిన మూడు నాలుగు మొగ్గలు కలదియు, ఐదారు ప్రియంగులతాకుసుమములు కలదియు అగు, క్రొత్తగావచ్చిన హేమంత ఋతువు సర్వోత్కర్షముగ నున్నది.''

మూ. పున్నాగలోధ్రప్రసవావతంసాః వామభ్రువః కఙ్కుకకుఙ్చితాఙ్గః
వక్త్రోల్లసత్కుఙ్కుమసిక్తకాఙ్కాః సుగన్ధతైలాః కబరీర్వహన్తి. 31

వ్యా. ''పున్నాగ-లోధ్రపుష్పములను కర్ణభూషణములుగా ధరించినవారును, రవికెలచే బిగించబడిన శరీరము కలవారును, ముఖములపై ప్రకాశించుచున్న కుంకుమబిందువు (తిలకము) కలవారును, అగు అంగనలు, సుగంధతైలము గల కబరీభారములను (కొప్పులను) ధరించుచున్నారు.''

మూ. యథా యథా పుష్యతి శీతకాలస్తుషారచూర్ణోత్కరకీర్ణవాతః
తథా తథా యౌవనశాలినీనాం కవోష్ణతామత్ర కుచా లభన్తే. 32

వ్యా. ''ఈ హేమంత ఋతువునందు మంచుయొక్క చూర్ణముచే వ్యాప్తమైన వాయువు గల శీతకాలము ముదిరిన కొలదియు, యౌవనశాలు లగు యువతుల కుచములు గోరువెచ్చతనమును పొందుచున్నవి.''

మూ. వరాహవధ్రాణి నవోదనాని దధీని సన్నద్ధశరాణిచాత్ర
సుకోమలాః సర్షపకన్దలీశ్చ భుక్త్వా జనో నిన్దతి వైద్యవిద్యామ్. 34

వ్యా. "ఈ కాలమునందు, వనవరాహమాంసములను, క్రొత్తబియ్యము అన్నములను, మీగడతో కూడిన పెరుగులను, కోమలములైన ఆవకూర అంకుర ములను భుజించి, జనులు వైద్యవిద్యను నిందించుచున్నారు." (ఇట్టి ఆహారము ఆరోగ్యహేతు వగుటచే జనులకు వైద్యసహాయము అనావశ్యక మని భావము).

మూ. అత్రోపచారః సలిలైః కవోష్ణైర్యత్కిఞ్చిదత్ర స్వదతేఽన్నపానమ్.
సుదుర్భగామత్రనిపీడ్య శేతే స్వస్త్యస్తు నిత్యం తుహినర్తవేఽస్మై.

"ఈ కాలమునందు గోరువెచ్చని నీళ్ళతో ఉపచారములు జరుగుచుండును. ఏ అన్నపాన మైనను రుచిగానే ఉండును. అతికురూపవతిని కూడ గాఢముగ అలింగనముచేసికొని శయనించుచుందురు. ఈ హేమంతర్తువునకు నిత్యము స్వస్తి యగుగాక."

మూ. విముక్తబర్హా విమదా మయూరాః ప్రరూఢగోధూమయవా చ సీమా.
వ్యాఘ్రీప్రసూతిః సలిలం సబాష్పం హేమన్తచిహ్నాని జయన్త్యమూని. 35

వ్యా. పింఛములు రాలిపోయిన మయూరములు మదరహితములై యుండును. గ్రామసీమలు గోధూమ-యవలపంటలతో నిండియుండును. ఆడ పులులు ఈనును. నీటిపై ఆవిరి తేలుచుండును. ఈ హేమన్తచిహ్నములు సర్వోత్కృష్టముగ నున్నవి.

మూ. సశమీధ్యానపాకాని క్షేత్రాణ్యత్ర జయన్తి చ.
త్రిశఙ్కుతిలకా రాత్ర్యః పచ్యన్తే లవణాని చ. 36

వ్యా. ఈ కాలమున పొలములు శమీధాన్యములు (మినుము పెసర, ఉలవలు, కందులు మొదలగునవి) పండి ప్రకాశించుచుండును. రాత్రులు త్రిశంకు నక్షత్రమః తిలకముగా కలిగి యుండును. (ఈ రాత్రులందు ఆకాశముపై నున్న త్రిశంకునక్షత్రము స్పష్టముగ కనబడును) ఉప్పు తయారగును."

మూ. ఉద్యానానాం మూకపుంస్కోకిలత్వం
భృఙ్గస్త్రీణాం మౌనముద్రామశేషమ్.
మన్దోద్యోగా పత్త్రిణాం వ్యోమయాత్రా
హేమన్తే స్యాత్సర్వ దర్పక్షయశ్చ. 37

వ్యా. హేమంతఋతువునందు, ఉద్యానములలోని పుంస్కోకిలలు మూగవోవును. అదు తుమ్మెదల ముఖములలో మౌనముద్ర యుండును. పక్షుల ఆకాశసంచారము మందప్రయత్నము కలదై ఉండును. సర్పముల దర్పము కూడ క్షీణించును.

మూ. కర్కన్ధూనాం నాగరఙ్గీఫలానాంపాకోద్రేకః ఖాండవోప్యావిరస్తి.
కృష్ణేక్షూణాం పుణ్డ్రికాణాం చ గర్భే మాధుర్యే శ్రీర్జాయతే చాప్య
పూర్వా. 38

వ్యా. "కర్కంధూఫలములకును, నారంగఫలములకును, పటికబెల్లము వంటి రుచిని కలిగించు (ఖాండవ మనగా పటికబెల్లము) పాకాధిక్యము ఉండును. నల్ల చెరకునందును, బంగారుతీగ చెరకునందును ఉన్న మాధుర్యములో ఒక అపూర్వమైన శోభ కలుగును"

మూ. యేషాం మధ్యేమన్దిరం తల్పసమ్పత్
పార్శ్వే దారాః స్ఫారతారుణ్యతారాః.
లీలావహ్నిర్నిహ్నుతోద్దామధూమ
స్తే హేమన్తం గ్రీష్మశేషం విదన్తి. 39
ఇతి హేమన్తః.

వ్యా. "ఎవరికి గృహమధ్యమున మంచి తల్పముండునో. అధికమగు తారుణ్యముతో ఒప్పారుచున్న భార్య ప్రక్కన ఉండునో, ధూమము లేని విలాసార్థ మగు అగ్ని ఉండునో, వారు హేమంతఋతువును కూడ గ్రీష్మముయొక్క శేషమునుగా (గ్రీష్మఋతువుయొక్క చివరిభాగమునుగా) భావింతురు."

ఇది హేమంతఋతుధర్మవర్ణనము.

మూ. హేమన్తధర్మా శిశిరః. విశేషస్తు :-
రాత్రిర్విచిత్రసురతోచితయామదైర్ఘ్యా
చణ్డో మరుద్వహతి కుఙ్కుమపఙ్కసాధ్యః.
తల్పస్థితిర్ద్విగుణతూలపటా కిమన్య-
దర్ఘన్తి చాత్ర వితతాగురుధూపధూమాః. 40

వ్యా. శిశిరఋతువు ధర్మములు కూడ హేమంతమునందు వలెనే ఉండును, ఇక విశేష మేమనగా:-

"రాత్రి విచిత్రసురతములకు అనుకూలముగ నుండు దీర్ఘత్వము గల యామములు కలది. కుంకుమలేపముచే చికిత్స చేసికొనుటకు తగిన తీవ్రమైన వాయువు వీచును. శయనముల ఏర్పాటు రెట్టింపు మడతలు పెట్టిన నూలుబట్టలు కలది; లేదా రెట్టింపు దూది నింపిన బట్టలు కలది. ఇంక చెప్పున దేమున్నది? ఇచట అతివిస్తృత మగు అగురుధూపధూమములు ప్రశంసనీయముగ ఉండును."

వి. ధూపమనగా కాల్చుటకు ఉపయోగించు సుగంధద్రవ్యము; లేదా దానినుండి వచ్చుపొగ. ధూమ మనగా పొగ. ఏ పొగ యైన కావచ్చును.

మూ. ఆశ్లేషిణః పృథురతక్లమపీతశీత-

మాయామినీం ఘనముదో రజనీం యువానః.

ఊర్వోర్ముహుర్వలనబన్ధనసన్ధిలోల

పాదాన్తసంవలితతూలపటాః స్వపన్తి. 41

వ్యా. ''అధికమైన సురతశ్రమచేత త్రాగివేయబడిన శీతబాధకలు గునట్లుగా, దీర్ఘమైన రాత్రియంతయు పరస్పరము ఆశ్లేషించుకొనిన, అత్యధి కానందవంతులగు యువతీయువకులు, మాటిమాటికిని ఊరువులను మెలిత్రిప్పు చుండుటచే, (మంచమునకుకట్టబిగించిన) బంధనముల సంధులనుండి జారి పోయినవియు, పాదములవద్ద ప్రోగుపడిపోయినవియు అగు దూదితో నింపిరి వస్త్రములు (అచ్ఛాదనవస్త్రములు) కలవారై నిద్రించుచున్నారు.''

మూ. పానేఽమ్బునోః సురసనీరసయోర్న భాతి

స్పర్శక్రియాసు తుహినానలయోర్న చాత్ర.

నోదర్పగాసుభగయోః పరిరమ్భణే చ

నో సేవనే చ శశిభాస్కరయోర్విశేషః. 42

వ్యా. ''ఈ కాలమున మధురమైన జలమును త్రాగినను, మధురము కాని జలమును త్రాగినను భేద మేమియు కనబడుటలేదు. మంచును స్పృశించినను, అగ్నిని స్పృశించినను భేదము తెలియుటలేదు. సుందరిని కౌగలించుకొన్నను, సౌందర్య విహీన యగు దానిని కౌగలించుకొనినను భేదము తెలియుటలేదు. చంద్రుని సేవించినను, సూర్యుని సేవించినను భేదము తెలియుట లేదు."

మూ. పుష్పక్రియా మరువకే జలకేలినిన్దా

కున్దాన్యశేషకుసుమేషు ధురి స్థితాని.

సౌభాగ్యమేణతిలకాద్భజతేఽర్కబిమ్బం
కాలే తుషారిణి దహన్తి చ చన్దనాని. 43

వ్యా. "మంచుతో కూడి యుండు ఈ హేమంతమున, మరువకవృక్షము నందు పుష్పోద్గమ ముండును. జలక్రీడల నింద యుండును. కుందపుష్పములు అన్ని పుష్పములకంటెను, అగ్రస్థానమున నుండును. సూర్యబింబము, చంద్ర బింబము కంటె ఆనందకరముగ నుండును చందనము శరీరమును దహింప చేయును (పీడించును)."

మూ. "సిద్ధార్థయష్టిషు యథోత్తరహీయమాన
సన్తానభిన్నఘనసూచిపరమ్పరాసు.
ద్విత్రావశేషకుసుమాసు జనిక్రమేణ
పాకక్రమః కపిశిమానముపాదధాతి" 44

వ్యా. యథోత్తరముగ (ముందువచ్చినదిముందు, తరువాతవచ్చినది తరు వాత అనువిధమున) తరిగిపోవుచున్న సంతానముకలవై బద్ధలగుచున్న దట్టమైన సూదుల (అనగా సన్నని కాయల) పరంపరలు కలవియు, జన్మక్రమముచే మిగిలిన రెండు మూడు పుష్పములు మాత్రమే కలవియు (అనగా అంతమున అవిర్భవించిన పువ్వులు మాత్రము పువ్వులుగా మిగిలిపోయినవి అని యర్థము) అగుఆవమొక్కలపై,పాకముయొక్క క్రమము కపిశవర్ణమును కలిగించుచున్నది."

మూ. ఉదీచ్యచణ్డానిలతాడితేషు సులీనమీనాసు జలస్య మూలే
నాలావశేషాబ్జలతాస్విదానీం విలాసవాపీషు న యాతి దృష్టిః. 45

వ్యా. "తీవ్రమైన ఉత్తరపుగాలులచే కొట్టబడినవియు, నీటి అట్టఅడుగున బాగాఅణగి ఉన్న మీనములు కలవియు, కాడలు మాత్రమే మిగిలిన పద్మములు గలవియు అగు విలాసార్థమైన దిగుడుబావులవైపు ఇప్పుడు దృష్టి వెళ్ళుట లేదు."

మూ. మాద్యన్మతఙ్గః పృషతైకతోషీ పుష్యద్వరాహో ధృతిమల్లులాయః.
దరిద్రనిన్ద్యః సధనైకవన్ద్యఃస ఏష కాలః శిశిరః కరాలః. 46

వ్యా. "భయంకరమైన ఈ శిశిరఋతువు మదించిన ఏనుగులుకలది, కేవలము పృషతమృగములను ఆనందిపచేయునది. వృద్ధి పొందుచున్న వరాహ ములు కలది. ఆనందము గలదున్న పోతులు గలది. దరిద్రులచే నిందింపబడునది. కేవలము ధనవంతులచేతమాత్రమే అభినందింపబడునది."

మూ. అభినవవధూరోషస్వాదుః కరీషతనూనపా
దసరలజనాశ్లేషక్రూరస్తుషారసమీరణః.
గలితవిభవస్యాజ్ఞేవాద్య ద్యుతిర్మసృణా రవే
ర్విరహివనితావక్త్రౌపమ్యం బిభర్తి నిశాకరః. 47

వ్యా. "(ఈ హేమంతఋతువునందు) పిడకల నిప్పు నవవధూకోపము వలె మధురమైనది. మంచుగాలి దుష్టజనుల సంబంధము వలె క్రూరమైనది. ఇపుడు, సూర్యుని కాంతి వైభవము తొలగిపోయినవాని ఆజ్ఞ వలె, మృదువుగా నున్నది. చంద్రుడు విరహముతో బాధపడుచున్న స్త్రీయొక్క ముఖముతో సామ్యమును ధరించుచున్నాడు."

మూ. ప్రియః ప్రకృతిపిత్తలాః క్వథితకుఙ్కుమాలేపనై-
ర్నితమ్బఫలకస్తనస్థలభుజోరుమూలాదిభిః.
ఇహాభినవయౌవనాః సకలరాత్రిసంశ్లేషితై
ర్హరన్తి శిశిరజ్వరారతిమతీవ పృథ్వీమపి. 48. శిశిరః.

వ్యా. "ప్రకృతిచేతనే పిత్తస్వభావము గల నూతనయౌవనవతులగు స్త్రీలు, ఉడికించిన కుంకుమలేపము గలవియు, రాత్రి అంతయు ఆలింగనము చేసికొన బడినవియు అగు నితంబఫలకములు, స్తనతటములు, భుజమూలములు, ఊరుమూలములు మొదలగువాటిలో మిక్కిలి అధికమైనను, శిశిరశైత్యమువలన కలిగిన బాధను హరించుచున్నారు." ఇది శిశిరర్తులక్షణము.

మూ. చైత్రే మదర్ధిః శుకసారికాణాం హారీతదాత్యూహమధువ్రతానామ్.
పుంస్కోకిలానాం సహకారబన్ధుః మదస్య కాలః పునరేష ఏవ. 49

వ్యా. "చైత్రమాసమున శుకసారికలకును, హారీత - దాత్యూహ - పక్షులకును, తుమ్మెదలకును గొప్ప మదము కలుగును. తీయమామిడిచెట్లకు బంధువైన ఈ చైత్రమాసమే పుంస్కోకిలల (మొగ కోకిలల) మదమునకు కాలము."

మూ. మనోఽధికం దాత్ర విలాస లాస్యే ప్రేఙ్ఖాసు దోలాసు చ సున్దరీణామ్.
గీతే చ గౌరీచరితావతంసే పూజాప్రపఞ్చే చ మనోభవస్య. 50

"ఈ కాలమున సుందరుల మనస్సు విలాసలాస్యములందును, పదారులు చేయుట యందును(ప్రేంఖాసు) ఉయ్యాలల యందును, పార్వతీచరిత్రము అలంకారముగా గల, అనగా పార్వతీ చరిత్రమునకు సంబంధించిన, పాటలయందును, మన్మథపూజా విస్తారమునందును, అధికముగ ప్రవర్తించును"

మూ. పుంస్కోకిలః కూజతి పఞ్చమేన బలాద్విలాసా యువతౌస్ఫురన్తి
స్మరో వసన్తేऽత్ర నవైః ప్రసూనైః స్వచాపయష్టేర్ఘటనాం కరోతి 51

వ్యా. "ఈ వసంత ఋతువునందు పుంస్కోకిల పంచమస్వరముతో కూయుచున్నది. యువతులయందు విలాసలు బలాత్కారముచే (అనగా వలదన్నను) ప్రకాశించుచున్నవి. మన్మథుడు నూతనపుష్పములతో తన ధనస్సును కూర్చుకొనుచున్నాడు"

మూ. పినద్ధ మాహారజనాంశుకానాం సీమన్త సిన్దూరజుషాం వసన్తే.
స్మరీకృతే ప్రేయసి భక్తిభాజాం విశేషవేషః స్వదతే వధూనామ్. 52

వ్యా. "వసన్తమునందు, బంగారు జరీగల వస్త్రములను ధరించినవారును. సీమంతమునందు సిందూరమును ఉంచుకొనిన వారును, మన్మథుడుగా చేయబడిన పియునియందు భక్తి కలవారును అగు స్త్రీల వేష విశేషము చాల మనోహరముగ నుండును."

వి. మన్మథోత్సవమునందు తమ భర్తలనే కూర్చుండబెట్టి, మన్మథునిగ భావించి వారికి పూజ చేయుదురు.

మూ. అయం ప్రసూనోద్ధుర కర్ణికారః పుష్పప్రపఞ్చాఞ్చితకాఞ్చనారః.
విజృమ్భణాకోవిద కోవిదారః కాలో వికాశోద్యత సిన్దువారః. 53

వా. "ఈ కాలము పుష్పములతో నిండిన కర్ణికారవృక్షములు కలది. పుష్పసముదాయముతో ప్రకాశించు కాంచనారవృక్షములు కలది. ఎట్లు విజృంభించవలెనో తెలియు కోవిదారవృక్షములు కలది. వికసించుటకు ఉద్యుక్తమైన సిందువారవృక్షములు కలది."

మూ. రోహీతకామ్రాతక కింకిరాతా మధూకమోదాః సహ మాధవీభిః.
జయన్తి కోలాఙ్కోలకశ్చ శాఖీ సకేసరః పుష్పభరైర్వసన్తే. 54

వా. "వసంతమునందు, రోహీతక - ఆమ్రాతక-కింకిరాతవృక్షములు, మధూకము, అరటిచెట్లు. మాధవీలతలు, కోలాంకోలకవృక్షము, కేసరవృక్షము, పుష్పభారముచే సర్వోత్కర్షగ నుండును."

మూ. యో మాధవీముకులదృష్టిమ వేదిజన్మో
యః కోకిలాకలకలే కథనే చ లాభః

పూజావిధిర్దమనకేన చ యః స్మరస్య
తస్మిన్ మధుః స భగవాన్ గురురఙ్గనానామ్. 55

వా. ''మాధవీముకళములను చూచినపుడు వేణీబంధమును చేసికొనుట యందును, (అనగా ఆ ముకులముల ఆకారమున కొప్పు కట్టుకొనుట లేదా ఆ ముకులమును కొప్పులోధరించుట అని యర్థము). కోకిలల మధురధ్వనిని బట్టి మాటలలో లాభమునందును, (అనగా కోకిలధ్వని వలె మధురముగ మాటలాడుట యందును), దమనకపుష్పముచే మన్మథపూజ చేయుట యందును, భగవంతుడైన ఈ వసంతుడే అంగనలకు గురువు.''

మూ. నాలిఙ్గితః కురవక స్తిలకో న దృష్టో
నో తాడితశ్చ చరణైః సుదృశామశోకః.
సిక్తో న వక్త్రమధునా వకుళశ్చ చైత్రే
చిత్రం తథాపి భవతి ప్రసవావకీర్ణః. 56

వ్యా. కురవకవృక్షము, (అంగనలచే) ఆలింగనము చేసికొనబడలేదు. తిలకవృక్షము చూడబడలేదు. అశోకవృక్షము స్త్రీల పాదములచే తన్నబడలేదు. వకుళవృక్షము ముఖమునందలి మద్యముచే తడపబడలేదు. అయినను, ఇవన్నియు చైత్రమాసమున పుష్పములతో నిండినవి. ఇది చాల ఆశ్చర్యము.

వి. కురవకవృక్షాదులు కాంతాలింగాదులచే పుష్పించునని కవిసమయము.

మూ. చైత్రే చిత్రౌ రక్తనీలావశోకౌ స్వర్ణాశోక స్తృతీయశ్చ పీతః.
క్షైత్రం తన్త్రం తత్ప్రసూనా న్తరేభ్యః శ్రేతో యోనేర్భూర్భువః స్వ స్త్రయేఽపి. 57

వ్యా. ''చైత్రమాసమునందు, రక్తవర్ణము గలదియు నీలవర్ణము కలదియు అగు అశోకవృక్షములు (పుష్పములు) ఆశ్చర్యజనకముగ నుండును. మూడవదైన స్వర్ణాశోకము పీతవర్ణము కలదై యుండును. అది (ఈపుష్పత్రయము) భూలోక - భువర్లోక - స్వర్లోకములు మూడింటియందును, ఇతరపుష్పములకంటె అధికమైన, మన్మథుని విజయసాధనము.''

మూ. గూవాకునాం నాలికేరద్రుమాణాం హిన్తాలానాం పాటలీకింశుకానామ్.
ఖర్జూరాణాం తాడతాఢీతరూణాం పుష్పాపీడన్యాస హేతుర్వసన్తః. 58

వసన్తః.

వ్యా. "వసన్తరువు, గూవాకు (పోక) - నాలికేర-హింతాళ, పాటలీ - కింశుక-ఖర్జూర-తాడ-తాడీవృక్షములపై పుష్పరూపము లగు శిరోభూషణములకు హేతువు."

ఇది వసన్తఋతువర్ణనము.

మూ. వికాసకారీ నవమల్లికానాం దలచ్ఛిరీష ప్రసవాభిరామః
పుష్పప్రదః కాఞ్చనకేతకీనాం గ్రీష్మో ఒయముల్లాసిధాతకేకః. 59

వ్యా. ఈ గ్రీష్మము నవమల్లికల వికాసమును చేయునది. వికసించుచున్న శిరీషపుష్పములచే మనోహర మైనది. కాంచనకేతకులయందు పుష్పములను జనింపచేయునది. వికసింపచేయబడిన ధాతకీవృక్షములు కలది.

మూ. ఖర్జూరజమ్బూపనసామ్రమోచప్రియాలపూగీఫలనాలికేరైః.
ద్వన్ద్వాని ఖేదాలసతామపాస్య రతానుసన్ధానమిహాద్రియన్తే. 60

వ్యా. ఈ ఋతువునందు, మిథునములు, ఖర్జూర - జంబూ-పనస-ఆమ్ర - మోచ - ప్రియాల - పూగీఫల - నారికేళఫలములచే అలసటను తీర్చుకొనుచు, సురతక్రీడలను ఆదరించుచుందురు.

మూ. స్రోతాంస్యనమ్బూంసి సకూపకాని ప్రపాః కఠోరేఒహని పాన్థపూర్ణాః
శుచౌ సమభ్యర్థితసక్తుపానే ప్రగే చ సాయం చ వహన్తి మార్గాః. 61

వ్యా ఉదకరహితము లగు ప్రవాహములు (ప్రవాహమార్గములు) చిన్న నూతులతో కూడినవి, (ఎండిపోయిన నదీమార్గములలో తాత్కాలికముగ నూతులు త్రవ్వుచుందురు). మిట్ట మధ్యాహ్నమున. పానీయశాలలు పాంథులతో నిండి యున్నవి. సక్తుపానమును (మజ్జిగలో కలిపిన పేలాల పిండి యొక్క పానమును) అభిలషించు గ్రీష్మఋతువునందు ప్రాతఃకాలమునందును సాయంకాలమునందును మార్గములందు జనుల ప్రయాణములు సాగుచుండును.

మూ. యత్కాయమానేషు దినార్ధనిద్రా యత్స్నానకేలిర్దివసావసానే
యద్రాత్రిశేషే సురతావతారః స ముష్టియోగో ఘనఘర్మమాథీ 62

వ్యా. "మిట్టమధ్యాహ్నమున గుడిశెలలో నిద్ర (గుడిశెలు చల్లగా నుండును) సాయంకాలమునందు స్నానక్రీడయు, తెల్లవారుఝామున సురత ప్రవేశము, ఇవి గ్రీష్మమునందు చేతిలోఉన్నఉపాయములు (ముష్టియోగః= చిట్కాలు)

మూ. యా చన్ద్రికా చన్దనపఙ్కహృద్యా యా జాలమార్గానిలవీచిమాలా
యా తాలవృన్తైరుదబిన్దువృష్టిర్జలాఞ్జలిం సా శుచయే దదాతి. 63

వ్యా. "మంచిగంధము వలె మనోహరమైన వెన్నెలయు, కిటికీల నుండి వచ్చు వాయుతరంగమాలయు, విసనకఱ్ఱలచే జలబిందువర్షము-ఇవి గ్రీష్మమునకు జలాంజలిని ఇచ్చివేయును (అనగా నశింపచేయును).

మూ. కర్పూరచూర్ణం సహకారభఙ్గస్తామ్బూలమార్ద్రక్రముకోపక్లృప్తమ్.
హారాశ్చతారాస్తనువస్త్రమేతన్మహారహస్యం శిశిరక్రియాయాః. 64

వ్యా. "కర్పూరచూర్ణము, తీయమామిడిచిగురు, పచ్చివక్కతోకూడిన తాంబూలము, పెద్దముత్యాలహారములు, సన్నని వస్త్రము, ఇది శీతలోపచారము లోని మహారహస్యము''

మూ. ''ముక్తాలతాశ్చన్దనపఙ్కదిగ్ధామృణాలహారానుసృతా జలార్ద్రాః.
స్రజశ్చ మౌలౌ స్మితచమ్పకానాం గ్రీష్మేఽపి సోఽయం శిశిరావతారః.'' 65.

వ్యా. ''మంచి గంధముచే పూయబడినవియు, జలముచే ఆర్ద్రములును తామర తూడుల హారములంచే అనుసరింపబడినవియు అగు ముత్యాలహారములు, శిరస్సుపై వికసించిన చంపక పుష్పముల మాలికలును, ఇవి గ్రీష్మమునందు గూడ శిశిరఋతువుయొక్క ఆగమనము'' (అనగా ఇవి గ్రీష్మర్తువును గూడ శిశిరఋతువుగా చేయును)

మూ. అత్రహి:-
పచ్యన్త ఇవ భూతాని తాప్యన్త ఇవ పాంసవః
క్వథ్యన్త ఇవ తోయాని ధ్మాయన్త ఇవ చాద్రయః, 66

వ్యా. ఈ గ్రీష్మమున''భూతములు ఉడికించబడుచున్నాయా అన్నట్లున్నవి. పరాగములు కాల్చబడుచున్నాదగా అన్నట్లున్నవి. ఉదకములు మరిగించబడు తున్నాయా అన్నట్లువి. పర్వతములు (నిప్పులో వేసి) ఊదబడుచున్నాయా అన్నట్లున్నవి.''

మూ. ఏణాః స్థలీషు మృగతృష్ణికయా హ్రియన్తే
స్రోతస్తనుత్వ జనితా జలవేణిబన్ధాః.

తామ్య త్తిమీని చ సరాంసి జలస్య శోషా
ద్వద్ధారఘట్టఘటికావలయశ్చ కూపాః. 67

వ్యా. 'ఎడారులయందు, లేళ్లు ఎండమావులచే ఆకర్షింపబడుచున్నవి. ప్రవాహములు సన్న పడుటచే జలమునందు వేణీబంధములు ఏర్పడినవి. జలము ఎండిపోవుటచే సరస్సులు కొట్టుకొనుచున్న తిములు (మత్స్య విశేషములు) కలవి. కూపములు అరఘట్టములకు కట్టబడిన ఘటముల పంక్తులు కలవి.

వి. అరఘట్ట మనగా నూతిలోనుండి నీళ్లు తోడుటకై ఉపయోగించు చక్రాకార మగు ఒక యంత్రము. ఈ చక్రమునకు చుట్టును కుండలను కట్టుదురు. చక్రమును త్రిప్పుదురు. చక్రము అడుగున ఉన్న కుండ నీరు తీసికొని పైకి వచ్చినపుడు ఆ నీరు భూమిమీద పడును. దాని తరువాత రెండవ కుండ, దాని తరువాత మూడవది ఈ విధముగ చక్రము తిరుగుచుండగా కుండలు ఒక దాని తరువాత ఒకటి నీటి వరకును వెళ్ళి, నీరు గ్రహించి పైకి వచ్చుచుండును.

మూ. కరభాః శరభాః సరాసభా మదమాయాన్తి భజన్తి విక్రియామ్.
కరవీర కరీరపుష్పిణీః స్థలభూమీరధిరుహ్య దాసతే. 68

వ్యా. ఒంటెలు, శరభమృగములు, రాసభములు మదమును పొందును. వికారమును కూడ పొందును అవి కరవీర-కరీరపుష్పములతో గూడిన మెట్ట భూములను ఎక్కి ఉండును.

మూ. సహకారరసార్చితా రసాలా జలభక్తం ఫలపానకాని మన్థాః
మృగలావరసాః శృతం చ దుగ్ధం స్మరసఞ్జీవనమౌషధం నిదాఘే. 69

వ్యా. ''మామిడిపండురసముతో కలపబడిన రసాలయు, నీటిలో వేసిన అన్నము (చలిది అన్నము) ఫలముతో తయారుచేయబడిన పానీయములు, మజ్జిగ, లేడిమాంసము, లావమాంసము, కాచిన పాలు, ఇవి గ్రీష్మమున మన్మథసంజీవని యగు ఔషధము.

వి. పెరుగులో పంచదార, కుంకుమ, ఏలకులు మొదలగునవి చేర్చి తయారుచేసినదానికి 'రసాల' అని పేరు. దీనినే మహారాష్ట్రదేశీయులు 'శ్రీఖండ' మందురు.

మూ. జడచన్దన ధారవ స్తరుణ్యః సజలార్ద్రాః సహతారహారమాలాః
కదలీదలతల్పకల్పనస్థాః స్మరమాహూయ నివేశయన్ని పార్శ్వే. 70

వ్యా. "తడిగా నున్న చందనముచే అందముగా నున్న వారును, జలముచే ఆర్ద్రముగా నున్నవారును, పెద్ద ముత్యాలహారములు కలవారును, అరిటాకులతో తయారుచేసిన శయనములందు ఉన్నవారును అగుతరుణులు మన్మథుని పిలిచి ప్రక్కనే కూర్చుండపెట్టుకొందురు."

మూ. గ్రీష్మే చీరీనాదనన్తో వనాన్తాః పఙ్కాక్తాః సైరిభాః సేభకోలాః
లోలజ్జిహ్వాః సర్పసారఙ్గవర్గామూలాస్రస్తైః పత్రిణఖ్యాంసదేశైః.71

వ్యా. గ్రీష్మమునందు వనప్రదేశము కీచురాళ్ల ధ్వనితో నిండియుండును. మహిషములు, గజములు. వరాహములు బురదచే పూయబడియుండును. సర్పములు, లేళ్లగుంపులు కదలుచున్న నాలుకలు కలవై యుండును. పక్షులు మొదళ్లదగ్గరజారిన (శిథిముగానున్న) భుజములు కలవై ఉండును.

మూ. "హర్మ్యం రమ్యం చంద్రికాధౌతపృష్ఠం
కాన్తోచ్ఛిష్టా వారుణీ వారిమిశ్రా.
మలాః కంఠే పాటలా మల్లికానాం
సద్యో గ్రీష్మంహ న్తహేమన్తయన్తి. 72. గ్రీష్మః.

వ్యా. "వెన్నెలచే కడిగివేయబడిన పైభాగము గల రమ్యమైన భవనము, కాంతచే ఎంగిలిచేయబడిన, జలమిశ్రమైన మద్యము, కంఠమునందు పాటలవర్ణములైన మల్లికామాలలు, ఇవి వెంటనే గ్రీష్మమును హేమంతముగ చేసివేయుచున్నవి." ఇది గ్రీష్మము.

మూ. చతురవస్థశ్చ ఋతురుపబన్ధనీయః. తద్యథా-సన్ధిః, శైశవమ్, ప్రౌఢిః, అనువృత్తిశ్చ. ఋతుద్వయమధ్యం సన్ధిః. శిశిరవసన్త సన్ధిర్యథా.

చ్యుతసుమనసః కున్దాః పుష్పోద్గమేష్వలసాద్రుమాః
మనసి చ గిరం గృహ్ణన్తీమే గిరన్తి న కోకిలాః.
అథ చ సవితుః శీతోల్లాసం లునన్తి మరీచయో
న చ జరఠతామాలమ్బన్తే క్లమోదయదాయినీమ్. 73

ఋతువుల సంధి, ఋతువు బాల్యము (ప్రారంభదశ), ప్రౌఢత్వము, అనువృత్తి అని నాలుగు అవస్థలు కలదానినిగా ఋతువును వర్ణింపవలెను. రెండు ఋతువుల మధ్యము సంధి. శిశిరవసన్తఋతువుల సంధికి ఉదాహరణమెట్లనగా:-

"కుందములు జారిపోయిన పుష్పములు కలవి. వృక్షములు పుష్పోద్గమమునందు అలసములై (మందములై) యుండును. ఈ కోకిలలు మనస్సులో వాక్కును గ్రహించును కాని పైకి ఉచ్చరింపవు. మరియు, సూర్యుని కిరణములు శీతప్రసారమును తొలగించుచున్నవి; కాని అలసటను కలిగించు నంతటి తీక్ష్ణత్వమును దాల్చుటలేదు."

మూ. వసన్తశైశవమ్:-

గర్భగ్రన్థిషు వీరుధాం సుమనసాం మధ్యేఽఙ్కురం పల్లవా
వాఞ్ఛామాత్రపరిగ్రహః పికవధూకణ్ఠోదరే పఞ్చమః.
కిం చ త్రీణి జగన్తి జిష్ణు దివసైర్ద్విత్రైర్మనోజన్మనో
దేవస్యాపి చిరోజ్ఝితం యది భవేదభ్యాసవశ్యం ధనుః. 74

వసన్తశైశవమునకు (ప్రారంభమునకు) ఉదాహరణము:- "మొక్కల కణుపులలో పుష్పములు బయలుదేరుచున్నవి. అంకురములమధ్య చిగుళ్లు ఏర్పడుచున్నవి. ఆడుకోకిలల కంఠమధ్యమున కోరినంతమాత్రముననే పంచమస్వరము బయలుదేరుచున్నది. మరియు, చాలకాలము క్రితము విడవబడినదియు, మూడు లోకములను జయింపసమర్థమైనదియు అగు మన్మథుని ధనస్సు రెండు మూడు రోజులలో మరల అలవాటై వశములోనికి వచ్చును."

మూ. వసన్తప్రౌఢిః-

సామ్యం సంప్రతి సేవతే విచకిలం షాణ్మాసికైర్మౌక్తికైః.
కాన్తిం కర్షతి కాంచనారకుసుమం మంజిష్ఠధౌతాత్పటాత్.
హూణీనాం కురుతే మధూకకుసుమం లావణ్యలుంటాకతాం
లాటీనాభినిభం చకాస్తి చ పతద్వృన్తాగ్రతః కేసరమ్. 75

వ్యా. వసంతప్రౌఢికి ఉదాహరణము:- "ఈ వసంతమున, విచకిల పుష్పము ఆరుమాసములకు పూర్వము పుట్టిన ముత్యములతో సామ్యమును పొందుచున్నది. కాంచనారపుష్పము మంజిష్ఠ పూసిన వస్త్రమునుండి కాంతిని లాగుచున్నది. మధూకము మొగ్గ హూణస్త్రీల లావణ్యాపహారమును చేయుచున్నది. తొడిమనుండి జారిపోవుచున్న పొగడపూవు లాటస్త్రీల నాభివలె ప్రకాశించుచున్నది."

మూ. అగ్రిమ ఋతుచిహ్నం యత్కుసుమాద్యం నువర్తతే
లిఙ్గానువృత్తిం తామాహుః సా జ్ఞేయా కావ్యలోకతః. 76.

వా. "గడచిపోయిన ఋతువుయొక్క చిహ్న మగు పుష్పాదికము (తరువాతి ఋతువునందు గూడ) అనువర్తించుటకు లింగానువృత్తి అని పేరు. దీనిని కావ్యములనుండియు, లోకమునుండియు తెలిసికొనవలెను."

మూ. వర్షాసు గ్రీష్మలింగాబ్జవికాసానువృత్తిః యథా:-
ఖం వస్తే కలవింకకంఠమలినం కాదంబినీకంబలం
చర్చాం పారయతీవ దుర్దురకులం కోలాహలైరున్మదమ్.
గంధం ముంచతి సిక్తలాజసదృశం వర్షేణ దగ్ధా స్థలీ.
దుర్లక్ష్యోఽపి విభావ్యతే కమలినీహాసేన భాసాంపతిః. 77

వ్యా. వర్షర్తువునందు గ్రీష్మర్తుచిహ్నము లగు పద్మముల వికాసము అనువర్తించుటకు ఉదాహరణ మెట్లనగా:-

"ఆకాశము కలవింకపక్షుల కంఠము వలె మలినమైన మేఘము లనెడు కంబళిని ధరించుచున్నది. కోలాహలములతో ఎక్కువ మదించి యున్న కప్పల సముదాయము చర్చను ముగించుచున్నట్లున్నది. కాలి ఉన్న నేల, వర్షముచే, తడిసిన పేలాల వాసనతో సమాన మైన వాసనను విడచుచున్నది. (వెలువరించుచున్నది). సూర్యుడు కంటికి కనబడకున్నను. పద్మములయొక్క వికాసముచే ఊహింపబడుచున్నాడు."

మూ. ఏవమన్యేఽపి. కిం చ:-
గ్రైష్మికసమయవికాసీ కథితో ధూలీకదంబ ఇతి లోకే
జలధరసమయప్రాప్తౌ స ఏవ ధారాకదంబః స్యాత్. 78

వ్యా. ఇతరఋతువుల విషయమున కూడనిట్లే గ్రహించవలెను. మరియు:- పరాగసమూహము గ్రీష్మసమయమున ఎగురు నని లోకములో ప్రసిద్ధము. వర్షకాలము రాగనే అదియే జలధారసముదాయ మగును. అనగా గ్రీష్మమున పరాగపుంజము సర్వత్ర వ్యాపించినట్లు వర్షకాలమున జలధారలు సర్వత్ర వ్యాపించును. అందుచే వర్షాకాలధూళీభర మనగా జలధారలే.

యథా :— ధూలీకదంబపరిధూసర దిఙ్ముఖస్య
రక్తచ్ఛటాసురశరాసనమణ్డనస్య.
దీప్తాయుధాశనిముచో నను నీలకణ్ఠ
నోత్కంఠసే సమరవారిధరాగమస్య. 79

వ్యా. ఎట్లనగా :- "ఓనీలకంఠుడా ! (ఓ మయూరమా !) ధూలీసముదాయముచే (అనగా ధూలీసముదాయ మనెడు జలధారాసముదాయముచే - వెనుకటిశ్లోకమున చెప్పినట్లు వర్షకాలమున ధూలీసమూహ మనగా జలధారారూప ధూలీసముహము) ధూసర మైన దిగంతములు కలదియు, రక్తకాంతి యనెడు ఇంద్రధనుస్సు అలంకారముగా కలదియు, ప్రకాశించుచున్న ఆయుధము లనెడు పిడుగులను విడచుచున్నదియు అగు యుద్ధ మనెడు వర్షకాలము కొరకై (నీవు) ఉత్కంఠ చెందుటలేదా."

వి. ఈ శ్లోక మెచటిదో తెలియదు. నీలకంఠశబ్దమునకు ఆ పేరు గల రాజు అను నర్థము కావచ్చును లేదా ఈశ్వరుడుకావచ్చును. వర్షకాలపక్షమున మయూర మని యర్థము. వర్షకాలమున ధూలీకదంబమనగా జలధూలి యని యర్థము.

మూ. జలసమయజాయమానాం జాతిం యాం కార్దమీతి నిగదన్తి
సా శరది మహోత్సవినీ గంధాన్వితషట్పదా భవతి. 80

వ్యా. వర్షకాలమునం దావిర్భవించు ఏ జాతీలతను 'కార్దమి' (బురదతో సంబంధించినది)అని చెప్పుదురో ఆ జాతీలతయే శరత్కాలమున గంధమును పట్టి చేరిన తుమ్మెదలు కలదై 'మహోత్సవిని' అను పేరు కలది అగును.

మూ. యథా :- స్థూలావశ్యాయబిన్దుద్యుతిదలితబృహత్కోరకగ్రన్థిభాజో
జాత్యా జాలంలతానాం జరఠపరిమలప్లావితానాం జజృమ్భే.
నానాహంసోపధానం సపది జలనిధేశ్చోత్తసర్పాపరస్య
జ్యోత్స్నా శుక్లోపధానం శయనమివ శశీ నాగభోగాంకమఙ్కః. 81

వ్యా. ఎట్లనగా :- స్థూలమైన మంచు బిందువుల వలె ఉన్న వికసించిన పెద్ద మొగ్గల గుత్తులతో గూడిన, అత్యధిక మగు సుగంధముతోనిండిన జాతీలతల సముదాయము విజృంభించెను. చంద్రుడు అనేకహంసలే ఉపధానముగా కలదియు, నాగశరీరములు చిహ్నముగా గలదియు అగు పశ్చిమసముద్రజలమును,

వెన్నెలవలె తెల్లని తలగడలు కలదియు, సర్పశరీరముయొక్కచిహ్నములు (నగిషీలు) గల శయనమును వలె వెంటనే, సమీపించెను."

మూ. స్తోకానువృత్తిం కేతక్యా అపి కేచిదిచ్ఛన్తి.

యథా :- "అసూచ్యత శరత్కాలః కేతకీధూలిధూసరైః
పద్మాతామ్రైర్న్నవాయాతశ్చరణైరివ వాసరైః". 32

వ్యా. కొందరు మొగలిపువ్వు కూడా శరదృతువులోనికి కొంచెము అనువర్తించు నని అంగీకరింతురు. ఎట్లనగా :- "కేతకీపరాగముచే ధూసరములును, పద్మములచేత (పద్మముల వలె అని పాదపక్షన) ఎఱ్ఱనైన వాసరములచే, పాదములచేత వలె సూచింపబడెను."

మూ. శరద్భవానామనువృత్తిర త బాణాసనానాం సకురుంటకానామ్
హేమంతవక్త్రే యది దృశ్యతేఽపి న దృశ్యతే బంధవిధిః కవీనామ్. 33

"శరత్కాలమునకు చెందిన బాణ-అసన - కురుంటక - పుష్పములు హేమంత ప్రారంభమునందు కూడ అనువర్తించుట కానవచ్చుచున్నను, కవులలో వాటి వర్ణనము కానరాదు."

మూ. హేమంతశిశిరయోరైక్యే సర్వలిఙ్గానువృత్తిరేవ. ఉక్తం చ:-ద్వాదశమాసః సంవత్సరః. పంచ ర్తవో హేమంతశిశిరయోః సమాసేన."

వ్యా. హేమంతశిశిరములను ఒకటిగా పరిగణించుటకు కారణము అన్ని చిహ్నములను అనువర్తించుటయే. అనగా హేమంతచిహ్నము లన్నియు శిశిరమున అనువర్తించుటయే. కావుననే ఇట్లు చెప్పబడినది :- "సంవత్సరమునకు పండ్రెండు మాసములు, హేమంతశిశిరర్తువులను కలిపివేయుటచే ఋతువులు ఐదు."

మూ. మరువకదమనకపున్నాగపుష్పలింగానువృత్తిభిః సురభిః
రచనీయశ్చిత్రశ్రీః కించిత్కుందానువృత్త్యా చ. 34

వ్యా. "వసంత (సురభిః) ఋతువు, మరువక - దమనక-పున్నాగ పుష్పముల అనువృత్తిచే తను, కొంచెము కుందముల అనువృత్తిచేతను చిత్రమైన శోభ కలదిగ వర్ణింపదగినది.

మూ. గేహే వాహీకయూనాం వహతి దమనకో మంజరీకర్ణపూరా 35
నున్మాదః పామరీణాం ఘురఘి ఘురఘికా ఘోదిని వ్యక్తిమేతి

సద్యోళంగానుసార స్రుతసురభిసిరాశీకరః సాహకారః
సర్పన్నంతః శరావే రచయతి చ రసో మేచకీచ్రకదకాణీ. 85

వ్యా. వాహీకదేశయువతీయువకుల గృహమునందు దమనకవృక్షము, (వారి) మంజరీరూపమున నున్న కర్ణాభరణములను ధరించుచున్నది. (వారు కర్ణభూషణముగా ధరింపవలసిన గుచ్ఛములు దమనకమునం దున్నవి అని యర్థము). మరువకము సువాసనతో కూడిన వాయువునందు పామరస్త్రీల ఉన్మాదము అతివ్యక్త మగుచున్నది. అప్పుడే విరిచిన ప్రదేశమునుండి స్రవించుచున్న రసముచే పరిమళించుచున్న నాడులనుండి వచ్చుచున్న తుంపరలు గల, సహకారవృక్ష సంబంధమైన రసము నీటితో నిండిన మూకుడులో ప్రసరించుచు నెమలికన్నుల వంటి చంద్రకములను (గుండ్రని ఆకారములను) ఏర్పరచుచున్నది."

వి. మేచకః = నెమలికన్ను, అనగా నెమలి ఈకపై కన్నువలె ఉండు భాగము. ఇచట సహకార పల్లవాదుల వర్ణనచే వసంతఋతు వని తెలియుచున్నది. కాని హేమంతశిశిరచిహ్నము లగు దమనకాదుల అనువృత్తి కూడ వర్ణింపబడినది.

మూ. కున్దేమన్దస్తమాలే ముకులిని వికలః కాతరః కింకిరాతే
రక్తాశోకే సశోకశ్చిరమతివికచే చంపకే కుంచితాక్షః.
పాంథః ఖేదాలసోఽపి శ్రవణకటురటచ్చక్రమభ్యేతి ధున్వన్
సోత్కంఠః షట్పదానాం నవమధుపటలీలంపటం కర్పటేన. 86

"ప్రియురాలియందు ఉత్కంఠతో గూడిన పాంథుడు, కుందపుష్పము విషయమున మందుడై, మొగ్గలు తొడిగిన తమాలవృక్షము విషయమున వికలుడై (గాబరాచెందినవాడై) కింకిరాతవృక్షవిషయమున భయపడుచున్నవాడై, రక్తాశోక వృక్షవిషయమున శోకముతో కూడినవాడై, బాగుగా వికసించిన చంపకము విషయమున మూసికొనబడిన నేత్రములు కలవాడై, నూతనమగు మకరందమును ఆస్వాదించుటయందు ఆసక్తి గల, కటువుగా ధ్వనిచేయుచున్న తుమ్మెదల సముదాయమును బట్టతో చెదరగొట్టుచు, శ్రమచే అలసిపోయినవాడైనను (ఇంటికి) వచ్చుచున్నాడు."

మూ. యథా వా:- ధునానః కావేరీపరిసరభువశ్చన్దనతరూన్
మరున్మందః కుంద ప్రకరమకరన్దానవకిరన్.
ప్రియక్రీడాకర్షచ్యుతకుసుమమామూలసరలం
లలాటే లాటీనాం లుఠితమలకం తాణ్డవయతి. 87

వ్యా. కావేరీప్రాంతములందున్న చందనవృక్షములను కదుపుచున్నదియు, కుందపుష్పసముదాయముయొక్క మకరందములను చిమ్ముచున్నదియు అగు మంద (మలయ) వాయువు, ప్రియులు క్రీడార్థమై ఆకర్షించుటచే జారిపోయిన పుష్పము కలవియు, మొదటివరకును సరళముగా (అవక్రముగా) నున్నవియు అగు లాటస్త్రీల లలాటమునందు దొరలుచున్న ముంగురులను నాట్యమాడించుచున్నది.''

వి. పై రెండు శ్లోకములందును, వసంతమున హేమంతశిశిరలింగాను వృత్తి వర్ణింపబడినది.

మూ. ఏవమన్యాస్వప్యనువృత్తిః.
విచకిలకేసరపాటలిచమ్పకపుష్పానువృత్తయో గ్రీష్మే.
తత్ర చ తుహినర్తుభవం మరువకమపి కేచిదిచ్ఛన్తి. 88
వ్యా. ఇతర ఋతువుల అనువృత్తి కూడ ఇట్లే.

''గ్రీష్మర్తువునందు వికసించిన కేసర-పాటలి-చంపకపుష్పముల అనువృత్తి యుండును. కొందరీ ఋతువునందు, శిశిరఋతువునకు సంబంధించిన మరువకమును కూడ అంగీకరింతురు.''

మూ. యథా:- కర్ణే స్మేరం శిరీషం శిరసి విచకిలస్రగ్లతాః పాటలిన్యః
కణ్ఠే మార్ణాలహారో వలయితమసితామ్భోజనాలం కలాచ్యోః.
సామోదం చన్దనామ్భః స్తనభువి నయనే మ్లానమాక్షీవపృష్ఠే
గాత్రం తోయార్ద్రం జయతి మృగదృశాం గ్రైష్మికో వేష ఏషః. 89

వ్యా. ఎట్లనగా-''కర్ణమునందు వికసించిన శిరీషపుష్పము, శిరస్సుపై పాటలపుష్పములతో కూడిన, వికసించిన మాలికలు; కంఠమునందు తామర తూడుయొక్క హారము; రెండు మణికట్టులందును వలయముగా ఉంచబడిన పద్మనాలము, స్తనతటమునందు పరిమళముతో గూడిన చందనోదకము, పై భాగమున వాడిన మాంజిష్ఠము వ్రాసిన నేత్రములు; స్రవించుచున్న జలముతో తడిసిన శరీరము-ఈ విధముగ నున్న స్త్రీల గ్రీష్మఋతువేషము సర్వోత్కృష్టముగా నున్నది.''

మూ. యథా చ:- అభినవకుశసూచిస్పర్ధి కర్ణే శిరీషం
మరుబకపరివారం పాటలీదామ కణ్ఠే.
స తు సరసజలార్ద్రోన్మీలితః సున్దరీణాం
దినపరిణతిజన్మా కోఽపి వేషశ్చకాస్తి 90

వ్యా. ఇంకను ఎట్లనగా-"కర్ణమునందు, క్రొత్తదర్భాంకురముతో పోటీ చేయు శిరీషపుష్పము, కంఠమునందు మరువకము పరివారముగా గల (మరువకముతో కలిపి గ్రుచ్చిన) పాటలపుష్పమాలికయు, ఈ విధముగ సరసము, జలార్ద్రము, ఉన్మీలితము (స్పష్టముగ కనబడినదియు, సాయంకాలమున రచింపబడిన స్త్రీలయొక్క ఒకానొక (వర్ణింప శక్యము కాని) వేషము ప్రకాశించుచున్నది."

వి. "స తు సరసజలార్ద్రోన్మీలితః" అనుదాని అర్థము తృప్తికరముగ లేదు. పాఠాంతర మేమైన ఉన్నదేమో.

మూ. ఏవముదాహరణాన్తరాణి.
ఋతుభవవృత్త్యనువృత్తీ దిక్మాత్రేణాత్ర సూచితే సన్తః.
శేషం స్వధియా పశ్యత నామగ్రాహం కియద్బ్రూమః. 91

వ్యా. ఉదాహరణాంతరములు కూడ ఇట్లే.

సత్పురుషులారా! ఆ యా ఋతువులందు ఉండునవి, అనువర్తించునవి దిక్మాత్రమున ఇచట సూచింపబడినవి. మిగిలిన విషయములను మీ బుద్ధిచే ఊహించుకొనుడు. పేరు పెట్టి ఎంత అని చెప్పగలము?"

మూ. దేశేషు పదార్థానాం వ్యత్యాసో దృశ్యతే స్వరూపస్య
తన్న తథా బధ్నీయాత్కవిబద్ధమిహ ప్రమాణం నః. 92

వ్యా. "వేరు వేరు దేశాలలో పదార్థముల స్వరూపమునందు వ్యత్యాసము కానవచ్చుచున్నది. కాని దానిని అట్లు కూర్చరాదు. కవులువర్ణించినదే మనకు ప్రమాణము."

మూ. శోభాన్భోగగన్ధరసైః ఫలార్చనాభ్యాం చ పుష్పముపయోగి
షోఢా దర్శితమేతత్స్యాత్పష్టమమనుపయోగి (తా తస్య) 93.

వ్యా. పుష్పము-శోభ, ఆహారము, గంధము, రసము, ఫలము, పూజ

అను ఆరు విధముల ఉపయోగించును. ఈ ఆరు విధములుగను ఉపయోగించ కుండగ రాలిపోవుట ఏడవ పద్ధతి''

మూ. యథా:- యత్ప్రాచి మాసే కుసుమం నిబద్ధం
తదుత్తరే బాలఫలం విధేయమ్.

తదగ్రిమే ప్రౌఢిధరం చ కార్యం
తదగ్రిమే పాకపరిష్కృతం చ. 94.

వ్యా. ఎట్లనగా- ''మొదటి మాసమున ఏ పుష్పము (ఏది పుష్పముగ వర్ణింపబడినదో) అది తరువాతి మాసమున పిందెగాను, దాని తరువాతి మాసమున ముదిరినకాయగాను, దాని తరువాతి మాసమున పండినదిగాను వర్ణింపదగినది.''

మూ. ద్రుమోద్భవానాం విధిరేష దృష్టో వల్లీఫలానాం న మహానసేహ.

తేషాం ద్విమాసావధిరేవ కార్యః పుష్పే ఫలే పాకవిధౌ చ కాలః.

వ్యా. ''వృక్షములందు పుట్టిన పుష్ప-ఫలములకు ఈ పద్ధతి ప్రసిద్ధము. కాని లతలనుండి పుట్టిన ఫలములకు ఇంత కాలముపట్టదు. వల్లీఫలముల విషయమున, పుష్పమునకును, ఫలముపక్వ మగుటను మధ్యనున్న కాలమును రెండు మాసముల అవధి కలదానినిమాత్రమే చేయవలెను.''

మూ. అన్తర్వ్యాజం బహిర్వ్యాజం బాహ్యాన్తర్వ్యాజమేవ చ
సర్వవ్యాజం బహువ్యాజం నిర్వ్యాజం చ తథా ఫలమ్ 96

వ్యా. ''ఫలము, లోపల వ్యాజము కలది, బయట వ్యాజము కలది, బైటను లోపలను వ్యాజము కలది, అంతటను వ్యాజము కలది, చాలాభాగము వ్యాజము కలది, వ్యాజము లేనివి అని ఆరు విధములు.''

వ్యాజ మనగా పనికిరాని తొక్క, టెంక, గింజ వంటి పదార్థము.

మూ. లకుచాద్య న్తర్వ్యాజం తథా బహిర్వ్యాజమత్ర మోచాది.
ఆమ్రాద్యుభయవ్యాజం సర్వవ్యాజం చ కకుభాది. 97

వ్యా. లకుచఫలము మొదలగునవి అంతర్వ్యాజములు, అరటిపండు మొదలగునవి బహిర్వ్యాజములు. మామిడిపండు మొదలగునవి ఉభయవ్యాజములు, కకుభాదిఫలములు సర్వవ్యాజములు.

మూ. పనసాది బహువ్యాజం నీలకపిత్థాది భవతి నిర్వ్యాజమ్.
సకలఫలానాం షోఢా జ్ఞాతవ్యః కవిభిరితి భేదః. 98

వ్యా. "పనసఫలము మొదలగునవి బహువ్యాజములు. నీలకపిత్థాది ఫలములు నిర్వ్యాజములు. ఈ విధముగ సకలఫలములయొక్కయు ఆరు విధములగు భేదము కవులచే గ్రహింపబడినది".

మూ. ఏకద్విత్ర్యాదిభేదేన సామస్త్యే నాథవా ఋతూన్.
ప్రబన్ధేషు నిబధ్నీయాత్ క్రమేణ వ్యుత్క్రమేణ చ. 99

వా. "ఒకటి లేక రెండు లేక మూడు ఋతువులను గాని, లేదా ఋతువు లన్నింటిని గాని, క్రమముచేతను (వసంతాదిక్రమము) లేదా విపరీతక్రమము చేతను, కావ్యములలో వర్ణింపవలెను."

మూ. న చ వ్యుత్క్రమదోషోఽస్తి కవేరర్థపథస్పృశః.
తథా కథా కాపి భవేద్వ్యుత్క్రమో భూషణం యథా. 100

వ్యా. "అర్థమార్గమును అనుసరించుచు (కథాసంవిధానమును బట్టి వర్ణనలను సాగించుచున్న) కవికి క్రమమును మార్చుటవలన దోషము లేదు. కాని వ్యుత్క్రమము కూడ భూషణముగనే కనబడు నట్లు కథాసంవిధాన ముండవలెను."

మూ. అనుసన్ధానశూన్యస్య భూషణం దూషణాయతే
సావధానస్య చ కవేర్దూషణం భూషణాయతే 101

వ్యా. "కథాసంవిధానముయొక్క అనుసంధానము సరిగాలేని లేదా ప్రతిభ లేని కవికి భూషణము కూడ దూషణముగనే అగును. సావధానచిత్తు డగు కవికి దూషణము కూడభూషణమే యగును."

మూ. ఇతి కాలవిభాగస్య దర్శితావృత్తిరీదృశీ
కవేరిహ మహాన్మోహ ఇహ సిద్ధో మహాకవిః. 102

ఇతి శ్రీరాజశేఖరకృతౌ కావ్యమీమాంసాయాం కవిరహస్యే
ప్రథమేధికరణే కాలవిభాగో నామ అష్టాదశోఽధ్యాయః.

వ్యా. కాలవిభాగమునకు సంబంధించిన ఈ విధమగు పద్ధతి, ఇట్లు చూపబడినది ఈ విషయమున కవి చాల పొరబడుచుండును. ఈ విషయమున సిద్ధుడైనవాడు మహాకవియే.

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా
తమహం జానకీజానిమానతోఽస్మి ముహుర్ముహుః.
దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా
కర్త్రాస్మద్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్.

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన కావ్యమీమాంసావ్యాఖ్య యగు
బాలానందినియందు అష్టాదశాధికరణము
సమాప్తము.

19-1-1979



శ్లోకసూచిక

—:o:—

17,668